# HISTORY OF THE KAMMAS

## PART II

ప్రాచీనాంధ్ర క్షత్రియులగు

# కమ్మవారి చరిత్రము

ద్వితీయ భాగము

(Cir 1000 A. D. మొదలు 1650 A. D. వరకు)

UNIVERSITY OF HYDERABAD
LIBRARY

Author

KOTTA BHAVAIAH CHOUDARY

SANGAM JAGARLAMUDY, GUNTUR DT.

గ్రంథకర్త

కొత్త భావయ్య చౌదరి, సంగం జాగర్లమూడి.

తెనాలి

ది ఓరియంటల్ పవర్ ప్రెస్ నందు ముద్రితము

అక్టోబరు 1940.

## మహారాజపోషకులు

మ-రా-రా-శ్రీ

జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు, Ex-M.L.C. etc.

భూస్వాములు,

కారంచేడు, గుంటూరు జిల్లా.

ఈ గ్రంథ ముద్రణకు దయతో రు 100/- ల విరాళము నొసంగిరి.

★ ★ ★



గ్రంథకర్త:

కొత్త భావయ్య చౌదరి

( తండ్రి శివలింగయ్యగారు )

# విజ్ఞప్తి

ఈభాగము వ్రాయుటలో నాంధ్రదేశ చరిత్రలో చాలభాగము తెలుపవలసి వచ్చినది. ఆంధ్రదేశము పాలించిన రాజ వంశములలో దాదాపన్నిఁటి నుండియు ననఁగా, దుర్జయ, చోడ, చాళుక్య, హైహయ వంశములనుండి కమ్మ వారేర్పడి యుండుటవల్లనే యీ చరిత్ర పెరిగినది. ఈ వివరము లాయా పుటలలో నిరూపింపఁ బడినందున నిచట చర్విత చర్వణముగాఁ జెప్పఁ బనిలేదు. కాని యీ రాజ వంశీకుల శాసనములలో వారిపేర్లముందుఁ గన్పడు గ్రామములపేర్లు యింటిపేర్లు కావనియు, కమ్మవారు 15 వ శతాబ్దికి పూర్వ మున్న దృష్టాంతములు లేవనియు నొక విమర్శ బయలు దేరినది. (ఆంధ్రపత్రిక 29-9-40, డా॥ మా. రామారావు). ఇది కేవలము పొరబాటు. కమ్మవారు 12 వ శతాబ్ది నుండి యున్నట్లు పద్మనాయక చరిత్రమునుబట్టి గ్రహింప వీలగుటయేగాక, వారి కప్పటి నుండి గృహనామ, గోత్రనామము లున్నట్లితర దృష్టాంతము లనేకము గానవచ్చుచున్నవి. వెలుగోటివారి వంశావళిలోగూడ 14వ శతాబ్దినాటికిఁగల కమ్మనాయకుల విషయ మచ్చటచ్చటఁ గలదు. ఆ కాలపు కమ్మవీరుల చరిత్ర లిందు వ్రాయఁబడి యున్నవి.

వివిధప్రదేశములలో, వివిధకాలములందు, ఒకే గృహనామమును వాడుచు శాసనములు వ్రాయించిన వారున్నారు. వారందరొకే వంశమువారుగ గుర్తింప వచ్చును. అట్టివారా యా ప్రదేశ పాలకులు గాకున్నను, వారి పూర్వీకుల స్థానములనుబట్టి ఆయాగృహనామములు నిర్ణయించుకొనినట్లు కన్పడును. ఇట్లేర్పరచుకొన్న వారిలో నీ గ్రంథము నందలి ఏరువవారు, ఆలూరివారు, విప్పర్ల వారు, రాపర్తివారు, ఎలమంచివారు, కోనవారు, సాగివారు మున్నగు వారి చరిత్రలవల్లనే యీ విషయము మఱింత స్పష్టపడఁ గలదు. వీనిని పరిశీలించిన కొలఁదిని, పైన నుడివిన రాజవంశముల వారందరును క్రమముగా కమ్మవారుగా 14 వ శతాబ్దము వరకును

కొన నిచ్చిరి. శ్రీ కొత్త దక్షిణామూర్తి చౌదరి బి. ఏ. గారు ప్రాచ్యలిఖిత గ్రంథాలయము నుండి కొన్ని నకళ్ళను వ్రాసి పంపిరి. వీ రందరికిని నా భక్తి పురస్కృత వందనములు.

ప్రథమ భాగముపై నితర పండితాగ్రేసరులకున్న యభిమాన ప్రోత్సాహములు గూడ కమ్మవారిలోఁ గనుపడవు. వందల కొలఁది రూప్యములు ఖర్చు పెట్టి, సంవత్సరముల కొలఁది పరిశ్రమించి యితరు లెవ్వరింత వరకు పూర్తి చేయని యీ గ్రంథ నిర్మాణ విషయమున యథాశక్తి నే నొనర్చిన యీ స్వల్ప సేవను గుర్తించి యుపయోగించుకొనుటకై కమ్మ వీరులు మేల్కొని, ప్రతియింట నీ గ్రంథమును వెలయించి, మూఁడవ భాగము వ్రాయుటకు ప్రోత్సహించినచో, తమ విధ్యుక్త ధర్మము నెరవేర్చినవా రగుదురు. ప్రథమ భాగము పై నభిప్రాయ మిచ్చుచు "కమ్మవారి కొక్కరికే గాక యాంధ్రు లందరికిని సమాదరణీయమైన గ్రంథ"మని రసజ్ఞు లగు పండితులు వ్రాసిచ్చిన యభిప్రాయములను, పత్రికాభిప్రాయములను ఈ గ్రంథము చివరఁ జదువఁ గలరు. వీనిని కమ్మ వీరులు గమనింతురు గాక!

ఇందలి చారిత్రక విశేషములు గమనించి, లోపములను దెలిపి నాచే సవరించు నట్లు చేయుటకై చరిత్ర కారుల వేడుచున్నాను.

ఈ మహాఘోర యుద్ధ కాలమున కాగితపు ధర హెచ్చి ముద్రణకు మిక్కిలి కష్టముగా నున్న సమయమున, గ్రంథముల కొఱకై లోఁగడఁ జేసిన సహాయము గాక, ముద్రణ కొఱకై రు 100 లు విరాళ మొసఁగిన మహారాజ పోషకులును, భూస్వాములు నగు శ్రీ శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారికి నా కృతజ్ఞతా పూర్వక వందనములు.

సంగం జాగర్లమూడి
10—10—40

ఇట్లు,
కో॥ భా॥, గ్రంథకర్త.

# విజ్ఞప్తి

ఈ భాగము వ్రాయుటలో నాంధ్రదేశ చరిత్రలో చాలభాగము తెలుపవలసి వచ్చినది. ఆంధ్రదేశము పాలించిన రాజ వంశములలో దాదాపన్నింటి నుండియు ననఁగా, దుర్జయ, చోడ, చాళుక్య, హైహయ వంశములనుండి కమ్మవా రేర్పడి యుండుటవల్లనే యీ చరిత్ర పెరిగినది. ఈ వివరములా యా పుటలలో నిరూపింపఁ బడినందున నిచట చర్విత చర్వణముగాఁ జెప్పఁ బడలేదు. కాని యీ రాజ వంశీకుల శాసనములలో వారిపేర్లముందుఁ గన్పడు గ్రామములపేర్లు యింటిపేర్లు కావనియు, కమ్మవారు 15 వ శతాబ్దికి పూర్వ మున్న దృష్టాంతములు లేవనియు నొక విమర్శ బయలుదేరినది. (ఆంధ్రపత్రిక 29-9-40, డా॥ మా. రామారావు). ఇది కేవలము పొరబాటు. కమ్మవారు 12 వ శతాబ్ది నుండి యున్నట్లు పద్మనాయక చరిత్రమునుబట్టి గ్రహింప వీలగుటయేగాక, వారి కప్పటి నుండి గృహనామ, గోత్రనామము లున్నట్లితర దృష్టాంతము లనేకము గానవచ్చుచున్నవి. వెలుగోటివారి వంశావళిలోఁగూడ 14వ శతాబ్దినాటికిఁగల కమ్మనాయకుల విషయ మచ్చటచ్చటఁ గలదు. ఆ కాలపు కమ్మవీరుల చరిత్ర లిందు వ్రాయఁబడి యున్నవి.

వివిధప్రదేశములలో, వివిధకాలములందు, ఒకే గృహనామమును వాడుచు శాసనములు వ్రాయించిన వా రున్నారు. వారందరొకే వంశమువారుగ గుర్తింప వచ్చును. అట్టివా రా యా ప్రదేశ పాలకులు గాకున్నను, వారి పూర్వీకుల స్థానములనుబట్టి ఆయాగృహనామములు నిర్ణయించుకొనినట్లు కన్పడును. ఇట్లేర్పరచుకొన్న వారిలో నీ గ్రంథము నందలి ఏరువవారు, ఆలూరివారు, విప్పర్లవారు, రొంపర్తివారు, ఎలమంచివారు, కోనవారు, సాగివారు మున్నగు వారి చరిత్రలవల్లనే యీ విషయము మఱింత స్పష్టపడఁగలదు. వీనిని పరిశీలించిన కొలఁదిని, పైన నుడివిన రాజవంశముల వా రందరును క్రమముగా కమ్మవారుగా 14 వ శతాబ్దము వరకును

కొన నిచ్చిరి. శ్రీ కొత్త దక్షిణామూర్తి చౌదరి బి. ఏ. గారు, ప్రాచ్యలిఖిత గ్రంథాలయము నుండి కొన్ని నకళ్ళను వ్రాసి పంపిరి. వీ రందరికిని నా భక్తి పురస్కృత వందనములు.

ప్రథమ భాగముపై యితర పండితాగ్రేసరులకున్న యభిమాన ప్రోత్సాహములు గూడ కమ్మవారిలోఁ గనుపడవు. వందల కొలఁది రూప్యములు ఖర్చుపెట్టి, సంవత్సరముల కొలఁది పరిశ్రమించి యితరు లెవ్వరింత వరకు పూర్తి చేయని యీ గ్రంథ నిర్మాణ విషయమున యథాశక్తి నే నొనర్చిన యీ స్వల్ప సేవను గుర్తించి యుపయోగించుకొనుటకై కమ్మ వీరులు మేల్కొని, ప్రతియింట నీ గ్రంథమును వెలయించి, మూఁడవ భాగము వ్రాయుటకు ప్రోత్సహించినచో, తమ విధ్యుక్త ధర్మము నెరవేర్చినవా రగుదురు. ప్రథమ భాగము పై నభిప్రాయ మిచ్చుచు " కమ్మవారి కొక్కరికే గాక యాంధ్రు లందరికిని సమాదరణీయమైన గ్రంథ "మని రసజ్ఞులగు పండితులు వ్రాసిచ్చిన యభిప్రాయములను, పత్రికాభిప్రాయములను ఈ గ్రంథము చివరఁ జదువఁ గలరు. వీనిని కమ్మ వీరులు గమనింతురు గాక !

ఇందలి చారిత్రక విశేషములు గమనించి, లోపములను దెలిపి నాచే సవరించు నట్లు జేయుటకై చరిత్ర కారుల వేడు చున్నాను.

ఈ మహాఘోర యుద్ధ కాలమున కాగితపు ధర హెచ్చి ముద్రణకు మిక్కిలి కష్టముగా నున్న సమయమున, గ్రంథముల కొఱకై లోగడఁ జేసిన సహాయము గాక, ముద్రణ కొఱకై రు 100 లు విరాళ మొసఁగిన మహారాజ పోషకులును, భూస్వాములు నగు శ్రీ శ్రీ జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి గారికి నా కృతజ్ఞతా పూర్వక వందనములు.

| | |
|---|---|
| సంగం జాగర్లమూడి<br>10—10—40 | ఇట్లు,<br>కొ॥ భా॥, గ్రంథకర్త. |

## —♦ ముఖ్యాంశములు


1. 11వ శతాబ్దస్థితి, దుర్జయాన్వయులు ... 1
2. చాళుక్యరాజుల చరిత్రము ... 3
3. కాఁపుశబ్దము క్షత్రియులు వాడుట ... 10
4. చాళుక్య గృహనామములు కొన్ని ... 25
5. చాళుక్యుల నుండి యేర్పడిన కమ్మవంశములు ... 27
6. కాంచీపుర చోడరాజుల చరిత్ర ... 29
7. చోడరాజవంశీకు లేమైరి? ... 35
8. ఇక్ష్వాకు వంశ వ్యాప్తి వివరము ... 38
9. ముదిగొండ, పిఠాపుర, ఎలమంచి చాళుక్యులు ... 44
0. హైహయ వంశజు లగు కోనసీమ రాజులు ... 51
1. దుర్జయాన్వయులు
   (a) కాకతీయరాజులు ... 62
   (b) వెలనాటిరాజులు ... 79
   (c) కొండపడమటి సీమరాజులు ... 86
   (d) పరిచ్ఛేదులు ... 93
   (e) నతవాటి సీమరాజులు ... 94
   (f) కోనకండ్రవాడి రాజులు ... 95
   (g) ధరణికోటరాజులు ... 96
   (h) నాగిరాజులు ... 101
   (i) మల్యాలవారు ... 115
   (j) దుర్జయవంశము నుండి యేర్పడిన వంశములు 119
   (k) కమ్మవారిలోని దుర్జయాన్వయులు ... 120
12. తెలుఁగుచోడరాజుల చరిత్ర ... 121
13. తెలుఁగుచోడరాజు నుండి యేర్పడిన వంశములు ... 152
14. కమ్మవారిలోని తెలుఁగుచోడ వంశములు ... 154
15. మిగిలిన కమ్మవా రెవరు ? ... 156
16. కమ్మవారి చరిత్రములు ... 156

| | | |
|---|---|---|
| ,, గణపతిదేవచక్రవర్తి | ... | 68 |
| ,, రుద్రమదేవి చక్రవర్తిని | ... | 71 |
| ,, వీర ప్రతాప రుద్రదేవచక్రవర్తి | ... | 73 |
| సామంత నృపాలుకు—వెలనాటి రాజులు | ... | 79 |
| కుడ్యవర్మII | ... | 80 |
| ఎరియరాజు, నన్నిరాజు | ... | 80 |
| గొంకరాజు I | ... | 80 |
| కులోత్తుంగ చోడరాజు I | ... | 81 |
| రెండవ గొంకరాజు | ... | 82 |
| రెండవ రాజేంద్రచోడరాజు | ... | 85 |
| మూడవగొంకనృపాలుడు | ... | 87 |
| వెలనాటి పృథ్వీశ్వర చోడరాజు | ... | 87 |
| ,, విమరరాజు | ... | 88 |
| దండనాయక పండినాయకుడు | ... | 88 |
| కొండ పడమటిసీమ రాజులు | ... | 90 |
| ,, మండవర్మ | ... | 90 |
| ,, బుద్ధవర్మ IV | ... | 90 |
| ,, మన్మమండరాజు | ... | 90 |
| ,, మల్లభూపాలుడు | ... | 91 |
| ,, బుద్ధరాజు V | ... | 92 |
| ,, మహామండలేశ్వర చోడరాజు | ... | 92 |
| నాదెండ్ల మన్మచోడరాజు | ... | 93 |
| ,, మండభూపతి III | ... | 93 |
| పరిచ్ఛేదులవంశము | ... | 93 |
| నతవాటిసీమ రాజులు | ... | 94 |
| ,, రుద్రరాజు | ... | 94 |
| కోనకంద్రవాటి రాజులు | ... | 95 |
| ధరణికోట రాజులు | ... | 96 |

## —♦ ముఖ్యాంశములు ♦—


1. 11వ శతాబ్దస్థితి, దుర్జయాన్వయులు ... 1
2. చాళుక్యరాజుల చరిత్రము ... 3
3. కాఁపుశబ్దము క్షత్రియులు వాడుట ... 10
4. చాళుక్య గృహనామములు కొన్ని ... 25
5. చాళుక్యుల నుండి యేర్పడిన కమ్మవంశములు ... 27
6. కాంచీపుర చోడరాజుల చరిత్ర ... 29
7. చోడరాజవంశీయు లేమైరి? ... 35
8. ఇక్ష్వాకు వంశ వ్యాప్తి వివరము ... 38
9. ముదిగొండ, పిఠాపుర, ఎలమంచి చాళుక్యులు ... 44
10. హైహయ వంశజు లగు కోనసీమ రాజులు ... 51
11. దుర్జయాన్వయులు
    (a) కాకతీయరాజులు ... 62
    (b) వెలనాటిరాజులు ... 79
    (c) కొండపడమటి సీమరాజులు ... 86
    (d) పరిచ్ఛేదులు ... 93
    (e) నతవాటి సీమరాజులు ... 94
    (f) కోనకంద్రవాడి రాజులు ... 95
    (g) ధరణి కోటరాజులు ... 96
    (h) నాగిరాజులు ... 101
    (i) మల్యాలవారు ... 115
    (j) దుర్జయవంశము నుండి యేర్పడిన వంశములు 119
    (k) కమ్మవారిలోని దుర్జయాన్వయులు ... 120
12. తెలుఁగుచోడరాజుల చరిత్ర ... 121
13. తెలుఁగుచోడరాజు నుండి యేర్పడిన వంశములు ... 152
14. కమ్మవారిలోని తెలుఁగుచోడ వంశములు ... 154
15. మిగిలిన కమ్మవా రెవరు? ... 156
16. కమ్మవారి చరిత్రములు ... 156

| | | |
|---|---|---|
| ,, గణపతిదేవచక్రవర్తి | ... | 68 |
| ,, రుద్రమదేవి చక్రవర్తిని | ... | 71 |
| ,, వీర ప్రతాప రుద్రదేవచక్రవర్తి | ... | 73 |
| సామంత నృపాలురు—వెలనాటి రాజులు | ... | 79 |
| కుడ్యవర్మ II | ... | 80 |
| ఎరియరాజు, నన్నిరాజు | ... | 80 |
| గొంకరాజు I | ... | 80 |
| కులోత్తుంగ చోడరాజు I | ... | 81 |
| రెండవ గొంకరాజు | ... | 82 |
| రెండవ రాజేంద్రచోడరాజు | ... | 85 |
| మూడవగొంకనృపాలుఁడు | ... | 87 |
| వెలనాటి పృథ్వీశ్వర చోడరాజు | ... | 87 |
| ,, విదురరాజు | ... | 88 |
| దండనాయక పండినాయకుఁడు | ... | 88 |
| కొండ పడమటిసీమ రాజులు | ... | 90 |
| ,, మండవర్మ | ... | 90 |
| ,, బుద్ధవర్మ IV | ... | 90 |
| ,, మన్మమండరాజు | ... | 90 |
| ,, మల్లభూపాలుఁడు | ... | 91 |
| ,, బుద్ధరాజు V | ... | 92 |
| ,, మహామండలేశ్వర చోడరాజు | ... | 92 |
| నాదెండ్ల మన్మచోడరాజు | ... | 93 |
| ,, మండభూపతి III | ... | 93 |
| పరిచ్ఛేదులవంశము | ... | 93 |
| నతవాటిసీమ రాజులు | ... | 94 |
| ,, రుద్రరాజు | ... | 94 |
| కోనకంద్రవాటి రాజులు | ... | 95 |
| ధరణికోట రాజులు | ... | 96 |

| | | |
|---|---|---|
| కోట భీమరాజు III | ... | 97 |
| ,, కేతరాజు II | ... | 97 |
| ,, రుద్రరాజు | ... | 98 |
| ,, బేతరాజు, గణపాంబ | ... | 99 |
| ,, కేతరాజు III, గణపతిదేవరాజు | ... | 99 |
| సాగి ప్రభువులు హైహయ వంశజులు | ... | 101 |
| ,, బేతరాజు II, రాజరాజు | ... | 101 |
| ,, అనుగురాజు | ... | 102 |
| ,, నలగామరాజు | ... | 103 |
| హైహయుల పూర్వవృత్తాంతము | ... | 105 |
| సాగి నాగభూపాలుఁడు | ... | 107 |
| ,, గన్నమంత్రి | ... | 107 |
| ,, బైచరాజు | ... | 109 |
| ,, మల్లయనాయకుఁడు | ... | 110 |
| ,, మేచయనాయకుఁడు | ... | 110 |
| ,, మఱియొక మేచయనాయకుఁడు | ... | 110 |
| ,, ముప్పరాజు, దోరపరాజు | ... | 111 |
| ,, పోతరాజు I | ... | 111 |
| ,, దోరరాజు II | ... | 111 |
| ,, రెండవ పోతరాజు | ... | 112 |
| ,, గణపయరాజు | ... | 113 |
| ,, మన్మచాగి గణపయరాజు | ... | 113 |
| ,, మూఁడవ పోతరాజు | ... | 113 |
| ,, మన్మపోతరాజు | ... | 114 |
| ,, మన్మచాగి దోరభూపతి | ... | 114 |
| కల్లయనాయకుఁడు | ... | 115 |
| మల్యాలవారు, అన్న సేనాపతి | ... | 115 |
| ,, సజ్జ సేనాపతి | ... | 116 |

,, జావ సేనాపతి, బాచసేనాపతి ... 116

,, కాటచమూపతి ... 117

,, చౌండ సేనాపతి ... 117

,, గుండదండాధిపుఁడు ... 117

,, సోమనాద్రిరెడ్డి ... 118

దుర్జయవంశమునుండి యేర్పడిన వంశములు ... 119

కమ్మవారిలోని దుర్జయాన్వయులు ... 120

తెలుఁగు చోడరాజులు ... 121

పొత్తపి సిద్ధిచోడభూపతి I ... 122

,, విమలాదిత్యుఁడు ... 123

,, బేతరాజు ... 123

,, యఱ్ఱసిద్ధిరాజు ... 124

,, నల్లసిద్ధిమహారాజు I ... 125

,, చిద్దనచోడుఁడు ... 126

,, నల్లసిద్ధిరాజు II ... 126

,, తమ్ముసిద్ధి ... 127

,, తిరుకాళతిదేవుఁడు లేక తిక్కరాజు ... 128

,, మనుమసిద్ధిరాజు II ... 130

,, ఇమ్మడి తిక్కరాజు వరపు తిరుకాలతిదేవుఁడు 132

,, రాజగండ గోపాలదేవుఁడు ... 133

కొణిదెన చోడరాజులు, కామచోడుఁడు ... 133

,, కన్నరదేవుఁడు I ... 134

,, చోడబల్లి II ... 135

,, చోడభూపతి ... 136

కామచోడుఁడు II ... 136

త్రిభువన మల్లదేవ చోడమహారాజు ... 137

చోడబల్లి ... 138

నన్నెచోడుఁడు I ... 139

| | | |
|---|---|---|
| మొదటి నన్నిచోడుని వంశము | ... | 140 |
| నన్నిచోడుడు II | ... | 141 |
| కీర్తిరాజు మల్లిదేవ చోడరాజు | ... | ,, |
| సాగి వెంకన వంశము | ... | 142 |
| తెలుగు బిజ్జన మన్మడు-మల్లిదేవుడు | ... | ,, |
| పొత్తపి సిద్ధి భూపతి, మల్లిదేవుడు | ... | 143 |
| ఓపిలిసిద్ధి I, మల్లిదేవుడు | ... | ,, |
| ఓపిలిసిద్ధి దేవచోడరాజు II | ... | 144 |
| చోడమల్లి దేవుడు | ... | ,, |
| మనుమగండ గోపాల చోడరాజు | ... | 145 |
| మఱి కొందఱు తెలుగు చోడరాజులు | ... | ,, |
| పశ్చిమ చాళుక్య సామంతులగు చోడరాజులు | ... | 146 |
| ,, శంకరస చోడ మహారాజు | ... | ,, |
| ,, రాజాదిత్యరస చోడమహారాజు | ... | 147 |
| ,, నిరుగసి చోడమహారాజు | ... | ,, |
| ,, మల్లరస చోడరాజు | ... | ,, |
| కందూరి రుద్రయన చోడరాజు | ... | 148 |
| కందూరి ఉదయన చోడరాజు | ... | 149 |
| చందాదిత్య చోడరాజు | ... | 150 |
| ,, భద్ర భూపాలుడు | ... | 150 |
| ఏరువవారు-ఎరువ తొండయరాజు | ... | 151 |
| ,, భీమరాజు | ... | 152 |
| తెలుగు చోడరాజులనుండి యేర్పడిన వంశములు | ... | 152 |
| కమ్మవారిలోని తెలుగు చోడ వంశములు | ... | 154 |
| మిగిలిన కమ్మవారెవరు ? | ... | 156 |
| రాపర్తి ముంజరాజు | ... | 156 |
| ,, ప్రోలయ్య | ... | 157 |
| ,, కొసనయ్య | ... | 157 |

| | | |
|---|---|---|
| రాపర్తి ముప్పినాయుఁడు | ... | 158 |
| ,, మంగిరాజు | ... | 158 |
| ,, ఉపేంద్ర దేవుఁడు | ... | 159 |
| సెజ్జప్రోలి నాయకుఁడు | ... | 159 |
| ఎలమంచి కొమ్మి నాయకుఁడు | ... | 160 |
| అయ్యనారప నాయకుఁడు | ... | 160 |
| పిన్న చోడుఁడు | ... | 161 |
| జయప నాయకుఁడు | ... | 161 |
| గొల్లపూడి కామా నాయకుఁడు, దేవి నాయకుఁడు | | 162 |
| అలుగూరి ప్రోల భీముఁడు | ... | 163 |
| ,, పోతి నాయుఁడు | ... | 163 |
| మాంబర్తి సిద్ధప నాయకుఁడు | ... | 164 |
| ,, కాపయ నాయకుఁడు | ... | 165 |
| విప్పర్ల అమరి నాయకుఁడు | ... | 165 |
| ,, అమరి నాయకుఁడు II | ... | 166 |
| భండారి ముప్పి నాయకుఁడు | ... | 166 |
| నిడుబ్రోలు సబ్బి నాయకుఁడు | ... | 166 |
| కొట్టూరి ఎరియమ నాయకుఁడు | ... | 167 |
| మోరంపూడి పోతి నాయుఁడు | ... | 167 |
| వింజము పోతరాజు | ... | 168 |
| నల్లూరి వెల్లాలడు | ... | 168 |
| ,, రుక్కుమ | ... | 168 |
| పాములపాటివారు - కొమ్మన నాయకుఁడు | ... | 168 |
| ,, కేతనకొడుకు కొమ్మన | ... | 169 |
| ,, వేమయ్య | ... | 169 |
| ,, కొండయ్య | ... | 170 |
| భట్టిప్రోలు చోడప నాయకుఁడు | ... | 170 |
| ఈదుపుగంటి సేవకేతి నాయఁడు | ... | 170 |

| | | |
|---|---|---|
| నాదెండ్ల కేతి నాయఁడు | ... | 171 |
| కొల్లూరి మడియప నాయకుఁడు | ... | 171 |
| కొల్లూరి భీమినాయకుఁడు | ... | 171 |
| క్రోణాది నారప నాయకుఁడు | ... | 171 |
| కంకణాల మల్లె నాయకుఁడు | ... | 172 |
| చిలుకూరి భీమనాయకుఁడు | ... | 172 |
| ముసునూరి కొండయ్య | ... | 172 |
| గొట్టిపర్తి యెఱ్ఱమనాయఁడు | ... | 172 |
| ముప్పిడి నాయకుఁడు | ... | 173 |
| పెద రుద్రనాయఁడు | ... | 174 |
| వీరశైవ వీర ప్రతాప చోళరాయఁడు | ... | 175 |
| కట్ట వరదరాజు | ... | 175 |
| పెన్నమ నాయఁడు, పెరుమాండి నాయఁడు | ... | 176 |
| కొల్లూరి ప్రభువులు } | ... | 177 |
| చింతమ నాయఁడు, ముత్తమ నాయఁడు } | ... | 177 |
| ఎఱప నాయఁడు | ... | ,, |
| ముక్రామల ఉప్పినేఁడు | ... | 177 |
| కురుగంటి కొమ్మినాయకుఁడు | ... | 178 |
| బెజవాడ కాలపనాయకుఁడు | ... | 178 |
| వెలిచెర్ల మల్లినాయకుఁడు | ... | 179 |
| మండడి కోటడు | ... | 179 |
| ప్రేకేటి ప్రోలయ్య | ... | 180 |
| కాకతీయరాజ్య పతనానంతర స్థితి | ... | 180 |
| ఎఱువవారు—ఎఱువ భక్తీశ్వరచోళుఁడు | ... | 187 |
| ఎఱువ అనదేవచోడ మహారాజు | ... | 189 |
| ,, భీమరాజు | ... | 193 |
| ,, కేశవరాజు | ... | ,, |
| మచ్చవారు, మచ్చగన్నవిభుఁడు | ... | 194 |

| | | |
|---|---|---|
| మచ్చ భాచడు | ... | 195 |
| ,, రుద్రుఁడు | ... | 195 |
| ,, ఓబల రాజు | ... | 196 |
| మచ్చకాచినేని | ... | 197 |
| కొండవారు, కొండమల్రాజు | ... | 197 |
| సమ్మెటవారు - కొండ్రాజు | ... | 197 |
| ,, సోమనృపాలుఁడు | ... | 198 |
| ,, పిన్నమనేని | ... | 199 |
| ఆరవీటివంశము; కోనేటివారు, కోనేటి కొండ్రాజు | ... | 199 |
| నంద్యాల చిట్రాజు | ... | 200 |
| మంచువ మల్లినేఁడు | ... | 200 |
| మంచెళ్ల నరహరినేని | ... | 201 |
| వాసిరెడ్డి పోతినీడు | ... | 202 |
| ,, మల్లికార్జునుఁడు | ... | 204 |
| ,, సదాశివనాయఁడు | ... | 205 |
| ,, వీరప్పనాయఁడు | ... | 206 |
| గురిజాల ముప్పభూపాలుఁడు | ... | 206 |
| కసకుర్తి బావినాయనింగారు, యీవిపాటి నాయనింగారు | | 208 |
| బొమ్మల భీమనేఁడు | ... | 208 |
| కంచర్ల కొండమనాయఁడు | ... | 208 |
| పొదిలపల్లి సింగమనాయఁడు | ... | 209 |
| చిటివారు-చిటి పోతినీఁడు, వల్లభయ్య, చెన్నయ్యలు | ... | 209 |
| కూనపులి అనపోతనాయనింగారు | ... | 209 |
| ఆలమండల నూకయదేవ చోడరాజు | ... | 210 |
| ,, వీరఅప్పకు భూదేవ చోడరాజు | ... | 210 |
| ,, గంగయ దేవ చోడరాజు | ... | 210 |
| వాలక కామయ్య వరపు అక్కలరాయఁడు | ... | 211 |

| | | |
|---|---|---|
| చెన్నయ బాలయ దేవుఁడు | ... | 211 |
| గురురాజు - రుద్ర దేవ చోళ మహారాజు | ... | 212 |
| రావెళ్ళవారు | ... | 212 |
| రావెళ్ళ వీర మల్లభూపతి | ... | 213 |
| ,, తిప్పభూపాలుఁడు | ... | 216 |
| ,, అయ్యపరాజు | ... | 217 |
| ,, తిప్పభూపాలుఁడు II | ... | 219 |
| ,, లింగ భూపాలుఁడు | ... | 220 |
| ,, కొండ భూపాలుఁడు | ... | 220 |
| ,, అయ్యపనాయకుఁడు II | ... | 222 |
| ,, లింగనృపాలుఁడు II | ... | 222 |
| ,, కొండభూపాలుఁడు II | ... | 224 |
| ,, రామభద్రనృపతి | ... | 224 |
| ,, తిమ్మభూపాలుఁడు | ... | 225 |
| రావెల కొనేటి చిన్నతిమ్మానాయుఁడు | ... | 225 |
| ,, తిరుమలనాయనింగారు | ... | 225 |
| రావెళ్ళ ముద్దునాయకేంద్రుఁడు | ... | 226 |
| ,, వెంగభూపాలుఁడు | ... | 226 |
| రావెల వెలిగొండ వెంకటాద్రి | ... | 227 |
| ,, పాపారాయనింగారు | ... | 227 |
| రావులవారు - | | |
| రావుల వెంగళప్ప | ... | 228 |
| ,, వెంకటాద్రి | ... | 228 |
| పెమ్మసానివారు | ... | 228 |
| పెమ్మసాని తిమ్మానాయుఁడు | ... | 229 |
| ,, రామలింగనృపాలుఁడు | ... | 231 |
| ,, పెదతిమ్మానాయుఁడు | ... | 234 |

| | | |
|---|---|---|
| ,, బలి చిన్నాయకేంద్రుఁడు | ... | 237 |
| ,, అరతిమ్మానాయుఁడు | ... | 237 |
| ,, నారసింహ నృపాలుఁడు | ... | 239 |
| ,, పెదతిమ్మానాయుఁడు, చినతిమ్మానాయుఁడు | ... | 240 |
| ,, పెద వీర నృపాలుఁడు | ... | 244 |
| యేర్లగడ్డవారు - దేవరకోట సంస్థానం | | |
| యేర్లగడ్డ గుర్వారాయుఁడు (లేక) గుర్వినీడు | ... | 247 |
| నల్లా గురవయ్య | ... | 248 |
| ఉద్దండ నాయుఁడు | ... | 248 |
| యేనుగుల చన్నానాయుఁడు | ... | 249 |
| సాయపనేని వెంకటాద్రి నాయనింగారు | ... | 249 |
| మిక్కిలినేని నలచన్నానాయుఁడు | ... | 249 |
| జూపల్లి రామానాయనింగారు | ... | 250 |
| కిలారి తల్లయ్య | ... | 250 |
| సూర్యదేవరవారు | ... | 250 |
| సూర్యదేవర తిమ్మనృపాలుఁడు | ... | 251 |
| ,, యెఱ్ఱ నృపాలుఁడు | ... | 252 |
| ,, ముసలయ నాయకుఁడు | ... | 252 |
| మేదరమెట్ల నరసభూపతి | ... | 254 |
| ,, రమణాభూపతి | ... | 255 |
| ,, కొండప ప్రభువు | ... | 256 |
| ,, సింగినాయుఁడు | ... | 256 |
| పురము తిమ్మానేఁడు | ... | 257 |
| సూరనాయని తిమ్మరుసయ్య | ... | 257 |
| అబ్బినేని వెంకన్న | ... | 257 |
| కూరపాటి అయ్యపనాయుఁడు | ... | 258 |
| ,, గోపినీఁడు | ... | 258 |
| అడపావారు - అడపా కూనయ నృపాలుఁడు | ... | 259 |

అడపా పెదతిమ్మనృపాలుని వంశము ... 260

,, చినతిమ్మభూపతి ... 261

,, రాయనృపాలుఁడు ... 261

,, నారనృపాలుఁడు ... 261

చిరుమామిళ్ళ పెద్దనృపాలుఁడు ... 262

,, తిమ్మనృపాలుఁడు ... 263

గుమ్మడివారి రామయదేవ మహారాజు ... 264

దాసరివారు - దాసరి తిమ్మానేఁడు ... 265

దాసరి చినగంగయ్య ... 267

శింగాల అక్కలయ్య ... 270

సాయపనేని చిన సాయప నాయఁడు ... 270

,, గంగప నాయఁడు ... 271

,, వెంకటాద్రి నృపాలుఁడు ... 271

,, పెదవెంకటాద్రి, చినవెంకటాద్రి భూపతులు 271

వెలిచేటి తిరపతిదొర ... 274

,, మల్లికార్జునదొర ... 274

వేజెళ్ళవారు ... 275

అనుబంధము I

కమ్మవారి గృహనామములు, గోత్రములు
(ప్రథమభాగము తరువాయి) ... 276

అనుబంధము II

ప్రథమభాగమున ప్రచురించిన గృహనామస్థులకుఁ గల
మఱికొన్ని గోత్రములు ... 282

## ఈ గ్రంథమునందలి సాంకేతిక పదములు

| | | |
|---|---|---|
| S. I. I. | = | South Indian Inscriptions |
| Vol. | = | Volume |
| J. A. H. R. S. | = | Journal of the Andhra Historical Research Society, Rajahmundry. |
| Q. J. M. S. | = | Quarterly Journal of the Mythic Society, Bangalore. |
| I. A. / Ind. Ant. | = | Indian Antiquary. |
| Ep. Ind. | = | Epigraphia Indica. |
| N. I. | = | Nellore Inscriptions edited by Butter-worth and Venugopala-chetty. |
| A.R.No. or No. | = | Number of the Annual Report of the Madras Epigraphy. |
| C. p. no. | = | Copper-plate number. |
| తె. శా. | = | తెలింగాణా శాసనములు |
| Mac M. S. S. | = | Mackenzie's Manuscripts. |
| L. R. | = | Local Records (C. P. Browne) |

★ ★ ★ ★

## ఈ గ్రంథరచన కాధారము లగు గ్రంథముల పట్టిక

(1) The Colas, Parts I & II.
(2) వెలుగోటివారి వంశావళి
(3) S. I. I. Vols. I to VI
(4) Nellore Inscriptions Vols. 1, 2 & 3
(5) పద్మనాయక చరిత్ర*
(6) Indian Antiquities XIX
(7) Epigraphia Indica IV
(8) ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సం॥ 25-6, సం. 3
(9) లోకలు రికార్డులు, తాడిపత్రి కయిఫీయతు, Vol. 12&36*
(10) మహాభాగవతము
(11) భారతి. ప్రమాది 16-10, 15-6 & శుక్ల సం॥

(12) కవి జీవితములు
(13) Ep. Reports
(14) సోమదేవరాజీయము
(15) నిర్వచనోత్తర రామాయణము
(16) చాటుపద్య మణిమంజరి.
(17) కుమారసంభవము
(18) J. A. H. R. S. Vols. II to XII
(19) రెట్టమత శాస్త్రము
(20) కమ్మవారి చాటుపద్యములు
(21) శాసన పద్యమంజరి I & II
(22) Quarterly Journal of the Mythic Society XXX
(23) చారు చంద్రోదయము *
(24) ఇందుమతీ పరిణయము *
(25) శకుంతలాపరిణయము
(26) జానకీ రాఘవము *
(27) మాఘమాహాత్మ్యము *
(28) Epi. Carnatica IX
(29) ఆంధ్రులచరిత్ర V భాగం
(30) కాకతీయ చరిత్రము
(31) పెమ్మసానివారి చరిత్రము
(32) రాయలసీమ ప్రమోదూత ఉగాది కానుక
(33) రెడ్డికుల నిర్ణయచంద్రిక
(34) ఆంధ్రకవులచరిత్రము 1, 2 & 3 భాగములు
(35) Kristna District Manual
(36) నానారాజన్య విఖ్యాతజన చరిత్ర
(37) ఆంధ్రులచరిత్ర II విమర్శనము
(38) ధర్మనందన విలాసము*
(39) ప్రజామిత్ర పత్రిక, 1938 సంపుటం
(40) కమ్మ మహారాజు పత్రిక, 1937 ,,

(* ఇవి అముద్రిత గ్రంథములు)

# తప్పొప్పుల పట్టిక

| పుట - పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|
| 27— 19— | 1088 | 1098 |
| 36ఫుట్ నోటు పంక్తి 6— | పైననుండి విన | పైన నుడివిన |
| 56— 20— | శ్రీరామే | శ్రీరా రామే |
| ఫుట్ నోటు 1. | Vol. | Vol. IV. |
| 57— 21— | ఈయన భార్య | ఈయన రెండవ భార్య |
| 21 | 1286 | 1197 |
| ఫుట్ నోటు 5. | Vol. V | Vol. V. No. 123. |
| 66— 12 | కందుకూరు | కందూరు |
| 78 — 8 | అమ్మ వెంక | అన్న వెంక |
| 157— ,, 1. | పుట. | పుట-437 |
| 157— ,, 2. | VI | IV |
| 171— 2— | Vol. | Vol. IV |
| 195— 20— | దాత | దాచ |
| 200—ఫుట్ నోటు | 420 | u, 20 |
| 204—5 | వాసి | వాసిలి |
| ఫుట్ నోటు 2 | మల్లి | మల్ల |
| 210— ,, 1 | No., | N. I., |
| 213—15 | బెల్లుగా | జెల్లుగా |
| 215—1 | వారితని | వారితనిని |
| 216—ఫుట్ నోటుపంక్తి2 | వీరమలా | వీరమల్లా |
| 219— ,, —2 | ప్రయాను | ప్రియాను |
| 220—23 | మహా | మహీ |
| 221—ఫుట్ నోటుపంక్తి3 | సాధించి | సాధించి॥ (ద్విపదబాలభాగ |
| 229—7 | యాకిడ | యాగకి వతము) |
| 230—14 | నగద | నగరద |
| 233—1 | జూపఁప | జూపఁ |
| 235—ఫుట్ నోటుపంక్తి7 | హొదా | హోదా |
| 238—16 | నీయన | నీయని |
| 239—18 | దేవెంద్ర | దేవేంద్ర |
| 240—ఫుట్ నోటుపంక్తి1 | నెఱుంగగ | నెఱుఁగంగ |
| 262—20 | పెద్ద | పెద్దన |
| 264—19 | వంశమ | వంశము |

ఇంకను గొన్ని స్ఖాలిత్యములు గలవు. వానిని పాఠకులే సవరించు కొందురుగాక!

శ్రీరస్తు

# ★ కమ్మవారి చరిత్రము ★

## రెండవ భాగము

### 11 వ శతాబ్దస్థితి — దుర్జయాన్వయులు

రెండవభాగ చరిత్ర ప్రారంభింపక పూర్వమే యీ 11 వ శతాబ్దము యొక్క ప్రాముఖ్యతను వివరింపవలసి యున్నది. ఈ శతాబ్దములోనే క్రీ. శ. 1098 వ సం॥ (శా. శ. 1020 వ సం॥) నాటికి దుర్జయకులస్థు లందరును శైవ మతములో జేరి పోయిరి. అప్పటి కింకను వైష్ణవ మతము బాగుగా నాంధ్ర దేశమున వ్యాపించినట్లు కనుబడదు. జైన మతమునుండి శైవ మతములోనికి నూతనముగా ప్రవేశించిన దుర్జయాన్వయుల కందరికిని గోత్రము లేర్పరుపబడ వలసి వచ్చెను. దానికి బడబానల భట్టను పండితుండు నియమింప బడినట్లు కనుపడు చున్నది ఈ బడబానల భట్టు శా. శ. 1020 వ సం॥లో వెలమవారి గోత్ర పట్టిక తయారుచేసినట్లుగా పద్మనాయక చరిత్రలో నొక శాసనాధారము కలదు. ఈ పని కాకతీయ రాజగు త్రిభువనమల్లు బేతరాజు II కాలములో జరిగి యుండును. వీరలకు "ఏ యూరనుండిన నా యూరి గోత్రంబు" పెట్టబడినట్లు పద్మనాయక చరిత్ర తెలుపుచున్నది*. శా. శ. 1020 వ సం॥ తర్వాత నుండిన దుర్జయ కులస్థుల శాసనములలో బడబానల భట్టు యేర్పరచిన గ్రామ గోత్రములే కానవచ్చు చున్నవి ♦. అందుచే పద్మనాయక చరిత్రలోని విషయము యధార్థమనిగా ధృవపడు చున్నది.

---

* ఆంధ్రుల చరిత్ర విమర్శనము. పు 154.

♦ ఐనవోలు, రాచకొండ, ఉమామహేశ్వర శాసనములును, Ep Report 1916-పుట 135 లోని శాసనమును దీనికిప్రమాణములు.

వెలమవా రా కాలమునుండి విడివడి పోయి యుండలేదు. కాని, తర్వాత వీరవైష్ణవ మతము మన దేశమున ప్రవేశించి నప్పు డనగా క్రీ. శ. 1150 వ సం॥ ప్రాంతమున సంఘములో శాఖమును, యితరులగు సంత్య జాతులును కలిసిన కారణముగా దక్కిన కాపు లేక క్షత్రియ వర్గమునుండి వెలియైనట్లు కనుపడుచున్నది

11 వ శతాబ్దములో దుర్జయ కులములోని యున్ని శాఖల వారును అనగా నేటి యాంధ్ర క్షత్రియులకును, కమ్మ, వెలమ వారలకును పూర్వీకులైన వారందరును శైవ మతమున సంతతి పూర్వమే కలిసిన దుర్జయాన్వయులతో శాఖా శామును చతుర్థులుగనే చెప్పుకొనుట కారంభించి, యట్లే శాసనములు లిఖించిరి. పద్మనాయక చరిత్రలో ని భావమే కలదు*. ఇది శైవ మతమున ప్రవేశించి నప్పుడు కలిగిన మార్పు కట్టుబాటు గాని యది చిర కాలము నిలిచి యుండలేదు.

శైవమతమునకు పోటీగా వైష్ణవ మతము క్రీ. శ. 1100 సం॥ ప్రాంతములో వీరియందు వ్యాపించుట కారంభించెను. శైవ మతమున నున్న హెచ్చు స్వాతంత్ర్యము గల యీ వైష్ణవ మతమున చేరిన దుర్జయాన్వయులు కొందరు అప్పటినుండి మరల తొల్లిటి సూర్య వంశీకులుగానే చెప్పుకొనుట కారంభించినట్లు శాసన దృష్టాంతములు లభించుచున్నవి. ఇట్టివారే నేటి యాంధ్ర క్షత్రియ శాఖవారని చెప్ప వచ్చును. కమ్మనాటిలోని యీ దుర్జయ శాఖీయులును వారి బంధువులును కమ్మవారని పిలువబడుచు వచ్చిరి. ఇక దర్వాత చరిత్రను తెలుసుకొందము.

---

* "శూద్రాభావం బభ్యూను । రుద్రక్షితిపాలు వాక్యయాధిఁ జెలంగెగా" అని పద్మనాయక చరిత్రము - దీని కర్థము (కమ్మ, వెలమవారలు) శూద్రులు కాకపోయినను, ప్రతాపరుద్ర మహారాజాజ్ఞానుసార మట్లయిరనియే.

# చాళుక్య రాజరాజ నరేంద్రుఁడు

దుర్జయ వంశీకులగు కాకతీయ రాజులు ప్రసిద్ధికి రాక పూర్వమే 7వ శతాబ్దమునుండి వేంగి దేశ మనబడు ఆంధ్ర దేశమును చాళుక్యరాజులు పాలించియుండిరి. వీరి విషయము 10వ శతాబ్దము వరకు మొదటి భాగమున వివరించితిమి.

ఇప్పుడు విమలాదిత్యుని తర్వాత నెవరు వేంగీ దేశమును పాలించిరో తెలిసికొనవలసియున్నది. విమలాదిత్యుఁడు దాదాపు క్రీ. శ. 1022 వ సం॥ వరకును పాలించిన పిదప నాతనికి కుందాంబవల్ల జనించిన రాజరాజ నరేంద్రుఁడు రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు కూడ రాజమహేంద్రవరము రాజధానిగా పాలించినవాఁడే. ఈ మహారాజు వేంగీ దేశము నవిచ్ఛిన్నముగా 40సం॥ లు పాలించెను. ఇతఁడు విద్వజ్జనులను చక్కఁగా నాదరించెను. తెలుఁగు భాష యందు శ్రీ మహాభారతమును నన్నయభట్టను కవీంద్రునిచే వ్రాయింప నారంభించెను. ఈయన భోజరాజునకు సమకాలికుఁడనియు, నొకప్రక్క భోజుఁడు సంస్కృతవిద్య నాదరించుచుండఁగా నితఁ డాంధ్రమును పోషించుచు వచ్చెనని చెప్పుదురు. కాని కాళిదాసాస్థానములో గల భోజరాజంతకు పూర్వికుఁడై యుండవలెను.

ఈ రాజరాజు శాసన మొకటి కోరుమిల్లి శాసన మనుపేరిట ప్రకటింపఁబడినది. దీనివల్ల నితఁడు వీడమార్యుఁడను బ్రాహ్మణునకు కోరుమిల్లి గ్రామ మగ్రహారముగా నొసంగినట్లు కన్పడును*. ఈయన గణిత శాస్త్రజ్ఞుఁడగు పావులూరి మల్లనామాత్యునకు నందంపూడి యను గ్రామ మగ్రహారముగ నొసంగెను♦. ఈ మహారాజునకు రాజమార్తాండ, పరగండభైరవ, రాజపరమేశ్వర, రాజమహేంద్ర, బిరుదాంకభీమ, సమస్త భువనాశ్రయ, త్రిభువనాం

---

* I. A. XIX p. 129.

♦ Ep Ind. IV p. 300.

కుశ, రాజ కంఠీరవాది పెక్కు బిరుదులు గలవు. ఈయన తర్వాత నితని తమ్ముఁ డగు (సవతితల్లియగు మాలవదేవి కుమారుఁడు) విజయాదిత్యుఁడు పాలనకు రావలసి యున్నను, ఆతని భార్యయు చోడ రాజకన్యయు నగు మేడవ కోరిక ప్రకారము విజయాదిత్యుఁడు తన యుక్తవయస్సు వచ్చిన కుమారుఁడగు శక్తివర్మ I ను రాజ్యమున నిల్పెను.

రాజరాజ నరేంద్రునకు అమ్మంగదేవి, రేవల్ దేవి, యను భార్య లుండిరి. ఇతఁడు అమ్మంగదేవి వలన రాజేంద్రచోళుఁ డను కుమారుని, రేవల్ దేవి వలన సోమల్ దేవి యను కన్యామణిని గాంచెను. సోమల్ దేవి శా. శ. 987 వ సం॥ లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరునకు బంగారు మంచారు పుష్పము, పితమణి బంధము, వెండిమంచె మున్నగు వస్తువుల నొసంగి దీపదానము గావించి యుండెను. మైసూరు రాజ్యములోని యెల్బూరులో "పిల్లయార్ అమ్మంగదేవి ఆళ్వార్" అను పేరు గల యొక శాసన మున్నది. అది రాజరాజనరేంద్రుని భార్యకు వర్తించునట్లు చరిత్రజ్ఞులు గుర్తించిరి. దీనిని బట్టి ఆళ్వార్ పిళ్ళయార్ పదముల్ వంశీకులు వాడుకొను చుండినట్లు కన్పడుచున్నది. కాని రాజరాజనరేంద్రుఁడు ఆంధ్ర దేశస్థుఁడైయుండి యాంధ్రుఁడుగ నే వ్యవహరించుచున్నట్లు కన్పడును.

## సప్తమ విజయాదిత్యుఁడు

రాజరాజనంతరము శక్తివర్మ I యొక సంవత్సరము పాలించి చనిపోగా నీ విజయాదిత్యుఁడు పాలనకు వచ్చినట్లు ర్యాలి శాసనమువల్ల తెలియుచున్నది. ఈ ర్యాలి గోదావరీ మండలము లోనిది. ఈయన క్రీ. శ. 1062వ సం॥లో పాలనకు వచ్చెను. ఈయన కాలములోనే త్రిపురిపాలకుఁ డగు యశకర్ణ దేవుఁ డను హైహాయ వంశపురాజు వేంగీ దేశముపై దండెత్తి వచ్చి స్వాధీన మొనర్చు కొనుటకు యత్నింపఁగా రాజరాజనరేంద్రుని కుమారుఁడగు రాజేంద్ర

చోడుఁడు వచ్చి యాతని బారఁద్రోలి పిన తండ్రినే రాజ్యపాలన జేయ మరల నియోగించెను. పశ్చిమ చాళుక్య చక్రవర్తి యగు ఆఱవ విక్రమాదిత్యుఁడు వచ్చి, మరల వేంగీ దేశమును హరించెను అప్పుడు మరల కులోత్తుంగుఁడను రాజేంద్ర చోడుఁడు చోళరాజగు వీరరాజేంద్రుని తోడను, విక్రమాదిత్యుని ప్రత్యర్థి సోదరుఁడగు సోమేశ్వరునితోడను వచ్చి విక్రమాదిత్యుని వెడలగొట్టి వేంగీ దేశ మాక్రమించెను. ఇట్టి కడగండ్ల మధ్యనే విజయాదిత్యుఁడు 15 సం॥లు వేంగీ దేశమును రాజేంద్ర చోడుని సహాయముతో బాలింపఁగల్గెను.

## కులోత్తుంగ చోడుఁడు

ఈయనను రాజేంద్ర చోడుఁడనియు, రాజనారాయణ చోడుఁడనియు నందురు. ఈయన రాజ్యపాలనము క్రీ. శ. 1070 వ సం॥ నుండి కనుబడు చున్నది. ఈయన యువరాజుగా నున్న కాలముననే చక్రకోట్య మండలము (బస్తరు) నకు దాడివెడలి, నాగరా నగరమును చోట గజయూధముల వశపరచుకొని, యచటి పాలకుఁడును, నాగ వంశోద్భవుఁడు నగు ధారావర్షుని జయించి వానిచే కప్పము గైకొనెను. ఈ మహారాజు పుష్యమీ నక్షత్రమున జన్మించెనఁట.

ఈయన తన మామగారగు రాజేంద్రదేవ చోళుని చోళ రాజ్యమును గైకొనవలె నని యాయన మరణింపఁగనే బయలుదేరి పోయెను; గాని యచట నాయన తమ్ముఁడగు వీరరాజేంద్రుఁడే పాలనే వంశాచారము ప్రకారము రాజ్యము స్వాధీన పరచుకొని యేల సాగెను. అందుచే నీయనకు వీరరాజేంద్రుఁడు మరణించు వరకు చోళ రాజ్యము స్వాధీనము కాలేదు.

ఈ మహారాజు తాను చోళ దేశమున నుండి పాలించుచు, వేంగీ దేశమునకు తన కుమాళ్ళను రాజప్రతినిధులుగా బంపుచు వచ్చెను. ఈయన వేంగీ దేశమునకు పినతండ్రి పాలించు కాల

ముతో జరిగిన యుద్ధముల కొఱకై వచ్చినపుడు, దక్షిణమున పాండ్య, కేరళ, సింహళ రాజ్యములు స్వాతంత్ర్యతఁ బ్రకటింపఁగా నితఁడు మరల తన పాలన సం॥లగు 7, 8 సంవత్సరములలో వానిపై దాడివెడలి, జయించి యచట నొక విజయధ్వజమును స్థాపించెను. ఈయన 28వ పాలన సంవత్సరమున పాండ్య దేశమున నరలోక వీరుఁడను వాని నాయకత్వమున మఱియొక తిరుగుబాటు రాగా దానిని గూడ యణచి వేసెను.

సింహళ పాలకుఁడగు విజయబాహునితో నితఁడు సంధి చేసి కొని తన కుమార్తెలలో సూర్యవల్లి యను దాని నచట యువరాజగు వీర పెరుమాళ్ళను వానికిచ్చి వివాహము గావించెను. మఱి యొక కుమార్తె రాజసుందరి యను దానిని కళింగరాజు కుమారుఁడగు రాజరాజున కిచ్చి పరిణయ మొనర్చెను. ఈ సంబంధముల వల్ల గూడ నీయన పలుకుబడి విస్తారమయ్యె నని చెప్ప వచ్చును. ఈయనకు మధురాంతక దేవి, దీనచింతామణి, ఎళిశైవల్లభి, త్యాగవల్లి, త్రైలోక్యమహాదేవి, కాడవమహాదేవి (పల్లవరాజకన్య) యను భార్యలుండిరి. చోళకులవల్లి, త్రిభువనమహాదేవి, వరపుకంపమా దేవి యను వారు గూడ నున్నట్లు శాసనములు గలవు. వారు పైన నుడివిన మధురాంతక దేవి, త్రైలోక్య మహాదేవి యను వారే యగుదురేమో! దీనచింతామణియే మధురాంతక దేవి యని యొక యభిప్రాయము నున్నది. ఈయనకు ఏడ్గురు కుమారులు గలిగిరి. వీ రందరును మధురాంతక దేవివలన గలిగిన వారఁట. తక్కిన భార్యల సంతాన విషయము తెలియుట లేదు. వేంగీ దేశమున నితని ప్రతినిధులుగా నున్నవారిలో పినతండ్రి యగు విజయాదిత్యుఁడు క్రీ. శ. 1070—76 మధ్యను. కుమారుఁడగు రాజరాజు క్రీ. శ. 1076—78 మధ్యను, తర్వాత వీరచోడుఁడు 1079—84 మధ్యను, తర్వాత రాజరాజచోడ గంగు 1084—89 మధ్యను, వీరచోడుఁడు మరల 1089—93 మధ్యను, తర్వాత విక్రమచోడుఁడు

1093—1118 మధ్యను రాజ ప్రతినిధులుగా నుండిరి. ఐనను వేంగీదేశ పాలన మంతయు నితని సామంతులగు వెలనాటి గొంకరాజు, రాజేంద్ర చోడుల వశమునందే యుండెను.

రాజరాజు రాజప్రతినిధిగా నొక సంవత్సరము మాత్రమే యుండి యతనికి రాజ్యపాలన రుచించక తల్లి దండ్రులకడ కేగెను. అప్పుడు వీరచోడుడు పంపబడెను. ఇది శా. శ. 1001 వ సం|| లో జరిగెను*. వీరచోడుని వద్ద వెలనాటి వెదురరాజు II మంత్రిగా నుండెను. ఈ వీరుడు మిక్కిలి పరాక్రమశాలియై పాండ్యరాజు పశ్చిమ చాళుక్య ఆరవ విక్రమాదిత్యునితో చేరి వేంగీదేశ మాక్రమించుటకై వచ్చినప్పు డతని జయించి సంతుష్టులకై మెచ్చుకొని కృష్ణా గోదావరుల మధ్యదేశము (వేంగీదేశములోని అర్ధభాగము) పాలించుట కిచ్చెను. ఈ రాజప్రతినిధి శాసనము లనేకములు గలవు. అందు చెల్లూరు శాసన మొకటి. ఇతని వద్ద మేడమార్యుడను బ్రాహ్మణ సేనాధిపతి యుండెను. చెల్లూరులో నీ సేనాధిపతి కట్టించిన విష్ణ్వాలయమునకు కాపేరును గ్రామము సర్వాగ్రహారముగ నిచ్చెను. ఈ మేడమార్యు డొకనాటి కాకతీయ ప్రతాపరుద్రునితో యుద్ధమాడి యోడిపోయెనట.

వీరచోడుని తర్వాత రాజరాజచోడగంగు ప్రతినిధిగా నుండెను. ఆతని కాలమున నాంధ్రదేశమున తెలికజాతి వారి కతడు కొన్ని మాన్యతన హక్కులను ప్రసాదించెను. తెలికలు గుఱ్ఱములపై వివాహకాలములందు నూరేగ వచ్చుననియు వివాహమైన దంపతులు ఒక జత గోవతులు కానుకగా దెచ్చి యిచ్చి రాజదర్శనము చేయవచ్చుననియు నితడు శాసించెను. ఈ విషయము లితడు వ్రాయించిన టేకి శాసనమున గలవు.

రాజరాజచోడగంగు తర్వాత వీరచోడుడు మరల రాజప్రతినిధి యయ్యెను. ఇతడు పిఠాపుర సామీప్యమున 536 ద్రావిడ

* S. I. I. Vol I. P. 56 (Chellur Plates)

బ్రాహ్మణుల కొరకు యగ్రహార మిచ్చెను. ఇతఁడు తంజావూరులో గూడ బృహదీశ్వరాలయమును గట్టించి యం దేకశిలా నందిని స్థాపించెను.

వీరచోడుని తర్వాత విక్రమ చోడుఁడను నాతని సోదరుఁడు వేంగీ దేశమునకు రాజప్రతినిధిగా వచ్చెను. కులోత్తుంగ చక్రవర్తి చనిపోవువరకును యితఁడే రాజప్రతినిధిగా నుండి తర్వాత చక్రవర్తి యయ్యెను.

విక్రమచోడుని కాలమున గోదావరి యుత్తరభాగ దేశము కళింగ రాజగు అనంతవర్మ చోడగంగు ఆక్రమించినట్లు శ్రీ కూర్మ శాసనము వల్లను, మల్లపదేవుని పిఠాపుర శాసనమువల్లను దెలియు చున్నది. కాని కళింగ రాజ్యములో కొంత యీతనికి లోబడి నట్లు మరికొన్ని శాసనముల వల్ల తెలియగలదు*. కొలను భీమనాయ కుఁడు కళింగరాజులతో జేరి యొక యుద్ధము సాగించి దేశము నాక్ర మింపఁగా నాతని బట్టుకొని కళింగభాగము మరల జయించి తీసికొన బడెను. విక్రమ చోడుఁడు తండ్రివలెనే శైవమతాభిమాని గాక నప్పటికి దేశమున వ్యాపించిన వైష్ణవమతమునకు కర్తయగు రామానుజుని పూజించి వైష్ణవమతమును తన దేశమున వ్యాపింప జేసెను.

పైన నుడివిన రీతిగ ప్రతినిధులను బంపి వేంగీదేశమును పాలించుచు కులోత్తుంగ చక్రవర్తి తాను గంగైకొండ చోళపుర రాజధానిగా దక్షిణదేశ మంతటిని స్వయముగా పాలించుచు వచ్చెను. ఐన నీ మహారాజు వేంగీదేశమునే తన స్వదేశ మని భావించుచు శాసనములు వ్రాయించెను.

ఇతఁడు ఉత్తర కళింగ రాజ్యమును కరుణాకర పల్లవుని బంపి తన యిరువది యారవ రాజ్యపాలన వత్సరమున దండయాత్ర సలిపి

* T. A. S. I. p. 22, l. 8, Teki Plates in E. I. VI. p. 335; No 363 of 1899.

యచ్చటి వారిని జయించి యనేక వస్తురాసులను గైకొనెను *. చేరరాజు నావికా సైన్యము నోడ లితఁడు రెండుమార్లు నాశన మొనర్చెను ♦. ఈయన రాజ్యము మన్నారు జలసంధి, పొడియల్ కొండ, కన్యాకుమారి, కొట్టూరు మున్నగు ప్రదేశముల వరకు వ్యాపించెను.

ఈ మహారాజునకు రాజనారాయణ, రాజేంద్ర, త్రిభువన చక్రవర్తి, విక్రమచోళ, కులశేఖర పాండ్యకులాంతక, విరుదరాజ భయంకర, అకలంక, అభయ, జయధర, పరాంతక, పెర్మానడి గలు, పరకేసరి మున్నగు ననేక బిరుదులు గలవు.

ఈయన చెల్లూరు గ్రామము కోలను కాటమనాయకునికిని, కాలే రగ్రహారము పిఠాపురమునందలి యన్నసత్రము జరుపుటకుగా నొసంగినట్లు కన్పడును.

ఈయనకు కుందవి, మధురాంతకి యను సోదరీమణు లుండిరి. కరుణాకర పల్లవుఁడును, నరలోకవీరుఁడును చోళదేశమున నీయనకు ప్రధాన సేనాధిపతులుగా నుండిరి.

ఈయన పాలనలో దేశమంతయు సర్వోకొలతి చేయింపఁ బడెను. కళింగరాజ్యముపై యితఁడు రెండుమార్లు దండెత్తెను. ఈయన విజయ యాత్రలు జయంకొండ యను జైన కవీశ్వరునిచే తమిళ భాషలో 'కళింగత్తు పరాని' యను గ్రంథమున మనోహరముగ వర్ణింపబడినవి. ఈ మహారాజు కాలమున భాషయు, మతమును వృద్ధి జెందెను. ఈయనవీర మాహేశ్వరుఁడగుటవల్ల శైవమతమే హెచ్చుగా దేశమున వ్యాపించెను. హొయిసలబల్లాల రాజులయాశ్రయమున రామానుజుఁడు వైష్ణవ మత మచట విస్తరింపఁజేసెను.

ఈయన దాదాపు చెన్నరాజధాని నంతటిని పాలించుచు వచ్చెను. వీరచోడుని దానశాసనములలో క్రీ. శ. 1127 వ సం॥

---

* Ind. Ant. XXII & The colas. Vol II. p. 33,38.
♦ Ep. Ind. V

నాటిది చేబ్రోలులోను, క్రీ. శ. 1135 వ సం॥ నాటిది నిడుబ్రోలు లోను, లభించుటచే నప్పుడు వీరచోడుఁడును, విక్రమచోడుఁడును కలిసియే పాలించి నట్లు తోఁచును. కులోత్తుంగ చక్రవర్తి వేంగి చోళ దేశముల నవిచ్ఛిన్నముగా 52 సం॥లు ఏకచ్ఛత్రముతో పాలించెను. కాని యీయన వృద్ధాప్యములో క్రీ. శ. 1118వ సం॥ నుండి విక్రమచోడుఁడే రాజ్యభారము వహించినట్లు కన్పడును.

ఈ మహారాజు రాజ్యపాలననాటి శాసనము లాంధ్రదేశమునను తమిళదేశమునను వందలకొలఁది గలవు. అవి యన్నియు నాటి ధర్మములను ప్రజాహిత జీవనమును తెలుపుచున్నవి. ఈయన కాలములోనే సిలోను (లంకా) రాజ్యము స్వతంత్రత ప్రకటించెను. సిలోనుపై నితడు కొన్ని దండయాత్రలు సాగించెను. కాని వశపడలేదు. అందు చేతనే యచటి పాలకుఁడగు విజయబాహునితో సంధి గావించుకొని తన కుమార్తెను వీరపెరుమాళ్ళ కిచ్చి సఖ్యపడినట్లు కన్పడుచున్నది.

ఈయన కాలములో గంగవాడి రాజ్యము (మైసూరులోనిది) స్వతంత్రమయ్యెను.

## కాఁపుశబ్దము క్షత్రియులు వాడుట

ఈ కాలమునకు కాపుశబ్దము క్షత్రియులలో వాడబడుచుండెను. శా. శ. 1037వ సం॥ నాటి యొక పల్లవ శాసనమున త్రిభువన చక్రవర్తి యగు నీ పరాంతక దేవరరాజ సర్వజ్ఞుఁడును, పల్లవరాజులును ఒకే కాఁపువంశీకులని వర్ణింపఁబడెను. ఈ శబ్దము తర్వాత కాలములో శూద్రపరముగా నిఘంటువులలో కెక్కుట విచారకరము. బెజవాడలోని మల్లేశ్వరాలయము నందలి యీ

శాసన భాగము క్రింద నుదాహరింపఁబడినది*. దీనిని బట్టి క్షత్రియులు కొందఱు క్రమముగా కాంపులుగా తర్వాత వ్యవహారమునకు వచ్చిరనుటలో నెంతేని సత్యము గలదు. వీరిలో కొందఱు కమ్మనాటి కాంపులు, తెలంగాణ కాంపులు మున్నగు పేర్ల పిలువఁబడి తుదకు కమ్మకాంపులు తెలగాలు అనియు గొన్నిచోట్ల వ్యవహారమునకు వచ్చినట్లును కనబడుచున్నది. ఈ కాంపు వృత్తిలోని క్షత్రియులు క్రమముగా మత భేదములలో మారిపోయిన కొలఁదిని వీరిని విష్ణుమూర్తి పాదములయందు గంగతోబాటు పుట్టినట్లు కొందఱు కవులు వ్రాయఁజొచ్చిరి. శ్రీనాథమహాకవి తన భీమఖండమున కమ్మ, వెలమ, రెడ్డి, పద్మనాయక వంశములన్నియు నట్లేర్పడినట్లు వ్రాసెను. ఆతని కాలమునాటికి అనఁగా 15వ శతాబ్దమునకు ప్రాచీన కులాచారములు మారిపోయెను. మతములు మారెను. అందుచే నప్పటికి పంటరెడ్డి ప్రభువులును, పద్మనాయకులును, కమ్మవారును చతుర్థవంశము వారమనియే చెప్పుకొనిరి. ఐనను పూర్వ వృత్తాంతములను సవిమర్శనా సహితముగ నాలోచించి నపుడా పుక్కిటిగాథ ప్రమాణముగ నిలుచుట లేదు. ఇక దాదాపా శ్రీనాథకవి సమకాలికుఁడగు వల్లభామాత్యుఁడు రచించిన "క్రీడాభిరామ" మను గ్రంథమున హైహయ వంశజులగు పలనాటి రాజులను "గొల్లసవతి తల్లుల బిడ్డల వని పతులు" అని వర్ణించిన విషయమును సమన్వయించుటకుగా గోల్కొండ పత్రికా సంపాద

---

* "స్వస్తి॥శ్రీ సర్వ్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ద్ధన మహారాజులు త్రిభువన చక్రవర్త్తి శ్రీ పరాంత్తక దేవర ప్రవర్ద్ధమాన విజయరాజ్య సంవత్సరంబులు ౩గు స్రాహిసకవర్షంబులు ౧౦౩౭గు నేంటి మన్మథ సంవత్సరంబున రాజసర్వ్వజ్ఞు జననాథ పురంబున రాజ్యాభివర్ద్ధనకోం సుఖంబున రాజ్యంబు సేయుచుణ్డి తన యన్వయ కాంపులైన వారి సకల పరమవంసోద్భవ భారద్వాజ గోత్ర ఖట్వాంగ్గధ్వజ వ్రిషభ లాంచ్ఛన కాంచ్చీ పురవరే ..............పల్లవకులతిలక పాదాంబుజ సేవిత అన్నువకామకుల..............."

S. I. I. Vol. IV No. 737.

కులు కోరి యుండిరి. (15-4-40 తేదీ పత్రిక ప్రథమభాగ విమర్శనము) ఈ పద ప్రయోగము "అల్ల సవతి తల్లుల బిడ్డలవని పతులని యుండవచ్చు" నని శ్రీ వెల్లాల సదాశివశాస్త్రి గారు వ్రాయించి యున్నారు. (ఆంధ్రచరిత్ర విమర్శనము) ఒక వేళ నట్లుగాక మొదటి పదమే సరియైన పాఠ మన్నను, గొల్లలుగూడ యాదవ వంశమునకు సంబంధించిన వారగుటచేత యదువంశములోని హైహయ రాజులకు మొదటినుండి దగ్గరవారని తెలుపవచ్చును. హైహయ వంశ రాజులలోని కోనసీమ రాజులు మున్నాటి కాపుల కన్యలను వివాహ మాడినట్లు మొదటిభాగమున కొన్ని దృష్టాంతములను జూపి యుంటిమి. అట్లే పలనాటి రాజులును గొల్లకన్నెలను ప్రేమించి వివాహమాడి యుందురు. వా రుంచుకొన్నవారు గాక న్యాయవిధిని పరిణయమాడిన వారై యుండినందున రాచ కుటుంబమున జేరగా వారి సంతానమునకు రాజ్యార్హత సంక్రమించి, యట్టివారు రాజులుగనే వ్యవహరించి యుండవచ్చును. ఈ యాచారము సూర్య చంద్ర రాజులకు క్రొత్తదిగా లేదు. పురూరవుడు దేవవేశ్యను మహాపద్ముడు శూద్రజాతి స్త్రీని వివాహమాడగా వారల సంతతి రాజవంశములోనే పరిగణింపబడినట్లు పురాణములు నుడువుచున్నవి. ఇట్లనేక దృష్టాంతము లున్నను గ్రంథవిస్తరభీతి నుదాహరించుట లేదు.

## విక్రమచోళ మహారాజు

కులోత్తుంగ చక్రవర్తి చనిపోక పూర్వమే యితడు వేంగి పాలకుడుగా నున్నను, యితని రాజ్యాభిషేకము 29-6-1118 వ తేదీనాడని చరిత్రజ్ఞులు గుర్తించిరి. ఈ తేదీ తరువాత కూడ కులోత్తుంగుని 52 వ పరిపాలన సంవత్సరపు (క్రీ. శ. 1120) శాసన మొకటి కలదు. విక్రమచోడుడు చోళదేశమున కేగిన తర్వాత వేంగీ పాలకునిగా వెలనాటి రాజేంద్రచోడుని నియమించెను. అప్పుడు పశ్చిమ చాళుక్య విక్రమాదిత్యుడు VI దండెత్తి వచ్చి, జయించి వెలనాటి రాజును సామంతునిగా జేసికొనెను. ఈ విష

యము దెలిసి విక్రమచోడుఁడు మరలి వచ్చి దేశమును జయించి లోబరుచు కొనెను. క్రీ.శ. 1127వ సం॥ నాటికి వేంగీదేశము మరల విక్రమచోడుని పాలనలో నుండెను. ఈయన చోళ దేశమును 7 సం॥లు శాంతి యుతముగా పాలించెను. ఈయన తండ్రి కాలములో తొలఁగి పోయిన గంగవాడి రాజ్యమును తిరిగి సంపాదించుటకై ప్రయత్నించెను; గాని ఫలించినట్లు కనుపడదు. మైసూరులోని తూర్పు భాగము మాత్రము కొద్దిగ నీతని పరమయ్యెను.

ఈ మహారాజు చిదంబరములోని నటరాజ స్వామి దేవళమున కనేక కట్టడములు కట్టించి యనేక దానము లొసంగెను. ఈ దానములు క్రీ.శ. 1128వ సం॥లో చేయఁబడెను. ఈ దేవళము చుట్టు నున్న బజార్లలోని యొక బజా రీయన పేరిట నుండెను. 'విక్రమచోళ తెంగు తిరువీధి'యని దాని పేరు. ఆ దేవాలయ ప్రాకారమునకు గూడ నీయన పేరే పెట్టఁబడెను. శ్రీరంగములోని రంగనాథాలయపు మొదవ ప్రాకారము గూడ యీయన పేరిటనే నిర్మింపఁబడినది.

క్రీ. శ. 1125వ సం॥ ప్రాంతమున ఆర్కాటు జిల్లాలో గొప్ప వరదలు వచ్చెనఁట. అప్పుడు పైరు లన్నియు నాశనమై పోగా భూముల నమ్మి శిస్తు చెల్లింపవలసి వచ్చెనఁట. ఆ యూ చోట్ల గల మహాసభవారు గ్రామములలోని వృమ్మాడి భూముల నమ్మి శిస్తులు చెల్లించిరఁట. కేంద్రమున నాదాయము తగ్గకుండుటకై యిట్టి యాచార మున్నట్లు కన్పడుచున్నది.

ఈ మహారాజునకు త్యాగ సముద్ర, అకలంక, రాజకేసరి, పరకేసరి మున్నగు బిరుదులు గలవు.

ఈయనకు ముక్కోకిల, త్యాగపతాక, నంబిరత్తియార్ నేరియన్ మాదేవి యను సతీమణు లుండిరి.

ఈయన వద్ద దక్షిణ దేశమున సూరినాయకుఁడు, సాంబువరాయలు, రాజనారాయణ, సుందర్ గంగై, కొండన్ పండి నాడు

కొండ యను వారలును, తొండై మండలములోని చాళుక్యులును సామంత నృపాలురుగా నుండిరి. ఆంధ్ర దేశమున పొత్తపి బేతరాజు, విమలాదిత్య దేవుఁడు, కన్నర దేవుఁడు, వెలనాటి గొంకరాజు II, మారయ పండరాజు, కొల్లిపాక నంబిరాజు, గట్టిదేవుఁడు మున్నగు వారు సామంతులుగాను సేనాధిపతులుగ నున్నట్లు కన్పట్టును.

చోళ దేశమున నీ నృపాలునివద్ద ననేక సేనాధిపతు లుండిరి. నరలోక వీరు డను సెంజియర్ పాలకుఁడు, నోలంబ పల్లవుఁడు, వాన కోవరాయర్, అనంతపాలుఁడు, త్రిగర్త, కరుణాకర తొండమాన్, మునయార్, చోళకాన్, కన్నన్ మొదలగు వారంద రంములోని వారే. ఈయన తర్వాత నీతని కుమారుఁడగు రెండవ కులోత్తుం గుఁడు రాజయ్యెను.

## రెండవ కులోత్తుంగరాజు

ఈయన క్రీ. శ. 1133వ సం॥ లో యౌవరాజ్యమునకు వచ్చి నను తర్వాత 2 సం॥ ల వరకును యితని తండ్రియగు విక్రమచోళుని పాలన ముండెను. ఈయన రాజ్యపాలనము చాల సుగుణముగా నుం డెను. ఈయన కాలములో గూడ చిదంబరములోని నటరాజదేవా లయము వృద్ధి చేయఁబడెను. అచట నీమహారాజు మేడంతసులు గల గోపురములను గట్టించెను. దేవాలయమునకు బంగారు పూత వేయఁ బడెను. ఈయన మొదట తన రాజధానిని గంగైకొండ చోళపుర మునసే యుంచెను; గాని తర్వాత నితఁడు విక్రమ చోళపురమున నివ సించు చున్నట్లు కన్పడును. ఈ మహారాజునకు అనపాయ, పెరు మాళ్ళు, తిరునిరుచోళ, ఎదిరిలిచోళ, కలికదిండచోళ మున్నగు బిరు దులు గలవు. ఈయనకు త్యాగవల్లి, ముక్కోకిల యను భార్య లుండిరి. ఇందలి ముక్కోకిల మలాడ రాకుమారి.

ఈయనకాలమున తెలుఁగు దేశమున ననేక దాన శాసన ములు వెల్వడెను. అవియన్నియు నీతని సామంతులు వ్రాయించిన వే

వెలనాటి రెండవగొంకరా జీయన ప్రతినిధిగా నచట పాలింప జొచ్చెను. ఈయన కాలమున యుద్ధములు దక్షిణదేశమున లేవన వచ్చును. అందుచే నచటదేశము సౌఖ్యముగ నుండెను. ఈకాలము ననే తమిళ భాషలో మంచి రచనలు వెల్వడెను.

కాడవ రాయఁ డను పల్లవసామంతుఁడు తిరునామ నల్లూరు, తిరువడి, వృరదాచలములలోని దేవాలయముల కనేక బంగారు, రత్న వస్తువులను, భూములను యిచ్చి దాన శాసనములు వ్రాయించెను. గట్టి దేవుఁ డను యితని సామంతుఁడు బ్రాహ్మణులకు, తపస్వులకు భోజనార్థ మొక యగ్రహార మిచ్చెను. ఇట్లే యీయన సామంతు లంద రనేక దానము లొనర్చుచు వచ్చిరి.

ఈయన కాలములో పుదుక్కోట రాజ్యమున తిరుగోకర్ణము నందొక బ్రాహ్మణవంశమువారు పాలకులుగా నుండి చోళసామంతుల మని చెప్పకొనుచుండిరి. పాండ్యదేశములో గల లంబకర్ణు లను వారు మహారాజ పట్టాభిషేక కాలమున ప్రత్యేక విధులు నిర్వ హించు వారుగా నుండిరి *.

ఈ మహారాజు 16, 17 సంవత్సరములు చోళ దేశమును వేంగీ దేశమును పాలించి క్రీ. శ. 1150 వ సం॥ ప్రాంతములో విరమించి నల్లు కన్నుమూను.

## రాజరాజు II

రెండవ కులోత్తుంగుఁడు చనిపోక పూర్వము 4 సం॥ లనుండి యీతఁడు యువరాజుగా పాలించుచు వచ్చెను. ఈయనకు చోళ దేశమును, వేంగీదేశమును, గంగవాడిలోని తూర్పుభాగమును కొంగుదేశమును స్వాధీనములోనే యుండెను. కాని యీయన సామంతు లందరును దాదాపు స్వతంత్ర రాజులుగనే వ్యవహరిం చుచు వచ్చిరి.

---

* మహావంశ మను తమిళ గ్రంథము చూడుడు.

ఈ మహారాజునకు చోళేంద్రసింహ, కందర్ప, రాజగంభీర, ఎదిరిలిచోళ, వీరధర, వీరోదయాది బిరుదులు గలవు.

ఈయనకు అవనిముఖుదుద్దైయాల్, భువనముఖుదుద్దైయాల్ ధరణిముఖుదు, దనూల్, ఉలగుడై, ముక్కోకిల యను రాణు లుండిరి. ఇందు అవనిముఖుదుద్దైయాల్ పట్టపుదేవిగా నుండెను.

ఈయన వద్ద మలాడు పాలకు డగు నరసింగవర్మ పౌత్రుడు తిరుక్కోవలూరున విష్ణ్వాలయమును గట్టించెను.

తెలుగు దేశమున నీయనకు సామంత నృపాలురుగా త్రిభువన మల్లచోడ మహారాజు, చిక్క దేవచోడ మహారాజు, కోన రాజేంద్ర లోకరాజు, కొండ పడమటి బుద్ధరాజు, వెలనాటి కులోత్తుంగ రాజేంద్ర చోడరాజు, చియ్యగునాడు మున్నగువా రుండిరి. వీరందరి పైనను వెలనాటి రాజేంద్ర చోడ రాజే రాజప్రతినిధిగా నుండెను.

దక్షిణ దేశమున రాజ గంభీర చేదియరాయుడు, రాజరాజ కాడవరాయుడు, కులత్తూరు పల్లవరాయుడు, నిత్యవినోద సాంబువ రాయుడు, రాజనారాయణ సాంబువరాయుడు, కాదంబరాయర్, వంగార ముత్తరాయ ననువారలు సామంతులుగా నుండిరి. మలయ కుల రాజర్ అను నతడొక సామంతుడు. ఈ మహారాజు క్రీ. శ. 1173 వ సం॥ వరకు రాజ్యమును పాలించెను.

## రాజాధిరాజు II

రెండవ రాజరాజు తర్వాత నితడు చోళ రాజ్యమును పాలింప నారంభించినను, అంతకు పూర్వము 8 సం॥ల నుండియు యువరాజుగా పాలించు చున్నట్లు కనుబడును. ఈతడు రాజరాజు కుమారుడు గా డనియు, విక్రమచోళుని దౌహిత్రు డనియు జెప్పెదరు. ఈతడు సమర్థు డని తలంచి రాజరాజు యువరాజుగా నొనర్చెను.

క్రీ. శ. 1169 వ సం॥ము తర్వాత పాండ్య దేశమున రాజ కుటుంబములలోనంతఃకలహములు చెలరేగి యందుపాల్గొనిన సిలోను వారి నణచుటకై చోళ రాజ్యము గూడ నా తగవులలో పాల్గొన వలసి వచ్చెను. మధురలోని పరాక్రమ పాండ్యునకును కులశేఖర పాండ్యునకును తగాదా యేర్పడి, కులశేఖర పాండ్యుడు మధుర నాక్రమింపదలచెను. మధుర పాండ్యునకు సిలోను సహాయము వచ్చుచుండెను. ఈలోపలనే కులశేఖరుడు మధుర నాక్రమించి పరాక్రమ పాండ్యుని దారాపుత్ర సహితముగా చంపించెను. సిలోను పాలకుడగు పరాక్రమ బాహు వందుచే యుద్ధము చివరవరకు జరుగవలె నని నిశ్చయించెను. ఈ యుద్ధమున కులశేఖరుని బలము హెచ్చుగా నుండినందున లంకనుండి మరికొంత సైన్య సహాయము కావలసివచ్చెను. అప్పుడు రామనాడు, మధుర జిల్లాలలో ఘోర యుద్ధములు జరిగెను.

సిలోనునకు ప్రత్యర్థిగా నుండుటచే చోళరాజు కులశేఖరుని పక్షమున నిలచెను. పాండ్యదేశమున కులశేఖరుని బలము హెచ్చ య్యెను. కాని తర్వాత జరిగిన యుద్ధములో పరాక్రమ బాహు కులశేఖరు నోడించి, పరాక్రమ పాండ్యుని పుత్రుడగు వీరపాండ్యుని రాజుగా జేసి పాండ్య చోళదేశములు దోచెనట. పిమ్మట రాజాధి రాజు రాజ్యమున సిలోనులు కొండి, పాశి ప్రాంతములలో సామంత రాజులతో యుద్ధము లొనర్చి జయించిరట; గాని తర్వాత కొద్ది కాలములోనే మరల ఓడింపబడి వెనుకకు తరిమి వేయ బడిరి.

ఈ మహారాజు తెలుగు దేశమున పలుకుబడి గల్గియే యుండెను. నెల్లూరు పాలకుడగు సిద్ధరసచోడుడు, ఈయనకు సామంతుడుగానే యుండెను. తమిళ దేశమున పొత్తపిచోళ వెన్నిగ కుర మను నతడొక నాయకుడుగా నుండెను.

ఈయన పాలనలో 7, 8 సం॥లు పాండ్య యుద్ధములలోనే జరగి పోయెను. ఈ యుద్ధములు 1169-77 వ సం॥ల మధ్య జరుగు

చుండెను. వీరపాండ్యుని జయించి సామంతునిగా జేకొని చోళసేనా నాయకుఁ డగు అన్న పల్లవ రాయుఁడు మధురరాజుగా జేసినట్లు కొన్ని దృష్టాంతములు గలవు. రాజాధిరాజు కాలములో గంగ వాడిలోని భాగ మట్లే కదలక యున్నట్లు కన్పడును.

ఈ మహారాజువద్ద అన్న పల్లవ రాయుఁడుగాక, పెరుమా నంబి యను మరియొక సేనాధిపతి ప్రసిద్ధి వహించెను.

ఈయన క్రీ. శ. 1179 సం॥ వరకు, నసగా మొత్తము మీద 16 సం॥లు చోళ రాజ్యమును పాలించెను. తర్వాత మూడవ కులోత్తుంగుఁడు రాజ్యమునకు వచ్చెను.

## కులోత్తుంగుఁడు III

ఈయన రెండవ రాజాధిరాజు కన్న మిక్కిలి సమర్థుఁడుగా కనబడు చున్నాఁడు. ఈయన కాలములో పాండ్య రాజులతో మూఁడు యుద్ధములు జరిగెను. మొదటి సారి పాండ్యరాజగు కుల శేఖరుఁడు చనిపోయి నప్పుడాతని కుమారుఁడో లేక దగ్గర జ్ఞాతియో యగు విక్రమ పాండ్యునిపై నెదిర్చిన వీరపాండ్యుని జయించుటకై చేయఁబడెను. ఈ యుద్ధము క్రీ. శ. 1182 వ సం॥నకు ముందే జర గెను. దీనిలో వీరపాండ్యుని కొడు కొకఁడు చని పోవుటయు, వీర పాండ్యుఁడు పారి పోవుటయు జరగెను. అప్పు డీ మహారాజొక జయ స్తంభమును నాటించెను.

రెండవ సారి వీరపాండ్యుఁడు కేరళరాజు సహాయము గైకొని క్రీ. శ. 1189 వ సం॥ ప్రాంతములో పాండ్యరాజు నెదిర్చఁగా, దానికి గూడ కులోత్తుంగుఁడు సహాయము పంపి, నెట్టూరువద్ద జర గిన యుద్ధములో నోడించఁగా, వీరపాండ్యుఁ డును కొల్లంరాజును విధిలేక కులోత్తుంగ రాజునకు లోబడి పోయిరి. అప్పుడు కులోత్తుం గుఁడు కారువూరులో తన 34 వ పాలన వత్సరమున మొదటను, తర్వాత మధురలోను విజయాభిషేకముల గావించు కొనెను. క్రీ.శ.

1215 వ సం॥ ప్రాంతమున నొక తిరుగుబాటు 3 వ సారి విక్రమ పాండ్యుని కొడుకు కులశేఖరుని కాలమున జరిగెను. అప్పుడు జటవర్మ కులశేఖరుఁడను వాఁ డెదిర్చగా నప్పుడు కూడ కులోత్తుంగుఁడు సాయ మొనర్చెను. ఆ యుద్ధములోనే గాబోలితఁడు మధురలో పాండ్య దర్బారును నాశనము గావించెను. ఈ పాండ్యరాజుల యంతః కలహములలో నితఁడు పాల్గొనుటవల్ల కొంతవరకు నష్టపడె నన వచ్చును.

క్రీ. శ. 1216 వ సం॥ ప్రాంతమున మారవర్మ సుందర పాండ్యుఁ డను నతఁడు విజృంభించి పాండ్యదేశ మాక్రమించుటయే గాక, చోళరాజ్యమున ప్రవేశించి యనేకచోట్ల నగ్నిని రగుల్కొల్పి, యల్లకల్లోలము గావింప నారంభించెను. అప్పటి కీ మహారాజు వృద్ధాప్యదశలో నుండుటచే నాతనికి చాలక యుండఁగా తుద కతఁడు ముదిగొండ చోళపురమునకు వచ్చి దర్బారులో వీరాభిషేకము గావించు కొనెనఁట. తర్వాత కులోత్తుంగుఁడు రెండవ బల్లాలరాజు వద్దకేగి యాతని కుమారుఁడగు వీరనరసింహుని సైన్యసమేతముగ గొనివచ్చి సుందర పాండ్యునితో తుదకు సంధి గావించుకొని చోళరాజ్యమును నిలుపుకొని నట్లు గన్పడును. ఇంతవరకు విజయాభిషేకముల గావించిన యీ మహారాజున కీ దశయే హీనదశ యన వచ్చును. అప్పటినుండి యీతఁడు పాండ్యులకు లోబడియెను.

ఈ మహారాజు పాలన 23, 24 సం॥ లలో దేశమున గొప్ప కరవు సంభవించెను. తిను బండారములు కరువయ్యెను. అప్పుడుత్తరార్కాటులో (తిరువన్నామలై) కాసునకు ఒక కొల్ల పాత్రలో నాల్గవవంతు ధాన్య మీయఁబడుచుండెనఁట. అప్పుడు కొందరు దాతలు నూతనముగా చెరువుల ద్రవ్వించియు, నది కరకట్ట వేయించియు బీదలకు కూలిని ప్రసాదించి రక్షించుచు వచ్చిరఁట. ఈ క్షామములో తంజావూరు నందొక వెల్లాలు, తన యిర్వురు కుమార్తెలతో సహా 110 కాసుల కమ్ముడు పోయెనఁట. దీనిని

బట్టియే యీ శాసనము యొక్క తీక్ష్ణతను మనము గ్రహింప వచ్చును. కాని యట్టి సమయములో మహారాజు చేసిన కార్యము లేమో మనకు తెలియ వచ్చుటలేదు; గాని యవసర కార్యము లొనర్చెననియే తలంపవలసి యుండును.

ఈ మహారాజు తంజావూరు జిల్లా త్రిభువనములో త్రిభువనేశ్వరాలయమును కట్టించెను. ఇంతేగాక చిదంబర దేవాలయమున ముక్తమండప మొకటియు, శివకామియాలయమున గోపుర మొకటియు, వరండా యొకటియు, తిరువాన్మూరులోని వాల్మీకేశ్వరాలయమునకు గోపుర మొకటియు, శివాలయమునకు సభామంటప మొకటియు, గోపురమును కట్టించి, మధురలోని హాలాహాలేశ్వర దేవళమును, కంచిలోని యేకామ్రనాథాలయమును, ద్వారసముద్రములోని రాజరాజేశ్వరాలయమును, తిరువడి తురుదూరులోని శివాలయమును, బాగు చేయించెను. చిదంబర దేవాలయమునకు బంగారు మలాము వేయించెను.

ఈ యనకు త్రిభువన చక్రవర్తి, చోళ కేరళ దేవబిరుదము లుండెను. వీర రాజేంద్రుండను బిరుదము గూడ గలదు.

ఈ మహారాజునకు యీశ్వర శివుండను శైవ గురువుండెను.

కడపజిల్లా వల్లూరులో మొదటను, తర్వాత నెల్లూరులోను రాజధాని నుంచుకొని పాలించిన నల్లసిద్ధి చోడరాజీయనకు సామంతుండుగా నుండెను. ఈతండు స్వతంత్రుండగుటకు ప్రయత్నించుటవలన గాబో లొకసారి కులోత్తుంగుండు దండెత్తి వచ్చి మరల లోబరుచుకొనెను. కాంచీపుర సామంతులు స్వతంత్రు లగుటకు యత్నింపంగా నచటకేగి వారిని మరల లోబరచుకొనెను. ఈయన కష్ట సుఖముల మధ్య 40 సం॥లు చోళ దేశమును పాలించి తుదకు క్రీ. శ. 1217–18 వ సం॥లో చనిపోయినట్లు కన్పడును.

ఈయన రాజాధిరాజు కుమారుండు గాడనియు, చోళవంశములో సంగమ రాజను వానిపుత్రుండును, నల్లమార్గ అను వాని

సోదరుఁడు నై యుండవచ్చునని చరిత్రజ్ఞులు గుర్తించు చున్నారు. రాజాధిరాజు పాలనచివరను, యీాయన పాలనలోను కమ్మనాడు, వెలనాడులు రాజధానులుగా పాలించిన చోడరాజులును వారి సామంతులగు కోటవారును, చాగివారును, కోనరాజులును, కాక తీయ రాజులకు సామంతులై పోయినట్లు కన్పడుచున్నది.

## రాజరాజు III

మూడవ కులోత్తుంగుని తర్వాత మూడవరాజరాజు చోళ రాజ్యపాలకుఁ డయ్యెను. ఇతని పాలనము క్రీ. శ. 1216వసం॥ నుండియు గన్పడుచున్నది. తర్వాత 1, 2 సం॥ ల వరకు కులోత్తుం గుఁడు జీవించియుండెను. అప్పు డీతఁడు యువరాజు.

ఈయన యువరాజుగా నున్నప్పుడు సుందర పాండ్యుఁ డను పాండ్యరాజు చోళదేశముపై దండెత్తెను. అందుచే నీయన రాజపాల నము వివిధ కష్టముల మధ్య నారంభింపఁబడ వలసివచ్చెను.

ఈయన పాలనలో గణుతింప దగిన కార్యము లేవియు గన్ప డుట లేదు. పాండ్య హొయిసల రాజులు బలవంతు లగుటచే వారి ప్రతిభ హెచ్చి చోళరాజ్య ప్రతిభ క్షీణింప నారంభించెను. ఈ కాలము నందే ఆంధ్రదేశములోని కమ్మనాఁడు, వెలనాఁడు ప్రాంతములు కాకతి గణపతి దేవచక్రవర్తికి లోఁబడి పోయెను. అప్పటికే యచ్చటి తెలుఁగు చోడ రాజులు స్వతంత్రులుగా నుండి తుదకు గణపతిదేవు నకు సామంతు లైరి.

ఈయన పరిపాలన 5 వ సం॥న దేశమున శాంతి భద్రతలు లేకుండిన నిదర్శనములు గలవు. ఒక దేవాలయములోని వస్తువులు, విగ్రహములు మరొక చోటికి మార్పబడిన ట్లొక శాసనము వివ రించు చున్నది. రెండు గ్రామములలోని రికార్డులు నాశనము కాగా మరల విచారణపై దయారు చేయవలసి వచ్చెను.

ఈయన కాలములో సామంతులలో గూడ నన్యోన్య కల హము లుండెను. వానిని వారించుట కితనికి శక్తి యున్నట్లు లేదు.

ఇతఁడు మొదట మారవర్మ, సుందరవర్మ పాండ్యులకు లోబడి యుండి తర్వాత ధిక్కరించుటవల్ల నతఁడు మరల దాడి వెడలెను. ఆ యుద్ధమునందు గూడ నితఁడోడింపఁబడెను. అప్పుడీయన పట్టపురాణి పరివార స్త్రీల సహితముగా బందీ చేయఁబడుటయేగాక పాండ్యరాజు విజయోత్సవములలో నీళ్లుమోయు పనిమున్నగు కార్యములు చేయుటకై నియోగింపఁబడెనఁట. పాపము! రాజరాజు పారిపోవు చుండఁగా కొప్పెరు జింగను కాడవరాజు పట్టుకొని బంధించి తీసికొని వచ్చెను. ఈ కొప్పెర జింగంతట చోళ రాజ్యమున గల వైష్ణవ దేవాలయములను ధ్వంసముచేయ నారంభించెనఁట.

ఈ సమాచారము విన్న హోయిసల నరసింహరాజు తాను వెంటనే పాండ్య దేశముపై దండెత్తి శ్రీరంగ ప్రాంతమున నుండి తన దండనాయకులగు అప్పన, సముద్ర గోపయ్య యను వారలను చోళరాజును విడిపించుటకై పంపెను. త్రోవలో నితఁడు నగర రాజ్యమును సాధించి సెందమంగళము, తూర్పున దక్షిణార్కాటు జిల్లాలో వారణాసి నదికి దక్షిణమున ననేక యూళ్ళను దోచి, పైర్లను నాశనము గావించి, స్త్రీలను పట్టుకొని హింసింప నారంభింపఁగా, నప్పుడు కొప్పరిజింగు సంధి కోడంబడెనఁట. హోయిసల రాజు పాండ్యుని జయించి కప్పము గైకొని, కొప్పరిజింగును చోళ రాజునకు లోబడి యుండున ట్లొనరించెను. అప్పటి నుండియు రాజరాజు పాలనము చక్కఁగా జరిగెను.

ఈ మహారాజు 30 సం॥లు మొత్తముమీద చోళరాజ్యపాలన గావించెను. ఇతఁడు క్రీ. శ. 1246 సం॥లో మూడవ రాజేంద్రుని యువరాజుగా నొనర్చెను. ఈయన కాలములో కడప, నెల్లూరు ప్రాంతములుం గూడ నీయనకు లోఁబడి యున్నట్లే కన్పడును. తంజావూరులో రాజద్రోహులు చెలరేగఁగా నితఁడు వారియాస్తులన్నిఁటిని వశపరచుకొని వేలము వేసి రాజ భండారమున జేర్చుకొనెను. మరి యొకచోట నిద్దరు శివబ్రాహ్మణులు శివాలయద్రవ్యమును, నగలును

హరించి, యం దొకఁడు తన విటక త్తెకు దేవుని నగలిచ్చినందుల కును, విచారింప వచ్చిన యధికారులను ధిక్కరించి కొట్టి తిట్టి నందు లకును శిక్షింపఁబడిరి. ఇట్లే యాకాలమున పరిపాలన పద్ధతి యుండెను.

చోళరాజ్యమున గూడ హోయిసల రాజుల శాసనములు గాన వచ్చుటచే వారి కా దేశమునందును పలుకుబడి విస్తారముగ నుండెనన వచ్చును. తెలుఁగు చోడరాజులలోని మన్మసిద్ధి, యల్లసిద్ధి, తిరుకాల దేవరాజు మున్నగు వారీ యన సామంతులనియే యభిప్రాయము గలదు.

## మూడవ రాజేంద్రుఁడు

మూడవ రాజరాజు జీవించి యుండఁగనే యితఁడు యౌవ రాజ్య పాలకుఁడుగా నుండి యాతని తదనంతరము చోళ దేశమును పాలింపఁజొచ్చెను. రాజరాజు కన్న నితఁడే హెచ్చు సమర్థుఁడుగ గన్పడుచున్నాఁడు. ఈతఁడు యువరాజుగా నున్నపుడే పాండ్యరాజు చోళరాజ్యముపై దండయాత్ర సలిపి యనేక చోట్ల గ్రామము లగ్ని పాలుగావించి చోళరాజు నోడించియుండుటచే నాబాధ పడలేక రాజేంద్రుఁడాతనికి సామంతుఁడై పోయెను. తర్వాత కొంత కాలమునకు మరల నీరాజేంద్రుఁడు విజృంభించి, సమయము జూచుకొని పాండ్య రాజ్యముపై దండెత్తి జయింపఁగా నా సమయమున హోయిసల సోమేశ్వరుఁడు పాండ్య పక్షము వహించి యాతని రాజ్యమును మరల నిప్పించెను. క్రీ. శ. 1258 ప్రాంతములో జటవర్మ సుందరపాండ్యుఁ డను వాఁడీయన దేశము పై దాడివెడలి జయించి యీతనిచే కప్పము బొందినట్లు కన్పడును.

ఈయన వద్ద చోడరాజులలోని తిక్కరాజు నెల్లూరు, చెంగల్పట్టు, కడప జిల్లాలలో సామంత నృపాలుఁడుగా నుండెను. ఈ తిక్కరాజు కాంచీపుర ప్రాంతమును గూడ వశపరచుకొని యుండెను. క్రీ. శ. 1249 వ సం॥ నాటికి కాంచీపుర ప్రాంతము గణపతిదేవ చక్రవర్తి జయించినట్లు కనుపడుచున్నది. జటవర్మ

పాండ్యుఁ డా సమయమున దండయాత్ర సాగించి కాంచీపురమున తిక్కరాజును చంపి, గణపతి దేవుని భారద్రోలి స్వాధీన పరచు కొనెనఁట. తర్వాత కొంతకాలమువరకు కాంచీపురము పాండ్యరాజు క్రిందనే యుండెను. రాజేంద్రుఁ డీప్రాంతమును తిరిగి చేర్చికొన జాలక పోయెను.

ఈయన వద్ద చోళగంగు, కలప్పాలర్ అను సామంతులు చోళదేశమున నుండిరి. ఈ మహారాజునకు చిదంబరములోని నట రాజస్వామి యిష్టదేవతయై యుండెను. ఈయనకు చోళకులమా దేవి యను భార్య యుండెను.

ఈయన 33 సం॥ లు చోళదేశమును పాలించెను. ఇతని పాలనము క్రీ. శ. 1279 వ సం॥ వరకు నున్నట్లు శాసనములు గలవు. ఈయన 34 వ పాలన సం॥ నుండియు నెల్లూరు, ఉత్తరార్కాటు జిల్లాలలో హెచ్చుశాసనములును, తక్కిన జిల్లాలలో సామాన్యముగను లభించుచున్నవి. ఆ కాలము నుండియు నీయ నకు గొంత విశ్రాంతియుండి యుండును. కాని యీయన యనంత రము చోళరాజ్యము చోళవంశీకు లెవ్వరును పాలించినట్లు కన్పడదు. ఇది పాండ్యరాజ్యములో జేరిపోయి యుండును. హొయిసల రాజగు వీరరామనాథుఁడు గూడ మిక్కిలి సమర్థుఁడు గానందున నాకాలములో పాండ్యులు దండెత్తి యీ రెండు దేశములను తమ రాజ్యములో గలుపుకొనినట్లు చరిత్రజ్ఞు లభిప్రాయపడిరి. మారవర్మ సుందర పాండ్యుఁ డొరయూరు, తంజావూరు పట్టణములను తగలబెట్టి నట్లొక యాధారము గలదు. ఇది యీయన పరిపాలనారంభమున జరిగియుండును.

9 వ శతాబ్దము నుండి వరుసగా కరికాలుని వంశీకుల చేతనే పాలింపఁబడిన యీ చోళరాజ్య మీ విధముగా 13 వ శతాబ్దము చివరకు పేరు లేకుండ బోయెను. చాళుక్య రాజ్యము దీనితో మధ్య గలిసి యుండియు జివరకు కాకతీయ రాజుల హస్తగత మయ్యెను.

చాళుక్య చోడరాజుల చరిత్ర మీా విధముగ ముగిసినను, వారొనర్చిన దేవాలయాది ప్రతిష్ఠలు, కట్టడము లిప్పటికిని చోళ దేశమున నుండి వారి కీర్తిని చాటు చున్నవి.

చోళ రాజ్యమంతయు నా కాలమున నాలు మండలములుగా నుండెను. కొన్ని గ్రామములు కలిసి కుర్రము లనియు, కొన్ని కుర్రములు కలిసి నాడులు లేక కొట్టము లనియు, కొన్ని నాడులొక మండల మనియుఁ బిలువఁబడుచుండెను. ప్రతి గ్రామమునకు మహాసభ యొకటి యుండెను. గ్రామ వ్యవహారము లన్నియు నీ సభయే నిర్వహించు చుండెను. కుర్రములకు కొట్టములకుఁ గూడ మహా సభలు గల్గి యున్నట్లు నిదర్శనములు చిక్కు చున్నవి. ఈ సభలలో 40 సం॥ల వయస్సు గలవారు మాత్రమే సభ్యులుగ నుండ నర్హులు.

ఈ తూర్పు చాళుక్యరాజ వంశమునుండి చోళ వంశమునకు వచ్చి కలిసిపోయిన మొదటి కులోత్తుంగుని వంశమువారు కొందఱు దక్షిణ దేశముననే వృద్ధిఁగొంది యచట పిళ్ళయారులు, ఆళ్వారులు, ఒడయారులు మున్నగు వారికి మూల పురుషులై పోయినట్లు దృష్టాంతములు లభించు చున్నవి.

ఈ విషయము ముందు వివరింపఁబడును.

ఇఁక తెలుఁగు దేశమున స్థిర నివాసులైన చాళుక్యరాజుల నుండి యీా క్రింది గృహనామస్థు లేర్పడినట్లు దృష్టాంతములు లభించుచున్నవి.

## —♦ చాళుక్య గృహనామములు ♦—

(1) తోలేటివారు
(2) నిడదవోలువారు
} ఇవి శివయోగ సార మను గ్రంథములో కన్పడు చున్నవి.

(3) ఆరవీటివారు
(4) కోనేటివారు
(4a) నందేలవారు
} ఇవి ఆరవీటి వంశచరిత్రవలన తెలియుచున్నవి.

( 5) అడపావారు
( 6) ఎలమంచివారు
( 7) గొల్లవాడవారు
( 8) వెల్మపాటివారు
( 9) సిద్ధిరాజువారు
(10) మంగలంపాటివారు
(11) ముదిగొండవారు
(12) భీమరాజువారు

ఇవి కొన్ని శాసనములలో కను పడుచున్నవి. (S. I. I; IV no. 1325 VI no. 612, 665, 916, 919 & 921, N. I, N/112, c. p. 6; p. 7

(13) కోటావారు *
(14) సమ్మెటవారు
(15) మచ్చవారు
(16) కొండవారు
(17) చోడవారు
(18) నందివాడవారు
(19) తిరుమలరాజువారు
(20) ఉద్దగిరివారు
(21) జూటూరివారు
(22) సాళువవారు
(23) మాదిరాజువారు
(24) పాశమువారు

14 మొదలు 30 వరకు గల పేర్లు వెలుగోటివారి వంశావళిలో వ్రాయబడియున్నవి♦.

---

* ఇది యూహామాత్రము

♦ "క్రీ. శ. 1361సం॥ లో వెలమ వీరులగు అనపోతానాయడు, మాదానాయఁడులు చంపిన చాళుక్య రాజులలో నీక్రిందివారలు గలరు.

"మచ్చ యౌబళరాజు, కొండమల్లరాజు, కొమ్మలదేవుపిన్నరాజు, చోడ పర్వతరాజు, నందివాడ నరసరాజు, తిర్మలరాజు కొండ్రాజు, కట్టవెంగళ్రాజు, జూటూరి సూర్యుఁడు, అప్పటి చెన్నాజు, సాళ్వ రాఘవరాజు, సంబెట కొండ్రాజు, మాదిరాజు హరిరాజు, పాశము చెన్నాజు, మున్నగువారు"

25) పాణెమువారు
26) గోవర్థనవారు
(27) అప్పచివారు
(28) చెందువవారు
(29) బోలెపల్లివారు
(30) కొమ్మూలదేవువారు

ఇంకను కొన్ని గలవు గాని స్పష్టముగా లేవు. వీనిలో గొన్ని వంశము లిప్పటికి నశించి యుండును. మరి కొన్ని యేర్పడి యుండును. కాని యవి కాలగర్భమున లీనమై గుర్తించుటకు వీలు లేకున్నవి. వీనిలో కొన్ని కమ్మవారిలోను, కొన్ని క్షత్రియులలోను, మరికొన్ని కాపు లేక బలిజవారిలోను గాన వచ్చు చున్నవి.

## —♦ చాళుక్యులనుండి యేర్పడిన కమ్మ వంశములు ♦—

కమ్మవారిలో గల (1) అడపావారు, (2) నిడదవోలువారు, (3) యలమంచివారు, (4) మురగొండవారు, (5) కోటావారు, (6) సమ్మెటవారు, (7) మచ్చవారు, (8) కొండవారు, (9) కోనేరు వారు, (10) ఎలంపాటివారు ఈ చాళుక్య వంశీకులే యైనట్లు కనుపడు చున్నది. వీనిలో కొన్ని వంశములు క్షత్రియులలో గూడ నుండి యాదిలో వీరందరొకటిగా నున్నట్లును పద్మనాయక చరిత్రలో సూచించి నట్లు క్రీ. శ. 1038 వ సం॥ తర్వాత క్రమముగా నా యా ప్రదేశములవారు అచటి వాడుకను బట్టి విడివిడిగాఁ బేర్లు వహించి నట్లును, అప్పుడు కమ్మనాటిలోని యీ వంశీకులు గూడ కమ్మవారై పోయినట్లును కనుబడు చున్నది. ఇంకను వెలమాటి వారును, మంగపాటివారును, మంగలపాటివారు నీ వంశముల లోని వారే యై యుండి వారి గృహ నామములు వాడుకలో నపభ్రంశము నొంది యుండు నని తోఁచు చున్నది. ఇట్లెన్ని చాళుక్య వంశములు కమ్మవారుగా మారిరో చెప్పుటకు శక్యముగా కున్నది.

ఇందలి యలమంచి, మచ్చ, కొండ, అడపా, సమ్మెట వార్ల చరిత్రము ముందు పుటలలో గలదు.

కమ్మవారు ప్రత్యేక మొక తెగ యనియు, కమ్మనాటి ప్రజలు కమ్మవారైరనియు, వీరికిని రాజకుటుంబముల వారికిని సంబంధములు మాత్రమే యున్నవి గాని కమ్మవారు రాజకుటుంబముల (Dynasties) లోని వారు కాదనియు నీ చరిత్ర ప్రథమ భాగముపై విమర్శనలు బయలు దేరినవి♦. కాని ప్రత్యేక రాజ వంశములలోని వారే కమ్మవారిలో నున్నట్లు పై విషయముల వల్ల స్పష్టపడు చున్నందునను, కమ్మనాటి ప్రజ లందరును కమ్మవారు మాత్రమే కానందునను, ఆ విమర్శనలకు విలువ కన్పడుట లేదు. తెలుగు చోడరాజుల నుండి యేర్పడిన వంశములను బట్టి చూచినను యిట్టి యభిప్రాయమే దృఢపడు చున్నది. వాని వివరములు ముందు గలవు. చాళుక్య తెగలో నింక నిట్లనేక వంశము లేర్పడి కమ్మవారిలో చేరియుండ వచ్చును గాని కాల గర్భమున బడిన వానిని గుర్తింపజాలము.

ఆరవీటివంశీకులతో (చాళుక్యరాజులు) సంబంధములో నర్సిన విజయనగర సామ్రాజ్యాధిపతియగు శ్రీకృష్ణదేవరాయలకు తంజావూరి నాయకరాజులగు బలిజలు గూడ (చెవ్వ విభుడు మున్నగు వారు) బంధువులేయగుటను, ఆరవీటి బుక్కరాయల వంశమువారు చాళుక్య రాజ వంశీకులైనట్లు ఆరవీటి వంశ చరిత్ర వల్లను, నెల్లూరి జిల్లా శాసనములందలి మంగలంపాటి వెంకట్రాజు శా. శ. 1524 సం॥ లో వ్రాయించిన శాసనము వల్ల (N' I' C' P' no 6) ను స్పష్టపడుచున్నందునను, చాళుక్య వంశీకులు కొండ రాతెగలో నున్నట్లు కన్పడు చున్నది. తంజావూరి నాయక రాజులు చతుర్థ వంశములోని రాజులైనట్లు రఘునాథాభ్యుదయమను గ్రంథమున గల విషయము

♦ Hindu D/ 19-11-39 & ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక సంపు 28-5 & 6

మొదటి భాగమున దెల్పితిమి. చాళుక్యరాజు లిట్లనేక తెగలు గా న్యారి పోవుటవల్ల, వీరు హెచ్చుగా కమ్మవారిలోనే యున్నట్లు లేదు గాని వీరు కమ్మవారిలో కొందఱికి మూల పురుషులగు తెలుఁగు చోడ రాజులతో బంధుత్వములు గల్గియుండుటవల్ల నట్టివారిలో కొందరైక్యమై పోయియుండిరి ఇఁక దూర్పు చాళుక్యచక్రవర్తులకు లభించిన చోడరాజ్య చరిత్రమును గూడ దెలిసికొందము.

## —♦ కాంచీపుర చోడరాజులు ♦—

కరికాలాన్వయులగు నీ చోడరాజులలో రాజరాజ దేవుని చారిత్రము వరకు మొదటిభాగమున జెప్పబడినది. ఆయనకు రాజేంద్ర దేవుఁడను కుమారుఁడు జనించి యాతని తర్వాత చోళరాజ్య పాలకుఁడయ్యెను.

## —♦ రాజేంద్ర చోళదేవుఁడు ♦—

ఈ మహారాజునకు గంగయి కొండచోళుఁడనియు, విక్రమ చోళుఁడనియు, అనపాయ యనియు బేర్లుకలవు. ఈయన తన తండ్రి కాలములో నుండియనఁగా క్రీ. శ. 1012సం॥ నుండి రాజ్యపాలనలో యువరాజుగా పాలించుచువచ్చెను. ఈయన రాజ్యము మదరాసు రాజధాని యంతటికిని మైసూరు రాజ్యములో కొంతభాగము వరకును విస్తరించెను.

పశ్చిమ చాళుక్య చక్రవర్తియగు మూడవ జయసింహునకును (1018-1042) యీయనకును కొల్లిపాక, మాన్యఖేతములకడ యుద్ధములు జరగి యీయనయే జయించుచువచ్చెను. ఇతఁడు రట్టపాడు, రాయచూరు, భవనాశిమున్నగు ప్రాంతములను జయించెను. ఈయన దండ యాత్రలకు సిలోను, కేరళ, పాండ్య దేశములు వడకి పోయి, లోబడియుండెను. మాళ్వ దేశము గూడ నితఁడు గో చెనఁట. చక్ర కొట్యమండలము (బస్తరు) మునిని దేశము మొదలైనవి త్రోవలో జయించి, వంగదేశమునకు గూడ నితఁడు తన సేనను బంపి

వారిని లోబరచుకొనెను. ఇతఁడు బీహారు, కళింగ రాష్ట్రములను గూడ జయించినట్లు చరిత్రకారుల యభిప్రాయము. ఇంతేగాక నితఁడు సుమిత్రా (సువర్ణ) ద్వీపముపై గూడ నౌకాదండ యాత్ర సలిపి యచ్చటి రాజగు సంగ్రామ విజయోత్తుంగుని విశేషధనరాసులను కొల్లగొనెనఁట.

ఈయన వద్ద చక్కఁగా తరిఫీదు నొందిన శూరాగ్రేసరులగు సైనికబలముండెడిది. ఈయన కాలములో యీస్టు ఇండీసు, చీనా దేశములకును యీయన రాజ్యమునకును వ్యాపారముండి, సైనికులచే రక్షణ చేయఁబడుచుండెను. ఈయన రాజధాని గంగైకొండ చోళపురము. దీనినే ముదిగొండ చోళపురమని గూడ పిలుచుచుండిరి. ఇది నేటి ఉదయార్పాళెం తాలూకాలో పాడువడి యున్నది. గంగైకొండ చోళునకు త్రిభువన లేక వానవన్ మహాదేవి, ముక్కోకిల పాంచవన్ మహాదేవి, వీరమహాదేవి యను భార్యలుండిరి. ఈయనకు రాజాధిరాజు, రాజేంద్రుఁడు, వీరరాజేంద్రుఁడునను మువ్వురు కుమాళ్లు జనించిరి. ఈయనకు అమ్మంగదేవియను కుమార్తె కలదు. ఈమెను వేంగీదేశచక్రవర్తియగు రాజరాజనరేంద్రునికిచ్చి వివాహమొనర్చెను. ఈయన తనచోళ రాజ్యమును మొత్తముమీద 33 సంllలు పాలించెను. ఈయన తనకుమారుని మధురలో ప్రతినిధిగా నుంచెను. రాజేంద్రుఁడచట నొకదివ్య భవనము గట్టించెను. మన్నారు కోవెలకీ మహారాజు కొంతభూమిని తన 24 వ పాలన సంllన నొసంగెను. ఇతఁడు చేరదేశమునకు జటవర్మ సుందర చోళపాండ్యుని తన ప్రతినిధిగా నియమించెను. క్రీ. శ. 1021-22సంllలలో జయసింహునితో మరల యుద్ధములు జరిగెను. అప్పుడితఁడే జయించెను.

ఈ మహారాజు చోళరాజ్య మవిచ్ఛిన్నముగా క్రీ. శ. 1044 వ సంll వరకు పాలించెను. ఇతని కుమాళ్ళలో రాజాధిరాజు యువరాజుగా క్రీ. శ. 1018 వ సంll నుండి పాల్గొనుచు వచ్చెను. ఈయన తర్వాత నాతఁడే సింహాసన మధిష్ఠించెను.

రాజేంద్రచోళుని తండ్రియగు రాజరాజదేవుని కాలములో సిలోను రాజ్యములోని పొలన్నరువ యను పట్టణమున గట్టించిన శివాలయ మిప్పటికిని నిలచియుండి, వీరి రాజ్యవిస్తారమును దెలుపు చున్నది. రాజేంద్రచోళుని పాలనా కాలమున మహాతీర్థ(మంతోట) మందీయన యుద్యోగి యొకఁడు రాజరాజేశ్వరాలయమును గట్టించెను.

క్రీ. శ. 1029 వ సం॥ ప్రాంతమున తూర్పుచాళుక్య వంశములోని విజయాదిత్యవిక్రమయన్న యను సతఁడు కోట్టూరు (తిరువాంకూరు కూరులోనిది) వద్ద నొక సామంత నృపాలుఁడు లేక సేనాధిపతిగా పాలించుచున్నట్లు కన్పడును.

## —♦ రాజాధిరాజ దేవుఁడు ♦—

ఈయన చోళరాజ్య పట్టాభిషిక్తుఁడగుటకు పూర్వమే తండ్రి రాజ్య కాలములోనే యనేక యుద్ధములలో పాల్గొని వీరాగ్రేసరుఁడని కీర్తి వహించెను. పశ్చిమ చాళుక్య చక్రవర్తి యగు రెండవ ఆహవమల్లునితో (క్రీ. శ. 964-990) నితఁడు యుద్ధములు సల్పుచు వచ్చెను. ఇతఁడు కొల్లిపాక, యుద్ధములో తన పరాక్రమమును గన్పరచెను. ఇతఁడు ఆహవమల్లుని సంహరింపఁ గలిగెను. పాండ్య, సిలోను దేశములకు వెడలిన దండ యాత్రలలో నితఁడు జయ మొందెను. ఈలమండల మనబడు సిలోను పాలకుఁడగు విక్రమ బాహుఁ డీతనికి లోఁబడెను. ఈతఁడు సిలోను దండ యాత్రకు వెడలి నపుడు 95 వేల సైన్యముతో బోయెనఁట.

ఈ మహారాజునకు రాజకేసరి, పరకేసరి యున్నగు బిరుదులు గలవు. క్రీ. శ. 1044-46 సం॥ల మధ్య నితఁడు పశ్చిమ చాళుక్య సోమేశ్వరునితో ఘోర యుద్ధము సల్పెను. కంపిలిలోని చాళుక్య భవన మితఁడు నాశనము గావించి, పూండూరు వద్ద జరిగిన యుద్ధములో సోమేశ్వరుని సామంతులగు ననేక తెలుఁగు నాయకులను

ఖైదీలుగా తీసుకొని, పూండూరు నగరము నేల మట్టము గావించి, యచట పిచ్చికుసుమ పైరు వేయించెనఁట. ఇట్లు వోడించినను చాళుక్య రాజ్య మాతని వశమైనట్లు కన్పడదు.

ఈయన తన తండ్రి కాలములోనే యొక యశ్వమేధ యాగ మొనర్చి ప్రసిద్ధికి వచ్చెను. కాంచీపుర చోడ రాజులలో నితఁ డొకఁడే యీ యాగ మొనర్చిన మేటి.

చాళుక్య సోమేశ్వరుని క్రీ. శ. 1047 వ సం॥ నాటి శాసన మొకటి బళ్ళారిజిల్లా హడగల్లి తాలూకాలో గన్పడు చున్నందున నచట వరకు నితని రాజ్యము విస్తరించినట్లు లేదు.

ఈ మహారాజు తన పినతండ్రిని, తన సోదరులను తన కుమారులను రాజ్యపాలనలో ముఖ్యాధికారులుగా నియమించి పాలించెను. ఈయన పూర్వఫల్గుని నక్షత్రమున జనించెనఁట.

ఈ నృపాలునకు ఆహవ మల్ల కులాంతక, కళ్యాణపురం గొండచోళ, ఉలగలండచోళ, జయంగొండచోళ, రాజేంద్ర దేవ, విజయ రాజేంద్ర మున్నగు బిరుదులు గలవు.

ఈయనవద్ద దండనాయకచోళ, కుమారపరాంతక మారార్యఁ వరపు రాజాధిరాజ నలగంగరయ్య చోళవల్లభ దేవపిళ్ళ, దండనాయక అప్పిమయ్య (మహారాజపదిపాలకుఁడు) విష్ణువర్ధన దేవపిళ్ళ, రాజేంద్రచోళమావలివానరాయరు మున్నగు వారు సామంతులుగా నున్నట్లు కొన్ని శాసనములు తెలుపుచున్నవి.

ఈ మహారాజు క్రీ. శ. 1054 వ సం॥ వరకును 36 సం॥ లు చోళరాజ్యమును పాలించి కొప్పమువద్ద జరిగిన ఘోరయుద్ధములో వీరశయన మలంకరించి నట్లు కన్పడుచున్నది.

ఈ మహారాజు నాణెములు సిలోనులో గూడ లభించెను.

ఈయన తర్వాత నితని సోదరుఁడగు రెండవరాజేంద్ర చోళుఁడు పరిపాలనకు వచ్చెను.

## —♦ రెండవ రాజేంద్రచోళుఁడు ♦—

ఇతఁడు తన సోదరుఁడగు రాజాధిరాజు చనిపోయిన తర్వాత రాజ్యపాలకుఁడైనను, తత్పూర్వము 2 సంలల నుండి అనగా క్రీ.శ. 1052 నుండి రాజ్యపాలనలో పాల్గొనుచు వచ్చినట్లు శాసన దృష్టాంతములు లభించు చున్నవి. కొప్పము యుద్ధము మధ్యనే తన సోదరుఁడు మరణించుట వల్ల నచటనే యితఁడు పట్టాభిషిక్తుఁడయ్యెను.

ఈ మహారాజునకు పరకేసరి మున్నగు బిరుదులు గలవు. ఈయన గూడ మిక్కిలి వీరాగ్రేసరుఁడు. ఇతఁడు సిలోను రాజ్యముపై దాడి వెడలినప్పు డారాజగు మానాభరణుని కుమాళ్ళ నిర్వురను ఖైదీలుగాఁ జేకొని యా రాజ్యమును లోబరుచు కొనెను. కొప్పము యుద్ధములో నితఁడు పులకేసి, భయసింహ, దశవర్మ, నన్నినోలంబ మున్నగు పశ్చిమ చాళుక్య సేనాధిపతులను సంహరించుటయేగాక ఆహవమల్లుని పారిపోవున ట్లొనరించెనఁట.

ఈ మహారాజునకు కిలానదిగల్, లోకమహాదేవి యను రాణు లుండిరి. ఈయనకు రాజమహేంద్ర రాజకేసరి యను నొక కుమారుఁ డుండి, మను ధర్మముల ప్రకారము నడచిన ధర్మాత్ముఁడని ప్రసిద్ధి వహించి, ఆహవమల్లునితో జరిగిన ముదక్కారు యుద్ధములో తన పరాక్రమమును గన్పరచి చివరకకాలమృత్యువు వాతఁబడెను. ఈ భూమీశుని చరిత్రము కళింగత్తుపరాని, విక్రమచోళను లాయను తమిళ గ్రంథములలో చక్కఁగా వర్ణింపఁబడి యున్నది.

రాజేంద్ర చోళునకు నల్గురు చిన్న తమ్ము లుండి రనియు, నొక పినతండ్రి యుండె ననియు, ఆర్గురు కుమాళ్లుండిరనియు, యిర్వురు మనుమ లుండి రనియు మణిమంగళం శాసనములో వ్రాయఁబడినది. ఈయనకు మధురాంతకి యను కుమార్తె యొకతె యుండెను. ఆమెను చాళుక్య కులోత్తుంగ మహారాజున కిచ్చి వివాహ మొనర్చెను. ఈయన వద్ద మిలాడ యను 2 వేల గ్రామములకు పాలకుఁడుగా నరసింహవర్మయను వాఁడును, అరియకడక్క గొండచోళుఁడు

జయమూరి నాడాళ్వార్ అను సేనాధిపతులు నున్నట్లు దృష్టాంతములు లభించు చున్నవి.

ఈ నృపాలుఁడు క్రీ. శ. 1064 వ సం॥ వరకు చోళ రాజ్యమును గంగాపురి రాజధానిగా నేలినట్లు కన్పడును. ఈయన తర్వాత తమ్ముఁడగు వీర రాజేంద్రుఁడు చక్రవర్తి యయ్యెను.

## —♦ వీరరాజేంద్రుఁడు లేక వీరచోళుఁడు ♦—

ఈయనకు కరికాలుఁడను బిరుదు నామము గూడఁ గలదు. ఈయన పాలనము క్రీ. శ. 1062 వ సం॥ నుండి కన్పడుచున్నను తన సోదరుని తర్వాత నితఁడు 1064 వ సం॥ లోనే రాజయ్యెను. ఇతఁడు క్రీ. శ. 1070 వరకు మాత్రమే పాలించినట్లు చరిత్రకారులు నిశ్చయించిరి. ఈతఁడు తన యువరాజు కాలములో యుద్ధము లొనర్చినట్లు కన్పడుచున్నది. పశ్చిమచాళుక్య రాజులకు చోళరాజులకుఁ గల వైరము లీయన కాలములో శాంతించెను. ఆహవమల్లుని తర్వాత నాతని కుమాళ్ళగు రెండవ సోమేశ్వరునికిని, విక్రమాదిత్యునికిని రాజ్యవిషయమున తగాదా యేర్పడినప్పుడు, విక్రమాదిత్యుఁడు తన తమ్ముఁడగు జయసింహుని యొక్కయు కాదంబరాజగు జయకేసియొక్కయు సహాయమువలన నీ వీరరాజేంద్రుని కడకు రాయబారమంపి, యీయన కుమార్తెను పెండ్లాడి స్నేహమును సంపాదించుకొని, యీ పలుకుబడి వలన రెండవసోమేశ్వరునుండి కొంత రాజ్యమును గైకొనెను. ఈ విషయము బిల్హణకవి రచిత విక్రమాంకదేవ చరిత్రవల్ల స్పష్టపడుచున్నది.

ఈయన యువరాజుగా నున్నప్పుడు క్రీ. శ. 1058 నుండి సింహళములో రాజప్రతినిధిగా నున్నట్లు కన్పడును.

## —♦ అధిరాజేంద్రుఁడు ♦—

ఈయన వీరరాజేంద్రుని కుమారుఁడు. వీరరాజేంద్రుఁడు క్రీ. శ. 1070 వ సం॥ లో చనిపోయిన తర్వాత నితఁడు చోళరా

జ్యపాలనము స్వీకరించెను. కాని విశేషకాలము పాలించియుండక కొద్దివారములలోనే యీయన పాలన మంతరించెను. పశ్చిమచాళుక్య విక్రమాదిత్యుఁడు తన మామగారి మరణ సమాచారమును వినిన వెంటనే వచ్చి యీతని నభిషేకునిఁ జేసెను; గాని యేకారణముననో యితఁడు కొలదికాలములోనే చనిపోవుటవల్ల రాజేంద్రచోళుని యల్లుఁడును వేంగిదేశ చక్రవర్తియు నగు కులోత్తుంగ మహారాజు వచ్చి యీ చోళరాజ్యమునకు హక్కుదారై క్రీ. శ. 1070 సం॥ లో 9 వ జూన్ తేదీన పట్టాభిషిక్తుఁ డయ్యెను. ఆయనయొక్కయు, తద్వంశీకుల యొక్కయు పాలన విషయము లోగడనే తెలిపితిమి. ఇట్లే చోడరాజుల చరిత్రము చాళుక్యచరిత్రములో కలిసిపోయెను.

చోడరాజులందరును శైవమతస్థులుగనే యుండిరి. వీరి సైన్యములో 60 వేల యేనుఁగులుండెడివని చైనా చరిత్రకారుఁ డొకఁడు వ్రాసెను. వీనిపై నధిరోహించి యనేకవేలసైనికులు బాణములు ఎక్కు పెట్టువారఁట.

## —♦ చోడరాజ వంశీకు లేమైరి ?

ఈ కాంచీపుర చోడరాజ వంశములనుండియు, తద్బంధువు లగు చాళుక్యరాజుల నుండియు దాక్షిణాత్యులలో నేడున్న వెల్లాలులు, ఆళ్వారులు, పిళ్ళయారులు, ఒడయారులు మున్నగు తెగల వా రేర్పడి నట్లు దృష్టాంతములు లభించుచున్నవి. ఈ చోళరాజుల లోని పరాంతకుని కుమారుఁ డగు అరికులకేసరి పిళ్ళయారు లేక ఆళ్వారులతో బంధుత్వము గల్గియుండె నని రాజకేసరి యొక్క 8 వ రాజ్యపాలన నాఁటి శాసనములలో గలదు*. ఈపదములు (ఆళ్వార్

---

* "Records of the eighth year of Rajakesari †show that Arikulakesari, the son of Parantaka, stood relation of pillaiyar or Alvar (terms often applied to junior members of the royal family) to the ruling king who, being a Rajakesari could have been Gandaraditya."

† S. I. I., III, 111&112. The Colas. Part I. p. 168, 9. See also 670 of 1919.

పిళ్లెయార్) రాజవంశములోని రాచ కుమాళ్ళకు వాడుచుండె నట్లు చరిత్రజ్ఞు లభిప్రాయ పడుచున్నారు. వేలన్, ఒడయారను బిరుదు లీ వంశీకుల శాసనములలో పెక్కులు గన్పడుచున్నవి. ఒక కాంచీపుర శాసనములో (No. 1 of 1906) 'కరికాల పిళ్ళయార్' అను పేరును, తిరుమలవాడి శాసనములో చోళవల్లభ దేవవరపు పిళ్లెయార్ అను పదమూతని (కరికాల పిళ్లెయార్) భార్యయగు పాంచవన్ మాదేవి యార్ వ్రాయించినట్లు (85 of 1920)ను గన్పడుచున్నందున కరి కాల వంశీకులగు చోళులే పిళ్లెయార్ బిరుదము ద్రావిడ భాషలో నుప యోగించుకొను చుండినట్లు స్పష్టపడుచున్నది. లోగడ రాజ రాజ నరేంద్రుని భార్యయగు అమ్మంగ దేవి పేరునకుఁగూడ పిళ్ళ యార్, ఆళ్వార్ బిరుదము లున్నట్లు తెలిసియుంటిమి. ఇదిఁగాక తెలుఁగు చోడరాజులలోని మనుమసిద్ధి, తిరుకాళతి దేవరాజులను గుఱించి యొక పడియారు చే వ్రాయింపఁబడిన శాసనములోఁ గూడ (N. I. R/ 8.) వారికి బిరుదుగా పిళ్లెయార్ పద ముపయోగింపఁ బడి నది. అందుచే దక్షిణదేశమునఁ గల చోడవంశీకులు పిళ్ళయారులు, ఒడయారులు, ఆళ్వారులు, వెల్లాలులు మున్నగు శాఖల వారై పోయిరనుటలో నసత్యము లేదు. ఇక తెలుఁగు చోడరాజులలో పైన నుదాహరింపఁబడిన వారిని గుఱించి పిళ్లెయార్ పద ముపయోగింపఁ బడినను తెలుఁగుచోడు లందఱును పిళ్ళయారులుగనే మారిపోయిరని తలంచుటకు వీలు లేకున్నది. ఈపదములు వచ్చుటకు పూర్వమీ వంశీకులే ప్రాచీనకాలమున మఱికొన్ని వాడుచుండినట్లు ప్రాచీన తమిళ గ్రంథములు సాక్ష్యమిచ్చుచున్నవి*. ఆంధ్రదేశము లోని

---

* ప్రాచీన తమిళ గ్రంథము లగు సంగంవాఙ్మయములో చోడ శబ్దమునకు బదులుగా "కిల్లి, వలవన్, సెంబియన్, చెన్ని" మున్నగుపదములు కనుబడుచున్నవి. శబ్దములు మారినను వంశములు మారలేదు.

భూవల్లభ యను నర్థమున "వల్లవ, పల్లవ, వల్లభ" యిత్యాది పదములు ప, వ, బ భేదములేని ప్రాచీన కాలమున దేశ,భాషా, భేదములచే నేర్పడి యుండును. వల్లభరాజులును, పల్లవరాజులును, పైననుండి విన వలవన్ బిరుదాంకితులును వాడు

యీ సూర్య వంశీకులగు తెలుఁగు చోడరాజులు కమ్మవారుగను, క్షత్రియులుగను మారిపోయి నట్లు తెలుఁగుచోడుల చరిత్ర యందు ముందు మీరు చదువఁగలరు.

సూర్యవంశ మనునది మిథ్యావాచకముగఁ దగిలించు కొనిన దగుటచే నంతమాత్రమున వివిధదేశములలో నట్లు చెప్పుకొనిన వంశముల కన్యోన్య సంబంధము లేదనియు, నట్లే తెలుఁగు చోడ రాజులకును కాంచీపుర చోడరాజులకును గూడ సంబంధము లేద నియుఁ గొందఱు చరిత్రకారులు తలంచిరి; గాని యిది చాల ప్రమా దకరమైన పొరబాటని నా యుద్దేశ్యము.

ప్రాచీన తమిళ గ్రంథములలో, (సంగం వాఙ్మయము) సూర్య వంశముల వారుగా పురాణములయం దుదాహరింపఁబడిన శిబిచక్ర వర్తి, ముచికుందుఁడు, మనువు మున్నగువారు కరికాలుని పూర్వీకు లని వ్రాయఁబడి యున్నది. సూర్యవంశములోని మనువును, ముచి కుందుఁడును ద్రావిడదేశ పాలకులని పురాణములు నుడువుచున్నవి. క్రీస్తు పూర్వము దాదాపు 6 వేల సం॥ల నుండి యున్న సూర్య వంశమువారు (యిక్ష్వాకులు) పలుశాఖల వారై పలుదేశములలో పాలించి రన్నచో నది యిప్పుడు చరిత్రకారులకు ధృవపడుటకు వీలు లేకున్నను కేవల మవిశ్వసనీయముగాదు. ఇక్ష్వాకు వంశములో కల్మాషపాదుఁ డను రాజొకఁడు పురాణములయందు వర్ణింపఁబడె

---

కొనిన "వల్లభ, వల్లవ, పల్లవ, వల్లవన్" శబ్దము లీయర్థముననే యేర్పడి నట్లు నా మతము. కొందరనినట్లు వల్లవ శబ్దమునకు వంటలవాఁ డనియో లేక గొల్లయనియో యుద్దేశించి వాడియుండ రని తోచును.

"కిల్లి" శబ్దమునకు త్రవ్వువాఁ డను నర్థము గలదు. భూమిని త్రవ్వువాఁడు కిల్లీ యనవచ్చును. అనగా సేద్యము చేయువా రను గుర్తుక్రింద వాడియుందురు. శిబి వంశజులని చెప్పుకొనువా రగుట సెంబియన్ పదము గూడ వ్యవహరించి నట్లు చరిత్రకారుల మతము.

• మహాభాగవతము జూడుఁడు.

యున్నాఁడు. ఆ యర్థము గల పేరిటనే తర్వాత కరికాలుఁ డను పేరు గూడ తద్వంశమున యేర్పడి వాడుకలోనికి వచ్చి యుండవచ్చును. ఈ యిక్ష్వాకు వంశము వా రయోధ్యలో నుండి భరతఖండ మంతటిని పాలించుటయే గాక ఖండాంతరము లందుఁ గూడ నొక కాలమునఁ బాలించుచు వచ్చి న ట్లిటీవల కొన్ని గుర్తులు దొరకినవి.

## —♦ ఇక్ష్వాకువంశవ్యాప్తి వివరము ♦—

మెసపొటేమియా యందు చేయఁబడిన భూగర్భ పరిశోధనలో నారితేరిన పండితు లొక ప్రళయము క్రిందటి భూమిని శోధించి యచట దొరకిన వస్తుసముదాయమును బట్టియు, నా దేశమునఁ గల సుమేరు రాజ వంశావళినిఁ బట్టియు, మన దేశమున సింధుప్రాంతమున జరిగిన భూగర్భ పరిశోధనయందు దొరకిన వస్తు సముదాయమును బట్టియు, యిక్ష్వాకు వంశీకులు మన దేశమునుండి వెడలి యూప్రాంతమును పాలించుచు వచ్చి రనియు, సుమేరు రాజ వంశావళిలో వరుసగా పేర్లన్నియు మన పురాణములలోని సూర్యవంశ రాజుల పేర్ల పోలికలుగానే యున్న వనియు, నందుచే సుమేరురాజ వంశ చరిత్రయు, యిక్ష్వాకు వంశచరిత్రయు నొకటే యనియు, నా దేశమున సూర్యవంశము నందలి నిమిచక్రవర్తిపేరిట నిమిూబాదు మున్నగు పట్టణములు, మున్నగునవి యిప్పటికిని కలవనియు, నచట నిమిచక్రవర్తి పాలించి యుండుననియు, మన దేశమున శవదహన మాచారముగా నున్నను, నిమి చక్రవర్తి చనిపోయి నప్పుడు పాతిపెట్టఁ బడినట్లు పురాణముల యందు చెప్పఁబడి యున్న యాచార మా దేశము వారిదే యనియు, నా దేశముననే నిమి చక్రవర్తి చనిపోయి యుండు ననియు నిర్ణయించియున్నారు. (భారతి. ప్రమాది ఆశ్వయుజ సంచిక, సంపు. 16. సం॥ 10 చూడుఁడు) దీనిలో ననేక యిక్ష్వాకు వంశీకుల యొక్కయు ప్రళయకాలము యొక్కయు, చంద్రవంశోత్పత్తి భారత యుద్ధకాలముల యొక్కయు, నింకను మరికొన్ని ముఖ్య కాలముల

రొయొక్కయు నిర్ణయముల గావించి యున్నారు. ఇట్టి విశాల రాజ్యపాలకులగు నైక్ష్వాకులు ద్రావిడ దేశమును గూడ పాలించు చుండి రనుటలో ప్రాచీన తమిళ గ్రంథములు యథార్థముచే తెలుపు చున్నవని తలంపవలెనే గాని వానిని మిథ్యావాచకములుగాఁ ద్రోసి వేయరాదు.

అందుచే కాంచీపుర చోడ రాజులకు మూల పురుషుఁడగు కరికాలుఁడును, తత్పూర్వీకులును, ఆ గ్రంథములలోను తర్వాత *కన్పడు శాసనములలోను ఉన్నట్లు సూర్యవంశము లోని యైక్ష్వాకులే యనియు విశ్వసింప వలయును. తర్వాత యేర్పడిన పిళ్లయారులు మున్నగు వారినిఁబట్టి సూర్య వంశీయులగు యైక్ష్వాకు లందఱు గాని లేక కరికాల వంశీకులుగాని పిళ్లయారులు మాత్రమే యని తలంప రాదు. అనేక శతాబ్దములలో వృద్ధిఁ బొందిన యిక్ష్వాకులా యా దేశ ములనుబట్టియు, భాషలనుబట్టియు, మతములనుబట్టియు, వృత్తులను బట్టియు ననేక జాతులుగాఁ గూడ నేర్పడి యుండుట సాధ్యమే. ఇక్ష్వాకులు వైశ్యులలోఁ జేరినట్లు పురాణములు వచించుటయే గాక నేఁటికిని వైశ్యులలో యిక్ష్వాకుకుల గోత్రీకు లున్నారు. ఇట్లే యితర జాతులలో నుండి యుందురు. అంత మాత్రముచేత నాజాతుల మూల పురుషులకు న్యూనత నాపాదింపఁ బూనుట చరిత్ర కారులకు

---

* దీని ప్రకారం ప్రళయము క్రీ. పూ. 3475 సం॥ల క్రింద ననియు,

| | | | |
|---|---|---|---|
| ఇక్ష్వాకు | క్రీ. పూ. | 3403-3353 | మధ్య వాడనియు. సువర్ణులతో కలిసి యితఁడు 3353 లో మెసపొటేమియాఁ జేరెననియు, |
| నిమి చక్రవర్తి | ,, | 3303-3252 | మధ్య పాలించెననియు, |
| సగర చక్రవర్తి | ,, | 2730-2667 | ,, |
| శ్రీరాముఁడు | ,, | 2117-2096 | ,, |
| ఈజిప్టు నాగరికతప్రారంభం | ,, | 2712 | ,, |
| చంద్రవంశోత్పత్తి | ,, | 2530-2513 | మధ్య ననియు |
| రామరావణ యుద్ధము | ,, | 2103 | లో ననియు. |
| మహాభారత యుద్ధము | ,, | 1425 | ,, నిర్ణయింపఁబడినది. |

తగనిది. ఈ సూర్యవంశీకులు వేదకాలమునాఁటి యూర్యాఙ్గ్రథ సమ్మేళనమున నేర్పడిన వారనియు వివిధదేశ వాస్తవ్య భేదముచే మూలాంధ్రభాషను మఱచి,దక్షిణమున కేగిన వారచటి భాషలలో తమ భాషను మేళగింపఁగా నదియే నేటి తమిళ భాషకు మూలమగు ప్రాచీన తమిళమయ్యెననియు, పంచద్రావిడభాష లన్నియు మూలాంధ్రభాషనుండియే యేర్పడియుండు ననియు నిచట గ్రహింపదగియున్నది.. దీనికి మహేంజొదారో (సింధు)లో దొరకిన లిపియే ప్రమాణముగ నున్నది.

ఆంధ్రదేశమున క్షత్రియు లను పేరు (లేక) సూర్య చంద్ర వంశముల పేరును విన్నంత మాత్రముననే యులికి పడి దానిని నేటి గోదావరీతీరస్థ రాజులకు (వీరు నిజముగ దుర్జ యాన్వయులు మాత్రమే) మాత్రమే అన్వయించు పండితులున్నారు. వీరి కెన్ని యుదాహరణములు చూపినను, సూర్యచంద్ర రాజులు క్షత్రియేతరులుగా కాలక్రమమున కొందఱు మార్పునొందిరనట్లు విశ్వసించరు. వీరిది కూపస్థ మండూక న్యాయముగ నున్నది. ఇట్టి వారికి సూర్య వంశీకులగు చోళరాజులును, వారిలోఁ గలిసిపోయిన చాళుక్యరాజులును దక్షిణదేశమున పిళ్ళయారులుగను, ఆళ్వారులుగను, ఒడయారులుగను, ఆంధ్రదేశమున కమ్మవారుగను, రాచవారుగను యింక కొన్ని తెగలవారుగను యేర్పడిరని చక్కఁగా విశ్వసించి తొల్లిటి తమ అభిప్రాయములను మార్చుకొనెదరని తలంచియే యీ విషయమిచట నింతగా విపులీకరించితిని. నేపాలు, కేరళదేశ ప్రభువులు గూడ సూర్యవంశీకులే యైనట్లు వారి ప్రాచీన చరిత్రల

---

మనుస్మృతిలో ద్రవిడులు, చోళులను తెగలు వేరుగా నున్నట్లు 10 వ అధ్యాయము లోని యీక్రింది శ్లోకమునఁ గలదు. దీనిని బట్టి చోళులు మొదట యుత్తరముననుండి దక్షిణమున కేగినట్లు గ్రహింపవలసి యుండును.

"పౌండ్ర కాశ్చోళ ద్రవిడాః కాంభోజా యవనా శ్శకాః
పారదః పల్లవ శ్చీనాః కిరాతాః దరదాః ఖశాః॥"

వల్ల స్పష్టపడుచున్నది. కాని యావిషయ మిచ్చట గ్రంథ విస్తర భీతి నుదాహరించుటలేదు.

## —♦ ముదిగొండ చాళుక్య రాజులు ♦—

ఇంతవరకు చోళ, చాళుక్యరాజుల ప్రధాన శాఖల వారి వృత్తాంతమును మాత్రమే తెలుసుకొంటిమి. వీరినుండి యేర్పడిన యితర శాఖలవారి చరిత్రను గనునింతము.

చాళుక్యరాజులలో ముదిగొండ చాళుక్యు లను తెగ యొకటి కలదు. వీరికి మూలపురుషుఁడు కొక్కిరాజు. ఇతఁడు తూర్పుచాళుక్యులలోని కొక్కిలిరాజై యుండునని చరిత్రకారులు విశ్వసించినట్లు మొదటిభాగమునఁ జెప్పితిమి.

ఈ కొక్కిరాజునకు కుసుమాయుధుఁ డను నతఁడు జన్మించె ననియు, నతనికి విజయాదిత్యుఁడును, ఆ విజయాదిత్యునకు రెండవ కుసుమాయుధుఁడును, ఆతనికి రెండవ విజయాదిత్యుఁడును, అతనికి మూఁడవ కుసుమాయుధుఁడును, ఆతనికి నిజ్జరాజు, మల్పడురాజు, లోభచరక యను ముప్వురు తనయులును గల్గినట్లును, అందు నిజ్జరాజునకు అచ్చిదేవి యను సతీమణివలన నాల్గవ కుసుమాయుధుఁడు జనించినట్లును అతఁడు వ్రాయించిన యొక తామ్రశాసనమువల్ల దెలియు చున్నది. (I. A. 1903)

నాల్గవ కుసుమాయుధునకు పేరకాంబ యను సతీమణివలన గొండియ, మల్లన యను వీరు లుద్భవిల్లి, మిక్కిలి శూరాగ్రేసరులై వేంగీదేశము నేలు దానార్ణవునికి యుద్ధములలో సాయపడి యాయనచే పొత్తపినాఁడు (300 గ్రామములకు) సీమ పాలనమును బొందుటయే గాక, పంచమహాశబ్దాది సామంత నృప చిహ్నములను సంపాదించు కొనినట్లు కండ్యం తామ్రశాసనము తెలుపుచున్నది. తత్పూర్వము వీరు ముదిగొండ ప్రాంతమున స్వల్పభాగమును మాత్రమే పాలించి యుండవచ్చును. పొత్తపినాటి సీమ పాలన మీ గొండియ, మల్లనలకు క్రీ. శ. 970వ సం॥లో దానార్ణవుని పట్టాభిషేక కాలమున

నోసంగబడుటచే, నాతడు రాజ్యాధిపతియగుటకు జరిగిన యుద్ధము లలో సాయపడినందుల కీబడినట్లు ధృవపడుచున్నది. ఈ వంశీకుల తర్వాత విషయము తెలియరాదు. కాని యీ వంశీకులు ముదిగొండ గృహనామము ధరించిరని తలంపవలసి యున్నది.

వేంగీరాజ్యమును దాదాపు క్రీ.శ. 1160వ సం॥ ప్రాంతములో కాకతీయ రాజు లాక్రమింపగా నీ చాళుక్య రాజులు కొందఱు క్రమముగా నుత్తరమునకుం బోయి పిఠాపురములోను, ఎలమంచిలి లోను చిన్న చిన్న రాజ్యములు స్థాపించినట్లు కనుపడు చున్నది. అట్లు స్థాపించిన వారిలో బేట విజయాదిత్యుని వంశీకులు పిఠాపుర మునందును, కులోత్తుంగుని కుమారుడగు విజయాదిత్యుని వంశీకులు విశాఖపట్టణము జిల్లాలోని ఎలమంచిలిలోను స్థాపించిరి.

## —♦ పిఠాపుర చాళుక్యరాజులు ♦—

బేట విజయాదిత్యుడు వేంగీ దేశమును క్రీ. శ. 918–25 సం॥ల మధ్య పాలించిన అమ్మరాజు జ్యేష్ఠ కుమారుడనియు, తండ్రి యనంతర మతడు పట్టాభిషిక్తుడై 15 దినములు మాత్రమే పాలింపగా యుద్ధమల్లుని కొడుకగు తాడప రాజీతనిని పదభ్రష్టుని గావించి నట్లును మొదటి భాగమున జదివి యున్నాము.

ఈ బేట విజయాదిత్యుని కొడుకగు సత్యాశ్రయుడు గాంగ వంశజురాలగు గౌరీదేవిని వివాహ మాడెను. ఈతని కుమారుడు విజయాదిత్యుడు సూర్యవంశజయగు (చోడకన్యకా వచ్చును)విజయ దేవిని పరిణయ మయ్యెను. ఈయన ద్వితీయ పుత్రుడగు మల్లప దేవుడు సాగర విషయాధిపతియు హైహయ వంశజుడు నగు బ్రాహ్మణుని కుమార్తె చందలదేవిని వివాహ మాడెను. వీరికి విజయాదిత్యుడు జనించెను.

ఈ విజయాదిత్యుడే రెండవ కులోత్తుంగ చోళుని కాల ములో ననగా శా. శ. 1079 వ సం॥ లో వేంగీదేశములోని

కొంత భాగము నాక్రమించుకొని పిఠాపురములో పట్టాభిషిక్తుడైన ట్లీవంశములోని మల్లపదేవుని పిఠాపుర శాసనము వచించు చున్నది. ఇతడు అరదవాడ రాజపుత్రికను, లక్ష్మీదేవియను మఱియొక భార్యను పెండ్లాడెను.

ఈ విజయాదిత్యుని తర్వాత నాతని కుమారుడగు మల్లవిష్ణు వర్ధనుడు శా. శ. 1124 వ సం॥ లో పిఠాపురములోని కుంతీమాధ వాలయములో పట్టాభిషిక్తుడయ్యెనట. ఇతడు గుడివాడ గ్రామమును దేవునికి దాన మొసంగెను. లక్ష్మీదేవి యను భార్యవలన విజయాదిత్యునికి జనించిన యొక సవతి తమ్ముడీయన కుండెను. ఈ సవతితమ్ముడు శా. శ. 1098 వ సం॥లో చాళుక్యభీమవరము లోని రాజరాజ నారాయణ దేవాలయములో నొకదానము గావించి నట్లొక శాసనము వల్ల దెలియుచున్నది. ఈమహారాజు పిఠాపురము లో 10 సం॥ లు మాత్రమే పాలించెను. ఇంతలో శా. శ. 1150వ సం॥ (క్రీ. శ. 1228) నాటి కీప్రాంతము గూడ కాకతీయ చక్రవర్తి యగు గణపతి దేవునిచే జయింపబడెను. అందుచే నీ వంశ ప్రతిభ తగ్గిపోయెను.

## —♦ ఎలమంచిలి చాళుక్యరాజులు ♦—

### (ఎలమంచివారు, గొల్లవాడవారు)

ఎలమంచిలి, దిమిల ప్రాంతములు చాళుక్యకుబ్జ విష్ణువర్ధనుని కాలము నుండియు చాళుక్య పరిపాలన మందే యున్న దృష్టాంతము లను ప్రథమ భాగమున వివరించితిమి.

ఎలమంచి విశ్వేశ్వరదేవ చక్రవర్తి సర్వసిద్ధి తాలూకా లోని పాంచధార్లలో వ్రాయించిన శాసనము వల్లను, గొల్లవాడ నరసింహభూపతి యచటనే వ్రాయించిన శాసనము వల్లను, ఎల మంచిలి చాళుక్య రాజవంశ చరిత్ర యీ క్రింది విధముగ నిర్ణ యింప నగు చున్నది.

వేంగీ రాజ్యమును పాలించిన కులోత్తుంగ చోడ చక్రవర్తి కుమారులలో విజయాదిత్యుఁ డను నతఁడు గలఁడు. ఆతనికి చందాంబిక యను భార్యవలన మల్లప దేవుఁడను కుమారుఁడు గల్గెను. ఆ మల్లప దేవునకు లక్ష్మాంబ యను సతీమణివలన ఉపేంద్ర దేవుఁడను నతఁడు జనించెను. ఈయనకు 'కరవాల భైరవ, ధరణీవరాహాది' బిరుదములు గలవు. ఈ ఉపేంద్ర దేవుఁడు గంగాంబ యను నామెను పెండ్లాడి యామెవలన రెండవ మల్లప దేవుని గాంచెను. ఆయనకుచోడాంబ యను భార్యవల్ల రెండవ ఉపేంద్రుఁడు జనించెను.

## —♦ ఎలమంచి ఉపేంద్రుఁడు II ♦—

ఈయనయు, నితని తల్లియుఁ గలిసి శా.శ. 1205 సం॥లో సింహాచలములోని నరసింహస్వామి కఖండ దీప దానము గావించిరి. ఈయన తన తల్లిదండ్రుల పేరిట చోడమల్లాగ్రహార మను దానిని గట్టించి ప్రసిద్ధి వహించెను. ఈతనికి మల్లాంబ యను దేవివలన కొప్పక్షితీశుఁ డుదయించెను. ఈ కొప్పక్షితీశ్వరునకు పరగండ భైరవ బిరుదము గలదు.

## —♦ ఎలమంచి కొప్పరాజు, ఉపేంద్రుడు III ♦—

కొప్పరాజు గంగమాంబను పెండ్లాడి మూఁడవ యుపేంద్రుఁడను కుమారుని గాంచెను. ఈ మూఁడవ యుపేంద్రునకు బింబాంబ యను భార్య వలన చెన్నోశదేవుఁడును, ఆతనికి ఎలమంచి మన్మ ఉపేంద్రుఁడును జన్మించి వరుసగా ఎలమంచిలి రాజ్యమును పాలించుచు వచ్చిరి. ఇచట శాసనములలో పరస్పరభేదములు గలవు. బింబాంబకే ఉపేంద్రుఁడు జన్మించెనని విశ్వేశ్వరుని శాసనములోను, బింబాంబకు చెన్నోశేపేంద్రుఁడు జన్మించెనని గొల్లవాడ నరసింహ భూపతి శాసనములోను గలదు. ఇందీ రెండవ శాసనమే సరియైనదిగఁ గన్పడుచున్నది. చెన్నోశేపేంద్రుఁడు లేక చెన్నోశదేవుని భార్యయగు మహాదేవి శాసన మొకటి శా.శ. 1294వ సం॥ నాఁటిది

సింహాచలములో నున్నందునను, అందు తన కుమారుడగు ఉపేంద్ర దేవ చక్రవర్తి యిష్టసిద్ధికై యఖండ దీపదానము గావించి, ఎలమంచిలిలోని జలక్షేత్రము, పుట్టెడు భూమిని దేవుని కొసంగినట్లు గన్పడుటవల్లను యిదియే క్రమమైనదిగ గన్పడుచున్నది.

## —♦ ఎలమంచి విశ్వేశ్వరరాజు ♦—

మన్మఉపేంద్రుడు గొప్ప యజ్ఞముల నొనర్చి ప్రసిద్ధి వహించెను. ఈయనకు లక్ష్మాంబయను యిల్లాలు వలన విశ్వేశ్వరుడు జనించెను. ఈ విశ్వేశ్వరుడు 'ఎలమంచి' గృహనామము ధరించి నట్లాతని శా. శ. 1323వ సం॥ నాటి సింహాచల శాసనమువల్ల దెలియుచున్నది. ఈయనగూడ ధరణీవరాహాది బిరుదుల ధరించెను. ఈ విశ్వేశ్వర దేవ చక్రవర్తి సింహాచలములోని శ్రీనరసింహస్వామికి గరుడారోహణ కంభము చేయించిన ట్లాశాసనమున గలదు. ఇంతే గాక నితడు పాంచధార్లలో ధర్మలింగేశ్వరస్వామి కొక గోపురమును గట్టించుటయేగాక యచట రాయగండ గోపాల దేవళ మొకటి కట్టించినట్లు తెలియుచున్నది. ఈయన కళింగ గాంగరాజునకు సామంతుడుగా నచట పాలించుచు, పూర్వ వంశమును బట్టి పేరునకే చక్రవర్తి బిరుదమును దగిలించుకొన్నట్లు కన్పడుచున్నది. ఈయన కవులను బోషించుచు, దేవ బ్రాహ్మణులకు భూదానము లొనర్చుచు వచ్చెను.

ఈయన యాస్థానములో విన్నకోట పెద్దన యను ప్రసిద్ధ కవీశ్వరుడుండెను. ఈ పెద్దన కావ్యాలంకార చూడామణియను గ్రంథమును రచించి దానిని విశ్వేశ్వరభూపతికి కృతి నొసంగెను.

విశ్వేశ్వరుని భార్యపేరు మన్మరుద్రయంగారు. ఈమెకు పుణ్యమునకై విశ్వేశ్వర దేవరాజు శా. శ. 1299వ సం॥లో సింహాచలములోని నరసింహస్వామి యాలయమున నొక దాన మొనర్చి శాసనము వ్రాయించెను. ఈయన కాలములో చిత్రభాను సంవత్స

రమున సర్వసిద్ధిలో నొక గొప్ప యుద్ధము జరిగి యం దాంధ్రవీరులే జయించిరని చెప్పఁబడినది.

## —♦ ఎలమంచి నాగేంద్ర, ఉపేంద్ర భూపతులు ♦—

చెన్నేశ్వరుని కుమారుఁడగు ఉపేంద్రునికి జనించిన నాగేంద్ర, ఉపేంద్ర, నరసింహ భూపతులను గుఱించి యిఁక చెప్ప వలసియున్నది.

నాగేంద్ర దేవుఁడుగూడ పేరునకు చక్రవర్తి బిరుదమునే ధరించెను. ఈతనికి భవాని దేవమ్మ యను సతీమణి యుండెను. ఈ దంపతులకు కుమార యెఱ్ఱమయంగారను పుత్రుఁ డున్న ట్లాతని శా. శ. 1354 వ సం॥ నాఁటి పాంచధార్ల శాసనమువల్లఁ దెలియు చున్నది. నాగేంద్ర దేవునకు అన్నమ దేవి యను మఱియొక భార్య యుండెను. ఈమె శా.శ. 1339 వ సం॥లో పాంచధార్లలోని ధర్మేశ్వ రస్వామి కఖండదీపదానము గావించి శాసనము లిఖించెను.

## —♦ గొల్లవాడ నరసింహ భూపతి ♦—

ఎలమంచిలి ఉపేంద్రుని కుమారులలో నొకఁ డగు నీ నర సింహ భూపతి గొల్లవాడ గృహనామమును ధరించెను. ఈ గొల్ల వాడ నరసింహభూపతికి వీరాంబిక యను భార్య యుండెను. ఈమె పాంచధార్లలోని ధర్మేశ్వరస్వామికిమహానస గృహ మొకటి కట్టించి యచట శాసన మొకటి లిఖించెను. ఇది శా. శ. 1350 వ సం॥ లో నొనర్పఁబడెను. ఇంతకు పూర్వమే యామె శా.శ. 1344 వ సం॥లో నచటి దేవుని కఖండ దీపదానము గావించెను.

నరసింహ భూపతి శా. శ. 1359 వ సం॥లో మరల నీదేవుని దర్శించి తన తండ్రియగు ఉపేంద్ర చక్రవర్తికిని, తల్లియగు అత్యా కూంబకును ధర్మమునకై కొంత భూదానమిచ్చి శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను. అప్పటి కా ప్రాంతము లాయన పాలన లోనే యుండెను.

## —♦ ఎలమంచి కుమారయెఱ్ఱ భూపతి ♦—

పైన నుడివిన కుమారయెఱ్ఱభూపతి గూడఁ దను వంశపారంపర్యముగు "సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన" బిరుదములు ధరించుచు వచ్చెను. ఈయన భార్యపేరు సింగమాంబ. ఈమెకు జనించిన సింగరాజ మహాపాత్రులు, ఉమామహేశ్వర పాత్రు లనువారు శా. శ. 1416 వ సం॥లో ధర్మలింగేశ్వరస్వామికిఁ గొంత భూదాన మొనర్చి శాసనము వ్రాయించిరి. వీరికిఁ గల 'మహాపాత్ర, పాత్ర' బిరుదములను బట్టియే వీరు గాంగరాజుల సేనానాయకులు లేక మంత్రు లని మనము స్పష్టముగ విశ్వసింపవచ్చును.

తర్వాత నీవంశములో బెహరామహాపాత్ర, శ్రీ సర్వరాజమహాపాత్రుఁడు గానఁబడుచున్నాఁడు. ఈ సర్వరాజ మహాపాత్రులు శా.శ. 1447వ సం॥లో సింహాచలములోని శ్రీనరసింహనాథస్వామి వారికి ఉత్తరాపల్లి యను గ్రామమును ధారవోసి, శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను.

ఈయన తర్వాత నితని కుమారుఁడగు శ్రీ హరినరేంద్ర మహాపాత్రులుంగారు తన తండ్రికిని, తల్లి యగు సర్వాదేవికిని పుణ్యమునకై పాంచధార్లలో ధర్మలింగేశ్వరస్వామి కొక మండపమును గట్టించి శా.శ. 1460వ సం॥లో శాసనము లిఖించి కీర్తిఁ జెందెను.

ఈకాలములోనే చాళుక్య శ్రీధరరాజనరేంద్ర మహాపాత్రులను నొకరు గాన నగుచున్నారు. ఇతఁ డెవరికుమారుఁడో తెలియరాదు. ఇతఁడు శా. శ. 1452 వ సం॥లో పాంచధార్లలోని దేవాలయములో దక్షిణద్వారమున గోపుర నిర్మాణము చేయించి ప్రతిష్ఠించి శాసనమొకటి వ్రాయించి పేరందెను.

## —♦ ఎలమంచి చోడగంగ దేవరాజు ♦—

శా. శ. 1313వ సం॥ ప్రాంతములో శ్రీపహిండిరాజునకు మల్లాంబ యను భార్యయందు జనించిన సర్వలోకాశ్రయ, శ్రీవిష్ణు

వర్ధన బిరుదాంకితుఁ డగు ఎలమంచి చోడగంగదేవరా జొకఁడు కలఁడు. ఈయన శా. శ. 1313 వ సం॥లో సింహాచలములోని శ్రీ నరసింహస్వామికిఁ గొన్ని యలంకారములను జేయించి యిచ్చి శాసనము లిఖించినట్లు కన్పడు చున్నది. ఇదిఁగాక శా. శ. 1310 వ సం॥ లో ఎలమంచి మహారాజునకు లక్కమదేవికి జనించిన అంబికాదేవి యను నామె సింహాచలస్వామికి గొంత భూదానమొనర్చి శాసనము వ్రాయించెను. ఈ ప్రాంతములోనే సర్వలోకాశ్రయ, విష్ణువర్ధన, కళింగమల్ల నల్లురాజు. రాభుత్తురాయుఁడను వీరుఁడొకఁడు గానవచ్చు చున్నాఁడు. ఇతఁ డెవ్వరి కుమారుఁడో తెలియకున్నది. ఈయనకు ధర్మమునకై శా. శ. 1307 సం॥ లో పొట్నూరి చెన్నరాజుజియ్యన సింహాచల నృసింహస్వామి యాలయములో నఖండ దీపదానము గావించి శాసనము లిఖించెను. శా. శ. 1460 వ సం॥ (క్రీ. శ. 1538 వ సం॥) వరకు నీ వంశీకులు ఎలమంచిలిలో సామంతనృపాలురుగా పాలించినట్లు పై యంశములనుబట్టి తెలియుచున్నది. కానితర్వాత చరిత్రలు తెలియ వచ్చుట లేదు. కాని ప్రథమ భాగ చరిత్రలో వ్రాసిన విధముగా క్రీ. శ. 1599 వ సం॥ లో బైరాముకాఁ అమీర్ ముల్కు అను మహమ్మదీయ సేనాని వల్ల చింతపల్లికండివద్దఁ జంపఁబడిన పెద్ద దొరలలో నుండిన సర్వరాజు యీ వంశీకుఁడే యైనచో దప్పక నాతనితోనే ఎలమంచివారి రాజ్యము మహమ్మదీయ పరమైనట్లు భావింప వలసి యుండును. క్రీ.శ. 1599 వ సం॥ నాఁటి సర్వరాజు లోగడ నుదాహరించిన సర్వరాజునకు పౌత్రుఁ డని తలంపవచ్చును. ఈ సర్వరాజు ముకుంద బాహుబలేంద్రుని బలములలోని వాఁడని మహమ్మదీయుఁడు వ్రాయించిన శ్రీకూర్మము నందలి శాసనమువల్ల స్పష్టపడు చున్నది. అప్పటికి కళింగరాజ్యము నందొక పాలకుఁడుగా నీ చాళుక్య సర్వరా జుండి యుండ వచ్చును. ఐన నీవిషయ మింకను భావి పరిశోధకులు దృఢపరుపఁదగి యున్నది. ఈ యలమంచిలి రాజ్యమును

పూర్వపాటి గజపతి రాజులే ధ్వంసము చేసినట్లును, పట్టుకొన్నట్లును వారికిఁ గల బిరుదులవల్ల స్పష్టపడు చున్నది♦. ఈ గజపతుల నుండి యీ రాజ్యము మరల మహమ్మదీయ పరమై యుండును.

ఈ ఎలమంచి గృహ నామస్థులు విశేషించి యిప్పుడు కమ్మ వారిలోనే యుండుటవల్లను, ఎక్కడనో బహు స్వల్ప సంఖ్యాకులు ఆంధ్ర క్షత్రియులలోఁ గూడ నున్నట్లు వినికిడివల్లఁ దెలియు చున్నందునను, ఏ రాంధ్రక్షత్రియులకును, కమ్మ వారికిని పూర్వీకులే యై నట్లు కన్పడు చున్నది.

ఎలమంచిలిలోఁ పాలించిన యీ రాజవంశము మొదటి నుండియు దేవతా భక్తితో నుండి యనేక దాన ధర్మములను గావించుచు ప్రసిద్ధివహించు చుండినట్లు పై చరిత్రవల్ల మనకు విదిత మగు చున్నది.

చాళుక్యరాజ్యము క్రమముగ క్షీణించుచున్న కాలములోఁ కొందఱు ప్రముఖులు కళింగ, గాంగ రాజులకు సామంతులై పోయి రని యిదివరకే తెలిసికొంటిమి. అట్టి వారిలో శా. శ. 1301 వ సం॥ర ప్రాంతీయుఁడును, 'సర్వలోకాశ్రయ చక్రవర్తి, మానవ్యస గోత్ర, శ్రీ విష్ణువర్ధన' బిరుదులు ధరించిన జలేశ్వర మహాపాత్రుఁ డొకఁడు. ఈతడు సింహాచలములోని శ్రీ నరసింహస్వామికి చామె రకుగాను కొంత భూమిని నేరేడుపల్లి గ్రామములో నొసంగెను. ఈ గ్రామము గుంటూరు జిల్లాలోనిదై నది లేక నచట మఱియొక గ్రామ మున్నదియు తెలియ కున్నది. శా. శ. 1304 వ సం॥లో నీయన భార్య యుభయ భూపాలయందు చామెర కొల్పులు ధర్మ మొనర్చి శాసనము లిఖించెను.

---

♦ కవి జీవితములు (గురుజాడ శ్రీరామమూర్తి గారి రచితము) పుటలు 32, 37 చూడుడు. అందు "నెల్లూరు, యెలమంచిలి, కంచి, దేవగిరి, చూర కారులు" అను బిరుదమును "కంచి, చెంచి, యెలమంచిలి, నెల్లూరు, ద్వారకాపురి, విర్ధూమధాములు" అను బిరుదమును గజపతి రాజుల కున్నట్లు చెప్పఁబడినది.

## —♦ చాళుక్య పతనము ♦—

ఈ చాళుక్యరాజులు క్రీ. శ. 1360 వ సం॥ ప్రాంతమునం గొందఱు జల్లపల్లి కోటలో పాలించుచు వచ్చిరి. క్రీ.శ.1150వ సం॥ దాపునుండి దుర్జయాన్వయుల నుండియు వారిబంధువులగు చోడ, చాళుక్యవంశముల నుండియు విడిపోయిన వెలమవారు తాము వెలియై పోయినదాది తమతో వేరువడిన వారితో లోలోన మత్సర గ్రస్తులై యుండిరి. కాని వెలమవారి కసి తీర్చుకొనుటకు తగిన బలము లేకుండెను. వీరు క్రమముగా కాకతీయ రాజుల యొద్దకుం జేరి వారివద్ద గొప్ప పలుకుబడిని సంపాదించి సైన్యాధిపతులై, దుర్గ రక్షకులై క్రీ. శ. 1323 వ సం॥ నాఁటికి వీరప్రతాపరుద్రచక్ర వర్తి కొలువులో నుండిరి. ఆయన రాజ్య మన్యాక్రాంతమైన పిమ్మట వీరి పలుకుబడి వీరికిఁ గల ప్రభుత్వమున వృద్ధి యయ్యెను.

క్రీ. శ. 1360 వ సం॥ లో రేచెర్ల వంశోద్భవుఁడగు సింగమ నాయఁడు రాజ్యాతిక్రమణమునకై చాళుక్యరాజులు పాలించు చుండిన జల్లపల్లి కోటను ముట్టడింపఁగా వారాతనిఁ గ్రుత్రిమమున సంహరించిరి. దానితో మిగత వెలమవారికి శివమెక్కి క్రీ. శ. 1361 వ సం॥ లో (శార్వరి సం॥ కార్తీకమాసము) సింగమనా యని కుమారులగు అనపోతానాయఁడును మాదానాయఁడును కలిసి జల్లపల్లి కోటను పట్టుకొనుటకై 6,000 గుఱ్ఱపుదండుతోను. 700 యేనుఁగులతోను. 20,000 కాల్బలముతోను, (వీరిలో తెలుంగు లుండిరి) దండయాత్ర వచ్చి ఇనుగుర్తివద్ద ఘోరమైన రణ మొన ర్చిరి. ఆ భయంకర యుద్ధమున చాళుక్యరాజుల కోటమి గల్గి వారిలో చాల భాగము హతులై పోయిరి. కమ్మవారుగూడ చాళుక్యులకు సహాయులైరి. తుదకు యెంత పోరినను జల్లపల్లి కోట అనపోతానాయని వశ మయ్యెను. అప్పు డా వీరుఁడు కోట లోను, యుద్ధములోను దొరకిన 101 చాళుక్యరాజులను పట్టుకొని చంపించి వారిరక్తముతో చనిపోయిన తన తండ్రికి తిలోదకము

లిచ్చి "సోమకుల పరశురామ" అను బిరుదమును ధరించెనఁట•. ఎంత సాహసము !!

అప్పటినుండియు నాంధ్రదేశములో చాళుక్యుల మని చెప్పుకొను రాచవారు హెచ్చుగా లేకపోయిరి. కొందఱు దూరదేశములకు పరారియైరి. రాచవారిలోఁ జేరిన చాళుక్యులు చాలభాగము సాతులై పోఁగా, కమ్మనాఁడు, వెలనాఁడులలోని కొలఁదిమంది చాళుక్యులు కమ్మవారుగా చెప్పుకొనినట్లు గన్పడుచున్నది. కొంద ఱన పోతానాయని ధాటికి తాళ లేక, యాయన రాజ్యమునుదాఁటి కళింగ గాంగరాజులవద్దకుఁ బోయి వారి సామంతులైనట్లు నిదర్శనములు గలవు.

ఈ తూర్పు చాళుక్యరాజులలో నొక శాఖవారు ఆరవీటి వంశము వారని ప్రసిద్ధికి వచ్చిరి. వీరు విజయనగర సామ్రాజ్యమున సామంత నృపాలురుగా నుండిరి. ఆరవీటి వంశచరిత్రయందు వీరి వంశ మీచాళుక్యులనుండియే యేర్పడినట్లు వ్రాయఁబడినది. క్రీ.శ. 1524 వ సం॥లో నీ వంశములోని మంగలంపాటి వెంకట్రాజు వ్రాయించిన తామ్ర శాసనము (C. P. No. 6 in N. I) లో నీ వంశక్రమ మిట్లున్నది. 'రాజరాజనరేంద్రునికి 10వ పురుషాంతరము వాఁడు విజ్జలేంద్రుఁడు. ఆతనికి 3వపురుషాంతమున హేమలిరాయడు (మాయపురిరాజు) ఆతనినుండి 4వ వాఁడు తాతపిన్నమరాయ'లని వ్రాయఁబడినది. ఈ తాతపిన్నమరాయలనుండి గల వంశక్రమము ఆరవీటి వంశ చరిత్రలోఁ గలదు. మంగలంపాటి వెంకట్రాజును, ఆరవీటి రాజులును చాళుక్యుల వంశము వార మని పైన నుడివినట్లు చెప్పుకొన్నను వారివలె మానవ్యస, హారీత గోత్రములు ధరింపక, నాత్రేయ గోత్రజుల మని వ్రాసికొనుచూ వచ్చిరి; దీనికి S. I. I. IV. P. 281 లోని శాసనముగూడ ప్రమాణముగ నున్నది. పెదచెరకూరు శాసనము వ్రాయించిన చాళుక్యవంశీకుఁడగు కుముదవర్థ

---

• వెలుగోటివారి వంశావళి చూడుఁడు—

నుఁడు తాను మాండవ్యస గోత్రీకుఁడ నని వ్రాయించెను. /ఇట్లే చాళుక్యులు గోత్రములు మార్చుకొనుచు వచ్చినట్లు ధృవపడు చున్నది.

చాళుక్య వంశీకుఁడుగాఁ జెప్పుకొనిన మంగలంపాటి వెంక ట్రాజు వలెనే నేఁటికిని కమ్మవారిలోఁ గల మంగలంపూడి వారి వంశీకులే యైనట్లు తోఁచుచున్నది.

ఇఁక నీ తూర్పు చాళుక్యరాజులకు ముఖ్యబంధువులును, విశే షించి యీ ఎలమంచి రాజులకు ముఖ్యులు నగు కోనసీమ రాజుల వంశ మొకటి గలదు. ఈ వంశమువారు హైహయ వంశమువారుగా వ్యవహరించిరి.

## —♦ కోనసీమరాజులు - కోన రాజేంద్రచోడుఁడు ♦—

హైహయ వంశజు లగు నీ కోనసీమరాజులకు మూలపురుషుఁడు రాజపతేఁడు. ఈయన ఆత్రేయగోత్రీకుఁడు. ఈయన కులోత్తుంగ చోడరాజునకు సామంతుఁడుగా నుండి మిక్కిలి పరాక్రమశాలిగా పేరొందె కోనసీమరాజ్యమును పాలించుచు వచ్చె నని మొదటిభాగ మునఁ జెప్పఁబడెను. ఈయన సుతులలో చోడరాజు లేక రాజేంద్ర చోడుఁ డను నతఁ డొకఁడు.

రాజపతేని యనంతర మీతఁడే కోనసీమ నేలెను. ఈయనకు మైలారదేవి యను భార్యయు; బేతరాజు, దేవదేవుఁడు, పురాంత కుఁడు, వెన్నమహీపతి. మల్లిదేవుఁ డను కుమాళ్లు నుండిరి♦. రాజప తేనికి తొండిదేవి యను మరియొక భార్యవలన సత్తిరాజు లేక సత్యాశ్రయుఁ డను కుమారుఁడు గూడ నున్నట్లు కన్పడుచున్నది. ఈ తొండిదేవి సూర్యవంశీకురాలు.

♦ భారతి సంపు॥ 15-6 కందికుప్ప శాసనము.

## —• కోన సత్తిరాజు, భీమరాజులు •—

సత్తిరాజు తన యన్నయగు రాజేంద్రచోడుని తర్వాత కోన సీమ కొంతభాగము నేలుచున్నట్లె కన్పడుచున్నది. ఇతనిఁ గుఱించి యొక శాసనములో • నిట్లు గలదు.

"సత్య త్యాగ దయానిధిః ప్రతినిధి ర్దేవో సురాజాంతరో
రప్యర్ధ్వేశ శిఖామణి స్సమరజిద్యః. కోనదేశాధిపః
శ్రీమాన్సత్య మహీపతిః ప్రతిదిన ప్రాప్తోదయః పండితై
ర్నిత్యస్తుత్య సహస్రబాహు గుణసంపన్నః ప్రతాపోన్నతః॥"

ఇతఁడు శా. శ. 1057 వ సం॥లో ద్రాక్షారామ భీమేశ్వర స్వామికి కఖండ దీపదాన మొనర్చుటయేగాక శా. శ. 1072వ సం॥లో తపసుల భోజనార్థమె కొంతభూమి నొసఁగి శాసనముఁలు లిఖించెను.

రాజపతేని కుమాళ్ళలో ముమ్మడి భీమరాజొకఁడు. ఈయన సత్తిరాజుతోఁగలిసి కోనసీమ పాలన మొనర్చినట్లుకన్పడును. ఇతఁడు చాళుక్యరాజగు రాయ భూపాలునికిని చంద్రికాంబకును జనించిన రాజాదేవిని పరిణయ మయ్యెను. ఈ రాజాదేవి శా. శ. 1057 వ సం॥లో శ్రీ భీమేశ్వరస్వామి కఖండ దీపదాన మొనర్చి శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను†.

## —• కోనబేతరాజు •—

కోన రాజేంద్ర చోడుని యనంతరము కోన సీమలోని కొంత భాగ మాతని కుమాళ్ళలో నొకరగు బేతరాజు పాలించి యుండును. ఈయన భార్యపేరు గంగాదేవి. ఈమె వలన నితనికి మన్మచోడరాజను నేకపుత్రుఁడు జనించెను*.

• S. I. I. vol. IV పుట. 359

† S. I. I Vol. IV పుట. 394.

* భారతి- బహుధాన్య సం॥ జ్యేష్ఠ సంచిక, కంధికుప్ప శాసనము.

## —• కోన బేతరాజు వంశము •—

బేతరాజు తర్వాత మన్మచోడ రాజు రాజ్యమునకు వచ్చెను. ఈయనకు చోడమహాదేవి, గంగమాంబ యను నిద్దరు భార్యలు గలరు. అందు చోడమహాదేవికి మన్మబేతరా జనఁబడు రెండవ బేతరాజును, రెండవ మల్లిదేవుఁ డనబడు మన్మమల్లి దేవుఁడును జనించిరి. గంగమాంబకు రెండవ చోడరాజు జనించినట్లు కన్పడు చున్నది•. ఈ వివరము లన్నియు కందికుప్ప శాసనములో గలవు.

## —• కోన సత్తిరాజు వంశము •—

ఇఁక సత్తిరాజు వంశమును తెలుసుకొందము. 'శ్రీ మన్మహామండలేశ్వర' బిరుదము గలిగిన కోన భీమరాజు శాసన మొకటి భీమేశ్వరాలయమునఁ గలదు. ఇది శా. శ. 1075 వ సం॥ నాఁటిది. అందీ భీమరాజు సత్తిరాజు కుమారుఁడ నని వ్రాసికొనెను. ఇతఁడు తనతండ్రి యిచ్చినభూమి గాక, గుద్దవాది నాఁటి క్రుందూటి పొలములో ముప్పది ఖండవుల భూమిని శ్రీ భీమేశ్వరస్వామి తిరువీధి మఠమునకు కళ్యాణోత్సవ కాలములో వచ్చు తపసుల భోజనార్థమై దాన మొసంగి కీర్తిఁ జెందెను. ఇతఁడు పిత్రార్జిత మగు కోనసీమలో కొంత భాగము నేలుచు వచ్చెను. ఇతని భార్య పద్మావతీ దేవి శా. శ. 1053 వ సం॥లో శ్రీభీమేశ్వరస్వామికి హవిర్బల్యార్చనకై ఖుండిపల్లియను గ్రామమును ధారవోసి శాసనము వ్రాయించెను*. ఇతఁడును ముమ్మడి భీముని కుమారుఁ డగు లోక మహీపాలుఁడును కలిసి కోనసీమను పాలించినట్లు కన్పడును.

ఈ భీమరాజువద్ద కామ నాఖ్యుని తనయుఁ డగు కొసనయ్య యనువాఁ డొక దండనాయకుఁడుగా నున్న ట్లాతని శా.శ. 1090 వ సం॥ పు శాసనమువల్లఁ దెలియుచున్నది+.

---

• భారతి. బహుధాన్య సం। జ్యేష్ఠ సంచికలోని వ్యాసము చూడుడు.

* S. I. I. vol. IV పుట 461

+ S. I. I. vol. IV పుట 360

## —♦ కోన మన్మసత్యరాజు, మల్లిదేవరాజులు ♦—

శా. శ. 1117 వ సం॥ ప్రాంతములో పిఠాపురమున కోన సత్తిరాజు మనుమలగు వీరి పాలనము కన్పడుచున్నది. మన్మసత్తిరాజు తండ్రియగు వల్లభరాజు గూడ కొంతకాలము మల్లిదేవునితో కలిసి పాలించుచు వచ్చెను. ఆతఁడు మరణించిన తర్వాత వీ రిద్దఱు కలిసి పాలించుచుండి ఒడ్డియూ రను గ్రామమును దానమిచ్చి శాసనము వ్రాయించి యుండిరి.

కోన మన్మ చోడరాజు కోనసీమలో పాలించిన తర్వాత నాతని జ్యేష్ఠ కుమారుఁడగు మన్మబేతరాజు పాలించి యుండును. కాని యీయన శాసనము లెచటను గన్పడవు. తర్వాత కోనసీమను పాలించినది కోన మన్మమల్లిదేవరాజు.

## —♦ కోన మన్మమల్లిదేవరాజు ♦—

ఈయన శా. శ. 1140 వ సం॥ ప్రాంతములో పాలించిన యొక మహామండలేశ్వరుఁడు. ఇతని తాలూకు కందికుప్ప శాసన మొకటి యిటీవల బయలు పడినది. గుద్దేశ విషయములోని పల్లమకుర్రి యను గ్రామమునుండి కొంతభాగము విడదీసి దానికి కందికుప్ప యను పేరుంచి దానిని శ్రీ చోడేశ్వర దేవుని కితఁడు సర్వకర పరిహారముగా నొసంగెను. ఇంతే కాక యితఁడు భైరవ స్వామికి 5 పుట్లును, స్థానాధిపతులకు 30 పుట్లును భూమి నొసంగెను. ఈ భూములన్నియు దన పిత్రీయమైన వృత్తిగ్రామములనుండి యిచ్చెను. ఈయనకాలములో శ్రీ చోడేశ్వరాలయము విద్యాస్థానముగ నుండెను. ఇట్లే యాకాలమున గొప్ప దేవాలయము లన్నియు విద్యాస్థానములుగ నుండెను. ఈయన దానమిచ్చిన దేవాలయ మితని తండ్రివలననో లేక యితని పూర్వీకులలో మఱి యొక చోడరాజు వలననో కట్టింపఁబడియుండి యాపేరు పెట్టఁబడి యుండును. ఈయన భార్యపేరు ఆకాదేవి. ఈయన శా. శ. 1153వ

సం॥లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరుని కఖండ దీప దానము గావిం చెను †. కోనరాజేంద్రచోడుని కుమారుఁడగు మల్లరాజొకఁడు శా. శ. 1057వ సం॥ ప్రాంతములోఁ గన్పడుచున్నాఁడు. అతని భార్య పేరు గంగాదేవి. ఆమె శా. శ. 1057వ సం॥లో శ్రీ భీమేశ్వరుని కఖండదీపదాన మొనర్చి శాసనము లిఖించెను ʃ. కోన అన్న మల్లయదేవరాజు భార్య శా. శ. 1176వ సం॥ లో ద్రాక్షారామ భీమేశ్వరుని కొక దాన మొనర్చి యొక శాసనము వ్రాయించెను. ఆమె పేరు గల శాసనభాగము శిథిలమైనది*. ఈ అన్నమల్లయరాజు పైన నుడివిన మన్మమల్లిదేవరాజా లేక యితరుఁడా యని తెలుసు కొనుటకు వీలు లేకున్నది.

ఈ కోనవంశములో తర్వాత శకవర్షము 1183 వ ప్రాంత ములో కోన భీమరాజు గానఁబడుచున్నాఁడు. ఇతఁడు రాజపతేని కుమారుఁ డని చెప్పఁబడినది. కాని రాజపతేని కాలమున కితనికిని చాల వ్యత్యాసము గన్పడుచున్నది. ఈతఁడు చాళుక్యరాజగు నిందు శేఖరుని కాతని భార్య ఉదయాంబయందు జనించిన అన్యమాంబను వివాహమాడినట్లామె వ్రాయించిన పాలకొల్లు శాసనమువల్ల దెలియుచున్నది ʃ. ఈయన విషయము లోగడ తెలుపఁబడినది.

ఈ భీమరాజునకు రామనాథదేవుఁడను కుమారుఁ డుండెను. ఈయన శా. శ. 1240వ సం॥ నాఁటి శాసన మొకటి పాలకొల్లులో గన్పడుచున్నది♦. శ్రీ రామేశ్వరస్వామి కాతఁడు కొంతభూమిని దానమొసగి యుండెను. శకవర్షము 1199-1218 ల మధ్య కోన గణ పతిదేవుఁడనునొక రాజు గన్పడు చున్నాఁడు. ఈయన గూడ భీమరాజు

---

† S. I. I. vol IV పుట 461
ʃ S. I. I. Do 360
* S. I. I. Do 425
ʃ S. I. I. vol. V పుట 45
♦ S.I. I. vol. V పుట 48

కుమారుఁడై యున్నాఁడు. ఈయన చాళుక్య రాజగు నిడదప్రోలి మహాదేవచక్రవర్తి కుమార్తె యగు పిన ఉదయ మహాదేవిని వివాహమయ్యెను. శా. శ. 1218వ సం॥ నాఁటి యీమె శాసన మొకటి శ్రీ రా రామేశ్వరాలయమునఁ (పాలకొల్లు) గనఁబడుచున్నది. దానిని బట్టి చూడఁగా నామె దేవునకు పది పుట్ల భూమిని దాన మిచ్చినట్లు తెలియుచున్నది†. ఈమె శా. శ. 1222వ సం॥ లో మరల 3 పుట్ల భూమి నొసంగెను*. ఇంతేగాక యీమె శా. శ. 1228 వ సం॥లో తన తల్లిదండ్రులకు పుణ్యమునకై 3 పుట్ల భూమి నా దేవునకే యొసంగెను‡. తర్వాత నీ వంశములో కోన భీమవల్లభరాజను నతఁడు శా. శ. 1240 వ సం॥ ప్రాంతమున నున్నట్లు కనుబడును. ఈయన కుమారుఁడగు రామనాథదేవుని భూదానశాసన మొకటి శకవర్షములు 1240 సం॥ నాఁటిది శ్రీ రా రామేశ్వరాలయమున నున్నది. ఈతఁడు 2 పుట్ల భూమిని దేవాలయమునఁ గల చలివేంద్ర కొఱకు దానమిచ్చినట్లు దానిని బట్టి తెలియుచున్నది§. చింగరాజు నాగన బోయ యనువాఁడు శా. శ. 1286 వ సం॥ లో కోన భీమవల్లభరాజు ధర్మమునకై దానమిచ్చి యొక శాసనము వ్రాయించెను. ఆ భీమరాజు పైన నుడివిన భీమరాజు ఒకరైనది లేక తాతయు మనుమఁడు నైనది తెలియుట లేదు. నాగనబోయ భీమ వల్లభరాజను మతిని 2 పుట్ల భూమి కొఱకు 12 గద్యాణములు దానమిచ్చెను. కోన భీమవల్లభరాజునకు కోన గణపతిరాజను కుమారుఁ డుండెను. ఈయన రెండవ భార్య పేరు లకుమాంబ. ఈమె తాలూకు శా. శ. ~~1286~~ 1197వ సం॥ శాసన మొకటి శ్రీ రా రామేశ్వరాలయమునఁ గలదు¶.

## — పాంచధార్ల కోన రాజులు —

కోన వంశము వారిలో శా. శ. 1200 వ సం॥ ప్రాంతమున నొక కోనరాజు చోడరా జను నతఁ డుత్తరమునకుఁ బోయి పాంచ

† S. I. I. Vol. V no. 125
* Do no. 127
‡ Do no. 124.
§ S. I. I. Vol. V no. 128
¶ S. I. I. Vol. V, 123

ఘార్ల ప్రాంతమున గాంగరాజుల వద్ద సామంతుఁడుగా పని చేయు చున్నట్లు దృష్టాంతములు లభించుచున్నవి.

పాంచధార్లలో నీవంశము నందలి మూఁడవ చోడరాజు శా. శ. 1325 సం॥ లో వ్రాయించిన దానశాసమును బట్టి* చూడఁగా నీ మొదటికోన చోడరాజునకు 'మాహిష్మతీద్వీప, బిరుదాంకరుద్ర గండ వెండ, మన్నెయకన్యాపాలి, మ్రాగవెంటకారాది' బిరుదము లున్నట్లు తెలియుచున్నది. అందుచే నతఁడు మిక్కిలి ప్రసిద్ధి చెంది యుండె ననుటకు సందియము లేదు. ఈతని భార్య పేరు మల్లాంబ యని యీ శాసనమునందే లిఖింపఁబడెను.

## — కోన ఉపేంద్రుఁడు —

ఆతని కుమారుఁ డగు మొదటి యుపేంద్రుఁడు తర్వాత గాంగ రాజునకు సామంతుఁడుగా నుండెను. ఆతని భార్య పేరు బింబాంబిక ఈయనకు రెండవ చోడరాజు జనించెను.

## — కోన రెండవ చోడరాజు —

రెండవ చోడరాజు భార్య పేరు అత్యమాంబ. ఈయన చాల పరాక్రమశాలి. ఇతని కాలములోనే ఢిల్లీ ప్రభు వగు తురుష్కుఁడు కళింగదేశముపై దండెత్తి వచ్చెను. ఆ యుద్ధములో నీతఁడు తన పరాక్రమమును గన్పరచి తురుష్క ప్రభువు నోడించి తరుముటయే గాక యాతని తాలూకు 22 యేనుఁగులను స్వాధీనము చేసికొని వానిని తన ప్రభు వగు నుత్కళరాజున కొసంగినట్లు గన్పడుచున్నది. ఈ ఢిల్లీ ప్రభువు మహమ్మద్ బిన్ తుగ్లకు సేనాధిపతియై యుండును.

ఇట్టి పరాక్రమ కంఠీరవునకు భీమరా జను కుమారుఁడు జనించెను. భీమరాజు లక్కాంబను పెండ్లాడెను. ఈమెవలన భీమరాజు

* S. I. I. Vol. VI. No. 657.

## —♦ కోన మూఁడవ చోడరాజు ♦—

నకు మూఁడవ చోడరాజు గద్దెను. ఇతఁడు తన పాలనలో మతధర్మ ములను క్రమముగా నాచరించె ననియు, శాస్త్రముల నభివృద్ధి పఱచె ననియు, శత్రువుల జయించె ననియుఁ జెప్పఁబడినది. ఇతఁడు శా. శ. 1325వ సం॥లో పాంచధార్లలోని ధర్మలింగేశ్వరస్వామి దేవాలయము నకు గోపుర మొకటి నిర్మాణ మొనర్చి, యచట కొబ్బరివనము వేయించి శాసనము లిఖించెను. ఈ వంశీకు లందఱును చాళుక్య సంబంధీకులు గనే గన్పడు చున్నారు. వీరి తర్వాత వృత్తాంతము తెలియవచ్చుట లేదు. ఐనను వీరు ఎలమంచిలి రాజుల వలెనే గాంగరాజులకును, గజపతులకును సామంతులుగా నుండి 16వ శతాబ్దములో నాం రాజ్యము తురుష్కుల స్వాధీనమైన పిమ్మట తిరిగి ఆంధ్రదేశములో దక్షిణమునకు వచ్చి నివాసము లేర్పరచుకొన్నట్లు గన్పడుచున్నది.

ఈ కోనగృహ నామస్థులు నేడు కమ్మవారిలోను, వెలమ వారి లోను, కాఁపులలోను గానఁబడుచున్నారు. పైన నుడివిన రాజ వంశ సంతతివారే యిప్పటి కోనవా రని నేను నమ్ముచున్నాను. దుర్జయాన్వయు లగు కమ్మవారును, వీరును గూడ హైహాయ వంశ ములో నుండియే జనించి రన వచ్చును.

## —♦ చాళుక్యులలో మఱికొందఱు ♦—

శా. శ. 1098, 1099 సం॥లలోఁ గొంతభాగమును పాలించు చుండిన మల్లపదేవ చక్రవర్తి యొకఁడు కలఁడు. ఈయన రాజ నారాయణ దేవరకుఁ గొంత భూదాన మొసఁగి యుండెను. శా.శ. 1098వ సం॥లో వ్రాయించిన శాసనములో నితని మూఁడవ రాజ్య సంవత్సర మని వ్రాయఁబడి యున్నది. అందుచేనితఁడా ప్రాంతమున కధికారిగా నుండె నని విశ్వసింప వచ్చును.

తర్వాత శక సం॥ 1145 ప్రాంతములో ఉదచంద్రదేవ చక్రవర్తి యీ ప్రాంతములో పాలించుచున్నట్లు తోఁచుచున్నది.

ఈయన కాలములో రాజనారాయణదేవర గుడి గానియొకటి యూ దేవాలయమున శాసనము వ్రాయించుచూ నీయన పేరుదాహరించి యున్నది.

నిడదవోలు కొల్లిపాక పురపాలకులుగానుండిన పాలకులీ వంశమువారు కొందఱు గలరు. వీరు నిడదవోలు, తోలేరు కొల్లిపాక మున్నగు ప్రాంతముల నధికారములు చెలాయించుచు వచ్చినట్లు గన్పడుచున్నది. ఇట్టివారిలో కొల్లిపాక పురాధిపతియగు మహాదేవరాజొకఁడు. ఈయనకు లక్కాంబిక యను నొక భార్య గలదు. భీమదేవి యను భార్యవలన నీయనకు జనించిన యిందుశేఖర రాజు తోలేటి ప్రాంతమున వసించుచు తోలేటి గృహనామము ధరించినట్లు కనుబడుచున్నది.

ఈ యిందుశేఖరుని భార్య పేరు ఉదయమహాదేవి. ఈయనకు వీరభద్రరాజను జ్యేష్ఠ సుతుఁడు జనించెను. ఈతఁడే కాకతి రుద్రమదేవి చక్రవర్తినికి భర్తగాఁ బేరొందెను. దుర్జయ, చాళుక్య వంశములకీ సంబంధమే మూలము. ఇందుశేఖరుని శాసనమొకటి శా. శ. 1222 వ సం॥ నాఁటిది శ్రీరామేశ్వరాలయమున పాలకొల్లులోఁ గానవచ్చుచున్నది. ఆశాసనములో నితఁడు తన జీతము క్రింద నియ్యఁబడిన పెనుగొండ గ్రామములోని భూమి 3 పుట్లు దేవుని కొసంగినట్లు కన్పడును. అందుచే నితఁడొక సేనాధిపతి లేక సామంతరాజుగా భావించవచ్చును. ఈయన కుమారుఁడగు వీరభద్రరాజు కొల్లిపాక పురాధిపతిగా నుండెను. ఇందుశేఖరునకు అన్నమాంబ యను కుమారిత యుండెను. ఈమెను కోన రాజపతేని కుమారుఁడగు భీమరాజు వివాహ మాడెనని యామె వ్రాయించిన పాలకొల్లు శాసనమువల్లఁ దెలియుచున్నది.

## — నిడదవోలు మహాదేవ చక్రవర్తి —

ఈ యిందుశేఖరుని కుమారుఁడే కాఁబోలు నిడదప్రోలి మహాదేవ చక్రవర్తి యను నతఁడు. నిరవద్యపుర (నిడదవోలు) మున

కధిపతిగా నుండెను. ఈ మహాదేవ చక్రవర్తియే రుద్రమదేవి పెంపుడు కుమారిత యగు ముమ్మడాంబను పెండ్లాడినవాఁ డని చరిత్రజ్ఞులు గుర్తించిరి. ఈయన నిడదప్రోలి గృహనామమునే ధరించిన ట్లీయన కుమార్తె యగు పిన ఉదయ మహాదేవి వ్రాయించిన పాలకొల్లు శాసనమువల్లఁ దెలియు చున్నది. ముమ్మడాంబవలన నామెకు జనించిన వాఁడే రెండవ ప్రతాపరుద్ర చక్రవర్తి. ఈ మహాదేవ చక్రవర్తికి జనించిన పిన ఉదయ మహాదేవిని కోన గణపతి దేవుని కొసంగి వివాహ మొనర్చి నట్లు లోగడ చదివి యున్నాము.

శా. శ 1238 వ సం॥ ప్రాంతములో కమ్మనాటియం దొక చాళుక్య పాలనము గాన వచ్చుచున్నది. మాండవ్య గోత్రీకుఁడును, చాళుక్యకులస్థుఁడు నైన కుముదవర్ధనుఁ డను రాజు శాసన మొకటి బాపట్లతాలూకా పెద్దచెరుకూరు గ్రామమునగలదు. దానిని బట్టి నాడఁగానతఁడు కనుకుర్తి, యినుగుర్తి, కొండపాటూరు, ఉంద్రాల పాలెం గ్రామములను దానమొసఁగినట్లు కన్పడును. ఈయనగోత్రము భేదించుటకు కారణము తెలియకున్నది.

ఇదిఁగాక శ్రీ కూర్మ ప్రాంతములో నొక చాళుక్య వంశము పాలనఁ జేయుచున్నట్లు కన్పడుచున్నది. శా.శ. 1231 వ సం॥లో శ్రీ కూర్మనాథునికి విశ్వనాథ దేవ జియ్యన యను చాళుక్యరా జొకఁడు నైవేద్యాది యనేక కైంకర్యముల కొఱకు భూదానములను గావించి శాసనము లిఖించెను. ఈయన తండ్రి పేరు పురుషోత్తమ దేవ జియ్యన. ఈ వంశ వివరము లింతకన్నఁ దెలియుట లేదు.

కొప్పేశ్వరము ప్రాంతములోఁ గూడ నొక చాళుక్య కుటుంబ మధికారము సల్పుచు వచ్చినట్లు కన్పడు చున్నది. శా. శ. 1238 వ సం॥లో రాజ నారాయణ చక్రవర్తి యను నతఁడు తాను కొప్పేశ్వరస్వామికి కట్టించిన శనివార మండపమున దేవుని నైవేద్యము నకుఁ గొంత భూమి నొసఁగి శాసనము వ్రాయించెను. ఈయన తన తండ్రి ఉపేంద్ర చక్రవర్తి యని చెప్పుకొనెను. ఈ ఉపేంద్రుని

శాసన మొకటి శా.శ. 1181 వ సం॥ నాటిది శ్రీరా రామేశ్వరాలయమున నున్నది. ఈ ఉపేంద్రునకును ఎలమంచిలిలో పాలించుచు వచ్చిన ఉపేంద్రుఁ డను పేరు గల వానికి నెట్టి సంబంధ మున్నదియు తెలుసుకొనుట కాధారములు లేవు. ఐన నితఁ డచటి మొదటి యుపేంద్ర చక్రవర్తిగాని రెండవ యుపేంద్ర చక్రవర్తిగాని కావచ్చును. శా.శ. 1518వ సం॥ ప్రాంతములో శ్రీసాతోడా బెహరా మహాపాత్రుని కుమారుఁడగు శ్రీ శంకర హరిశ్చంద్ర మహారాజొకఁడు కన్పడుచున్నాఁడు. ఇతని యొక్కయు నితని తండ్రి యొక్కయు బిరుదములను బట్టియే వీరు కళింగరాజ్య సామంతులని గ్రహింప వచ్చును. ఈ హరిశ్చంద్ర మహారాజు పెరుమాండు నగరమును శా. శ. 1518 వ సం॥లో ప్రతిష్ఠఁ జేసిన ట్లొక శాసనమున వ్రాయఁబడి యున్నది. మొదట మొదట చక్రవర్తులుగా పాలించు చుండి తర్వాత శాఖోపశాఖలుగా విజృంభించిన యీ చాళుక్య రాజులు తుద కనేకచోట్ల సామంతులుగా వ్యవహరించి కాలక్రమమున సామాన్య కుటుంబము లై పోయెను. వీరి రాజ్యము కాకతీయుల హస్తగతమయ్యెను.

## —♦ కాకతీయ రాజులు ♦—

చాళుక్యరాజ్యము క్షీణించుచున్న కాలములో దుర్జయకులములోని యొక శాఖ యగు కాకతీయుల ప్రతిభ క్రమముగా నేక శిలానగరమున వృద్ధి గాంచెను. దుర్జయవంశీకులు నేఁటి కమ్మ, వెలమ, క్షత్రియ శాఖలలో చాలమందికి మూలపురుషు లై యుండి 14 వ శతాబ్దము మధ్యవరకును కలిసి యుండినందున యీ వంశీకుల నందఱిని గుఱించి యిచ్చట జెప్ప నావశ్యముగాదు. అనుమకొండ రాజధానిగా కొరవి దేశమును దాదాపు 11 వ శతాబ్ద ప్రారంభమున పాలించినది మొదటి బేతరాజు. ఈ కొరవి దేశ మాంధ్రభూమి లోనిదే.

## —♦ బేతరాజు I ♦—

ఈతఁడు విరియాల యెఱ్ఱనృపాలునికి గామమసానికిజనించి కాకతి చక్రవర్తికిఁ బెంపుగాఁ బోయెనని కూడూరు శాసనములోని (తెలింగానా శాసన సంపుటం, పుట 97)యీక్రింది పద్యము నుడువుచున్నది.

" చం॥ అరుదగు నట్టి యెఱ్ఱ నృపునంగన గామమసాని యాకమే
ల్గర దని బేతభూ విభుని గాకతి వల్లభు చేసి వాని తా
బరగగ జేతబెట్టి ఘను బల్లవరాయుని యీగిజొచ్చి భా
స్కర విభుచక్రవర్తి గని కాకతి నిల్పుట గోటిసేయదే.''

ఈ విరియాలవారు వెలమవారిలో నున్నందునను, కమ్మ వెలమ వారలు పూర్వ మొకేజాతి యగుటను, దుర్జయవంశములోని యీ బేతరాజే తర్వాత వారికి మూలపురుషుఁడగుట వల్లను♦ కాకతీయ రాజులు కమ్మ వెలమ శాఖలలోని వారనుట కెట్టి సంశయ ముండదు. ఇందుఁ గల భాస్కరవిభు చక్రవర్తి యను పదమునకు సూర్యవంశ చక్రవర్తి యని నే నర్థము చేయుచున్నాను. ఈ కూడూరు శాసనము నందే 'కారకకాలుఁడై పడసె' యను నొక పద్యముగలదు. కారకకాలుఁ డనఁగా కరికాలుని వంశీకుఁ డను నర్థమున నిది యుపయోగింపఁ బడి యుండునని తలఁచెదను. కరికాలుని వంశీకులగు వారిని గుఱించియో యిది చెప్పఁబడినను సందర్భము చక్కఁగా బోధపడుట లేదు. ఈ బేతరాజు పాలనను గుఱించి మనకే మాత్రము సంగతులు తెలియుట లేదు. ఇతని పూర్వీకుల జాడ కూడఁ దెలియుట లేదు.

## —♦ ప్రోల రాజు I ♦—

ఇతఁడు బేతరాజు కుమారుఁడు. క్రీ.శ. దాదాపు 1050-80సం॥ల మధ్య ననుమకొండ రాజధానిగా నేలెను. ఇతఁడు కేసరీ తటాకము

---

♦కాకర్త్యగుండన యను వాని శాసన మొకటి గలదు. అతనికిని యీ వంశమునకును సంబంధము గనుపడదు: కాని యాతఁడు సూర్యవంశము లోని (చంద్ర వంశాంతర్గత) రాష్ట్రకూట శాఖీయుఁ డని తోఁచుచున్నది.

నిర్మించినట్లు క్రీ. శ. 1244వ సం॥ నాటి మోటుపల్లి శాసనము వల్ల దెలియుచున్నది. ఈయన జైన మతస్థుఁడనియే చరిత్రకారు లనుచున్నారు. ఈయన సేనాధిపతి యగు రేచెర్ల బమ్మిరెడ్డి కాంచీపుర చోడరాజుపై దాడి వెడలి యా నగరకవాటమును భేదించి యీాయనకు జయము సమకూర్చినట్లు పిల్లలమర్రి, పాలంపేట శాసనముల వల్లఁదెలియుచున్నది. చాళుక్యరాజుల కితఁడు సహాయుఁడై యుండునని చరిత్రజ్ఞు లూహించుచున్నారు. ఈయనకు రెండవ బేతరాజను కుమారుఁడు జనించెను.

## —♦ త్రిభువనమల్ల బేతరాజు II ♦—

ప్రోలరాజు తర్వాత నితఁడు దాదాపు క్రీ. శ. 1080వ సం॥ ప్రాంతములో రాజ్యమునకువచ్చి క్రీ. శ. 1115వ సం॥ వరకు పాలించెను. ఇతడు పశ్చిమ చాళుక్యచక్రవర్తియు త్రిభువన మల్ల బిరుదాంకితుఁడునగు నాఱవవిక్రమాదిత్యునకుసామంతుఁడైయాతనిబిరుదమును తాను గూడ ధరించెను. ఈతని కాలములో జైన మతము తగ్గి శైవమతము వ్యాపించుటచే నితఁడు శైవుఁడైనట్లు తోఁచును. ఈయనకు 'విక్రమచక్రి, చలమర్తిగండ' మున్నగుబిరుదములుగలవు. చోళ, మాళవ రాజుల కితఁడు సింహమువంటి వాఁడని శాసనములలో వ్రాయఁబడియుండుటచే నీతఁడు వారితో యుద్ధము లొనర్చుచు వచ్చె ననియు, నీ యుద్ధములు చాళుక్య చక్రవర్తి పక్షమున జరుగుచు వచ్చె ననియు గ్రహింప వచ్చును. ఇతఁ డనుమకొండలో నొక కోటను వేయించి, శివపుర మను తీర్థమును నిర్మించి తన పేరిట బేతేశ్వరాలయమనుశివాలయమును గట్టించెను. ఇతఁడు తన తండ్రి పేర వరుణప్రతిష్ఠను గావించెను. ఇతని వద్ద వైజన దండనాథుఁ డను సుప్రసిద్ధ మంత్రి శిఖామణి యుండెను. ఆ కాలములో ననుమకొండ రాజ్యము సబ్బిసాయిర మండలమని పేరు జెందెను. ఈయనకు రెండవ ప్రోలరాజను కుమారుఁడు జనించెను.

## — రెండవ ప్రోలరాజు —

ఇతఁడు రెండవ బేతరాజు తర్వాత దాదాపు క్రీ. శ. 1115 సం॥లో రాజ్యమునకు వచ్చి 1158 వరకు నేలినట్లు కన్పడుచున్నది. ఇతఁడు గూడ తండ్రివలెనే యాఱవ విక్రమాదిత్య చాళుక్య చక్రవర్తికి సామంతుఁడుగనే యుండెను. ఈయన వద్ద బేతనప్రగడ మంత్రిగా నుండెను. ఈ బేతనప్రెగడ త్రవ్వించిన చెఱువున కితఁడు క్రీ.శ. 1117 వ సం॥లోఁ గొంతభూమి నొసంగెను. పశ్చిమ చాళుక్య చక్రవర్తియగు త్రైలపదేవు నితఁ డొకసారి బంధించి, మఱల విడచి పుచ్చె నని హనుమకొండ శాసనమునఁ గలదు. అప్పటి నుండియు నీతఁడు స్వతంత్ర ప్రభు వయ్యెను. గోవిందరా జను నతఁ డీతనికి ప్రతిస్పర్ధిగా నుండి కొండపల్లిసీమకు పాలకుఁడుగా నుండఁగా, నితఁడు వానిని జయించి యారాజ్యమును ఉదయుఁ డను చోడరాజున కొసంగెను. ఇదిగాక యాతఁడు మంత్రకూట పట్టణాధిపతియగు గుండరాజుతో యుద్ధమొనర్చి, యాతని నోడించి, తలగొరిగించి, వక్షస్థలమున వరాహముద్రఁ (రాజలాంఛనము) బొడిపించి, చంపె నని వేయిస్తంభాలగుడి శాసనము, పాలంపేట శాసనములవల్లఁ దెలియుచున్నది. ఈయన చాల పరాక్రమశాలి. పట్టిపోం బుచ్చపురాధీశుఁడగు జగద్దేవుఁడొకసారి దండెత్తిరాఁగా వానినిఁగూడ నితఁడు పారఁద్రోలెను. ఈ మహారాజునకు రామేశ్వర దీక్షితుఁడు గురువు. ఇతఁడు కాలాముఖ శైవమతస్థుఁడని మూదిరెడ్డి కుంట శాసనము వల్లఁ దెలియుచున్నది. ఈయన భార్య ముప్పమదేవి. ఈమె వలన నీతని కైదుగురు పుత్రులు గల్గిరి. జ్యేష్ఠుఁడు రుద్రదేవుఁడు. రెండవ వాఁడు మహాదేవుఁడు. తక్కినవారి పేర్లు తెలియకున్నవి. ఈయన వద్ద మల్లెనాయకుఁ డను మహాసామంతుఁడును రేచెర్లవంశజుఁ డగు కామచమూపతియు, గంగాధరమంత్రి యను వారలున్నట్లా కాలపు శాసనముల వల్లఁ దెలిసికొనఁ గలుగు చున్నాము. ఈ మహారాజనేక శివాలయములను గట్టించెను. తుద కితఁడు వెలనాఁటి రెండవ

చోడరాజు వలన నొక యుద్ధములో దహింపఁబడె నని యొక శాస నమువల్లఁ దెలియుచున్నది.

## —♦ రుద్రదేవుఁడు ♦—

ఇతఁడు రెండవప్రోలరాజు కుమాళ్లలో జ్యేష్ఠుఁడు. ఈయననే మొదటి ప్రతాపరుద్రుఁ డని కూడ నందురు. ఇతఁడు దాదాపు క్రీ. శ.1158వ సం॥ మొదలు 1196 వ సం॥వరకు రాజ్యపాలన నొనర్చెను. తండ్రి యప్పగించిన రాజ్యము నితఁ డన్ని విధముల విస్తరించి ప్రతాపశాలి యని పేరందెను. దొమ్మరాజును జయించి యనేక గ్రామములను స్వాధీన మొనర్చుకొనెను. తైలపదేవునిఁ గూడ నితఁడు పరాజితునిఁ జేసెను. ఇతఁడు చోడరాజులకు విరోధిగా నుండెను. వర్ధమానపురాధిపతియగు భీమచోడునితో యుద్ధ మొనర్చి యాతనిని వనములకుఁ బారఁద్రోలెను. ఇతఁడుకందుకూరులో నుదయ చోడుని నగరమును ఆంజనేయుఁడు లంకాపురి దహించినట్లు దహించి యా నగర మధ్యమున నొక తటాకము త్రవ్వించెను. భీమచోడుఁడు దురాత్ముఁ డనియు, సోదరుఁడగు గోకర్ణచోడుని భోజన కాలమునఁ జంపెననియు, సవతితల్లికిఁ బతియయ్యెననియుఁ దెలిసి యాతనిఁ బారద్రోలెనఁట. ఈతఁ డుదయచోడుని కుమార్తె పద్మావతిని పెండ్లా డెను. చోడ, దుర్జయవంశము లొకే తెగ యనుట కీ సంబంధమే నిదర్శనము. ఈయనకు మేడరాజు, మైలగిదేవుఁ డను శత్రువు లుండిరి. ఇతఁడు వెలనాటికి రెండుమార్లు దండెత్తిపోయి, యా దేశ మును జయించెను. ఈయనవద్ద యినగాల బమ్మిరెడ్డి యను మంత్రియు, రేచెర్ల బేతిరెడ్డి, కోటిరెడ్డి, నామిరెడ్డి యను ప్రసిద్ధ సేనాధిపతులు నుండిరి. చెల్లకి గంగాధరుఁ డను మంత్రి గూడ నుండెను.

ఈ మహారాజు పరాక్రమశాలి యగుటయే గాక విద్యాభి మానియు, విద్యావిభూషణుఁడు నై యుండెను. ఇతఁడు సంస్కృత మున నీతిసార మను గ్రంథమును రచించెను. పండితారాధ్యుఁడు, పాల్కురికి సోమనాథుఁడను ప్రసిద్ధ కవు లీతని సమకాలికులు.

ఈయన శైవమతాభిమానియై, యీ మతాభివృద్ధికై పాటు పడెను. ఈయన కాలములో ననేక శైవాలయములు రమ్యముగ కట్టింపఁ బడెను. ఈ మహారాజు అయినవోలులో మైలార దేవాలయమును, ఒద్దిపల్లెలో బుద్ధగణపతియాలయమును, మొగలిచర్లలో శక్త్యాలయమును, హనుమకొండలో చతుర్ముఖేశ్వరాలయమును, సహస్ర స్తంభమంటపము మున్నగునవి గట్టించుటయేగాక, వాని పోషణకై 84 గ్రామములను బ్రాహ్మణుల కొసంగి యుండెను. కాకతీయరాజు లెవ్వరు గాని యిన్ని గ్రామములు దానమొనర్చి నట్లు కనుపడదు. ఓరుగల్లు దుర్గము గోడ ఈ కాలములోనే నిర్మింపఁ బడెను. ఈయన రాజ్యము పూర్వన సముద్రము వరకును, దక్షిణమున శ్రీశైలము వరకును, పడమర కళ్యాణపురము వరకును, ఉత్తరమున మాల్యవంత పర్వతము వరకును వ్యాపించెను. ఏకశిలా నగరాధ్యక్షునిగా నితని వద్ద యిందులూరి పెద మల్లన మంత్రియు, నారికి మంత్రిగా నిందులూరి చిన మల్లన మంత్రియు నుండిరి. ఈమహారాజు శా. శ. 1108 వ సం॥ లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని దర్శించి యఖండ దీపదాన మొనర్చెను. ఈయనకు అన్నమదేవి యను భార్య కూడఁ గలదు. ఈమె రాజరాజ సం॥ 23 లో (శ్రీ) భీమేశ్వరస్వామిని దర్శించి దీపదానము గావించెను.

ఈ మహారాజు చివరకు దేవగిరియాదవ రాజులతో నొనర్చిన యుద్ధములలో మరణించి యుండవచ్చునని చరిత్ర పరిశోధకులు నిర్ధారణచేసిరి. ఈయన తర్వాత తమ్ముఁడగు మహాదేవుఁడు రాజ్యమునకు వచ్చెను.

## —♦ మహదేవరాజు ♦—

రుద్రదేవునకు కుమాళ్లు లేనందునను, అతఁడకస్మాత్తుగ యుద్ధములో మరణించినందునను, అతని తమ్ముఁడగు నీ మహాదేవ రాజు క్రీ. శ. 1196 వ సం॥ లో రాజ్యమునకు వచ్చినట్లు కన్పడుచున్నది. ఈతఁడు 1198 వ సం॥ వరకు మాత్రమే పాలించెను. ఈయన భార్యపేరు బయ్యమాంబ. ఈయనకు గణపతిదేవుఁ డను

కుమారుఁడును, కుందాంబ యను కుమార్తెయు నుండిరి. కుందాంబను నతవాటిసీమ పాలకుఁడగు రుద్రరాజు వివాహ మాడెను. ఈమె కరణముగా నిచ్చిన వేములకొండ యను గ్రామము నీమె బ్రాహ్మణుల కగ్రహారముగా క్రీ. శ. 1220వ సం॥లో ధారవోసి కీర్తిఁ జెందెను. ఈయన తర్వాత కుమారుఁడగు గణపతిదేవుఁడు రాజయ్యెను.

## —♦ గణపతిదేవ చక్రవర్తి ♦—

ఈయన క్రీ. శ. 1198 వ సం॥ లో రాజ్యమునకు వచ్చెను. ఈయన కాలములో నోరుగల్లు రాజ్య మన్ని ప్రక్కల విస్తరించెను. ఇతఁడు కమ్మనాడు, వెలనాడు, కొలనుపురము, కళింగ దేశములలోని రాజులనందరిని జయించి సామంతులుగాఁ జేసికొనెను. గంజాం జిల్లాలోని బొర్కూర వర కీయన రాజ్యము వృద్ధినొందెను. దక్షిణమున కందుకూరుసీమ, ములికినాడు, పొత్తపినాడు, రేనాడు, గండికోట, కాంచీపురము వరకుఁ గల దేశమంతటిని జయించి, యచ్చటి తెలుఁగు చోడులు మున్నగు రాజుల నెల్లరను సామంత మండలేశ్వరులను గావించెను. ఈయన పట్టపురాణి సోమిదేవి.

ఈయన వెలనాటిలో నయ్యవంశము నందలి పిన్నచోడుని కుమార్తెలగు నారాంబ, పేరాంబలనుగూడ వివాహ మాడెను. వీరి సోదరుఁడగు జాయప నాయకుని పరాక్రమమునకు మెచ్చుకొని యాతనిని గజ సైన్యాధిపతిగా నియమించెను. ఈ మహారాజు వద్ద ఇందులూరి సోమయామాత్యుఁడు, పెదగన్నణరా జను వారలు మంత్రులుగను సేనాధిపతులుగ నుండిరి. రేచెర్ల రుద్రిరెడ్డి, బేతిరెడ్డి, మల్లల హేమాద్రిరెడ్డి, కాట చమూపతి, చౌండ సేనాధిపతి యను వారలుకూడ నీయన సేనాధిపతులే. విశ్వేశ్వర శివదేశికులను నాయన నీ మహారాజునకు గురువుగను, ప్రధాన సచివుఁడుగ నుండెను.

వీరందరి సహాయముననే గణపతి దేవుఁ డనేక రాజ్యములను జయింపఁ గల్గెను. వీరిలోఁ గొందఱు చక్రవర్తి యాజ్ఞచే ననేక

దేవాలయములు, తటాకములు నిర్మించుచు వచ్చిరి. కాటచమూపతి శా.శ. 1162వ సం॥లో కొండిపర్తి యను గ్రామములో త్రిమూర్తుల దేవాలయమును కట్టించి దానికి బెల్లముచెఱు వను గ్రామమును దాన మిచ్చెను. చౌండ సేనాపతి యచట నొక తటాకము నిర్మించి చౌండేశ్వరాలయముకట్టించి దాని కనపర్తి యను గ్రామ మిచ్చెను. కాయస్థ వంశజుఁ డగు గంగయసాహిణి యను నతనికి చక్రవర్తి బాహత్తరి నియోగాధిపత్యము (డెబ్బదిరెండు విధములగు రాజాశ్రితులపై యధికారము) నొసంగెను. ఈతఁడు చక్రవర్తి ప్రతినిధిగా పానుగల్లు ప్రాంతమునఁ బాలించుచు, కడప, కండనోలు, అనంతపురం, బళ్ళారి, నెల్లూరు, గుంటూరు మండలములపైఁ గూడ సర్వాధి కారిగా నుండెను.

సామంత భోజుఁడను సేనాధిపతియు, గంగయ సాహిణియుఁ గలిసి యనేక దేవాలయములకు గ్రామములను, బ్రాహ్మణుల కగ్ర హారములు నొసంగిరి. మైదకూరను గ్రామము బ్రాహ్మణులకును, పూలచెఱువు, బోయపల్లి, రెడ్డపల్లి గ్రామ భూములను త్రిపురాంతకములోని దేవళమునకును ఒసంగిరి. కాంచీపురములోని యేకామ్రనాథస్వామికి కాలత్తూరను గ్రామమును సామంతభోజుఁ డొసంగెను. సామంతభోజుఁ డచట ప్రతినిధిగాఁ బాలించుచు వచ్చెను.

ఈ మహారాజు జైన, బౌద్ధ మతస్థులను హింసించె ననియు, జైనులుగా నుండిన కమసాలుల నుండి గ్రామ కరణీకములు తొలఁగించి నియోగ బ్రాహ్మణుల కొసంగినట్లు ప్రవాదము కలదు. కాని అరవలనుండి తొలఁగించి నట్లు కొండవీడు కవిలలో నున్నది. శైవ బ్రాహ్మణుల ప్రోత్సాహమున నితఁడు ముప్పైయాఱు జైన గ్రామముల నాశన మొనర్చెనఁట. చెన్నాప్రగడ గణపామాత్యుఁ డను నాతఁ డీమంత్రులలో నొకఁడు. ఏకశిలానగరమునకు దుర్జయ వంశీకుఁ డగు మేచయ నాయకుఁ డను ప్రసిద్ధ పురుషు నితఁడు నగర పాలకుఁడు గను, తలవరిగను నియమించెను.

ఈ చక్రవర్తి కాలములో నాంధ్రరాజ్య మంతయు నేకచ్ఛత్రాధిపత్యముక్రిందకు వచ్చెను. అట్లు చేయుటకై యీయన యనేక దిగ్విజయ యాత్రలు సల్పి తుదకు జయము బొందెను.

ఈయన కాలములో మోటుపల్లి, రేవుపట్టణముగా నుండి విదేశ వ్యాపార మచట వృద్ధిగా నుండెను. అచటి వర్తకుల కనేక సుంకములఁ దగ్గించి యీమహారాజు వ్యాపారమును ప్రోత్సహించెను.

చక్రవర్తి రాజమహేంద్రవరమున తన తండ్రిపేరిట మహాదేవేశ్వరాలయమును కట్టించి దాని యంగ, రంగ భోగములకై కొంతభూమిని, కొన్ని సుంకములను ఒసంగెను.

కమ్మనాటిలోని తేమెర్త యను గ్రామమునకు గణపాపురమని పేరుఁబెట్టి దాని నాత్రేయగోత్రజుఁడును, పులకంటి కుప్పనార్యునికి పౌత్రుడును, కుమారస్వామి భట్టపుత్రుఁడును, నారాయణభట్ట వాజపేయాజుల కగ్రహారముగా నొసంగి శాసనము లిఖించెను. ఈయన తన గురువగు విశ్వేశ్వరశివునకు మందర మను గ్రామము దానముగా నీయఁగా నాతఁ డచట నొక మఠమును, విశ్వేశ్వరాలయమును, సత్రము నొకదానినిఁ గట్టించి యందు విద్యార్థులకు, శివయోగులు మున్నగు నాగంతుకుల కుచిత భోజనాది సౌకర్యములను గావించెను.

ఈ మహారాజువద్ద వల్లుట్ల గోత్రికుఁడగు ప్రోలరాజను నతఁడు తంత్రపాలుఁడుగా నుండెను. ఓపిలిసిద్ధి యను పొత్తపిచోడరాజును, కన్నర దేవచోడుఁడును యీతనికి సామంతులైరి. ఇంక నీయనవద్ద భాస్కరమంత్రి, పివిరిఅన్నయ, గోవిందనాయకుఁడు, దామనామాత్యుఁడు, బయ్యననాయకుఁడు, జగదాలముమ్మడి, మల్లిదేవుఁడు, సిద్ధదేవుఁడు, నూవులమంచిరాజు, దేవరాజు మున్నగువారు సేనాధిపతులుగను, మంత్రులుగను ఉండిరి.

ఈ మహారాజునకు రుద్రమదేవి, గణపాంబయను కుమార్తెలు గల్గిరి. ఈయనకు పుత్రసంతానము లేనందున జ్యేష్ఠకుమార్తెయగు

రుద్రమదేవినే తన యనంతరము రాజ్యమునకు వచ్చునట్లు చేసెను. ఈమె పట్టపుదేవి కొమారిత. రెండవ కుమార్తె యగు గణపాంబను ధరణికోట రాజగు కోట బేతరాజున కిచ్చి వివాహ మొనర్చెను. ఈమె దాదాపు క్రీ. శ. 1261 వ సం॥ వరకును రాజ్య మేలెను.

## —• రుద్రమదేవి చక్రవర్తిని •—

ఈమె యోరుగల్లు రాజ్యమును క్రీ. శ. 1261 నుండి దాదాపు క్రీ. శ. 1295 వ సం॥ వరకును పాలించెను. ఈమె చాళుక్యరాజును వెడదవోలు పాలకుడు నగు వీరభద్ర నృపాలుని పెండ్లాడెను. ఈ విషయము ముత్తిగ గ్రామములోని విష్ణు వను నాతడు వ్రాయించిన శాసనమువల్ల దెలియుచున్నది. ఈమె రుద్రదేవుడను పురుష నామములోనే రాజ్యపాలన మొనర్చెను. ఆడుది రాజ్యమేలుచున్న దని నుల్కనగా నితర రాజులు దండెత్తి రాకుండుటకై యీ తంత్రము యీమె పితండ్రి కాలములోనే యేర్పడెను. ఈమె యొక పిల్లను దెచ్చి వివాహతంతుగూడ నడపిరట. ఈ పిల్లపేరు ముమ్మడంబ. రాజ్యము స్థిరపడిన పిమ్మట నీ ముమ్మడంబను తన పెంపుడు కుమార్తెగా భావించి యీమె తనమరది యగు చాళుక్యమహాదేవ రాజున కిచ్చి వివాహము గావించి నట్లు కన్పడుచున్నది.

ఈమె తన రాజ్యమును చక్కగా పాలించెను. ఈమె కాలములో సామంతు లనేకులు స్వతంత్రించుటకై విజృంభింపగా వారి నందఱిని తన సేనాధిపతులగు అన్నయదేవుడు, రుద్రదేవుడు, గుండదండాధి నాథుడు, ప్రసాదాదిత్యనాయుడు, దామానాయుడు మున్నగు వారల వలన నణగద్రొక్కి తన రాజ్యమును సింహాచలమువరకు వ్యాపించునట్లొనర్చెను. దేవగిరిలో పాలించుచుండిన యాదవరా జగు మహాదేవుడు 3 లక్షల సైన్యముతో నోరుగల్లు పైకి దండెత్తి వచ్చినపుడీ మహారాణి యాతని పారద్రోలుటయే గాక యాతడు కోటిద్రవ్యము లపరాధముగా సమర్పించు కొనునట్లు చేసెను. ఈమె తనకోట ననేకవిధముల వృద్ధిజేసి, కంపకోట, మట్టి

కోట, జాతికోట, యిటుక కోట లను ప్రాకారముల నేర్పఱచి శతృరాజులకు దుర్భేద్యమగున ట్లొనర్చెను.

క్రీ. శ. 1291 వ సం॥ ప్రాపులో వెనీసు వాస్తవ్యుఁ డగు మార్కొపోలో యను నాతఁడు మన దేశమునకు వచ్చి చూచి యీమె రాజ్యౌన్నత్యము నెంతయో కొనియాడియుండెను.

ఈమె పానుగల్లు ప్రాంతములకు జన్నిగదేవసాహిణి యను వానిని; కమ్మనాడు, ములికినాఁడు, పొత్తపినాడు, గండికోట ప్రాంతములకు త్రిపురాంతదేవుఁ డను వానిని అంబయదేవునిని; వర్ధమానపుర ప్రాంతములకు గోన గన్నారెడ్డి సాహిణిని, తన ప్రతినిధి పాలకులుగా నియమించెను.

ఈ సేనాధిపతులు చక్రవర్తిని యాజ్ఞ ప్రకార మనేక ధర్మకార్యము లొనర్చుచు యామెకు కీర్తి గల్గఁజేయు చుండిరి. ఊటుకూరు గ్రామములో నొక చెఱువు, అత్తిరేల గ్రామములో సత్రనిర్మాణము, దేవాలయమునకు మాన్యములు, కారెముపూడి దేవాలయమునకు గోపుర ప్రాకారాదులు, పురందలూరు గ్రామము బ్రాహ్మణాగ్రహార మొనర్చుట, వర్ధమానపుర, బూదపూరు గ్రామములలో తటాకములు, శైవాలయములు మున్నగునవి యీమె పాలన కాలములో సేనాధిపతుల వల్ల నెఱవేర్పఁబడెను.

ఈమెవద్ద మల్యాలగుండ దండనాథుఁడు యీమెకు దక్షిణ భుజముగా నుండి రాజ్యమును రక్షించెను. ఇందులూరి పెద గన్నయామాత్యుని పుత్రుఁడగు అన్నయదేవుఁ డను బ్రాహ్మణ సేనాధిపతికూడ నట్టివాఁడే. ఇంతేగాక వెలమ వీరులు 77 మందికి నాయంకరము లిచ్చి నాయకులుగా నేర్పరచెనఁట.

ఈమెకు రుయ్యాంబ యను నొకపుత్రి జనించెను. ఈమెను ఇందులూరి అన్నయ దేవుఁ డను బ్రాహ్మణ సేనాధిపతి కొసంగి వివాహ మొనర్చెను. మల్యాలగుండయ దండనాథుఁడు సంకిసపురాధిపతిగాఁ బేరొందెను. ఇతఁ డనేక చెర్వుల త్రవ్వించి, బ్రాహ్మ

ములకనేక మాన్యములనొసంగి పోషించెను. ఈమెవద్ద సంరక్షకులుగా మర్జయ కులస్థులును, వలవర్ట్ల గోత్రీకులు నగు ఎక్కినాయుఁడు, రుద్రినాయుడు, పినరుద్రినాయుఁడు, పోతినాయుఁడు, వల్లయనాయుఁడు నను వారు ప్రఖ్యాతులై యుండిరి.

ఈ మహారాణి 34 సం॥లు రాజ్య మవిచ్ఛిన్నముగ నేలి తన దౌహిత్రుఁడును, పెంపుడు కుమారుఁడును, చాళుక్యమహాదేవ చక్రవర్తి కుమారుఁడు నగు శ్రీ-వీరప్రతాపరుద్ర దేవునకు రాజ్య మప్పగించి పరలోక గతురాలయ్యెను.

ఈమె · వంశీకులే మందపాటివా రనుటకు దృష్టాంతము లున్నవి. ఈమె పుత్రికయే బ్రాహ్మణ వంశములోఁ జేరిపోయినట్లు పైచరిత్ర వల్ల స్పష్టము గదా. ఇట్లే యీ కాలములో నీ వంశము నుండియు కమ్మవా రేర్పడి రనుటలో నాశ్చర్యము లేదు*. ఆ కాలములో వర్ణవివక్షత యంతగా లే దనవలెను.

ఈ మహారాణి విశ్వేశ్వరశివగురువునకు వెలగపూడి యను గ్రామము దాన మొసఁగఁగా నాతఁ డదివరకు నిర్మించిన సత్రములు మున్నెన్నవిగాక ప్రసూత్యారోగ్యశాల మొదలగునవి స్థాపించి కీర్తి శాలి యయ్యెను. అన్నసత్రములో నన్నిజాతులవారి కన్నదానము జరుగునట్లొనర్చెను. ఈ వెలగపూడిగ్రామము, పూర్వము గణపతిదేవచక్రవర్తి యొసఁగిన మందర గ్రామమును కలిసి 270 పుట్ల భూమి యిట్లు ధర్మార్థమై వినియోగింపఁ బడుచుండెను.

## —• వీరప్రతాపరుద్రదేవ చక్రవర్తి •—

ఈయననే రెండవ ప్రతాపరుద్రుఁ డందురు. ఓరుగల్లు రాజ్యమును పాలించిన కాకతీయరాజుల కితఁడు చివరివాఁడు. ఈయన చాళుక్యరాజగు నిడదప్రోలి మహాదేవచక్రవర్తి కుమారుఁ డగుటచే చాళుక్యుఁ డయ్యెను రుద్రమదేవిచక్రవర్తిని పెంపుడు కుమారుఁడని చూచినను గూడ చాళుక్యవంశజుఁ డయ్యెను, కాకతీయ రాజ్యము సంక్రమించుట కారణముగా కాకతీయులలోఁ గలపి

* మందపాటివారు కమ్మవారిలో గూడ నున్నారు.

చెప్పుచున్నాము. ఈయనవంశీకులని చెప్పఁదగిన నిడదవోలు గృహనామస్థులు కమ్మవారిలోను, ఆంధ్రక్షత్రియులలోను నేఁటికినిగలరు.

ఈయన యెంత పరాక్రమశాలియో, యెంత ధర్మపరుఁడో యంత దురదృష్టవంతుఁడుగఁ గన్పట్టెడిని. ఈయన కాలములోమహమ్మదీయులు తండోపతండములుగా వచ్చి యీతని రాజ్యాతిక్రమణాకై యనేకమార్గ ప్రయత్నించి తుదకు సఫలీకృత మనోరథులైరి.

ఈయనవద్ద తొమ్మిదిలక్షల సైన్యముండెను. దీని కనేకసేనాధిపతు లుండిరి. వెలమవారు డెబ్బదియేడు గోత్రములవారు బురుజున కొక్కరు చొప్పున కోట సంరక్షకులుగా నుండుచు వచ్చిరి. ఈ మహారాజువద్ద యోరుగల్లు నగరు మంత్రిగా సాగి గన్నమ నాయఁడును, గజ సైన్యాధిపతిగా బెండపూడి అన్నామాత్యుఁడును, అశ్వసైన్యాధిపతిగా సాహిణిమారుఁ డను నతఁడును ఉండిరి. ఇంతే గాక పల్నాటి దేశమున దేవరినాయునింగారును, వెలనాటిలో సోమయ వెంకయ సాహిణింగారును, కమ్మనాటియందు కామయ బొప్పనింగారు, పాకనాటియందు పోతయసాహిణింగారు మున్నగు ప్రసిద్ధుల నితఁడు తనప్రతినిధి పాలకులనుగా నియమించి రాజ్యమును చక్కఁగా పాలించుచు వచ్చెను.

ఈ మహారాజు కాలములో చక్కని తోటలును, వాణిజ్యమును వృద్ధి పొందెను. ఈయన రాజ్య మిప్పటి నైజాము రాజ్యములో పదింట తొమ్మిది భాగములును, ఉత్తరమున సింహాచలము వరకు, దిగువను కందనోలు, బళ్ళారిజిల్లా పశ్చిమ భాగము వరకును వ్యాపించి యుండెను.

ఈ మహారాజు విద్వద్గోష్ఠీ విహారుఁ డని పేరొందెను. ఈయన యాస్థాన కవులలో విద్యానాథ కవి యుండెను. ఈ మహారాజునకు సమకాలికులుగా రుద్రభట్ట త్రిపురాంతకవి, నరసింహకవి, విశ్వనాథుఁడు, అగస్త్యుఁడు, గంగాధరకవి మున్నగు వార లుండి సంస్కృతాంధ్ర గ్రంథముల రచించి యుండిరి.

ఈతఁ డనేక దేవాలయములను గట్టించి నట్లు కన్పడును. ఈతఁడు శైవ మతాభిమాని. జైన మతస్థుల నీతఁ డనాదరణఁ జేయఁగా వా రీతని రాజ్య వినాశనమునకై శాప మిచ్చిరఁట.

ఈ మహారాజు రాజ్యమునకు వచ్చిన తర్వాత నెప్పుడు యుద్ధములు జరుగు చుండెను. అందుచే దేశమున శాంతి నెలకొను టకు వీలుండ దయ్యెను. ములికినాఁడు, గండికోటలు పాలించు చుండిన త్రిపురాంతకాంబ దేవు లీయనను ధిక్కరించి స్వతంత్రు లగుటకు ప్రయత్నింపఁగా వారిపైకిఁ గొంత సైన్యముఁ బంపి వారిని జయించి యచట తన సామ్రాజ్యాధికారమును స్థాపించెను.

క్రీ. శ. 1303 వ సం॥లో మహమ్మదీయ దండ యాత్రలు సాగెను. ఢిల్లీ సామ్రాజ్యము నప్పు డేలు చుండిన అల్లాఉద్దీ నను వాని కీ దేశముపై కన్ను గుట్టెను. ఆతఁడు మాలిక్ కాఫరు అను నొక సేనాధిపతిని 10 వేల గుఱ్ఱపు దళముతోడను, 40 వేల పదా తులతోడను నోరుగల్లు కోట ముట్టడికై మొదటి సారి పంపెను. త్రోవలో నున్న దేవగిరిని జయించి యాతఁ డోరుగల్లు పైకి వచ్చెను. అప్పు డిరుతెగల వారికి ఘోర యుద్ధము జరిగెను.

ఈ యుద్ధములో చక్రవర్తి వద్దనున్న వెలమ, కమ్మ సేన లద్భుత పరాక్రమమును గన్పరచి మహమ్మదీయుల నావలికిఁ బారఁ ద్రోలి జయలక్ష్మిని చేకొనఁ గల్గెను. కాని యిది చిర కాలము నిలువఁజాల దయ్యెను. వెన్నమ నాయఁడను వెలమ సేనాధిపతి యీ కాలములో నుండెను.

క్రీ. శ. 1307 వ సం॥లో మాలిక్ కాఫరు తిరిగి దండయాత్ర వెడలి, 30 వేల గుఱ్ఱపు దళముతోను, లక్ష కాల్బలముతోను వచ్చి ముట్టడించెను. ఈమా రుభయ సైన్యములు హోరా హోరిగ పోరిరి. అందుచే నుభయ సైన్యములలో కొంత వరకు హతము కాఁగా చివరకు ఆంధ్ర చక్రవర్తికే జయము సమకూరి నందున నా మల్లిక్ కాఫరు విచారముతో ఢిల్లీకి మరలి పోయెను.

ఈ మహమ్మదీయుల ముట్టడులను జూచి యిదే సమయమని యొక ప్రక్క పాండ్యరాజులు చెలరేగి కాంచీపురమున నీ మహారాజ ప్రతినిధి యగు మనుమగండ గోపాలునిఁ బారఁద్రోలి రాజ్యమపహరించిరి. అప్పుడు ఈయన తన సేనాధిపతులలో ముప్పిడి నాయకుఁడు, రేచెర్ల నల్లదాచానాయఁడు, యెఱ్ఱదాచానాయఁ డను వారిని సైన్యముతోఁ బంపి వారలను జయించి మఱల మనుమగండ గోపాలు నచట నిలిపెను.

పొత్తపినాడు, గండికోట సీమలలోఁ బాలించెడి సామంతు లొకసారి స్వతంత్రు లగుటకుఁ బ్రయత్నింపఁగా, నీ మహారాజు తన కుమాళ్ళలో నొకఁడగు జుట్టయలంక గొంకారెడ్డినిఁ బంపి వారి నణంచి యాతని నచట ప్రతినిధిగా నియమించెను. క్రీ. శ. 1309వ సం॥ చివరలో తురుష్క సైన్యాధిపతి యగు మల్లిక్ కాఫరు మరల మూఁడవ సారి ఓరుగల్లుపై దండెత్తెను. ఈ మారు ఢిల్లీ చక్రవర్తి 40 వేల గుఱ్ఱపు దళమును, లక్ష కాల్బలము నిచ్చి పంపెను.

నిరంతర యుద్ధములలో నష్టపడిన యీ యాంధ్ర చక్రవర్తికి జయము యీ మారు కష్టమయ్యెను. ఐనను దైవముపై భారము వేసి యీయన సైన్యములోని కమ్మ, వెలమ రాచవార లందఱును ప్రాణములకు తెగించి యీ మహమ్మదీయ సైన్యములతో ఘోరమైన యుద్ధ మొనర్చిరి. ఆ యుద్ధమున మహమ్మదీయులకే జయము లభించినందున నప్పుడు వారితో ప్రతాపుఁడు రాజీపడవలసివచ్చెను. మల్లిక్ కాఫరు పట్టణము నంతను దోఁచికొని వేయి యొంటెలు మోయఁ గలిగిన ధనరాసులను తీసికొని రాజ్యమును వదలిపోయెను. ఐనను మహమ్మదీయుల కంతటితోఁ దృప్తిఁ గలుగలేదు. ఎట్లైనను యీ రాజ్యమంతయు వారి యేలుబడిలోనే యుండవలె నను యాస గల్గెను. కాని ప్రతాపరుద్రుఁడు కప్పము చెల్లించుటకొప్పుకొనెను.

క్రీ. శ. 1322 వ సం॥ నాఁటికి ఢిల్లీలో ఖుస్రూఖాన్ అను తుగ్లకు రాజ్యమునకు వచ్చెను. అతని కాలమైన నీ యోరుగల్లు

రాజ్యము తనదానిలో కలుపుకొనవలెనను పట్టుదల హెచ్చయ్యెను. క్రీ. శ. 1323 వ సంIIలో ఆతఁడు తన జ్యేష్ఠ పుత్రుఁడగు అలూఫ్‌ఖానను నతనిని సైన్య మిచ్చి పంపి యెట్లైనను ఆంధ్రరాజ్యమును స్వాధీన పఱచుకొమ్మని యాజ్ఞ యిచ్చి పంపెను. అప్పు డోరుగల్లు కోటవద్ద మహమ్మదీయులకును, ఆంధ్ర వీరులకును మిక్కిలి భయంకరమైన రణమయ్యెను.

ఆ రణరంగమున కమ్మ వెలమ వీరులు ప్రాణములకు తెగించి పోరాడిరి. కాని రెడ్డి సంఘమువారు మహమ్మదీయులవద్ద లంచము దిని యొకనాఁటి యుద్ధమున పనిచేయనందున మహమ్మదీయులు విజృంభించి కోటను సాధించినట్లు కొందఱు చరిత్రకారు లనుచున్నారు. ఈ విషయము నిజమైనను, కాకపోయినను ఆ మహా యుద్ధములోనే ఓరుగల్లు కోట తురుష్కాధీన మైనదనుట మాత్రము నిశ్చయము. విశాలమైన ఆకోట పాడువడి నేటికిని వరంగల్లు వద్ద గుర్తుగా నిలచి యున్నది. ప్రతాపరుద్రుఁడు ఢిల్లీకి చెరగొని పోఁబడెను. ఆ త్రోవలోనే మరణించెనఁట.

ఈ మహారాజు మాద్గల్య క్షేత్రమున 11 బంగారు గోవులను దానమిచ్చెను. ఇంక ననేక తులాభారములు తూగి ధర్మమొనర్చెను. ఈయన మంత్రులలో నొకఁడగు సాగి గన్నమ నాయఁడు మారన కవిచే మార్కండేయ పురాణము రచింపఁజేసి దానికి కృతి భర్త యయ్యెను.

ఈయన కాలములో భైరవార్చనము, ఏకవీరమహాదేవి, మైలారదేవుఁ డను దేవతలపూజ యోరుగల్లు నం దుండెను. పల్నాటివీర పురుషారాధనోత్సవము లపుడు జరుగుచు వచ్చెను. ఘడియలు కొట్టు యంత్రములును, పూటకూళ్ళ బసలును గూడ నోరుగల్లు నగరమున నుండెడివి.

రాజు లప్పుడు స్వేచ్ఛగా భోగభార్యలక్రింద వారకాంతల నుంచుచు వచ్చిరి. ఈ మహారాజునకు లక్ష్మీదేవివంటి మాచల్దేవి

యను వారాంగన యుండెడిది. ఈమె దానశాసనములు కొన్ని బెజవాడ మున్నగు దేవాలయములలో గలవు.

ఈ మహారాజు కమ్మనాటిలోని ప్రేంపల్లి (శాపట్ల) భావ నారాయణ స్వామికి దానమిచ్చి శా. శ. 1220 వ సం॥ లో నొక శాసనము లిఖించెను.

ఈయన యశ్వసైన్యాధిపతి యగు సాహిణిమారుడు భాస్కర రామాయణమునకు కృతి భర్తయై ఖ్యాతినొందెను. ఈయనవద్ద యిందులూరి రుద్రుడు, అమ్మవెంక, వేపేటి కొమ్మయ గుండయనాయకుడు, ముమ్మడిముట్టయ మున్నగు ప్రతినిధి పాలకు లుండెడివారు. వీరు సింహాచలము, మెదక్ సీమ, కమ్మనాడు, ములికినాడు, పెదకల్లుసీమలు పాలించుచువచ్చిరి.

దూపాటిసీమ యీ చక్రవర్తికాలములో శ్రీనాథ రాజనునతడును, నందికొటుకూరుసీమను సిరిసింగళ మహాదేవుడను నతడును రాజప్రతినిధులుగా పాలించుచువచ్చిరి.

ఈ మహారాజు కాలములో వీరభల్లట దేశికుడు, అప్పయార్యుడు, ఏకామ్రనాథుడు మున్నగు కవు లుండెడివారట. ఈయన చరిత్రము ప్రతాపరుద్రీయ మను సంస్కృతనాటకమున గలదు. ఇది విద్యానాథ మహాకవి రచించెను.

ఈయన చంద్రవంశమున జనించునని దూర్వాస దేవీ పురాణములో భవిష్యత్పరముగా వ్రాయబడినను, నిజమున కా గ్రంథ మీయన తర్వాతనే రచింపబడి యుండవలెను. కమ్మవారి కితడు పూర్వీకుడని యా గ్రంథమున గలదు. కమ్మవారిలో కొందఱు దుర్జయవంశీకు లని రుజువు పడుచున్నందున నిదియు సత్య మనరాదు. ఈయన భార్యల పేర్లు గాని, కుమాళ్లందరి పేర్లుగాని తెలియవు. ఈయనకు కృష్ణనాయకుడు, హరిపాలుడు, వీరభద్రు డను కుమాళ్ళున్నట్లును కొన్ని గ్రంథములలో వ్రాయబడినది; గాని శాసన దృష్టాంతములు లేవు. శాసనరీత్యా పైన నుడివిన గొంకారెడ్డి యొకడే

పుత్రుఁడుగనున్నాఁడు. కృష్ణనాయకునకు నాగదేవుఁడను కుమారుఁడు గూడ కలఁడని కొందఱు చెప్పుదురు. వీరల చరిత్ర తెలియకున్నది. ఈయన యనంతరమే కమ్మవారును, రాచవారును విడివిడిగా బేరు వహించి రనుటకు దృష్టాంతములు లభించుచున్నవి. అంతకు పూర్వము 12వ శతాబ్దముననే వెలమవారు విడిపోయి యుండిరి.

ఈయనకు అన్నమదేవరాజను తమ్ముఁ డున్నట్లును, అతని వంశమువారు యోరుగల్లు రాజ్య పతనానంతరమో, తత్పూర్వము నుండియో జగదళపురములో వసించుచు నచటి పాలకులుగానున్నట్లు కనుబడుచున్నది. ఈ అన్నమదేవరాజు కొడుకు అయ్యదేవుని శా. శ. 1307వ సం॥ నాటి శాసన మొకటి సింహాచలములోని నృసింహాలయమున గలదు. ఆ దేవుని కితఁడు పాయసమునకై 50 ఆవులను దానమిచ్చియుండెను. దంతేశ్వర దేవాలయ శాసనము ప్రకారము చూడఁగా, అన్నమదేవుని కుమారుఁడు (మరియొకఁడు కాఁబోలు) హమీరదేవుండను నతఁ డనియు, నతని వంశమున క్రీ. శ. 1703వ సం॥ ప్రాంతములో దిక్పాలదేవుఁ డను నతఁడున్నట్లును. అతని వంశీకులే యిప్పటి జగదళపుర సంస్థానపాలకులైనట్లును కనుబడుచున్నది.

## —♦ సామంతనృపాలురు ♦—

ఇంతవరకు దుర్జయ, చాళుక్యవంశము లందలి మహారాజుల వృత్తాంతములను వివరించి యుంటిమి. ఇఁక వీరివద్ద సామంతరాజులుగా పేరొందినవారి చరిత్రలు దెలుసుకొందము.

## —♦ వెలనాటి రాజులు ♦—

చాళుక్య చక్రవర్తులకు సామంతులుగా వీరు 7వ శతాబ్దము నుండి యున్నట్లు లోగడ నుడివి యుంటిమి. రెండవ చాళుక్యభీమునకు సామంతుఁడుగా నుండిన రెండవ మల్లవర్మ వృత్తాంతము మొదటి భాగమున వివరించితిమి. ఆతని కుమారుఁడగు కుద్యవర్మII

విమలాదిత్య చక్రవర్తికి (క్రీ. 1011—22 మధ్య) సామంతుఁడై వెలనాటి రాజ్యమును పాలించుచు వచ్చెను.

## —♦ కుడ్యవర్మ II ♦—

విమలాదిత్య చక్రవర్తి యీతని సహాయమునకు మెచ్చుకొని గుద్రవార ద్వయమును గూడ నాతని రాజ్యములోఁ జేర్చినట్లు పిఠాపురములోని పృథ్వీశ్వర శాసనమున గలదు.

## —♦ ఎరియరాజు, నన్నిరాజు ♦—

వీరిద్దరును కుడ్యవర్మ II కుమారులుగా గన్పడు చున్నారు. వీరు తాలరాజునకును, రాజరాజనరేంద్రునకును సామంతులుగా నుండిపాలించి రని చెప్పవచ్చును. తర్వాత ఎరియరాజునకు గుండాంబ వల్ల జనించిన యైదుగురు కుమాళ్ళలో (గొంక, బసవ, మల్ల, గండ, పండరాజులు) గొంకరాజు వెలనాటి రాజ్యాధీశుఁ డయ్యెను.

## —♦ వెలనాటి గొంకరాజు I ♦—

ఈయన చాళుక్య చక్రవర్తియగు కులోత్తుంగ చోడునకు సామంతుఁ డగుటచే వెలనాటి కులోత్తుంగ గొంక రాజనియుఁ జెప్పెదరు. ఈతఁడు వెలనాటినే గాక దాదాపు వేంగీదేశ మంతటిని కులోత్తుంగునకు ప్రతినిధిగా క్రీ. శ. 1076—1117 సం॥ల మధ్యను పాలించెను. ఈయన విద్వత్పంకజాళీ మృగాంకుఁ డని శాసనములలో వ్రాయఁబడినది. ఈయన భార్య పేరు సబ్బాంబిక. ఇతఁడు తన తమ్ముఁ డగు పండయరాజు చనిపోయినపు డాతని పేర చందవోలులో పాండేశ్వరాలయమును గట్టించెను. మంచన కవి రచితమగు కేయూరబాహు చరిత్రమునం దీయన ప్రతిభ విశేషముగా వర్ణింపఁబడి యున్నది. ఈయన వద్ద నండూరి గోవిందామాత్యుఁడను సంధి విగ్రహి మంత్రియు ప్రోలనాయకుఁ డను మంత్రియు నుండిరి. గోవిందామాత్యుని శా. శ. 1030వ సం॥నాఁటి శాసన మొకటి ధరణికోట అమరేశ్వరాలయమునఁ గలదు. ఈయన వెలనాఁటి

రాజ్యమును వేంగీ దేశమును కలిపి 41 సం॥లు పాలించిన తర్వాత నీయన కుమారుఁడగు రాజేంద్రచోడ రాజు పాలనకు వచ్చెను. ఈయన శా. శ. 998 వ సం॥లో చేబ్రోలులోని కుమారస్వామి కఖండ దీప దానము గావించి హారమునకై యేఁబది జయమాడల నొసంగెను♦.

## —♦ వెలనాటి కులోత్తుంగ చోడరాజు I ♦—

చాళుక్య చక్రవర్తి యగు కులోత్తుంగ చోడరాజీయన నభిమాన పుత్రునిగాఁ జేసికొని తన రాజ్య మంతటి నితని చేతనే యేలింపఁ జొచ్చెను. ఈ మహారాజునకు 'సమధిగత పంచమహాశబ్ద, మహామండలేశ్వర, ప్రతాపలంకేశ్వర, చాళుక్యరాజ్యభవన మూల స్తంభ, శుంభజృంభిత రిపుమదస్తంభ, చతుర్థకులవనజవనమార్తాండ, చలమర్తిగండ, చతుశ్శ్వతాశీతిగ్రామావనీవల్లభ, సహకార వల్లభ, ఆహవ రక్కస, విక్రమ కర్కశ, భండన భీమ, భువనాభిరామ, దాయగజసింహ, సాహసోత్తుంగ నా'మాది బిరుదములు గలవు. ఈ మహారాజు బొక్కసములో 9 లక్షల ద్రవ్యమును, 90 యేనుఁగు లును, 40,000 వడిగల గుఱ్ఱములును గల వనియు, నిత్యము డెబ్బది యైదు పుట్లు ఖర్చనియు కేయూరబాహు చరిత్రమునఁ జెప్పఁబడెను. ఈయనకు గుండాంబిక, సాంబు దేవి యను భార్యలు గలరు. ఈయ నకు సబ్బమ దేవి యను కుమార్తెయును, రెండవ గొంకరాజును జనిం చిరి. కుమార్తె నీయన కోటభీమరాజున కిచ్చి వివాహ మొనర్చెను. ఈభీమరాజు ధరణికోట పాలకుఁడు. ఈయన భార్యలలో గుండ మాంబ శా. శ. 1058 వ సం॥లో దాక్షారామ భీమేశ్వరుని దర్శించి యఖండదీపదానము గావించి యొక శాసనము వ్రాయించెను. సాంబు దేవి కొండపడమటి కాపూరి త్రికోటీశ్వరాలయమున నఖండ దీపదాన మొనర్చెను. ఈ మహారాజు తండ్రివద్ద నుండిన గోవిందా మాత్యుఁడుగాక, ముదుసెలి నారాయణ పెగ్గడ యను నతఁడొక

♦ S. I. I. Vol. VI. No. 109.

మంత్రిగా నుండెను. ఈ మంత్రి శాసన మొకటి శా. శ. 1042 వ సం॥ నాఁటిది భీమేశ్వరాలయమునఁ గలదు. ఈ మహారాజు క్రీ. శ. 1115 వ సం॥ నుండి 1130 వ సం॥ వరకు వేంగీదేశమును, వెలనాఁటిని పాలించెను; గాని కులోత్తుంగ చక్రవర్తి 1120 వ సం॥ ప్రాంతములో చనిపోఁగా పశ్చిమ చాళుక్య చక్రవర్తి యగు నాఱవ విక్రమాదిత్యుఁడు వచ్చి వేంగీదేశమును జయించి 4 సం॥లు రాజ్యమేలగా తుదకు కులోత్తుంగుని కుమారుఁడగు విక్రమచోడుఁడు వచ్చి యాతని ప్రతినిధులను పారఁద్రోలి రాజ్యమును తిరిగి రాజేంద్రచోడరాజునకు స్వాధీనముఁ జేసినట్లును కనఁబడుచున్నది. ఈయన తర్వాత నీయన కుమారుఁడగు రెండవ గొంకరాజు వెలనాఁటిరా జయ్యెను. ఈయన కుమాళ్లలో నొకఁడగు పండరాజు భార్య నాగలదేవి శా. శ. 1069 వ సం॥ లో బాపట్లలోని దేవున కఖండ దీపదాన మొనర్చెను♦.

## —♦ వెలనాఁటి రెండవ గొంకరాజు ♦—

ఈ మహారాజు వేంగీదేశమును, వెలనాఁటిని తూర్పుచాళుక్య చక్రవర్తుల పక్షమున క్రీ. శ. 1130 - 63 సం॥ల మధ్య పాలించినవాఁడు. ఈయనకుఁ గూడ తండ్రి తాతలకువలెనే చందవోలు రాజధాని. ఈయనకు గుండాంబ, సబ్బాంబిక, ప్రోలమాంబ, సోమాండియమ్మ, పండమాంబ యను భార్య లున్నట్లు కన్పడుచున్నది. ప్రసిద్ధి వహించిన దండనాయక పండినాయకుఁ డీతని మామ. ఈయన చాళుక్య చక్రవర్తి పక్షమున మరాటులతోను, కుంతలదేశాధిపతితోను బోరాడి జయించిన ట్లీయన భార్యలలో పండమాంబ శా. శ. 1066 వ సం॥లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కఖండ దీపదానము గావించి, యంగుళీపంచకమును సమర్పించి వ్రాయించిన దానశాసనములో వ్రాయఁబడి యున్నది. ఇంతేగాక నితఁడు గోదావరీ సంగరమున గోవిందదండాధిపుని జయించిన ట్లొక శాస

♦ S. I. I. Vol. VI. No. 137.

నము దెలిపెడిని. ఈయనకు శావమఱంది యగు చోడపనాయకుఁడితనివద్ద నొకసేనాధిపతిగా నుండెను.

ఈయన వద్ద వాసనప్రెగడ యను ప్రధాని యుండెను. ప్రోలిశెట్టి యను వైశ్యుఁ డొకఁ డీయన సేనాధిపతులలో నొకఁడుగా నుండెను. ఈ మహారాజు సేనలో గొల్లలుగూడ నున్నట్లొక శాసనమువల్లఁ దెలియుచున్నది. ఈయన తన తండ్రి వహించిన బిరుదుల నన్నిటిని వహించెను. గోదావరీ సంగరములోఁ జూపిన పరాక్రమమునకు మెచ్చుకొని చాళుక్య విక్రమచోడుని కుమారుఁ (రెండవ కులోత్తుంగ) డీయనకు శ్రీశైల ప్రాంత దేశమునకుఁగూడ పాలనాధికార మొసంగెను. అందువలననే యీయన బిరుదులలో "త్రిశతోత్తర షట్సహస్రావనీ నాథ సంపాదిత" అనునది కన్పడుచున్నది. ఈయన శైవభక్తుఁ డని బిరుదులనుబట్టి తెలియుచున్నది. ఈయనయు నీతని మంత్రి వాసనప్రెగడయు కాళహస్తి ప్రాంతమునకేగి విక్రమచోళుని 12 వ పాలన సం॥న నచటి దేవుని కఖండదీపదానములు గావించిరి†. విక్రమచోళుని పక్షమున నాదేశము స్వాధీనపరచుటకై యచటి కేగి యుండిరి. ఈకాలముననే దండనాయక నందిమరాజు కొడుకు గొంకననాయకుఁడు గూడ నచటి కేగి యుండెను. ఆతఁడు గూడ నచట దీపదానము గావించెను*. ఈ కాళహస్తి శాసనము లన్నిటిలోను వీరి రాజ్యము పేరు వెలినాఁ డనియే వ్రాయఁబడెను.

ఈయనకు కొలనురాజులకును యుద్ధములు జరుగుచుండెను. కొలను భీమరాజీయన ప్రత్యర్థి. ఈ భీమరాజును చంపించి కొలను రాజ్యముగూడ నితఁడు స్వాధీన పరచుకొనెను.

ఈ మహారాజు తన భార్య యగు గుండాంబతోను, కుమారుని తోను మామయగు పండినాయకునితోను, శావమఱంది యగు చోడపనాయకునితోను శ్రీద్రాక్షారామ భీమేశ్వరుని దర్శించి శా. శ.

† 103 & 108 of 1922
* 111 of 1922

1064వ సం॥లో క్షీరాభిషేకాఖండ దీపదానములను గావించుటయేగాక దేవునికి కనకవలయులు 2, గద్యలు 200, పసిడి పళ్ళెము, కొలగములు. లోహదండములును సమర్పించి, యచట రాయ మండపమొకటియు, గొట్టారమండప మొకటియుఁ గట్టించి, పూల వనమొకటి వేయించి, తటాక మొకటి నిర్మించి పేరొందెను.

ఈయన భార్యలలో సబ్బమాంబ శా. శ. 1055 వ సం॥ లో నాదెండ్లలోని గోవర్ధనస్వామి కఖండ దీపదానము గావించెను. ఈమె శా. శ. 1043 వ సం॥లో శ్రీ భీమేశ్వరునికి కనకవలయు, 93 గద్యాణముల నొసంగెను. ఈయన తల్లియగు గుండాంబికా దేవి శా. శ. 1054 వ సం॥లో శ్రీ కాకొలనులోని శ్రీ వల్లభస్వామి కఖండ దీపదాన మొనర్చెను.

పెన్మదిగ్రామ (పెనుమూడి కావచ్చును) వాస్తవ్యుఁడగు భీమనప్రెగడ కుమారుఁడు అప్పనప్రెగడయు, మాధవరాజును, కంటపు గ్రామస్థుఁడగు అనంతామాత్యుని కుమారుఁడు సూరయామాత్యుఁడు నీయన మంత్రులుగా నుండిరి. ఈయన భార్యలలోని పోలమాంబ ద్రాక్షారామ భీమేశ్వరాలయమున నెరియ భూపాలుని సతి యగు నెరియాసానితోఁ గలసి బంగారు కలశములను స్థాపించెను. సోమాండియమ్మ యను సతీమణి శా. శ. 1066 వ సం॥ లో కమ్మనాటిలోని ప్రేంపల్లి శ్రీ భావనారాయణస్వామి కొక దానమిచ్చి శాసనము వ్రాయించెను.

ఈయన తండ్రివద్ద నుండిన నండూరి కొమ్మనయే యీాయనకు ప్రధాన మంత్రిగా నుండెను. ఈయన వెలనాఁటి రాజులలో ప్రసిద్ధి గలవాఁడు. ఈయన కాలములోనే కొండ పడమటి సీమ రాజు లీయనకు సామంతులైరి. ఈయన సేనాధిపతులలో కొమ్మిశెట్టి యను వాఁడు బాపట్ల దేవాలయమున కనేక ధర్మము లొసంగెను. ఈయన మంత్రులలో యీశానప్రెగడ యను నతఁడు కారెంపూడిలో సూరేశ్వరాలయ మొకటి గట్టించెను.

ఈ మహారాజు విద్యార్థి పోషణకును, సన్యాసుల భోజనాదులకును పెరుంజంక, వడ్రావుల గ్రామములలోని పన్నుల నొసంగెను.

ఈ మహారాజు 6000 పైగా గ్రామముల కధీశుఁడైనను కొన్ని శాసనములలో 480 గ్రామముల కధీశుఁడని వ్రాయఁబడెను♦. (655 & 945 of 1921) ఇది వెలనాటి రాజ్యభాగము మాత్రమై యుండును. ఈయన లాటమరాట, కుంతలరాజుల ధిక్కరించి రాజ్యమేలెను. ఈయన పరిపాలనము కాళహస్తి వరకును వ్యాపించెనఁట. ఈయనశాసన మొకటి త్రిపురాంతకములో నున్నది. ఈయన రెండవ కుళోత్తుంగ చక్రవర్తికి సామంతుఁడుగా నుండెను. ఈయన కాళహస్తీశ్వరస్వామి యాలయములో పది యఖండ దీపములకొఱకై 320 గోవులను దానమిచ్చి శాసనము వ్రాయించెను*.

## —♦ వెలనాటి రెండవ రాజేంద్రచోడరాజు ♦—

సబ్బాంబికా పుత్రుఁడగు నీ మహారాజు రెండవ గొంక నృపాలుని యనంతరము వెలనాటి రాజ్యమును, వేంగీదేశమును చాళుక్య చక్రవర్తుల పక్షమున క్రీ. శ. 1163 వ సం॥ మొదలు 1181 వ సం॥వరకు పాలించినవాఁడు. ఈ మహారాజునకు కుప్పాంబ, అక్కమ్మ, గొంకమాంబ, పండమాంబ యను భార్య లుండిరి. ఇందు అక్కమ్మ కొండపడమటి బుద్ధరాజునకు చెల్లెలును, పండమాంబ కోనకంద్రాఁడి పశుపతిరాజ కుమార్తెయును, గొంకమాంబ అమ్మాండియమ్మాన్ల పెర్మలుకును సుగ్గలాంబకు జనించినదియు నై యుండిరి. ఈయన అమరేశ్వరస్వామి భక్తుఁడు. తన తండ్రి వహించిన బిరుదులనే గాక యితఁడు "గండరొళుగండ, గండకాలానల, వైరివిలయగల, సంగ్రామకంఠీరవ, పరచక్రభైరవ, సిద్ధిమస్తక, కాకతిప్రోల నిర్దహనమరదమాండి దవదానలుండు" అను బిరుదులఁ

♦ See J. A. H. R. S. Vol. V. p. 68. 70.

* No 123 of 1922

గూడ ధరించెను. దీనినిఁ బట్టి యీయనకును కాకతి ప్రోలరాజు II నకును యుద్ధము లుండె ననియు, ప్రోలరాజు నీతఁడు చంపె ననియు తెలియు చున్నది. ఈయన తండ్రి పాలన కాలములోనే యితఁడు చోడ పట్టణము గట్టించి, కొలని భీమునిఁ జంపి రాజ్యమును విస్తరించెను.

ఈయన కాలములోఁ గూడ కోన రాజ్యము వెలనాటి రాజులకు లోఁబడి యుండెను. కోన రాజేంద్ర చోడుఁడును, మండాది ప్రభువులు గూడ నీయనకు సామంతులుగా నుండిరి. ఆంధ్ర చోడుల లోని కన్నర దేవచోడుఁ డీయన రాజ్యముపై తిరుగఁబడఁగా నీతఁడు జెల్లయ, నారయ, సూరయ యను సేనాధిపతులను బంపి వాని నణంచెను. ఈ మహారాజు మండపట్టును గ్రామ మగ్రహార మొసఁగెను. ఈయన వద్ద అమ్మ్రుతలూరి మంచి రాజు కొడుకు దేవన ప్రెగడ, వాసనప్రెగడ, సోమనప్రెగడ, యెఱ్ఱప నాయకుఁ డను సేనాధిపతు లుండిరి. కోన సీమను సాధించిన వారిలో దేవనప్రెగడ యొకఁడు.

ఈ మహారాజు కాలములోనే కాకతి రుద్రదేవుఁ డీతనిపై దండెత్తి త్రిపురాంతక ప్రాంత ప్రదేశమును హరించి నట్లు కన్పడు చున్నది.

ఈయన భార్యలలో పండమాంబ శా. శ. 1085 వ సం॥ లోను, గొంకమాంబ శా. శ. 1102 వ సం॥లోను శ్రీ ద్రాక్షా రామభీమేశ్వరుని కఖండ దీపదానములఁ గావించిరి. కుప్పాంబ యను సతి వెల్లయను గ్రామమును శ్రీ భీమేశ్వరుని కర్పించెను. ఈయన కుమార్తె యగు మైలమదేవిని పల్నాటి సీమ ప్రభువును హైహయ వంశజుఁడు నగు చాగి అనుగురాజు పెండ్లాడెను. ఈయన తాలూకు తామ్ర శాసన మొకటి శా. శ. 1091 వ సం॥ నాఁటిది బాపట్లలో నిటీవల లభించినది♦.

♦ C. P. 23 of 1916—17.

## —♦ వెలనాటి మూడవ గొంక నృపాలుడు ♦—

ఈయన అక్కాంబవలన రెండవ రాజేంద్ర చోడరాజునకుఁ బుట్టినవాఁడు. ఇతఁడు క్రీ. శ. 1163 వ సం॥ నుంచి 1181 వరకు చాళుక్య చక్రవర్తుల ప్రతినిధిపాలకుఁడుగనే పాలించుచు వచ్చెను. ఇతని తండ్రి యగు రాజేంద్రచోడుఁడు కాకతి రెండవ ప్రోలరాజును చంపి యుండుట వల్ల నాతని కుమారుఁడగు కాకతిరుద్ర దేవుఁడీయనపై దండెత్తి క్రీ. శ. 1186 ప్రాంతములో కొంత రాజ్యమును హరించి నట్లు కన్పడుచున్నది. ఈయనకు జయాంబిక, కామాంబిక యను భార్యలు గలరు. జయాంబిక కొండపడమటి రాజ కుమారిత. ఈమె పిఠాపురములోని కుంతీమాధవాలయమును గట్టించి, సింహాచలము లోని నృసింహస్వామి విగ్రహమునకు సువర్ణ తొడుపు వేయించెను. కుంతీమాధవాలయమున కీమె నవఖండవాడ యను గ్రామమును దాన మొసంగెను.

## —♦ వెలనాటి పృథ్వీశ్వర రాజు ♦—

ఈయన మూఁడవ గొంక నృపాలుని పుత్రుఁడు. ఈయన కాలమున వెలనాటి రాజ్యమును కాకతీయ గణపతిదేవ చక్రవర్తి యాక్రమింపఁగాఁ జేయునదిలేక శక్తిహీనుఁ డగు నితఁడు పిఠాపురమునకుఁ బారిపోయి యచట తన రాజ్యమును స్థాపించుకొన్నట్లు గన్పడుచున్నది. దురదృష్టవంతుఁ డగు నితఁ డచట రాజ్యము చేయుచుండఁగా తెలుఁగు చోడరాజులలోని మనుమసిద్ధి కుమారుఁ డగు తిక్కభూపతి యాతనిపై దండెత్తి యుద్ధమున నీయన తలఁ ద్రుంచి నట్లు తిక్కనసోమయాజి రచితమైన నిర్వచనోత్తర రామాయణమున వ్రాయఁబడియున్నది. ఈ మహారాజు శాసనములు క్రీ. శ. 1163—80 వరకుఁ గన్పడుచున్నవి. ఈయన కుమాళ్లలో నొకఁ డగు అయ్యపదేవరాజు యొక్క శా. శ. 1159 వ సం॥ (క్రీ. శ. 1237 వ సం॥) నాఁటి శాసన మొకటి బెజవాడ మల్లేశ్వరాలయమునఁగలదు.

మల్లేశ్వరుని కతఁడఖండ దీపదాన మొనర్చెను. పృథ్వీశ్వరరాజు కాలమునకు రెండవ కులోత్తుంగుని కుమారుఁడగు రాజేంద్ర చోడుఁడు నామకా చాళుక్య చక్రవర్తిగా నుండెను; గాని యాతని పలుకుబడి తగ్గి పోయెను. తెలుఁగు చోడరాజులును కాకతీయరాజు లును కలసి యీ వెలనాఁటి రాజ్యమును వేంగీరాజ్యముతో పాటు హరించినను, వీరి ప్రసిద్ధత మనకు గోచరించుచునే యున్నది. ఈ మహారాజు శాసన మొకటి పిఠాపురమునఁ గలదు.

## —♦ వెలనాఁటి విదురరాజు II ♦—

ఇతఁడు వెలనాటి మొదటి గొంక నృపాలుని సోదరులలోఁ గల గండ నృపాలుని పుత్త్రుఁడు. ఈతఁడు చాళుక్య రాజులలోని వీరచోడునికి మంత్రిగా నుండి పాండ్యరాజుపై యుద్ధమునకుఁ బోయి నపు డాతని జయించెనఁట. అందుచే నితనిని కృష్ణా గోదావరీల మధ్య ప్రదేశమునకు స్వతంత్రపాలకునిగా నియమించె నని పృథ్వీశ్వ రుని పిఠాపుర శాసనమునఁ గలదు. ఈ దేశమునకు సింధు యుగ్మాంతర దేశ మను పేరందు వ్రాయఁబడెను.

## ♦ దండనాయక పండినాయకుఁడు ♦

వెలనాటి రెండవ గొంక నృపాలునికి మామగా నుండిన యీ సేనాధిపతి మిక్కిలి ప్రసిద్ధిగలవాఁడును, దాతయునై యుండెను. ఈయనకు "సమధికసమరసమోపార్జిత, జయాంగనా లింగిత, దక్షిణ దోర్దండ, నిక్కువ గండవైరి భాంగార, భావనంకకాల, ఉభయ బలసుభట, మున్నటివకలి కఱకలిత, నమ్మెుబువ" మున్నగు బిరు దులు గలవు. ఈయన తండ్రి మారినాయకుఁడు కర్నాట యుద్ధ ములో మరణించె నని యొక శాసనమునఁ గలదు. ఈయన తల్లి పేరు మల్లాసాని. ఇతని కుమారుఁడగు చోడప నాయకుఁడు గూడ సేనాధిపతియే. పండినాయకుఁడు శా. శ. 1061 వ సం॥ లో తన తల్లి దండ్రులకును తమ్ముఁడగు మారినాయకునికిని పుణ్యమునకై

ద్రాక్షారామ భీమేశ్వరున కఖండ దీపదానము లొనర్చెను. శా. శ. 1067 వ సం॥ లో చేబ్రోలులోని కుమార స్వామికిఁ గూడ నఖండ దీపదానము గావించెను. చోడపనాయకుఁడు గూడ శా. శ. 1079 వ సం॥ లో ద్రాక్షారామ భీమేశ్వరునికి దీపదాన మొనర్చెను. పండినాయకుని భార్య కొమ్మమ నిడుమాని కొమ్మయకు మల్లాంబకు జనించెను. ఈమె పెరవలి గ్రామములో మాధవ స్వామిగుడిఁ గట్టింపఁగా, నామె కుమారుఁ డగు చోడపనాయకుఁ డా దేవళమునకు 3 పుట్లభూమి నొసంగెను.

పండి నాయకుఁడు చెరుకుపల్లిలో గొంకేశ్వరాలయమును గట్టించి దానికి 35 పుట్ల భూమి నొసంగెను. ఇది విక్రమచోడ చాళుక్య చక్రవర్తి విజయరాజ్య 17 వ సం॥లో చేయఁబడెను. నిడుబ్రోలులోని చోళేశ్వరాలయ శాసనమునం దీ పండి నాయకుఁ డిట్లు వర్ణింపఁబడెను.

“ శా॥ పెంచ్చొంబుట్టల నెల్ల బేర్మి వెలయం బెట్టించె సత్రంబు గ
ట్టించె న్భక్తి శివాలయంబులిల బ్రాఘించాల్చి యొప్పంగ గొ్రి
ప్పించెం బూర్ణ తటాకముల్ జలధి గంభీరంబుగాఁగ చెన్నిధుల్।
నించెఁ గూర్మి నయపండఁడర్థిభవనా నీకంబులం గీర్త్యుఁడై ॥”

ఈయన కాళహస్తి వరకును గూడ వెళ్ళి పాలించు చున్నట్లు గన్పడును. ఇక్షుపల్లిలో నితఁ డొక గొప్ప శివాలయము గట్టించెను♦. ఈయన వంశము చేబ్రోలు శాసనమున నిట్లున్నది. త్రిలోచన పల్లవుని వద్ద ఓంగేరు మార్గ త్రయమును బొందిన బుద్ధవర్మ వంశమున గండఁడును, ఆతనికి దేసటి పండఁడును, ఆతనికి విల్లమ భీముఁడును, ఆతనికిఁ రెండవ గండఁడును, ఆతనికి మేడమాంబ వలన పండఁడును, ఆతనికి బూరమవల్ల భీముఁడును, ఆతనికి ఎరియాంబవల్ల నీ పండ రాజును జనించినట్లు వ్రాయఁబడెను. విల్లమ భీముఁ డాంధ్ర రాజుచే (చాళుక్యరాజు) పంచిని కుర్రువృత్తిగాఁ బొందెనఁట.

♦ S. I. I. Vol. No. VI, No.103

## —♦ కొండ పడమటి సీమ రాజులు ♦—

మర్జయాన్వయు లగు వీరిలో రెండవ బుద్ధరాజు చరిత్రము మొదటి భాగమునఁ జెప్పఁబడినది. ఈ రెండవబుద్ధరాజు తరువాత 10 వ శతాబ్దమువరకు చరిత్రవివరముగఁ దెలియుట లేదు. కాని 10 వ శతాబ్దమున మఱియొక బుద్ధరాజీ వంశమున జనించినట్లును, ఆ మూఁడవ బుద్ధరాజునకు మండవర్మ జనించినట్లును కనుపడు చున్నది.

## —♦ మ ం డ వ ర్మ ♦—

ఈయనకు యెఱ్ఱమండఁడని కూడ పేరు గలదు. ఈతఁడుకొండ పడమటి సీమ 210 గ్రామములకు ప్రభువుగా నుండెను. ఈయనకు "యెలదాయ సింహ" బిరుదము గలదు. ఈయనకు నాల్గవ బుద్ధరాజును, గండరాజును జనించిరి. ఈయన వద్ద సూరఁడను ప్రసిద్ధ సేనాధిపతి యొకఁ డుండెను. ఈ సేనాధిపతి మండవర్మ రాజ్యమును వృద్ధి గావించెనఁట. ఈ సేనాని శా. శ. 1040వసంIIలో చేబ్రోలు లోని స్వామి కఖండదీప దాన మొనర్చెను *. ఇతఁడు గాక వజ్ర దండ గన్నోజను విశ్వకర్మ కులస్థుఁడీయన వద్ద సేనానిగా నుండెను.

## —♦ బు ద్ధ వ ర్మ IV ♦—

ఈయనకు బాదాంబిక, గడియమదేవియును భార్య లుండిరి. అందు గడియమదేవి వలన మన్మమండ రాజును, బాదాంబిక వలన మహామండలేశ్వర చోడరాజును జనించిరి. ఈతఁడు కొండపడమటి సీమను పాలించిన తరువాత మిక్కిలి శూరాగ్రేసరుఁడగు మన్మ మండరాజు పాలనకు వచ్చెను.

## —♦ మన్మమండరాజు ♦—

మండరాజునకు మనుమఁడగు నితఁడు రాజేంద్రచోడ చక్రవర్తికి సామంతుఁడుగా నుండెను. ఈయన ప్రతాప మొక శాసనమున నిట్లు వర్ణింపఁబడెను.

---

* S. I. I. Vol. VI, No. 117

"శ్లో॥ తస్యోదభూ త్త్రిభువనే స్వరగీత కీర్తిః
రుద్రిప్త వైరిలలనా గలసూత్రదాత్రః
మండశ్చ్యభై గ్గుణ గత్త్తై స్తు లయాంచకార
భీమం భృగుం రఘుమసావనియంక భీమః॥

శ్లో॥ కాళింగ గంగ కటకం తటవ ద్విపాట్య
జగ్ధ్వాకటంకరవదార భటారి వీరాన్
ఉచ్ఛిద్య గజ్జతి శిరస్సరసీరుహాణి
తేషాంచ మండలిక మండమదద్విపేంద్రః॥"

ఈయనకు "పరబలసాధక, ఎలదాయసింహ, సాహసోత్తుంగ, రణరంగరామ, అనియంకభీమ, సత్యరాధేయ, శౌచగాంగేయ, దుర్జయకులకుముదక్షీరార్ణవ నిశాకర, సురుచిర గుణాకర, విక్రమ క్రీడావినోద, కావ్యవినోద, సుకవికీరసహకార, తురగరేవంత, వైరికృతాంత, వివేకపద్మాసన, గిరిపశ్చిమశాసనాది" బిరుదులు గలవు. ఇతఁడు తన తల్లిదండ్రుల పుణ్యమునకై నాదెండ్లలోని మూలస్థానదేవర కఖండదీపదానము గావించి నొంచిడ్లపాడులో నాదేవునకు 140 పుట్లభూమిని నానాసేవలకుఁగా నొసంగి ఖ్యాతిఁ జెందెను. ఇంక ననేకము లగు వస్తువులఁ జేయించి యొసంగెను. ఈయన పాలనము క్రీ. శ. 1061వ సం॥ము వరకు నుండెను. ఈయన కైదవ బుద్ధవర్మయు, మల్లవర్మయు జనించిరి.

## —♦ మల్ల భూపాలుఁడు ♦—

మన్మమండరాజు పుత్త్రుఁడగు నీయన గూడ కొండపడమటి సీమను పాలించుచు ఖ్యాతిఁ జెందెను. ఈయన నాదెండ్లలోని మూలస్థాన దేవరకును, శ్రీ కేశవస్వామికిని అఖండ దీపదానములను గావించి శాసనములను వ్రాయించెను. అందీతని ప్రతాప మిట్లు వ్రాయఁబడెను.

"శ్లో॥ మేఘాడంబర మంబరే జలముచాం దృగ్గుపాం విభూత్యై ।
క్షీరోదధేరిందు రివేందు మూలేః స్వామీవమల్లః పరహస్తిమల్లః ।
ప్రఖ్యాత శౌర్యోజని ధైర్య ధుర్యః ॥
బలేర్విక్కీర్తి ర్బలభిద్విలాసం, సత్యం హరిశ్చంద్ర విభో ర్విభాతి ।
శౌర్యం రఘోర్మల్లంధ్నపాల కేనసస్తైవజాతం సహవర్ధమానం॥"

## —♦ బుద్ధరాజు V ♦—

మన్మమండ నృపాలుని పుత్రులలో నొకరగు నీయన చరిత్ర విశేషముగఁ దెలియుటలేదు. ఈయన భార్యపేరు గుండాంబిక. ఈయన శాసనములు నాదెండ్లలోను చేబోలులోను గలవు. ఈయన తన చెల్లెలగు అక్కమ్మను వెలనాటి ప్రభువగు రెండవ రాజేంద్రచోడరాజున కిచ్చి వివాహ మొనర్చెను. ఇతఁడు చంద వోలులోని పాండేశ్వరాలయమునకుఁ గొంత భూమి నొసంగెను. ఈయనఁ గూడ మన్మమండరాజు బిరుదుల నన్నింటిని ధరించెను. నాదెండ్లలోని మూలస్థానదేవర కితఁడు శా. శ. 1070 వ సం॥లోను యితని భార్యయగు గుండమదేవి శా. శ. 1093వ సం॥ లోను అఖండదీపదానము లొనర్చిరి. వెలనాటి పృథ్వీశ్వరచోడుని భార్య యగు జయాంబిక యీ వంశములోనిదే.

## —♦ మహామండలేశ్వర చోడరాజు ♦—

ఇతఁడు లోగడ నుడివిన నాల్గవ బుద్ధవర్మ పుత్రుఁడు. ఈయన శా. శ. 1054 వ సం॥ ప్రాంతీయుఁడు. ఈయన తన పూర్వీకుల బిరుదముల నన్నిఁటిని ధరించినవాఁడు. "సమర ముఖ షణ్ముఖ, ప్రతిజ్ఞా పరశురామ, విజయలక్ష్మీకళత్ర, బిరుదరాక్షస నృసింహాది" బిరుదులఁ గూడ ధరించుటచే నితఁడు యుద్ధములలో జయములఁ గొనుచుండె నని చెప్పవచ్చును. ఇతఁడు చాళుక్య రెండవ కులోత్తుంగ చక్రవర్తి సామంతుఁడుగాఁ గన్పడును. ఈయన నాదెండ్ల మూలస్థాన దేవరకు తూబాటి పొలమున

3 పుట్లును, నొంచెనపాటిని 130 పుట్లును, భూమి నొసంగి దేవునికి పూజార్లకు, పురోహితులకు, సంగీతపాటకులు మున్నగువారికి వృత్తుల నేర్పరచెను. ఇంతేగాక నచటి కేశవ స్వామికి 33 పుట్ల భూమిని, ఇట్టిలూరి సోమేశ్వరస్వామికి 60 పుట్ల భూమి నొసంగి ఖ్యాతిఁ జెందెను.

## —♦ నాదెండ్ల మన్మచోడరాజు ♦—

పైన నుడివిన చోడరాజునకు మనుమఁడగు నితఁడు నాదెండ్లలో నివసించుచు నచటి మూలస్థానదేవరకు 3 పుట్లభూమి నిచ్చి యఖండ దీపదాన మొనర్చి యుండెను. ఈ వంశీకులే క్రమముగా నాదెండ్ల గృహనామమును గోత్రమును ధరించినట్లు తోఁచును. కమ్మవారిలో నాదెండ్ల గోత్రీకులును, గృహనామస్థులును గలరు. శా. శ. 1177 వ సం॥ లో నాదెండ్ల భీమినేనికిని యఱకాసానికిని జనించిన కేతినాయుఁ డను నతఁడు బెజవాడ మల్లేశ్వర స్వామి కఖండ దీపదానము గావించి యుండెను. ఈ కేతినాయుఁ డీ వంశీకుఁడై న ట్లూహింప వలసియున్నది.

## —♦ మండ భూపతి III ♦—

ఇతఁడు మన్మమండరాజునకు మనుమఁడును, నల్లమల్లరాజునకు కుమారుఁడునై యున్నాఁడు. ఇతఁడు గూడ కొంతప్రదేశము పాలించినట్లే కన్పడును. ఈయనవద్ద ఎఱ్రమప్రెగడ యను భండారాధిపతియుండెను. ఈయన శా. శ. 1095వ సం॥లో నాదెండ్లలోని శ్రీ కేశవస్వామికి ఒకమర్తు పల్లపునేలను దానమిచ్చి పేరొందెను.

## —♦ పరిచ్ఛేదుల వంశము ♦—

కొండపడమటి సీమరాజులకు మూలపురుషుఁ డగు మొదటి బుద్ధవర్మ వంశమున గండఁడును, ఆతనికి దేసటి పండఁడును, ఆతనికి విల్లమభీముఁడును, ఆతనికి గండఁడును, ఆతనికి మేడమయను భార్య వలన పండఁడును, ఆతనికి బూరమ యను భార్య వలన భీమనయు,

ఆతనికి ఎరియాంబయను సతీమణి వలన, ప్రసిద్ధుఁడగు మహామండ లేశ్వర పండరాజును జనించి నట్లు చేబ్రోలులో నతఁడు శా. శ. 1067 వ సం॥లో వ్రాయించిన శాసనమునఁ గలదు. ఇందలి విల్లమ భీముఁడు పంచిని కుర్రును వృత్తిగా ఆంధ్రరాజుచేఁ బొందెనని చెప్ప బడినది. ఈ యాంధ్రరాజు చాళుక్యరాజేగాని యన్యుఁడు గాడు. పండరాజునకు పరిచ్ఛేద బిరుదున్న ట్లాతని భీమేశ్వరాలయ శాసనము వల్లఁ దెలియుచున్నది. ఈ పరిచ్ఛేద వంశములోని అమలరాజను నతఁడు పూసపాటిలో నివసించుట వల్ల తద్వంశీకులు పూసపాటివారైనారని పూసపాటివారి (విజయనగరం గజపతులు) వంశావళి వలన స్పష్టపడుచున్నది. అచట నప్పుడు నివసించుచు వచ్చిన దుర్జయ వంశీకు లందఱును పూసపాటి గృహనామము ధరించి యుందురు. కమ్మవారిలో నిప్పుడు గల పూసపాటి వారీ తెగవారే యని వేఱుగ చెప్పనక్కఱ లేదు.

## —♦ నతవాటిసీమ రాజులు ♦—

దుర్జయ వంశములోని దుర్గరాజను నతఁడు 12వ శతాబ్దారంభమున నతవాటిసీమ నేలుచుండెను. ఈ సీమ యిప్పుడు నైజాం రాష్ట్రములోని మధిర జిల్లా యని చెప్పుదురు. మడపల్లియను దుర్గమీ రాజ్యమునకు రాజధాని. ఈ వంశీకులు కాకతీయ రాజులకు బంధువులుగా నుండిరి. దుర్గరాజు తరువాత నాతని కుమారుఁడగు బుద్ధరాజీ సీమను 12వ శతాబ్ద మధ్యమున పాలించెను. ఈ బుద్ధరాజు రెండవ కుమారుఁడగు రుద్రరాజునకు కాకతీయ చక్రవర్తి యగు మహాదేవరాజు కుమార్తె మేళమ్మ లేక మైలమ్మ నిచ్చి వివాహము గావించిరి.

## —♦ రుద్రరాజు ♦—

ఇతఁడు కొన్ని మండలముల కధీశ్వరుఁడై మహామండలేశ్వరుఁడని పేరొందెను. ఈయనకు "వక్కడిమల్ల, దొడ్డప్పారిగండ

భైరవుఁడు'' మున్నగు బిరుదులు గలవు. ఈయన కెనిమిదిమంది కుమాళ్ళును, బయ్యలదేవి యను కుమార్తెయు గలిగిరి. ఈ కుమార్తెను కోట కేతరాజు III న కిచ్చి వివాహ మొనర్చెను. ఈయనకు కుందాంబ యను మతియొక భార్య యున్నట్లును, ఆమె వలన మాధవరాజను కుమారుఁడు జనించినట్లును ముదునూరు శాసనము తెలుపుచున్నది. ఈ మాధవరాజునకు మహాదేవి యను సతీమణి గలదు. ముదునూరు శాసన మామె వ్రాయించినదే. రుద్రరాజు భార్య యగు మేళమ్మ త్రిపురాంతకములో మేళాంబి కేశ్వరుఁడను దేవుని బ్రతిష్ఠించి కొంతభూమిని దాన మొనర్చెను. ఈ వంశీకుల తరువాత విషయము తెలియరాదు.

## —♦ కోన కంద్రవాడి రాజులు ♦—

(సూర పోతరాజు, భీమరాజు)

12, 13 శతాబ్దములలో బెజవాడ రాజధానిగా 210 గ్రామములు కోన, కంద్రవాడి యను పేరున బరగుచుండెను. వానిని దుర్జయ వంశములోని పోత భూపాలుని వంశమువారు పాలించుచు, చాళుక్య రాజులకు సామంతులుగా నుండిరి. పోత భూపాలుని వంశమున వీరచోడ రాజును, ఆతనికి భీమరాజును, ఆతనికి చోడరాజును, ఆతనికి అయ్యమాంబ యందు సూరపోత రాజును జనించి యీ సీమకు పాలకులుగా నున్నట్లు గన్పడును. ఈ సూర పోత రాజునకు '' సమధిగత పంచమహా మండలేశ్వర, పరమమాహేశ్వర, విజయవాటికాపురేశ్వర, త్రిసప్తతి గ్రామాధీశ్వర, చాళుక్య కుల వల్లభ ప్రాసాదలబ్ధ రాజ్యపదవీ విరాజమాన, విక్రమభీమ, అభినవరామ, చాళుక్యకటక, వజ్రప్రాకార, పరాంగనాదూర, దాయవెన్నడ్డగుణ, రాచగుడియ, అరిగిరికులిశాయుధ, ధైర్య నాగేంద్ర, విభవమహేంద్ర, దుర్జయ కులార్జున, పరహితభాషణ, పతిహిత భూషణ, సాహస శూద్రక, వైరిరాజన్య ముఖముద్రిక, వానరాయతారకషడానన, ఈరుగమదేభపంచానన, వినోదవిద్యా

ధర, వీరవృకోదర, ఆంధ్రమండలమాణిక్య, యుపాయచాణుక్య, యుదారదధీచి, కాంచీసుధాగోచిచౌవ్రులిక సేనాంబుధర, ప్రళయ వాతూల శత్రుందిశిపాల, చీలదుర్గ నరేంద్రచూడా, పండియవినిర్జిత శౌచమహావ్రతాది'' బిరుదు లుండుటచే ప్రసిద్ధుఁడుగఁ గన్పడు చున్నాఁడు. ఇతఁడు శా. శ. 1157 వ సం॥లో బెజవాడలోని మల్లేశ్వరస్వామికి కొంత భూమి నొసంగెను. ఈ వంశములోని భీమరా జను నతఁడు సూరపోత రాజువలె బిరుదముల నన్నిఁటిని ధరించుచు నుండి శా. శ. 1135 వ సం॥లో శ్రీ మల్లేశ్వరస్వామికి 25 పాడి యావులను దాన మొసంగెను. వీ రిద్దఱకును గల సంబంధము తెలియుట లేదు. కాని తాతయు, మనుమఁడునై యుందురని యూహించఁదగి యున్నది.

ఈ భీమరాజు కుమార్తె పోతమదేవిని రాజరాజనరేంద్రుని సామంతులలో నొకఁడును మహామండలేశ్వరుఁడు నగు రాచూర దారపరాజు వివాహ మాడినట్లు కన్పడును. ఈమె శా. శ. 1088 వ సం॥లో శ్రీ భీమేశ్వర స్వామి కఖండ దీపదాన మొనర్చెను.

## —♦ ధరణికోట రాజులు ♦—

ధాన్యవతీ పుర మనియు, ధాన్యాంక పురమనియుఁ ధనకటక మనియుఁ బ్రసిద్ధి చెందిన ధరణికోట రాజులలోఁ గొందఱిని గుఱించి మొదటి భాగమునఁ జెప్పితిమి. అందు కోట రెండవగండ రాజునకు భూరమదేవి యను భార్య యున్నట్లు దెల్పితిమి. ఆతనికి వింజమదేవి యను మఱియొక భార్య యున్నట్లు కోటప్పకొండ శాసనమువల్లఁ దెలియు చున్నది. గండభూపతి కుమారుఁడగు కోట ముమ్మడిదేవ రాజు శాసన మొకటి శా.శ. 1133వ సం॥ నాఁటిది ఇప్పటము గ్రామములో శ్రీ మల్లేశ్వరాలయమున గలదు. దానిలోఁ గొందఱు బ్రాహ్మణుల కతఁడు దానమిచ్చిన ట్లున్నది. ఈ ముమ్మడిదేవరాజే కోట గండరాజు కుమారుఁ డగు ముమ్మడి భీముఁడా యని సందేహించ వలసి యున్నది. ఈయనను గుఱించి మొదటి భాగమునఁ దెలిపితిమి.

కోట రెండవగండరాజు తర్వాత నతని కుమారుఁడగు భీమ రాజు పాలించినట్లు గన్పడును. ఈభీమరాజు తర్వాత నతనికుమారుఁడగు కోటబేతరాజు I, 12 వ శతాబ్దమున ధరణికోటను పాలించుచుండెను. వీరి చరిత్రా వివరము లేమియు మనకుఁ దెలియుటలేదు.

## —• కోట భీమరాజు III •—

కోట కేతరాజు I నకు సబ్బముదేవియం దితఁడు జన్మించెను. ఈ సబ్బముదేవి వెలనాఁటి ప్రభు వగు రెండవ గొంకరాజు తోఁబుట్టువు. ఈయన కాలములో బుద్ధారాధన లింకను గలవు. ఈయనకు రెండవ కేతరాజు, చోడరాజు నను నిర్వురు కుమాళ్లు జనించిరి. చోడరాజు వింజమదేవిని పెండ్లాడెను. ఈయన చరిత్ర లభ్యమగుట లేదు. కాని యీయనకు ముమ్మడిపోతరాజు, రాజయ్య యను నిర్వురు కుమాళ్ళున్నట్లు గన్పడును. భీమరా జనంతరము రెండవ కేతరాజే క్రీ. శ. 1182 వ సం॥లో ధరణికోట సింహాసనమునకు వచ్చినట్లాధారములు లభించుచున్నవి.

## —• కోట కేతరాజు II •—

చాళుక్య చక్రవర్తి ప్రతినిధి యగు వెలనాఁటి గొంకరాజునకు మేనల్లుఁ డగుటచే నాతని సామంతులలో నీ కేతరాజు ప్రసిద్ధి వహించెను.

ఈయనకు "చతుస్సముద్రముద్రితనిఖిల వసుంధరా పరిపాలక, శ్రీమత్త్రినయన పల్లవ ప్రసాదాసాదిత కృష్ణవేణీదక్షిణ సహస్రావనీవల్లభ, భయలోభ దుర్లభ, చోళచాళుక్య సామంత మదానేకప మృగేంద్ర, విభవామరేంద్ర, శ్రీమదమరేశ్వర దేవ దివ్యశ్రీ పద పద్మారాధక, పరబలసాధక, శ్రీధాన్య కటక పురవరాధీశ్వర, ప్రతాపలంకేశ్వర, కళగళమోళడక్కె, బెట్టరగవక్కె, గండరగండ, గండభేరుండ, జగమెచ్చుగండ, నన్నిమార్తాండ" మున్నగు బిరుదములున్నను యీతఁడు నిజముగా పాలించినది మాత్రము యే రెండు

మూఁడు నందల గ్రామములోనై యుండును. ఈయన బ్రాహ్మణులను పోషించుచు కాకొల్లు, జింజిపాడు, చల్లగర, తాడువాయి యను గ్రామముల నగ్రహారములుగాఁ జేసి తన తల్లిదండ్రుల పుణ్యమునకై ధారవోసెను. ఇతఁడు బౌద్ధ ధర్మాసక్తుఁడు గూడ నై యుండుటచే బుద్ధదేవునకు శా. శ. 1104 వ సం॥లో కంతేరు, మేడికొండూరు, డోంకిపఱ్ఱను గ్రామముల నిచ్చెను. అమరేశ్వరస్వామి కితఁ డఖండ దీపదానము గావించెను. బ్రాహ్మణుల కగ్రహారముల నిచ్చుటలో నితఁడు ప్రసిద్ధి వహించెను. ఇతని యగ్రసోదరుని పుణ్యమునకై అమ్మలపూడి యను నగ్రహారమును, తనకు పుణ్యమునకై కుంటిమడ్డి, ఉప్పలపాడు, సత్తెనపల్లి, చింతపల్లి, కేతపల్లి, ఎఱ్ఱగుంట ఒంకదొన గ్రామములను అగ్రహారములుగా బ్రాహ్మణోత్తముల కొసంగెను. ఈయనవద్ద రాయసారి పూర్వశాసనుఁడును, భారద్వాజగోత్రీకుఁడునగు అప్పన పెద్దియను స్తోత్రబ్రాహ్మణుఁ డుండెనఁట. ఈయనకు వింజమ, సబ్బమ, పార్వతి, నాగమ, కొమరమ దేవులను భార్యలును, కసవదేవి చోడమదేవి భండారువు నాగమదేవి యను భోగస్త్రీలును ఉండిరి. వీరందరును శా. శ. 1119 వ సం॥ లో శ్రీ అమరేశ్వర స్వామి కఖండ దీపదానములు గావించిరి. ఈయన పల్నాటి యుద్ధకాలములో నొక రాయబారిగాఁ బోయి యుండె నని పల్నాటి వీరచరిత్రను బట్టి తెలియుచున్నది. ఈయనకు రుద్రరాజు, భీమరాజు అను నిర్వురు కుమారుళ్ళు జనించి తండ్రి యనంతరము ధరణికోటను బాలించినట్లు కన్పడుచున్నది.

## —♦ కోట రుద్రరాజు ♦—

ఈయన పాలనా విశేషములు తెలియుట లేదు. యనమదల శాసనము ప్రకారం మీాయన భార్య పేరు పండాంబ యనియు, కుమారుని పేరు బేతరాజనియుఁ దెలియుచున్నది. ఈ బేతరాజున కితఁడు కాకతీయ గణపతిదేవ చక్రవర్తి రెండవ కుమార్తె యగు గణపాంబను దెచ్చి వివాహము గావించెను. ఈ సంబంధమువల్లను

చాళుక్యులయొక్కయు వెలనాటి రాజులయొక్కయు ప్రభ తగ్గిన కొలఁదిని కోటరాజులు కాకతీయులకు సామంతులై పోయిరి.

## —♦ కోట బేతరాజు, గణపాంబ ♦—

కోట రుద్రరాజు కుమారుఁ డగు బేతరాజు కాకతి గణపతి దేవచక్రవర్తి యొనర్చిన దిగ్విజయ యాత్రలలోఁ బాల్గొనుచు వచ్చెను. అంతిమఁడు మరణించుటవల్ల కాఁబోలు ఈయన తరువాత నీయన భార్యయగు గణపాంబయే చాలకాలము ధరణికోట నేలి మిక్కిలి ప్రసిద్ధి వహించెను. ఈమె శాసనములు క్రీ.శ. 1274 వ సం॥ వరకుఁ గన్పడుచున్నవి. కాకతీయ రుద్రమదేవియు నీమెయు సమకాలికులు. ఈమె చాల ధర్మకార్యము లొనర్చెను. ఈమె తన భర్త పేరిట బేతేశ్వరాలయ మొకటి గట్టించి దీనికి చెనదేవి యను గ్రామము నొసంగెను. తన తండ్రి పేరిట గణపేశ్వరాలయ మొకటి కట్టించి దానికి చింతిపా డను గ్రామమొసంగెను.

అమరేశ్వరస్వామి కీ యిల్లాలు గోపురముమీఁద సువర్ణకలశములు స్థాపించెను. క్రీ. శ. 1241వ సం॥లో రెడ్డినాయుఁడులు కొందఱు కట్టించిన రుద్రేశ్వరాలయమునకుఁ గూడఁ గొంతభూమి నొసంగెను. యనమదల గ్రామములోని శ్రీ గోపీనాథస్వామికి పూఁదోటయు, గానుగ యొకటియు, వివాహ సుంకములును శా.శ. 1183 వ సం॥లో దానమిచ్చి శాసనము వ్రాయించెను.

ఈయమ రాజ్యపాలనకు వెనీసువాస్తవ్యుఁ డగు మార్కొ-పోలో మెచ్చుకొని వ్రాసిన సువర్ణాక్షరము లింకను చరిత్రలలో మెఱయుచున్నవి.

## —♦ కోట కేతరాజు III -గణపతిదేవరాజులు ♦—

కోటభీమరాజు III కుమారుఁ డగు మూఁడవ కేతరాజు 13 వ శతాబ్దప్రారంభమున ధరణికోట రాజ్యములోఁ గొంత భాగమును బాలించుచు వచ్చెను. ఈయనకు బయ్యలదేవి యను భార్య

గలదు. ఈమె నతవాటిసీమ రాజగు రుద్రరాజు కుమార్తె. ఈ బయ్యాలదేవి తల్లి కాకతి గణపతిదేవ చక్రవర్తి తోఁబుట్టు వగు మైలమ్మ. బయ్యాలదేవి క్రీ.శ. 1234వ సం॥లో బుద్ధదేవుని కఖండ దీపదానము గావించెను. అప్పటివరకు బౌద్ధారాధన లుండె నని స్పష్టపడుచున్నది.

బయ్యాలదేవి వలన కేతరాజునకు గణపతి దేవరాజు, భీమరాజను కుమారులు గలిగిరి. గణపతిదేవరాజు క్రీ. శ. 1234వ సం॥లో రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు శా. శ. 1180వ సం॥లో నాదెండ్ల లోని కేశవస్వామికి కొంత భూదానమును, సుంకములును యిచ్చి శాసనము వ్రాయించెను.

కోటమన్మగణపద్దేవరాజు భార్య పోతులదేవమ్మ శ్రీకాకొలని శ్రీ వల్లభస్వామి కఖండ దీపదాన మొసర్చెను. ఆమెయే యీ గణపతిరాజు భార్యయై యుండును.

కోటవారిలో తర్వాతవారి చరిత్రము బాగుగాఁ దెలియరాదు. కాని మూర్తిత్రయోపాఖ్యానమను గ్రంథమును కృతిఁబొందిన దంతులూరి గన్న భూపాలుఁ డీ కోట వంశీకుఁడే యనియు నితఁడు క్రీ.శ. 1400 వ సం॥ర ప్రాంతమున ధరణికోటఁ బాలించు చుండె ననియు, నాతనికి పూర్వులలో హరికృష్ణుఁడను పాలకుఁ డుండె ననియు నా గ్రంథమువల్లఁ దెలియుచున్నది. ఈ గన్న భూపాలుని పుత్రియగు సూరాంబ పెదకోమటి వేమారెడ్డిని పెండ్లాడి క్రీ.శ. 1410వ సం॥లో సంతానసాగర మను చెర్వును త్రవ్వించినట్లు ఫిరంగిపుర శాసనము వచించుచున్నది. కోటవారిలో కొందఱు దంతులూరివారుగా మారి పోయినట్లు మూర్తిత్రయోపాఖ్యానమును బట్టి తెలియనగును. ఈ దంతులూరివారు నేఁటి యాంధ్రక్షత్రియులలో నున్నారు. కోట వారు కమ్మవారిలో నున్నారు. ఆంధ్ర క్షత్రియులలోను కమ్మవారి లోను గల జంపనివారు గూడ యీ వంశీకు లనియే ప్రథమభాగమున నుడివితిమి. ఇట్లు కోట వారాంధ్ర క్షత్రియులలోను, కమ్మవారి

లోను ఉండి యాకాలమున రెడ్డి ప్రభువుల సంబంధములను జేయుచున్నట్లు స్పష్టపడు చున్నది.

## —♦ సాగి ప్రభువులు-హైహయ వంశజులు* ♦—

### సాగి బేతరాజు II, రాజరాజులు

పల్నాటిలో పాలించిన హైహయవంశజుల చరిత్ర క్రీ. శ. 1111 వ సం॥ వరకు మొదటి భాగమునఁ జెప్పఁబడినది. తర్వాత వృత్తాంత మరయుదము. పల్నాటి రాజగు వీరకామునకు నల్వురు కుమారు లుండిరి. జ్యేష్ఠుఁడు రాజరాజనియు, రెండవవాఁడు సాగి బేతరాజనియుఁ దెలియుచున్నది; గాని తక్కినవారి పేర్లు తెలియవు. ఈ యిర్వురును పలనాటిసీమను కలిసియే పాలించుచు వచ్చిరి. వీరు పశ్చిమ చాళుక్యరాజగు భూలోకమల్లు చక్రవర్తికి సామంతులుగా నుండిరి. బేతరాజునకు బిరుదాంక రుద్ర బిరుదము గలదు. ఈ యిర్వుర పేర్లు భృగుబండలో శా.శ. 1040వ సం॥నాఁటి యొక శాసనములో వ్రాయఁబడినవి.

బేతరాజునకు రాజధాని మాచెర్ల. దీనినే గురివింద స్థలమనియు, మాధవీపట్టణ మనియు నాకాలమునఁ బేర్కొనుచుండిరి. శా.శ. 1051వ సం॥ నాఁటి శాసన మొకటి యచటఁ గల వీరభద్రేశ్వరాలయమున నున్నది. దీనిలో బేతరాజు భూలోక మల్లుని (మూఁడవ సోమేశ్వరుఁడు) సామంతుఁడని పేర్కొనఁ బడినది. దీనిని బట్టి తూర్పు చాళుక్య చక్రవర్తి యగు కులోత్తుంగుని పాలన చివరలోఁ గాని, తర్వాత కాలములోఁ గాని సోమేశ్వరుఁడు కొంత దేశమాక్రమింపఁగా నీ బేతరాజాయనకు సామంతుఁడైనట్లు కన్పడును. ఈయన క్రీ. శ. 1130 వ సం॥ వరకు పాలించె ననియుఁ దర్వాత జరిగిన యుద్ధములలో మరణించె ననియుఁ జరిత్రజ్ఞు లభిప్రాయపడిరి.

ఈయన యచటి త్రిమూర్తి దేవాలయమునకు కొంతభూమిని ఆదిత్యేశ్వరాలయమునకుఁ గొంత భూమిని దాన మొసంగి శాసన

* Fallowed J. A. H. R. S. Vol XII.

ములు లిఖించెను. ఈయనకు సుందర చక్రవర్తి యను కుమారుఁడుండెను. కాని యితఁడు తర్వాత రాజు కాలేదు. కారణము స్పష్టపడుట లేదు. వెలనాటి రాజు లాతనిని తొలఁగించిరేమో యని యొక యభిప్రాయము కలదు.

## —♦ అనుగురాజు ♦—

ఈయన గురజాల రాజధానిగా పలనాటిని పాలించెను. రెండవ బేతరాజు తర్వాత యితని పాలనమే కన్పడుచున్నది; గాని వీరిర్వురకుఁ గల బంధుత్వము తెలియుట లేదు. అనుగురాజు బాలమాచాపురి యను పేరిటఁగల జంభనాపురము నుండి నూతనముగా వచ్చెనఁట. ఇతఁడు వెలనాఁటి రెండవ గొంకరాజు కన్య మైలమదేవిని వివాహ మాడెనఁట. అప్పటికి పశ్చిమ చాళుక్యరాజు మఱల జయింపఁబడి, పల్నాటి రాజ్యము తూర్పు చాళుక్య రాజప్రతినిధి యగు నీ గొంకరాజునకు లోఁబడిపోవుటచే నాతఁ డీ యనుగు రాజునకు దాని నరణముగా నిచ్చెను. శ్రీనాథకవి రచితమగు పల్నాటివీర చరిత్రవలన వీరి విషయము తెలియుచున్నది.

అనుగురాజునకు మైలమదేవియు, వీరవిద్యాదేవి యనఁబడు విజ్జలదేవియు, భూరమాదేవియు నను మువ్వురు భార్య లుండిరి. వీరిలో మైలమదేవివలన నలగామరాజును; వీరవిద్యాదేవి వలన పెదమల్లి దేవుఁడు, పినమల్లి దేవుఁడు, బాలమల్లిదేవుఁడు నను వారును; భూరమా దేవి వలన యరకామరాజు, ఝట్టిరాజు, పెరుమాళ్ళ రాజు నను కుమాళ్ళు నుదయించిరి. ఈ సంతతి కలుగక పూర్వ మనుగురాజు తన మంత్రియగు రేచెర్ల దొడ్డనాయని కొడుకు బాదన్నను పెంచెనఁట. పెద్దనాయఁడు తక్కువ వంశమువాఁ డని తలఁపఁబడుటచే రాజ కుటుంబములలోనివా రెవ్వరు పిల్ల నియ్యకపోయినందున తుద కొక తంత్రముచే కంచెర్ల నగరాధిపతి యగు కృష్ణగంధర్వుని కుమార్తె ముక్తలవాంబను వివాహ మొనర్చిరి. ఇతనికి హయారూఢ రేవంతుఁ డను బిరుదుండెను.

అనుగురాజు కాలములో నర్లకొండ ప్రభువునకును అనుగు రాజునకొక యుద్ధము గల్గెను. దాని కీతనిమంత్రి యగు దొడ్డనాయఁడును, సేనానియగు తెప్పిలినాయఁడును పంపఁబడిరి. వారు నర్లకొండ ప్రభువు నోడించి యాతని పట్టణమును దోచి విజయులైవచ్చిరి.

అనుగురాజునకు కుమాళ్లు గలిగిన పిమ్మట దొడ్డ నాయనికి తన కుమారుఁడు రాజు కాడని దిగులు గల్గి లోన. కాపట్యము వహించినట్లు తోఁచును. దీనిని గనుపెట్టి నట్టియు, చౌదరి రామిరెడ్డి యను వాని పెంపుడు కుమార్తె యైనట్టియు నాగమ్మ యను నాయకురాలు క్రమముగా ననుగు రాజున కెఱుకయై యా సంగతులు నివేదించి యనుగురాజునకును మంత్రికిని మనస్పర్థలు గలిగించెను.

దొడ్డనాయఁడు మంత్రిపదవిని వదలిపెట్టవలసి వచ్చెను. కాని యాతని రెండవకుమారుఁ డగు బ్రహ్మనాయని కీఁబడెను. కాని యీతఁడు గూడ తనకా రాజ్యముదక్క లేదను యీర్ష్యలోన నుంచుకొని తుద కెట్లో నలుగురాజును చంపించెను.

## —♦ నలగామరాజు ♦—

అలుగు రాజు తర్వాత నతని జ్యేష్ఠకుమారుఁడగు నలగాముఁడు రాజయ్యెను. కాని యితఁడు బ్రహ్మనాయని మంత్రి పదవి నుండి తప్పింపలేక పోయెను. దేశములో నతని పలుకుబడి యుండెను. తరువాత కొంతకాలమున కాతని దప్పించు నవకాశము దొరకెను. నలగాముఁడు తన సవతి తల్లి కుమాళ్ళకు కొంత రాజ్య మీయవలసి వచ్చెను. బ్రహ్మనాయఁడు చెప్పినటుల వారికి మాచెర్ల వంతు (చంద్రవంక నది యొడ్డున) నీయక తప్పలేదు. బ్రహ్మనాయనిఁ దొలఁగించుటకిదే సమయమని నాయకురాలుచే ప్రోత్సహింపఁబడి యాతఁడు పెదమల్లి దేవాదులకు పోషకునిగా బ్రహ్మనాయని యేర్పరచెను. దాని కతఁ డంగీకరించెను.

పెదమల్లి దేవుఁడు కళ్యాణిలోని కాలచుర్య వంశీకుఁడును, బిజ్జలుని కుమారుఁడు నగు రాయమురారి సోవిదేవుని (క్రీ. శ. 1167-77) కుమార్తెను పెండ్లాడి కొంత పలుకుబడి సంపాదించెను.

నాయకురాలు నలగామరాజునకు ప్రధానివలె మెలంగుచు బ్రహ్మనాయుఁడు మల్లిదేవాదులకడ గడు వైభవముతో నున్నాఁడని విని వానిపై నీర్ష్య వహించి, తుదకు కోడిపందెములఁ గల్పించి మల్లిదేవాదుల పక్షమున బ్రహ్మనాయని రప్పించి, దానిలో నోడినవారు రాజ్యమును వదలి యేడు సం॥ లు కృష్ణదాటి ప్రవాసము సలుపవలె నని పందె మొడ్డించి బ్రహ్మనాయనిచే నంగీకరింపఁ జేసెను.

మల్లిదేవాదుల పక్షమున బ్రహ్మనాయఁడం దోడిపోయి వారినిఁ దోడ్కొని మందాడివద్ద నరణ్యవాసము సలుపఁజొచ్చెను. ఈ ప్రవాసమైన పిదప బ్రహ్మనాయఁడు వీరమేడపి యను పట్టణమునకు వచ్చి మాకరాజను వానివద్ద 23 గ్రామముల నిజారాకుఁబడసి కొంత పలుకుబడి సంపాదించుకొనెను. తరువాత నలగామరాజున కల్లుఁ డగు రాచమల్లుని ద్వారా రాయబారమంపి మాచెర్ల భాగము మరల నీయఁ గోరెను.

నాయకురా లా రాయబార మంగీకరింప నీయక, రాయబారి యగు రాచమల్లుని విష ప్రయోగముచే జంపించెను. అదియే నిరువాగుల వారికిని యుద్ధకారణ మయ్యెను.

క్రీ. శ. 1184 వ సం॥ ప్రాంతములో నిరువాగుల వారికిని ఘోర యుద్ధము జరిగెను. ఈ లోపలనే మఱియొక రాయబారము కోట రెండవ కేతరాజొనర్చెను; గాని తుదకది బ్రహ్మనాయని కుమారుఁ డగు బాలనాయనిచే విఫల మయ్యెను.

ఈ యుద్ధమున నతవాటి సీమ పాలకుఁ డగు సాగి పోతరాజును, హొయిసలరా జగు రెండవ వీర బల్లాలుఁడును, వెలనాటి రాజేంద్ర చోడుఁడును, మొదటి ప్రతాపరుద్ర చక్రవర్తియుఁ దమకుఁ దోఁచినట్లు సాయపడిరి.

ఈ యుద్ధమున 65 మంది వీరనాయకులు మరణించిరఁట. మల్లిదేవుని బావమరఁదియు, కాలచుర్య వంశీకుఁడు నగు కొమ్మరాజు, నరసింగరాజు మున్నగు వారును, మల్లి దేవాదులును చని పోయిరి. తుదకు నాయకురాలు యుద్ధములో బ్రహ్మనాయనిచేఁ జిక్కెను. నలగామ రాజు చేయునది లేక బ్రహ్మనాయనికి లోఁబడి పోయెనఁట. బ్రహ్మనాయఁడు గూడ మల్లి దేవాదులు మరణించుటచే చివరకు మరల నలగామ రాజునే రాజ్యమంతటికిని పునరభిషిక్తునిఁ గావించె నఁట. ఈ కథ యంతయు పల్నాటి వీరచరిత్రమునందు దత్యద్భుతముగ శ్రీనాథ మహాకవి వర్ణించి యున్నాఁడు.

నలగామ రాజసంతతి మీఁద రాజ్యము కాకతీయ గణపతి దేవ చక్రవర్తి జయించి తన రాజ్యములోఁ గలుపుకొనెను. ఆ కాలమున నీ వంశీకుల వివరము తెలియకపడుట లేదు. కాని గణపతి దేవుని కుమార్తె యగు రుద్రమదేవి కాలములో నీ సాగి వంశము లోని నాగ భూపాలుఁ డను నతఁడు ప్రసిద్ధికి వచ్చి పాకనాఁటి సీమ కధిపతిగా నున్నట్లు కన్పడు చున్నది. ఈయన చరిత్ర ముందు పుటలలో నున్నది.

వెలనాటి రాజ సంబంధము లొనర్చిన పిమ్మట నీ శాఖ వారు చతుర్థాన్వయులుగా వ్యవహరించిరి. కాని నతవాటి సీమ పాలించినవారు మాత్రము దుర్జయ వంశీకులమనియు క్షత్రియుల మనియు జెప్పుకొను చుండిరి. ఆ వంశీకులే నేఁటి యాంధ్రక్షత్రియుల లోని సాగివారును, వత్సవాయవారు నైనట్లు నిదర్శనములు గలవు.

## —♦ హైహయుల పూర్వ వృత్తాంతము ♦—

ఈ హైహయ వంశీకుల పూర్వ చారిత్రము గొంత మొదటి భాగమున నుడివితిమి. నూతనముగా లభించిన వారి చరిత్రము మఱి కొంత యిచట వివరించెదము.

ఈ హైహయ వంశములో కృష్ణరాజు కుమారుఁడగు శంకర గుణుఁడు 6 వ శతాబ్దిలో పాలించిన తర్వాత నతని కుమారుఁడగు

బుద్ధవర్మ పాలించెను. ఈ బుద్ధవర్మను బాదామి చాళుక్య రాజగు మంగళేశుఁడు జయించె నని బీజపూరు శాసనము తెలుపుచున్నది. ఈ బుద్ధవర్మ విదిశాపురి రాజధానిగా నేలెను. ఇది యిప్పటి బీశ నగర్ అనునదై యున్నది. బుద్ధవర్మ సంతతియే క్రమముగా ఆంధ్ర దేశమునకు వలస వచ్చుట కారంభించి యుండవచ్చు నని తోఁచు చున్నది.

త్రిపురి రాజధానిగా నీ వంశములో కోకల్లరాజు క్రీ. శ. 875 వ సం॥ర ప్రాంతములో పాలించుచు వచ్చెను. ఈయనకు 18 మంది కుమాళ్లు కల్గిరి. అం దొకఁడు రత్నపుర పాలకుఁ డగు తుమ్మాన రాజునకు దత్తుఁడై యాయన వంశ మచట విస్తరించినట్లు కన్పడుచున్నది.

మహాకోసల దేశ మను భాగమును పాలించిన వారిలో గంగాయదేవుని వంశీకుల కొందఱి నాణెములు పరిశోధన శాఖవారికి లభించెను. ఆ నాణెములలో బంగారు, వెండి, రాగి నాణెము లుండెను♦. క్రీ. శ. 1140-60 సం॥ ల మధ్య పృథ్వీదేవుఁ డను నతఁడును, తర్వాత 1160-75 సం॥ల మధ్య జజ్జలదేవుఁ డను నతఁడును, తర్వాత 1175-90 సం॥ల మధ్య మూఁడవ రత్నదేవుఁడును తర్వాత 1200-14వ సం॥ల ప్రాంతములో ప్రతాపమల్లిదేవుఁ డను నతఁడును బాలించుచు వచ్చినట్లు చరిత్రజ్ఞులు నిర్ణయించిరి. ఇందలి జజ్జలదేవుఁడు, జెజెకభుక్తి, కన్యాజ, చేదిరాజులను జయించినట్లొక శాసనము తెలుపుచున్నది. ప్రతాపమల్లదేవుని శాసన మొకటి రాయపూరు జిల్లా పెండ్రబంధు గ్రామంలోను, ఈయన నాణెములు విలాసపూరు జిల్లాలో బోల్పూరులోను దొరకినవి.

మొదటి భాగమున వ్రాసి నట్లీ హైహయులు క్రమముగా నాంధ్రభూమికి వలసవచ్చి, పలనాఁడు, కోనసీమ, గుడిమెట్ట సీమలలో స్థావరము లేర్పఱచుకొనిరి.

---

♦ See J. A. H. R. S. Vol. XII.

ఈ హైహయ వంశములోని సాగివారిలో నొక తెగవారు కాకతి గణపతిదేవచక్రవర్తి కడ సైన్యాధిపతులుగ బేరువహించి నట్లు కన్పడు చున్నది.

## —♦ సాగి నాగభూపాలుడు ♦—

విప్పర్ల గోత్రీకుడును, నాగదేవుడను నామాంతరము గల యీ సాగి నాగభూపతి పాకనాటిసీమ కధిపతిగా గణపతిదేవచక్రవర్తి చివరికాలములోను, రుద్రమదేవి కాలములోను ఉండెను. ఈ నాగదేవుని తండ్రి మల్లచమూపతి యనియు దల్లి పోలాంబ యనియు మారనకవి రచితమగు మార్కండేయ పురాణములోని యీ క్రింది పద్యము స్పష్టపరచు చున్నది.

సీ. ఆచతుర్థకుల సు ♦ ధాంబుధి నుదయించె
నమిత కాంతి చంద్రుడ ♦ డవని భరణ
దిగ్గజేంద్రమును వి ♦ తీర్ణ మందారంబు
మల్లసైన్య విభుడు ♦ మహితకీర్తి॥"

ఈ సాగివారు గూడ శైవమతము బుచ్చుకొనిన పిమ్మట చతుర్థుల మనిగా చెప్పుకొన్నట్లీ పద్యమువలన నేగ్రహింపగలము.

ఈతడు గణపతిదేవ చక్రవర్తి కడ తలవరి యుద్యోగమున నుండిన మేచయ నాయకుని కుమార్తె మల్లమాంబికను పరిణయ మాడి గన్నమనాయుడు, ఎల్లయనాయుడు, మేచయనాయుడను కుమాళ్ళను గాంచెను.

## —♦ సాగి గన్నమంత్రి ♦—

నాగభూపాలుని పుత్రుడగు నీతడు కాకతీయ వీరప్రతాప రుద్ర చక్రవర్తి కడ సేనానిగను, మంత్రిగను మెలంగెను. ఈయనకే నీతి యుగంధరుడను పేరుండెను. ఈయన మారనయను కవీశ్వరునిచే మార్కండేయ పురాణమును తెనిగింపజేసి దానికి కృతి భర్త యయ్యెను. అందీతడిట్లు వర్ణింపబడి యుండెను.

చ॥ ఎలమిఁ బ్రతాపరుద్ర మను ♦ జేంద్రునిచేఁ బడసెం బ్రవీణుఁడై
కొలిచియు శౌర్యలీల రిపు ♦ కోటి రణావని గీటడంచియున్
బలరిపుతుల్య విక్రముఁడు ♦ నాగయగన్న విభుండు తేజమున్
విలసిత రాజ్య చిహ్నములు ♦ విశ్రుత లక్ష్మియు నాయకత్వమున్

ఇతఁడు కటకము(ధాన్యకటకముఁ గాఁబోలు) పాలించుచు వచ్చినట్లు మార్కండేయ పురాణములోని 'కాకతి క్ష్మాతలాధీశ కటకపాలుఁ' డను పద్యభాగము వల్లఁ దెలియుచున్నది. ఈతఁడు మిక్కిలి ధర్మాత్ముఁ డనియు బంధుమిత్ర వర్గమునకుఁ గల్పతరు వనియు ప్రతాపరుద్రదేవ సామ్రాజ్య వర్ధన స్థిరవిస్తృతి కరణ కుశలుఁ డనియు నా గ్రంథమున వర్ణింపఁబడెను.

ఇట్టి సత్కీర్తి కామునకు బైచరాజు, దేవరి నాయనింగారలను కుమారులు జనించిరి. ఈ గన్న మంత్రి ప్రతాపరుద్ర చక్రవర్తి పాలనలో మిక్కిలి ప్రసిద్ధి వహించియుండెను. ఓరుగల్లుపైకి తురుష్కు లనేక దండ యాత్రలు గావించుచున్నను, యితని మంత్రాంగమువల్ల నారాజ్యము చెక్కు చెదరకయుండెను. కాని తుదిసారి తురుష్కులతో జరిగిన యుద్ధమున ప్రతాపరుద్ర చక్రవర్తి యోడిపోయి వారిచే పట్టుకొనఁబడి నపుడితఁడుగూడ పట్టుకొని పోఁబడి బలాత్కారముననో యిచ్ఛాపూర్వకముగనో మహమ్మదీయ మత మవలంబించెనఁట. తర్వాత నితఁడు మల్లికు మక్బూల్ అను పేరు వహించి, ఉలూఫ్‌ఖాను సుల్తాన్ మహమ్మ దను పేరిట ఢిల్లీ ప్రభువైన పిమ్మట నాతనివద్ద ముల్తాను పాలకుఁడుగా నుండెను. పిమ్మట క్రీ. శ. 1334 వ సం॥లో కాఁబోలు మఱల తెలింగానా దేశమునకు పాలకుఁడుగా నియమింపఁబడెను. అప్పుడచటి హిందువులు మహమ్మదీయులలోఁ జేరిన యీతని పాలన మంగీకరింపక రెడ్డి వీరుఁడగు కాపయనాయకుని నాయకత్వమున యుద్ధ మారంభింపఁగా నోడి యతఁడు ఢిల్లీకి మరలిపోయెను. కాపయనాయకుఁడు హిందూరాజ్య సురత్రాణుఁ డయ్యెను. తర్వాత గన్న మంత్రి గుజరాతు దేశ పాలకుఁ డయ్యెను. ఢిల్లీ సుల్తానురాజ్య రక్షణకై యేర్ప

ఆచిన మంత్రాంగ సభయం దీతఁ డొక సభ్యుఁడుగా నుండెను. సుల్తాను మహమ్మదు చనిపోయిన తర్వాత నితఁడు ఫిరోజిషా సుల్తాను వద్ద పనిచేసెను. అప్పు డీయనకు ఖానిజహాన్ అను బిరుదు నొసంగి దన ప్రధాన మంత్రిగఁ జేసికొనెను. ఈ సుల్తాను దూర దేశముల కేగునప్పుడెల్లను రాజ్యభార మీతని పరముగా నప్పగింపఁ బడుచుండెను. ఇతఁ డేమతములోఁ జేరియున్నను, యీయన సమరతా. పాలనము గుర్తింపఁదగినది. ఈయన క్రీ. శ. 1372 వ సం॥ ప్రాంతములోఁ చనిపోయినట్లు కనుపడుచున్నది*.

## —♦ సాగి బైచరాజు ♦—

పైన నుడివిన గన్నమంత్రి కుమారుళ్ళలో నొకఁడగు నీయన గూడ ప్రతాపరుద్ర చక్రవర్తి కడ మిక్కిలి ప్రసిద్ధిగల వీర శిఖామణి. ఈయన పేరిఁట గల చాటువులను బట్టి యితఁడు కందుకూరు వద్ద జరిగిన యుద్ధములలో ఘూన మల్క లను గెల్చెననియు, తిరువత్తి వద్ద యుద్ధస్థల మీతని వేట పొలముగా నుండెననియు. నితనికి ''మానగోవిందరాయ రాయరాహుత్తమిండ, పులియ మారొక్కలుగండ, గండభేరుండ, బల్ల సురత్రాణ'' యను బిరుదము లున్నట్లును తెలియుచున్నది. ఇందలి గండభేరుండ బిరుదము పట్టిన వెల్లంకులను రణమున విరుగఁ బొడిచి పారద్రోలినందునను, బల్ల సురత్రాణ బిరుదము సెట్టిపల్లి రాఘవుఁ డను వానిని చేతి దెబ్బతోనే యణఁచి నందునను లభించెనఁట. ఈ సాగి వంశీకులు విప్పర్ల గోత్రీకులని యీతని పేరిఁట గల యీ క్రింది చాటువు గూడ దృఢ పఱచుచున్నది.

''మ॥ ఘను విప్పర్ల కులాధిపుల్ బిరుదులే ♦ మో మాటలే గాని బెం
పునఁ బెంపాలర మానసంబలర నే ♦ పారం జెఱన్ బెట్టి నా
వనఘా, గన్నయ సాగిబైచ, పటుబా ♦ హాశక్తి వెల్లంకి మా
దనియా రాముని బట్టి కాచితి మహో ♦ ద్దామప్రతాపోన్నతిన్.''

* భారతి సంపు 16 - సం 2 చూడుఁడు.

ఈతఁడు గూడ చివరకు తన తండ్రితోసహా మహమ్మదీయ మతమునఁ బ్రవేశించి యాతని మరణానంతర మా ఫిరోజిషా సుల్తాను వద్దనే యొక పాలకుఁడుగా నున్నట్లు కన్పడు చున్నది. ఈతని సోదరుఁ డగు దేవరి నాయునింగారు పలనాఁటిలో చక్రవర్తి ప్రతినిధి పాలకుఁడుగా నున్నట్లు తెలియు చున్నది.

## —♦ సాగి యెల్లయ నాయకుఁడు ♦—

గన్నమంత్రి జ్యేష్ఠ సోదరుఁ డగు నీతఁడు గూడ వీరప్రతాప రుద్ర చక్రవర్తి కడ నొక సేనాధిపతిగ నుండి పేరొందెను. ఇతని నా కాలపు కవీశ్వరులు "ఉన్మద పరిపంథి సింధుర సమాజ విదారణ సింహ "మని కొనియాడుచు వచ్చినట్లు మార్కండేయ పురాణములోని వర్ణనలను బట్టి విశదపడు చున్నది. దీనిని బట్టియే యాతని ప్రతాప మూహింప వచ్చును.

## —♦ సాగి మేచయ నాయకుఁడు ♦—

సాగి గన్నమంత్రికి రెండవ తమ్ముఁ డగు నీతఁడు గూడ చక్రవర్తి కడ నొక సేనాధిపతిగను, మహాధికారిగను బ్రసిద్ధి వహించెను. ఇతనిని గుఱించి మార్కండేయ పురాణమున నిట్లు గలదు.

"చ. నయవినయాభి రాముఁ డగు♦నాగయగన్నని మూర్తి తమ్ముఁడ
న్వయ నవరత్న దీపము ది ♦ వాకర తేజుఁడు రాజనీతి ని
శ్చయ నిపుణుండు నిర్మల ♦ విచార వివేక పరాయణుండు మే
చయ రథినీశుఁ డుజ్జ్వల యశ♦స్స్ఫురణంబొనగూడె నిద్ధరన్."

## —♦ మఱియొక మేచయ నాయకుఁడు ♦—

ఇతఁడు సాగి నాగ భూపాలునికి మామ. ఈయన గణపతి దేవ చక్రవర్తి కడఁ దలవరి యుద్యోగమున నున్నట్లును, మిక్కిలి ధర్మాత్ముఁ డనియు, నీతని కుమార్తె మల్లాంబనే నాగ భూపతి వివాహ మాడినట్లును మార్కండేయ పురాణము వచించు చున్నది.

## —♦ సాగిముప్పరాజు - దోరపరాజు ♦—

దుర్జయవంశములోనిదే యగు నీసాగివంశములో నొక తెగ వారు గుడిమెట్టసీమ రాజధానిగా నేలుచు వచ్చిరి. వీరు విప్పర్ల వంశీకు లనియే (గోత్రము కావచ్చును) అనుమంచిపల్లె శాసనము దెలుపు చున్నది. ఈ శాఖవారికి మూలపురుషుఁడు ముప్పరా జనియు, నాతనికి దోరరాజను కుమారుఁడు గల్గెననియు వీరిద్దరును రాజేంద్ర చోడ చక్రవర్తివలన ఘాలే, భేరి, శంఖ, ఆనక, కాహళములను పంచమహాశబ్ద గౌరవములను, అరయతా పట్టమును, స్వర్ణంపు పాల కియు, నక్షత్ర యుతాంబరముఁబోలు నుల్లెడయు, స్వేతచ్ఛత్రము, హేమ దండయుతచామరములను బొందినట్లు చరిత్రలు నుడువు చున్నవి. ముక్త్యాల లోని నాగుల బండమీఁదఁగల శాసనములో నీ వంశ వివరణము గలదు. ఇందలి దోరపరాజు భార్య బిమ్మాంబిక. ఈ దోరరాజునకు పోతరా జను కుమారుఁడును, భీమరా జను కుమా రుఁడును జనించినట్లు శా.శ. 1121 వ సం॥ లో సాగి రెండవ పోత రాజు వ్రాయించిన శాసనమును బట్టి విదితము.

## —♦ సాగి పోతరాజు I ♦—

సాగి దోరపరాజునకు బిమ్మాంబికయందు జనించిన యితఁడు తండ్రి యనంతరము గుడిమెట్టను పాలింప నారంభించి క్రీ.శ. 1180వ సం॥ వరకు పాలన మొనర్చినట్లు గన్పడుచున్నది. పల్నాటిసీమప్రభు వగు నలగామరాజునకు పల్నాటియుద్ధమున నితఁడు సహాయపడెను. ఈయనవద్ద కవలియు సింగనామాత్యుఁ డను మంత్రిపుంగవుఁడుండెను. ఈ పోతరాజు సత్య త్యాగ శౌర్యాది గుణమణి విభూషితుఁడని పేరొందెను. ఇతఁడు గుడిమెట్టలో విశ్వేశ్వరాలయమును గట్టించెను.

## —♦ సాగి దోరరాజు II ♦—

పోతరాజు తర్వాత నాతని కుమారుఁడగు నీ దోరరాజు క్రీ.శ. 1181 వ సం॥ లో పాలనకువచ్చి గుడిమెట్టసీమను క్రీ.శ 1196 వ సం॥

దాపు వరకును పాలించినట్లు కన్పడుచున్నది. ఈయన భార్యపేరు ముప్పాంబ. ఈయనకు రెండవపోతరాజు, గణపయరాజు, భీమరాజను ముప్వురు కుమాళ్లు గల్గిరి. ఈ దోరరాజు గుడిమెట్ట సీమను 15 సం॥లు మాత్రమే పాలించెను. ఇతఁడు గుడిమెట్టలోని విశ్వేశ్వరస్వామి సేవకుగాఁ గొన్ని భూములను దానమిచ్చి పేరొందెను. ఈయనవద్ద శా. శ. 1112వ సం॥ర ప్రాంతములో కొన్నా తాడి గంధసిరి సూరపరెడ్డి యొక యుద్యోగిగా నుండెను.

## —♦ సాగి రెండవ పోతరాజు ♦—

రెండవ దోరరాజు తర్వాత నితఁడే గుడిమెట్టసీమ నేలెను. ఈయన శాసనములు క్రీ. శ. 1197 నుండి 1230 వరకు గన్పడుచున్నవి. ఈయనకును, యితని తమ్ములలోని గణపయ రాజునకును "నరసింహనరక" బిరుదము గలదు. సాగివంశ ప్రభువులలో నితఁడు మిక్కిలి కీర్తిశాలి యని చెప్పవచ్చును. ఇతఁడు త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర, విశ్వనాథ చోడ నారాయణదేవస్థానములలోఁ గనక కలశములను బెట్టించి, సింహాచల నృసింహస్వామి కొక చెఱువును త్రవ్వించి, శ్రీశైలమున మల్లికార్జునదేవుని ముందఱ నందికేశ్వర విగ్రహమును ప్రతిష్ఠించి, దేవుని భోగములకై కంథముపాడు, ముచ్చింతలు, బూదవాడ మున్నగు గ్రామములను దానమొసంగి, ముక్తీశ్వరస్వామికి నావిర్భల్యర్చనార్థము ముక్తిగ్రామమును (ముక్త్యాల) యిరువదైదు గోవులను, రత్నకిరీటమును, బెజవాడలోని శ్రీ మల్లేశ్వరస్వామి కర్చనాదులకై నొంచిడ్లపూడి గ్రామమును, జక్కమపూడిలో రెండువంతులు నొసంగి మిక్కిలి ఖ్యాతిగాంచెను. మఱియు నీ మహారాజు శా. శ. 1121వ సం॥లో జక్కమపూడిలోని మిగతభాగమును గోరాలంకను రాజనారాయణస్వామికిని, తన తమ్ముఁడగు గణపయరాజుతోఁ జేరి కురుకూరిలోని సోమనాథస్వామికిని, స్వయంభూదేవరకును గొన్ని మాన్యములొసంగి పేరొందెను. ఇతఁడు బెజవాడ రాజధానిగనే పాలించెను.

అనుమంచిపల్లె యను గ్రామమున నితఁ డొక శివాలయమును గట్టించి, యా దేవునకుఁ గొన్ని భూముల నిచ్చి, పోతాపుర మను నొక యగ్రహారము నేర్పరచి యందు కొబ్బరి మున్నగు వృక్షములు గల వనప్రతిష్ఠఁ జేసి కీర్తిఁబడసెను. ఇంతేగాక నితఁడు పాలేరు నుండి గొప్ప కాల్వ యొకటి త్రవ్వించి తన సీమ నంతయు సస్యసమృద్ధిగ నొనర్చెను.

—♦ సాగి గణపయ రాజు ♦—

రెండవ పోతరాజు తర్వాత నతని సోదరుఁడగు నీ గణపయ రాజు గుడిమెట్టసీమను పాలించుచు వచ్చెను. ఈయన శాసనములు క్రీ. శ. 1250 వరకును గన్పడుచున్నవి. ఇతఁడు అమరేశ్వరస్వామికి దాములూరను గ్రామమును దాన మిచ్చెను. ఈయన తన తల్లి యగు ముప్పాంబతోఁ గూడ త్రిపురాంతకమున కేగి యచట నొక గోదాన మిచ్చెను. ఈయన భార్య తిన్నాంబిక. ఇతనికి మనుమచాగి యను కుమారుఁడు జనించెను.

—♦ సాగి మన్మచాగి, గణపయరాజు ♦—

రెండవ చాగిరాజునకు మనుమఁడగుటచే నితనికి మన్మచాగి యను పేరు వచ్చెను. ఈయనయే అనుమంచిపల్లె శాసనము వ్రాయించెను. అందితఁడు క్షత్రియ వంశస్థుఁ డననియు విప్రుల వంశము వాఁడ ననియు వ్రాయించెను. దానిని మొదటి భాగమున వ్రాసితిమి. ఇతఁడు వేదాద్రిలోని ప్రతాప నృసింహస్వామికి వేముపల్లి యను గ్రామమును ధారాగ్రహీత మొనర్చియు, సోమయాజి భాస్కరుఁడను బ్రాహ్మణుఁడు కట్టించిన గణపేశ్వరాలయమునకుఁ గొంత భూమి నొసంగియు ఖ్యాతి గాంచెను. ఈయనకు మూఁడవ పోతరాజను కుమారుఁడు జనించి యాతని తర్వాత రాజ్యమునకు వచ్చెను.

—♦ చాగి మూఁడవ పోతరాజు ♦—

ఈయనగూడ గుడిమెట్ట సీమపాలకుఁడై యుండి మహామండలేశ్వర బిరుదము వహించి యుండెను. ఈయన పాలనము క్రీ. శ.

1276 వ సం॥ ప్రాంతములోఁ గన్పడుచున్నది. శా. శ. 1198 వ సం॥ లోఁ అల్లుదేవరాజు వ్రాయించిన శాసనమున నితనిపేరు కనఁబడుచున్నది. ఈయన శాసన మొకటి బెజవాడలోఁ గలదు. దానినిబట్టి యితఁడొక దాన మొనర్చినట్లు గన్పడును.

### —♦ చాగి మన్మ పోతరాజు ♦—

ఇతఁడు చాగి రెండవ పోతరాజునకు మనుమఁడును, నరసింహరాజు పుత్రుఁడు నై యుండును. ఇతనికి మాచరాజను సోదరుఁడు కూడఁ గలఁడు. మన్మపోతరాజు క్రీ. శ. 1256 వ సం॥లో ముప్పాల యను గ్రామములో నొక ధర్మ మొనర్చి శాసనము వ్రాయించెను. ఇతఁడు పెనుగంచిప్రోలు రాజధానిగా రాజ్యపాలన మొనర్చుచు వచ్చిన ట్లాశాసనమువల్లఁ దెలియుచున్నది. దీనినిబట్టి చాగివారి రాజ్యము రెండుగా విభజించఁబడి, బెజవాడలో నొక శాఖవారును, పెనుగంచిప్రోలులో నొక శాఖవారును పాలనముఁ జేయుచున్నట్లు గ్రహింపవచ్చును.

### —♦ మన్మ చాగి దోరభూపతి ♦—

ఇతనిని మూఁడవ దోరభూపాలుఁ డని కూడ పిలువవచ్చును. ఇతఁడు రెండవ దోరభూపతి మనుమఁడును, భీమరాజు పుత్రుఁడునై యున్నాఁడు. ఈయన కూడ నతవాటి సీమలో కొంతభాగమున కధికారియై పరిపాలించుచు నేలేశ్వర దేవునిఁ బ్రతిష్ఠించి మున్నేరున కావల నున్న కొన్ని భూముల నా స్వామికి దాన మొసంగి శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను.

(ఈ సాగివంశము నుండియే వత్సవాయవారు క్షత్రియులలో చేర్పడినట్లు. రామవిలాసములో యేనుఁగ లక్ష్మణకవి వ్రాసియున్నాఁడు సాగివారిలో కొందరిప్పటికిని కమ్మవారిలోను, క్షత్రియులలోను, కాఁపులలోనుఉండి ఆదిలో వీరంద రొకేశాఖీయు లనుటకు గుర్తుగా నిలచియున్నారు. కమ్మవారిలోఁ గల విప్పర్ల గోత్రీకులు కొందఱు కూడ యీ శాఖీయులే కావచ్చును.)

## —♦ కల్లయ నాయకుఁడు ♦—

దుర్జయ వంశములోని పోత.భూపాలుని అనుజుఁడు కల్లయ నాయకుఁ డనియు, నాతని భార్య సరువాసాని యనియు తెలియఁజేయ గల శాసన మొకటి అమరేశ్వరాలయమునఁ గలదు. సరువాసాని శ్రీ అమరేశ్వరస్వామి కఖండ దీపదానమొనర్చి దానిని వ్రాయించెను. కల్లయనాయకుఁడు కోనకంద్రవాడి శాఖీయుఁడుగాఁ గన్పడుచున్నాఁడు. ఇతని గూర్చి విశేషములు మనకుఁ దెలియుటలేదు. ఈయన భార్య యగు సరువాసాని దుర్జయవంశములో జనించిన ముచ్చనాఖ్యునకు జక్కాంబికకును జనించెను. ముచ్చనాఖ్యుఁడు హైహయవంశ రాజభృత్యుఁ డనియు, ధాచూరు దేశప్రతిలబ్ధ రాజ్యోబభూవభాను ప్రకట ప్రతాపుఁ డనియు నామె శాసనమున వ్రాయఁబడెను. సరువాసానికి చరువమ యను యగ్రసోదరి యొకతె యుండెనఁట.

## —♦ మల్యాలవారు లేక మల్లాలవారు ♦—

( అన్న సేనాధిపతి )

వీరి మొదట నివాసస్థలము నైజాములోని నిర్మల యను పట్టణము. ఈ వంశమునకు మూల పురుషుఁడు మల్యాల అన్న సేనాపతి. ఈయన నే మల్లాల నాథుఁ డనియుఁ బిలుచు చుండిరి. ఈతఁడు దుర్జయ వంశమున జనించినట్లు కొండిపర్తి శాసనమును బట్టి తెలియు చున్నది. ఈ విషయము ప్రథమ భాగమున వ్రాయఁబడినది. ఈ అన్న సేనాధిపతి కాకతి రెండవ ప్రోలరాజు సమకాలికుఁడుగాఁ గన్పడు చున్నాఁడు. ఈయనకు “ పెదముట్టి గండఁ ”డను బిరుదు గలదు. దీనిని తద్వంశీకులు ధరించుచు వచ్చిరి. పెదముట్టి యను వీరుని సంహరించి యీతఁ డా బిరుదమును బొందెను. ఈయనకు సబ్బ సేనాపతి, జావ సేనాపతి యను నిద్దరు కుమారుల్లుండిరి.

## —♦ మల్యాల సజ్జ సేనాపతి ♦—

ఈయన కొన్ని యుద్ధములలో తన పరాక్రమమును గన్ప అచినట్లు కొండిపర్తి శాసనములో నిట్లు వ్రాయఁ బడినది.

"యస్మాన్నినాత్య పిరిషూన్య విరాద్దదాతితేభ్యః ప్రభూత వినయః శ్రీ సజ్జసేనాపతి, ర్యస్మిన్నంగరంగ సంగి నిరిషు వ్రాతన్న మగ్రాపనః బ్రత్య కాంత మతిర్విలోక్య సకలాన్వాశా సుతం శస్త్రీణాం నై వాలం చలితుః జహాతి సహసాతిష్ఠన్న—దేవతు॥ వకచవికలా భ్యకుల సద్భిర్యయశోభిర్జగతి దదతేస్మి న్సంకిసాధీశ్వరస్య కథమపకళయంతి స్పర్శమాత్రాది దానిం ఖరకర హిమదామద్యోత భేదం చకారః॥"

ఈయన సంకిస పురాధి నాథుఁడుగాఁ బేరందెను. ఈయన కచ్చమ యను సతీమణివలన కాట చమూపతి జనించెను. ఈయన కాకతి రెండవ ప్రోలరాజు కాలములోను, రుద్రదేవుని కాలములోను సేనాధిపతిగా నుండి యుండ వచ్చును.

## —♦ మల్యాల జావ సేనాధిపతి - బాచ సేనాపతి ♦—

అన్న సేనాధిపతి పుత్రుఁడగు జావసేనాధిపతి గూడ కాకతీయ రాజులవద్ద నొక ప్రసిద్ధ సేనానాయకుఁడే. ఈయనకు బాచ సేనాపతి యను నొక కుమారుఁడు గూడ నుండెను. ఈ బాచ సేనాపతి ప్రతాపరుద్ర చక్రవర్తి కడ (క్రీ. శ. 1158 - 95 సం॥ మధ్య) నొక యోధాగ్రేసరుఁడుగఁ బేరు వహించెను. ఈ వంశమును గుఱించి బూదపూరు శాసనములో నిట్లున్నది.

శ్లో॥ "తదీయ పాదాంబురుహోపజీవి మల్యాలవంశే కమలేక్షణాళః దిగంత విశ్రాంత యశో విలాసః। శ్రీదన్న సేనాధిపతిః ప్రసూతః తస్మాదభూదతుల భావితపుణ్యమూర్తిః । శ్రీజావసైనికపతిః ప్రథితప్రభావః । ఉద్దామరాయ గరుడ——— లక్ష్మీమాతల సురక్షణ నిత్యదక్షః॥

## — ♦ మల్యాల కొటచమూపతి ♦ —

ఇతఁడు పైన నుడివిన సజ్జ సేనాపతి పుత్రుఁడు. ఈయన మొదట ప్రతాపరుద్రుని వద్దను తరువాత గణపతిదేవ చక్రవర్తి వద్దను సేనాధిపతిగాఁ బేరుఁ జెందెను. ఈయనకు బొల్లమాంబ యను సతీమణి యుండెను. శా.శ. 1162 వ సం॥ శార్వరి సంవత్సరమున నితఁడు కొండిపర్తి గ్రామమునఁ ద్రిమూర్తుల ప్రతిష్ఠఁ జేయించి యాదేవరలకు కైంకర్యములకుగాను బెల్లంచెఱు వను గ్రామమును దాన మిచ్చి శాసనము వ్రాయించెను. ఇంతేగాక నితఁడు రుద్రేశ్వర, ప్రోలేశ్వర దేవతలకుఁ గొన్ని దానముల నొసర్చి ప్రసిద్ధి వహించెను. ఈయనకు పోతసేనాని, చౌండ సేనాని యను నిర్వురు కుమాళ్ళుండిరి.

## —♦ మల్యాల చౌండ సేనాపతి ♦ —

ఈయన కొటచమూపతి పుత్రుఁడు. కాకతి గణపతిదేవ చక్రవర్తి సేనానాయకులలో నొకఁడు. గణపతిదేవచక్రవర్తి యొనర్చిన దిగ్విజయ యాత్రలలో నితఁడు పాల్గొని శత్రుసేనలను జయించెనఁట. తర్వాత నితఁడు కొండిపర్తిలో చౌండసముద్ర మను నొక గొప్ప తటాకమును......నిర్మించెను. ఇంతేగాక నచట చౌడేశ్వర స్వామి దేవళ మొకటి కట్టించి, దానికి ప్రాకారమును, సువర్ణకలశములను బెట్టించుటయే గాక నాదేవుని భోగములకొఱకై అనకుర్తి యను గ్రామమును ధారాగృహీత మొనర్చి ప్రసిద్ధిఁ జెందెను. ఇంతే గాక నితఁడు బ్రాహ్మణులకు చౌండపుర మను నగ్రహార మొకటి కూడ నొసంగెను. ఈయనకు మైలమ్దేవి యను భార్య యుండెను.

## — ♦ మల్యాల గుండదండాధిపుఁడు ♦ —

ఈయన బాచసేనాపతి పుత్రుఁడు. బాచాంబికా నందనుఁడు. ఈయన గణపతిదేవ చక్రవర్తి పాలన చివరను, రుద్రమదేవి చక్రవర్తిని కాలములోను ప్రసిద్ధికి వచ్చెను. అందుచే నితఁడు క్రీ. శ.

1260వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన గూడ సంకిసపురాధినాథుఁడే. ఈయనకుఁ గోన బుద్ధారెడ్డి కుమారిత కుప్పాంబ భార్యగా నుండెను. ఈతఁడు దేవగిరి సేవణరాజులకును, గణపతిదేవ చక్రవర్తి, రుద్రమదేవి చక్రవర్తినులకు జరిగిన యుద్ధములలోఁ బాల్గొని విజయములంది పేరందెను. ఇతఁ డనేక తటాకములు నిర్మించెను. గణపతిదేవ చక్రవర్తి పేరిట నితఁడు గణపసముద్ర మను నొక చెఱువును త్రవ్వించి, బూదపూరులో శా. శ. 1181వ సం॥లో తన తల్లిపేర నొక చెరువును నిర్మించి బ్రాహ్మణుల కనేక మాన్యములు మడులు నొసంగి కీర్తిఁ జెందెను. ఈయన శా.శ. 1198 వ సం॥ నాఁటికి చనిపోఁగా, భార్య యగు కుప్పాంబ బూదపూరున గొప్ప దేవాలయమొకటి కట్టించి యా దేవునకు గుండేశ్వరస్వామి యని నామకరణమిడి యా దేవునకు 21 మరుతుల భూమిని దానమిచ్చి శాసనము వ్రాయించెను. ఈయనకు శాచయ, బొప్పఁడు, గణపతిదేవుఁడు, పర్వతము మల్లియ యను కుమాళ్లుండిరి. ఈయనకు "పెద ముద్దుగండఁడు, సమర సమయాఖండలుఁడు, సంగర సమయాధి నాథరిపు ప్రబలమార్తాండుఁడు, దుష్టతురగరేఖా రేవంతుఁడు, చిరవితరణగుణ గణాలంకారుఁడు, సత్యసదాచారుఁడు, నిజ కులోద్ధారకుఁడు, వారనారీయావన వన వసంతుఁడు, రిపుకులభేదకుఁడు, శ్రీ విశ్వనాథ దేవ దివ్య శ్రీపాద పద్మారాధకుఁడు" మున్నగు బిరుదు లనేకములు గలవు. ఈ బిరుదులలో చాలవరకు వంశపారం పర్యముగా వచ్చినవే. ఈయన కుమాళ్ల చరిత్రము కాలగర్భము లోఁబడిపోయి మనకు తెలియవచ్చుటలేదు.

## —♦ మల్లల హేమాద్రిరెడ్డి ♦—

ఈయనగూడ దుర్జయవంశీకుఁడే యైనను పైవారికిని యీయనకును గల సంబంధము తెలియుటలేదు. ఇతఁడుగూడ గణపతిదేవ చక్రవర్తి సేనాధిపతులలో నొకఁడు. ఈయనకు 'కాకతి గణపతిదేవ, దివ్య శ్రీపాదశేఖర, పరబలభీకర, దుర్జయ కులవార్ధివర్ధన

సంపూర్ణ సుధాకర, సత్యరత్నాకర, వడముట్లగండ, కులోత్తుంగ రాయరాజేంద్రచోడ, గొంక దిశాపట్ట, వైరిగోధూమ సంఘట్ట ఖరట్ట, అంబుధిప్రకోప..." మున్నగు బిరుదావళి గలదు. ఈయన శా. శ. 1159 (క్రీ. శ. 1237) వ సం॥ లో శ్రీమద్దాక్షారామ భీమేశ్వరాలయమునఁ దన తల్లి దండ్రులకు ధర్మార్థమై యఖండ దీపదాన మొసర్చి శాసనము వ్రాయించెను. అప్పుడీతఁడా ప్రాంతములకు గణపతిదేవ చక్రవర్తి దండయాత్రలలో వెడలియుండ వచ్చునని చరిత్రజ్ఞు లభిప్రాయపడిరి. ఈయన తండ్రి పేరు చౌడయ్య. కమ్మవారిలోను, కాపులలోను గల మల్యాల, మల్లెలవారి వంశీకులే యని తెలియవచ్చును.

## —♦ దుర్జయ వంశము నుండి యేర్పడిన వంశములు

ఇంతవరకు ప్రథమ భాగమునను, యీ భాగమునను వివరించిన విషయములను బట్టి యీ క్రింది గృహనామస్థులు దుర్జయాన్వయులలో నుండి యేర్పడినట్లు స్పష్టపడుచున్నది.

(1) విరియాలవారు (గూడూరు శాసనము ప్రకారము)

(2) ముందపాటివారు (సోమదేవరాజీయము ప్రకారం)

(3) పూసపాటివారు మొదలగు పరిచ్ఛేద వంశజులు—(విజయనగర రాజుల వంశమును బట్టి)

(4) మల్యాల లేక మల్లలవారు (తెలింగానా శాసనములను బట్టియు S. I. I. Vol. IV పుట 568 ప్రకారమును)

(5) విప్పర్ల గోత్రీకు లందరును - (గోత్రపట్టిక జూడుడు.) (Ep. 283 of 24)

(6) వలపుట్ల లేక వల్లుట్ల గోత్రీకు లందరును, (Ep. Rept. 1916 పుట 135)

(7) సాగివారు, వత్సవాయవారు (రామవిలాస మను గ్రంథము వల్లను, S. I. I. Vol. IV. పుట 245 వల్లను.)

(8) కాకతీయాన్వయులని చెప్పుకొను, ఉప్పలపాటి, సయ్యపరాజు నంబూరు గుండ్రాజు, పాతపాటి ఈదరపల్లి, కఠారి, బెల్లంకొండ, కనుమూరి, లకంరాజు, వారును — (వీరందరు మందపాటివారి బంధువులు)

(9) శుద్ధపల్లివారు (వెలనాటి రాజుల సిద్ధిపుర వరాధీశ్వర బిరుదము బట్టి)

(10) పంఢావారు
(11) మండావారు } (దుర్జయ వంశములోఁగల వారిపేర్లను బట్టి.)

(12) ఆలూరివారు (S. I. I. Vol. IV. పుట 317)

(13) విప్పర్లవారు డిటో 243

(14) రావిళ్లవారు — (సౌగంధిక ప్రసవాపహారణమున గల చలమర్తి గండ బిరుదమును బట్టి)

(15) నాదెండ్లవారు (దుర్జయవంశజుల పాలక ప్రదేశమును బట్టి)

(16) వేజెండ్లవారు — (మందపాటివారి బంధుగులు.)

వీరేగాక దుర్జయవంశము నుండి యనేకవంశము లేర్పడినను వానిని గుర్తించుట కాధారములు లభించుట లేదు.

## —♦ కమ్మవారిలోని దుర్జయాన్వయులు ♦—

పైన నుడివినవంశములలో క్షత్రియులలో చాలవర కుండుట గాక కమ్మవారియందు క్రింది వంశములవా రుండి, వారును వారి బందుగులును దుర్జయాన్వయు లనుటకును, ఆంధ్ర క్షత్రియ శాఖనుండి యెప్పుడో చీలిరనుటకును దృష్టాంతముగ నున్నారు.

(1) మందపాటివారు.

(2) పూసపాటివారు.

(3) మల్లల లేక మల్లెలవారు.

(4) విప్పర్ల గోత్రీకులందరును.

(5) వలవుర్ల లేక వల్లుట్ల గోత్రీకులందరును.

(6) సాగివారు.

(7) కతారివారు
(8) బెల్లంకొండ వారు
(9) కనుమూరివారు
(10) ఉప్పలపాటివారు
(11) శుద్ధపల్లివారు
(12) పండావారు
(13) మండావారు
(14) ఆలూరివారు
(15) రావిళ్ళవారు
(16) నాదెళ్ళవారు
(17) నూజెళ్ళ (లేక) వేజెండ్లవారు

దుర్జయాన్వయులకు సన్నిహిత బంధువులగు కోటవారును, వారినుండి యేర్పడిన దంతులూరి, జంపని, దాంట్లవారును * కోనవారును హైహయ వంశజుల మని చెప్పుకొనినవారును యీ తెగవారి క్రిందికే వచ్చుచున్నారు. కమ్మవారిలోఁ గల (1) కోటవారు, (2) జంపనివారు, (3) కోనవారు యీ తెగవారే యనవచ్చును.

(కమ్మ వారిలోఁ గల దుర్జయాన్వయులు మొదటి ప్రతాపరుద్రుని కాలమునుండియు చతుర్థులుగా పరిగణింపఁబడి నట్లును, తత్పూర్వము శూద్రులు గా రనియు పద్మనాయక చరిత్రను బట్టి గ్రహింప వలసి యుండును. ఈ విషయము లోగడ తెలిపితిమి)

## —♦ తెలుఁగు చోడ రాజులు ♦—

కమ్మవారిలో కొందఱు తెలుఁగు చోడరాజుల సంతతివారని చెప్పి, 10వ శతాబ్దమువరకుఁ గల వీరి చారిత్రమును మొదటి భాగమున వివరించితిమి. ఇఁక దర్వాత వారిని గుఱించి తెలుసుకొందము.

---

* ఈమూఁడుశాఖలు నేఁడాంధ్ర క్షత్రియులలోఁగలవు. ఇందలి దంతులూరి వారితో రెడ్ల బంధుత్వము లున్నవి. ఈ వివరము ముందుపుటలలోఁగలదు. పత్సవాయ వారికిని రెడ్లకుఁగూడ బంధుత్వముండెను. ప్రథమభాగము పుట 105 చూడుఁడు.

మనకుఁ దెలిసినంతలో నీ తెలుఁగు చోడరాజులు మొదట పొత్తపిలో రాజధాని నేర్పరుచుకొనిరి. ఈ పొత్తపి నేటికడపజిల్లా పుల్లంపేటతాలూకాలో కడపకు 8 మైళ్ళ దూరమున నున్నది. పొత్తపి నేలుటచే పొత్తపి చోడు లనియు, మధురను జయించుటచే మధురాంతక బిరుదమును నీ వంశీకులు ధరించుచు వచ్చిరి. వీరిలో కొందఱు ఒరయూరుపురవరాధీశ్వర బిరుదమును ధరించు చుండిరి. ఈ తెలుఁగు చోడరాజుల శాసనములలో వారి ప్రశస్తిని సాధారణముగా నిట్లు చెప్పుకొనిరి.

"చరణసరోరుహ, విహితవిలోచన, త్రిలోచన ప్రముఖాఖిల పృథివీశ్వర, కారిత కావేరీతీర కరికాల కులరత్న ప్రదీపాహిత కుమారాంకుశ శ్రీమన్మహామండలేశ్వర" రాదులు.

ఈ శాఖీయులలో కొందఱు తర్వాత కోమార్కులో పాలించుచు వచ్చినందున నట్టి వారు 'కోమార్పురవరేశ్వర' బిరుదమును గూడ పారంపర్యముగ వహించుచు వచ్చిరి. వీరికి కల్గుడి (రాతికోడి), కల్పోన్న (రాతిపొన్న) లు చిహ్నములుగా నుండెను.

శా. శ. 1010 వ సం॥ర ప్రాంతములో పొత్తపి యందీ శాఖీయులలో నిర్వుర పాలనము గన్పడు చున్నది. పొత్తపి సిద్ధి భూపతి యను నతఁ డొకఁడు. ఈయన గాక కామచోడుఁ డను నతఁ డొకఁడు. ఇందు కామచోడుఁడు క్రమముగా తన పాలనమును కమ్మనాటిపై పునకు విస్తరించి యాతని కుమారుఁ డగు కన్నరదేవు నచటికిఁ బంపినట్లు కన్పడును. ఈవంశీకులు కొణిదెనలో స్థావర మేర్పరచుకొని పాలించిరి. వీరి వృత్తాంతము తర్వాత వివరింపఁ బడును. ఇక సిద్ధిచోడుని వంశమును గుఱించి తెలుసు కొందము.

## —♦ పొత్తపి సిద్ధి భూపతి I ♦—

ఈయన పొత్తపి రాజధానిగ కొంత భాగమును శా. శ. 1010వ సం॥ ప్రాంతములో. పాలించిన వాఁడని యే తోఁచుచున్నది.

ఈయన శాసనములు గన్పడ కున్నను, యీతని కుమారుఁ డగు విమలాదిత్యుని శాసనములు శా. శ. 1047, 1051 నాటివి కడప జిల్లా నందలూరులోను, కాళహస్తిలోను గన్పడుచు నం దీతని పే రుదాహరింపఁబడి యున్నది*. ఈ శాఖవారి వృత్తాంతము ఓపిలిసిద్ధి శాసనము వచించుట లేదు.

## —♦ విమలాదిత్యుఁడు ♦—

ఈ మహారాజు పాలనము శా. శ. 1041, 47 సం॥ల మధ్య కడపజిల్లా నందలూరు ప్రాంతమునను, కాళహస్తి యందును గన్పడును. ఈయన విక్రమచోళ చక్రవర్తికి సామంతుఁడుగా నుండెను. విక్రమచోళ చక్రవర్తి 11 వ పాలన సంవత్సరమున నితఁడు కాళహస్తిలోని స్వామికి దీప దానము గావించి శాసనము వ్రాయించెను. శా.శ. 1047 వ సం॥లో నితఁడు నందలూరు (కడపజిల్లా)లో 70 పాళ్ళ భూమిని అగ్రహార మొసఁగిన ట్లొకటి శాసనము దెలుపుచున్నది. అందుచే నా కాలమున నే వఱి యొకరి పాలనము కూడ నచట నున్న ట్లూహింప వచ్చును. విక్రమచోళ మహారాజునకు సామంతుఁడుగా నా కాలమున బేతరాజను నతఁడు కూడ పాలించుచు వచ్చెను. ఆతఁడు కూడ పొత్తపి చోడుని కుమారుఁడ నని శాసనము లిఖించెను; గాని తండ్రి పేరుదాహరింప నందున నాతనికిని విమలాదిత్యునకును గల సంబంధ మెరుక పడుట లేదు. ఐనను వీరిద్దరును సోదరులు గాని లేక అన్నదమ్ముల కుమాళ్ళుగాని యై యుందు రని తెలుప వచ్చును.

## — ♦ బేత రాజు ♦ —

ఈయన వ్రాయించిన శాసన మొకటి కూడ నందలూరులో నున్నది♦. అది శా. శ. 1044 వ సం॥ లో వ్రాయఁబడినది. ఈయన కూడ విక్రమ చోళుని సామంతుఁడే. ఈయనకు దయ

---

* No. 100 of 1922 & 579 of 1907.
♦ No. 583 of 1907.

భీమరాజు, యఱ్ఱసిద్ధి, నల్లసిద్ధి యను మువ్వురు కుమాళ్ళు జనించిరి. ఈ బేతరాజు పాలనము తర్వాత పాకనాటిలో మల్లిదేవుని యొక్కయు, నాతని కుమాళ్ళగు సిద్ధిచోడ, మల్లిదేవుల యొక్కయు పాలనము గన్పడును.

ఈయన కుమారుఁడగు నల్లసిద్ధి పాలనము శా. శ. 1114 వ సం॥ లోఁ గన్పడుచున్నందున నితఁడు దాదాపు శా. శ. 1100 సం॥ వరకును పొత్తపి రాజధానిగా కొంతభాగము మాత్రముఁ బాలించుచు వచ్చె ననియో విశ్వసింపవలసి యుండును. ఈయన కుమాళ్ళలోని దయ భీమరాజు వృత్తాంతము తెలియుట లేదు. యఱ్ఱసిద్ధి పొత్తపినిఁ బాలించుచుండఁగా నల్లసిద్ధి వల్లూరు రాజధానిగాఁ బెట్టుకొని పాలించినట్లు కన్పడును.

## —◆ యఱ్ఱసిద్ధి రాజు ◆—

ఈయన శా. శ. 1100 సం॥ ప్రాంతమునఁ బాలించుచు వచ్చెను. ఈయన కాలములో రాజధానిని నెల్లూరునకు మార్చి నట్లు గన్పడు చున్నది. ఇతఁడు రెండవ రాజాధిరాజునకు సామంతుఁడుగాఁ బాలించి యుండవచ్చును. రాజాధి రాజు సామంతులలో నొక సిద్ధరసచోడుఁడు నెల్లూరి పాలకుఁడుగా నున్నట్లు కనుపడు చున్నది. ఆతఁ డీతుఁడయో యై యుండునని నిర్ణయింప వచ్చును. ఈయనకు శ్రీ దేవి యను భార్య యుండెను.

ఈయనవద్ద 'అలతూరి పురవరాధీశ్వర' బిరుదాంకితుఁడగు నారపసాహిణి భీమినాయకుఁడొక సామంతుఁడుగా నుండెను. ఈతఁడు కోటూరుపల్లె (రాపూరుతాలూకా) లో నొక దానశాసనము వ్రాయించెను. ఇంతేగాక యీయనవద్ద గొల్లపెడి బమ్మినాయకుఁడను నతఁడు రాజ్య ప్రతిపాలకుఁడుగా నున్నట్లు మహిమలూరు శాసనమువల్లఁ దెలియుచున్నది. ఎఱ్ఱసిద్ధివద్ద బావమఱఁదియగు సిద్ధరస చోడుఁడు గలఁడు. ఈతఁడుగూడ పరిపాలనా వ్యవహారములలోఁ

పాల్గొనుచుండినట్లే తోఁచును. ఇతఁడు గూడూరు తాలూకాలో నొక దేవునికి దీపదాన మొనర్చుచు వ్రాయించిన శాసనము గన్పడుచున్నది.

యఱ్ఱసిద్ధికి నల్లసిద్ధి II, బేతరాజు, తమ్ముసిద్ధి యను కుమాళ్లు జనించిరి. ఈయన తర్వాత నల్లసిద్ధియు తమ్ముసిద్ధియు వరుసగా నెల్లూరు రాజధానిగఁ బాలించిరిగాని బేతరాజు పాలించి యుండ లేదు. ఈయనకు 'భుజబలవీర, సాహసోత్తుంగ, కీర్తినారాయణ, అయ్యనసింగు, ఒరయూరు పురవరాధీశ్వ'రాది బిరుదములు గలవు.

## —♦ నల్లసిద్ధి మహారాజు I ♦—

యఱ్ఱసిద్ధి సోదరుఁడగు నీతఁడు వల్లూరు రాజధానిగా నేలుచు వచ్చెను. ఈ వల్లూరు కడపకు 8 మైళ్ల దూరమున నున్నది. ఇతఁడు గూడ పొత్తపి చోడుల బిరుదములు వహించుచు నే యుండెను. ఈయన మూఁడవ కులోత్తుంగ చక్రవర్తికి సామంతుఁడు. మహారాజ పదియను మోడువేల గ్రామముల కీతఁడు ప్రభుత్వము నల్పుచు వచ్చెను. ఈయన మహారాజ బిరుదమును ధరించెను. అందుచే నితఁడు స్వతంత్ర పాలకుఁడుగా నుండి యుండునని గుర్తింప వచ్చును. ఈయన పేరు గల కన్నడ శాసన మొకటి శా. శ. 1114 వ సం॥ నాటిది గన్పడుచున్నందున * నీతఁడా కాలమున బాలించెనని చరిత్రజ్ఞులు గుర్తించిరి. ఈయనకు 'భుజబల వీర'యను బిరుదముగూడ కలదు. ఈతఁడు కాంచీనగరమును జయించి కప్పము గైకొనెనని వ్రాయించెను. ప్రాయశః యిది కులోత్తుంగ చక్రవర్తి కాంచీపురిపై దండెత్తి జయించి నప్పు డాతని సామంతుఁడుగా నొనర్చి యుండు నని తలఁపవచ్చును; ఈ మహారాజునకు బేటరాజను కుమారుఁ డొకఁ డుండెను; గాని యీతని పాలనా విశేషములు మనకుఁ దెలియవచ్చుట లేదు.

* No. 483 of 1906

## —♦ చిద్దన చోడుడు ♦—

శా. శ. 981 వ సం॥ ప్రాంతమున సిందవాడి రాష్ట్రములో నీయన పాలనము గానవచ్చుచున్నది. ఈయన పొత్తపి చోడుల శాఖీయుడుగా గన్పడుట లేదు. ఈయన దొనెకల్లులో నొక శాసనము వ్రాయించెను♦. ఈయన మహా మండ లేశ్వర బిరుదము ధరించెను. పశ్చిమ చాళుక్య చక్రవర్తి యగు త్రైలోక్యమల్ల దేవునికి సామంతుడుగా నుండి నైజాం రాష్ట్రములోని అలంపుర సామీప్యమున పాలించుచు వచ్చిన చిద్దన చోడరా జీయన యని యో తలంప వచ్చును*.

## —♦ నల్లసిద్ధి రాజు II (వరపు మన్మ సిద్ధి I) ♦—

ఈయన నెల్లూరు రాజధానిగాఁ బాలించెను. ఇతఁడు కూడ మూఁడవ కులోత్తుంగ చక్రవర్తికి సామంతుఁడుగానే యుండెను. ఈయన తన తండ్రి యగు యఱ్ఱసిద్ధి రాజునకు తరువాత, నఁగా శా. శ. 1109 వ సం॥ ప్రాంతమున రాజ్యమునకు వచ్చి శా.శ. 1135 వ సం॥ వరకును పాలించినట్లు కన్పడుచున్నది. ఈయన శా.శ. 1111 వ సం॥ లో నెల్లూరులోని విష్ణ్వాలయమునకు కోపూరను గ్రామమును దాన మొనర్చి శాసనము వ్రాయించెను. నాగేశ్వర స్వామికి పూంగినాటిలోని యెట్టంపల్లిలోఁ గొన్ని భూముల నొసంగెను. ఇంతేగాక ఇతఁడు నిరందనూరు (నందలూరు) ఆండపూరు, మంతరము అను గ్రామములోని పన్నులను మినహాయించుచు నందలూరున శాసనము వ్రాయించెను. ఇది కులోత్తుంగుని 26 వ పాలన వత్సరమునఁ గావింపఁబడెను. కూడూరు తాలూకాలోని గునుపాడులోని తిరునంగాడు దేవర కితఁడు వేలూరను గ్రామమును దాన మొసంగెను.

---

♦ Ep. Colle. 392 of 1920.

* తెలింగానా శాసనములు, పుట 113

ఈ మహారాజునకు నూాంకమ యను భార్య యుండెను. ఈమె చాల భక్తురాలు. ఈమె చెంగల్పట్టు జిల్లా తిరుప్పాలి వనమునను, కాళహస్తి యందును, నందలూరులోను దేవాలయములలో దానము లొనర్చి శాసనములు వ్రాయించెను. ఈయన పాలనము క్రీ. శ. 1213 వ సం॥ వరకును గన్పడుచున్నది. ఈ లోపలనే యితని తమ్ముఁడగు తమ్మసిద్ధి గూడ వచ్చి రాజ్యపాలనలో పాల్గొనుచు యువరాజుగా నుండెను.

నల్లసిద్ధికి పినతండ్రికూడ నల్లసిద్ధి యగుటవల్ల నీ రెండవ నల్లసిద్ధిని మన్మసిద్ధి యని గూడ పిలుచుచున్నట్లు కన్పడును. ఈయనకు మైలమదేవి యను మఱియొకభార్య యున్నట్లు కన్పడుచున్నది.

## —♦తమ్మసిద్ధి♦—

ఈయనపాలనము నెల్లూరులో శా. శ. 1127 వ సం॥ నుండి కన్పడు చున్నది. ఈయన శాసనములు తెలుఁగుదేశముననే గక చెంగల్పట్టు, ఉత్తరార్కాటు జిల్లాలలోఁగూడ నున్నవి. అందుచేఁ నీయన రాజ్య మచటివరకు వ్యాపించి యుండెననవచ్చును. ఈయన గూడ మూఁడవ కులోత్తుంగ చక్రవర్తికి సామంతుఁడే. క్రీ. శ. 1207వ సం॥లో నితఁడు తన తల్లియగు శ్రీదేవి పేరిట శ్రీపురమను నగ్రహారమును బండారు త్రిపురార్యుఁడు మున్నగు బ్రాహ్మణుల కొసంగెను. పల్లికొండలోని దేవున కితఁడు మండనాటిలోని తామరమడుపుచెరు వను గ్రామమును దాన మిచ్చెను. ఇది కులోత్తుంగుని 26వ పాలన సం॥నఁ గావింపఁబడినది. కైవందూరను గ్రామమును తిరుప్పాసూరను గ్రామములోని దేవాలయమునకై కొండటు వర్తకులు నెల్లూరు మున్నగు గ్రామములవారు కొని యా గ్రామము పన్ను మినహాయింపఁ గోరఁగా నీ మహారాజట్లే పన్ను మినహాయించెను*.

* No. 12 of 1930.

## — • తిరుకాళత్తి దేవుఁడు లేక తిక్కరాజు I • —

ఈయన పైన నుడివిన నల్లసిద్ధిరాజు II కుమారుఁడు. తమ్ముసిద్ధిరాజు తర్వాత నితఁడు విక్రమసింహపుర మనఁబడు నెల్లూరు రాజధానిగా పాలించుచు వచ్చెను. ఈయన మిక్కిలి పరాక్రమ వంతుఁడని బాల్యమునుండి పేరొందెను. తిక్కన సోమయాజిచే రచింపఁబడిన నిర్వచనోత్తర రామాయణమున నీతఁడు పదునెనిమిది సంవత్సరముల ప్రాయముననే వెలనాఁటి పృథ్వీశ్వరరాజుతో రణరంగమునఁ బోరి యాతని తలఁ ద్రుంచెనని వ్రాయఁ బడినది. ఈ మహారాజు నెల్లూరిలో మనుమకేశ్వర దేవునకు ఈడపూ్ప రను గ్రామమును దాన మొసంగెను. ఇతఁడు పొటుకూరులోను, రాపూరు కందుకూరు తాలూకాలలోను గొన్ని దానము లొనర్చి శాసనములు వ్రాయించెను. ఈయన కాలములో, కాంచీపురము రణరంగముగ నుండెను. కర్నాట సోమేశ్వరుని, పాండ్యరాజులను కాంచీపుర ప్రాంతమున జయించి యాతఁడు మూఁడవ రాజరాజును రాజ్యమున నిలిపినందున 'చోళస్థాపనాచార్య' బిరుదము గణైను. క్రీ. శ. 1133 వ సం॥లో కాంచీపురము నందలి అరుణాళస్వామికీయన యొక దానము గావించెను. ఈయన ప్రతాపమును నిర్వచనోత్తర రామాయణమున తిక్కన సోమయాజి యిట్లు వర్ణించి యున్నాఁడు.

" సీ॥ లకుమయగురుము లూ-రికి నెత్తివచ్చిన, గొనఁదె యాహవమున-ఘోటకముల
దర్పదుర్జయులగు-దాయాద నృపతుల, నని లోన బలుపఁదే-యాగ్రహమున
శంభు రాజాది ప్ర-శస్తారి మండలి, కము జేర్చి యేలఁదే - కంచిపురము
జేదిమండలము గా - సిగఁ జేసి కాళవ, పతి నియ్యకొలుపఁదే- పలచమునకు
గీ॥ రాయ గండ గోపాలున- రాతి భయద, రాయ పెండార బిరుదాభి-రాముసుభయ
రాయగండాంకు ఖండియ-రాయుదిక్క । ధరణివిభు బోల రాజుల-కరిదిగాదె॥"

ఈ మహారాజు వైష్ణవ భక్తాగ్రేసరుఁడును కవి సార్వభౌమ బిరుదము వహించిన విద్వాంసుఁడునై యుండెను. ఇతనివద్ద పెద్దయామాత్యుఁ డను ఆస్థాన కవి యున్నట్లు విక్రమార్క చరిత్రము

వచించుచున్నది. ఈయనవద్ద సిద్ధనామాత్యుఁ డను నతఁ డొక సేనాపతిగ నున్నట్లు దశకుమార చరిత్రలోఁ గలదు. ఈసిద్ధనామాత్యుఁడు మంత్రి భాస్కరుని మూఁడవ కుమారుఁడఁట.

ఈ మహారాజు వద్ద గంగయ సాహిణి యను శూరాగ్రేసరుఁడు సేనాధిపతిగ మొట్టమొదట నుండి తర్వాత క్రమముగా గణపతిదేవచక్రవర్తి కడకుఁ బోయెను. ఈతఁడు క్రీ. శ. 1249 వసం॥ ప్రాంతములో మఱల గల్గిన కాంచీపుర దండయాత్రలో జటవర్మ సాంద్యునిచే సంహరింపఁబడినట్లు కన్పడుచున్నది.

ఈయన కులోత్తుంగరాజ్య 31 వ సం॥లో కడపజిల్లా నందలూరు గ్రామమున స్వామి కఖండ దీప దానమును తన తండ్రి పుణ్యమునకై కావించెను.

ఈ తిరుకాళదేవ మహారాజు వద్ద నొక సేనాధిపతిగా నితని యల్లుఁ డగు తిరుకాళ దేవుఁడు కూడ నుండెను. ఈ అల్లు తిరుకాళ దేవుఁడు తన మామగారి పుణ్యమునకై అత్మకూరులో పెరుమాండి దేవుని శా. శ. 1168 వ సం॥లో ప్రతిష్ఠించి దేవునికిఁ గొన్ని మాన్యములొసంగెను. ఈ అల్లు తిరు కాలతి దేవునకు 'గండగోపాలరా' జను బిరుదము గలదు. ఈ అల్లు తిరుకాల దేవునకు విజయాదిత్యుఁ డను సోదరుఁడు గలఁడు. ఇతఁడు కూడ శా. శ. 1169 వ సం॥లో రాపూరు తాలూకాలో నొక ధర్మ శాసనము వ్రాయించెను. ఇతని వద్ద ప్రోలిరెడ్డి యను సామంతుఁడు కలఁడు.

ఈ తిరుకాళత్తి దేవునకు యాదవరాజులకుఁ గొంత సంబంధమున్నట్లు గన్పడుచున్నది. తిరుకాళత్తిదేవ, శశికుల చలుక్కి బిరుదములు ధరించిన వీర నరసింహ యాదవరాజు యొక్కయు, నాతని కుమారుఁ డగు సింగపిల్లయార్ వరప్ప వీరరాక్షస యాదవ రాయలు యొక్కయు, నరసింహుని భార్య పుదోలిమాదేవి చలుకి కులమాదేవి యొక్కయు దాన శాసనములు కాంచీపురము, కాళహస్తి, తక్కోలము, రామగిరి, తిరుప్పాసూరు, తిరువోరియూరు,

సెంజి గ్రామములలోఁ గన్పడు చున్నవి. సింగపిళ్ళయారు 'గోదావరీ తీర కనఖారిపుర పురవరాధీశ్వర' బిరుదమును మఱి కొన్ని యితర బిరుదములను ఆతని కాళహస్తి శాసనమున వ్రాసికొని యున్నాఁడు. వీరనరసింహ యాదవరాజు తిరుకాళత్తి దేవునకు యాదవ కాంత వలనఁ బుట్టినవాఁడేమో యని తోఁచు చున్నది. ఈతని పాలనము గూడ పైన నుదాహరించిన చోట్ల గన్పడు చున్నది. ఈ యాదవ శాఖీయులు గూడ పిళ్ళయారులలోఁ గలిసిపోయి రేమో యని సందేహించుటకు నా కుపయోగించిన పిళ్లయార్ బిరుద మవకాశ మిచ్చు చున్నది. వీరు దక్షిణ చోడరాజు లెవ్వరును యాదవ రాజుల మని చెప్పుకొనిన దృష్టాంతములు గన్పడవు ♦. అందుచే తెలుఁగు చోడు లందరును యాదవులై రనఁ జాలము.

ఈ తిరుకాలత్తి దేవునికి మనుమసిద్ధిరాజు II అను కుమారుఁడు జనించెను. తిరుకాళదేవుని తర్వాత నితఁడే విక్రమపురి సింహాసన మధిష్ఠించెను.

## —♦ మనుమసిద్ధిరాజు II ♦—

ఈయన పాలనము క్రీ. శ. 1262వ సం॥ము వరకును గన్పడు చున్నది. ఈయన తండ్రివలె గొప్ప శూరాగ్రేసరుఁడు గాకున్నను, వాఙ్మయ పోషకుఁడుగఁ గన్పడుచున్నాఁడు. తిక్కన సోమయాజిచే నితఁడు నిర్వచనోత్తర రామాయణమును రచింపఁజేసి దానికిఁ గృతి భర్త యయ్యెను. ఇతఁడు పాకనాటి నంతటిని నెల్లూరు రాజధానిగాఁ బాలించెను.

శా. శ. 1179వ సం॥లో నీ మహారాజు తన తండ్రి యగు తిరుకాలదేవ చోడరాజునకు పుణ్యమునకై కోడూ రను గ్రామమును బ్రాహ్మణుల కగ్రహారముగ నొసంగెను. దీనిని వెలమ వా రాక్ర

---

♦ ఈ యాదవ రాజులలో నొక శాఖవారు మైసూరు ప్రాంతములఁ బాలించుచు వచ్చిరి. నేఁటి మైసూరు మహారాజావారి వంశము యాదవ వంశమే యై యున్నది. (See 'Modern Mysore' by Mr. M. Shama Rao.)

మించఁగా బ్రాహ్మణు లీ మహారాజునకు విన్నవించుకొనిరి. దానిపై నితఁ డా గ్రామమును మరల బ్రాహ్మణుల కిప్పించెను. ఈయన శౌర్యమును తిక్కన సోమయాజి యిట్లు వర్ణించెను.

"మ॥ ద్రవిడోర్వీపతి గర్వముం దునిమి శౌ • ర్యం బొప్పఁ గర్ణాట ద
ర్ప విఘాతంబు నొనర్చి వైరి ఘనుజేం • ద్ర శ్రేణికిం గొంగ నా
నవనిం బేర్కొని యున్న యట్టి విజయ • శ్రీమధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళయ మన్మసిద్ధి యనిఁ బ్రా • యేటం బ్రగాఢోద్ధతిన్॥"

ఇట్లున్నను, దాయాదు లగు అక్కన, బయ్యన లను వా రొక సారి దండెత్తఁగా నితఁ డోడిపోయి గణపతిదేవ చక్రవర్తి సాయమును బొందినట్లు సిద్ధేశ్వర చరిత్రలోఁ గలదు. క్రీ. శ. 1250వ సం॥ర ప్రాంతములో ని దాయాదుల ప్రోత్సాహమున నే గాఁబోలు జటవర్మ సుందర పాండ్యరాజు నెల్లూరు దండయాత్ర వచ్చి యీతనిఁ బారఁ ద్రోలి రాజ్య మాక్రమించినట్లు పల్లికొండలో పాండ్యరాజు వ్రాయించిన శాసనమును బట్టి గ్రహింప వచ్చును. అప్పుడే యీతఁడు గణపతిదేవుని సహాయమును బొంది పాండ్యుని జయించి యప్పటి నుండియు నాతనికి సామంతుఁ డయ్యెను.

ఈయన దానశాసనములు కంమకూరు సీమలో నున్నవి. కనిగిరి సీమలో ఆవలపాడున కధిపతిగా నుండిన యాదవ రాజగు కాటమ రాజునకును యితనికిని పసులమేపు బీళ్లవద్ద తగాదా గలిగి తుద కది గొప్ప యుద్ధముగా పరిణమించెను. అప్పు డీ మహారాజు వద్ద ఖడ్గతిక్కన యను బ్రాహ్మణుఁడు సేనాధిపతిగా నుండెను. ఈ మహారాజుచే నియమితుఁడై ఖడ్గతిక్కన కాటమరాజుపై దండెత్తి పోయి వాని సైన్యముచే నోడింపఁబడి, సైన్యమును గోల్పడి యింటికి వచ్చెను. వీర వనిత యగు నాతని యిల్లాలు స్నానమునకు నీళ్లు తోడి యచట నాడువారికిఁ గావలసిన పసుపు ముద్దగూడ నుంచెనఁట! దానిపై నది యేమనఁగా, నా యిల్లాలు ధైర్యముతో

"కం॥ పగఱకు వెన్నిచ్చినచో । నగరే నిను మగతనంపు-నాయకు లందున్
ముగు రాడువార మైతిమి । వగపేటికి జలకమాడ-వచ్చిన చోటన్॥"

అని జవాబొసంగెనఁట. ఇట్లే తిక్కన తల్లి కూడ భోజనమునఁ బాలు వడ్డించుచుఁ దిరస్కారముగ మాట్లాడెనఁట.

అభిమాన శూరుఁ డగు నా తిక్కన మఱల వెంటనే బయలుదేఱి, చెదరిపోయిన సైన్యమును గూర్చుకొని యుద్ధమునకు తారసిల్లెను. ఆ భయంకర రణరంగములోనే తిక్కనయు, సిద్ధిరాజును, కాటమరాజును కూడ మడిసిరని చెప్పఁబడెను.

ఈ మనుమసిద్ధిరాజు II తర్వాత నతని జ్యేష్ఠకుమారుఁ డగు ఇమ్మడి తిక్కరాజు రాజ్యాధీశుఁ డయ్యెను. మనుమసిద్ధివద్ద శా. శ. 1180 వ సం॥ ప్రాంతములో అల్లాడ నాథుఁ డను ముక్కంటి కాడుపల్లవుఁ డొక సామంతుఁడుగాఁ బనిచేయుచున్నట్లు గన్పడును.

ఈయనకు ఇమ్మడి తిక్కరాజును, పల్లసిద్ధిరాజును గోపీనాథుఁడు నను ముగ్గురు కుమారులుండిరి.

## —♦ ఇమ్మడి తిక్కరాజు (వరపు తిరుకాలతి దేవరాజు II) ♦—

ఈయనను తిరుకాల దేవుఁడనియు, తిక్కరాజనియు నందురు. ఇతఁడు 'ఇరుమడి' (లేక ఇమ్మడి) యను గన్నా నామము ధరించినట్లు కృష్ణా పట్టణములోఁ గల యీయన కాలపు శాసనము వల్లఁ దెలియుచున్నది. ఈయనకు గండ గోపాలుఁ డను బిరుదు గలదు. ఈయనకు విజయాభివృద్ధికై యీయన సామంతులలో నొక్కఁ డగు ముక్కంటి పల్లవ మధుసూదన దేవుఁ డొక యగ్రహారము శా. శ. 1181వ సం॥లో నొసంగెను. శా. శ. 1201వ సం॥న కృష్ణా పట్టణములోని వర్తకులు కొందఱు వ్యాపార వస్తువులపై సుంకము లేర్పరచుకొని యచటి మనుమ సిద్దేశ్వరాలయమునకు సమర్పించినట్లు కన్పడును. ఈ సుంకము నీ మహారా జంగీకరించి యుండును. ఈయన తరువాత గండ గోపాలుఁడు రాజ్యమునకు వచ్చినట్లు కన్పడుచున్నది.

## —♦ రాజగండ గోపాలదేవుఁడు ♦—

ఈయనకు పొత్తపిచోడ శ్రీరంగనాథుఁ డనుపేరు గూడ కలదు. ఈతనికి త్రిభువన చక్రవర్తి యను బిరుదము గలదు. ఈయన శాసనములు నెల్లూరు, గూడూరు సీమలలోఁ గనుపడు చున్నవి. ఇతఁడు క్రీ. శ. 1279 వ సం॥ లో ఇమ్మడి తిక్కరాజు తరువాత సింహాసన మధిష్ఠించెనఁట. ఈయన కొంతకాలము కాకతీయ రుద్రమదేవికి ప్రత్యర్థిగా నుండి చివరకు వీర ప్రతాపరుద్ర చక్రవర్తిచే జయింపఁబడెనఁట. దాదాపు క్రీ. శ. 1314 వ సం॥ వరకు నితఁడు నెల్లూరు ప్రాంతమును పాలించుచుండెను. ఈయన నెల్లూరిలోని శ్రీరంగనాయకస్వామి కనేక దానము లిచ్చి శాసనములు వ్రాయించి పేరొందెను. ఈతఁడు వైష్ణవ భక్తాగ్రేసరుఁడు. ఈయన పాలనతో నెల్లూరు చోడుల రాజ్యపాలన మంతరించె ననవచ్చును.

త్రిభువన చక్రవర్తి విజయగండ గోపాలుఁ డను వాని శాసనములు కొన్ని కంచిలోఁ గన్పడుచున్నవి. ఆ శాసనము లాతని పాలనము 22 వ సంవత్సరము వరకును ఉన్నవి. వానినిబట్టి చూడఁగా నతఁడు శకవర్షము 1172 వ సం॥ ప్రాంతము నుండియు నచట పాలించుచున్నట్లు కన్పడును. అతఁడును రాజగండ గోపాలుఁడును ఒకరై యుందురేమో! ఇదిఁ గాక కొణిదెనలోను కంచిలోను పాలన మున్నట్టి మనుమగండ గోపాలుఁడును, ఈతఁడును ఒకరేయై యుందురని కొందఱు చరిత్రజ్ఞుల యభిమతము. ఈ మనుమగండ గోపాలుని చరిత్ర ముందు పుటలందు గలదు.

## —♦ కొణిదెన చోడరాజులు ♦—

### (కామచోడుఁడు I)

నరసరావుపేట తాలూకా కొణిదెనగ్రామమును కమ్మనాంటికి రాజధానిగాఁ జేసికొని యొక శాఖీయులగు తెలుఁగు చోడరాజులు 11వ శతాబ్దము నుండియు పాలించుచు వచ్చిరి. వీరు చాళుక్యచక్ర

వర్తులకు సామంతులుగానే యుండిరి. ఈ శాఖీయులు గూడ పొత్తపి నుండి వచ్చినవారే. అందుచేతనే పొత్తపిచోడ, మధురాంతక బిరుదముల ధరించుచు వచ్చిరి. ఈ చోడ శాఖీయులకు మూలపురుషుఁడు దాసవర్మ. ఈ దాసవర్మ వంశములో తర్వాత కామ చోడుఁడు వచ్చెను. ఈ మహారాజు మొదట పొత్తపిలో నుండి శా.శ.1001 వ సం॥లో పొత్తపియందు దాక శాసనము వ్రాయించెను. దీని నకలొకటి లోకలు రికార్డు, వాల్యూము 22లో వ్రాయఁబడి యున్నది. ఈయనకు మల్లపదేవి యను భార్య యున్నట్లితని కుమారాళ్ళలో కన్నర దేవుఁడు శ్రీ దాక్షారామ భీమేశ్వరాలయమున వ్రాయించిన శాసనము వల్ల గ్రహింపఁ గలము. ఈయన మొదట పొత్తపిలోఁ బాలించుచు తర్వాత తన రాజధానిని కమ్మనాఁటి లోని కొట్య దొనకు మార్చి యుండెను. ఇతఁడు దాదాపు క్రీ.శ. 1115వ సం॥ (శా.శ. 1037) వరకు పాలించినట్లు కనుపడు చున్నది.

ఈయన వద్ద భీమయప్రెగడ యను నతఁడు మంత్రిగా నుండి శా. శ. 1033 వ సం॥ సరియగు ఖర సంవత్సరమున త్రిపురాంతకము నందలి దేవునకు నేఁబది పసువుల నఖండదీపమునకై యొసఁగి శాసనము వ్రాయించెను*.

## —♦ కన్నర దేవుఁడు I ♦—

కామదేవచోడుని కుమారుఁ డగు నీతఁడు కమ్మనాటిలో కొంత భాగమును తన తండ్రి యనంతరము పాలించుచు వచ్చెను. ఈయన శా. శ. 1038 వ సం॥లో మధుకంబల్లి యను గ్రామమును బాపట్లలోని భావనారాయణ స్వామికి దానమిచ్చి యొక శాసనము వ్రాయించెను♦. ఇంతేగాక నీతఁడు శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరాలయమున చాళుక్య విక్రమ 46 వసం॥ న తన తల్లియగు పల్లమదదేవికిని తండ్రియగు కామరాజునకును ధర్మమునకై యఖండదీప

---

* No. 262 of 1905.
♦ S. I. I. Vol VI. No. 155

దాన మొనర్చి శాసనము లిఖించెను.* ఈయనకు చోడబల్లిరాజను తమ్ముఁ డున్నట్లును, అతఁడు గూడ 10 మాడలు దేవుని కర్పించిన ట్లును అందు వ్రాయఁబడెను. ఈతఁడు కమ్మనాటిని దాదాపు శా. శ. 1056 వ సం॥ వరకును తమ్ముఁ డగు చోడబల్లితో కలిసి పాలించుచు వచ్చెను. ఈ కన్నర దేవుని కుమార్తె మా దేవి కాళ హస్తిలోని దేవుని కఖండదీపదాన మొనర్చెను. ఇది విక్రమచోళుని 12 వ రాజ్యపాలన సం॥నఁ గావించెను.

## —♦ చోడబల్లి ♦—

ఈ మహారాజునకు పొన్నమ దేవి, శ్రీ సతి యను నిర్వురు భార్యలు గన్పడుచున్నారు. శ్రీ సతి వలన నన్నిచోడుఁ డను కుమారుఁడు జనించెను. ఈయనకు కామచోడుఁడు II అను కుమారుఁడు గూడఁ గలఁడు. ఈ చోడబల్లికి నన్నిచోడుఁ డను కుమారుఁడును, ఆ నన్నిచోడునకు సూరరాజును, ఆతనికి రాజరాజును, ఆయనకు చోడమహాదేవి వలన మల్లిదేవుఁడును, ఆతనికి మహా దేవివలన నన్నిచోడ, మల్లిదేవులు గల్గిరనియు, నా మల్లిదేవుఁడు కాకతి గణపతిదేవ చక్రవర్తి వద్ద సామంతుఁడై కందుకూరి పుర వరాధీశ్వర బిరుదము ధరించి నట్లును, ఆతని శాసనము వల్ల విదితమగుచున్నది.

కందుకూరు ప్రాంతము గణపతిదేవ చక్రవర్తికి శా.శ. 1150 వ సం॥ దాదాపున లోఁబడినట్లు చారిత్రకముగా రుజువగు చున్నందున నిందలి చోడబల్లికి మల్లిదేవునకు మధ్య 4 తరములు మాత్రమే యుండుట వల్లను, తరమునకు 25 సం॥లు చొ॥ లెక్కించినచో చోడబల్లి శా. శ. 1050 వ సం॥ ప్రాంతీయుఁ డగు చున్నాఁడు.

ఈ మహారాజును పొన్నమదేవి యను భార్యయును శా. శ. 1057 వ సం॥ లో బాపట్లలోని భావనారాయణస్వామి కఖండ దీప

S. I. I. Vol IV No. 1328

దానము లొనర్చి శాసనములు వ్రాయించిరి*. ఈయన పాలనము హెచ్చుగా జరిగినట్లు కనుపడదు. ఇతని కుమారుఁ డగు కామ చోడుఁడు శా. శ. 1059వ సం॥ర ప్రాంతమునుండియు యువరాజుగా నున్నట్లు కన్పడుచున్నది.

## —♦ చోడ భూపతి ♦—

ఈయన మొదట కామచోడుని పుత్రులలో నొకఁడుగాఁ గన్పడుచున్నాఁడు. ఈయన భార్య సూరాంబ. ఈమె శా. శ. 1053 వ సం॥ లో బాపట్లలోని భావనారాయణ స్వామి కఖండ దీప దానము గావించి యుండెను.

## —♦ కామ చోడుఁడు II ♦—

ఈయన చోడబల్లి కుమారుఁడు. ఈయన పాలనము శా. శ. 1059 వ సం॥ నుండి కన్పడు చున్నది. ఈయన భార్యపేరు శ్రీయా దేవి. ఈ మహారాజు శా. శ. 1059 వ సం॥లో కొట్యదోనలోని బల్లేశ్వరస్వామికిఁ గొన్ని భూముల నిచ్చి దాన శాసనము వ్రాయించెను. ఈ బల్లేశ్వరాలయము తన తండ్రి పేరిట గట్టించి యందీ శాసనములు వ్రాయించి యుండును. శా. శ. 1075 వ సం॥లో శ్రీయాదేవి యొక శాసనము వ్రాయించెను. అది శిథిలమై యసంపూర్తిగా నున్నది. దానిని బట్టి శ్రీయాదేవి తల్లి జటచోడుని మనుమరా లని తెలియు చున్నది.

శా. శ. 1085 వ సం॥లో నీ శ్రీయాదేవి యనేక దానము లొనర్చినట్లు గన్పడును. కొట్యదోనలోని కామేశ్వరస్వామికి 3 పుట్ల భూదాన మిచ్చెను. ఇంతే గాక రాయూరులోని 3 పుట్ల భూమిని బల్లేశ్వరస్వామి కర్పించెను. ఈమె శా. శ. 1075 వ సం॥లో కొట్యదోనలోని కేశవస్వామికి సోంగ రేవుల ఉప్పలములోని భూమినిఁ గొంత యొసంగి, యఖండ దీప దానము గావించెను. ఈ మహారాజునకు త్రిభువన మల్లదేవ చోడుఁడను కుమారుఁడు జనించినట్లు కన్పడును.

---

* S. I. I. Vol. VI. No. 170.

## —♦త్రిభువన మల్లదేవ చోడ మహారాజు♦—

కొట్యదొన రాజధానిగా నీతఁడు శా. శ. 1059-77 సం॥ల మధ్య పాలించినట్లు శాసన దృష్టాంతములు గలవు. ఈయన తండ్రి యగు రెండవ కామచోడుఁడు శా. శ. 1059వ సం॥ తర్వాత నెన్ని సం॥ల వరకు పాలించుచుండెనో చెప్పఁజాలము గాని యప్పటి నుం డియు నీతఁడు యువరాజుగా పాలించుచుండె ననవచ్చును.

ఈయనకు కామిదేవి, మాచలదేవి యను పట్టపు రాణు లుండిరి. ఈ మహారాజునకు 'పిడువరాదిత్య' బిరుదమును, తెలుఁగు చోడరాజుల బిరుదము లన్నియును గలవు.

శా. శ. 1064వ సం॥ లో కొట్యదొన శంకరాలయమున కీతఁడు కొట్యదొనగ్రామము దానమిచ్చెను. శా. శ. 1069వసం॥లో నీయన కొట్యదొనలోని బల్లేశ్వరునకు గుండియపూడి గ్రామమును దాన మిచ్చెను. ఈయన భార్య యగు కామిదేవి శా. శ. 1070 వ సం॥లో నచటి కేశవస్వామి కఖండ దీపదాన మొనరించెను. ఈయ నకు మాచమాంబ వలన నన్నెచోడుఁడు, కన్నరదేవ చోడుఁడు, చోడదేవుఁడు నను ముగ్వురు కుమాళ్ళు జనించిరి. ఈ మహారాజు శా. శ. 1070వ సం॥లో తన తల్లి యగు శ్రియాదేవికిని, తండ్రి యగు కామచోడునకును పుణ్యమునకై కొట్యదొనలోని భీమేశ్వరు నికి 6 పుట్ల భూమి నొసంగెను.

ఈయన వద్ద అధ్యక్షుఁడుగా విదనప్రెగడ కొడుకు మల్లయ ప్రెగడ యను నతఁ డున్నట్లు కన్పడును.

ఈ మహారాజు శా. శ. 1078వ సం॥లో చనిపోవుట వలన గాఁబోలు యీయన పేరిట త్రిభువనేశ్వరాలయమును గట్టించి యీయన కుమాళ్ళు ముగ్వురును నూదనిపాటిలోఁ గొంత భూమిని నా దేవున కొసంగిరి. ఈ దేవాలయము బొప్పూడిలో నిర్మింపఁ బడెను. ఈ వంశీకులు కొందరా బొప్పూడిలో వసించుట వల్లనే యచట నా యాలయము గట్టింపఁబడి యుండును. ఏలయన నిదివరకే

కొట్యదొన గ్రామము దేవాగ్రహార మయ్యెను. ఈ బొప్పూడిలో వసించిన చోడవంశీకులే క్రమముగా బొప్పూడి వారుగా మారిపోయి రన వచ్చును. కమ్మవారిలో నిప్పటికిని బొప్పూడి వారు కలరు. ఇట్లే కొట్యదొనలోని వారు కొందఱు కొట్యదొన వారై పోయినట్లు కనుబడును.

త్రిభువన మల్లచోడుని వద్ద కవలియ అన్నయామాత్యుఁడు గుండిమెడ పాలకుఁడుగాఁ బ్రసిద్ధి వహించి బాపట్లలోని భావనారాయణస్వామి మున్నుగా ననేక చోట్ల గల దేవుళ్ళకు అఖండ దీప దానములు గావించి ధర్మాగ్రేసరుఁడుగాఁ బేరొందెను.

ఈ త్రిభువన మల్లచోడుని రాణులలో నొకటియగు కామిదేవి అమరాద్రి నల్ల భూపతికి వెన్నమాంబ యందు జనించినది. ఈయన సార్వభౌమ్య సృపాలుఁ డగు రెండవ కులోత్తుంగ చక్రవర్తికి సామంతుఁడుగా కమ్మనాఁటిని పాలించుచు వచ్చెను.

## —♦ చోడబల్లి II ♦—

ఈయన మూఁడవ కామచోడుని పుత్రుఁడుగఁ గన్పడు చున్నాఁడు. ఈయనకు కామిదేవియను భార్య గలదు. ఈతఁడును పాకనాటిలో కొంతభాగమును పాలించుచుండఁగా త్రిభువనమల్ల చోడుఁడు కమ్మనాటిలో పాలించినట్లు కన్పడుచున్నది. ఈయన శా. శ. 1067వ సంIIలో మన్నెపల్లిలోని మల్లేశ్వరస్వామికి మన్నెపల్లి గ్రామము నొసంగి శాసనము వ్రాయించెను. శా. శ. 1069వ సంIIలోను, 1088 వ సంIIలోను అచటనే యీతఁడు మఱికొన్ని దానము లొనర్చి యుండెను. ఆ శాసనములలో నొకచోట మన్నెపల్లి తనజీవితవర్గమైన గుండికర్తిలోనిదని యీతఁడు వ్రాయించెను. ఈయన భార్యయగు కామిదేవి శా. శ. 1076వ సంIIలో కల్లేపల్లిలోని స్వామి కఖండ దీపదాన మొసఁగెను.

ఈయన మన్నెపల్లిలో శా. శ. 1088 వ సంIIలో వ్రాయించిన శాసనమందు తన వంశావళి నీ క్రిందివిధమునఁ జెప్పెను.

పౌత్రపి నన్నిచోడునకు వెంకచోడుఁడును, ఆతనికి కామచోడుఁడును, ఆ కామచోడునకు తాను బుట్టి రని వ్రాసెను. త్రిభువనమల్లదేవుని తండ్రియగు కామచోడుఁడును, యీతని తండ్రి యగు కామచోడుఁడును ఒకరేయనుటకు వీలులేకున్నది. ఏలయన యీతని తండ్రి వెంకచోడుని కుమారుఁడును, నన్నిచోడుని మనుమఁడు నై యుండఁగా, నాతని తండ్రి చోడబల్లి కుమారుఁడుగను, తాతపౌత్రపి కామచోడుని కుమారుఁడుగను కనుబడుచున్నారు. కొణిదెనలో పాలించిన చోడబల్లియును, యీతఁడును ఒకరే యనుటకు వీలు గన్పడదు. ఆతని పాలనము కొణిదెనలో శా. స. 1059వ సం॥ తర్వాత కనుబడుట లేదు.

## —♦ నన్నెచోడుఁడు I ♦—

ఈయన చోడబల్లి రాజునకు శ్రీసతి యందు జనించినవాఁడు. ఈయన తాలూకు శాసనములు గన్పడుట లేదు; కాని యితఁడు రచించిన కుమారసంభవ మను కావ్యమున తనను గుఱించి యిట్లు వ్రాసికొని యున్నాఁడు.

" చం॥ అరి నరపాలమౌళి దళి-తాంఘ్రి యుగుండయి పాక నాఁటియం
దిరువది యొక్క వేయిఁటి క-ధీశుఁడు నా జను చోడ బల్లికిం
జిరతర కీర్తి కగ్ర మహి-షీ తిలకం బన హైహ యాన్వయాం
బర శశిరేఖయైన గుణ-భాసిని శ్రీ సతికిం దనూజుఁడన్॥"

ఈయనకు మల్లికార్జునయోగి గురువై యుండెను. ఇతఁడు కుమారసంభవ కావ్యము నాతనికే కృతి యొసంగెను. అం దాతని గుఱించి యిట్లు వర్ణించెను.

" సీ॥ శరధినీరులు పయో-ధరములు కొనివచ్చి। కురిసి వారిధియందు-కూర్చునట్లు।
చేన బండిన విత్తు-చేనికి ఫలకాంక్షఁ। బేరి గ్రమ్మఱ వెద-వెట్టు నట్లు।
రోహణాచలపతి-కూహించి వరరత్న, సంచయంబున విభూ-షించునట్లు।
తీర్థాళి కర్థి ద-త్తీర్థోదకంబుల, నెసకంబుగా నర్ఘ్య-మిచ్చి నట్లు।
గీ॥ నింగి ముట్టి యున్న-జంగమ మల్లయ, వరమునందు గనిన-వస్తు కవిత
దగిలి వారి యంద-నెగడింతు రవికి దీ, పమున నర్చ లిచ్చు-పగిది వోలె।

క్రింద వివరింపఁబడిన యీతని వంశమును బట్టియే యీయన శా. శ. 1057—70 ప్రాంతీయుఁ డని నిర్ణయింపవచ్చును. నన్నె చోడుని భార్యయగు కామపరాణి శాసన మొకటి శా. శ. 1076వ సం॥ నాటిది గన్పడు చున్నది. ఆమె యీతని దేవియో లేక రెండవ నన్నెచోడుని దేవియో తెలియుటలేదు.

## —♦ మొదటి నన్నెచోడుని వంశము ♦—

చోడబల్లికిని, శ్రీసతికిని జనించిన నన్నెచోడ మహారాజు వంశ మీ క్రింది విధముగ నొక శాసనమున వ్రాయఁబడినది. నన్నె చోడునకు సూరరాజును, ఆతనికి అనుజఘటంకార బిరుదాంకితుం డగు రాజరాజును, ఆతనికి చోడ మహాదేవివలన మల్లిదేవుఁడును, ఆతనికి మహాదేవివలన నన్నెచోడుఁడు॥ను, ఆతనికి మల్లిదేవుఁడును, బుట్టి రని యం దున్నది. ఈ మల్లిదేవుఁడు చోడ వంశీకుల బిరుద ములును, 'పాకనాటి విషయ ఏకవింశతి సహస్ర గ్రామావనీ వల్లభ' బిరుదమును వంశాచారమును బట్టి వ్రాసికొన్నను, నిజ ముగా నీతఁడు కందుకూరి ప్రాంతమును పాలించు నొక సామం తుఁడుగాఁ గన్పడుచున్నాఁడు. ఈయన బిరుదములలో 'కందుకూరి పురవరేశ్వర' బిరుద మొకటి. ఈ మల్లిదేవుఁడు కాకతిగణపతి దేవ చక్రవర్తికి సామంతుఁడు. ఈతఁడు గణపతి దేవునికి పుణ్యమునకై పరిదపూడిలోని శ్రీ భీమేశ్వరస్వామికి పరిదపూడిగ్రామమును దాన మొసర్చి శాసనము వ్రాయించెను. గణపతిదేవచక్రవర్తి శా.శ.1140 వ సం॥ప్రాంతీయుఁ డగుటవల్లను, నాతని సామంతుఁడగు మల్లిదేవునికి నన్నె చోడునకు 5 తరములు మాత్రమే యుండుటవల్లను, యీ మొదటినన్నెచోడుని తండ్రియగు చోడబల్లి శాసనములు శా.శ. 1057 వ సం॥ వరకుఁ గన్పడుచు తర్వాత నాతని జ్యేష్ఠ కుమారుఁ డగు కామచోడుని పాలనము గన్పడుట వల్లను, యీ మొదటి నన్నెచోడుఁడుగూడ శా. శ. 1057-70 సం॥ల మధ్యనుండినవాఁ డనవచ్చును.

## —♦ నన్నె చోడుఁడు II ♦—

ఈయన త్రిభువన మల్లదేవ మహారాజు జ్యేష్ఠ పుత్రుఁడు. ఇతఁడు శా. శ. 1078 వ సం॥లో బొప్పూడిలో వ్రాయించిన దాన శాసనమును గుఱించి లోగడ చెప్పఁబడినది. ఈయన వద్ద గుండ మంత్రి కుమారుఁడగు అన్నయ యొక మంత్రిగా నుండెను. ఈ మహారాజు శైవభక్తుఁడు. ఈయన శా. శ. 1073 వ సం॥లోను, శా. శ. 1081వ సం॥లోను తన తల్లిదండ్రుల పుణ్యమునకై కొట్యదోనలోని కేశవస్వామికి కొంత భూమిని దానమిచ్చి శాసనములు వ్రాయించెను. ఈతని సోదరుఁడగు రెండవ కన్నర దేవుఁడు కంచెర్లలోని భీమేశ్వరునకు 12 ఆవుల నిచ్చి యఖండ దీప దానము గావించెను.

ఈ కన్నర దేవుని వద్ద శా. శ. 1081 వ సం॥ ప్రాంతములో నల్లప్రెగడ యను మంత్రి యుండెను. ఈ కన్నర దేవుని వంశీకులు కొందఱు కంచెర్ల ప్రాంతములో నివసించుచు కంచెర్లవారని ప్రసిద్ధిఁ జెందిరా యని తోఁచు చున్నది. కమ్మవారిలో నిప్పుడున్న కంచెర్ల వారీవంశీకులే యని తలఁచెదను.

నన్నె చోడుఁడును, కన్నర దేవుఁడును వెలనాఁటి రెండవ రాజేంద్ర చోడునికి సామంతులుగా కమ్మనాఁటినిఁ బాలించుచు వచ్చిరి. కన్నర దేవుఁ డొకసారి స్వతంత్రుఁ డగుటకు ప్రయత్నింపఁగా రాజేంద్ర చోడుఁ డితర సేనాధిపతులఁ బంపి యణఁచినట్లు లోగడ తెలిపితిమి.

## —♦ కీర్తిరాజు మల్లిదేవ చోడరాజు ♦—

ఈయన శా. శ. 1117 వ సం॥ ప్రాంతీయుఁడు. ఇతఁడు తెలుఁగు చోడరాజుల బిరుదముల నన్నిఁటిని ధరించెను. జలమూరను పేరు గల విప్పర్ల గ్రామములోని మూలస్థాన దేవర కితఁడు శా. శ. 1117 వ సం,లో నొక దాన మొసర్చి శాసనము వ్రాయించెను. ఈ యింటి పేరిటి వారిప్పు డెచటనైన నున్నదియు లేనిదియు

తెలియుట లేదు. కమ్మవారిలో కొసరాజు, ముప్పరాజు, కొమ్మరాజు వారలున్నారు, కాని కీర్తిరాజువారు కనుపడుట లేదు. ఇతఁడోపిలి సిద్ధి పూర్వీకులలోని వాఁడేమో నని తోఁచుచున్నది.

## —♦ చాగి వెంకన వంశము ♦—

చాగి వెంకన కొడుకు బల్లెరా జనియు, నాతని కొడుకు కంట్రువంక్య రాజనియు, నాతని కొడుకు నన్నిచోడుఁ డనియు, నాతని కొడుకు సూరపరా జనియు, నాతని కొడుకు రాజమహేంద్ర పొత్తపి చోడుఁ డనియు, నా పొత్తపిచోడుఁడు నన్నూరు ఓంకార దేవికి శా. శ. 1010 వ సం॥లోఁ గొంత భూదాన మిచ్చినట్లుగా వ్రాయఁబడిన యొక శాసనము గలదు. ఈ పొత్తపి చోడుఁడు సూర్యవంశీకుఁడనియే యా శాసనమునఁ గలదు. ఈ వంశమునకు కొణిదెన శాఖ తెలుఁగు చోడుల మూలపురుషుఁ డగు బల్లయచోడున కును గొంత సంబంధ ముండవచ్చును, గాని స్పష్టపడుట లేదు. పరిదె పూడి శాసనములోని మొదటి నన్నిచోడుని పేరును, ఆతని కుమారుఁ డగు సూరపరాజు పేరును యిందు సరిపోవుచున్నను, అంతకు పై వంశావళి సరిపోవుట లేదు. దీని నింకను చరిత్రజ్ఞులు బాగుగా పరి శోధించిన యెడల తెలుఁగు చోడుల వంశావళికి తోడ్పడునని నమ్మె దను. ఇది మఱియొక శాఖయైనను కావచ్చును.

## —♦ తెలుఁగు బిజ్జన మన్మఁడు - మల్లిదేవుఁడు ♦—

పొత్తపి రాజధానిగ పాక నా డిరువదియొక్కవేయి గ్రామ ముల కీ మల్లిదేవుఁడు ప్రభువుగా నుండి పల్లవరాజులను జయించి నట్లు శా. శ. 1146వ సం॥ము నాటి ఓపిలిసిద్ధి శాసనము నందలి యీ క్రింది పద్యమువల్లఁ దెలియుచున్నది:

"చ॥ బిరుదన జన్న యా తెలుఁగు ♦ బిజ్జన మన్మఁడు మల్లిదేవుఁడ
చ్చెఱు వగుచున్న పొత్తపి య ♦ చెన్నయ వీడుగ వ్రాలి పాకనాఁ
డిరువది యొక్కవేయి జని ♦ నేలుచుఁ బల్లవు దండు గెల్చి త
త్కరివర కుంభ మౌక్తిక ల ♦ తాతతిఁ బుచ్చె నిజాసి పుత్రికన్॥"

ఓపిలిసిద్ధికిని యీయనకును మూఁడు తరములు మాత్రమే యుండుటవల్ల నీతఁడు దాదాపు శక1070వ సం॥ర ప్రాంతీయుఁడుగాఁ గన్పడు చున్నాఁడు. ఇతఁడు తెలుఁగు బిజ్జన కుమారుని కుమారుఁడే యనుటకు వీలులేదు. కొన్నితరములు గడచినను, సాధారణముగా మనుమఁ డనియే చెప్పు వాడుక ప్రకారము పై శాసనము వ్రాయఁ బడి యుండును. కాకతి గణపతిదేవ చక్రవర్తి సామంతులలో నొకఁడగు మల్లిదేవుఁడు వ్రాయించిన శాసనములో తన తండ్రి నన్నెచోడుఁ డనియు, తాత మల్లిదేవుఁ డనియు వ్రాయించి యున్నాఁడు. ఈ మల్లిదేవుఁడాతఁడేమోనని తోఁచుచున్నది గాని ఓపిలిసిద్ధి నన్నెచోడుని పేరందు వ్రాయించలేదు. ఇది యైనను, కాకున్నను యీతఁడు శక 1070వ సం॥ర ప్రాంతీయుఁ డనుటకు సంశయింప నక్కఱలేదు.

## —♦ పొత్తపి సిద్ధిభూపతి, మల్లిదేవుఁడు ♦—

మల్లిదేవుని జ్యేష్ఠ పుత్రుఁడగు సిద్ధిచోడరాజు తన తండ్రి యనంతరము పొత్తపిరాజధానిగా పాకనాఁటిని పాలించి యుండును. ఈయనను గుఱించియు, నితని తమ్ముఁ డగు మల్లిదేవుని గుఱించియు ఓపిలి సిద్ధి శాసన మిట్లు నుడువుచున్నది.

"చం. అతనికి బుట్టి రొప్ప మధు • రాంతక పొత్తపి చోడసిద్ధి భూ
పతియును మల్లిదేవుఁడును • బాహు పరాక్రమ విక్రమ క్రమఁల్
నత నరనాథ బాలకదణస్థిర • పాదసరోజ వైభవా
వితత సముద్ర కాంచి పరి • వేష్టిత భూపరి రక్షణక్రమఁల్॥ "

వీరిర్వురును శా.శ. 1100వ సం॥ ప్రాంతీయు లని చెప్పవచ్చును.

## —♦ ఓపిలిసిద్ధి I-మల్లిదేవుఁడు ♦—

వీరిర్వురును పైన నుడివిన మల్లిదేవుని కుమారుళ్ళు. వీరు సేనా నాయకులుగా ప్రసిద్ధి వహించినట్లుకన్పట్టు చున్నది. వీరిని గుఱించి ఓపిలిసిద్ధి II శాసన మిట్లు వచించుచున్నది.

చ॥ భూప దిలీపుఁడై వరగు • పౌత్రపి సిద్ధని తమ్ముఁ మల్ల ధా
త్రీ పతికిన్ సమస్త జగ • తీ పతికి న్సుతులు దృవించి రా
శాపరి పూర్ణ కీర్తులు భు • జా బలవంతులు నైన తొంటి య
య్యోపిలి సిద్ధియున్ గుల స • ముద్ధరణుం డగు మల్లిదేవుఁడున్"॥

వీరు శా. శ. 1120 వ సం॥ ప్రాంతీయులుగా నున్నారు.

ఇందలి మల్లిదేవునకు గౌరిశ్రీ యను భార్య యుండెను. ఈమె వలన రెండవ ఓపిలిసిద్ధిచోడుఁడు జనించి తర్వాత ప్రసిద్ధికి వచ్చెను.

## —♦ ఓపిలిసిద్ధి దేవచోడరాజు II ♦—

ఈయన కాకతి గణపతిదేవచక్రవర్తి సామంతులలో నొకఁడుగా నుండి యాతఁ డొనర్చిన యుద్ధములలో సేనాధిపత్యము వహించి పేరుగాంచి కమ్మనాటికి పాలకుఁడ య్యెను. ఈయనకు "టంకణాదిత్య, జగదొబ్బగండ, కీర్తినారాయణ, ఒర యూరిపురవ రాధీశ్వర" రాది బిరుదులు గలవు. ఇతఁడు శా.శ. 1146 వ సం॥లో కొట్యదోన యందలి శ్రీశంకర స్వామికి మోగడ చెఱువు భూమిని గణపతి దేవునికి పుణ్యముగా దానమిచ్చి శాసనము వ్రాయించెను. ఆ శాసనమున తన వంశావళి నీ క్రింది విధముగఁ దెల్పెను: కరికాలన్నృపతికి మహిమానుఁడును; ఆతనికి రెండవ కరికాలుఁడు,-కొండమానుఁడు, దశవర్మ లను వారును; ఆ రెండవ కరికాలుని వంశమున చోడబిజ్జనయు, నాతనికి మనుమఁడుగా మల్లిదేవుఁడును; ఆతనికి పౌత్రపి చోడసిద్ధిభూపతి, మల్లిదేవులును; అందు సిద్ధిభూపతికి సోమేశ్వర, మల్లిదేవులును; సిద్ధిభూపతి తమ్ముఁడగు మల్లిదేవునికి ఓపిలిసిద్ధ, మల్లిదేవు లనువారును; అందలి మల్లిదేవునకు గౌరిశ్రీ మహాదేవియందు తాను జనించినట్లు వ్రాసెను.

## —♦ చోడమల్లి దేవుఁడు ♦—

శా. శ. 1212 వ సం॥ (క్రీ. శ. 1290 వ సం॥) ప్రాంతమున నీయన పాలనము దర్శి తాలూకాలోఁ గానవచ్చు చున్నది. ఈయన యా వత్సరమున ప్రతాపరుద్రదేవ చక్రవర్తి పుణ్యమునకై

దర్శి తాలూకా, భీమవరము గ్రామములో, గోపాలనాథస్వామిని ప్రతిష్ఠించి, యా దేవుని కచటి భూమిని కొంత దాన మిచ్చి శాసనము వ్రాయించెను. అందుచే నితఁడు కాకతీయ రెండవ ప్రతాప రుద్రుని సామంతులలో నొకఁ డనవచ్చును.

## —♦ మనుమగండ గోపాలచోడ రాజు ♦—

ఈయన నల్లసిద్ధి చోడుని కుమారుఁడు. కాకతీయ రెండవ ప్రతాప రుద్ర చక్రవర్తి కడ నొక సామంతుఁడుగానుండి యాతఁడు కాంచీ పురపాలకుఁడుగా నుండెను. ఈయనకు "మహామండలేశ్వర, భుజబలవీర, నిత్యసత్యప్రదాత, సేవణకటక వేణుకబళన, దావపావ కోపమాన, గుర్జర కాంభోజ నిదాన, ద్రవిళబలవార్ధి పరిశోషణ బడ బానల, రాయగండ గోపాల, విహితాహితమానభంగ, రాజ వేశ్యా భుజంగాది" బిరుదములు గలవు. పాండ్య రాజులు కొంద ఱొక సారి యాతఁడు పాలించు కాంచీపురమును ముట్టడించి జయిం పఁగా, ప్రతాపరుద్ర చక్రవర్తి ముప్పిడి నాయకుఁడు, రేచెర్లదాచా నాయనిం గారలను తన సేనాపతులకు తగిన సైన్యము నిచ్చి పంపించి పాండ్యులను జయించి పారఁదోలి యాతని మరల నచటి పాలనమునో నియోగించెను. ఈయన శా. శ. 1219 వ సం॥లో కొట్యదానలోని శ్రీ చెన్నకేశవస్వామికి తిరునాళ్ళకై పదుమూవర గండ సిద్ధాపురములో నిరవై పుట్ల భూమి నొసంగి శాసనము వ్రాయించెను*. ఈతఁడు తన తండ్రికి జనించిన యేమగురు పుత్రు లలో మధ్య వాఁడ నని వ్రాసికొనెను. ఈతఁడును రాజగండ గోపాలుఁడును ఒకరే యై యుందు రని యొక యభిప్రాయ మున్నది.

## —♦ మఱికొందఱు తెలుఁగు చోడరాజులు ♦—

శా. శ. 1058 వ సం॥ ప్రాంతమున పోతన చోడరా జను నతఁడును, ఆతని తర్వాత శా. శ. 1078 వ సం॥ ప్రాంతమున

---

* S. I. I. IV. No. 661.

నాతని కుమారుడగు జిక్కి దేవచోడుడును కమ్మనాటిలో కొంత ప్రాంతమున కధికారము సల్పుచున్నట్లు వారి శాసనములు తెలుపుచున్నవి*.

కొచ్చెర్లకోట ప్రాంతమున శా. శ. 1089 వ సంిలో పంట దేవచోళరాజు యొక్కయు, శా. శ. 1159 వ సంి ప్రాంతమున కనిగిరి తాలూకా గుడ్లూరులో చోడదేవ, చోడ, చిక్కిచోడుల యొక్కయు, శా. శ. 1176 వ సంిన హరిదేవ చోడునియొక్కయు పాలనము గన్పడుచున్నది. వీ రందరు యీ ప్రదేశములలోఁ గొన్ని గ్రామములకు మాత్రమే యధీశులుగాఁ గన్పడుచున్నారు. ఇందలి చోడదేవ, చోడ, చిక్కిరాజులు గుడ్లూరులోని నీలకంఠేశ్వర స్వామికి కొంత తోఁట భూమిని దాన మిచ్చియుండిరి.

వీరు గాక కాకతి గణపతిదేవ చక్రవర్తి వద్ద నొక సామంతుఁడుగా కన్నరదేవచోడుఁ డను నతఁడు పాలించుచున్నట్లు నందలూరు శాసనము వల్లఁ దెలియు చున్నది♦.

-♦పశ్చిమచాళుక్య చక్రవర్తుల సామంతులగు తెలుఁగుచోడులు♦-

(శంకరసచోడ మహారాజు)

ఈయన 11వ శతాబ్దమువాఁడు. త్రైలోక్య మల్లుఁ డను పశ్చిమచాళుక్య చక్రవర్తి సామంతులలో నితఁడొకఁడుగా నుండెను. ఈయనకు 'సమధిగత పంచమహాశబ్ద,మహామండలేశ్వర,మధ్యదేశాధీశ్వర,అయ్యణ వంశాన్వయ,కరికాలకులరత్నప్రదీప,కుమారాంకుశ నయ్యనసింగ, కాంచీపుర త్రిపురమాహేశ్వర'' మున్నగు బిరుదులు గలవు. వీనిని బట్టి యీతఁడొక మహామండలేశ్వరుఁడని స్పష్టపడుచున్నది. ఈయనకు పద్మలదేవి యను భార్య గలదు. ఈమె అయ్యణ వంశాన్వయుఁ డగు నీలకంఠదేవుని కుమార్తె. పద్మలదేవికి శంకరస చోడునకు జనించిన మల్లమహాదేవి తెలింగానాలోని గంగాపురము

* S. I. I. Vol. VI. No. 153
♦ 805 of 1922

నందలినంబుల కుంటలో మాడిసిర దేవాలయమునకు గొంత భూమిని దాన మిచ్చి శాసనము వ్రాయించెను♦. ఈ గ్రామము నైజాము రాజ్యములో నున్నది.

## —♦ రాజాదిత్య రసచోడ మహారాజు ♦—

ఇతఁడుగూడ నొక మహామండలేశ్వరుఁడు. కళ్యాణపురము రాజధానిలో మాడిసి రను గ్రామ ప్రాంతమున నీయన పాలించుచుండెను. త్రిభువనమల్ల పశ్చిమ చాళుక్య చక్రవర్తి కీతఁడు సామంతుఁడు. ఇతఁడు తన పేరిఁట రాజాదిత్యేశ్వరాలయమును చా. వి. 8 వ సం॥ (క్రీ. శ. 1083 వ సం॥)లో నిర్మించి దానికిఁ గొంతభూమియుఁ గొన్ని వస్తువుల నొసంగెను. ఈయనకు "విరోధి మండలికషూదన మహేశ, సుకవిబళ నిశుకరరిత సహాకారమునం; నర్తనవినోద లావకం, గండరొరణం, విజయరాదదిం, యజయ సహారణం" మున్నగు బిరుదావళి యున్నది.

## —♦ నిరుగనీ చోడమహారాజు ♦—

ఈతఁడు గూడ నొక మహామండలేశ్వరుఁడు. త్రైలోక్య మల్ల చక్రవర్తి సామంతులలో నొకఁడు. తెలింగానాలోని అలం పురము గ్రామమునం దితఁ డొక దాన శాసనము వ్రాయించెను. అం దీతఁడు తెలుఁగు చోడుల బిరుదులను ధరించినట్లే యున్నది. కాంచీపుర త్రిపుర మహేశ్వర బిరుద మొకటి శంకరస చోడుని వలెనే యీతఁడు గూడ ధరించెను*. ఈతఁ డా ప్రాంతమున కధికారిగా నుండె నన వచ్చును.

## —♦ మల్లరస చోడరాజు ♦—

ఇతఁడు తెలుఁగు చోడరాజులలోని కోడూరు శాఖకుఁ జేరిన వాఁడు. ఈయన త్రిభువనమల్లుఁ డను పశ్చిమ చాళుక్య చక్రవర్తి

♦ తె. శా. పుట. 111. * తె. శా. పుట. 112.

వద్ద నొక మహామండలేశ్వరుఁడుగ నుండెను. ఈయనకు "మహామండలేశ్వర చలువానెగడ్డం, కొడూర్పురవరేశ్వర, పతిహితరత్నాకర, రిపుతిమిర దివాకర, దియదుత్తరస్న్యాతసింగ, దియాళనాగ మనయ్యన గంధవార"ణాది బిరుదములు గలవు. ఇంకను "కల్కడిపురవరేశ్వర, అనేక సమరసంఘట్ట నోపలబ్ధ విజయలక్ష్మీసమాలింగిత విశాలవక్షస్థలం, క్షత్రియపవిత్ర, భువనత్రినేత్ర" అను బిరుదులు గూడ మఱియొకచోట వ్రాయఁబడినవి♦. తెలుఁగు చోడరాజులు "కల్కడిపురవరేశ్వర" బిరుదము గూడ ధరించుచుండిరి. అట్లే యీతఁడును ధరించెను. ఈ కొడూరు శాఖీయులగు చోడులు గూడ కొణిదెన శాఖీయులవలెనే దాసవర్మ సంతతివారుగఁ గన్పడుచున్నారు. ఈవిషయము కొలనుపాకలో నీశాఖీయుఁ డగు నొక కందూరిచోడరాజు వ్రాయించిన శాసనమువల్ల స్పష్టపడుచున్నది.
(తె. శా. పుట. 21)

ఈ మహారాజు సర్వజిద్వత్సరమున మప్పళిపూడి శ్రీ బ్రహ్మేశ్వరస్వామికి పంచోపచార పూజకై వితరణేంద్ర రాశి యను పండితునికిఁ గొంత భూమిని దానమిచ్చి శాసనము వ్రాయించెను. పశ్చిమ చాళుక్య లొనర్చుచు వచ్చిన ఘోర యుద్ధములలో నితఁ డొక సేనాధిపతిగా నుండి జయములు గొన్న ట్లీయన బిరుదులవల్ల గ్రహింపఁ గలము*.

## —♦ కందూరి రుద్రయనచోడరాజు ♦—

ఈయన యొక మహామండలేశ్వర బిరుదాంకితుఁడు. ఈతఁడు తెలింగానాలోని నేలకొండపల్లి ప్రాంతమును శా. శ. 1047వ సం॥ర ప్రాంతములో నేలుచున్నట్లు గన్పడును. ఈయన రాజ్యపాలన చేయుచుండఁగా, నా గ్రామమునందలి పెద్దచెఱువు తూము వద్దనున్న కొంతభూమిని కడత్తూరు శ్రీమహావిశ్వేశ్వర దేవునికి ఆ నాయకనాధ

♦ తె. శా. పుట. 127. * తె. శా. పుటలు 130 - 131.

నాయకుఁడు దానమిచ్చి శాసన మొకటి వ్రాయించెను. ఈ నేల కొండపల్లి కంభంమెట్టు రైలు స్టేషనుకు 18 మైళ్ళ దూరములో నొద్దుమీఁద నున్నది.

## —♦ కందూరి ఉదయనచోడరాజు ♦—

ఇతఁడుగూడ నొక మహామండలేశ్వరుఁడు. ఈయనకు "వీర మాహేశ్వర, కోడూర్పురవరేశ్వర, సూర్యవంశోద్భవ, కులతిలక, కాశ్యపగోత్ర, కరికాలాన్వ" యాది బిరుదులు గలవు. అందుచే నీతఁడు కోడూరు తెలుఁగుచోడుల శాఖకుఁ జెందిన వాఁడు. ఈయన వద్ద సుంకాధికారులు దండనాయక నల్లసిద్ధమయ్య, అరసిద్ధమయ్య యను వారలు శా. శ. 1084వ సం॥లో కోడూరులోని స్వయంభూ సోమనాథ దేవునికి దీపనైవేద్యములకు గంగాపురిలోని సుంకములను దాన మొనర్చిరి. ఆ కాలములో కోడూరి గోకర్ణసింగ యూక లను నామము లుండెను. ఈ సుంకాధికారుల శాసనము మహబూబు జిల్లాలోని జడచర్లలో నున్నది. ఈతనికిని కాకతీయ రుద్రదేవ మహారాజునకును విరోధము గల్గినందున రుద్రదేవుఁడు యీతని నగరముపై దండెత్తి వచ్చి యీతని జయించి, పట్టణమును దహించి నాశనముఁ జేసి యా పట్టణ మధ్యమున నొక గొప్ప తటాకము త్రవ్వించెను. అందుచే తుద కీతనికి పిచ్చియెత్తి క్రమముగా చని పోయెను. ఈతని కుమార్తె యగు పద్మావతిని రుద్రదేవుఁడు పెండ్లాడెను. తెలుఁగు చోడకన్య యగు నీమెను దుర్జయ వంశీకుఁడగు రుద్రదేవుఁడు పెండ్లాడుటను బట్టి వీ రిద్వర జాతి యొకటియే యని బోధపడుచున్నది. ఈ ఉదయన చోడుఁడు చాల దుర్మార్గుఁడనియు, సవతి తల్లిని భార్యగా స్వీకరించె ననియు, రుద్రదేవుని శాసనములలో వ్రాయఁబడియున్నది. ఈ కోడూరు శాఖ చోడుల నుండియే కమ్మవారిలోని కోడూరు వారును, కందార, కందుల కుంట, కందాల, కుందూరు మున్నగు గృహ నామస్థులును

నేర్పడి యుందురని మొదటి భాగమునఁ దెల్పితిమి. ఏరువవారుఁ గూడ నీశాఖీయులై యున్నారు.

## —♦ చంద్రాదిత్య చోడరాజు ♦—

ఈయన శా. శ. 1060 వ సం॥ ప్రాంతీయుఁడు. చక్రకూట రాజ్యాధిపతి యగు ధారావర్షుని వద్ద నితఁ డొక సామంతుఁడుగా నుండెను. ఈతఁడు గూడ తెలుఁగు చోడులలోని వాఁడే. ఈయన వరశూర పట్టణ ప్రాంతమున పాలించుచున్నట్లు కన్పడును. ఆ పట్టణమున నితఁడు శా. శ. 1060వ సం॥ లో చంద్రాదిత్య సముద్ర మను నొక తటాకమును త్రవ్వించి, తన పేరిఁట నొక శివా లయమును గట్టించి దానికి వడ్డనాములోని యొక గ్రామమును ధారావర్షుని యనుమతితో దాన మొనర్చెను.

## —♦ భద్రభూపాలుఁడు ♦—

ఈతఁడు పశ్చిమచాళుక్య చక్రవర్తియగు భువనైక మల్లునికి సామంతుఁడుగా నుండిన యొక తెలుఁగు చోడరాజు. ఈతఁడు విద్వద్గోష్ఠి విహారుఁడుగా పేరొందుటయే గాక స్వయముగా నీతి శాస్త్ర ముక్తావళి, సుమతి శతకము మున్నగు గ్రంథములను రచించెను. నీతిశాస్త్ర ముక్తావళిలో నీ క్రింది పద్యము గలదు.

> "కం॥ శ్రీ విభుఁడ గర్వితారి। క్ష్మావర దళనోపలబ్ధ•జయలక్ష్మి సం
> భావితుఁడ సుమతి శతకము।గావించిన ప్రౌఢగావ్య•కమలాసనుఁడన్॥"

ఈయనకు "రాజరాజ మనోజుఁడనియు, దశదిశాభరణాంకుఁ డనియు, నరేంద్ర చతురాననుఁ డనియు, రవికుల శేఖరుఁ డనియు" బిరుదములు గలవు. ఈయనను బద్దెన యని గూడ పిలుచుచుండిరి. ఇతఁ డొనరించిన యుద్ధములేమో, యెచట జయలక్ష్మినిఁ బొందఁ గల్గెనో దృష్టాంతములు గన్పడవు. ఈయన వెలనాఁటిని పాలించెనని యొక యభిప్రాయము గలదు.

## —• పూండూరు హల్లక రస చోడ మహారాజు •—

ఈ మహారాజు పశ్చిమ చాళుక్య చక్రవర్తి యగు త్రిభువన మల్లదేవునికి సామంతుఁడుగా పూండూరు ప్రాంతము (నైజాములో నున్నది) ను శాలించుచు వచ్చెను. ఈయన చాళుక్య విక్రమ సం॥ 27 అగు క్రీ. శ. 1106 వ సం॥లో తన జైన గురు వగు కనకసేన భట్టాచార్యునకుఁ గొంత భూ దాన మొసంగి శాసనము వ్రాయించెను*. ఈయనకు "సమధిగత పంచమహాశబ్ద, మహామండలేశ్వర, అయోధ్య సింహాసన, వరాహలాంఛన, బుడకుర్వార్పురవరేశ్వర, బయానేగళ్ళనశింపూర, భుజంగరిపు పక్షయ కారణ, గోవింద నర సింహ, పద్మావతీలబ్ధ వరప్రసాద, యశస్సుధాధవళిత దిగ్వరేయను, ఆహారభయ భైషజ్య శాస్త్ర దాన వినోదన, మృగమదామోద, పంచబలసాధ" కాది బిరుదములు గలవు. ఇతఁడు బుడకుర్వారు పుర వరేశ్వర బిరుదమును ధరించినను, పూండూరునే గృహనామముగాఁ జేసికొని నట్లీయన శాసనమును బట్టి గ్రహింపవచ్చును. ఈయ నకుఁ గల అయోధ్య సింహాసన బిరుదము పారంపర్యముగ వచ్చినదే గాని యితఁ డచట పాలించి యుండలేదు. ఈయన వైద్యశాస్త్ర ములను దాన మొనర్చి యా విద్యను బోషించుచున్నట్లు పై బిరుదా వళి వల్లఁ దెలియఁ గలదు. ఈ వంశీకులే పూండూరి వారై యుందు రని మొదటిభాగమునఁ దెలిపితిమి.

* తె. శా. పుటలు 128 & 129.

## —♦ ఏరువవారు ♦—

ఎఱువ లేక ఏరువవారు కరికాలాన్వయులును, కోడూరు రాజధానిగా నేలి నట్టియు, తెలుఁగు చోడరాజుల సంతతి వారు. ఈ కోడూరు శాఖీయులు దాసవర్మ వంశములోని వారు*. ఈ కోడూరు చోడరాజులలో కొందఱి చరిత్రను లోగడ చదివితిమి. వీరిలో ఎఱువ ప్రాంతము నేలుచు వచ్చినవారే ఈ ఎఱువ గృహనామము ధరించుచు వచ్చిరి. ఈ వంశములో 12వ శతాబ్దము నుండి ప్రసిద్ధి వహించిన వారి చరిత్రమే మనకు లభ్యమగుచున్నది.

## —♦ ఎఱువ తొండయరాజు ♦—

క్రీ. శ. 1121 వ సం॥ ప్రాంతములో నీ వంశములోని తొండయరాజు పశ్చిమచాళుక్య చక్రవర్తి యగు త్రిభువన మల్లదేవునికి సామంతుఁడుగా నుండెను. ఈయన యొక్క మహామండలేశ్వరుఁడు. ఇతఁడు పంచ మహాశబ్ద గౌరవములను ధరించి వీర మాహేశ్వరుఁడుగా నుండినవాఁడు. ఈయనకు "కోడూర్పుర వరేశ్వర" బిరుదము గలదు. ఈయన భార్య పేరు మైలమదేవి. ఈమె శా. శ. 1043 వ సం॥ లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వర స్వామిని దర్శించి యఖండ దీపదానము గావించి యుండెను. వేంగీ చాళుక్యరాజ్య మల్లకల్లోలముగా నున్నపుడే పశ్చిమ చాళుక్య రాజుల సామంతు లీ ప్రాంతములకు వచ్చినట్లు కన్పడు చున్నది. అప్పుడే యీదీపదానము చేయఁబడి యుండును. కాకతీయ రుద్రమదేవి చక్రవర్తిని కాలములో ఎఱువ మల్లిదేవ చోడుఁడును, మఱియొక తొండయ రాజును ప్రత్యర్థులుగా నుండిరి. వారి నామె సేనాధిపతులలో అంబదేవుఁడును, గోన గన్నారెడ్డియు జయించినట్లు కన్పడు చున్నది. వారుగూడ నీ యెఱువ వంశీకులే.

---

* తెలింగానా శాసనములు పుట 123 చూడుఁడు

## —♦ ఎఱువ భీమరాజు ♦—

క్రీ. శ. 1200వ సం॥ర ప్రాంతములో నీ యెఱువ వంశమున భీమరాజను నతఁడు మిక్కిలి ప్రసిద్ధి వహించెను. ఈయన పరాక్రమము నొక కవి యిట్లు వర్ణించి యుండెను.

"ఉ॥ ఏఱువ భీమ. నీ పగతు • లెక్కని కొండలు చంచలాత్ము లై
దూఱని యట్టి ఘోర వన • దుర్గములం దనితా వియోగులై
పాఱని క్రోవలుం దినని • పండ్లును నాఁకట గూర లుప్పఁగా
నేఱని కట్టులుం గలవె • యీ లవణాంబుధి వేష్టి తా వనిన్॥"

ఈయనగాక 14వ శతాబ్దములో మఱియొక భీమరాజుకూడ ప్రసిద్ధి నొందెను. అందుచే నీ పద్య మాయన కన్వయించుటకుఁ గూడ నవకాశము గలదు. పై భీమ నృపాలునకు ప్రోలాంబ యను భార్య యుండెను. ఆమెవలన నతఁడు 'చౌహత్తినారాయణ' బిరుదాంకితుఁ డగు దామనృపాలునిఁ గాంచెను. దామనృపాలునకు లక్ష్మీదేవి యను సతీమణియందు సోమభూపతియు, నా సోమభూపతికి సూరాంబయందు గంగాధరుఁ డను నామాంతరమును, 'అరిగండరగండ, రాయవేశ్యాభుజం'గాది బిరుదులు గల అన్నదేవచోడుఁడును, ఆతనికి ఎఱుకుగాంబిక యను భార్యవలన కామభూపతి యనఁబడు భక్తీశ్వర చోళ నృపాలుఁడును, ఆతనికి అన్నదేవచోడుఁడును బుట్టినట్లు అన్నదేవుని తామ్రశాసనము వల్ల స్పష్టపడుచున్నది*. ఈ భీమరాజు తల్లిపేరు అన్నమాంబ.

## —♦ తెలుఁగు చోడ రాజులనుండి యేర్పడిన వంశములు ♦—

క్రీ. శ. 12 వ శతాబ్దము నుండి 15 వ శతాబ్దమువరకుఁ గల తెలుఁగు చోడరాజు వంశముల నుండి యీ క్రింది వంశము లేర్పడినట్లు శాసన దృష్టాంతములు లభించు చున్నవి.

ఎఱువ భక్తిరాజు, అన్న దేవచోడ రాజులను గుఱించి తెలుపు రాజమండ్రి మ్యూజియము తామ్రశాసనమువల్లను♦, శ్రీ ద్రాక్షా

* See Rajahmundry Musuem plates in J.A.H.R.S., I.

♦ J. A. H. R. S. Vol. I.

రామభీమేశ్వరాలయ శాసనము వల్లను⌀, గొల్లపూడి కామా నాయుఁడు శా. శ. 1207 వ సం॥లో ఆత్మకూరు తాలూకా చిరమన గ్రామమున వ్రాయించిన శాసనములో తెలుఁగు చోడులు ధరించిన ఒరయూరిపురవరాధీశ్వర బిరుదమును వ్రాసికొనుట వల్లను♦, అల్లే బద్యమద్రరాజు కొడుకు బయ్యరాజు శా. శ. 1212 వ సం॥లో రాజవోలు నందు వ్రాయించిన శాసనమును బట్టియు∫, శా. శ. 1117 వ సం॥లో క్రిరాజు మల్లిచోడరాజు విప్పర్లలో వ్రాయించిన శాసనమున కరికాలాన్వయుఁడ నని వ్రాసిన దానిని బట్టియు∓, శా. శ. 1348 వ సం॥లో కనుపర్తిలో ఆల మండల నూకయ దేవచోడరాజు కొడుకు వీరఅన్నుకుభూదేవ చోడ రాజును†, శా. శ. 1350 వ సం॥ లో ఒంగోలు తాలూకా నాగులపాటియందు ఆలమండల గంగయదేవ చోడరాజును వ్రాయించిన శాసనములలో చోడ శబ్దమును వాడుకొని యుండుట వల్లను, శా. శ. 1136 వ సం॥లో కావలిలో మన్మసిద్ధి తమ్ముఁడగు కడనల్లెతంగదేవ మహారాజు వ్రాయించిన శాసనమును బట్టియు⁹ శా. శ. 1403 వ సం॥ లో తిరుచునాపల్లి జిల్లా జంబుకేశ్వర ములో వాలకకామయ్య వరపు అక్కలరాయుఁడు 'ఒరయూరిపుర వరాధీశ్వర' బిరుదు వహించి వ్రాయించిన శాసనమును బట్టియు$\pi$ శా. శ. 1476 వ సం॥ లో కుంభకోణములోని ఆదికుంభేశ్వరస్వామి దేవాలయమున గురురాజ రుద్రదేవ చోళ మహారాజు చోళ శబ్ద మును వాడుకొనుచు వ్రాయించిన శాసనమునుబట్టియు, * శా. శ. 1452 వ సం॥లో శ్రీరంగమునందు చెన్నయబాల దేవుఁడు 'ఒర యూరిపుర వరాధీశ్వ'రాది బిరుదులతో వ్రాయించిన శాసనమును

---

⌀ S. I. I. Vol. IV P. 420. ♦N. I. A/25. ∫N. I. A/55.
∓S. I. I. Vol. VI. No. 587. † N. I. O/56.
§N. I. O/85. ⁹ N. I. Kavali/13.
$\pi$ 30 of 1891 & "The colas" Vol. II. P. 778
*291 of 1927 & "The colas Vol. II. P. 794.

బట్టియు •, చోడరాజుల నుండి (1) ఏరువవారు (2) గొల్లపూడి వారు (3) బద్యవారు (4) కీర్తిరాజువారు (5) ఆలమందలవారు (6) కడనల్లెవారు (7) వాలకవారు (8) గురురాజువారు (9) చెన్నయ వారు యేర్పడినట్లు కన్పడుచున్నది. ఇదిగాక ప్రథమ భాగ మున వివరించిన రీతిని శ్రీరంగమాహాత్మ్యమను గ్రంథమును బట్టి (8)కట్టా వంశీకులును, చాటుపద్యములను బట్టి(9)సూర్యదేవర వంశీకులును, రెట్టమత శాస్త్రమును బట్టి (10) కొండ్రాజు వంశీకులును తెలుగుచోడ వంశీకు లనియో స్పష్టపడుచున్నది. కొండ్రాజువారును సూర్యదేవర వారును 'ఒరయూరి పురవరాధీశ్వర' బిరుదమును వాడుకొని యున్నారు♦.

ఇంతే గాక తెలుగు చోడులు పాలించుచు వచ్చిన ప్రదేశములు (11) వల్లూరు (12) నెల్లూరు (13) కోడూరు (14) మోపూరు (15) మాలెంపాడు (16)కొణిదెన (17) కంచెర్ల (18) పొంనూరు (19) నెక్కొండ (20) కందూరు మున్నగు వానిని బట్టి యా యా పేర్లతో నా యా వంశీకులకు గృహనామము లేర్ప డినట్లు కనుబడుచున్నది. ఇమ్మడి తిక్కరాజు ధరించిన 'ఇమ్మడి' పదమును బట్టియో తద్వంశీకు లా (21) 'ఇమ్మడి' ని గృహ నామమును జేసికొని యుండవచ్చును.

## —♦ కమ్మవారిలోని తెలుగు చోడవంశములు ♦—

ఈవిధముగ నేర్పడిన వంశములలో కమ్మవారిలో నేటికిని యీ క్రింది వంశములు నిలచియుండి కమ్మవారిలో చాలవరకు ఈ తెలుగుచోడ వంశీకులైనట్లు తెలుపుచున్నవి. అందుచే కాంచీ పుర చోడులకు వీరు దూరపు జ్ఞాతు లనవచ్చును.

(1) ఏరువవారు (2) సూర్యదేవరవారు (3) గొల్లపూడివారు (4) ఆలమందలవారు (5) కోడూరువారు (6) నెల్లూరువారు

• 56 of 1892 (S. I. I. Vol. IV. No. 503)

♦ కమ్మవారి చాటు పద్యములు, రెట్టమత శాస్త్రము చూడుడు.

(7) మోపూరువారు (8) వల్లూరువారు (9) కొణిదెనవారు (10) మూలెపాటివారు (11) కంచెర్లవారు (12) పొందూరువారు (13) నెక్కొండవారు (14) కందారవారు (15) ఇమ్మడివారు (16) కట్టావారు.

వీరేగాక వీరి బంధువు లగు ననేకుల వృత్తాంతము మనకు కాలగర్భమునఁ బడి తెలియకపోయినను, వారిలో ననేకు లనేక చోట్ల నివసించుచు వేర్వేరు గృహ నామములు ధరించుచు వచ్చినట్లును, అందు చాలమంది చోడ వంశీకులే యైనట్లును ఊహించుట సత్యదూరము గాదు. శాసనముల రీత్యా పైన నుదాహరింపఁబడిన కొన్ని వంశము లిప్పటికి నశించి యుండవచ్చును. కొన్నిటి నామములు మార్పుచెంది యుండవచ్చును. వానిలోఁ గల 'కొండ్రాజువారును కట్టావారును' నేటికిని క్షత్రియులలోఁగూడ నున్నారు. వీరి వృత్తాంతము చారిత్రక ప్రసిద్ధి గలదిగా నున్నది. కమ్మవారిలో గూడ కట్టా వా రున్నారు. ఇట్లు తెలుఁగు చోడులు నేటి యాంధ్ర క్షత్రియులలో కొందఱును, కమ్మవారిలో కొందఱును ఉన్నా రనుటకు స్పష్టమైన యాధారములు లభించుచున్నవి. కొందఱు విమర్శకులు తలంచినట్లు కమ్మవారు తెలుఁగు చోడులకు బంధువులు మాత్రమే కా దనియు, తెలుఁగు చోడ రాజులలో కొందఱు కమ్మవారుగా మారిపోయి రనియు పై యంశములవల్ల ధృవపడుచున్నది. ఇట్లే రాష్ట్రకూట రాజులనుండి యేర్పడిన రెడ్డిప్రభువులలోఁగూడ వీరి సంబంధములు కన్పడుచున్నందున వారిలోఁ గూడ చోడులు కొంద రైక్యమైపోయి రనవచ్చును. ఈ రెడ్డివీరు లనేకులు సూర్యవంశీకుల మని వ్రాసికొనిన దృష్టాంతములుగలవు*. ఆ కాలము వరకు నేటి యాంధ్ర క్షత్రియులకును రెడ్డి, కమ్మవారలకును బంధుత్వము లుండెను.

---

* శా. శ. 1248వ సం॥ము నాటి హంపి నృసింహాలయములో జగదాళ ఇమ్మడి దేవరెడ్డి కుమారుఁడు ప్రోలిరెడ్డి తాను సూర్యవంశములోని సుమిత్రుని మనుమఁడును, విశ్వవరుని పుత్రుఁడు నగు రాష్ట్రకూటుని వంశీకుఁడ నని వ్రాయించెను.

తిరువళ్లూరు వీరరాఘవస్వామి యాలయమున వేమభూపాలుఁడు శా.శ. 1326వ సం॥న వ్రాయించిన శాసనమున తాను సూర్యవంశజుఁడ నని వ్రాయించెను.

## —♦ మిగిలిన కమ్మవా రెవరు ? ♦—

ఇంతవరకును, దుర్జయ, చోడ, చాళుక్య, హైహయ రాజ వంశములనుండి యేర్పడిన కమ్మవారిని దృష్టాంతములు దొరకినంత వరకు గుర్తించితిమి. ఇంక ననేకులు మిగిలినవారేరే వంశమువా రయినదియు తెలిసికొనదగి యున్నది. వైశ్య వర్గము నుండి వచ్చి కమ్మవారిలో కొందఱు కలిసిపోయి రనియు, వారికి 'కుల' శబ్దాంతము గల గోత్రము లున్నట్లును మొదటి భాగమున నుడివితిమి. ఇట్టి వారు గాక మిగిలిన కమ్మవారు పైన నుడివిన రాజవంశముల నుండియు వారి బంధువర్గము (కాఁపులేక క్షత్రియ వర్గము) నుండియు నేర్పడి నట్లు మనము దృఢముగ విశ్వసింపవచ్చును. వీరందరును మొదట సూర్యచంద్ర వంశీకులుగా వ్యవహరించిన వారేయై యున్నారు. కాఁపులేక క్షత్రియవర్గమునకు 11 వ శతాబ్దము వర కెట్టి భేదములే దనియు, బంధుత్వాదులను గల్గియుండి రనియు లోగడ నుడివి యున్నాము. ఇఁక నీ మహావీర వంశములలోనుండి యేర్పడిన కమ్మ వారి చరిత్రలను దెలుసుకొందము.

## —♦ రాపర్తివారు - రాపర్తి ముంజరాజు ♦—

రాపర్తివా రిపుడు కమ్మవారిలో రాపర్ల వారుగా వ్యవహ రించు చున్నారు. వీరు చాల పూర్వీకులుగాఁ గన్పడు చున్నారు.

---

శా.శ.1456వసం॥లో వైకుంఠములోని విష్ణ్వాలయమున నాగిరెడ్డి యను నతఁడు వ్రాయించిన శాసనములోఁ గూడ నతఁడు రాజమహేంద్ర పాలకుఁడ ననియు, సూర్యవంశీకుఁడ ననియు వ్రాసెను. ఇతఁ డచ్యుతరాయల కాలమువాఁడు.

ఇట్లే కొన్ని గ్రంథములందును కలదు. రెడ్డి కుల నిర్ణయ చంద్రికఁ జూడుఁడు. ద్విపద భారతము రచించిన జయపురపు రామిరెడ్డి తాను సూర్యవంశీకుఁడ ననియే వ్రాసెను. సూతసంహిత రచించిన పట్టమెట్ట సోమనాథకవియు, అధ్యాత్మరామాయ ణము రచించిన కాణాదము పెద్దన సోమయాజియు రెడ్డి ప్రభువులు సూర్య చంద్ర వంశములలోని వా రనియే వరుసగా వ్రాసిరి. పై గ్రంథములఁ బరికింపుఁడు. ఇంకను గొన్ని శాస నాధారములను మొదటిభాగమున వ్రాసితిమి. చూడుఁడు.

అం దీ రాపర్తి ముంజరాజు మనకు తెలిసి నంతలో ప్రాచీనుఁడు. ఇతఁడు శా. శ. 1056 వ సం॥ (క్రీస్తు శకము 1134వ సం॥) ప్రాంతీయుఁడుగాఁ గన్పడు చున్నాఁడు. ఇతఁ డొక మండలేశ్వరుఁడు. అనఁగా కొన్ని గ్రామముల కధీశ్వరుఁడు. ఇతనివద్ద నొక యుద్యోగిగా నుండిన దండనాయక పోలమ జేతన్న శ్రీ ద్రాక్షారామము నందలి భీమేశ్వరస్వామి సన్నిధి నొనర్చిన దాన శాసనము శా. శ. 1056 వ సం॥లో వ్రాయఁబడినది♦. అం దీతని గుఱించిన ప్రస్తావన కలదు.

## —♦ రాపర్తి ప్రోలయ్య ♦—

ఇతఁడు వెలనాటి కులోత్తుంగ చోడ గొంకరాజు వద్ద నొక యుద్యోగిగా నున్న ట్రీయన కుమార్తె యగు వెలమున కొమ్మప్ప యను నామె శా.శ. 1072 (క్రీ.శ. 1150)వ సం॥లో గుంటూరుజిల్లా నాదెండ్ల గ్రామములోని శ్రీ మూలస్థాన దేవర కఖండదీప దానము గావించుచు వ్రాయించిన శాసనమువల్లఁ దెలియు చున్నది†. ఆ శాసనములో నీ రాపర్తి వారిని ప్రాంబర్తి వారని కూడ వ్రాయఁబడెను*.

## —♦ రాపర్తి కొసనయ్య ♦—

ఇతఁడు శా. శ. 1075 (క్రీ.శ. 1157) వ సం॥ ప్రాంతీయుఁడు. ఈయన కోనసీమ ప్రభువును, హైహయ వంశజుఁడు నగు కోన భీమరాజు వద్ద దండనాయకుఁడుగ నుండి ప్రసిద్ధి వహించినట్లు కన్పడు చున్నది. ఇతని తల్లిపేరు మేచమవ్వ. • ఇతని తండ్రి కామనాయకుఁడు. ఈతఁడు ద్రాక్షారామములోని శ్రీభీమేశ్వరస్వామిని శా. శ. 1070 వ సం॥ లో దర్శించి దేవునికి లోహదం డొకటి చేయించి యిచ్చెను. మరల నితఁడు శా. శ. 1075 వ సం॥ లో నఖండ దీప దానము గావించి శాసనము వ్రాయించి ప్రసిద్ధ వహించెను ‡. అం

♦ S. I. I. Vol IV. పుట 437 & * S. I. I. Vol. IV. పుట 206
‡ S. I. I. Vol. ~~VI~~ IV పుటలు 346 & 349.

దొక శాసనములో నాతని గుఱించి యిట్లు వ్రాయఁబడి యున్నది. ''

''శ్రీమార్గ ధార్మిక శ్శశ్వద్విశ్వజనీన శుద్ధచరిత
స్సౌజన్య రత్నాకరః॥

దీనిని బట్టియే యాతఁడు చాల మంచి వాఁ డనియు, ప్రసిద్ధ పురుషులలో నొకఁ డనియుఁ జెప్ప వచ్చును. కోన భీమరాజు కోన సీమలో పాలించిన వాఁడగుటచే నా ప్రాంతముల కీతఁడు తర్వాత వెళ్ళి యుండు నని తలంపఁబడు చున్నది.

## —♦ రావర్తి ముప్పనాయఁడు ♦—

ఇతఁడు వెలనాటి శ్రీ కులోత్తుంగ రాజేంద్రచోడయరాజు వద్ద పడవ లను నొక యధికారిగా నుండెను. ఈయన సూరయ్య యనఁబడు గొంకన నాయకునకును బిమ్మాంబికకును జనించెను. ఇతని వలెనే యీతని తండ్రికూడ ఖడ్గవృత్తిచేతనే జీవించిన ట్లీతని శాస నములోని యీ క్రింది శ్లోకభాగమువల్లఁ దెలియుచున్నది.

''ఖడ్గేచాస్య సహాయవా-తమతి ర్మావర్తి సూరం మహాన్
శ్రీమాం గొంకన నాయకో''

ఈయన శా. శ. 1088 (క్రీ.శ. 1166)వ సంIIలో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కఖండ దీపదాన మొనర్చి వ్రాయించిన శాసనము వల్ల *పై విషయములు తెలియుచున్నవి.

## —♦ రావర్తి మంగిరాజు ♦—

ఇతఁడు శా. శ. 1188 (క్రీ. శ. 1266) వ సంIIర ప్రాంతీ యుఁడు. ఈయనకు లక్ష్మీదేవి యను భార్యయు, ఉపేంద్రరాజను కుమారుఁడు ఉన్నట్లు కన్పడును. ఈయన భార్య యగు లక్ష్మీదేవి శా. శ. 1188వ సంIIలో తన కుమారుఁడు ఉపేంద్రరాజునకు ఆయు రారోగ్యములకై యఖండ దీప దాన మొనర్చి న ట్లొక శాసనము

* S. I. I. Vol. IV. పుట 347

వల్లఁ దెలియుచున్నది.§ ఈ మంగిరాజు శ్రీ ద్రాక్షారామభీమేశ్వరు నకు పసిడి ఘంటలు 20న్ని, వెండి పువ్వులు 100 చేయించి యిచ్చి శాసనము వ్రాయించి పేరొందెను.

## —♦ రాపర్తి ఉపేంద్రదేవుఁడు ♦—

ఇతఁడు పైన నుడివిన మంగిరాజు కుమారుఁడు. ఈయన భార్యపేరు అయతాసాని. ఇతని కాలములోఁగూడ వీరికి కొంత రాజ్యపాలన మున్నట్లు గన్పట్టుచున్నది. అందువలననే యీతని భార్య శా. శ. 1185వ సం॥ (క్రీ.శ. 1263) లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని దర్శించి యా దేవునికి తాడితోఁట యుత్సవముఁ నకుగాను విశ్వనాథపట్నమను గ్రామమును దానమొనర్చి శాసనము వ్రాయించి ప్రసిద్ధి వహించెను‡.

## —♦ సెజ్జ ప్రోలినాయకుఁడు ♦—

ఇతఁడు శ్రీమన్మహామండలేశ్వర వెలనాఁటి కులోత్తుంగ రాజేంద్ర చోడరాజువద్ద నొక యధికారిగా బేరొందినట్లు కను బడుచున్నది. ఈయన శాలివాహన శకము 1085 వ సం॥ (క్రీ. శ. 1187 వ సం॥) లో సూర్యగ్రహణకాలమున ద్రాక్షా రామములోని శ్రీ భీమేశ్వరస్వామిని దర్శించి యఖండ దీపదానము గావించి వ్రాయించిన శాసనములో నీతని గుఱించి యీ క్రింది శ్లోకము వ్రాయఁబడెను♦.

శ్లో॥ శాకాబ్దే బాణనాగాంబర శశిగణితే యాతి సూర్యోపరాగే
సోయం సంపూర్ణ పుణ్య స్సకవి సురతరుః సెజ్జ ప్రోల స్సుశీలః
శ్రీమద్భీమేశ్వరాయ త్రిపురవిజయినే ప్రాదిశద్దీపముచ్చై
ర్ద్రాక్షారామేశ్వరాయ త్రిభువన గురవే దీప మాచంద్రతారమ్॥

§ S. I. I. Vol. VI. No.692.
‡ S. I. I. Vol. IV. పుట 432.
♦ S. I. I. Vol IV. పుట 373

అమరావతిలోని మఱియొక శాసనములో వెలనాటి గొంక నృపాలుని వద్ద నీయన భార్య యగు కొమ్మానాని వంట కత్తెగాఁ ప్రసిద్ధివహించి వంటల కొమ్మానాని యని పేరు వహించి నట్లు వ్రాయఁబడెను. ఈమె అమరేశ్వరస్వామికి దీపదానము గావించి శాసనము వ్రాయించెను*. ఈ సెజ్జవంశీకులు కమ్మవారిలో నిప్పుడు రేపల్లె తాలూకా సింగుపాలెం ప్రాంతములలో నివసించుచు సజ్జా వారుగా వ్యవహరించుచున్నారు. ప్రోలి నాయకుని తల్లి దండ్రుల పేర్లు గల శాసనభాగము శిథిలమైనందున నింతకన్న వివరములు తెలియకున్నను, సెజ్జావారింత ప్రాచీనులని గ్రహింపవచ్చును.

## —♦ ఎలమంచి కొమ్మి నాయకుఁడు ♦—

ఇతఁడు శ్రీ కులోత్తుంగ చోడుఁ డనఁబడు తూర్పు చాళుక్య రాజు కాలములోని యొక ప్రసిద్ధనాయకుఁడుగాఁ గన్పడుచున్నాఁడు. ఈయనకు ఎఱ్ఱమాంబ యను సతీమణి కలదు. ఈయన శా. శ. 1072 (క్రీ. శ. 1150) వ సం॥లో ద్రాక్షారామములోని శ్రీ భీమేశ్వరాలయములో నఖండ దీప దానము గావించుటయే కాక దానికి గాను 50 గొఱెలను (ఇనుప యెడ్లు) సమర్పించి, లోహదం డొకటి చేయించి యిచ్చి శాసనము వ్రాయించి పేరొందెను. అందితఁడు చాల భక్తుఁడని వ్రాయఁబడెను♦. ఎలమంచివారు చాళుక్య వంశీకులనియు కమ్మవారిలోని వారనియు క్రిందటి చరిత్రలలో వివరింపఁబడినది. కమ్మవారిలోని ఎలమంచి వారింత ప్రాచీనులని యీయన సంగతి వల్లగూడ మనకుఁ దెలియుచున్నది.

## —♦ అయ్య నారప నాయకుఁడు ♦—

ఈయన వెలనాఁటి రాజు (గొంక III కాఁబోలు) వద్ద నొక సామంతుఁడుగా నుండెను. ఈయన తలగడదీవి మున్నగు గ్రామముల కధికారి. ఈయన తండ్రి భీమనాయకుఁడు. ఈయనకు జల్లయ,

* S. I. I. Vol. No. VI, 240.
♦ S. I. I. Vol. IV, పుట 391.

సూరయయను సోదరు లుండిరి. వీరందఱును యుద్ధమునం దారితేరి యుండిరి. జల్లయ కన్నారదేవుని రణరంగమున జయించెనఁట. ఈ కన్నరదేవుఁడు తెలుఁగు చోడులలోని వాఁడు.

నారపనాయకుఁడు కృష్ణాసాగర సంగమమున కోటపురమును రాజమందిరములను గట్టించి, యచట మంచి తోటలను నిర్మించి, యచట కరాళ భైరవాలయ మొకటియు, విష్ణ్వాలయ మొకటియుఁ గట్టించి ప్రసిద్ధి వహించెను. ఇంతేగాక నితఁడు వట్టికూ రను గ్రామమున తన తండ్రి పేరిఁట భీమేశ్వరాలయమును గట్టించి, యచట భీమసముద్ర మను చెఱు వొక దానినిఁ ద్రవ్వించెను. ఈయన వెలనాఁటిలోని క్రొయ్యూరు రను గ్రామమున నివసించుచు వచ్చెను.

ఈయనకు పిన్నచోడుఁ డను కుమారుఁడు జనించెను.

## —♦ పిన్నచోడుఁడు ♦—

ఈతఁడు గూడ వెలనాఁటి చోడరాజు వద్ద (పృథ్వీశ్వరుఁడై యుండును) నొక సేనాధిపతిగా నుండెను. ఈయనకు జయపనాయకుఁడు, పృథ్వీనాయకుఁడు, నారపనాయఁడు నను కుమాళ్ళును; నారాంబ, పేరాంబయను కుమార్తెలును గలరు. ఈయన భార్యపేరు దామాంబ. ఈయన కుమాళ్ళందరును యుద్ధములలో నారితేరిన వీరాగ్రేసరులుగా నుండిరి. కాకతి గణపతిదేవచక్రవర్తి వెలనాఁటిని జయింప వచ్చి నప్పు డీయన విభవమును జూచి యీయన కన్యామణు లగు నారాంబ, పేరాంబలను వివాహమాడి, యీతని కుమారులలోని జయప నాయకుని తన గజసేన కధ్యక్షునిగా నియమించెను. పిన్నచోడుఁడు వెలనాఁటి పృథ్వీశ్వరుని పేరిఁట తన కుమాళ్ళలో నొకనికి పృథ్వీనాయకుఁడను పేరుఁబెట్టినట్లు గన్పడు చున్నది.

## —♦ జయప నాయకుఁడు ♦—

గణపతిదేవ చక్రవర్తి కడ నీతఁడు గజసైన్యాధిపతిగా మిక్కిలి ప్రసిద్ధి వహించెను. ఈయన చక్రవర్తి యనుఁగుగాఁ జేరం

దెను. ఈతనికి ''వైరిగోధూమఘరట్ట''ను బిరుదము గలదు. జయప నాయకుఁడు చక్రవర్తి పక్షమున కళింగదేశ దిగ్విజయమునకై వెడలి యచటి వారిని జయించి, రాజ్యమును చక్రవర్తి స్వాధీన మొనరించెను. ఈయన శా. శ. 1175వ సం॥లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కఖండదీప దానము గావించెను. ఇతఁడు చక్రవర్తి పేరిఁట గణపేశ్వరాలయ మొకదానినిఁ గట్టించి దాని కనేక గ్రామములను దాన మిచ్చెను. ఇది శా. శ. 1153 వ సం॥లో జరిగెను. ఈ యాలయ పోషణకై పడవ కొక పణము పన్ను గైకొనుటకుఁ గూడ నేర్పాటొనరించెను. ఇతఁడు చేబ్రోలులో తన తండ్రి యగు పిన్న చోడుని పేరిఁట చోడేశ్వరాలయమును ప్రతిష్ఠించి, యచట దేవదాసీలకు రెండంతస్థులు గల రెండు వరసల యిండ్లను గట్టించి యిచ్చి, దేవ భోగమునకై మోదుకూరను గ్రామమును దానమిచ్చి శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను.

ఈయన గొప్ప విద్వాంసుఁడు గూడనై యుండి నృత్త శాస్త్ర మను గొప్ప శాస్త్ర గ్రంథమును రచించెను. ఈతఁడు చేబ్రోలు గ్రామ మందలి దేవభక్తుని వారికి మూల పురుషుఁ డని యచటి వారొకరు నాకు చెప్పిరి; గాని దీని కింకను శాస నాధార ములు లభించుట లేదు.

ఈ అయ్య వంశీకులు కరికాలాన్వయులైనవారే యని మొదటి భాగమున దెల్పితిమి. శంకరసచోడుఁడు గూడ నీ వంశీకుఁడే యైన ట్లాతని శాసనములవల్ల స్పష్ట పడుచున్నది.

## —♦ గొల్లపూడి కామానాయకుఁడు, దేవినాయకుఁడు ♦—

వీరు శా. శ. 1207వ సం॥ర ప్రాంతమువారు. వీరు తెలుఁగు చోడరాజుల శాక్షియులు. అందువలననే వీరి శాసనములో ''ఒరయూరిపుర వరాధీశ్వర'' బిరుదమును జెప్పుకొనియున్నారు. వీరిరువ్వురును సోదరులు. కేశిమనాయకుఁ డను నాతని పుత్రులు. వీరు ఆత్మకూరు తాలూకా చిరమన గ్రామమున వసించుచు నచట పాల

కులుగా పేరందిరి. వీరు పల్లవ రా జగు విజయగండ గోపాలునికి సామంతులుగా నుండిరి. వీ రచటి మల్లిఖార్జున స్వామికి గొంత భూమిని దానమిచ్చి శా. శ. 1207వ సం॥లో శాసనము వ్రాయించిరి. వీరికి "గండరగండ, ప్రజమెచ్చుగండా"ది బిరుదులు గలవు. ఈ వంశీకులు కులోత్తుంగ రాజ్యపాలనము నాటినుండియు బ్రసిద్ధిగా నున్నట్లు కన్పడుచున్నది. కులోత్తుంగ రాజ్య 18వ సం॥లో గొల్లపూడి నాయకర్ అను నాతఁడు ఆ గ్రామములోని కేశవస్వామికి పన్నులు దానమిచ్చి శాసనము వ్రాయించి యున్నాఁడు. అతఁడు కూడ నీ వంశీకుఁడే యనవచ్చును. గొల్లపూడివారు చాళుక్య వంశీకులని సందేహించి మొదటిభాగమున నుడివితిమి గాని వీరి చరిత్రను బట్టి తెలుఁగు చోడరాజ వంశము వారని చెప్పవచ్చును. ఈ గొల్లపూడివారు నేఁటికిని కమ్మవారిలో గలరు.

## —♦ ఆలూరి ప్రోలభీముఁడు ♦—

ఆలూరివారు 11 వ శతాబ్దమునుండియు బ్రసిద్ధిగ నున్నట్లు దృష్టాంతములుగలవు. ఈయన వెలనాఁటి గొంక నృపాలుని బంటునని చెప్పుకొనెను. ఈయన తండ్రిపేరు ఆలూరిబోయు బోతయ్య. ఈ ప్రోలభీముఁడు శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కఖండ దీపారాధనకై లోహదం డొకటి జేయించి యిచ్చి శాసనము వ్రాయించెను.

## —♦ ఆలూరి పోతినాయుఁడు ♦—

ఈయన ఆలూరి పురవరాధీశ్వరుఁడుగా నుండెను. ఈయనకు 'సకల భువనరాజ్య లక్ష్మీ నివాస, చలమత్తుగండ, శౌచగాంగేయ, సకల లక్ష్మీనివాస, వివేక కమలాసన, శిష్టసముద్ధరణ, పతికార్యసాధక, పరనారీదూర, పతిమెచ్చుగండ, దుర్జయకుల విభూషణవార్ధి వర్ధన సుధాకర, సత్యరత్నాకర, స్వామిద్రోహర గండ, సహకార నివాస, పిడువరాది' త్యాది బిరుదములు గలవు. ఇతఁడు చోడనారాయణదేవ దివ్య శ్రీపాదపద్మారాధకుఁడ నని వ్రాసికొని యున్నాఁడు. అందుచే నితఁడు కులోత్తుంగ చక్రవర్తి I కి సామంతుఁ

డనవచ్చును. ఈయన 11వశతాబ్దములోని వాఁడు. ఈయన తండ్రి పేరు మల్లినాయుఁడు. ఇతఁడు శ్రీకాకొలను లోని శ్రీకాకుళేశ్వర స్వామికి నఖండ దీపదాన మొనరించి పఱుతిగడ పందుము చేను భూదానము గావించి శాసనము వ్రాయించెను. ఈయన దుర్జయ వంశీకుఁడ ననియు చతుర్థ కులస్థుఁడ ననియు జెప్పుకొనెను. ఈయ నకుఁ గల బిరుదములలో కొన్ని దుర్జయ వంశస్థులగు కాకతీయ రాజులును, వెలనాఁటి రాజులును ధరించి యున్నారు. ఈతఁ డా వంశీకుఁ డగుట వల్లనే యవి ధరింపఁ గలైను.

## —♦ తూంబర్తి సిద్ధప నాయకుఁడు ♦—

గుంటూరు జిల్లా నరసారావుపేట తాలూకాలో తూఁబా డను గ్రామము గలదు. అది పూర్వము తూంబర్తి యనబడు చుండెడిది. ఆ గ్రామమున నివసించినవారు తూంబర్తి వా రనియు దర్వాత తూమాటి వా రనియు ప్రసిద్ధికెక్కిరి. అందు తూంబర్తి సిద్ధపనాయకుఁడు ఆగ్రామమున కధీశ్వరుఁడుగా నుండెను. అతఁడు బుద్ధవర్మచే గొంత రాజ్య పాలనముబొంది నట్లీ క్రింది పద్యమువల్ల దెలియును. ఇది యీతని వంశీకుఁడైన యొక కాపయనాయకుని శాసనములోనిది*.

"చం॥ అదపయు నందలంబు వివి ♦ ధాతప వారణ కాహళావళిం
బడియము నాదిగా గల నృ ♦ పాలక చిహ్నలు బుద్ధవర్మచే
బడసిన వాఁడు నాయక స ♦ భామణి సిద్ధపనాయ కాంకుఁ డి
వ్వడమి దదీయ వీరభట ♦ పుంగవు మన్మఁడుదాత్త సంపదన॥"

ఈ సిద్ధపనాయకుఁడు కాపయనాయకుని మనుమఁ డనియు, నా కాపయగూడ తూంబర్తి శాసనుఁ డనియు దెలియుచున్నది. ఈ సిద్ధపనాయకుఁడు యెఱ్ఱమండరాజు బనుపఁగా శత్రువుల జయించి నందులకై ఆతుకూ రను గ్రామమును వృత్తిగా నిచ్చిన ట్లా శాస నమున గలదు. అందలి పద్యమిది.

* శాసన పద్యమంజరి.

"శా॥ తన్నగ్గించుచు నెట్టిమండఁడు బుధా • ధారుండు వన్నంగ న
మ్మన్నెటంగ వయంబుల న్రిపులకు • న్మార్పెట్టి యోడించి పే
ర్కొన్న న్మందన గంధవారణ సమా • ఖ్యం జేసి తూంబర్తి పై
నెన్న న్వృత్తిగ నాతుకూరు దయతో • నిచ్చె న్నిజస్వామియుఁ॥"

ఈయన సేవణి, సింగన, జగదేవుఁడు మున్నగు వారితో యుద్ధ మొనరించి యోడించినట్లు గన్పడును. ఈయన శా. శ. 1054 వ సం॥లో నచటి శివాలయమునకు అఖండ దీపదానము గావించి, వృత్తుల నేర్పరచి నృత్య వాద్యాదుల నేర్పరచెనఁట.

ఈయనకు మండమాంబ యందు కాపయ నాయకుఁడు జన్మించెను.

## —♦ తూంబర్తి కాపయనాయకుఁడు ♦—

ఈ కాపయనాయకుఁడు వెలనాఁటి రెండన గొంకనృపాలుని వద్ద నొక సేనాధిపతిగాఁ బ్రసిద్ధి వహించి నట్లితని శాసనములోని క్రింది పద్యమువల్ల దెలియుచున్నది. *

"ఉ॥ శ్రీ వెలనాటి గొంకనృప•శేఖరుశ్రీకరు సిద్ధిబేత వి
ద్రావణ రావణాంతక ప•రాక్రము విక్రమ చక్రిభూరితే
జో విభవాభి రాముఁడగు•చోడన చక్రము గొల్చి తత్ప్రసా
దావహలీల దాల్చిన మ•హాత్ముఁడు కాపఁడు ధర్మశీలుఁడై॥

ఈయన తూంబర్తిలో శివాలయ మొకదానిని గట్టించెను. ఈ వంశీకులే యిప్పుడు కమ్మవారిలో తూమాటివారుగా నున్నారు. ఈతఁడు క్రీ. శ. 1150 వ సం॥ ప్రాంతీయుఁడని చెప్పవచ్చును.

## —♦ విప్పర్ల అమరినాయకుఁడు ♦—

విప్పర్లవారు 12 వ శతాబ్దము నుండియు ప్రసిద్ధిగా నున్నట్లు కన్పడు చున్నది. ఈ అమరి నాయకుఁడు వెలనాటి కులోత్తుంగ రాజేంద్ర చోడరాజువద్ద నొక (భటాగ్రణి) యుద్యోగిగా నుండెను. ఈయన తండ్రి పేరు పోతి నాయకుఁడు. ఈయన శా. శ. 1091

* శాసన పద్యమంజరి.

సం॥లో (శాహి 25) శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరాలయమున నఖండ దీప దానము గావించి శాసనము వ్రాయించెను*. ఈయన తల్లి పేరు పెల్లమాంబ.

### —♦ విప్పర్ల అమరి నాయకుఁడు II ♦—

ఈయన శా. శ. 1158 వ సం॥ర ప్రాంతీయుఁ డగు సామంత నృపాలుఁడు. ఈయనకు "సమధిగత పంచమహాశబ్ద సామంత, తురగ రేవంత, దుర్జయకుల విభూషణ, దెలమదంలిన శౌన, పరబల సాధక, స్వామిద్రోహ కులాంతక, సంగ్రామభీమ, శౌచగాంగేయ, గొత్తంగోన రాచగుడియ గోపులమారి, పులియమార్కొలువ, కటకమున్నెలువమండలిక ఘూమకేతు" మున్నగు బిరుదు లనేకము గలవు. వానిని మొదటి భాగమున వివరించితిమి. ఈ బిరుదములను బట్టి యీతఁ డొక గొప్ప సేనాధిపతి యని తలఁపవచ్చును. ఈతఁడు శా. శ. 1158 వ సం॥లో బెజవాడలోని మల్లేశ్వరస్వామి కఖండ దీపదానము గావించి పేరందెను. ఈయన దుర్జయ వంశజుఁ డనని యే వ్రాసికొనుట గమనింపఁ దగినది. ఈ విప్పర్లవారు కమ్మవారిలో నేఁటికిని గలరు. వెలమవారిలోఁ గూడ నీ వంశీకులు కొందఱున్నారు.

### —♦ భండారి ముప్పినాయకుఁడు

ఈయన వెలనాఁటి కులోత్తుంగ రాజేంద్ర చోడరాజు II వద్ద భండారిగా నుండుటచే నాగృహనామము ధరించెను. శ్రీద్రాక్షారామములోని శ్రీభీమేశ్వరస్వామి కితఁడు శా. శ. 1087వ సం॥లో నఖండ దీపదానము గావించి శాసనము వ్రాయించెను. ఈయన తల్లి పేరు బెత్తమాంబ.

### —♦ నిడుబ్రోలి సబ్బినాయకుఁడు ♦—

ఇతఁడు వెలనాఁటి కులోత్తుంగ చోడరాజు II వద్ద కొట్టములపై నధికారము వహించి యుండెను. అందుచే నితని వంశీకులు

---

* S. I. I. Vol. IV, No. 1241

కొట్టూరివారై పోయిరి. ఈతని కుమారుఁడగు ఎరియమనాయకుఁడు శా. శ. 1085 వ సం॥లో నొక శాసనము వ్రాయించుచూ దాను సూర్యవంశీకుఁడ నని వ్రాయించెను.

## —♦ కొట్టూరి ఎరియమనాయకుఁడు ♦—

ఈయన కూడ కోష్ఠములపై యధికారిగా వెలనాఁటి కులోత్తుంగ చోడ నృపాలుని వద్ద నున్నట్లితని శాసనము వల్లఁ దెలియఁగలదు. ఈతఁడు శా. శ. 1085 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి నిత్య నైవేద్యమునకు ద్రవ్యము లన్నియు నిచ్చి, కొంత భూమి నిచ్చి అనన్తారామమున పోఁకతోఁట నొక దానిని దేవునకు కొనియిచ్చి ఖ్యాతిఁ జెందెను. ఈయన కొని యిచ్చిన పోఁకతోఁట వెయ్యి చెట్లు గలదిగా నుండెను. ఈతఁడు తర్వాత వెలనాఁటి రాజేంద్ర చోడరాజువద్ద ధనాధికారిగా నుండి శా. శ. 1089 వ సం॥లో ఒంగోలు తాలూకా కొండమంజలూరు గ్రామములో నొక శివాలయము గట్టించి భూదాన మొసంగెను.

## —♦ మోరంపూడి పోతినాయుఁడు ♦—

ఈయన వెలనాటి కులోత్తుంగ గొంక నృపాలుని వద్ద నొక మంత్రిగా నుండి ప్రసిద్ధి వహించెను. ఈయన తండ్రి పేరు కాటయ్య. ఈ పోతినాయుఁడు శా. శ. 1077 వ సం॥లో శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరస్వామి కఖండ దీపదానము గావించి లోహ దండొకటి చేయించి యిచ్చుటయే గాక, నా దేవుని మధ్యాహ్న నివేదనము నకై నిత్యము రెండు కుంచముల బియ్యము వండుటకు నన్నపశెట్టి పొలము పడమర భాగములో మూఁడుపుట్ల భూమిని దాన మొసంగి ఖ్యాతిగాంచెను. ఈ వనికండ్రవాటి మొఱమపూడి యీయన గ్రామమై యుండును. ఆ మొఱమపూడియే క్రమముగా మోరంపూడిగా నిప్పుడు పిలువఁబడుచున్నది. ఇది తెనాలి తాలూకాలో నున్నది.

N. I. O/59&60

## —♦ వింజము పోతరాజు ♦—

ఇతఁడు కులోత్తుంగ చోడ నృపాలుని యధికారులలో నొకఁడు. ఈయనవద్ద ఎఱ్ఱిపో తను సేవకుఁ డుండి శా. శ. 1062 వ సం॥లో శ్రీ భీమేశ్వరస్వామి కఖండ దీపదానము గావించి యుండెను. ఈయన తల్లి వింజమదేవి; తండ్రి భీమరాజు. వింజమదేవి శా. శ. 1067 వ సం॥లో శ్రీ భీమేశ్వరుని కఖండ దీపదాన మొనర్చెను. 50 యినుప మెడ్లనుగూడ సమర్పించెను. కమ్మవారిలో నిప్పటికిని వింజమువా రున్నారు. ఈ వంశ మింత ప్రాచీన మైనదిగఁ గన్పడుచున్నది.

## —♦ నల్లూరి వెల్లాలఁడు ♦—

ఇతఁడు పేరూరినాఁటి క్షత్రియుఁడ నని శాసనము లిఖించెను. శా. శ. 1037 వ సం॥న నితఁడు శ్రీ ద్రాక్షారామ భీమేశ్వర స్వామికి గొంతభూమిని దానమిచ్చి శాసనము వ్రాయించి కీర్తి వహించెను

## —♦ నల్లూరి రుక్కమ ♦—

ఈమెకును వెల్లాలనికిని గల సంబంధము తెలియుటలేదు. కాని యీమెగూడ యాతని కాలపు నారీమణియే. ఈమె శా. శ. 1022 వ సం॥లో శ్రీ భీమేశ్వరస్వామికి తమ పాలనలోని (రట్టడికము) శిస్తులో నాల్గవ భాగమును దానమిచ్చుటయే గాక నాలుగు పుట్ల భూమినిగూడ దానమిచ్చి శాసనము వ్రాయించి ప్రసిద్ధిజెందెను. ఇందులో "కులోత్తుంగచోడ నల్లూరి రుక్కమ" యని వ్రాయించెను గాని యా చక్రవర్తికిని యీమెకుగల సంబంధము తెలియదు. అతని పేరిట గల నల్లూరని తెలియఁగల గుర్తైనను గావచ్చును. లేదా యీమె యాతని సంబంధికురాలైన నగును. ఈ వంశీకులకు గుద్దవాడిలో రట్టడిక మున్నట్లు శాసనమువల్ల స్పష్టపడు చున్నది. గుద్దవాడి నేటి గుడివాడ తాలూకా ప్రాంతమని చరిత్రజ్ఞుల యభిప్రాయము.

## —♦ పాములపాటి వారు ♦—

### పాములపాటి కొమ్మనాయకుఁడు

ఈతఁడు పాములపాటి మండనకు యేడుమాంబయందు జనించెను. ఈతఁ డొక సేనాధిపతిగా నుండి పాములపాటిలో మల్లికార్జున స్వామికి శా. శ. 1094 వ సం॥లో నఖండ దీప దానము గావించెను*. ఈ దీప దానము తన తల్లి దండ్రుల ధర్మమున కై చేసెను. ఈ విషయ మాతఁడు వ్రాయించిన పద్యశాసనమున నున్నది. అది యీ క్రింది విధమున నున్నది.

ఉ॥ పాములపాటి మండనకు • బంకరుహానన యేడుమాంబకుం
గామ నిభుండు గొమ్మన సు • ఖస్థితి బుట్టి నిజాన్వవాయ సు
త్రాముఁడు తల్లిదండ్రులకు • ధర్మువుగా దన వృత్తిపై గ్రహ
గ్రామణి బోలిదీపక మ • ఖండితమై మహి బర్వ యొప్పఁగాన్"

"కం॥ శరధినిధిఖేందుసక వత్సర సంఖ్యల గార్తికమున • దనతిమ పూర్ణన్
స్థిరగురు దినమున గొమ్మన। యురుతర దీపంబు శివున • కొప్పుగ నిల్పెన్"

## —♦ పాములపాటి కేతన కుమారుఁడు కొమ్మన ♦—

పైన నుడివిన కాలమునకే మఱియొక కొమ్మన గూడ నీ వంశమునఁ బ్రసిద్ధిగా నుండెను. ఈయన పాములపాటి కేతన కుమారుఁడు. ఈతఁడు గూడ మల్లికార్జున స్వామి కఖండ దీప దానము గావించిన ట్లీ క్రింది శాసనము వల్లఁ దెలియుచున్నది.

" ఉ॥ శ్రీమహిమాభిరాముఁడు వి • శేషిత కీర్తుఁడు గొమ్మఁ డర్థి చిం
తామణి తల్లిదండ్రులకు • ధర్మువుగా శివధర్మయుక్తుఁడై
పాములపాటి నొప్పఁగఁ గ • పర్దికి సజ్జన సంస్తుతంబుగా
ధీమణి వెట్టె నాత్మకుల • దీపకమైన యఖండ దీపమున్."

## —♦ పాములపాటి వేమయ్య ♦—

ఈతఁడు శా. శ. 1095 వ సం॥ ర ప్రాంతమున పాములపాటిలో నుండిన యొక ప్రసిద్ధ పురుషుఁడు. ఈయన యెరగాంక

---

* శాసన పద్యమంజరి.

పుత్రుఁడు. ఈతఁడు గూడ మల్లికార్జున స్వామికి పాములపాటిలో నఖండదీపదానము గావించి యీ క్రింది శాసనము వ్రాయించెను.

"ఉ॥ వారక యా నిశాకర ది • వాకరమై చనఁగా శకాబ్దముల్
ధారుణివార్ధి నందదివి • తారకనాథ మితంబుగా మహీ-
గౌరవ ను త్తరాయణము • గారమె(యిన్) యెరగాంకపుత్రుఁ డు
త్సారిత దోషపుంజము వి • చార పరుండు ధరాతలంబునన్."

## —♦ పాములపాటి కొండయ్య ♦—

ఈతఁడు పాములపాటి భీమన్నకు కామపసానికి బుట్టి పే రొందినవాఁడు. ఇతఁడు గూడ తన తల్లి దండ్రుల ధర్మమునకై పాములపాటి మల్లికార్జునున కఖండ దీపదానము గావించి యుండెను. *

## —♦ భట్టిప్రోలి చోడపనాయకుఁడు ♦—

ఇతఁడు శా. శ. 1102 వ సం॥ ర ప్రాంతీయుఁడు. ఈయన వెలనాఁటి రెండవ కులోత్తుంగ రాజేంద్ర చోడరాజువద్ద భట్టిప్రోలు ప్రభువుగాఁ బ్రసిద్ధి వహించి యుండెను. ఈయన తండ్రి కంచెమ నాయకుఁడు. ఇతని తల్లి గుండసాని. ఈయనకు కామాసాని యను భార్య యుండెను. ఈతఁడు తన తల్లి దండ్రులకునుఁ దనకును తన భార్యకును ధర్మార్థమై (శ్రీ) ద్రాక్షారామ భీమేశ్వరుని కఖండ దీపదానము గావించి లోహ దండొకటి చేయించి యిచ్చి శాసనము వ్రాయించెను. భట్టిప్రోలి వా రిప్పటికిని రెంటచింతల ప్రాంతములో కమ్మవారిలో నున్నారు.

## —♦ ఈడుపుగంటి సేవకేతి నాయుఁడు ♦—

ఈతఁడు పన్నెండవ శతాబ్దములో నుండిన యొక ప్రసిద్ధ పురుషుఁడుగఁ గన్పడు చున్నాఁడు. ఈయన శాసన మొకటి బెజ వాడలోని మల్లేశ్వరాలయమున నున్నది. దానిని బట్టి చూడఁగా

♦ & * శాసనపద్య మంజరి

నీయన యచటి మల్లేశ్వరస్వామికి అఖండ దీపారాధనకై కొన్ని గొఱ్ఱెలను సమర్పించి నట్లు కనుబడు చున్నది. (S. I. I. Vol. P. 252)

## —♦ నాదెండ్ల కేతినాయుఁడు ♦—

ఈయన శా. శ. 1177 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన తండ్రిపేరు భీమనీఁడు. తల్లిపేరు యఱకాసాని. ఈయన గూడ బజ వాడలోని మల్లేశ్వర దేవరకు శా. శ. 1177 వ సం॥లో నఖండ దీప దానము గావించి ప్రసిద్ధి వహించెను. (S. I.I. Vol. IV. P. 252)

## —♦ కొల్లూరి ముడియపనాయకుఁడు ♦—

ఈయన 12 వ శతాబ్దములో నుండిన యొక ప్రసిద్ధ పురుషుఁడు. గుంటూరు తాలూకాలోని కాజ గ్రామమందుఁ గల నరేంద్రేశ్వర మహాదేవర కితఁడు సంధ్య దీపమునకై ద్రవ్య దాన మొసంగి శా. శ. 1078 వ సం॥లో నొక శాసనము వ్రాయించెను. ఆ కాలమున నాగ్రామము క్రాంజ యను పేరిట నుండెను. S. I. I. Vol. IV. P. 253

## — కొల్లూరి భీమినాయకుఁడు —

ఈయనగూడ 12వ శతాబ్దములోని వాఁడే. ఈయన తండ్రి పేరు కాపినాయకుఁడు. ఈతని భార్య మేడాసాని. ఈమె శా. శ. 1067వ సం॥లో ప్రేంపల్లి (బాపట్ల) లోని భావనారాయణస్వామి కఖండ దీపదాన మొనర్చి శాసనము వ్రాయించెను*.

## — ♦ద్రోణాది నారప నాయకుఁడు ♦—

ఈయనకూడ 12వ శతాబ్దము వాఁడే. ఈతని తండ్రిపేరు ద్రోణాది వేమనాయకుఁడు. ఈ నారపనాయకుఁడు శా.శ. 1071వ సం॥లో ప్రేంపల్లి (బాపట్ల) లోని భావనారాయణస్వామి కఖండ దీపదానము గావించి ప్రసిద్ధి వహించెను. ♦

* S. I. I. Vol. VI, No. 129. ♦ S. I. I. Vol. VI, No. 134.

## —♦ కంకణాల మల్లెనాయకుఁడు ♦—

ఈయన 13వ శతాబ్దము వాఁడు. ఈయన తండ్రి కందె నాయకుఁడు. మల్లెనాయకుఁడు శా. శ. 1163వ సం॥లో బాపట్ల లోని శ్రీ భావనారాయణదేవర కఖండ దీపదానము గావించి యచట నొక శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను†.

## —♦ చిలుకూరి భీమినాయకుఁడు ♦—

ఈయన 11వ శతాబ్దములోని వాఁడు. ఇతఁడు కులోత్తుంగ చోడరాజు దివ్య సం॥ 9 లో బాపట్లలోని శ్రీ భావనారాయణ స్వామి కఖండ దీపదానము గావించి ప్రసిద్ధి వహించెను¶. ఇతఁడు పెన్నాతవాడిలోని వాఁడ నని చెప్పుకొనెను. ఆకాలమున బెజవాడ ప్రాంత మట్లు ప్రసిద్ధి నొందెను. ఈయన తండ్రిపేరు చిక్క నాయకుఁడు.

## —♦ ముసునూరి గొండయ్య ♦—

ఇతఁడు తూర్పునాఁటి వాఁడ నని చెప్పుకొనెను. ఇతఁడుగూడ కులోత్తుంగ రాజ్యపాలన కాలమునాఁటి వాఁడు. అందుచే 11 వ శతాబ్ద పురుషవర్యుఁ డనవచ్చును. ఈయన దాన శాసన మొకటి బాపట్లలోనిభావనారాయణస్వామి యాలయమునఁ గన్పడుచున్నది♦.

## —♦ గొట్టిపర్తి యెఱ్ఱమ నాయకుఁడు ♦—

ఈయన శా. శ. 1120 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన అమరావతిలోని శ్రీ అమరేశ్వరస్వామి కఖండ దీపదాన మొనరించి శాసనము వ్రాయించెను*. ఈ దీపదానము కోట కేతరాజునకు

† S. I. I. Vol. VI, No. 159.
¶ S. I. I. Vol. VI, No. 187.
♦ S, I. I. Vol. VI, No. 179.
* S. I. I, Vol. VI, No. 216.

ధర్మార్థమై చేయఁబడెను. అందుచే నితఁడాయన సామంతుఁడని గ్రహింపవచ్చును. అం దీతని వంశ మిట్లు వ్రాయఁబడినది.

గొట్టిపర్తి యెఱ్ఱమ నాయకునకు రేకమ యను భార్యయందు సోమన్న, వెన్నన యను వారు పుట్టిరనియు, తర్వాత నా వంశమున కాలపనాయఁడు జన్మించె ననియు నా కాలప నాయునికి తాను జన్మించితి ననియు వ్రాయఁబడెను. ఈయన పూండిలో నొక తటాకమును త్రవ్వించి ప్రసిద్ధి వహించెను. ఈతఁడు చతుర్థ వంశమున జన్మించినట్లు యందుఁ గలదు. ఈ వంశీకులే క్రమముగా గొట్టిపాటి వారుగా మారిరని చెప్పవచ్చును.

## —♦ ముప్పిడి నాయకుఁడు ♦—

ఈయన తండ్రి పేరు నాగినాయకుఁడు. తల్లిపేరు గంగసానమ్మ. ఈతఁడు కాకతీయ రెండవ ప్రతాప రుద్రచక్రవర్తి మహాప్రధాను లలో నొకఁడు. ఈ యన దాన శాసనము లనేకము కందుకూరు సీమలో గనుపడుచున్నవి. క్రీ.శ. 1319వసం॥లో కాంచీపుర రాజ్యము మనుమ గండ గోపాల చోడరాజు ప్రతాపరుద్ర చక్రవర్తికి సామంతుఁడుగాఁ బాలించుచుండెను. అప్పుడు పాండ్య, కేరళ దేశాధీశులు వచ్చి యాతనిని జయించి రాజ్య మాక్రమింపఁగా చక్రవర్తి యాతని సహాయార్థమై ముప్పిడి నాయకుఁడు మున్నగువారలఁ బంపెను. ఈతఁడా సమయమునఁ దన పరాక్రమమును జూపి పాండ్య, కేరళ రాజులను బారఁద్రోలి క్రీ. శ. 1319సం॥ జూన్ 11వ తేదీని మానవీడుఁ డనఁ బడు నామన్మ గండగోపాలుని పునరభిషిక్తునిఁ జేసెను. ఈ యన కాంచీపురములోని అరుణాల పెరుమాళ్ళ దేవాలయమున నా నెల 16వ తేదీ కొన్నిధర్మములొనర్చి శాసనము వ్రాయించెను. ఇంతేఁ గాక వేగవతీ నదికి దక్షిణపు టొడ్డున నొక నానావిధ పుష్ప జాతుల యుద్యాన వన మొకటి నిర్మించి దేవుని కుపయోగించుటకై 240 మాడలును, దేవుని నిత్యకైంకర్యములకు 360 మాడలును, దేవుని శాశ్వతమండపాది నిర్మాణమునకు 382 మాడలు

ప్రతిసంవత్సరమును ఆదాయము గాఁగల పెయ్యూర్యారు, అయిరచేరి, పాండ్రె పాకమను గ్రామములను దాన మొనర్చి శాసనము లిఖించెను. కంకుకూరి సీమలోని గుడ్లూరు నీలకంఠేశ్వర స్వామికిత్ఁడొక దానమిచ్చి శాసనము వ్రాయించెను. ఇతఁడు పాకనాటి సీమను, తొండ మండలమును రాజ ప్రతినిధిగాఁ బాలించుచు వచ్చెను. ఈతఁడు వెలమ కులస్థుఁడు గావచ్చునని శ్రీ మా. రామ రావు బి, ఏ., బి. ఇ. డి గారభిప్రాయ పడినను, వెలమవారి కాలమునకు పూర్వమునుండియు వెలమవారుగా ప్రసిద్ధి నొందుట వల్లను, యీాయన శాసనములలో నెచ్చటను వెలమశబ్దము వాడకపోవుట వల్లను. యీాతఁడు శ్రీ చి. వీరభద్రరావు పంతులుగారభిప్రాయ పడినట్లు కమ్మవారిలోనివాఁడే యనవచ్చును. ఈయనకు పెద రుద్ర నాయఁడను కుమారుఁడు జనించి ప్రసిద్ధికి వచ్చెను.

## —♦ పెద రుద్రనాయఁడు * ♦—

ఈతఁడు గూడ కాంచీపుర దండ యాత్ర కాలములో నున్నట్లు గన్పడుచున్నది. ఈయన శాసన మొకటి క్రీ. శ. 1322వ సం॥ నాఁటిది ద్రాక్షారామమున నున్నది. దానిని బట్టి చూడఁగా నితఁడు పాండ్య దేశమునకు దండయాత్ర కేగెననియు, నచటి రంగనాధుని భయ భ్రాంతుని జేసి, యుద్ధమునుండి పారిపోవున ట్లొనరించెననియు, నందు చే కోటతిక్కరాజు మఱికొందరు మన్నెదొరలును నారాయణ వనము చుట్టుగల యరణ్యములో స్థావర మేర్పరుచుకొని యలజడి పరచుచుండఁగా నీతఁ డందలి కోట తిక్కనిఁ జంపి, మన్నెదొరలను వశపరచు కొని నెల్లూరి రాజ్యము స్వాధీన పరచుకొనెననియు దెలియుచున్నది.

ఒకసారి హొయిసలరాజయిన మూఁడవ వీర బల్లాల రాజునకు నీతనికిని చంద్రగిరి సరిహద్దుల విషయమై తగాదా యేర్పడి, తిరువెంగళ నాథ యాదవరాజను సేనాధిపతిని రుద్రమ నాయని మీాఁదికి యుద్ధమునకుఁ బంపఁగా, నాయుద్ధములో రుద్రనాయఁడోడిపోయెనఁట.

As per introduction in Velugotuvarivamsavali

UNIVERSITY OF HYDERABAD LIBRARY HYDERABAD

## —♦ వీరశైవ వీర ప్రతాప చోళరాయుఁడు ♦—

ఈయన శా. శ. 1223 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన మహారాజాది బిరుదులను ధరించెను. అందుచే స్వతంత్ర ప్రభువుగాఁ గన్పడును. ఈయన పాలనము బెంగుళూరుజిల్లా బేగూరు ప్రాంతమున నుండెను. ఈయన బేగూరులో శా.శ. 1223 వ సం॥ (క్రీ. శ. 1291 వ సం) ప్రాంతమునఁ బాలించుచు వచ్చెను. అచటి వర్తకులు కొందఱచ్చటి దేవాలయమునకు గొన్ని భూముల్ని నొసంగుచు వ్రాయించిన శాసనములో నీ మహారాజు పాలనములోని వార మని వ్రాయించి యుండిరి. ♦ ఈతఁడు గూడ చోళశాఖీయుఁడైన ట్లాయన పేరువలననే గ్రహింపవచ్చును.

## —♦ కట్ట వరదరాజు ♦—

ఈతఁడు కట్టహరిదాస రాజన్యుని పుత్త్రుఁడు. ఈ వరదరాజు గరుడ పురాణాంతర్గత మగు శ్రీరంగ మాహాత్మ్యమును, మఱికొన్ని యితర గ్రంథములను రచించి ప్రసిద్ధికి వచ్చెను. ఈయన వ్రాసిన గ్రంథములలో పరమభాగవత చరిత్రము, కూర్మేశ విజయము, పుండరీక చరిత్రము, రుక్మాంగద చరిత్ర మున్నగునవి కలవు. ఇతఁడు వైష్ణవ భక్తాగ్రేసరుఁడై నందున శ్రీరంగమాహాత్మ్యమును, పరమభాగవత చరిత్రమును గూడ తిరుపతి వేంకటేశ్వర స్వామికి కృతి నొసంగెను. శ్రీరంగమాహాత్మ్యమున నితఁడు తన వంశావళిని వర్ణించుచు, సూర్య వంశస్థుఁడగు కరికాళచోడుని వంశమున తెలుఁగు బిజ్జలరాజును, ఆయన వంశమున రంగరాజును ఆతనికి శ్రీరంగరాజును, ఆతనికి గల్గిన యైదుగురు కుమారుల్లో కట్టహరిదాసరాజను తన తండ్రియు జనిం చి రని వ్రాసెను. ఈతని కాల నిర్ణయము చేయుటకు వీలుగాలేదు. కాని,

---

• E. C. IX. Bn. 96.

క్రీ. శ. 1616 వ సం॥లో రామ దేవరాయల పక్షమున యుద్ధమాడిన తంజాపూరు రఘునాథరాయలకును గొబ్బూరి జగ్గ రాజునకును జరిగిన తోపూరు యుద్ధములో కట్టరంగపరాజను వీరాగ్రేసరుఁడొకఁడు పాల్గొనినట్లు రఘునాథాభ్యుదయ నాటకమున గలదు. * అతఁడు పైన నుడివిన రంగరాజైనచో నీ వరద రాజు 17 వ శతాబ్దాంతమున నుండి యుండును.

కట్టావారు క్షత్రియులలోను, కమ్మవారిలోను, భట్రాజుల లోను గలరు. కమ్మవారిలోఁ గొందఱు గూడ తెలుఁగు బిజ్జన వంశీకులై యుండి కట్టావా రిప్పటికి నున్నందునను, కట్టావారు వాసిరెడ్డి ప్రభువులకు ముఖ్య బంధువులుగా పూర్వముండుట వల్లను కమ్మవారిలోఁగల వీరుచోడ వంశీకు లని తలఁపవచ్చును.

క్రీ. శ. 1361 వ సం॥ర ప్రాంతమున వెలమ వీరులకును, చాళుక్య రాజులకును జరిగిన యుద్ధములో కట్ట వెంగభూజను వీరుఁ డుండి యా రణరంగమున నిహతుఁడయ్యెను. కట్టవారు చోడ వంశీకులైనను, అతఁడు చాళుక్యులలోని వాఁడనియే వెలుగోటివారి వంశావళి తెలుపుచున్నది. ఈయిరు తెగలు కలిసి వ్యవహరించుచున్నందున నే యట్లు వ్రాయఁబడియుండును. ఈ వంశీకులే మత భేదములలో మారిపోయి వేర్వేరు శాఖలవారుగా బ్రసిద్ధి నొందిరి.

—♦ పెన్నమ నాయుఁడు, పెరుమాండి నాయుఁడు ♦—

వీరిద్వురును కాకతి గణపతి దేవచక్రవర్తి గజసాహిణులలో నొకఁడగు భాస్కర దేవుని వద్ద ప్రధానులుగ పేరొందిరి. వీరిద్వురకుఁగల సంబంధము తెలియదు. వీరు శ్రీకాకొలనులోని కాకుళేశ స్వామికి కొడాలిగ్రామములో నైదు పుట్ల భూమిని దాన మిచ్చి శాసనము వ్రాయించి పేరొందిరి. ఇందలి పెన్నమనాయునిఁ బట్టియే కమ్మవారిలోఁగల పెన్నమనేని వారేర్పడి యుండవచ్చును. కొడాలి ప్రాంతములలో నిప్పటికిని పిన్నమనేని వారున్నారు.

---

* తంజాపూరాంధ్రనాయక, చరిత్ర పుట, 213.

## కొల్లూరి ప్రభువులు - చింతమనాయఁడు, ముత్తమనాయఁడు

వెలనాటికులోత్తుంగ గొంకనృపాలుని వద్ద చింతమ నాయకుఁడు ప్రతీహారి యను నుద్యోగిగా నుండి కొల్లూరి ప్రభువుగాఁ బేరొందెను. ఆయనకు గుండమాంబయందు ముత్తమ నాయఁ డుదయించెను. ఈముత్తమ నాయకుఁడు 'కలియుగ శూద్రక మహారా'జని పేరొందెను. ఈముత్తమ నాయకునికి మేడమ యను భార్యవలన కొమ్మమ యను పుత్రిక జన్మించెను. ఈకొమ్మమ శా.శ 1076 వ సం॥ లో అవనిగడ్డలోని లక్ష్మీనారాయణస్వామి కఖండ దీపదానముగావించెను. ఈ మెగాక నూంకమ యను మఱియొక కుమార్తె యుండి శా.శ.1074 వ సం॥లో నొక దాన శాసనము వ్రాయించెను. ఈవంశీకులు వెలనాఁటి రాజుల యన్వయ భృత్యులుగాఁ బేరొందిరి. ఇందలి చింతమనాయని పేరిఁట కొల్లూరి ప్రాంతముల చింతమనేని వారేర్పడి యుందు రని ప్రథమ భాగమునఁ జెప్పితిమి. ఒక వేళ కొల్లూరు వారైనను గావచ్చును.

### —♦ ఎఱప నాయకుఁడు ♦—

శా. శ. 1110 ప్రాంతమున వెలనాఁటి రెండవ రాజేంద్ర చోడునివద్ద నొక చమూపతిగా నుండిన కొల్లూరి విభుఁ డొకఁడు గలఁడు. ఆయన పేరు ఎఱప నాయకుఁడు. ఈయన తండ్రి ఘుడియన్న యనియు, ఘుడియన్న వెలనాఁటి (రెండవ) గొంకనృపాలుని వద్ద చమూపతిగా నుండె ననియు, నాఘుడియన్న తండ్రి ఎఱప దేసటి యనియు ఎఱప నాయకుఁడు శా. శ. 1110 వ సం॥లో వ్రాయించిన శ్రీ కూర్మనాథ దేవాలయ దాన శాసనము వల్లఁ దెలియుచున్నది. వీరందరును కొల్లూరు ప్రభువులే.

### —♦ ముక్రామల ఉప్పినేఁడు ♦—

ఈయన శా. శ. 1218 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన తండ్రి పేరు పేరినీఁడు. ఇతనిని మేల్నాక ఉప్పినేఁ డని గూడ పిలుచుచుండిరి. ఈయన తల్లి సూరసాని. ఈయన శా. శ. 1218 వ

సం॥లో పాలకొల్లు నందలి శ్రీ రామేశ్వరాలయములోని మహా దేవునకు అఖండ దీప దానము గావించి 3 పుట్ల భూమి నొసంగి శాసనము వ్రాయించి ఖ్యాతిఁ గాంచెను. ఈ వంశీకు లిప్పుడు కమ్మవారిలో ముక్కామల వారుగా వ్యవహరించు చున్నారు.

## —♦ కురుగంటి కొమ్మినాయకుఁడు ♦—

ఈతఁడు 12వ శతాబ్దమున దామలూరు పురమున కధిపతిగాఁ బ్రసిద్ధి వహించెను. ఈ దామలూరు తెనాలి తాలూకాలోని దావులూరని తోఁచుచున్నది. ఇతఁడు ఈవని కంద్రవాడిలోని కురుగంటి శాసనుఁడుగా నుండెను. ఈయన వెలనాఁటి కులోత్తుంగ గొంకరాజు వద్ద నొక యమాత్యుఁడుగా నుండెనఁట. ఈయన శా. శ. 1077వ సం॥లో శ్రీ అమరేశ్వరస్వామివారి కఖండదీపదానము గావించి ప్రసిద్ధి వహించెను. ఈ వంశీకు లిపుడు 'కొరగంటి' వారుగా కమ్మవారిలో వ్యవహరించు చున్నారు.

## —♦ బెజవాడ కొలపనాయకుఁడు ♦—

ఇతఁడు బెజవాడ కండవాడిమన్య పురవరాధీశ్వరుఁడ నని చెప్పుకొనెను. అందుచే నీ వంశీకులు బెజవాడ లేక మన్నె గృహ నామము ధరించి యుందురు. ఈయనకు "జటాచోడరాజ్యసముద్ధరణ, మన్మకులాభరణ, ప్రచండ దక్షిణ భుజాదండ కోదండ ప్రచండ, కలహాజయనాథ, వేంగీ విషయాధినాథ, చేకొలుగండ, సత్యమార్తాండ, ప్రతాప లంకేశ్వ"రాది బిరుదములు గలవు. అందుచే నీతఁ డొక సేనాధిపతిగఁ గన్పడుచున్నాఁడు. ఈతఁడు శా., శ. 1176వ సం॥లో వినుకొండ తాలూకాలోని యినుమెళ్ళ గ్రామమున కాకతి గణపతిదేవ చక్రవర్తికి పుణ్యమునకై శ్రీ చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠించి పేరొందెను. అందుచే నీతఁడా మహారాజు సామంతులలోని వాఁడన వచ్చును. కమ్మవారిలో యినుమెర్ల గోత్రీకులును,మన్నెం వారున్నందున నీ వంశీకులుమన్నెం గృహనామస్థులుగాఁగూడ మారి యుండి రనుట కవకాశము గలదు,

## —♦ వెలిచెర్ల మల్లి నాయకుఁడు ♦—

ఈయన శా. శ. 1082 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఇతనికి "మన్మకులవార్ధి వర్ధనసుధాకర, సౌజన్య రత్నాకర, సుభట మార్తాండ, శివపాద శేఖర, నయమ_ర్తిగండ, వెలిచెర్ల పుర శాసన, వివేక కమలాసన, బంధుజన సముద్ధరణ" మున్నగు బిరుదులు గలవు. ఇతఁడు శా. శ. 1082 వ సం॥లో మురికిపూడిలోని చెరువు భూమిని శ్రీ మల్లికార్జున కామేశ్వర దేవరలకు దానమిచ్చి శాసనము వ్రాయించెను. కమ్మవారిలో నిప్పుడు వెలిచెర్ల గోత్రికులును (నిమ్మగడ్డవారు) వెలిచేటి గృహ నామస్థులును గలరు. ఈ మల్లి నాయకుఁ డెవరి మూల పురుషుఁడో తెలియుట లేదు. ఐనను వెలి చెర్ల గోత్రికులే యీ వంశీకులై యుందురని తలఁచెదను.

## —♦ మందడి కోటఁడు ♦—

ఇతఁడు 11 లేక 12 వ శతాబ్దపు కమ్మ వీరులలో నొకఁడుగఁ గన్పడు చున్నాఁడు. ఈతఁడు వెలనాటి గొంక నృపాలుని వద్ద నొక యధికారిగాఁ బ్రసిద్ధి వహించెను. గుంటూరు తాలూకా మంద డము గ్రామములోని మల్లికార్జు నాలయమున నీతఁ డొక దాన శాసనము వ్రాయించెను. అందు దీ క్రింది పద్య భాగము గన్పడు చున్నది.

ఉ॥ ............................................................
...............సూరమాంబికకు • మిక్కిలి పుణ్యుఁ డుదార కీర్తి ల।
క్ష్మలలనా సమేతుఁడు స • మీహితచిత్తుఁడు పుట్టెఁ గొంక భూ।
పాలకు నిష్టభృత్యుడు స • భామణి మందడి కోట డొప్పగ॥

దీనిని బట్టి యీతఁడు గొంక నృపాలుని వద్ద యధికారి యగుటయే గాక మిక్కిలి ప్రసిద్ధి గల సభామణి యనియు, నితని తల్లి సూరమాంబ యనియు గ్రహింపవచ్చును. ఇందలి గొంక నృపాలుఁ డెవని కాలము వాఁడో తెలియకున్నది. అందుచే నితని కాలనిర్ణయము చేయుటకు వీలు లేదు.

## —♦ ప్రేకేటి పోలయ్య ♦—

ఈతఁడు కోట రెండవ కేతరాజు వద్ద (అమరావతిప్రభువు) మంత్రిగా నుండినట్లును, ఆయన కులస్థుఁడే యైనట్లును యితఁడు చెప్పఁగొనెను. ఈతఁడు సత్తెనపల్లి తాలూకా వేలుపూరు గ్రామములోని రామలింగేశ్వరాలయమున నొక దాన శాసనము వ్రాయించెను. అందిట్లున్నది :

సీ॥ ....................................................................................

............పవిత్రుండు ప్రేకేటి పురవల్లభుఁడు గుణాకరుఁడు ఘనుఁడు
దనకులస్వామి నుద్ధతరాజగజరాజ మృగరాజవరు జగమెచ్చుగండ
భూపాలుసప్తాంబికా పుత్రుదన్నడ కేతవల్లభు జగద్గీతకీర్తి
బ్రీతిఁ గొలిచి తన సునీతివాచాలత గాగఖడ్గముల బ్రగల్భతర ని
యోగయోగుఁడై సమున్నత సంపదల్ దాల్చినెగడె బుధులందన్ను బొగడ॥

మ॥ అనిశంబుఁ దనబుద్ధిపేర్మి బతి దం త్రావాప్తి వాటించుచుం
దనవిక్రాంతి నరాతివర్గము భుజా దర్పంబు ఖండించుచుం
దన దాక్షిణ్య విశేషతఁ బుధుల మి త్రశ్రేణి రక్షించుచుం
దనరెం గేత ధరాతలేశు సచివో త్తంసుండు ప్రోలండిలన్॥

దీనిని బట్టి కేతరాజువద్ద నుండిన ప్రధాన సచివులలో నీతఁ డొకఁడుగాఁ గన్పట్టును. ఈ వంశీకు లిపుడు కమ్మవారిలో పోంకంటి వారనఁబడు చున్నారు.

## —♦ కాకతీయ రాజ్య పతనానంతర స్థితి * ♦—

క్రీ.శ. 1323వ సం॥ర ప్రాంతమున వీర ప్రతాపరుద్ర రాజ్యము లోగడ నుడివిన రీతిని మహమ్మదీయులచే నోరంగల్లున భగ్నపరుపఁ బడిన పిమ్మట నాతని యొక్కయు నాతని వంశీకుల యొక్కయు చరిత్రము మనకు దొరకుట లేదు. ఆతని మంత్రి యగు సాగి గన్నమ నాయఁడు కమ్మవారి శాఖకు ప్రధాన పురుషులలో నొకఁడుగా

---

* Fallowed Introduction in Velugotivarivamsavali by Dr N. V. Ramanayya & published in 1939 by the Madras University.

నుండెను. దురదృష్ట వశమున నాతఁడు సకుటుంబముగ మహమ్మ
దీయ మతములోఁ గలిసి ఢిల్లీనవాబుల యాశ్రితుఁడయ్యెను. అట్లా
తఁడు మతాంతరుఁడగుటయు, ఓరుగంటి రాజ్యము మహమ్మదీయుల
పర మగుటయు నాంధ్రదేశ స్థులకు మిక్కిలి హేయముగఁ గన్పట్టెను.
అందుచే హిందూరాజ్యమును మఱల స్థాపించుటకై పునఃప్రయ
త్నముఁ జేసిరి.

రెడ్డివీరుఁడగు కొప్పుల కాపయ నాయకుఁడును, అతని కుమారుఁ
డగు నామయ నాయకుఁడును విజృంభించి హిందువు లందరి తోడ్పా
టుచే నోరంగల్లును ముట్టడించి యెట్లైననేమి దానిని జయించి
స్వాధీన పఱచుకొనిరి. అప్పుడు కాపయ నాయకుఁడు "హిందూ
రాయ సురత్రాణ" బిరుదము ధరించి పాలింపఁ జొచ్చెను. ఈయన
తన రాజ్యమును గోదావరి వరకును వృద్ధిఁ జేసెను.

ఈ సమయముననే వెలమవారు స్వతంత్రులై తమ కొక రాజ్య
మును నల్లగొండలో స్థాపించుకొనిరి. కాపయ యాధ్వర్యమున
నుండుటకు వారంగీకరింపక యుద్ధములు జరుపుచుండిరి. వెలమవారిలో
యేచమ నాయఁడును, పకురుద్దీను సేనానియు తెలింగానా దేశమును
స్వాధీన పఱచుకొనుటకై ప్రయత్నించుచు వచ్చిరి. వెలమవారికి,
మహమ్మదీయులకుఁ గూడ పరస్పర సంఘర్షణములు గల్గుచు వచ్చెను.
ఫిలంపట్టం, ఇందిరాల ప్రాంతములలో వెలమ వారికిని, గుల్బర్గమహ
మ్మదీయ (మల్లిక్ సప్రద్దిన్ మున్నగువారు) సైన్యమునకు యుద్ధ
ములు జరిగెను. వెలమ వారితోఁ బోరాడుటకు సహాయముఁ
బొందుటకై కాపయనాయకుఁడు క్రీ. శ. 1351వ సం॥ర ప్రాంత
ములో మహమ్మదీయ సేనాని యగు అల్లావుద్దీను హుసేనుకు లోఁబ
డక తప్పదయ్యెను. ఇట్లు వెలమ వీరులును, రెడ్డివీరులును అన్యజాతి
వారికి లోఁబడి పరస్పర ద్వేషములతోనే రాజ్యాభివృద్ధి గావించు
టకై నిరంతరము ప్రయత్నించుచు వచ్చిరి.

చాళుక్య వంశీకులకును వెలమవారికిఁ గూడ నిష్టములేదు. హిందూరాజ్య మెవరికి వారే తమదే యని తలంచి యితరుల నణఁగఁ ద్రొక్కఁ జూచుచుండిరి. ఈస్థితిలో మొళుగూరు (మోగులూరు) కడ పంట, ముమ్మడి, మైలారు రాజులకును, వెలమవారికిని గొప్ప యుద్ధము జరిగెను. దానిలో కమ్మ వీరులుగూడ రెడ్లకు సాయపడి యుండిరి. కాని ఆ యుద్ధములో వెలమవీరులే జయింపఁ గల్గిరి. దీనితో వెలమవారి కెక్కుడలేని ధైర్యసాహసములు కలుగుట కవ కాశ మేర్పడెను.

క్రీ. శ. 1360వ సం॥ర ప్రాంతమున వెలమ ప్రభువులలోని యెఱ్ఱ దాచానాయని కుమారుఁ డగు సింగమ నాయనికిని చాళుక్య రాజులకును యుద్ధములు జరుగుచుండెను. సింగమనాయఁడొక దండ యాత్రకేగి, జల్లిపల్లివద్దఁ గృత్రిమముగ సంహరింపఁ బడెనఁట. దానితో వెలమవారికి శివ మెక్కు వయ్యెను. సింగమనాయకుని కుమాళ్ళగు అనపోతా నాయఁడును, మాదానాయఁడును తమ సైన్యములను గూర్చుకొని జల్లిపల్లి కోటను ముట్టడించుటకై 20 వేల కాల్బలముతోను, 6 వేల గుఱ్ఱములతోను, 700 యేనుఁగులతోను వెడలిరి. ఈసంగతి విని చాళుక్యరాజులు అయిదు లక్షల యిరువది వేల సైన్యముతో నెదిరించిరఁట. ♦ వెలమ వీరులంతట జల్లిపల్లి కోట విడిచివచ్చి ఇనుగుర్తి కోటవద్ద ఘోరమైన రణ మొనర్చిరి. ఈ యుద్ధము క్రీ. శ. 1361 వ సం॥ము(శార్వరి సం॥ కార్తీక మాస ము)నఁ జరిగెను. దీనిలో ననేక చాళుక్య రాజులు సంహరింపఁబడిరి. చివరకు జల్లిపల్లి, యినుగుర్తి కోటలు వెలమ వీరులకు స్వాధీన మయ్యెను. జల్లిపల్లి కోటలో నుండిన 101 చాళుక్య రాజులను గాను గలఁ ద్రొక్కించియు, నితర విధములను జిత్రవధ గావించి వారి రక్తముతో అన పోతానాయఁడు, మాదానాయఁడు నను వీరులు తమ తండ్రి యగు సింగమనాయని కాతని యాజ్ఞానుసారము తిలోద

♦ ఇది యతిశయోక్తి కానోపును.

కముల నిచ్చిరఁట. ఆహా! ఎంత రాక్షసకృత్యము! చివరకు వారు "సోమకుల పరశురామ" యను బిరుదమును గూడ ధరించిరఁట. చాళుక్య రాజులలో నిట్టి దారుణవధ జరిగిన తర్వాత చాళుక్యుల మని యీ రాజ్యమున చెప్పుకొనుట కష్ట మయ్యెను. అందువలననే వారిలో హతశేషులు మచ్చ, సమ్మెట, కట్టా వంశీకులు మున్నగు వారు తర్వాత కమ్మవారుగనే వ్యవహరించి నట్లు కన్పడును. కొందఱు వారు పోయిన వలస ప్రదేశములను బట్టి యితర నామములతో మెలఁగు చుండిరి.

పిమ్మట వెలమ వీరులలో అనపోతానాయఁడు రాచ కొండలోను, అతని సోదరుఁ డగు మాదానాయఁడు దేవర కొండలోను రాజ్యములను స్థాపించుకొని వానిని వృద్ధిచేయుటకై నిరంతరము ప్రయత్నింపఁ జొచ్చిరి. దేసటి వేమారెడ్డియు, అతని కుమారుఁ డగు అనపోతా రెడ్డియు తత్పూర్వమే అద్దంకిలో రాజ్యమును స్థాపించుకొని దానిని వృద్ధిచేయుటకై యత్నించు చుండిరి. వెలమ వీరులకును యీ రెడ్డి వీరులకును ధరణికోట సరిహద్దున యుద్ధములు జరగు చుండెను. అచట నిప్పటికినిఁ గల నరుకుళ్ళపాడు, ఎముకపాడు నను గ్రామము లా యుద్ధములలోఁ గాని, తత్పూర్వ యుద్ధములలోఁ గాని ప్రసిద్ధిఁ జెంది యుండును.

అనపోతానాయఁ డను వెలమ వీరుఁ డొక ప్రక్క రెడ్డి వీరులతోను, మఱియొక ప్రక్క రాచవారితోను పైన నుడివిన విధమున ఘోర యుద్ధము లొనర్చి వారిని హింసించు చుండెను. క్రీ. శ. 1369 వ సం॥లో అనపోతానాయఁడు భీమవరం వద్ద జరిగిన యుద్ధములో కాపయ నాయకుని సంహరించెను. ఈ లోపుగ కాపయనాయకుఁడు అల్లావుద్దీను హసన్ అనువాబునకు లోఁబడెను. తర్వాత వెలమ ప్రభు వగు అనపోతానాయఁడు తన యాశ్రితుఁ డగు ఎఱువభక్తి రాజునకు (కమ్మవారును, చోడ వంశీకుఁడును) సాయ మిచ్చి యాతనిని అనపోతారెడ్డి (అద్దంకి ప్రభువు) మీఁదికి పంపించెను. అనపోతా రెడ్డి సూరవరం వద్ద నోడింపఁబడెను. ఇట్లే కొప్పులవం

శీకుని మీఁదికిఁ గూడ భక్తిరాజు పోఁగా నాతనికి అల్లావుద్దీను సేన లును, గజపతి సేనలును సాయపడి యితనిని వెనుకకు తరిమిరి. చివ రకు ఎఱువ వారెట్లో కష్టపడి, మరల సైన్యమును ప్రోగుఁజేసికొని విజృంభించి, తమ పరాక్రమమును గన్పరచి, వెలమ ప్రభు వగు వేదగిరి I సాయముతోను, గుల్బర్గ పాలకుఁడగు ఫిరోజిషా సాయ ముతోను, కామపురియందు క్రీ. శ. 1366వ సం॥ ప్రాంతమున రాజ్య మును నెలకొల్పుకొనిరి. ఎరువ భక్తిరాజును, అనదేవచోడరాజును అచట పాలించుచు వచ్చిరి; గాని యీ రాజ్యము గూడ చిరకాలము నిలువదయ్యెను.

క్రీ. శ. 1417 సం॥ లో రాజమంద్రి పాలకుఁడగు దొడ్డయ అల్లారెడ్డి విజయనగర ప్రభువగు రెండవ హరిహరరాయల సైన్య సహాయముతో అనదేవచోడుని పైకి వచ్చి యాతనిని యుద్ధ మున సంహరించి యాతని రాజ్యమును తన వశము గావించుకొనెను. ఇంతకు పూర్వమే గురిజాల ముప్ప భూపతి గోదావరీతీరమున రామ గిరిలో నొక రాజ్యమును స్థాపించెను. ఇది కూడ కొంత కాలమున కన్యాక్రాంతమయ్యెను. ఇట్లుండఁగా కొండవీటి సీమప్రభు వగు పెద కోమటి వేమారెడ్డికిని గుల్బర్గ పాలకుఁడగు ఫిరోజిషాకును స్నేహము కుదిరెను. అతఁడు రాజమంద్రి పాలకుఁడగు రెడ్డి ప్రభునితో యుద్ధ మున కేగిన సమయము గుర్తించి దేవరకొండనుండి వెలమవీరుఁ డగు వేదగిరి II, దండెత్తి ధరణికోట ప్రాంతమున మాచానాయనిఁ జంపి, దేశము జయించి వెడలి పోయెను. పెద కోమటి వేమారెడ్డి తిరిగి రాఁగానే యీ వార్తను విని వెంటనే ఫిరోజిషా సాయమున దేవరకొండపైకి వెడలి వేదగిరి II ను యుద్ధమున జయించి పట్టు కొని వచ్చి యాతని తలఁ దీయించెను. తర్వాత వెలమప్రభు వగు రెండవ అనపోతానాయఁడు విజయనగర పాలకుఁడగు దేవరాయ లతో సంధిపడి యాతని సహాయముచే పానగల్లు, నల్లగొండసీమలకు దండెత్తెను. అప్పుడు ఫిరోజిషా యీ సీమల నాక్రమించి యుండెను. ఈమా రెదుర్కొనిన ఫిరోజిషా సైన్యములను హిందువులు నరకివైచి

యా ఘోరయుద్ధమున నరకిన మహమ్మదీయ తలలతో నొక అరుగును (Platform) కట్టించిరఁట. తర్వాత మహమ్మదీయ సుల్తాను హతశేషులతో పారిపోయెను.

వెలమ వీరుఁడగు మాదానాయఁ డంతట పెదకోమటి వేమారెడ్డిపై కొండవీడునకు క్రీ. శ. 1419వ సం॥ర ప్రాంతమున దండయాత్ర సాగించి యాతనిని జయించినట్లు కన్పడు చున్నది.

ఇట్లుండఁగా క్రీ. శ. 1457వ సం॥లో సుల్తాను అల్లావుద్దీను చనిపోయి యాతని కుమారుఁడగు హుమయూన్ షా రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు వచ్చునరికి ఒరంగల్లు రాజ్యమును వెలమప్రభువు లాక్రమించి యుండిరి. అందుచే వీరిపై కితఁడు ఖ్వాజాజహాను, నైజాముల్ ముల్కు అను సేనాధిపతులకుఁ గొంత సేననిచ్చి పంపెను. వారు దేవరకొండ రాజ్యముపై దాడివెడలి, యచట ఘోర యుద్ధము లొనరించి చివరకా రాజ్యమును పట్టుకొనిరి. అచటి పాలకుఁడగు లింగనృపాలుఁ డంతట చేయునదిలేక కపిలేంద్రగజపతి సహాయ మర్థించెను.

గజపతి తన రాజ్యమును విస్తరింపఁ జేయుటకు తగిన సమయమునకై వేచియున్నవాఁడు గావున, వెంటనే దాని కంగీకరించి తన కుమారుఁడగు హంవీరునకు కొంత సేననిచ్చి మహమ్మదీయుల పైకి పంపించెను. దేవరకొండ వద్దను, కంభంమెట్టు వద్దను జరిగిన యుద్ధములలో మహమ్మదీయు లోడిపోయిరి. అంతట లింగభూపతిని రాజకోటయందు నిల్పి హంవీరుఁడు క్రమముగా తెలింగానా నంతటిని స్వాధీన పఱచుకొని క్రీ. శ. 1461 వ సం॥ నాఁటికి వరంగల్లు నాక్రమింపఁగల్గెను.

కపిలేంద్ర గజపతి మిక్కిలి పరాక్రమ కంఠీరవుఁడు. అందుచే నీ రీతిగఁ దన రాజ్యమును విస్తరింపఁ జేసి క్రీ. శ. 1464 వ సం॥ నాఁటి కితఁడు తన రాజ్యమును ఆంధ్రదేశ మంతటను నెలకొల్పెను. ఇంతేఁగాక యీయన రాజ్యము దక్షిణార్కాటు జిల్లా వరకును

వ్యాపించిన చిహ్నములు కనుబడుచున్నవి. ఈయన కాలమున కొండవీడు ప్రాంతము లన్నియు కపిలేశ్వర కుమార పాత్రుఁడు రాజ ప్రతినిధిగాఁ బాలింపఁ జొచ్చెను. ఈయన తర్వాత పురుషోత్తమ గజపతి క్రీ. శ. 1471 వ సం॥ ప్రాంతము వరకును, తర్వాత ప్రతాపరుద్ర గజపతియు నాంధ్రదేశమును బాలించుచుండిరి. ఈ గజపతుల పాలన కాలములో విజయనగర రాజ్యాధిపతు లగు ప్రౌఢ దేవరాయలు, మల్లికార్జున రాయలు, సాళువ నరసింహ రాయలులకును వీరికి ననేక యుద్ధములు జరుగుచుండెను. ఇట్టి వాని మధ్య చిన్నరాజ్యము లెచ్చటను నిలుచుట కవకాశము లేకుండెను. తుదకు క్రీ. శ. 1514-15 సం॥ లలో శ్రీకృష్ణదేవరాయలు ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి మున్నగు ప్రాంతములను వరుసగా గజపతులపైకి దండెత్తి జయించి తీసికొను వరకును యివి గజపతుల స్వాధీనములోనే యుండెను. అతఁడు గజపతుల మీఁదికి 4 సార్లు దండెత్తి జయించెను.

కృష్ణదేవరాయలు చనిపోయిన పిమ్మట అచ్యుతదేవరాయలు పాలించుచుండఁగా, కూలీకుతుబ్షా యను గోల్కొండ ప్రభువు క్రీ. శ. 1530 వ సం॥ లోఁ గొండవీడు దుర్గము పైకి దండయాత్ర వచ్చి పట్టుకొనెను; గాని యిది విని అచ్యుతరాయలు వెంటనే తన సేనలను బంపి స్వాధీనము గావించుకొనెను. క్రీ. శ. 1563 వ సం॥లో ఇబ్రహీం కుతుబ్షా కొండవీడు స్వాధీనమునకై ప్రయత్నించి యా యుద్ధములలో నోడిపోయెను. ఈతఁ డంతటితో నూరకొనక క్రీ. శ. 1565 వ సం॥లో తళ్ళికోటవద్ద మహమ్మదీయులకు, విజయనగర పాలకులకు జరిగిన యుద్ధములో విజయనగర ప్రభుత్వమున కోటమి గల్గిన తర్వాత, మొదటి శ్రీరంగనాయకులు పెనుగొండకుఁబోయి యచట రాజ్యపాలన చేయుచు బలహీనుఁడై యున్న కాలములోఁ గొండవీడు, ఉదయగిరి రాజ్యాలు ఆక్రమించెను.

ఇట్టి క్లిష్టపరిస్థితులలో లోఁగడ తలయెత్తిన ఎరువవారును, గురిజాలవారును హతులై పోవుటయు, సాగివారిలో కొంద రుత్త

రమునకుఁ జీలిపోయి చాలకాలము తర్వాత పెద్దాపురప్రాంతమున మహమ్మదీయ సామంతులుగా నొక రాజ్యమును స్థాపించు కొనుటయు, వెలమరెడ్డి ప్రభుత్వములు గూడ నాశనమై పోవుటయు, కమ్మనాఁటిలోని కమ్మవీరులకు నాథుఁడు లేని విధ మయ్యెను. (ఈ కాలమున శూరాగ్రేసరు లగు కమ్మవీరులు తల కొక విధముగా కొందఱు రెడ్ల ప్రభుత్వమునను, మఱికొందఱు గజపతులవద్దను, మఱి కొందఱు విజయనగరరాజ్యమునను సేనాధిపతులుగను, సామంతుల్నుగను కొల్వఁజొచ్చిరి. ఇట్టివారి చరిత్రము లన్నియు నిఁకమీఁదట వివరించెదను; గనుక నిచట మరల చర్చించుట లేదు

## —♦ ఎఱువవారు ♦—

### ఎఱువ భక్తీశ్వర చోళుఁడు*

ఎఱువవారిలో కొందరి చరిత్రము లోగడ తెలుపఁ బడినది. క్రీ. శ. 1360వ సం॥ర ప్రాంతములో నీయన పాలనము గన్పడుచున్నది. ఇతఁడు తమ పూర్వస్థాన మగు ఎఱువ ప్రాంతమునుండి గోదావరీ ప్రాంతములకు వచ్చి యచట రెడ్డిరా జగు అనపోతారెడ్డికి సామంతుఁడుగా మొదటినుండి యున్నట్లు చరిత్రజ్ఞులు గుర్తించుచున్నారు. అనదేవచోడుని శాసనము వల్ల నీతఁడు మిక్కిలి శూరాగ్రేసరుఁ డనియు, బొగ్గర మున్నగు యవనరాజులను గులపుండివద్ద యువరాజుగా నున్నపుడే జయించెననియు, పాంచధార్లవద్ద గజపతిని, భరణిపాడువద్ద సింగభూపతిని, పెదకొండవద్ద దిబర్ ఖాన్ మున్నగువారిని, సూరవరంవద్ద వీరాన్నపోతుని యోడించెనసియు, తురుష్కుని సాయముతో కర్నాటకరాజు నోడించె ననియు, అత్తిలివద్ద జరిగిన యుద్ధములో శత్రువుల నెదిర్చి యోడించి 10 వేల సైన్యమును రక్షించె ననియు, ఉండిరాజు సాయముతో కాకరపర్తి వద్ద

* Fallowed J. A. H. R. S. Vol. I. & Introduction in Velugotivari Vamsavali (1939).

జరిగిన యుద్ధమున కన్నడ సైన్యమును హతమార్చె ననియు, కాటయ వేమారెడ్డి కుటుంబము తనతోడి యుద్ధమున నోడింపఁబడి శరణుఁ జొచ్చఁగా వారలను రక్షించె ననియుఁ దెలియుచున్నది. ఇందుఁ గల తురుష్క సేనాధి పతులు బహమనీ సుల్తా నగు అల్లా వుద్దీను హసన్ గంగు సైన్యములోని వారై యుందు రనియు, అన పోతారెడ్డి (అద్దంకి ప్రభువు) కొప్పుల కాపయనాయకుని కొఱకై గజ పతితోఁ బోరాడిన సమయమున నీతఁడు గూడ వెడలి యుండుననియు, అప్పుడు గజపతి యోడింపఁబడి కాపయనాయకుఁడు పునః ప్రతిష్ఠింపఁ బడె ననియు, తర్వాత నితఁడు తన కొక చిన్నరాజ్య మేర్పరచుకొని యుండు ననియు చరిత్రజ్ఞులు గుర్తించుచున్నారు.

ఈయన యే కారణము వలననో తర్వాత రెడ్డి రాజులతో విరోధము వహించి రాజ్యము కొఱకు యుద్ధములు సల్పుచున్నట్లు కన్పడును. ఈతఁడు కామపురి యను పట్టణము గట్టించి కామరా జను పేర్గాంచి యందుఁ దాను పాలింపఁదొడఁగెను. గోదావరి ప్రాంతమున అనపోతారెడ్డి పాలనము క్రీ. శ. 1356 వ సం॥ తర్వాత ముగిసిపోయి, తిరిగి అన వేమారెడ్డి పాలనము క్రీ. శ. 1373వ సం॥లో నచట కన్పడుచున్నందున నీ మధ్య కాలములో నితఁడు పాలించు చున్నట్లు చరిత్రకారుల యభిప్రాయము. అనవేమారెడ్డి యీతనితో సఖ్యపడి యీ యనను సామంతునిగాఁ జేసికొన్నట్లు కన్పడును. ఇంతేగాక అనవేమారెడ్డి ప్రభువు తన కుమార్తెను యీయన కుమారుఁడగు భీమరాజున కిచ్చి వివాహము గావించినట్లు శివలీలా విలాసము కాశీఖండ మను గ్రంథముల వల్లదెలియుచున్నది*. ఈ వివా

* "మ॥ అనవేమ క్షితిపాలు పౌత్రియగు వే • మాంబా మహాదేవికిన్
ఘనుఁ డయ్యల్లడ భూమిపాలునకు సం • గ్రామ స్థలీ గాండివుల్
తనయుల్ వేమ విభుండు వీరవసుధా • ధ్యక్షుండు దొడ్డ ప్రభుం
డును నన్నయ్యయు బాహువిక్రమ కళా • టోప ప్రతాపోన్నతుల్॥"

శ్రీనాథుని కాశీఖండము.

శివలీలా విలాసములోని పద్యమునకు ప్రథమభాగము, 104 పుట చూడుము.

హాము భక్తీశ్వర చోళుఁడు బ్రతికియుండఁగా జరిగినదియు, లేనిదియు చెప్పుటకు వీలు లేకున్నది. లోకలు రికార్డులలోఁ గల యొక శాసనమును బట్టి చూడఁగా ♦నితని కుమారుఁ డగు అనదేవ చోడుఁడు క్రీ. శ. 1366వసం॥లో ననఁగా అనవేమారెడ్డి పాలనమునకు ముందే సింహాసన మెక్కినట్లు గన్పడును.

భక్తీశ్వర చోడుఁడు గోముఖగిరీశ్వరాలయమునకును, పట్టసవీరభద్రాలయమునకును బంగారు మలాము వేయించెనఁట. ఈతఁడు కాశీ విశ్వేశ్వరస్వామికిఁ గొన్ని గ్రామములను పట్టసంలోని బ్రాహ్మణులకు గోశతమును దానమిచ్చి ప్రసిద్ధి వహించెను. ఇతఁడు పర్వతస్వామికి చెరువాడు, ఆతుకూరు గ్రామముల నిచ్చెననియు, త్రిపురాంతక స్వామి కాముదాల పల్లి యనుగ్రామ మొసంగెననియు, శ్రీనాథ మహాకవి రచితమగు శివరాత్రి మాహాత్మ్యమును గ్రంథమునవ్రాయఁ బడినది. ఈమహారాజు శైవ భక్తుఁ డగుటచే దినమున కాలుమార్లు శివుని ధ్యానించువాఁ డఁట. ఈయన భార్య పేరు అన్నమాంబ. ఈ మహారాజునకు భీమరాజు, అన దేవచోడుఁ డను నిద్దరుకుమారుండిరి. భక్తీశ్వరుఁడు శా. శ. 1227 వ సం॥లో శ్రీశైలయాత్ర నొనర్చి విశ్వేశ్వర బ్రహ్మచారికి కండ్యకోల నగ్రహారముగనిచ్చెను. ఈ విశ్వేశ్వర బ్రహ్మచారి శ్రీశైలము మీఁద వసించిశిష్యులకు విద్య నేర్పుచు, తెలుఁగు దేశమున మతప్రచారముఁ జేయుచుఁ బేరొందెను.

భక్తి రాజునకు 'గండ భేరుండ, రాయవేశ్యా భుజంగాది' పెక్కు బిరుదులు గలవు. ఈయన పూర్వీకులు ముమ్మడి ప్రోలవరమున నుండిన ట్లొక యభిప్రాయము గలదు.

## —♦ ఎఱువ అనదేవ చోడ మహారాజు * ♦—

ఈయన తండ్రి యనంతరము రాజ్యమునకు వచ్చెను; గాని తన సవతి తల్లి కుమారుఁడును, రెడ్ల బంధుగుఁడు నైన భీమరాజు

♦ Mac M. S. S. 215—4—4 P. 231.
* Fallowed Introduction in Velugotivarivamsavali.

యొక్క తంత్రమువల్లఁ గాబోలు పదభ్రష్టుఁడైనట్లు కన్పడుచున్నది. భీమరాజు అన వేమారెడ్డి సహాయముతో నీయనను రాజ్యమునుండి తొలఁగింపఁగా, నితఁడు త్రిపురాంతక ప్రాంతమునకు తమ పూర్వ రాజ్యమగు 'ఎఱువ' సంస్థానమును బాలించుకొనుటకై యచ్చటి కేగినను, అది యంతకు పూర్వమే విజయనగర రాజ్యాధిపతి యగు రెండవ హరిహర రాయలుకు లోఁబడి పోయిన దగుటవల్ల, చేయునది లేక, దేవరకొండ రాజ్యాధిపతియు, వెలమ వంశోద్భవుఁడు నగు వేదగిరి నాశ్రయించెను. ఈయనకు వేదగిరి తన సైన్యముల నిచ్చి పంపఁగా, భీమరాజునకు సాయముగా కొండవీటి ప్రభువగు అన వేమారెడ్డి సైన్యములను దోడుకొని వచ్చె ననియు, నప్పుడు రెండుసార్లు యుద్ధములు జరిగి, చివరకు అన వేమారెడ్డి ప్రభువును సింగభూపతి పుత్రుఁ డగు అప పోతానాయఁడు II రణరంగమున జంపినట్లును దెలియుచున్నది; గాని తుద కప్పుడు గూడ అన దేవ చోడుఁడు రాజ్యలాభముఁ బొందఁజాలఁ డయ్యెను.

అన దేవచోడుఁ డంతట నూరకొనక గుల్బర్గ రాజ్యాధీశ్వరుఁ డగు ఫిరోజిషా నాశ్రయించి, యాతనికిని కర్నాట రాజులకును జరుగుచు వచ్చిన యుద్ధములలో సాయపడి, సాగర వద్ద జరిగిన యుద్ధములో కర్నాటకుల నోడించి, కోట పట్టుకొని యాతని స్నేహితునిగాఁ జేసికొనెను.

ఇంతలో రెడ్డిరాజ్యమున పాలకుఁ డగు కుమారగిరిరెడ్డి చనిపోయినందున రాజ్య విషయమున పెదకోమటివేమ భూపాలునకును, కాటయ వేమునకును తగాదా లేర్పడెను. ఈ సమయమును గనుపెట్టి మఱల తన రాజ్యమును గైకొనుటకై యితఁడు రాచకొండ వెలమ వీరుల యొక్కయు, యవనుల యొక్కయు సాయముతో బ్రయత్నించినట్లు కన్పడుచున్నది. అప్పుడు వెలమ వీరుఁ డగు వేదగిరికి ననేక రాజులకు (రెడ్డి సామంతులై యుందురు) యుద్ధములు జరిగి, బెండపూడి కోటను వేదగిరి పట్టుకొనినట్లు వెంకటగిరి

రాజవంశావళి తెలుపుచున్నది. ఈ యుద్ధములలో జయించి నందు ననే చివరకు అనదేవచోడుఁడు "రాజాధిరాజ పరమేశ్వర పూర్వ సింహాసనాధీశ్వ"రాది బిరుదములతో తన రాజ్యమును వశపఱచు కొనె నని చరిత్రకారుల విశ్వాసము. ఇట్లు అనదేవ మహారాజు విజృంభించుటచే కాటయ వేమారెడ్డి రాజ్యమునకు నష్టమేర్పడఁగా నాతఁడు మఱల నన్నదేవచోడునిపైఁ గవియుటకుఁ బ్రయత్నించుచు వచ్చెను. ఈ సంగతి ముందుగనే గుర్తించిన వేదగిరి భూపాలుఁడు తనమంత్రియగు పినమాదానాయని రాజమండ్రిలో నుంచి అనదేవ చోడుని కంటికి రెప్పవలెఁ గాపాడఁగలైను.

కాటయవేముఁ డంతట తన బందుగుఁ డగు విజయనగర రెండవ హరిహరరాయల నాశ్రయించి కొంత సైన్యమును తోడ్కొని అనదేవ మహారాజుపై నెదిర్చెను. అనదేవచోడుఁడు తన పూర్వస్నేహితుఁడగు గుల్బర్గ సుల్తాను ఫిరోజిషా నాశ్రయించి కొంత సైన్యమును ప్రోగుఁజేసికొని, దేవరకొండ వెలమ వీరుల సైన్యముతో సహా డీకొనెను. గుండుగొలను వద్ద నొక యుద్ధము జరిగి యందు వెలమ వీరులచే కాటయ వేముని సైన్య మోడింపఁ బడెను. ఆ యుద్ధములోనే కొప్పునూళ్ల తిప్పానాయని వారిచే కాటయ వేముఁడు సంహరింపఁబడినట్లు వారి వంశప్రాశస్తి తెలుపు చున్నది. అత్తిలివద్ద గూడ నొక రణరంగము జరిగెను. కాకర పర్తివద్దఁ గూడ విజయనగరసేనలకును, అనదేవచోడుని బావ మఱఁదియగు పిన్నుండి రాజునకు ఘోరయుద్ధము జరిగి యందు అన దేవచోడుఁడే జయము గాంచెను. కర్నాట సైన్యము చెల్లాచెదరై నష్టపడిపోయెను. కాటయ వేముఁడు చనిపోయి యుండుటవల్లను తర్వాత యుద్ధములలో రెడ్లకోటమి గల్గుటవల్లను, తుదకు కాటయ వేముని కుటుంబము 10 వేల సైన్యముతో అనదేవచోడుని శరణుఁ జొచ్చెను. అనదేవచోడుఁడు వారలను మన్నించి వదలినను, యీ మైత్రి చిరకాలము నిలచి యుండ లేదు. ఏలయన, కాటయ

వేముని సైన్యాధిపతులలో నొకఁడును, రాజమంద్రి పాలకుఁడును నగు దొడ్డయ అల్లారెడ్డి మఱల విజృంభించి, అనదేవచోడునకు రాజమంద్రి దుర్గమును స్వాధీనము గాకుండఁ జేయుటయే గాక, యింతలో ఫిరోజిషా తెలింగానా దిక్కుగా నేగవలసి వచ్చు సమయ మెఱిఁగి యెదిర్చెను. అప్పుడు విజయనగర దేవరాయల సాహాయ్యము గూడ అల్లాడరెడ్డి కుండెను. క్రీ. శ. 1417 వ సం॥లో దాదాపు మఱియొక ఘోరయుద్ధము జరిగి యందు దురదృష్టవంతుఁ డగు అనదేవచోడ మహారాజు సకుటుంబముగ నల్లాడరెడ్డి వలనఁ జంపఁ బడెనఁట. శ్రీనాథ రచితమగు భీమేశ్వర పురాణమున అల్లాడరెడ్డి పక్షమునఁబోరిన అరియేటి లింగనతో నితఁ డోడిపోయినట్లు వ్రాయఁ బడి యున్నది.

అనదేవమహారాజు తన తండ్రి వలెనే శైవ భక్తుఁడైయుండి, దినమున కాఱుమార్లు శివధ్యానము చేయుచుండువాఁడు. ఇతఁడు శ్రీ ద్రాక్షారామ భీమేశ్వరునకు సువర్ణ ఖచితమును, సువర్ణ వృషభమును, కలశములను చేయించి శాసనము వ్రాయించెను. ఇతఁడు తన తండ్రి కాలములోఁ గట్టింపఁబడిన కామపురియందే వసించుచు వచ్చెను.

కామపురి (కళ్యాణపురి) యెచట నుండెనో గుర్తింపఁబడలేదు. కాని అందు నిత్యము కస్తూరి, నవరత్నములు మున్నగు వస్తు విక్రయ శాల లనేక ముండెనఁట. ఈ మహారాజు జగ్గవాయ యను రాజు నోడించినట్లు తన శాసనములో వ్రాసికొనెను. ఈయన శ్రీ చక్రవర్తి కుమార్తెయు, పిన్నుండిరాజు సోదరియు నగు నిరుగాంబికయను కన్యను పెండ్లాడి వీరభద్రరాజను కుమారునిఁ గాంచెనఁట. ఈతఁడు కూడ యుద్ధములలోఁ బాల్గొనుచు వచ్చెను. అనదేవ మహారాజు వీరభద్రాలయమునకుఁ గొన్ని గ్రామములను ధారాగ్రహీత మొనర్చెను. ఇంతేగాక నీతఁడు విసరినాఁడులో తన పేరిఁట అన్నదేవచోడాగ్రహార మొకటి నిర్మించి బ్రాహ్మణుల కొసంగెను,

ఇతఁ డనేక బ్రాహ్మణాది వివాహములు గావించి ప్రసిద్ధి కెక్కెను. ఈయన వ్రాయించిన క్రీ. శ. 1388వ సం॥ నాఁటి శాసన మొకటి త్రిపురాంతక ప్రాంతమునఁ గలదు. ఈయన శా.శ. 1335వ సం॥లో తన తల్లిదండ్రుల పుణ్యమునకై పాలకొల్లు క్షీరా రామేశ్వరాలయ మునకు భూదాన మొసంగెను.*

## —♦ ఏరువ భీమరాజు II ♦—

ఇతఁడు భక్తీశ్వరచోళుని కుమారులలో నొకఁ డని లోఁగడ తెల్పితిమి. ఈయన కొండవీటి పాలకుఁ డగు అనవేమారెడ్డి కుమార్తెను పరిణయమై తనకు జనించిన వేమాంబ యను కన్యను రాజమండ్రి పాలకుఁ డగు దొడ్డయ అల్లారెడ్డి కిచ్చి వివాహ మొనరించి, యాతని సహాయముతో తన సోదరుఁ డగు అనదేవ చోడునిపై వైరము వహించి రెడ్లకు నాతనికి జరిగిన యుద్ధములో ప్రధానపాత్ర వహించి నట్లు కన్పడు చున్నది. కాని రాజమండ్రి దుర్గము గాని మఱియొక దుర్గముగాని యీతఁడు పాలించినట్లు లేదు. ఇతఁడు అల్లాడ రెడ్డి సైన్యాధిపతిగనే యుండెను. కడప జిల్లా తాళ్ళప్రొద్దుటూరు శాసన మున నితఁ డిట్లు వర్ణింపఁబడి యున్నాఁడు:

" ఉ॥ పన్ని తురంగమంబునకు • బక్కెర పెట్టిన వార్త పేరిచే
విన్న భయంబునం గలిగె • వీసరనాఁడును జక్రగొట్టమున్
మన్నియవద్దె కేలియమలప్పన వేంగి గళింగలాదిగా
నన్నియు నొక్కనాండ • (నే)ఱువ భీమనృపాలు దాడికిన్॥"

ఇట్టి శూరాగ్రేసరుఁ డగు భీమరాజు సోదరునితో సఖ్యపడి యుండిన యెడల వీరి రాజ్యమన్యాక్రాంతము గాక యుండెడిదే; గాని విధిప్రేరణచే నట్లు జరగదయ్యెను.

## —♦ ఎఱువ కేశవరాజు ♦—

ఈ యెఱువ వంశమున ప్రసిద్ధి వహించిన వారిలో నీ కేశవ రా జొకఁడు. ఇతఁడు ఎఱువ సింగరాజునకును, లక్ష్మీదేవికిని

* S. I. I. V. No. 145.

పుత్రుఁడు. ఈయన శాసన మొకటి అమరావతిలోని అమరేశ్వరాల యమునఁ గానవచ్చుచున్నది. దానినిబట్టి చూడఁగా నితఁడు చిలుమూరు గ్రామములోని ఫుట్టెడుచేను నా దేవునకు దానమిచ్చి శాసనము వ్రాయించి నట్లు గన్పట్టును. ఇది యాతని వృత్తిభూమి నుండి యొసఁగఁబడి యుండును. కమ్మవారిలోని యేరువ వారి వంశీకులే యగుదురు.

ఈ యెఱువ వంశీకుల తర్వాత విషయము చరిత్ర ప్రసిద్ధిగాఁ గన్పడదు; గాని శా. శ. 1579వ సం॥ర ప్రాంతములో విప్పర్ల గోత్రీకులగు యేర్వ పేరారెడ్డి, జంగంరెడ్డి, కొండారెడ్డి, పెదవెంగన, తిమ్మారెడ్డి, చినవెంగన యను వారలు కనిగిరి తాలూకా కూటగుండ్ల గ్రామములో గోపాలస్వామి గుడి పునః శిలాకట్టడము గట్టించి నట్లు వారి శాసనమువల్లఁ దెలియుచున్నది. వీరల తండ్రి లచ్చిరెడ్డి యనియు, తాత కొండారెడ్డి యనియు వ్రాయఁబడినది. వీరికిని పై రాజవంశీకులకును గల సంబంధము తెలియుటలేదు. వీరందరును రెడ్డి వంశీకులై పోయినవారని తోఁచుచున్నది. (N. I. K. 16)

## —• మచ్చవారు - మచ్చగన్న విభుఁడు •—

మచ్చవారు చాళుక్య వంశములోని వారని వెలుగోటి వారి వంశావళి తెలుపుచున్నది. వీరు కమ్మవారిలోని అడపావారికి ముఖ్య బంధువులై యున్నారు. 14 వ శతాబ్దమున నీ మచ్చ వంశములో ననేకులు వీరాగ్రేసరులుగ నుండి పద్మనాయక రాజులతో విరోధులై యుండిరి. ఆ కాలములో పలువురు రాజ్యాతిక్రమణములకై పోరాడుచు వచ్చిరి. మచ్చ వంశములో దాదాపు క్రీ. శ. 1321 వ సం॥ర ప్రాంతమున గన్న విభుఁ డను ప్రముఖ నృపతి యుండెను. ఆతఁడు వెలుగోటి యెఱ్ఱదాచా నాయనిచే యుద్ధమునఁ జంపఁబడి నట్లు, వెలుగోటివారి వంశావళిలోని యీ క్రింది పద్యము తెలుపుచున్నది.

"స్ర. వీరుం డా యాచపృథ్వీ - విభుఁ డతుల భుజా • విక్రమ మన్యక్ష్మాత్యాన్య
స్ఫారుండై మచ్చగన్న - ప్రముఖనృపతులన్ • బ్రాణముల్వాపి హెచ్చెన్
(దోరాజత్) ఖడ్గధారన్ - దునిమె దురకలం • దోలి తత్సైన్య రాజీ
ఘోరాజీ ధాటి చెల్లన్ - గొలచలమపురిన్ - ఘోటికా కోటిదెచ్చెన్."

ఎఱ్ఱదాచా నాయుని పుత్రుఁడగు సింగమనాయఁడు గూడ జీలుగుపల్లి కడ జరిగిన యుద్ధములో నొక మచ్చ గన్నమనేనిని జంపినట్లు వ్రాయఁబడినది. ఈ యుద్ధములో తండ్రియు, కుమారుఁడుఁ గలిసి పోరాడి యుందురు.

## —♦ మచ్చ కొమ్మానేని, బాచఁడు ♦—

మచ్చ కొమ్మవిభుని పుత్రుఁడు బాచఁడు. ఈ తండ్రిబిడ్డ లిర్వురును శూరాగ్రేసరులై యుండిరి. వీరు వెలుగోటి యెఱ్ఱదాచా నాయుని పుత్రుఁడగు సింగమ నాయనితో ఘోర యుద్ధము లొనర్చుచు నోడి పోయిరఁట. మగతల వద్ద జరిగిన యుద్ధములో మచ్చ కొమ్మానేని సంహరింపఁ బడియెను. తర్వాత జీలుగుపల్లి వద్ద జరగిన యుద్ధములో సింగమ నాయనిచే బాచనేని సంహరింపఁబడి నట్లీక్రింది పద్యము దెలుపు చున్నది.

"చ॥ బలువిడి మచ్చ కొమ్మవిభు • బాచని జీలుగు పల్లియొద్ద న
చ్చలమున ద్రుంచి తద్రణము • సాహసుఁడై కుడిపించె ఘాతముల్
పలుమరు సొక్కియాడుచును • బాడుచు మోద మెలర్ప నయ్యెడన్
జెలఁగఁడె యెఱ్ఱదాతవిభు • సింగఁడు ఘోరిపరాక్రమంబునన్॥"

## —♦ మచ్చ రుద్రుఁడు ♦—

ఈయనగూడ పరాక్రమశాలియై యుద్ధములలోఁ బాల్గొనుచు వచ్చెను. దురదృష్టవశమున మగతలయొద్ద జరిగిన యుద్ధములో నీతఁడు గూడ సింగమ నాయనిచేఁ జంపఁబడిన ట్లీ క్రిందిపద్యము దెలుపుచున్నది:

"చ॥ మగతల యొద్ద నుద్దవిడి • మార్కొని రాజులు సన్నుతింపఁగా
నగణిత విక్రమస్ఫురణ • నాలము లోపల మచ్చ రుద్రునిన్

దగ వదదోలి చంపె నెలదాచయ సింగడు పార్థుడై వడిన్
బగ యడగించి యచ్చటనపండువు సేసెను భూతకోటికిన్॥"

జీలుగపల్లి వద్దను, నగతల వద్దను జరిగిన యుద్ధములలో కమ్మవీరు లనేకు లిట్లు సంహరింపఁబడినట్లు కనుపడుచున్నది. సింగమనాయఁ డంతట 'మచ్చనాయకుల తల గొండగండ' 'కమ్మదొరల మోదిన కాలదండమ' యను బిరుదములను ధరించెనఁట. ఈ సింగమ నాయఁడు తుదకు జల్లిపల్లి కోట ముట్టడిలో కమ్మల బొమ్మనిచే బొడువఁ బడి చనిపోయెను.

## —♦ మచ్చ ఓబలరాజు ♦—

ఈతఁ డిందువంశంబు రాజులలోని వాఁ డని స్పష్టముగ వెలుగోటివారి వంశావళి తెలుపుచున్నది. (పుట 18). జల్లిపల్లి వీరక్షేత్రమున అయిదు లక్షల అఱువది వేల బలముతో నీ మచ్చ ఓబలరాజు మున్నగు ననేక సేనాధిపతులు చేరి వెలుగోటి అనపోతానాయఁడు, మాదానాయఁడులతో (క్రీ. శ. 1361వ సం॥) శార్వరి సం॥లో ఘోర యుద్ధమొనర్చిరి. ఈ రణరంగములో శూరాగ్రేసరుఁ డగు ఓబలరాజు గూడ అనపోతానాయనిచేఁ జంపఁబడి నట్లీ క్రింది పద్యము స్పష్టపరచు చున్నది.

"ఉ॥ కొమ్మని మచ్చ యా బళుని - గూల్చి శిరంబులు ద్రుంచి గన్నయన్
బిమ్మట ద్రుంచి తత్సుతుల - బేర్చిన బొమ్మలు వెట్టి దారులం
దమ్మటము ల్వెసం గొనియె - దాచయ సింగని పట్టి యెట్టిదో
బొమ్ములు బెట్టు నిట్టు లన పో - తఁడు వైరము బూను వారికిన్॥"

ఈ మచ్చవారిలో చాలవర కిట్లు హతులై పోగా, హతశేషులగు వా రెచ్చటనో తల దాచుకొని తర్వాత కమ్మవార మనియే చెప్పుకొనఁజొచ్చిరి. వీరిలో 15వ శతాబ్దమున మచ్చకొండ నృపాలుఁ డను నతఁ డుండి యాతని కుమార్తె యగు తిరుమలమ్మను అడప నృసింహ నృపాలుని కిచ్చి పరిణయము గావించినట్లు జానకీరాఘవ మను గ్రంథమువల్లఁ దెలియుచున్నది.

## —♦ మచ్చ కాచినేని ♦—

ఈ మచ్చవంశములో శా. శ. 1337 వ సం॥ (క్రీ. శ. 1415 వ సం॥ ) నాఁటికి మచ్చ కాచినేని యను నతఁడు కొండవీడు ప్రాంతమున నొక ప్రసిద్ధ పురుషుఁడుగా నున్నట్లు కనబడుచున్నాఁడు. ఈయన భార్యపేరు నాగసాని. వీరికి కొలవేమసాని యను పుత్రిక గలదు. ఈ కుమార్తె శా. శ. 1337 వ సం॥లో కొండవీటిలోని మూలస్థాన మైలారదేవర యాలయమున మధ్యరంగము కంభము తన తల్లిదండ్రుల పుణ్యమునకై వేయించి శాసన మొకటి వ్రాయించి ప్రసిద్ధి వహించెను. †

## —♦ కొండవారు - కొండమల్రాజు ♦—

క్రీ. శ. 1361వ సం॥ర ప్రాంతమున నీ కొండ వంశములో కొండమల్రా జను నతఁ డొక ప్రసిద్ధ వీరాగ్రేసరుఁ డుండెను. ఆతఁడు చాళుక్య రాజులలోని వాఁ డని యీ వెలుగోటివారి వంశావళి నుడువుచున్నది. వెలమ వీరులగు అనపోతానాయుఁడు, మాదానాయఁ డను వారలు (రాచకొండ, దేవరకొండ ప్రభువులు) జల్లిపల్లి కోటపై దండెత్తి వచ్చినప్పు డీతఁడుగూడ తక్కిన చాళుక్య నృపాలురతోఁ పాటు ఘోరయుద్ధము నొనర్చెనుగాని వారిచే నా రణరంగమున సంహరింపఁ బడెను. ఈ వంశీకుల తర్వాత వివరము తెలియుటలేదు. కాని కమ్మవారిలో నేటికి నున్న కొండ వారి చాళుక్య వంశమువారే యనవచ్చును.

## —♦ సమ్మెటవారు * ♦—

(సమ్మెట - కొండ్రాజు)

సమ్మెటవారు చాళుక్య వంశజులని వెలుగోటివారి వంశావళి తెలుపుచున్నది. వీరినే సంపెటవా రనియు, సంబెటవా రనియు

---

S. I. I. Vol. IV, No. 695·

వెలుగోటివారి వంశావళిని బట్టి వ్రాయఁబడెను.

గూడ నందు వ్రాయఁబడినది. క్రీ. శ. 1361వ సం॥ర ప్రాంతమున నీ వంశములో సంబెట కొండ్రాజను వీరాగ్రేసరుఁ డుండెను. క్రీ. శ. 1361 వ సం॥లో ఇనుగుర్తివద్ద వెలమ వీరులకును చాళుక్య రాజుల కును జరిగిన ఘోర సంగ్రామములోఁ బాల్గొనిన వీరులలో నితఁ డొకఁడు. దురదృష్టవంతుఁడగు నీ శూరశిఖామణి గూడ నా రణ రంగమున రావులింగయ నాయకుని కొడుకగు ననపోత నృపాలునిచేఁ దక్కిన చాళుక్య రాజుల వలెనే మడిసినట్లు వెలుగోటివారి వంశా వళి తెలుపుచున్నది. అప్పటి నుండియు నా రాజ్యమున చాళుక్యుల మని చెప్పుకొనుట కష్టమయ్యెను. అచటివారు క్రమముగా కమ్మ వారుగనే చెప్పుకొనుచున్నట్లు కన్పడును. మిక్కిలి దూర ప్రాంతీ యులుగు నీ వంశీకులు కొందఱు మామూలుగఁ క్షత్రియులుగఁ జెప్పు కొనుచు వచ్చిరి.

## —♦ సమ్మెట సోమ నృపాలుఁడు ♦—

ఈ వంశములో దాదాపు క్రీ. శ. 1417వ సం॥ ప్రాంతమున కడప జిల్లా పెర్నిపాడు పాలకుఁడుగా నీ సోమనృపాలుఁడు పేరందెను. ఈతఁడు విజయనగర సామ్రాజ్య ప్రభు వగు రెండవ దేవరాయల సామంతుఁ డని చరిత్రజ్ఞులు గుర్తించుచున్నారు. ఈతఁడు కొండ వీటి ప్రాంతమున జరిగిన యొక యుద్ధములో రాయరావు బిరుదాంకి తుఁడగు వెలుగోటి అనపోత నృపాలునిచే నోడింపఁబడినట్లు వెలు గోటి వారి వంశావళిలోని యీ క్రింది పద్యము తెలుపుచున్నది.

"కం॥ సమ్మెట సోముని సరెపలి ♦ తిమ్మని నలకొండవీటి • దిక్కున మెఱయన్
దమ్మటము వేసి గెలిచితి • వమ్మక్కారాయరావు • అనపోతాంకా॥"

ఇట్లు గెలిచినను, యీతని పాలనము గైకొనినట్లు లేదు. ఏమైన కప్పమును గైకొనెనో లేదో తెలియదు. ఈయనకు పిన్నమ నేని యను కుమారుఁడుండెను. ఈతని యనంతర మతఁడే పెర్ని పాడు పాలకుఁడయ్యెను.

## —♦ సమ్మెట పిన్నమనేని ♦—

ఈయనకును వెలుగోటి మాదానాయని కొడుకు లింగమ నాయనికిని జరగిన యొక యుద్ధములో నితఁడోడిపోయినట్లు వెలుగోటివారి వంశావళి తెలుపుచున్నది. దేవరాయల రాజ్యపాలన నాఁటి యొక శాసనములోఁగూడ నీ పిన్నమనేని పెర్నిపాడు పాలకుఁడుగా నుదహరింపఁబడి యున్నాడు. ♦ లింగమనాయని మరల దేవరాయలోడించి పిన్నమనేనిని తిరిగి తన సామంతుఁడుగాఁ జేసికొని యుండునని. దీనిని బట్టి గుర్తింపఁ బడుచున్నది. ఈ సమ్మెట వంశీకు లిప్పటికిని కమ్మవారిలో నిలిచి యున్నారు. ఈ వంశములో నొక యోధుఁడు కృష్ణదేవరాయల సామంతుఁడుగా నున్నట్లును, అతఁడు సింహాద్రికి జయస్తంభమును జేర్చినట్లును ఒక చాటువు గలదు. * అతఁడు దాదాపు క్రీ. శ. 1520 వ సం॥ ప్రాంతీయుఁ డన వచ్చును.

## —♦ ఆరవీటి వంశము—కోనేటివారు - కోనేటి కొండ్రాజు ♦—

కృష్ణరాయల సంబంధీకులగు ఆరవీటి వంశమువారు చాళుక్య శాఖీయులే యని లోగడ తెలుసుకొంటిమి. ఈ వంశములో కోనేరు నాధుఁడను నతఁడు ఆరవీటి బుక్కరాజు తర్వాత కొంత కాలమునకు జనించెను. ఈ వంశములోనే మరి కొందఱు కోనేటయ్యలు తర్వాత జనించి పేర్వడసి యుండిరి. మహామండలేశ్వర రామరాజు కొడుకు పేరు కోనేటయ్య దేవుఁడు. ఈయన కుమారుఁడు తిమ్మరాజు. ఈ తిమ్మరాజు ఉదయగిరి రఘునాధస్వామికి గోపుర మొకటియు, మండప మొకటియు, ప్రాకారాదులను గట్టించుటయే గాక కోనే రొకటి త్రవ్వించి పేరు జెందెను. ఈయనకు "దంకాదుకమ్మ" యని బిరుదున్న ట్లాయన యచట వ్రాయిం

• L. R. 18, Pernipadu. p. p. 23—30&L. R, 14. p. 412

*"సంపెట నరపాల సార్వభౌముఁడు, వచ్చి • సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు"

చిన శాసనములో గలదు. * (డంబు + ఆది + కమ్మ) ఘనమగు యాది కమ్మ యని దీనికి నే నర్థము చేయు చున్నాను. ఇది సరియైన దగు నెడల లోగడ నుడివిన చాళుక్య రాజులవలెనే యీ శాఖలో కొందఱు గూడ కమ్మవారుగాఁ గూడఁ జెప్పుకొనుచు క్రమముగా మారిపోయి యుందు రనవలెను. ఏలయన, కోనేటి లేక కోనేరు వారు నేఁటికిని కమ్మవారిలో నున్నారు.

కోనేటి కొండ్రాజను వీరుఁ డొకఁడు క్రీ. శ. 1616వ సం॥ లో తోపూరు వద్ద గొబ్బూరి జగ్గరాజునకు శ్రీ రామదేవరాయల పక్షమున రఘునాథరాయలకును జరిగిన యుద్ధములో శ్రీ రామదేవరాయల పక్షమున నిలిచి యుద్ధమాడి నట్లు రఘునాథాభ్యుదయనాటకమును బట్టి గ్రహింపఁ గలను.

ఈ ఆరవీటి చాళుక్య శాఖవారు క్రమముగా కృష్ణదేవరాయల సంబంధములు చేయుచు, కమ్మ శాఖతో సంబంధములు తగ్గించి యుందు రని తెలఁచెదను.

## —♦ నంద్యాల చిత్రాజు ♦—

ఈ ఆరవీటి వంశములోఁ గొందఱు నంద్యాలవారుగాఁ బేరు వహించినట్లు ఆరవీటి వంశ చరిత్రవల్లఁ దెలియఁ గలదు. కమ్మవారిలోఁ గల నంద్యాలవారు గూడ నీ వంశీకులే యై యుండవచ్చును. కొందఱు నంద్యాలవారు క్షత్రియులుగానే వ్యవహరించుకొని యుండవచ్చును. క్రీ. శ. 1616వ సం॥ర ప్రాంతమున నందేల చిత్రాజను వీరుఁ డొకఁడు తోపూరు యుద్ధమునఁ బాల్గొనెను. అతఁడుగూడ యీ ఆరవీటి చాళుక్య వంశీకుఁడుగనే గన్పడును.

## —♦ మండువ మల్లినేఁడు ♦—

ఈతఁడు మణుఁగూరి కోట పాలకుఁడుగా 15వ శతాబ్దమున నుండెను. ఆకాలములో వెలుగోటి వంశీకుఁ డగు మాదయ లింగ

---

* N. I. 420.

నృపాలుఁ డీ కోటపై దండెత్తి యీ మల్లినేనిని జయించినట్లు వెలుగోటి వారి వంశావళి వలనఁ దెలియుచున్నది. మంఞా లేక మంచువవారు దుర్జయాన్వయులలోని వారని లోగడ తెలిపియున్నాను. ఈతఁడు కూడ నా శాఖీయుఁడే యనవచ్చును.

## —♦ మంచెళ్లవారు ♦—

### మంచెళ్ల నరహరినేని

ఈయన మంచెళ్ళ పిన్నమనేని కుమారుఁడు. ఈ వంశీకులు రాజమహేంద్ర పాలకులగు రెడ్డి ప్రభువులకడ సామంతులుగా పేర్వడసిరి. క్రీ. శ. 1416 వ సం॥ర ప్రాంతమున దొడ్డయ అల్లారెడ్డి యను రెడ్డి ప్రభువు రాజమంద్రి పాలకుఁడుగా నుండెను. ఆతఁడు కాటయ వేమారెడ్డికి బంధుగుఁడును సేనాధిపతియునై యుండి యాతని మరణానంతరము రాజ్యమునకు వచ్చినట్లు కన్పడును. ఈ నరహరినేని అల్లాడరెడ్డిని రాజ్యము నందు నిల్పిన యోధాగ్రేసరులలో నొక్కఁడు. అందుచేతనే యీతనికి 'రాజ్య ప్రతిష్ఠాపకుఁడ'ని బిరుదు గలదు. ఆ కాలములో అల్లాడ రెడ్డికిని యుత్తర ప్రభువు లగు పెదకోమటి వేమారెడ్డి (కొండవీటి ప్రభువు) అనదేవచోడుఁడు (కామపురి పాలకుఁడు) ఫిరోజిషా (గుల్బర్గపాలకుఁడు)లకును విరోధము లుండియుద్ధములు జరుగుచుండెను. ఆయుద్ధములలోనే నరహరినేని తన పరాక్రమమును గన్పఱచి అల్లాడరెడ్డికి జయము లభింపఁజేసి చివర కాతని రాజ్యమున నిల్పి యీ బిరుదుఁ గొనినట్లు కన్పడును. ఈయన శా. శ. 1338 వ సం॥ (క్రీ. శ. 1416 సం) శ్రీ రామేశ్వరాలయమున (పాలకొల్లులో) కళ్యాణ మండప మొకటి కట్టించి గోపుర నిర్మాణ మొనరించినట్లచట నొక శాసనము గలదు. దానిలో నీ క్రింది శ్లోకములు గన్పడుచున్నవి :

" శాకాబ్దే వసుమూర్తి రామ రజనీ నాథైశ్చ గణ్యే గతే ।
ఖ్యాతే దుర్మ్ముఖి వత్సరేచ విలసన్మాసస్తుత్యమే శ్రావణే ।

శ్రీమ ద్దొడ్డయ యల్ల భూతలపతే రాజ్య ప్రతిష్ఠాపకో ।
మంచెల్లాఖ్య పురీశ్వరో నరహరిః పిన్నక్షితీశాత్మజః॥
యథాకైలాస శిఖరం తథైవ పరిశోభితం
షోడశ హస్త ప్రమాణ దీర్ఘం తదర్ధవిస్తారం॥"

ఈయన మంచెళ్ళ నగరాధిపతిగాఁ బేరు వహించెను. ఈయనవద్ద కిరిలెంక లేక కూచిలెంక శిరిగిరి నేఁడనునతఁడు సచివుఁడుగా నుండెను.

ఈయన యాధ్వర్యమునసే పై మంటపము తయారుచేయఁబడెనఁట. ఇంతేగాక నరహరినేఁడచటి స్వామివారికి రథ మొకదానిని చేయించి, పసిఁడిప్రభను, గొన్ని వస్త్రములను సమర్పించి పేరందెను. ఈ వంశీకు లిపుడు కమ్మవారిలో మంచాల వా రనఁబడుచున్నారు. వీరు పోగునూళ్ళ గోత్రీకులు. శిరిగిరినేని తండ్రియగు నారభూపాలుఁడు, నరహరినేని తండ్రియగు పిన్నమ హీపాలుని వద్ద చెలికాఁడుగా నుండె ననియు, శిరిగిరినేఁడు శా. శ. 1341వ సం॥లో నచట రామలింగేశ్వరునకుఁ గొంత భూమిని దానమిచ్చినట్లును మఱియొక శాసనమువల్లఁ దెలియుచున్నది. కమ్మవారిలోని కూచివారి వంశీకు లగుదురేమో తెలియదు.

## —♦ వాసిరెడ్డి వారు ♦—

### వాసిరెడ్డి పోతినీఁడు

వాసిరెడ్డి వారి వృత్తాంతము 14వ శతాబ్దమువరకుఁ దెలియుట లేదు. వీరు వల్లుట్ల గోత్రీకులు. వీరిలో 14వ శతాబ్దాంతమున వాసిరెడ్డి వాసయ ప్రభు వను నతఁ డుండెను. ఆయన కుమారుఁడగు పోతినీఁడు శా. శ. 1352వ సం॥ర ప్రాంతీయుఁడు. ఇతఁడు రాజమహేంద్ర పాలకుఁ డగు కాటయ వేమారెడ్డివద్ద నొక సామంతుఁడుగా నుండి పిఠాపుర ప్రాంతమును బాలించుచున్నట్లు తెలియుచున్నది. ఈయన పిఠాపురమునందు విష్ణు, సూర్య, విశ్వేశ్వర, గాలి, కుక్కుటేశ్వరాలయములను ఐదు దేవాలయములను గట్టించి

పానిలో దేవతలను ప్రతిష్ఠించి 4 శాసనములు వ్రాయుటయేగాక నా ప్రాంతమున నాల్గు లక్షల అరవై వేల తాడిచెట్లు నాటించె ననియు నందుచే మను దేవేంద్రుఁ డనదగు ననియు నొక శాసనమున వ్రాయఁబడినది*. తాడిచెట్టు సర్వగ్రంథ నిర్మాణమున కుప యోగకారి యని యభినందించుచు నొక శాసనమున వ్రాయించెను. ఈయన వ్రాయించిన యొక శాసనములో నితఁ డిట్లభివర్ణింపఁబడి యున్నాఁడు.

"సీ॥ నిండె నెవ్వనికీర్తి • నిఖిలలోకంబుల - చంద్రికావిస్ఫార • సాంద్ర గరిమ
నుండెనెవ్వనియింట • పుండరీకాక్షుని - ప్రాణవల్లభయైన • పద్మనయన
పండెనెవ్వని కృపా • పాథోధినిల యెల్ల - ధాన్య సంపూర్ణ వ • దాన్యయగుచు
మండె నెవ్వనికోప • మహిమా నలంబుచే - అరివీరగేహంబు • లక్షణంబు

గీ॥ అనుచు గొనియాడుచుందు రిన్ను • నఖిలసభల
వేమ భూపాల కారుణ్య • విమల పాత్ర
ప్రబలకరి తేజ వాసయ • ప్రభు తనూజ
మనుజ దేవేంద్ర పోత కు • మార చంద్ర॥"

ఈయన భార్యపేరు పోతసాని. ఈయనకు వేమయ్య యను కుమారుఁ డుండెను. పోతినీఁడు పిఠాపురములోని కుంతీమాధవ పెరుమాళ్ళకు లక్ష్మీదేవి నగ రొకటి కట్టించి, బృందావన మొకటి వేయించి, నగరునకు సున్నం వేయించి శా. శ. 1352 వ సం॥లో నొక శాసనము వ్రాయించెను. పైన నుడివిన దేవాలయ ప్రతిష్ఠ లన్నియు ప్రమాది, సౌమ్య, సాధారణ సం॥లలో కావింపఁ బడెను.

ఈయన కుమారుఁ డగు వేమయ్య తన తల్లికి ధర్మమునకై బృందావన మొకటి వేయించి శాసనము వ్రాయించెను★. పోతినీఁడు తండ్రి యగు వాసయ ప్రభుని పేరిఁటనే వాసిరెడ్డి వా రేర్పడి యుందు రని మొదటి భాగమున తెలుపఁ బడినది. పోతినీఁడు తన ప్రభు వగు కాటయ వేమారెడ్డి పేరునే తన కుమారునకుఁ బెట్టె నట్లూహిం చుట సత్య దూరము గాదు.

---

* S. I. I. Vol. VI, Nos. 673 to 676.
★ S. I. I. Vol. VI, No. 677.

## —♦ వాసిరెడ్డి మల్లికార్జునుఁడు ♦—

ఈ వంశీకుల వృత్తాంతము తర్వాత దాదాపు క్రీ.శ. 1525వ సం॥ము వరకును తెలియుట లేదు. వాసిరెడ్డి వంశ చరిత్రను బట్టి చూడఁగా, నీ వంశములో తర్వాత వాసిరెడ్డి మల్లికార్జునుఁడను నతఁడు వాసి, నగరాధిపతిగా హైదరు జంగను తురుష్క ప్రభువు సామంతుఁడుగా నుండినట్లు కనుపడును. ఈ హైదరు జంగెవ్వరో గుర్తించుటకు వీలు లేకున్నది*. ఇతఁడు బహుశః గోల్కొండ నవాబు కుతుబ్షా వంశమువారి సేనాధిపతి యని తోఁచు చున్నది. చాటుపద్యములలో "దరికొండవీటికి దక్షుఁడై విలసిల్లు, నల వాసిరెడ్డి మల్లప్రభుండు" అని వర్ణింపఁబడిన దీతఁడే యై యుండును. ఇది సరియైనచో నితఁడు నెల్లూరు జిల్లా వాసిలిలోఁగాక కొండవీటిసీమలో నేయొక సామంతుఁడుగా నుండి యుండును. ఈ మల్లికార్జునునకు హైదరు జంగు నకును కప్పముల విషయమై తగాదా వచ్చి చివరకు గొప్ప యుద్ధమయ్యెను. హైదరు వద్ద ఖాదరుజంగు, సౌబతుజంగు, ముఖర్ జంగు, మున్నగు సహాయ సేనాధిపతు లుండిరి. మల్లికార్జున ప్రభువు వద్ద భీమసింగను ప్రధాన సేనాని యుండెను. ఇరువాగులవారికిని జరిగిన యుద్ధములో ప్రధానులగు హైదరుజంగును, మల్లికార్జునుఁడును చనిపోయిరఁట. మల్లికార్జున భూపతికి సహాయముగా వచ్చిన యాతని యల్లుఁడగు రావెల వీరమల్లానాయుఁడు గూడ హతుఁడయ్యెను★. అంతటితో మల్లికార్జునుని పాలన మంతరించెనఁట.

---

* కృష్ణదేవరాయల యనంతరము క్రీ. శ. 1530 వ సం॥లో కూలీకుతుబ్షా యను గోల్కొండ నవాబు సైన్యము కొండవీటి నాక్రమింపఁగా నచ్యుతరాయలు మరల గెలిచెను. ఈ కుతుబ్షా సైనికులు కప్పములు బలవంతముగా వసూలు చేయుటకై ప్రయత్నించిన దీ కాలమై యుండును.

★ ఇతఁడు కృష్ణదేవరాయల సేనాధిపతియగు రావెళ్ళమల్లి భూపతి కావచ్చును.

## —♦ వాసిరెడ్డి సదాశివనాయఁడు ♦—

మల్లికార్జునుని మరణానంతర మాతని పుత్రుఁడొకఁడు దాసిచే నూతక్కి గ్రామమునకుఁ బంపఁబడి యచటఁ బోషింపఁబడెను. ఆతఁడు పెద్దవాఁడై అనవేమారెడ్డి నాశ్రయించి మరలఁ గొంత రాజ్యమును సంపాదించినట్లు వంశచరిత్రలో చెప్పఁబడినది; గాని యిది పొరబాటుగ నున్నది. ఈతఁడు గోల్కొండ నవాబగు ఇబ్రహీం కుతుబ్షా కాలములో (క్రీ. శ. 1550-81) నుండి యాతనికడ నేమైనఁ గొంత పాలనాధికారము గ్రహించి యుండవచ్చును. ఆతని కాలములోనే కొండవీటి సీమ కుతుబ్షా వంశజులకు వచ్చెను. తత్పూర్వ మిది కృష్ణదేవరాయల క్రిందను, ఆయన సామంతులగు గజపతుల క్రిందను ఉండెను. సదాశివనాయఁడు కోడాలి రామన్నపాలుని కుమార్తెను పెండ్లాడి మల్లికార్జునుఁడను పుత్రునిగాంచెను. ఆయనకు శ్రీశైలపతి, మల్లికార్జున, సదాశివ, గంగాధరు లను నల్వురు పుత్రులుండిరి. ఇందు శ్రీశైలపతి కట్టా వంశజయగు శ్యామలాంబను వివాహమాడఁగా వారికి వెంకటాద్రి యను కుమారుఁడు జనించెను. వీని పాలనా విశేషములు తెలియకున్నను వెంకటాద్రికి గంగినీఁడు, మాదినీఁడు, వెంకటాద్రి, గుర్వినీఁడు, చినవెంకటాద్రి యను నైదుగురు కుమాళ్లుండి వారిలో గంగినీడు మోపులూరునను, మాదినీఁడు తాడిగిరి యందును, వెంకటాద్రి పల్లగిరిలోను, గుర్వినీఁడు పోపూరునను, చిన వెంకటాద్రి నందిగామలోను చౌదరీ తనము చేయుచున్నట్లు వంశచరిత్ర స్పష్టపఱుచుచున్నది. ఈ చౌదరీ తనము మొగలు ప్రభుత్వములో నేర్పడినట్లు దృష్టాంతము లున్నందునను, క్రీ. శ. 1632వ సం॥ ప్రాంతములో గోల్కొండ నవాబు రాజ్యము ఢిల్లీ మొగల్ చక్రవర్తి యగు షాజహానునకు లోఁబడుట వల్లను, దాదా షా కాలములోనే పై వారందరును చౌదరీతనము సంపాదించుకొన్నట్లు గ్రహింపవచ్చును. శ్రీశైలపతి సోదరుఁడగు సదాశివ నాయునికి మల్లికార్జునుఁడును, ఆతనికి వీరరాఘవనాయఁడును, ఆత

నికి లింగమనీఁడును, ఆతనికి వీరపనీఁడు, మల్లినీఁడు, మాదినీఁడు, బెజ్జనీఁ డను నల్వురు కుమాళ్ళును జనించిరి. ఇందలి మాదినీఁడు ప్రసిద్ధుఁడై ఆత్మకూరు నిడమర్రు వంటులకు చౌదరి యయ్యెనఁట.

వీరపనీఁడు కుమాళ్లు సింగనీఁడు, లింగినీఁడు, మాదినీఁడు, మాల నీఁడనువారలు. ఇందులో లింగినీఁడు ప్రసిద్ధుఁడై తాడికొండ వంటునకు చౌదరితనము సంపాదించినట్లు కనుబడును. వీరందరును క్రీ. శ. 1632—1670 వ సం॥ల మధ్య ఢిల్లీచక్రవర్తుల సామంతుఁడుగా మెలంగిన గోల్కొండ కుతుబ్షా అబ్దుల్లాకు కప్పములు చెల్లించు చుండి రనవచ్చును.

## —♦ వాసిరెడ్డి వీరప్ప నాయఁడు ♦—

పైన నుడివిన నందిగామ సీమచౌదరి యగు వాసిరెడ్డి చిన వెంకటాద్రికి వీరపనీఁడు, చిన వీరన్న, బెజ్జనీఁ డను ముగ్గురు పుత్రు లున్నట్లు కన్పడుచున్నది. వీరిలో జ్యేష్ఠుఁ డగు వీరప్ప నాయఁడు ప్రసిద్ధుఁడై క్రీ. శ. 1660 వ సం॥లో గోల్కొండ నవాబు వద్ద (అబ్దుల్లా కుతుబ్షా యై యుండును) నందిగామ పరగణా దేశముఖ సన దును పొందినట్లు కృష్ణాజిల్లా మాన్యుయల్‌లో వ్రాయఁ బడినది. దీనినిబట్టి యీవంశీకులు వరుసగానే యచటచౌదరీతనము చేయుచూ దేశముఖ పదవిని సంపాదించినట్లు గ్రహింప వచ్చును. ఈ వంశీకుల తర్వాత చరిత్రము మూఁడవభాగమున వ్రాయఁబడును.

## —♦ గురిజాల ముప్ప భూపాలుఁడు ♦—

ఇతఁడు గౌతమీతటమున గల సబ్బినాటి రాష్ట్రమును రామ గిరి రాజధానిగాఁ బాలించినవాఁడు. ఈయనకు "సిరు నెత్తురుగండ లేక నిరు వెత్తుగండ, గండగోపాల, గోపాలకాంచిరక్షపాలక, చోడ రాజ్య స్థాపనాచార్య, దొంతి మన్నియవిభాళ, చలమర్తిగండ, గజగంధవారణ, రాజగజకేసరి, మూఁడురాయ జగదళ విభాళా"ది బిరుదు లున్న ట్లీతని మంత్రి కృతినొందిన పద్మపురాణోత్తర ఖండ మను గ్రంథమువల్లఁ దెలియుచున్నది[†]. ఈ గ్రంథము పది యాశ్వాస

† కవిజీవితములు చూడుఁడు.

ములు గలది. దీని ప్రతి యొకటి యాంధ్రసాహిత్యపరిషత్కార్యాలయమున నున్నది. దీని కృతిభర్తయగు వాణసకందనామాత్యుఁడీ నృపాలునివద్ద మంత్రిగాఁ బేరండెను. వీరి కాల నిర్ణయము సరిగాఁ దెలియకున్నను, బిరుదములను బట్టి యీతఁడు రెండవ ప్రతాపరుద్రుని కాలమువాఁడుగాఁ గన్పడుచున్నాఁడు. అందుచే 14వ శతాబ్ద ప్రారంభము వాఁ డనవచ్చును. ఈయనవద్ద సింగన యను కవి యాస్థాన కవీశ్వరుఁడుగా నుండెను. అతఁడు రచించిన వాసిష్ఠ రామాయణమున నితనిని గుఱించి యిట్లున్నది.

"కం॥ కూనయ ముప్పనృపాలుని। సూనుం డగు తెలుఁగు విభుని - సుందరి మల్లాం
బా నందనుఁడగు ముప్పయ। భూనాథుని సుకవివరుఁడ-బుధసన్నుతుఁడా॥"

దీనినిబట్టి యీ వంశమునకు మూల పురుషుఁడు కూనయ యనియు, నాతని కుమారుఁడు ముప్పరాజనియు, నాతని కొడుకు తెలుఁగు విభుఁడనియు, నాతనికి మల్లాంబ యం దీ ముప్పభూపాలుఁడు జన్మించినట్లును కనుబడుచున్నది. ఇందలి తెలుంగు రాయని గురించి పద్మపురాణోత్తరఖండ మిట్లు చెప్పుచున్నది.

"మ॥ గురజాలాన్వయ దుగ్ధవార్ధి శశి ది • క్కుంభీంద్ర హస్తాభ బం
ధుర భూభాగ ధురీణ నిశ్చల మహా • దోర్దండుఁ డుగ్రారి భీ
కరుఁడై దిక్పరవర్తి కీర్తి నెగడం • గా భూరి భోగాఢ్యుఁడై
పరగెం ధాత్రిఁ దెలుంగు రాయఁడు జగ • త్ప్రఖ్యాత రాజ్యోన్నతిన్॥"

తెలుఁగురాజునకు మల్లాంబయం దీతఁడును, ముత్తభూపాలుఁడును జనించినట్లు తర్వాత పద్యములలోఁ గలదు. ఈ ముత్తభూపాలుఁడు గూడ నీతనికి రాజ్యపాలనలో సాయపడుచుండెనఁట.

ఈ వంశములోని తెలుఁగు రాయలే సాంపరాయని తెలుంగాధీశుఁడని కొందఱు పండితులు పొరఁబడిరి; గాని ఈ యిర్వురొకటి గాదని పై వంశావళి స్పష్టపఱచుచున్నది★. ఈ సబ్బినాటి రాజ్యము చిరకాలము నిలిచినట్లు కనుబడదు. ఈ రాజ్యమునకు క్రీ. శ. 1433 వ సం॥ తర్వాత అహమదుషా యను గుల్బర్గు సుల్తాను దండెత్తి

★ కవిజీవితములు చూడుఁడు.

యచటి కమ్మదొరలను జయించి యాక్రమించినట్లు కనుబడుచున్నది. ఈ సుల్తాను రామగిరిని తన కుమారుఁ డగు మహమ్మదు ఖానునకు పాలించుటకు క్రీ. శ. 1435 వ సం॥ ప్రాంతమున నియ్యఁగా, నచట జలాల్ ఖాను, సికందరుఖా నను వారలు ఆ ప్రాంతమున యెస్టేట్లను సంపాదించినట్లు తెలియుచున్నది. * కాకతీయ రాజులవలె నీముప్ప భూపాలుఁడు 'చలమర్తి' గండ బిరుదము ధరించినవాఁ డగుటచే నా తెగలోనివాఁడే యనవచ్చును. ఈ గురిజాలవా రిప్పటికిని కమ్మవారిలో నున్నారు. రెడ్లలోఁ గూడ నున్నను, వీరు రెడ్డికులజులుగాఁ గన్పడరు.

—♦ కసకుర్తి బావినాయనింగారు; యీవిపాటి నాయనింగారు ♦—

వీ రిద్దరును శా. శ. 1259 సం॥ (క్రీ.శ. 1337 సం॥ర) ప్రాంతీయులు. ఒంగోలుతాలూకా వీరన్నపాటి కాపురస్థులు. వీరు వీరన్నపాటిలోని లక్ష్మీనృసింహ దేవరకు బృందావనము వేయించి శాసనము వ్రాయించి ప్రసిద్ధిఁ జెందిరి*.

—♦ బొమ్మల భీమనేఁడు ♦—

ఈయన శా. శ. 1324 సం॥ ర ప్రాంతీయుఁడు. ఇతఁడు దర్శి తాలూకా రాజంపల్లి గ్రామకాపురస్థుఁడు. ఈయన యచ్చటి గోపీనాథస్వామికి శా. శ. 1324వ సం॥లో పందుము భూమి (న ౧౦)ని దానమిచ్చి శాసనము వ్రాయించి ప్రసిద్ధి జెందెను. †

—♦ కంచర్ల కొండమనాయఁడు ♦—

ఈయన గూడ శా.శ. 1324 వ సం॥ర ప్రాంతీయుఁడే. ఈయన రాజంపేట కాపురస్థుఁడు. అచటి గోపీనాథస్వామి కితఁడు రెండు కుంటల భూమిని దానమిచ్చి శాసనము వ్రాయించి కీర్తి వహించెను. ʃ

---

* వెలుగోటివారి వంశావళి, పీఠిక 1939.

† N. I., D. 62.

★ N. I., O. 109.

ʃ N. I., D 62.

## —♦ పొదిలపల్లి సింగమనాయఁడు ♦—

ఇతఁడు శా. శ. 1260 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన కా కాలమున కొంత నాయంకర ముండెను. ఒంగోలు తాలూకా ధేనువుకొండ గ్రామములోని దేవుని కితఁడు శా. శ. 1260 వసం॥ లో గొంతభూమిని దానమిచ్చి శాసనము వ్రాయించి ఖ్యాతి గాంచెను.∓

## —♦ చిటివారు ♦—

### చిటిపోతినీఁడు, వల్లభయ్య, చెన్నయ్యలు

చిటి, చిటినేని వంశీకులు కమ్మవారిలో నున్నారు. వీరిలో శా. శ. 1349వ సం॥ ర ప్రాంతమున చిటి పోతినీఁ డను ప్రసిద్ధ పురుషుఁ డొకఁడు గనఁబడు చున్నాఁడు. ఈయన తండ్రి పేరు ముమ్మన్నని. తల్లి పేరు ప్రోలాంబ. ఈయన పాటిబండ్ల గ్రామములో కొంత భూమిని అమరావతిలోని శ్రీ అమరేశ్వర స్వామి కర్పించి శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను. *దాదా పీయన కాలములోనే చిటి వల్లభయ్య యను వీరుఁ డుండి, వెలమ వీరుఁ డగు మాదయలింగ భూపాలునితో నొనర్చిన యుద్ధములలోఁ జెల్లులో పడ వేయఁ బడినట్లు వెలుగోటివారి వంశావళి తెలుపుచున్నది. చిటి చెన్నయ యను వీరుఁడు గూడ సీతనితో యుద్ధము సల్పి పారిపోయె నఁట. దీనిని బట్టి యీ వంశీకులుగూడ నాకాలపు యుద్ధములలో బాల్గొనినట్లు గ్రహింప వచ్చును.

## —♦ కూనపులి అనపోతా నాయనిం గారు ♦—

ఈయన శా. శ. 1338వ సం॥ర ప్రాంతీయుఁడు. ఇతఁడు నేటి గుంటూరు జిల్లాలో నిడుబ్రోలు కాపురస్థుఁడుగా నుండెను. ఈయన తండ్రి గుండానాయఁడు. తల్లి పేరు లక్కసాని. ఈతఁడు తన తల్లి దండ్రులకు పుణ్యమునకై పొన్నూరు లోని శ్రీ భావనారాయణ స్వామివారికి నిడుబ్రోలులోని కొంత పొలమును దానమిచ్చి యందు బృందావనము వేయించి శాసనమొకటి వ్రాయించి ప్రసిద్ధి

∓ N. I., O 35. * S. I. I. VI. No. 242.

కెక్కెను. ఈ వంశమువారు కమ్మవారిలో కోనపులి లేక కోనపల్లి వారుగా వ్యవహరించుచున్నారు.

## —♦ ఆలమందలవారు ♦—

### ఆలమందల సూకయదేవ చోడరాజు

ఆలమందలవారు తెలుఁగు చోడ శాఖీయులుగఁ గన్పడు చున్నారు. ఆలమందల సూకయదేవచోడరాజు శా. శ. 1320 వ సం॥ ర ప్రాంతములో కనుపర్తి ప్రాంతమున నొక పాలకుఁడుగా నున్నట్లూహించుట కవకాశము గలుగుచున్నది. ఈయనకు వీర అవుకు భూదేవచోడరాజను కుమారుఁ డుండెను. ఈయన చోడ శబ్దమును వాడుకొనుచు శాసనము లిఖించెను.

### —♦ ఆలమందల వీరఅవుకు భూదేవ చోడరాజు ♦—

ఆలమందల సూకయదేవచోడరాజు కుమారుఁడగు నీతఁడు శా.శ .1348 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయనకు "త్రిభువనాభిరు[ఁ]ద్రమల వెన్ను సంబెట" మున్నగు బిరుదులు గలవు. ఈయన శా. శ. 1348 వ సం॥ న కనుపర్తిలో భూదాన మిచ్చుచూ నొక శాసనము వ్రాయించి ఖ్యాతిఁ జెందెను. ఆ ప్రాంతము నతఁడు తన తండ్రి యనంతరము పాలించినట్లు కన్పడును. *

### —♦ ఆలమందల గంగయదేవ చోడరాజు ♦—

శా. శ. 1350 వ సం॥ న నితఁడు ఒంగోలు తాలూకా నాగులపాటి ప్రాంతమును పాలించుచు వచ్చెను. ఈయన తండ్రి పేరు అనపోతయదేవచోడరాజు. ఈయన తాత తిరుమలరాయఁడు. ముత్తవ పెద్దమ్మదేవి. ఈయన తల్లి చెన్నమదేవి. ఈయన తన తల్లి దండ్రులకును, తాత ముత్తవలకును పుణ్యమునకై నాగులపాటిలోని దేవ, బ్రాహ్మణ, జంగాలకుఁ గల వృత్తిపన్ను మినహాయించుచు శా.శ. 1350 వ సం॥లో నొక ధర్మశాసనమును వ్రాయించి ప్రసిద్ధి వహించెను. †

* No., O/ 56. † N. I., O/85.

ఈ ఆలమందలవారు చోడ శబ్దమును మాత్రమే ధరించిరి. కాని తమ పూర్వీకుల బిరుదులు ధరించలేదు. అప్పటి కా బిరుదులకు విలువ తగ్గి, కాకతీయ రాజ్య పతనానంతరము నూత్న బిరుదుల నప్పటి పాలకులు వీరి కొసంగి నట్లు కనుబడుచున్నది. ఈ బిరుదులు రెడ్డి ప్రభువులుగాని వెలమ ప్రభువులుగాని యొసంగి యుందురు.

ఈ ఆలమందల వా రింకను కమ్మవారిలో మండాది ప్రాంతమున నున్నా రని తెలియు చున్నది.

## —♦ వాలక కామయ్య వరపు అక్కలరాయుఁడు ♦—

ఈయన శా. శ. 1403 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయనకు తెలుఁగు చోడరాజులు ధరించిన "ఒరయూరి పుర వరాధీశ్వర" బిరుదము గలదు. అందుచే నితఁ డావంశీకుఁడే యన వచ్చును. ఈయన తిరుచునాపల్లి జిల్లా జంబుకేశ్వర ప్రాంతమున నాయంకరము సంపాదించి యచటనే పాలించు చున్నట్లు కన్పడు చున్నది. కావేరి కుత్తరమున నున్న తన నాయంకరము భూమిలోని యొక వేలి భూమిని జంబుకేశ్వరములోని స్వామివారి కితఁడు దానమిచ్చి శాసనము వ్రాయించి ప్రసిద్ధి వహించెను. * ఈయన యొక మహామండలేశ్వరుఁడు. అందుచే కొన్ని మండలములఁ బాలించిన వాఁడని చెప్పవచ్చును. ఈ వంశీకు లిప్పు డున్నదియు లేనియుఁ దెలియదు.

## —♦ చెన్నయ బాలయ దేవుఁడు ♦—

ఈయన గూడ తెలుఁగు చోడరాజులు ధరించిన "ఒరయూరిపురవరేశ్వరాది" బిరుదుల ధరించిన వాఁడు. ఈయన శాసన మొకటి శ్రీరంగమునం దున్నది. ఇతఁడు కృష్ణదేవరాయల కాలము నాఁటి వాఁడు. అందుచే క్రీ. శ. 1530 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఇతఁడు కృష్ణరాయలచే నిర్మింపఁబడిన రంగేశ్వరస్వామికిని, నిసుల వల్లి దేవరకును బంగారు నగలును, వెండి పాత్రలును చేయించి దాన మొసంగుటయే గాక, రంగనాయక స్వామి కొరకు పుష్ప వన

* No. 30 of 1891. (E. R.)

మును వేయించి యిచ్చి ప్రసిద్ధి వహించెను. ఈ దాన శాసనము ★ శా. శ. 1452 వ సం॥లో వ్రాయఁబడినది. ఈ వంశీకు లింకను నిలిచి యున్నదియు లేనిదియు గుర్తింపఁబడ లేదు.

—♦ గురురాజు - రుద్రదేవ చోళ మహారాజు ♦—

ఈయన శా. శ. 1476వ సం॥ర ప్రాంతీయుఁ డగు నొక మహామండలేశ్వరుఁడు. ఈయన 'మహారాజు' బిరుదము ధరించుట వలన స్వతంత్ర ప్రభువుగా నుండి యుండు నని చరిత్రజ్ఞు లభిప్రాయ పడిరి. ఇతఁడు కుంభకోణ ప్రాంతమునఁ బాలించుచు వచ్చినట్లు కనఁబడుచున్నది. ఈ మహారాజు కుంభకోణము లోని ఆది కుంభేశ్వరస్వామి పూజలకును, దేవాలయమున నిత్యము కొందఱు బ్రాహ్మణుల కన్న ప్రదానము జరుపుటకును శా. శ. 1476వ సం॥ (క్రీ. శ. 1554) ఆనందనామ సంవత్సర మందు వాయలూరు, ఏలాంగట్ట లైక్కిరామం అను రెండు గ్రామములను సమర్పించి శాసనములు వ్రాయించి ప్రసిద్ధి వహించెను*. ఈ వంశీకు లింక నెచటనైన నున్నారేమో తెలియుట లేదు.

—♦ రావెళ్లవారు ♦—

రావెళ్లవంశీకులు కమ్మవారిలో మిక్కిలి ప్రసిద్ధికి వచ్చిన శూరవంశమువారు. వీరి విషయము 13 వ శతాబ్దము నుండియు వినఁబడుచున్నది. క్రీ. శ. 1257 వ సం॥ నాఁటికి పాలించుచుండిన చాళుక్య చక్రవర్తి యగు మూఁడవ రాజ రాజుకాలమున నొక రావెళ్లనాయకుఁ డున్నట్లొక శాసనము వచించుచున్నది†. తరువాత వీరి వృత్తాంతము కాలగర్భమునఁబడిపోయి మనకు తెలియకున్నను, వీ రచ్చటచ్చట సేనాధిపతులుగ కాలము జరపుకొన్నట్లే తోచుచున్నది. వీరికిఁగల 'చలమర్తి గండ' బిరుదమును బట్టి వీరు దుర్జయాన్వయులలోని వారని ప్రథమ భాగమునఁజెప్పి యున్నాము.

★ 56 of 1892. * 291 of 1927 † N. I. S. 6.

## —♦ రావెళ్ల వీరమల్ల భూపతి ♦—

ఈయన 'విజయనగర రాజ్యపాలకుఁ డగు సాళువ నరసింహ రాయుల వద్ద మొదట నొక సేనాధిపతిగా నుండి ప్రసిద్ధికి వచ్చెను. ఈ మల్లనృపాలుఁడు గుడిపాటికోట వద్ద రాయలకును మహమ్మదీయ ప్రభువగు కుతుబుశాహకును జరిగిన యుద్ధములో తన యద్భుత పరాక్రమమును గన్పరచి రాయల వారిచే ననేక బిరుదులను సంపాదించుటయే గాక "రాజ హృదయభల్ల ప్రతాపప్రభావుండ"ని ప్రత్యేకము శ్లాఘింపఁబడుచు వచ్చెను. రావెళ్లవారి చారిత్రక వృత్తాంతమంతయుఁ జక్కఁగా వివరించిన సౌగంధిక ప్రసవాపహరణ మను గ్రంథమున రత్నాకరం గోపాలకవి యీ మల్లభూపతి నిట్లు వర్ణించి యున్నాఁడు.

"ఆ కమ్మ వంశ సుధాంభోధి యందు, రాకానిశాకరు-రమణఁజెన్నొంది
యనుప మాటోప సాహస విక్రమార్కుఁ,డనుచు రాయకుమారు లభినుతింపఁగను
విమతరా డ్భయదమై-విస్మయంబగుచు, గొమరొంద గుడిపాటి-కోట చెంగటను,
కుతలాధి పతులెల్ల-గొనియాడి మెచ్చ, కుతుబు శాహ బలంబు-ఘోరించి నరికి
బెల్లుగా రాయల-చే హెచ్చు బిరుదు, లెల్ల గైకొని మదా-హిత రాజహృదయ
భల్ల ప్రతాప ప్ర-భావుండనంగ, మల్లభూరమణుఁడు-మహికీర్తి వించ
వినుతులు గాంచు రా-వెళ వీరమల్ల, జననాథ చంద్ర వం-శంబున నలరి॥"

ఇందలి కుతుబుశాహా బహమనీ సుల్తాను సామంతుఁడుగఁ బనిచేసిన కూలీ కుతుబుల్‌ముల్కు అను నతఁడే యనియు, నితఁడు క్రీ. శ. 1495వ సం॥ము మొదలు 1512 వరకు నాతని సామంతుఁడుగా నుండి తర్వాత బహమనీ సుల్తానును ధిక్కరించి కుతుబు శాహ యను నామమున స్వతంత్రుఁడై గోల్కొండ నవాబని పేరొందినవాఁ డనియుఁ జరిత్రజ్ఞులు గుర్తించుచున్నారు*. అందుచే నీ మల్లభూపాలుఁడు క్రీ.శ. 1495వ సం॥ర ప్రాంతీయుఁ డనవచ్చును. ఆ కాలమున నరసింహరాయులకును బీజపూరు, బీడరు, గోల్కొండ నవాబులకును ఘోర యుద్ధములు జరుగుచు వచ్చెను. ఇవి క్రీ. శ. 1489, 1493వ సం॥లలోను తర్వాతను ఉండెను. అందులో నీ

* ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంపు. 15, సం. 6.

వీరాగ్రేసరుఁడు పాల్గొని సేనాధిపతిగా నుండి తన శౌర్యమును ప్రకటించెను. ఈయనకు కొండభూపతి యను సోదరుఁ డొకఁ డున్నట్లును, ఆతఁ డేకారణముననో దమ యాస్థాన భట్టున కొసఁగఁబడిన మాన్యమును గైకొనఁగా, రాయల సంస్థానమున సామంత నృపాలుర మీఁద భట్టురాజు లందఱు పద్యములు కైవారము చేయుచుండు కాలమున నా భట్టు మల్లభూపాలుని పై పద్యములు చదువకుండుటఁ గనిపెట్టి రాయ లడుగఁగా దాని కాతఁడు

"ఆ॥ తోడఁబుట్టినట్టి - తొయ్యలి మనువిచ్చి, వయసు రాగ దాని - వలఁచి నట్లు
ప్రథమమందు నిచ్చి-రావెల కొండయ, కమతమందుఁ జేను-కలుపుకొనియె॥"

అని చదివినట్లును, దానిపై రాయ లట్లు చేయవచ్చునా యని మల్లనృపాలుని మందలించుచుండఁగా, నా తమ్ముఁ డైన నట్లు చేయునా యని యితఁడు పల్కఁగా, నభిమాన శూరుఁ డగు నా కొండయ వెంటనే తన కరవాలమున నాత్మహత్య గావించుకొన్నట్లుగా నొకకథ ప్రచారమునందున్నది; గాని దీనిని నమ్ముటకిత రాధారము గన్పడక పోఁగా, నా పేరు గల తమ్ముఁడు మల్లభూపాలునకున్నట్లుగూడ సౌగంధిక ప్రసవాపహరణమున వర్ణింపఁబడి యుండలేదు. అందుచే నీ కథ విశ్వసింప వలను గాకున్నది. ఈ మల్ల భూపతి పెదారికట్ల రాజధానిగఁ జేసికొని పాలించి నట్లు చెప్పుదురు†. ఈ వంశీకులకు బసవశంకర బిరుదము గలదు. ఈయన తురుష్కులతో నొనర్చిన యొక యుద్ధమున జయము గైకొని వచ్చుచుండఁగా నొక భట్టు రాయలతో నిట్లు విన్నవించెనఁట.

ఉ॥ అల్లవె కమ్మ మూకలఁట - నావల రావెళ వంశ చంద్రుఁడౌ
మల్లయ భూప దుర్భర స-మగ్ర బలంబుల మండలాగ్రముల్
ఝుల్లపు టీబెలుఁగ బసవ-శంకరు బిర్కుము భూరి వీర భూ
వల్లభ మల్లికార్జునుఁడు-వాఁడె సుమీ జగదేక వీరుఁడున్.

---

†రావెళ్లవారు పచ్చగుళ్లపాడు రాజధానిగఁ జేసికొని అలంగీరు పాదుషాకాలములో పాలించుచుండి రని కొచ్చెర్లకోట స్థలపురాణములో చెప్పఁబడినది. See. N. I.

ఈయన శౌర్యమును కన్నులార గాంచిన వారితని వీర మల్ల భూపతి యని పిలుచుచుండఁగా తుద కదియే నాతని పేరయ్యెను. ఈ పేరుననే యనేక చాటువులు దొరకుచున్నవి. ఈ క్రింది యెత్తు గీత చరణములు కొన్ని పద్యములలోఁ గలవు.

"సమరరఘురామ రావెళ్ల ♦ సార్వభౌమ! వైరిహృద్భల్ల యుద్దండ ♦ వీరమల్ల" గ్రంథ విస్తరభీతి నాచాటువుల నిచట నుదాహరించుట లేదు. చాటుపద్య మణిమంజరి చూడుఁడు.

రావెళ్లవారు విజయనగర రాజ్యములోని పాళెగార్లలో నొకరు. వీరు రాజధానికి సపరివారులై వెడలి నపు డచట మకాము చేయుటకై 1260 కుంటల వైశాల్య ప్రదేశ ముండెనని 'విజయనగర దసామ్రాజ్యవు' అను ప్రాచీన కడిత పుస్తకమువల్ల విదితమగుచున్నది*. ఈమల్ల భూపాలుఁడు నరసింహరాయల తర్వాత వీర నరసింహరాయల యొక్కయు, కృష్ణదేవరాయల యొక్కయు కాలములో నున్నట్లే కనఁబడుచున్నాఁడు. పోర్చుగీసు వ్రాతకాఁడగు న్యూనిజు ననుసరించి సీవెలను గ్రంథకర్త వ్రాసిన "Forgotten Empire" అను ఆంగ్ల గ్రంథములో కృష్ణదేవ రాయల సామంతులలో నొక మల్లప నాయకునిఁ బేర్కొనుచు నాతని క్రింద నున్న రాజ్యాదాయము 13000 వరహాలనియు, నాతని క్రింద 6000 కాల్బలమును, 400 గుఱ్ఱములును ఉండెడి వనియు రాయలవారి కతఁడు ⅓ రాజ్యాదాయమును కప్పము క్రింద చెల్లించుచుండె ననియు వ్రాసియున్నాఁడు.★ ఆ మల్లపనాయకుడు మన వీరమల్లభూపతియే గాని యన్యుఁడు గాఁడని చెప్పవచ్చును. ఈ మల్లికార్జునునకు తిప్ప నృపాలుఁ డను కొమారుఁడు జన్మించెను. మల్లికార్జునుఁడు కృష్ణదేవరాయలుకు 3 సం॥ లకు ముందే ననగా క్రీ. శ. 1527 వ సం॥లో

* భారతి శుక్లసంపుటము, పుట 623.

★ J. A. H. R. S. Vol. IV, చూడుఁడు.

చనిపోయెనఁట†. ఈ మల్లికార్జునునివంటి మహావీర పురుషులు సైన్యాధిపతులుగా నుండుటవల్లనే హిందూరాజ్యము మహమ్మదీయ దండయాత్రలకు లెక్క చేయక స్థిరముగా నుండి, కృష్ణదేవ రాయలరాజ్యమునకు భద్రత యుండెను.

## —♦ రావెళ్ళ తిప్పభూపాలుఁడు ♦—

ఈతఁడుగూడ వీరనరసింహరాయల కాలములోను కృష్ణదేవరాయల కాలములోను సేనాధిపతిగాఁ బేరందెను. వీరనరసింహరాయలకును, గజపతులకును జరిగిన యుద్ధములలో నీతఁడు చూపిన పరాక్రమమునకు మెచ్చుకొని రాయ లీయన కనేక బిరుదులను ధ్వజములను, పట్టుగొడుగులు, అందలములు, పాలకులు, హారములు పంచమహాశబ్దగౌరవము, వన్నెవన్నెల గుడారములు, గుఱ్ఱములు, యేనుఁగులు మున్నగు రాజలాంఛనములన్నిఁటిని పారితోషికముగా నొసంగెనఁట. ఈ విషయము సౌగంధిక ప్రసవాపహరణ మిట్లు చెప్పుచున్నది.

"ధీరతరావెళ్ళ - తిప్పభూవిభుఁడు, హేరాళముగ ధాత్రి-నేలుచు నుండి।
భుజ బలోద్దండుఁడై-పొదలుచు వచ్చి - గజపతి దళముల - గదిసి చెండాడి-
వికలంబుగా జేసి-వెన్గొట్టి తరిమి, అకలంక బిరుదుధ్వ-జావళుల్పట్టు
గొడుగు లందలములు-గొనబు పల్లకులు, బెడిదంపు పేరులు-పెద్దబూరగలు
వన్నెవన్నె గుడార్లు - వాజులు కరులు, చెన్నొంద గైకొని - సిరులచే వెలసి
తనకీర్తి సకల ది - క్తటములనించి, జనపాలురెన్న రా - జ్యము చేయుచుండె॥

పురుషోత్తమ గజపతి వీరనరసింహరాయల కాలములోను ప్రతాపరుద్ర గజపతి కృష్ణదేవరాయల కాలములోను ప్రత్యర్థులుగా నున్నందున నీతిప్ప నృపాలుఁ [illegible]డించిన సైన్యమిం

---

† వాసిరెడ్డి మల్లికార్జున ప్రభువునకును హైదరుజంగునకును జరిగిన యుద్ధమున నొక రావెళ్ల వీరమలానాయఁడు చనిపోయినట్లు వాసిరెడ్డి వంశచరిత్ర తెలుపుచున్నది. ఆతఁ డీయనయే యగునేమో!

దెవ్వరిదో తెలియుటకు వీలు లేకున్నది. కాని కృష్ణరాయలు కళింగ దండయాత్ర వెడలి నప్పుడు గజపతి దళములతో సమర రంగమునఁ బోరాడిన వారిలో నీ రావెలవారు గూడ నున్నట్లు కుమార ధూర్జటి రచించిన కృష్ణరాయ విజయమునం దీ క్రింది పద్యమునఁ గలదు.

ఉ॥ తీవిగ నౌకు వారును గ - డింది రహిణ వెలుగోటి వార లా
రావెలవారు గూడుకొని - రాత్రి పగల్ చతురంగ సేనతో
నేవఁగ జూచినం దెలియ - నెంతయు శక్యము గాని దుర్గమా
భూవర మౌళి గాంచి యొక - పూటనె దీసెద నంచు నుగ్రుఁడై॥

తిప్ప భూపతికి పెద్దమాంబ యను సతీమణి యందు అయ్యప రాజు, వెంకటాద్రి యను నిర్వురు వీరాగ్రేసరు లుదయించిరి. ఇందలి వెంకటాద్రి విషయము మనకు చరిత్ర ప్రసిద్ధిగా లేదు.

## — రావెళ్ళ అయ్యపరాజు —

ఈ రావెళ్ళ అయ్యపరాజు మిక్కిలి శూరాగ్రేసరుఁ డని చెప్ప వచ్చును. ఈయనకు పాపరా జను పేరు గూడ కలదు. ఈయనకు లక్ష్మమాంబ యను భార్యయును, తిప్పభూపాలుఁ డను కుమారుఁడు నుండిరి. ఈయన గూడ సాళువ వీరనరసింహరాయుల కాలము లోను, కృష్ణదేవరాయల కాలములోను సేనాధిపతిగా నున్నట్లు కన్పడు చున్నది. ఈతఁడు కందనవోలు (కర్నూలు) వద్ద జరిగిన యుద్ధములోఁ బాల్గొని కోటను పట్టుకొనెనఁట. ఈ కందనవోలు కోటను బట్టుకొను నపుడు అళియ రామరాయల తాత యగు రామ రాజు గూడ నరసింహరాయల సామంతుఁడుగా నుండి యా యుద్ధమునఁ దన పరాక్రమమును జూపి యుండెను. ఈ విషయము పద్య బాలభాగవతము, ద్విపద బాలభాగవతము, రామ రాజీయము,

వసుచరిత్రము లందు వర్ణింపఁబడి యున్నది*. అందుచే నీ కర్నూలు యుద్ధము చారిత్రాత్మక ప్రసిద్ధిఁ గలది. దీనిలో అయ్యపరాజు చూపిన పరాక్రమమును గుఱించి సౌగంధిక ప్రసవాప హారణమున నిట్లున్నది:

అరయ నా యిరుపురి-యం దగ్రజుండు । పరమపావనుఁ డయ్య-పక్ష్మతలేంద్రు
సతి శీలవతి లక్ష్మ-మాంబిక యందు । సుతుని శ్రీ తిప్ప వ-సుంధ రాధిపుని
గని పెంచి సకల భూ-కాంతులు గొలువ । వసువద తనయుని-పట్టంబు గట్టి
అతి ముదంబున దాల్చి-యలరు బటించి । హాగలు నగ్గోలు రా-జ వజీరుఁ డనుచు
ముగురు దునేదార్లు-మొగి సన్నుతింప । దాపురే మా యయ్య-భళిభళి యనుచు
గోపాలరాజు పే-ర్కొని చూచి మెచ్చి । యటకు జొక్కను లేక-ఆహవ భూమి।
తెలుఁగు బిజ్జలుమాడ్కి-తెగువతో జొచ్చి । మొనసి కందనవోలు-ముందరియెల్ల।
మునుమున్నె విడిపించి-మోహరింపైన । బలు దునేదారుల-ఖండించి వైచి
పొలుపొంద గండేభ-ముల నుగ్గుజేసి । పొదలు గరీజుల-పొంగ ణగించి
యెదురు పఠాణీల-నెల్ల మట్టాడి । చెలరేగి యరిసి వ-జీరుల జిదిమి
కల దక్కనీల చీ-కాకు గావించి । డేరీజు తాళ్ళన్ని-తెగ నరికించి
కోరి బండారముల్-కొల్లలాడించి । తన పేరు వారి కం-దన వోలి కోట
యనురాగమునఁ జొచ్చి-యా రాజు చేత । మెచ్చులు గైకొని-మేదినీపతుల
నిచ్చ మెచ్చులు చూచి-నృపులలో నితఁడె । గెలుపుల రాజని-కీర్తించి పొగడ
విలసిల్లి పిఱికేళి-విహరించె నెలమి"

ఈ కర్నూలు యుద్ధమున 70 వేల ఆశ్వీక సైన్యములతో మహమ్మదీయ సైన్య మెదిరించినను, దానిని పారద్రోలి రని బాల భాగవతములోని యీ క్రింది పద్యము నుడువుచున్నది.

"గబ్బుల్ డెబ్బదివేవు రాశ్వికులు వే • ఢ్కన్ గొల్వఁగాఁ గన్కపె
న్మబ్బుల్ గప్పఁగ గండనోలు కొను వే • ఢ్కం జుట్టు ముట్టన్ సవా

---

* "రామ నృపాలుండు రాజేంద్రుఁ డౌదలె.... ..........
నెందు నెన్నఁగ జాలు - నిర్ధశౌర్యమున। గందనవోలి దు-ర్గంబులో నుండి
పీరులు డెబ్బది - వేవు రాశ్వికులు। చేరి కొల్వంగ వ - చ్చిన సవానెదిరి
కలనంది పంచబం - గాళంబు సేసి। గెలిచె దచ్చరితంబు - గీర్తింపఁ దరమె
ద్విపద బాలభాగవతము.

"అనఘుతర కందనోలి మ - హాపురీ ని,శాంతుఁడగు రామ మేదినీ - కాంతుఁ
డలరు" వసుచరిత్ర.

బిబ్బి సుబ్బణఁగించి తోలె నరిరా • డ్భీముండు లంకాసర
జ్యబ్బంద్రాభుఁడు బుక్క భూవిభుని రా • మాధీశుఁ డాహోయనన్॥"

ఈయన తర్వాత నితని కుమారుఁ డగు తిప్పభూపతి II రాయల సామంతపాలకులలో నొకఁడుగాఁ బ్రసిద్ధికి వచ్చెను.

## —• రావెళ్ళ తిప్ప భూపాలుఁడు II •—

ఈ తిప్ప నృపాలుని కాలములోఁ గూడ యాదవాని దుర్గమును తిరిగి పట్టుకొనుటకై తురుష్కులు ప్రయత్నించినట్లు కన్పడును. రాయల పక్షమున నితఁ డప్పుడు సాహసించి తన పరాక్రమమును జూపి, వారి నోడించి జయలక్ష్మిని గూరగొనెను. ఈ విషయము సౌగంధిక ప్రసవాపహరణములో నిట్లు వర్ణింపఁబడియున్నది:

"అతని తనూభవుం-డగు తిప్పనృపతి । కుతలాధిపతులు మి-క్కుటముగా నెంచి
ధరణి పేరైన యా-దవని దుర్గంబు । సురత్రాణ లగ్గగా-చూరలాడించి
తగువజీరుల దునె-దారుల ఁజంపి । పొగరు తురుష్కుల-పోనీక ద్రుంచి
కలపా లెగాంద్ర పీ-నాకుగాఁ బరియు । చెలరేగి జయలక్ష్మి-చేకొని వచ్చి
చల్లఁగా నల హరి-శ్చంద్రునిలీల । నెల్ల మహీస్థలి-నేలుచు నుండి."

ఈయనకు వెంగమాంబ యను సతీమణి వలన లింగనృపాలుఁడు జన్మించెను. ఈతఁడు పాల్గొనిన ఆదవాని దుర్గ యుద్ధములో అళియరామరాయల (కృష్ణదేవరాయల అల్లుఁడు) తండ్రి యగు తిమ్మరాజు గూడ పాల్గొని సాధించినట్లు బాలభాగవతములో వ్రాయఁబడి యుండుటవల్ల, నాతని కీ తిప్ప భూపాలుఁడు సహాయుఁడై యుండు నని చరిత్రకారులలో నొకరగు కె. యీశ్వరదత్తుగా రభిప్రాయ పడుచున్నారు. ★ అళియ రామరాయలు పాల్గొనినట్లుగూడ వసుచరిత్రమున గలదు. * అందుచే నీయుద్ధము ప్రసిద్ధిగలది.

ఈ రామరాయలకు "ఆదవేని దుర్గాపహారుఁడ"ను బిరుదున్నట్లును, దాని నాతఁడు గెల్చినట్లును రామరాజీయములో గూడ

★ ఆంధ్ర సాహిత్య పరిత్పత్రిక. సంపు-25-6 సం॥

* "సీ॥ పట్టాభిషేక విపర్యయంబున బ్రోలు, వెడలి పర్రియానుజుల్
వెంటనడుపఁ । జిత్రకూటాఖ్యఁ జెలఁగు పెన్గొండ సాంద్ర హరిద్విపేంద్ర
నాదవని జెంది॥" వసుచరిత్రము.

వ్రాయఁబడియున్నది. ఇట్టి మహాయోధులకు రణరంగమైన ఆదవాని (ఆదోని)లో తన పరాక్రమమును గన్పరచి యితఁడు ప్రభువుల మన్ననల నందెననుట స్పష్ట పడుచున్నది.

—♦ రావెళ్ళ లింగ భూపాలుఁడు ♦—

రెండవ తిప్పనృపాలుని పుత్రుఁడగు నీతఁడు చాల ధర్మాత్ముఁడని పేరుఁ జెందెను. ఈయన భార్యపేరు సిద్దాంబ. ఈమె నర్రావుల పర్వతా లను ప్రసిద్ధ కమ్మవంశజుని కుమార్తె. ఈ లింగ నృపాలునికి కొండభూపతి, అయ్యపరా జను కుమాళ్ళు జనించి ప్రసిద్ధికి వచ్చిరి. ఈయన క్రీ.శ. 1510 వ సం॥ ప్రాంతీయుఁడుగాఁ గన్పడుచున్నాఁడు. ఈయన శౌర్య విశేషములు తెలియుట లేదు.

—♦ రావెళ్ళ కొండ భూపాలుఁడు ♦—

రావెళ్లలింగనృపాలుని పుత్రులలో నొకఁడగు నీయన మిక్కిలి పరాక్రమశాలిగాఁ గన్పడు చున్నాఁడు. ఈయన కనేక బిరుదములను రాయ లొసంగెను. అవి యన్నియు నాతని యుద్ధయాత్రలకు మెచ్చుకొని యొసఁగఁబడినవిగనే గన్పట్టును. సౌగంధిక ప్రసవాప హారణమున నితని బిరుదము లన్నియు నీ క్రింది రీతిని వ్రాయఁబడినవి.

"ఆ కుమారుల లోన - నహిత రాజన్య, భీకర శౌర్యుండు - భీమ బలుండు
బలభేది విభవుంపు - పట్టి బెనుగంటి, బల శిలాటంక కుం - భత్పాండ్య రాజ్య
పుర హల్లకల్లోల - భువన భేతాళ, పరసైన్య భైరవ - భళ్యాణ రాయ
గండోగ్ర జగనొబ్బ - గండ ప్రచండ, గండర గండ వి - ఖ్యాత కేళాది
రాయ చౌరాశి దు - ర్గ విభాళ చటుల, గాయ గోవాళ ర - క్తచ్ఛత్ర బసవ
శంకర నిశ్శంక - శౌర్య హం వీర, కంకణ హస్త సం-గడి రక్షపాల
శత్రు మహానాధ - సముదయాకార, చిత్రితాంగద భీమ - సింహ తలాట
నర శౌర్య ముఖ్య నా-నాభవ్య బిరుద, భరితుండు కొండ భూ-పాల శేఖరుఁడు."

దీనినిబట్టి పాండ్యదేశమునకు రాయలతో యుద్ధయాత్ర నొనర్చి యచట ప్రశంసింపఁ దగినట్లుగా నితఁడు చూపిన పరాక్రమమునకు మెచ్చుకొని రాయలు భేతాళ బిరుద మిచ్చినట్లు కన్పడును. ఏదులశాహి యను మహమ్మదీయ పాలకుఁడు (బీజపూరు

సుల్తాను) మానవపురి కడకు వచ్చి ముట్టడించి నప్పు డీ కొండభూపతి చాల పరాక్రమమును జూపినట్లు సౌగంధిక ప్రసవాప హరణములోని యీ క్రిందిభాగము తెలుపుచున్నది.

" పొదలుచు మానవ - పురి చెంతఁజేరి, వదరు నేదులశాహి - బలముల మీద
తేజీని చేసల్ల - ధేయని నూకి, యాజి రంగము జొచ్చి - యహిత సైన్యములఁ
గకవికల్ గావించి - గద్దించి నరకి, ప్రకటించి తనపేరు - వాసి వోసీక
ఉదుటు రేపంతుల - నొరయు వజీర్ల, పొదలు దునేదార్ల - పుడమిపైఁ గూల్చి
హత్తి వెంబడి వచ్చు - నవసీకు లెల్ల, తత్తరంబున పెన్క - దండముల్ వెట్ట
విరుమొ నల్ నలుకిన నేదిక్కు గన్న, ధర దొల్లి యాదెదు-తలలు పైనెగసి
పడెడి కండలుబెట్టు వారు రక్తములు, పొడియైన యెముకలు-పొలియు రాహుతులు
గలిగి యొప్పెడు మహా కదన రంగమున, నలుకు బెళ్కునులేక-అని జేయువేళ
వేయారు వెడగాడి-వీపున వెడలు, గాయముల్ మణి పద-కంబులు గాగ।
వెక్కసంబున మొన-విరిగిన యలుగు, లక్కసంబున తార-హారముల్గాగ।
పెనగొని మెడవ్రేలు-పేర్విపుల సొబగు। తనర నుత్తర జన్ని దంబులు గాగ "

అళియరామరాయలతండ్రి గూడ నీ యుద్ధములో నున్నట్లు బాలభాగవతమునఁ గలదు.[†] ఇట్టి వీరాగ్రేసరుఁడు రణభూమికి వెడలు నప్పుడు పెండ్లికొడుకువలెనే యీ క్రింది వైభవముతోఁ బోవుచు వచ్చెనఁట.

" బలువిడి చతురంగ - బలముల తోడ, వలనొప్పు బహు వైభవంబుల తోడ।
కర వర దీప్తుల - కరవాలు బూని, సరిలేని చికిలి ప-చ్చల బాకు బట్టి
కరకు కెంపుల భాషి-కంబు ధరించి. తరలక కరవీర-దామముల్ దాల్చి
సిరిగల్గు రత్నాల - సింహలలాట, బిరుదాంకములు జాల-పెంపొంద జవన
తురగంబుపై నెక్కి - తోరంపు వేడ్క, సరసులు వీరసే-సలు జల్లుచుండ
గొప్ప యెట్టని పట్టు-గొడుగుల నీడ, నొప్పు చుందురు కావి-యుల్లెడక్రింద
చెలువొందు జయలక్ష్మి-చేకొనువరకు,కులుకుచు జనుపెండ్లి-కొడుకు చందమున"

---

† "4 రాజచంద్రుఁడు రామరాజు తిమ్మయ్య..................
కడిమిమై మానువ-కదరణక్షోణి, గడుసరి నేదుల-ఖాను జయించె
విక్రమంబున నాద-వేని దుర్గంబు, విక్రాంతు లెన్నవే - వేగ సాధించి
....................మానువకడ సవాబూని పోరనుబరా
జయము నొందించెనే-శౌర్యశాలి."                పద్యబాలభాగవతము.

రాయలు బీజపూరుపై ముట్టడిని 1512-20 సం॥ లలో నొనర్చి యుండుటవల్ల నీ మధ్యకాలముననే కొండభూపతి పాల్గొనిన మానవ పురి యుద్ధము జరిగియుండును.

—♦ రావెళ్ళ అయ్యపనాయకుఁడు II ♦—

ఈయన కొండనృపాలుని సోదరుఁడు. ఇతనికి "సాహస విక్రమార్కుఁడు, వరవీరకోలాహలుఁడు, చెంచుమలచూరకారుఁడు" మున్నగు బిరుదములు గలవు. వీనిని బట్టియే యీ వీరాగ్రేసరుని శౌర్యమును గ్రహింపవచ్చును. ఈయన భార్యపేరు వెంగమాంబ. ఈమె యం దీతనికి కొండ భూపాలుఁడు జన్మించెను.

ఈ అయ్యపనాయఁడు అళియ రామరాయల కాలములోని వాఁడై యుండి యాయనక్రింద నొకపాలకుఁడుగా నున్నట్లు, క్రింది ద్విపదవల్ల దెలియుచున్నది.

"బలియుఁడౌ కొండభూ-పాల సోదరుఁడు, విలసితసాహస-విక్రమార్కుండు
గురుతర వర వీర-కోలాహలుండు । వరభవ్య గాంగేయ-వర్ణ కేతనము
నరసుతుఁ డయ్యప - నాయకేంద్రుండు । రాజిల్ల వెలయు-కర్ణాటశ్రీరామ
రాజదత్త కిరీట - రమ్య భూషణుఁడు । మనసి జాకృతి చెంచు-మల చూరకాఁడు.

దీనిని బట్టి అయ్యపనాయఁడు క్రీ శ. 1542-65 సం॥ ల మధ్యకాలపు వీరపురుషుఁడని గ్రహింపవచ్చును.

—♦ రావెళ్ల లింగ నృపాలుఁడు II ♦—

ఈయన రావెళ్లకొండ భూపాలుని పుత్రుఁడు. తండ్రి తాతల వలెనే యితఁడు మిక్కిలి కీర్తి నొందిన వాఁడు. ఇతఁడు కవీశ్వరుల నాదరించెను. ఈయన సాయపనాయని అనంతనృపాలునికి శ్రీరంగమాంబ యందు జనించిన భాస్కరాంబ యను సతీమణిని వివాహమయ్యెను. ఈతఁడు తిరుమణికోట రాజధానిగఁ బాలించుచు వచ్చెను. అప్పుడబ్దుల్ పాదుషాహ తన సైన్యముతో కోటను బట్టుకొనరాఁగా, నాతని ససైన్యముగ జయించి, దళవాయి యగు వెంకటరాయల వారి మెప్పొంది, పెనుగొండకు ఖైదీలను తీసికొని

వెల్లు త్రోవలో దయదలఁచి వారలను విడిచి రక్షించిన ట్లీతఁడు కృతి నొందిన సౌగంధిక ప్రసవాపహరణ గ్రంథమున నే తద్గ్రంథ కర్త యగు రత్నాకరం గోపాలకవి యిట్లు వర్ణించు చున్నాఁడు.

" తిరుమణి కోటలో - స్థిరముగ నిలచి । పరవీర దుర్గముల్ - పట్టణంబులును
నదలించి బెదరింప . నావార్త దెలసి । పౌదలు సుల్తాని మ-బ్బులు పాదుషాహ
చతురంగ బలములు-సంరంభులగుచు । ధృతిమీరగా నలు - దిక్కులఁ గ్రమ్మి
యుదయాస్త మయముల-నురిమినలంగ । ఎదిరించి నరికి మ-హోగ్ర శౌర్యమున
డాబాలఁ పైబడి - డాగులు చేసి । జీబులు బలసిన - సేనల దునిమి
మన్నీలదొరల సా - మంతుల దునిమి । వన్నెకునెక్కు రే - వంతుల దునిమి
యాలంబులో జొచ్చి - యఖిల శాత్రవుల । దోలి పెన్గొండకు-దోవలు చూపి
కురువీర బలముల - గూల్చిన యట్టి । నరుఁ డీ విభుండని-నరనాథు లెంచ
గదిసిన శత్రువుల్ - గళవళ మంద । జెదరి పోవఁగలేక - జేతులు మొగిచి
కావుము బసవశం - కర బిరుదాంక - ప్రోవుము బెళగంటి - పురిశిలాటంక
శరణు గండర గండ - శత్రువిభాళ । కరుణించి రక్షించు - గాయ గోవాళ
కీర్తించెదము మిమ్ము - కేళాదిరాయ । యర్థుల మన్నింపు - మర్థి వేడెదము
అని వేడుకొనిన - దయా దృష్టిజూచి ; తనర వేడ్కల ధర్మ - ధార వట్టించి
సమరంబు చాలించి - చయ్యన మరలి.... ...... .....॥ "

ఈయన బిరుదావళి యంతయు పై పద్యములందు స్పష్టముగ నున్నది. ఇందు గొన్ని బిరుదులు పారంపర్యముగను, మరికొన్ని నూతనముగను వచ్చినట్లు కన్పడు చున్నవి. ఈయనకు రామభద్ర నృపాలుఁ డను కుమారుఁడు జనించెను.

ఈయన యొనర్చిన యుద్ధ కార్యములకు మెచ్చుకొని నరపతి యనేక రత్నభూషణములను, కరితురంగాదులను బహూకరించె ననియు, సింధురాజు త్తమ గుఱ్ఱములఁ బూన్చిన శకట మిచ్చెననియు, సౌరాష్ట్రి నృపాలుఁ డొక రత్నహారము నిచ్చెననియు సౌగంధిక ప్రసవాప హరణములోని యీ క్రింది ద్విపద భాగమువల్లఁ దెలియఁ గలదు.

" నరపతి దత్తనా - నారత్నభూష, కరి తురంగ శతాంగ - ఘనభాగ్య పేర
సింధు రాజార్పిత - సింధురచిత్ర, సైంధవ బంధుర - స్యందను పేర
సౌరాష్ట్రి నృపదత్త - సలలితరత్న. హారునిపేర దీ - నావను పేర॥ "

ఈయనకు గల బిరుదులలో అశ్వరేవంత, రణధీరఘంటా నిరాతంకమల్ల, ప్రణుత సింహలలాట, పరబలభీమ, చలమర్తివర గండ, ఆదవనిదుర్గగర్వవిభాళ, హత్తుమువ్వర గండ, హార్యతు శౌర్య, గగ్గోలురాయ' మున్నగునవి గూడ కాన వచ్చుచున్నది. (వీని వివరములకు మొదటి భాగము 71 పుట, చూడుఁడు)

ఈతఁడు జయించిన అబ్దుల్ పాదుషాహసైన్యము గోల్కొండ రాజ్యమును క్రీ. శ. 1611-72 సం॥ల మధ్య పాలించిన అబ్దుల్లా కుతుబ్షా యను వానిదే గాని వేరు గాదు. వెంకటపతిరాయల వారి కాలములోనే యీ యుద్ధము జరిగి యుండుట వల్ల నిది క్రీ. శ. 1611-14 సం॥ల మధ్య జరిగి యుండె ననవచ్చును. అందుచేత నీతఁడు దాదాపు క్రీ. శ. 1586-1614 వ సం॥ల మధ్యప్రాంతమున వీరవిహారము సలిపిన యోధాగ్రేసరుఁ డనియుఁ దలఁప వచ్చును. ఈ వీరాగ్రేసరుఁడు కవితాపోషకుఁడై సౌగంధిక ప్రసవాప హరణ మను గ్రంథమును రచింపఁ జేయనిచో నీ రావెళ్ళవారి చరిత్రము మన కగమ్య గోచరమై యుండును. ఈయన యాస్థానమున రత్నాకరం గోపాలకృష్ణకవి యనునతఁ డాస్థాన కవీశ్వరుఁడుగా నుండెను. అతఁడే యీ గ్రంథమును రచించి యీ నృపాలునకు కృతి నొసంగెను.

## —♦ రావెళ్ళ కొండ భూపాలుఁడు II ♦—

ఈయన రావెళ్ళ రెండవ అయ్యపనాయకుని కుమారుఁడు. ఇతఁడు చాల దయాశాలి యని కీర్తి వహించెను. యుద్ధములలో తారసిల్లి పారిపోవు శత్రురాజులను కూడ నీతఁడు తగిన మర్యాద మన్నలఁ జేయుచు కీర్తి వహించెనఁట. ఈయనకు రామభద్ర నృపాలుఁడు, తిమ్మ భూపతి యను నిర్వురు కుమాళ్లు జనించిరి.

## —♦ రావెళ్ళరామభద్ర నృపతి ♦—

రెండవకొండనృపాలుని పుత్రుఁడగు నీతఁడు చాలధర్మాత్ముఁ డనియుఁ దన తల్లి దండ్రుల యొక్కయు తాతల యొక్కయు కీర్తి

నినుమడింపఁ జేసినట్లుగా వర్ణింపఁబడి యున్నాఁడు; గాని యీతని చారిత్రక విశేషములు దెలియుటలేదు.

## —♦ రావెళ్ళ తిమ్మభూపాలుఁడు ♦—

ఈయన రామభద్ర నృపతికి సోదరుఁడు. ఈయనకు చౌషష్ఠి విద్యల యందును ప్రవీణత గలదనియు, మిక్కిలి వీరాగ్రేసరుఁ డనియు సౌగంధిక ప్రసవాప హారణములోని యీక్రింది ద్విపదవల్ల తెలియుచున్నది.

"ఆరామభద్ర నా - యక సహోదరుఁడు, సార బలోద్దండ - సాహసాంకుండు
హారచౌషష్టి వి - ద్యా ప్రవీణుండు, ఘోర మదారి సం - కుల భేదనుండు
ధీరుండు తిమ్మ ధా - త్రీ కళత్రుండు, దారుణి వెలసె స - త్కవులు నుతింప॥"

ఈయన పెనుగొండ రాజధానిగా నేలిన శ్రీరంగరాయల సామంతుఁడై యుండును.

## —♦ రావెల కోనేటి చినతిమ్మానాయఁడు ♦—

ఈయన ఉదయగిరిసీమ పాలకుఁడుగా శా. శ. 1504వ (క్రీ. శ. 1582వ) సం॥ర ప్రాంతములో నుండెను. ఈయన తండ్రి పేరు తిరుమలయ్య. తాత రావెలకోంటి నాయకుఁడు. ఈతఁడు కోవూరు తాలూకా విడవలూరు గ్రామములో పోలేరమ్మమిట్టపై వ్రాయించిన శాసనమును బట్టి చూడఁగా, నితఁడు నూఱు కుంటల భూమిని దాన మొనర్చినట్లు కనుపడును*. ఈయన తండ్రి తాతలు కూడ ఉదయగిరిసీమను పాలించుచు వచ్చినట్లు తోఁచు చున్నది. ఇతఁడుగూడ మొదటి శ్రీరంగరాయల సామంతుఁడై యుండును.

## —♦ రావెల తిరుమలనాయనింగారు ♦—

ఈయన క్రీ. శ. 1575వ సం॥ర ప్రాంతములో పొదిలిసీమలో నొక పాలకుఁడుగా నుండెను. ఈయన తండ్రిపేరు తిప్పానాయనిం గారు. ఈ తిప్పానాయనింగారు మఱియొక తిప్పానాయని కుమారుఁడు. ఈయన వ్రాయించిన శాసన మొకటి నెల్లూరిజిల్లా ఈగల

పాడు గ్రామములో నున్నది. ఈయన గూడ శ్రీరంగరాయల సామంతుడుగా నన్నడుచున్నాడు. ఈయన తండ్రి తాతలుగూడ పొదిలిసీమను పాలించుచు వచ్చిరి. ఈయనకు పొదిల, తుమ్మలూరు గ్రామములలో నాయంకర మున్నట్లతడు వ్రాయించిన శాసనములో వ్రాయబడినది. అందుచే నితడు నా కాలమున నొక సేనాధిపతి యని తలంప వచ్చును. ఈయన సేనాధిపతిగా నుండుటయే గాక, నచ్చటి శ్రీ సంగమేశ్వర స్వామికి తనకు చెల్లుబడి యగుచుండిన నాయంకరములోని పుట్టెడు భూమిని దానమిచ్చి ఖ్యాతిగాంచెను *.

## —♦ రావెళ్ల ముద్దు నాయకేంద్రుడు ♦—

ఈయన రావెళ్ళ లింగ భూపాలుని సోదరుడు. ఇతడు కోటపాటి మాకావసింద్రుని కొమార్తె యగు తిరుమలాంబను వివాహమాడెను. ఈతడును, యితని మామగారగు మాకరాజును తంజావూరు పాలకుడగు రఘునాధ నాయకునకును, గొబ్బూరి జగ్గరాజునకును తోపూరువద్ద క్రీ. శ. 1616 వ సం॥లో జరిగిన యుద్ధములో జగ్గరాజు పక్షమున నిలిచి యుద్ధమొనర్చి చివరకు యుద్ధమున నోడి పారిపోయినట్లు కనుబడుచున్నది. రఘునాధాభ్యుదయ నాటకములో "పారె మాకల వెంట బడి మాకరాజు" అని వ్రాయబడినది. ఇట్లే యీముద్దునాయకుడను మాదన్న గూడ పారిపోయనని వ్రాయబడినది. ఈవిషయము తంజావూరు ఆంధ్రనాయక చరిత్రలో నున్నది. ఈయనకు వెంగభూపాలుడను కుమారుడు జన్మించెను.

## —♦ రావెళ్ళ వెంగభూపాలుడు ♦—

ముద్దు నాయకేంద్రుని పుత్రుడగు నీ వెంగ భూపాలుడు వెంకటపతి నాయుడని గూడ ప్రసిద్ధి నందెను. ఈయన చౌషష్టి విద్యల యందు ప్రవీణుడు. ఈయన పెనుగొండ రాజధానిగా నేలిన

* N I. P/19

రెండవ వెంకటపతి రాయల సామంతులలో నొకఁడుగాఁ గన్పడు చున్నాఁడు. ఈయన దేవతాభక్తి తత్పరుఁడు. ఈయనవద్ద రావుల వెంగళప్ప యను నతఁ డొక సామంతుఁడుగా నుండెను. వీరన్న కనుపూ రను గ్రామము నితఁడు రావుల వెంగళప్పకు అమరం క్రింద నియ్యఁగా, నతఁ డా గ్రామ సుంకముల నచటి శ్రీ విశ్వేశ్వరస్వామికి దానమిచ్చి శా. శ. 1538 వ సం॥లో శాసనము వ్రాయించెను. * ఈతఁడు గూడ తనతండ్రితోపాటు తోపూరుయుద్ధమునఁ జాల్గొనిరఘు నాథనాయకుని సైన్యములచే నోడింపఁబడెనని విజయనగర చరిత్రా ధారము లను గ్రంథము (పుటలు 249—290)వల్లఁ దెలియుచున్నది.

## —♦ రావెల వెలిగొండ వెంకటాద్రి ♦—

ఈయనగూడ నొక యోధాగ్రేసరుఁడు. క్రీ. శ. 1616 వ సం॥ర ప్రాంతీయుఁడు. తెంజావూరు నాయక రాజులు పాలించిన కాల ములో నితఁ డొక యుద్ధమున మట్ల అనంతభూపాలునితో నెదిర్చి తన పరాక్రమమును గన్పరచి తుద కా రణరంగమున వీరస్వర్గ మలంకరించినట్లు విజయనగర చరిత్రాధారము లను గ్రంథము (పుటలు 249—290) వల్లఁ దెలియుచున్నది.

## —♦ రావెళ్ల పాపారాయనింగారు ♦—

ఈయన క్రీ. శ. 1660వ సం॥ర ప్రాంతీయుఁడు. ఆ కాలము నకు నారికట్ల సముతు మహమ్మదీయ పాలన క్రిందికి వచ్చెను. అప్పుడు గోల్కొండను నవాబు అబ్దుల్లా కుతుబ్షా యను నతఁడు పాలించుచుండెను. ఆతని తాబేదారులలో నొకఁ డగు హజరత్ మీరునాంకాను సాహెబా రికట్ల ప్రాంతమునకు పాలకుఁడయ్యెను. ఆతనివద్ద నీ రావెళ్ల పాపరాయనింగా రొక యిజారాదారుగా పేరు వహించి యీ సమితిలోని బడుగులే రను గ్రామమును కొని యందలి 45 కుచ్చెళ్ల భూమి నొక కండ్రెకగాఁజేసి, దానికి పట్టాభిరామపుర మని పేరుబెట్టి, అగ్రహారముఁజేసి దానిని శా. శ. 1582 వ సం॥లో

చంద్రగ్రహణ కాలమున శ్రీ వెంకటాచలపతి స్వామి కర్పించి శాస నము వ్రాయించి కీర్తిఁ జెందెను.

## —♦ రావులవారు - రావుల వెంగళప్ప ♦—

వల్లుట్ల గోత్రీకులగు రావెళ్ళవారి వృత్తాంత మింతవరకుఁ దెలుపఁబడినది. రావులవారను పేరుగల వారు లోకపాలగోత్రీకులుగా కమ్మవారిలో ప్రసిద్ధికి వచ్చిరి. క్రీ.శ. 1617 వ సం॥ర ప్రాంతములో రావుల వెంగళప్ప యను నతఁడీ వంశమునఁ బ్రసిద్ధికివచ్చి రావెల వెంకటపతి నాయనింగారికి సామంతుఁడుగా నుండెను. ఈ వెంగళప్ప తండ్రి పేరు వెంకటప్ప. తాత వెంగళప్ప. రావెల వెంకటపతి నాయ నింగారీయనకు నెల్లూరి జిల్లాలోని పీరన్నకనుపూరను గ్రామమును అమరంగా నొసంగెను. ఇతఁడా గ్రామపాలకత్వము వహించుటయే గాక శా.శ. 1538వ సం॥ లో నాగ్రామ సుంకముల నచటివిశ్వేశ్వర స్వామికి దానమిచ్చి యొక శాసనము వ్రాయించి కీర్తి వహించెను. †

### రావుల వెంకటాద్రి

ఈయన క్రీస్తుశకము 1645వ సం॥ర ప్రాంతపువాఁడు. ఇతఁడు రావెళ్ళ ముద్దుకృష్ణప్పనాయనింగారికి సామంతుఁడుగా పనిచేయు చుండెను. అందుచే నీయనకు నెల్లూరి జిల్లాలోని సర్వేపల్లి సీమ యందలి కోడూరు గ్రామము నమరముగా నొసంగఁ బడెను. ఈతఁడా గ్రామమున నొక ధర్మచెఱువును త్రవ్వించి శాసనము వ్రాయించి ప్రసిద్ధికి వచ్చెను.*ఇంక నాతని శాసనములు నారికేళపల్లి, మడవనూరను గ్రామములలో గలవఁట.

## —♦ పెమ్మసానివారు ♦—

పెమ్మసానివారి వృత్తాంతము ప్రౌఢదేవరాయల కాలము నుండియుఁ దెలియవచ్చుచున్నది. వీరు కమ్మవంశములో మొదట సామాన్య గృహస్థులుగా నుండి రనియు, వీరి పూర్వనామము ఆలం వారనియు, మొదట తిమ్మనాయని తండ్రి ఆలం వెంకటపతినాయఁ

† N. I. G/112 * N. I. n/33

డనియు, నాతని తలిదండ్రులు చిన్నతనమున చనిపోఁగా, పెమ్మసాని యను బోనకత్తె వలన పెంచఁబడి నందున, నతనికి పెమ్మసాని తిమ్మానాయఁ డని పేరు వచ్చినట్లును, యీయన మొదట పావు రేళ్ళ కడ నున్నందున, పావురేళ్ళ తిమ్మానాయఁడనికూడ వ్యవహరించినట్లును, స్థానిక చరిత్రములందుఁ గలదు*.

## —♦ పెమ్మసాని తిమ్మానాయఁడు ♦—

క్రీ.శ. 1431వ సం॥ర ప్రాంతమున నితనికి యాకిడ పరగణాపాల నాధికారము ప్రౌఢదేవరాయలచే నొసంగఁబడి నట్లు స్థానిక చరిత్రలు తెలుపుచున్నవి. ఈ ప్రౌఢదేవరాయ లొనరించిన యనేక యుద్ధములలో నితఁడు పాల్గొని తన శౌర్యమును జూపినందులకు మెచ్చుకొని తర్వాత గండికోట పాలన మొసంగినట్లు కనుబడును. ప్రౌఢదేవ రాయలు కల్బర్గు కోట పట్టుకొనుటకై వెడలిన దండయాత్రలో గండికోటనుండి పెమ్మసాని తిమ్మనాయకుఁడు 8000 సైన్యముతో వెడలినట్లు గుమ్మనాయక పాళెగాళ్ల చరిత్రవల్ల. దెలియుచున్నది†. ఈయన గండికోటలో జిల్లేళ్ళ చలపతిరాజు కట్టించిన కోటను మరల గట్టించెను; గాని యిది పూర్తి యగు సంతలోనే యీతఁడు కాల ధర్మము నొందినట్లు కన్పడును. యాడకిలోఁగూడ నితఁ డొక కిల్లాను గట్టించెను. ఈయనతల్లి వెంకటమ్మ. ఈమె పేరిఁట తిమ్మానాయఁడు వెంకటాపుర మను గ్రామమును గట్టించి, యచట నొక బావిని త్రవ్వించెను. ఈయన గుత్తి, గండి కోట సీమలను రాయలకు సామంతుఁడుగాఁ బాలించుచు వచ్చెను.

పెమ్మసాని వారి రాజ్యము క్రమముగా నభివృద్ధియయ్యెను. వీరి రాజ్యమున నెల్లూరు, గుంటూరు, అనంతపురము, కృష్ణా మండలములలో చాల భాగ ముండె ననియు, వీరు రాయలకు తొమ్మిది లక్షల రూప్యములు కప్పము చెల్లించుచు వచ్చి రనియు, వీరి

---

* భారతి శుక్ల సంపుటము

† Q. J. M. S; XXX, No. 2. P. 186

రాజ్యాదాయము మొత్తము 25 లక్షల రూప్యము లనియు, వీరి క్రింద 25 వేల కాల్బలమును, 15 వేల ఆశ్విక దళమును, 40 గజములు నుండెడివనియు, నీ వంశీకులకు 'ఆదివీర' యను బిరుదము గల దనియు శ్రీ మున్నంగి లక్ష్మీ నరసింహ శర్మగారు వ్రాయుచున్నారు. ఈ పెమ్మసాని వారి పేరిట స్వంత మాడలు, రూకలు వేయించి చలామణి చేయుచు వచ్చినట్లు గూడ లోకలు రికార్డులలో గలదు. ఈ నాణెములకు వారి యిలవేల్పగు వీరభద్రుని పేరొక వైపున నాగరలిపిలో వ్రాయించి, వెంకటరమణ ప్రతిమ యొక వైపున నుండునట్లుగా మాడలు రూకలు తస్నాలు వేయించి వారి రాజ్యములో నడచునట్లు చేసిరని స్థానిక చరిత్రలు తెలుపుచున్నవి. ఈ పెమ్మసానివారు విజయనగర రాజ్యమున పాళెగాండ్లలో ప్రసిద్ధి గలవారు. వీరు విజయనగర పట్టణమునకు సపరివారులై వెడలినపుడచట నివసించుటకు 1240 కుంటల వైశాల్యము గల ప్రదేశ ముండెనని "విజయనగర సామ్రాజ్యవు" అను ప్రాచీన కడిత పుస్తకమువల్ల విదితమగుచున్నది. వీరికి మొదట గండికోట, గుత్తి రాజ్యములు మాత్రమే స్వాధీనములో నున్నట్లును, క్రమముగా వృద్ధి యగుచుండి నట్లును గ్రహింప వచ్చును. ఈక్రింది చాటు వీయన పేరిట రచింపఁబడినట్లు తోచుచున్నది.

" ఉ. చాలు గుణాలు మౌళి గడి - సంగడి రాజులు గొల్వ రండహో
హాలహాలో గ్రఫాల నహ - నాప్పుల యంతటి ధాటివాఁడు నా
యేలిక వెంకటాద్రి ధర - జేకుని తిమ్మఁడు పెమ్మసాని భూ
పాలుఁడు హెచ్చు ధాత్రిఁ గల - పార్థివు లెల్లరు లొచ్చు వారికిన్॥"

ఇది యొకవేళ వెంకటపతి రాయలవారి కాలములోని తిమ్మ నృపాలుని కన్వయింపఁదగునేమో తెలియకున్నది. తిమ్మానాయనికి వీర తిమ్మానాయఁ డను కుమారుఁ డున్నట్లు కొన్ని స్థానిక చరిత్రములును, రామలింగ నాయఁ డను కుమారుఁడుండి

నట్లు తాడిపత్రి చరిత్రమును దెలుపుచున్నవి. చాటుపద్యములు రామలింగవిభుని తండ్రి చెన్నవిభుఁడని పేర్కొనుచున్నవి. వీని నన్నిఁటిని సమన్వయించుటకుఁ దగిన చారిత్రక సామగ్రి గన్పడకున్నది. సమకాలికములగు చాటువులనే మన మిచట విశ్వసించినచో, నీ తిమ్మానాయని కుమారుఁడు వీర తిమ్మానాయఁ డనియు, నితఁడు మల్లికార్జునరాయల కాలములోఁ గుత్తి, గండికోట రాజ్యములు పాలించుచుండె ననియు విశ్వసింపవచ్చును†. ఈ వంశములోఁ దర్వాత ప్రసిద్ధికి వచ్చిన పాలకుఁడు రామలింగనృపాలుఁడు.

## —♦ పెమ్మసాని రామలింగనృపాలుఁడు ♦—

పైన నుడివిన తిమ్మానాయని తర్వాత నీ రామలింగ నృపాలుని చరిత్ర మనకు లభ్యపడుచున్నది కాని మధ్యచరిత్రము తెలియుట లేదు. రామలింగనృపాలుని తండ్రిపేరు చెన్నవిభుఁడని చాటుపద్యముల వల్ల (దెలియుచున్నది. ఈయనకు పెదతిమ్మానాయఁడను సోదరుఁడు గూడ నున్నట్లు కన్పడును. వీరిర్వురును సాళువ వీరనరసింహ రాయలయొక్కయు, శ్రీకృష్ణదేవరాయల వారి యొక్కయు సామంతులుగానుండిరి. పైన నుడివిన వీరతిమ్మానాయనికి చెన్నవిభుఁడను కుమారుఁడుండి యాయనకు నిర్వురు జనించిరా యని యూహించుట కవకాశ మేర్పడుచున్నది. చెన్నవిభుఁడు సాళువ నరసింహ, వీరనరసింహ రాయల కాలములలో నుండియుండును.

† విజయనగరరాజ్యమును ప్రౌఢదేవరాయల తర్వాత నీతని కుమారుఁడు మల్లికార్జునరాయలును, తరువాత నాతని వంశములో మఱియొకరును క్రి. శ. 1487 వరకును బాలించియుండిరి. తరువాత సాళువ వంశీకుఁ డగు నరసింహరాయలు 1493 ప్రాంతమువరకు,ను తరువాత నాతని కుమారుఁడగు ఇమ్మడి నరసింహరాయలు II క్రి. శ. 1505 వరకును పాలించియుండిరి. ఈ ఇమ్మడి నరసింహరాయల వద్ద సేనాధిపతియగు తులువ వంశ నరసనాయకుఁడు తర్వాత విజయనగరమును బాలించుచున్నను స్వతంత్రుఁడు కాలేదు. కాని యీతని కుమారుఁడగు వీర నరసింహరాయలు క్రి. శ. 1509 వరకు స్వతంత్రుఁడుగఁ బాలించెను. ఈతని తరువాత పాలించినవాఁడు కృష్ణదేవరాయలు.

రామలింగనృపాలుఁడు కృష్ణదేవరాయలవద్ద 80 వేల సేన కధ్యక్షుఁడుగా నుండెను. * ఆ కాలమున కల్బుర్గు రాజధానిగా యేదుల్ ఖా నను మహమ్మదీయుఁడు పాలించుచుండెను. రాయలు కల్బుర్గు మీదికి దండయాత్ర వెడలిన సమయమున నాతనికి గోల్కొండ ప్రభువగు కుతుబనముల్కును అహమ్మదునగర ప్రభువగు నిజాముశాహయును యేదుల్ ఖానునకు తోడ్పడవచ్చిరి. అందుచే నా యుద్ధము మిక్కిలి భయంకరమైన దయ్యెను. ఆ ఘోర యుద్ధమున జయాపజయములు సందిగ్ధముగా నుండెను. ఆక్లిష్ట సమయమున యోధాగ్రేసరుఁ డగు రామలింగ నృపతి సింగపుఁ బిల్లవలె రణరంగమధ్యమునకు 10 వేల సైన్యముతో జొచ్చి, సాహసముతో తురుష్కసేనం జొరఁబడి, వారి డేరిజు త్రాళ్లు తెగఁగోసి, యా యుద్ధమున ననేకులను సంహరించి, తుదకు జయలక్ష్మి రాయలను వరించు నట్లొనరించెనఁట♦. అప్పుడు రాయలు మిక్కిలి కొనియాడి యనేక బహుమానము లొసంగెను. ఈ యుద్ధము కృష్ణరాయ విజయ మను గ్రంథమునఁ జక్కఁగా వర్ణింపఁబడి యున్నది. తురకలు యుద్ధమునకు వచ్చు వార్త రాయలు సభలో తెలిసినప్పు డీ వీరాగ్రేసరుని చర్య యిట్లుండెనఁట.

"మ॥ విని యా భూవర కోటిలోన ఘన దో-ర్వీర్య ప్రభావుండు బం
ధు నృపాల ప్రబలుఁడు యుద్ధముల యం-దుణ్ స్వామి కార్యంబులం
దున యజ్ఞుండగు పెమ్మసాని కుల చం-ద్రుండైన యా రామలిం
గ నృపాలాగ్రణి పల్కె సంగర కళా - కౌతూహ లాయత్తుఁడై.

చ॥ తురక లనంగ నెంత పటు-దోర్బల లీల వధింతు వారలన్
గురుతు పడం గుడార్లు దెగఁ-గోసెద బౌజులలో మెలంగెదన్
నరపతి చంద్ర యెంతయు ఘ-నంబుగ దేవరవారి సొమ్ము ది
న్న ఋణము దీర్చుకోఁ గలిఁగె-నన్ గృప జూఁడు మటంచు బల్కఁగన్॥"

* భారతి శుక్లసంపు. పుట. 624 & ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక సంపు III

♦ భారతి శుక్లసంపుటము. పుట. 624, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికసంపు. III

ఈయన పరాక్రమమూ యుద్ధరంగమున నిట్లు జూపఁబడెనఁట.

"మ॥ అనుచుం బల్లెము గేలఁ బూనుకొని శౌ-ర్యారూఢులౌ కమ్మవా
ర్వెనువెంటం బదివేలు బల్లెములతో-విఖ్యాత శౌర్యోన్నతిం
జనుదేరం ఘన సింహరావ మలరం-దత్సైన్యముం జొచ్చి హె
చ్చిన ధైర్యంబున బారసీక తతులం-జెండాడె నుద్దండుఁడై.

మ॥ మొనకు న్వచ్చిన విచ్చు కత్తులసివే-ముష్టిమ మేల్ రౌతులఁ
దునుమాడంగను గల్గి పార్శ్వముల యం-దుం గ్రమ్ము నశ్వమ్ములన్
దన బల్లెమ్మున గ్రుమ్ము క్రమ్మఱచు వె-న్కాల్ దారసిల్ జోదులన్
గని దూరంబుఁ దొలంగఁ జేయుఁ బటుదో-ర్గర్వం బఖర్వంబుగన్.

ఇట్లే యుద్ధమునఁబది వేలమంది కమ్మయోధుల సహాయమున నీశూరశిఖామణి యద్భుత పరాక్రమముఁ గన్పరచి, యనేక సైనికులఁ బారఁద్రోలి, ముగ్గురు వజీర్లను సంహరించెను. ఈ యోధాగ్రేసరుఁడు జూటూరు, పెడకంటి, బేతము చెర్ల ప్రాంతములలో జరిగిన యుద్ధములలోఁ గూడ తన పరాక్రమము గన్పఱచెను. ఇతఁడు చింతగుంట రఘుపతిరాజు, సలకం తిమ్మరాజు, సహజియ్యఖాను వైరి వీరుల జయించి, బేతంచెర్ల కోట నేలమట్టు నాశన మొనర్చెను. ఈ విషయము లీ క్రింది చాటుపద్యము స్పష్టపరచుచున్నది.

"సీ॥ జూటూరి ముందర-శూరత్వ మేర్పడ । రణభూమిలో సల్క-రాజు గెలిచి
కోరి బేతము చెర్ల-కోట ధూళిగఁ జేసి । చింతగుం ట్రఘుపతి-పంత మణఁచి
పెడకంటి కయ్యాన-భీకరంబుగ నీవు । వెండియు సలకము-విభుని దోలి
సాహసుండైనట్టి-సహజియ్య ఖానుని । నదలించి యాదవు-నంత లోన

గీ॥ ద్రిమ్మరైనట్టి సలకము-తిమ్మ విభుని । ద్రుంచి రాయల బట్టాన-నుంచితౌర
పృధుల గెల్పుల సురతాన-పెమ్మసాని । చెన్నవిభు రామలింగతే-జః పతంగ॥"

రామలింగ నృపాలుఁడు తన పేరఁట తాడిపత్రిలో రామలింగేశ్వరాలయ మొకటి కట్టించెను. తాడిపత్రి బస్తీని రాయలవారి యనుమతితో వృద్ధిఁ జేసి కట్టించెను. ఈయన పేరఁట రామలింగ నాయని పల్లె యొకటి గూడ నిర్మింపఁబడెను. ఈ పల్లె యిప్పుడు తాడిపత్రికి నాలుగు క్రోసుల దూరమున నున్నది. ఈయన కట్టిం

చిన రామలింగేశ్వరాలయమునకు ప్రక్కగా నితఁ డొక మామిడి వనము వేయించెను. సర్కారు ద్రవ్యముతో నీ దేవునకు నిత్యనైవేద్య పూజాపునస్కారములకును, ఉత్సవాదులకును యేర్పాటొనరించెను ఇంతేఁగాక నితఁడు యద్రమలకొండ బుగ్గవద్ద వోబులేశ్వరాలయ మొకటి గట్టించెనఁట. ఈయనకు రాజగోపాలమ్మ, గోవిందమ్మ యను నిర్వురు కుమార్తె లున్నట్లు గన్పడుచున్నది.

రాజగోపాలమ్మ రామలింగానాయని పల్లెలో గోపాలస్వామి యాలయ మొకటి కట్టించి దాని కెనిమిది తూములభూమి నిచ్చెనఁట! గోవిందమ్మ యొక పల్లెను గట్టించి యచట యాంజనేయాలయ మును గట్టించి, యచట నొక చెఱువును త్రవ్వించి, చలివేంద్ర నేర్పాటొనరించెనఁట! ఆమె కట్టించిన పల్లెకు పట్రకేతయ పల్లెయని పేరు వచ్చెను. పట్రకేతయ యను వాని నచట వ్యవహార పరీక్షలకు నియమించుటచే నాపేరు వచ్చెను. ఈ రామలింగనృపతి కృష్ణదేవరా యల తర్వాతఁ గూడ జీవించి యున్నట్లు కన్పడును. అతని తర్వాత నే సలకము తిమ్మరాజు రాజ్యాధిపత్యమునకై తగవు లాడఁగా చివరకు సంహరింపఁ బడెను.

## —♦ పెమ్మసాని పెదతిమ్మా నాయఁడు ♦—

ఈయన రామలింగనృపాలుని కుమారుఁడైనదియు, సోదరుఁడైన దియు నిర్ణయించుటకు వీలుగా లేదు. చాటువులలో నితఁడు సోదరుఁడ నియు, తాడిపత్రి మున్నగు కయిఫీయతులలో కుమారుఁ డనియు నున్నది. ఈతఁడు గూడ వీరనరసింహరాయల యొక్కయు, కృష్ణదేవ రాయల యొక్కయు కాలములోని వాఁడే. ఈయన కాలములో జరి గిన యుద్ధములలో నితఁడు దస్తూరిఖా నను తురుష్కుని సంహరించిన ట్లొక చాటువవల్లఁ దెలియుచున్నది. ఈయనకు నారసింహ నృపా లుఁడు, బలిచిన్న నాయకుఁడు, చిన తిమ్మభూపతి యను మువ్వురు కుమాళ్ళున్నట్లు గొన్ని చాటు పద్యములను బట్టి నిర్ధారణ యగు చున్నది. ఇందు నరసింహనాయఁ డను పేరు తన యేలికయగు

వీరనరసింహరాయల పేరిటఁ బట్టినట్లు కన్పడును. ఈయన యుద్ధ పరాక్రమమును గుఱించి యొక చాటు విట్లున్నది.

" మ. అబిసీ తొండములున్ ఫరంగుల తలల్ - హమీరురెట్టల్ గరీ
బుబొరల్ మన్నెదొరల్ బడామసలిమాన్ - పొట్టల్ తెగన్ గండికో
టబయల్లన్ హెదరావు బాణహతి గొం - డల్ గూలి నట్లొప్పె నీ
ప్రబలోద్ధాటిని పెమ్మసాని పెద తి - మ్మా। రాజ కంఠీరవా।। "

ఈతఁడు తాడిపత్రిలో చింతల రాయస్వామి కోవెలను గట్టించి, దానిలో శిల్పశాస్త్ర ప్రకారము గర్భగృహ, సుకవాసిక, సూదితె, మధ్యరంగ, ఆస్థానమంటప, సౌధాంతరాళ, గోపుర, ప్రాకార, నృత్యసికా, పచనాలయ, యాగశాల, కళ్యాణమండప, ఆళ్వారాదిమంటప, శయనాలయ, గరుడ మంటప, హనుమార్ మంటప, వరాహ మంటపములును, శ్రీ భాగవత, రామాయణ అష్టదిక్పాలకాది చిత్ర ప్రతిమలతో కట్టించి, ఘండా తిరుమలయ్య, రామాయణం రామాచార్యు లనే యర్చకులను తాడిపత్రి తిరువెంగళాచార్యుల నాచార్యులు గాను యేర్పాటుచేసి, దేవళము వద్ద నొక కోనేరు త్రవ్వించి, దేవుని కనేక యుత్సవాదుల నేర్పాటు గావించి నట్లు తాడిపత్రి కయిఫీయతు తెలుపు చున్నది*.

ఈయన కాలములో మాగాణి భూములు వృద్ధి చేయఁ బడెను. తాడిపత్రిలో నీయన తన బంధుగుఁడగు ఉద్దండనాయని

---

*తాడిపత్రిపాలన వీరి క్రింద నున్నను, మొత్తము మీద గుత్తిరాజ్య మంతయు సాళువ తిమ్మయ్య గోవిందయ్యలకు నాయంకరము క్రింద యివ్వఁబడినట్లును ఆ నాయంకరము శా. శ. ౧౪౩౨-౧౪౩౫ సం॥ల మధ్య అమలులో నున్నట్లును, తాడిపత్రి శాసనములు తెలుపుచున్నవి. (S. I. I. Vol. IV. Nos. 800, 802, & 803) ఈ నాయంకరము వీరనరసింహరాయలు, కృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు మువ్వుర కాలములలోను అమలునం దుండెను. అందుచే పెమ్మసానివారు యీప్రభువుల సేనాధిపతుల హోదాలోనే తాడిపత్రిని (గుత్తిరాజ్యము) పాలించి యుందురు. గండికోట, యాడకి పరగణాలు వీరి నాయంకరము క్రింద నున్నట్లు గన్పడును.

పరిపాలనకు నియమించి గండికోటలో తా నుండి పాలించుచు వచ్చెను. గండికోట యీయన కాలములో మఱల బలపఱుపఁబడెను. ఉద్దండనాయనివారీయన తరఫున పెన్నబడి మాగాణి విచారించుచుండెను. ఇతఁడు మడవంక యను పొలమును దన తల్లి పేర నేర్పఱచి దానికి గడ్డకాల్వ త్రవ్వించెను. ఈ కాల్వకు తిమ్మానాయని కాల్వ యని పేరు వచ్చెను.

ఈయన వద్ద యేనుఁగుల చెన్నానాయుఁ డను బంధువుఁడుండెను. ఈయన గాండ్లపాడు అనే గ్రామమును గట్టించి, బక్క చెన్నారాయణస్వామికి దారుమంటపము గట్టించి ప్రతిష్ఠించెను. ఈ మంటపము లోఁగడ నడివిస చెన్నవిభుని పేరిటఁ (రామలింగనాయని తండ్రి) గట్టింపఁబడి యుండును. ఈయన కాలములో తాడిపత్రిలో యేటి అవతల నాలుగు కపిల బావులు త్రవ్వింపఁ బడెను. వీని వల్ల గూడ మాగాణి వృద్ధి చేయఁబడెను. తాడిపత్రికి క్రోసు దూరములో చల్లావారిపల్లె యొకటి కట్టింపఁబడెను. ఈపల్లెలో చల్లావా రనే కమ్మవారు నివసించుటచే నా పేరు వచ్చెను.

ఈయనకు శానమ్మ యను తోఁబుట్టువు కలదు. మిక్కిలినేని నలచెన్నానాయుఁడు కట్టించిన పల్లె వద్ద నామె యొక చెఱువును ద్రవ్వించెను. దానిలో జమ్ము విస్తారముగ పెరిగి యా పల్లెకు జంబులపా డను పేరు గల్గెను.

ఈయన వజ్రగిరికొండ మీఁద నృసింహస్వామి యాలయ మొకటి కట్టించెను. ఇదిఁ గాక తాడిపత్రికి మూఁడు క్రోసుల దూరమున నొక చెఱువును గ్రామమును కట్టించెనుగాని యీ చెఱువులో నీళ్లు నిలవనందున వోడు తిమ్మానాయని చెర్వు అని పేరు వచ్చెను. ఈ పెద తిమ్మానాయనినే అక్క భూపాలుఁడని కూడ పిలుచుచున్నట్లు కన్పడును. ఈయన యొనర్చిన కార్యము లింక నసేకము లుండి యుండును. గాని వానినన్నిఁటిని తెలుసుకొనఁ జాలకున్నాము.

## —♦ పెమ్మసాని బలి చిన్ననాయ కేంద్రుఁడు ♦—

ఈయన పెద తిమ్మానాయని అగ్రసుతుఁడు. ఇతఁడు కూడ నొక యోధాగ్రేసరుఁడుగ నుండి మస్తఖాననుతురుష్క సేనానితో జరిగిన యుద్ధమునఁ బాల్గొని యాతని సేనానులను చీకాకు పరచెను. ఇంతకన్న నీయన విశేషములు తెలియుటలేదు. ప్రాయశః యితఁడు మహామ్మదీయులతో జరిగిన యుద్ధములలో మరణించి యుండును.

## —♦ పెమ్మసాని అర తిమ్మానాయఁడు ♦—

ఈయననే చినతిమ్మ నృపాలుఁ డని కూడ నందురు. అక్క భూపాలుఁ డను పేరు గల పెద తిమ్మ భూపాలున కితఁడు కుమారుఁ డుగఁ గన్పడు చున్నాఁడు. పెమ్మసాని వారిలో నితఁ డత్యంత ప్రసిద్ధ యోధాగ్రేసరుఁడు. ఈయనకు "హత్తుమువ్వరగండ, వాడిచే కండ బిరుద, గండికోట దుర్గాధ్యక్ష, గండరగండ, గరుడ నారాయణాంక విహార, శాత్రవ మద విఫాల, హన్నిబ్బరగండ, చేపట్టు గండర సూర్యభద్ర చిహ్న, గండరాదిత్య, మన్నె మార్తాం" డాది బిరుదులు గలవు.

శ్రీకృష్ణదేవరాయలు విజయనగర రాజ్యమును బాలించిన పిమ్మట చనిపోఁగా, నా రాజ్య మాతని యల్లుఁ డగు అళియరామ రాయల స్వాధీనములో నుండెను. ఇతఁ డచ్యుత రాయల పక్షమున బాలించుచుండెను. అపుడు రామరాయలకు కోటలో క్రమముగా శత్రువు లధిక మైనందున నాతఁ డొకసారి తన ప్రాణరక్షణార్థమై గండికోటకుఁ బరుగెత్తి వచ్చెను. అప్పు డీ తిమ్మానాయఁడు రాయలను కంటికి రెప్పవలె గాపాడెను. అంతట రాయల శత్రువు లీతని పైకి యుద్ధమునకు రాఁగా, కోమలివద్ద ఘోరమైన యుద్ధము జరిగెను. దానిలో నితఁడును, యీాయనకు తోడ్పడ వచ్చిన యితర పాలెగాండ్రనుకలసి,సలకము తిమ్మరాజను శత్రువును ఆతనిఫౌజుతో

సహాయంతంచేసి, రామరాయలను తిరిగి విజయనగర సింహాసనారూఢుని జేసినందున, రాయలవారు మిక్కిలి సంతసించి అరతిమ్మానాయునికి విశేషమైన వస్తువులు, ద్రవ్యమును బహుమాన మిచ్చినట్లు నడిమిదొడ్డిపాళెగాండ్ల కయిఫీయతు తెలుపుచున్నది. * దీనిని తాడిపత్రి కయిఫీయతు కూడ ధృవపఱచు చున్నది. కాని సలకము తిమ్మరాజును రామలింగ నృపాలుఁడు పారద్రోలినట్లు కొన్ని చాటువులు తెలుపుచున్నవి. ఒకవేళ నాతఁడు కూడ నాకాలము వరకు నుండి యుండవచ్చును.

అర తిమ్మానాయఁడు క్రీ. శ. 1550 వ సం॥ (సౌమ్యనామ సం॥)లో తాడిపత్రిలోని చింతలరాయలస్వామికి యెనుముచింతల అనే గ్రామమును దానమిచ్చి శాసనము వ్రాయించెను. ఈయన యింకను ఖంకమల పాటిలోను, పెద్దపొల్మెడలోను, కనగలగూడూరిలోను, వెన్నపూసపల్లెలోను యీడు పుట్ల భూమిని దేవునకు సర్వమాన్యముగా ఖాయపఱచెను.

ఈయన తన పేరిట నొక తటాకమును త్రవ్వించెను. ఇతఁడొకసారి తాను కోరిన సాలెగ్రామము నీయని యొక బ్రాహ్మణుని చంపించఁగా, బ్రహ్మహత్యాపాతకము చుట్టుకొనె ననియు, తద్దోష పరిహారార్థము క్రీ. శ. 1552 వ సం॥లో తిమ్మానాయనిపేట యొకటి కట్టించి, దానిని బ్రాహ్మణాగ్రహార మొనర్చి యచట నొక చెర్వు కట్టించె ననియు, హత్యచేయఁబడిన బ్రాహ్మణుని రూప మొకప్రక్కను, 'యాడకి వీరభద్ర' అనే నాగరాక్షరము లొక ప్రక్కను గల నాణెములను (రూకలు) వేయించి, తన దేశమున చలామణి చేయించుచుండెననియు తాడిపత్రి కయిఫీయతు తెలుపుచున్నది.

యాడకి పరగణా పెమ్మసానివారి ప్రధాన స్థానమగుటవల్లను, అచటి తమ కులస్వామి యగు వీరభద్రునిపేర నాణెములు తయారు

* L. Rt Vol. 12. p. 213 & Vol. 39.

చేసినట్లు కనుబడుచున్నది. ఈ యోధాగ్రేసరుఁ డొకానొక యుద్ధములో జయించినపుడు శత్రుయోధుల నుండి యనేకము లగు గుఱ్ఱములను వస్తువులను కొల్లగొని వచ్చిన ట్లీ క్రింది చాటువు తెలుపుచున్నది.

"సీ॥. మేలిమి తేజీలు-డాలు దమామీలు । చికిరేల గోరీలు-సింగిణీలు।
ఖబ్బాయి ధట్టీలు-కపురంపు సురటీలు , తులలేని నైజాలు-తోడు మీలు।
చౌకట్ల జల్లులు-జవ్వాది పిల్లులు । తెలిముత్తియపు బేర్లు-బలు గుడార్లు।
పన్నీటి చెంబులు-పైడి కేడెంబులు , నందలంబులు జరీ-చాందినీలు

గీ॥ కొల్లగొనివచ్చె నీ మూఁక-కొంకులేక । క్షితి బ్రబుత ధర్మ మృదుతర-చేల ధర్మ
సిద్ధ గజకర్మ పెమసాని-చిన్న తిమ్మ। వితరణ గుణేంద్ర భోగ వి-ర్జిత సురేంద్ర॥

ఈ యుద్ధములో నోడిన వారి శూరాగ్రేసరు నీ క్రింది బిరుదావళితోఁ బ్రార్థించి రని యొక చాటు విట్లు తెలుపుచున్నది.

"సీ॥ అభయం బొసంగుము-హత్తు మువ్వరగండ । కాపుము వాడిచే-కంఠ బిరుద
క్రోధింపకుము గండి-కోట దుర్గాధ్యక్ష । కరుణించు గండర-గండ బిరుద
రక్షించు గరుడ నా-రాయణాంక విహార । మనుపుము శాత్రవ-మద విపాల
నిగ్రహింపకుము హ-న్నిబ్బరగండ చే । పట్టు గండర సూర్య-భద్ర చిహ్న

గీ॥ అనుచు నీ చేతి హేతికి-నడరి రిపులు । శరణుఁ బొందిరి భవదీయ-చరణములకు
ధీర పెమసాని అక్క-పార్థివ కుమార । భోగ దేవేంద్ర చిన తిమ్మ భూపచంద్ర॥

## —♦ పెమ్మసాని నారసింహనృపాలుఁడు ♦—

ఈయన విజయనగర రాజ్యాధిపతిగా నుండిన అళియ రామరాయల కాలములో నుండి యాతని సేనాధిపతులలో నొకఁడుగఁ బ్రసిద్ధికి వచ్చెను. గండికోట, తాడిపత్రి మున్నగు ప్రదేశము లీయన పాలించుచు వచ్చెను. ఈయన పరిపాలన కాలములో శా.శ. 1472, 1485 వ సం॥లలో కంటునయెల్లప్ప, కామరాజు రామన్న మున్నగు వారు తాడిపత్రిలో ధర్మశాసనములు వ్రాయించి యున్నారు. ఈయన పెదతిమ్మ భూపాలుని పుత్రుఁడు. ఈయన కూడ మిక్కిలి పరాక్రమశాలి. జమ్ములమడుగు వద్ద జరిగిన యొక

యుద్ధములో నశ్వరాయఁడను వాని నితఁడు మార్కొని యాతని సైన్యబల మణంచెనని యీ క్రింది చాటువు తెలుపుచున్నది.

"సీ॥రమణ మీపెదతండ్రి-రామలింగ విభుండు, ముగురు వజీర్లను-మొక్క పరచె-
మీతండ్రి పెదతిమ్మ-భూతలా ధ్యక్షుండు, దస్తూరి ఖానును-మస్తణంచె.
మీయన్న బలిచిన్న - నాయకేంద్రుఁడుమస్త, ఖానుని బలము చీ - కాకు పరచె
అదివిచారించి నీ-వశ్వరాయని బల. మడచవే జమ్ముల-మడుగు బయల

గీ॥అహహ నీగెల్పు నెన్నంగ-నవనిలోన, దరమె శేషునకైన ము-ష్కర తురుష్క
మస్తకన్యస్తచరణ స - మస్తశక్తి, నవబిరుద సింహ పెమసాని-నారసింహ॥"

ఈయనకు తురుష్కుల తలలపై పాదములుంచు వీరాగ్రేసరుఁడని యర్థము వచ్చు "ముష్కరతురుష్కమస్తకన్యస్త చరణ సమస్తశస్త" యను బిరుదున్నట్లు గూడ పై పద్యమువల్లఁ దెలియుచున్నది. ఈయన తండ్రియు, సోదరుఁడును జయించిన దస్తూరిఖాను మస్తఖానను వారలను వెలుగోటి కుమారతిమ్మానాయఁడు గూడ జయించినట్లు వారివంశావళిలోఁ గూడ వ్రాయఁబడియున్నది.† అందుచే నీ యోధాగ్రేసరు లందరు తురుష్కులతో నెదిర్చినట్లు రుజువు పడుచున్నది. ఈ నారసింహ నృపాలుఁడు వెల్లలూరు గ్రామములో కొంత భూమిని చెన్నమరాజు క్రిష్టమరాజు కొడుకు లింగమరాజను పండితునికి ధారాగ్రహీత మొనర్చెను. దాని నాతఁడు క్రీ. శ. 1594 వ సం॥లో నచటి చింతలరాయ స్వామికి సూర్యగ్రహణ కాలమున సమర్పించినట్లు తాడిపత్రి కయిఫియతులో నున్నది.

## —♦ పెమ్మసాని పెద తిమ్మానాయఁడు, చిన తిమ్మానాయఁడు ♦—

వీ రిర్వురును పెమ్మసాని నారసింహ నృపాలుని కుమాళ్ళుగా గన్పడుచున్నారు. వీ రాయన యనంతరము క్రీ. శ. 1584—1641 సం॥ ల మధ్య పెనుగొండ రాజధానిగా పాలించిన, రెండవ వెంకటపతి రాయలకు సమకాలికులై యుండి, యాయనవద్ద సేనాధిపతులు

† "ధరయెల్ల నెఱుంగ-గదస్తురఖానుని. జెండవె గండర గండ బిరుద। భీర। వెలుగోటి తిమ్మభూ-పతి కుమార। మతిఫణీశ కుమార తిమ్మక్షితీశ॥

గను, సామంత నృపాలురుగను ఉన్నట్లు కన్పడుచున్నది. వీరు గండి కోట సీమను యాడికి పరగణాను పాలించుచు ననేక రణరంగము లలో రాయలవారికి సాయపడి, యనేక బిరుదులు, బహుమాన ములు పొందుచు వచ్చిరి. వీరి శూరత్వమునకు మెచ్చుకొని వెంకట పతిరాయలు వీరికి "గరుడ నారాయణ బిరుద ధ్వజమును, బంగారు పువ్వుల చంద్రికావి పావడయు, తురాయి, యేనుఁగు, హయరత్నము, వీరమలహరి ఘనకంఠమాలిక, తాళిచౌకట్లు, ముత్యాల కడియములు, పల్లకి" యిత్యాదుల నొసంగినట్లు చారు చంద్రోదయములో వర్ణింపఁబడి యున్నది. * ఈ గ్రంథమును వీరి యాస్థాన మంత్రియు, కవీశ్వరుఁడు నగు చెన్నమరాజు శేషమంత్రి కొడుకు చెన్నమరాజను నతఁడు వ్రాసెను. దానిలో నతఁడు పెద తిమ్మ భూపాలుని మంత్రి నని చెప్పుకొనుచు నాతని వైభవము నిట్లు నుడువు చున్నాఁడు.

"సీ॥ తన లస ద్వనలక్ష్మి - తన లస ద్వనలక్ష్మి, పగిది నాళీ వైభ- వములఁబూనఁ
దనమహో యశపాళి - తనమహో యశపాళి, గతి దానవారి సం - గతి వహించ
దనకళా విభవంబు - తనకళా విభవంబు, సరస నబ్జజ పరి - స్ఫురణ నెరప
దన విగ్రహ స్ఫూర్తి - తనవిగ్రహ స్ఫూర్తి, రీతి దర్పక విరా - కృతి యొనర్ప

గీ॥ నలరు ధాత్రిని మన్నె మా - ర్తాండుఁ డట్టి, గండరాదిత్య గండర - గండబిరుదు
దీపితాటోప భయదప్ర - తాప ఘృణికి, పెమ్మసాని తిమ్మ భూ - మేంద్ర మణికి

గీ॥ మంత్రివై నీవు చెన్నయ - మంత్రిచంద్ర! ప్రణుతి కెక్కితి వఖిలభూ- పాల సభల
క్షితి హరిశ్చంద్రునకు సత్య-కీర్తిసరణిఁ ధరణి ధర గర్వ భేదికి-గురునికరణి॥"

---

"* సీ॥ గరుడ నారాయణ - బిరుద ధ్వజంబు బం, గారు పువ్వుల చంద్రి - కావిపావ
డయు తురాయి గజంబు-హయరత్నమును వీర,మలహరిఘనకంఠ-మాలికయును
తాళిచౌకట్లు ము - త్యాల కడియములు, గండ పెండేరంబు - కత్తి కుచ్చు
వెంకట పతిరాయ - విభుని చేతను దెచ్చి, పెమసాని తిమ్మ భూ - రమణ మణికి

గీ॥ నిచ్చి తదనుజ్ఞ గైకొంటి - వెలమి నీవు, రాయదత్తంబులైన కు - ర్కాయి మీది
పాగ ధవళ శంఖంబుబు - పల్లకియును, దాళి చౌకట్లు చెన్నప్ర - ధాన చంద్ర॥"

వెంకటపతి రాయలవారు తిమ్మభూపతికి బహుమానముగఁ బంపిన వస్తువులలో కుళ్ళాయిమీఁదపాగ, ధవళశంఖములు, పల్లకి, తాళిచొకట్లును తన మంత్రిసత్తముఁ డగు చెన్నమరాజున కొసంగి గౌరవించెను. ఈ మంత్రి వర్యుఁడు తాడిపత్రిలో నొక గోపాల కృష్ణాలయమును గట్టించి, యా దేవునకు కిరీట పీతాంబరముల నొసంగెను.

మఱియు యాడకి గ్రామమున కొనే రొకటి త్రవ్వించియు, వన మొకటి వేయించియుఁ, దన తల్లి పేరిట సర్వమాంబాపురమను నగ్రహారమును యేర్పాటు నరించియుఁ బ్రసిద్ధి వహించినట్లు తన గ్రంథమునందుఁ జెప్పుకొనెను.

చిన తిమ్మానాయుని శాసనములు క్రీ. శ. 1578 వ సం॥ము నుండియు నున్నట్లు తాడిపత్రి కయిఫీతు చెప్పుచున్నది. పెద తిమ్మా నాయనితో కలిసియు, నాతని తర్వాతను చిన తిమ్మానాయఁడు గండికోట దుర్గాధ్యక్షుఁడుగా నున్నట్లు తెలియుచున్నది. ఈ చిన తిమ్మానాయని యాస్థాన కవీశ్వరుఁ డగు చిత్ర కవి అనంత కవి తాను రచించిన 'ఇందుమతీ పరిణయము' అను ప్రబంధములో చిన తిమ్మానాయఁడు గండికోట దుర్గాధ్యక్షుఁ డని యీ క్రింది పద్యమునఁ జేర్కొని యున్నాఁడు.

"సీ॥ శ్రీ హనుమద్వర-శ్రీ లబ్ధ సుకవిత్వ । చతురుండ లక్షణ-సార సంగ్ర
హం బొనరించి యు-ద్యత్కీర్తిఁ బఖ్యాతుఁ । డగు చిత్రకవి పెద్ద-నార్యసుతుఁడ
విష్ణుచిత్తీ యాది-వివిధ కావ్యార్థముల్ । దెలిసి వక్కాణించు-ధీర మతుఁడ
గండికోటాఖ్య దు-ర్గ స్థలాధ్యక్షుఁడై । పృథివిమతుకు నెక్కు-పెమ్మసాని

గీ॥ చిన్న తిమ్మక్షమాపాల-శేఖరుండు । గారవింపఁగ బహుమాన-గౌరవమున
మనిన ధన్యుండ సభ్య స-మ్మత గుణైక।గరిమ వెలయు ననంతాఖ్య-కవివరుండ॥

ఈ చిన్న తిమ్మ నృపాలుఁడు బీదవారలకు వివాహ కార్యము లనేకము లుచితముగాఁ జేయుచుండెననియు, మిక్కిలి దాత యనియు సాంఘిక లోపములను గొన్నిఁటిని సంస్కరించి యశఃకాముఁడయ్యె ననియు గండికోట ప్రాంతములఁ జెప్పుదురు. ఈ పెమ్మసాని వారి కిప్పటి కా ప్రాంతములలో సభలయందు ప్రథమ తాంబూల గౌరవ మిచ్చుచుందురు. చిన్న తిమ్మ భూపతి క్రీ. శ. 1578 వ సంIIలో తాడిపత్రిలోని చింతలరాయల స్వామి వారికి ముప్పాతిక పుట్టిభూమి నొసంగి, క్రీ.శ. 1585 వ సంIIలో నైవేద్యములఁ గొన్ని యేర్పాటు లను గావించి, క్రీ. శ. 1593 వ సంIIలో చినతాడిపత్రి చేను గూడ నొసంగి శాసనములు వ్రాయించి పేరొందెను. ఇంతేఁగాక నితఁడు రంగస్వామి దేవాలయమునకు తుంట యను గ్రామమును ధారాగ్రహీత మొనర్చినట్లు కనుపడును. * వీనిని బట్టి గండికోట పాలనము తల్లికోట యుద్ధానంతరము గూడ పెమ్మసాని వంశీయులే చేయుచున్నట్లు స్పష్టపడుచున్నది.

క్రీ. శ. 1586 వ సంIIము దాపులో గోల్కొండ నవాబగు మహమ్మదు కూలీ కుతుబ్షా గండికోట నాక్రమించుటకై తనమంత్రి యగు అమీరుల్ ముల్కును సైన్యముతో పంపి జయించి, యచట సంజరుఖాన్ అనువానిని నిల్పె నని ఫెరిస్తా వ్రాసియున్నాఁడు. కాని యీ ఆక్రమణ చిరకాలము నిలువలేదు. వెంకటపతిరాయల వారీ వృత్తాంత మెఱిఁగి, పెనుగొండ నుండి సైన్యసమేతుఁడై వచ్చి యుద్ధము సాగించి, సంజరుఖానునకు సహాయముగా గోల్కొండ నవాబుచే పంపఁబడిన మూర్తజాఖాను, రుస్తుంఖా నను వీరాగ్రేసరు లను గూడ పెన్నారునది వద్ద జరిగిన ఘోరయుద్ధములో జయించి మహమ్మదీయ సైన్యమును ముక్కలు ముక్కలుగా నరికివేసి గండి కోటను స్వాధీన పఱచుకొనెనఁట. మఱల నచట పెమ్మసానివారినే పాలకులుగా నుంచినట్లు కన్పడుచున్నది. పెద తిమ్మ భూపతి

* తాడిపత్రి కయిఫీతు L. R.

జయించె నని చెప్పఁబడిన యుద్ధములలో నిది యొకటి యనవచ్చును. ఈ గండి కోటయేగాక యీ యుద్ధములలో కృష్ణ సరిహద్దు వరకుఁ గల రాజ్య మంతయు వెంకటపతి రాయలకు వశమయ్యెనఁట.

## —♦ పెమ్మసాని పెద వీర నృపాలుఁడు ♦—

ఈయన క్రీ. శ. 1581 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈ పెమ్మసాని వంశములో గండికోటను పాలించిన వారియం దొకఁడుగాఁ గన్పడుచున్నాఁడు. ఈయన మొదటి శ్రీరంగరాయల సామంతుఁడు గావచ్చును. చారు చంద్రోదయములో నీ యోధాగ్రేసరుఁ డిట్లు వర్ణింపఁబడియున్నాఁడు:

" చ॥ విడువక పెమ్మసాని పెద - వీర నృపాలుని యందలంబుపై
నడచు నుదార ఘోర మద - నాగముచే పిడియమ్ము కొద్ది యె
క్కుఁడు వడి గ్రుద్ది పోఁ దటమె - కొంచక లింగయ మంత్రి సింహ్వా మిం
పడరెడు వేఁక- రాయలవు - రా యన నా మిడిగేసి చెంగటన్॥ "

ఇం దుదాహరింపఁబడిన లింగయ మంత్రి శాసన మొకటి క్రీ.శ. 1581వ సం॥ము నాఁటిది (శా.శ. 1516 వ సం॥) తాడిపత్రిలో కనుబడుచున్న దని తాడిపత్రి కయిఫీయతులో వ్రాయఁబడినది. ఆ శాసనములో నతఁడు పెమ్మసాని నారసింహ నృపాలునివద్ద ధారా గ్రహీతముగా పొందిన కొంత భూమిని సూర్యగ్రహణకాలమున చింతలరాయ స్వామి కిచ్చినట్లు వ్రాయఁబడినది. అందుచే నీ పెద వీర నృపాలుఁడుగూడ నాతని సమకాలికుఁ డని ధృవపడుచున్నది. ఇట్టి పరాక్రమ కంఠీరవుని కాలమునకు విజయనగర సామ్రాజ్యము పతనమై కొంత భాగము తురుష్కాధీనమై యుండెను. తల్లికోటవద్ద క్రీ.శ.1565వ సం॥న జరిగిన యుద్ధములో మహా ప్రళయముగావచ్చి పడిన లక్షలకొలఁది మహమ్మదీయుల ఢాక తాఁగఁజాలక విజయనగర రాజ్యము విచ్ఛిన్నమైన పిమ్మట, నీ పెదవీర నృపాలుఁడు సపరివారముగా దక్షిణదేశమునకు వలస పోవలసివచ్చెను. మధుర రాజ్య

మప్పుడు విజయనగర రాజుల బంధువులే పాలించుచుండిరి. అప్పు డచట విశ్వనాధనాయకుఁడు రాజుగా నుండెను. ఈతఁడు క్రీ. శ. 1530-1600 మధ్య కాలమునఁ బాలించెను.

వీరప్పనాయఁ డంతనుచే విశ్వనాధ నాయకుని కడకేగి, యాతని క్రింద నుండిన డెబ్బది రెండు పాళెగాండ్రలో నొక ప్రధాన పాళె గాఁడుగాఁ జేరెను. ఇక నీతనికి విశ్వనాధ నాయకుఁడు సమాన గౌర వముల నిచ్చుచు వచ్చెను. ఈయనకు తిరునెల్వేలి జిల్లాలోని కురివి కులమను జాగీరు నొసంగెను. అచట నంతకు పూర్వము కురవి తల యవన్ అను నాతఁడు దాని పాలకుఁడుగా నుండెను. ఆతఁడు దానిని యిచ్ఛా పూర్వకముగ స్వాధీనముఁ జేయనందున నచటఁగూడ నొక చిన్న యుద్ధము జరుగవలసివచ్చెను. దానిలో వీరప్పనాయఁడు జయమొంది విశ్వనాధ నాయకుని యాజ్ఞాప్రకారము కురివికుల మును స్వాధీనపరచుకొనెను.

విశ్వనాధ నాయకుని రాజ్యమునందు కురివికులము, అలై యరసనందల్ పరగణాలే మిక్కిలి ప్రాముఖ్యములైనవి. ఈ విష యము కెలరు దొరవ్రాసిన మాన్యుస్క్రిప్టులలో నున్నది. పెమ్మసానివా రచట పాళెగాండ్లుగా నుండి మధుర, తిరుచునాపల్లి రాజుల కనేక విధముల సాయపడుచుండిరి. తిరుచునాపల్లి రాజ్యమునకు కేరళరాష్ట్రము స్వాధీన మగుటలో వీరి సాయ మత్యావశ్యకముగ నుండెను.

మధుర తిరుచునాపల్లి రాజ్యములు తర్వాత చాల కాలము నిలువలేదు. అవి యన్యాక్రాంత మయ్యెను. క్రమముగా నీరాజ్యము యీస్టిండియా కంపెనీ వారి పర మగుటయు తటస్థించెను. అప్పుడు పెమ్మసానివారి జాగీరు జమీందారీగా మారెను. ఈ పెమ్మసాని వంశమును గుఱించి మధుర తిరుచునాపల్లి రాజు యొక్క మంత్రి

యగు విజయ మీనాక్షీ నాయఁ డను నతఁడు యీస్టిండియా కం పెనీ వారి కిచ్చిన లిఖిత పూర్వక ప్రకటనలో నిట్లున్నది.

"రోయరుల (రాయలు) యేలుబడి కాలమున పెమ్మసాని వంశ పూర్వీకులు గండికోటకు పరిపాలకులై యుండిరి. ఆ స్థలము క్షీణించిన తర్వాత వారు మా రాష్ట్రములకు వచ్చి మధుర తిరుచు నాపల్లి రాజగు విశ్వనాథనాయకుని నాశ్రయించి కురువికులము జహా గీరును బడసిరి. అది మొదలు విశ్వనాథ నాయకుని పాలిత రాజ్యము లోని కురువికులపు పాలకు లగు ఈ పెమ్మసానివారు తప్ప తక్కిన పాళెగాండ్రందఱును రాజదర్శనమున కెప్పుడైన పోయినపుడు బంగా రుతోఁ గాని వెండితోఁ గాని చేసినపుష్పములును, ఒక పట్టు పుట్ట మును రాజసన్నిధి నుంచి రాజు పాదములపై వ్రాలి తమ విధేయ తను జూపుచు, మరియూందార్వముగ కొలఁది దూరమున చేతులు మోడ్చి నిలుచుండుట యాచారముగ నుండెను.

ఇఁక పెమ్మసాని నాయండ్లు ఎప్పుడైన రాజదర్శనమునకు వచ్చి రని యెఱిఁగినతక్షణమే విశ్వనాథనాయకుఁడుస్వయముగ వారి నెదుర్కొని హ స్తసంచలనమున స్వాగత మొసంగి సమాన పీఠ మిచ్చి గౌరవించెడు మర్యాద కలిగియుండెను.'' ఈయపూర్వ గౌర వమే పెమ్మసానివారి పలుకుబడిని, గౌరవమును ప్రజ్ఞావిశేషములను దెలుపుటకుఁ జాలియున్నది.

ఇఁక గండికోటను గుఱించి తెలుసుకొందము. గండికోటకు పెమ్మసాని చిన తిమ్మనృపాలుఁడే చివరి పాలకుఁ డందురు*. క్రీ. శ. 1616-72 సం॥ల మధ్య పాలించిన గోల్కొండ సుల్తాను అబ్దుల్లా యను వాఁడు తీవ్రమైన ముట్టడి సాగించి, చివరకు తంత్రముచేతనే క్రీ. శ. 1652వ సం॥ము ఆగష్టు 25వ తేదీని సంపూర్ణముగా పెమ్మ సానివారి నుండి స్వాధీన పఱచుకొనినట్లు "థీవ్‌నాట్'' పరిశోధకుని

* తాడిపత్రి కయిఫీయతు.

యభిప్రాయముగ నున్నది[†]. కృష్ణ సరిహద్దు వరకు వెంకటపతి రాయల రాజ్యముగా నుండినట్లు లోఁగడ తెలిపితిమి. క్రీ. శ. 1643వ సం॥లో మూఁడవ శ్రీరంగరాయల కాలమున గోల్కొండ సుల్తాను ఉదయగిరి ప్రాంతమునకు దండెత్తి వచ్చినపుడు బీజపూరు సుల్తానును శ్రీరంగరాయలును గలిసి యెదిరించఁగా మరలిపోయెను. 1649వ సం॥ర దాపులో రాయల రాజ్యము కొంత యాక్రమింపఁ బడఁగా, నతఁడు శ్రీరంగ పట్టణమునకు రాజధాని మార్చినట్లు కన్పడును; గాని క్రీ. శ. 1659వ సం॥లో రాయలు పెనుగొండను గూడ జయించి తీసికొనెను. ఈమూఁడవ శ్రీరంగరాయల యంత్య కాలములోనే గండికోట తుదకు మహమ్మదీయ పరమై యుండును. ఈరీతిగ గండికోట పాలనము కమ్మవారి హస్తములనుండి జారి పోయెను.

## —♦ యేర్లగడ్డవారు-దేవరకోట సంస్థానము ♦—

### యేర్లగడ్డ గుర్వారాయుఁడు (లేక) గుర్వినీఁడు

యేర్లగడ్డవారి చరిత్రము 15 వ శతాబ్దము వరకును దెలియుట లేదు. వీరు రేచర్ల గోత్రీకులు. తళ్ళికోట యుద్ధానంతరమున కొండవీటి సీమ గోల్కొండ నవాబును, కుతుబ్షా వంశజుఁడు నగు ఇబ్రహీం కుతుబ్షా పాలనక్రిందికి వచ్చినట్లు లోఁగడ చదివితిమి. అతఁడు దనచేతి క్రింద ననేక దేశముఖులను జమీందార్ల నేర్పఱచినట్లు కనుబడును. ఈ ఇభరాం పాదుషా క్రీ. శ. 1592 వ సం॥వరకును పాలించుచున్నట్లాతని సేనాధిపతులలో నొకఁ డగుఅమీర్‌ముల్కు వ్రాయించిన అమీనాబాదు శాసనము తెలుపుచున్నది.

క్రీ. శ. 1576 వ సం॥ర ప్రాంతమున యేర్లగడ్డ వంశములో మిక్కిలి ప్రసిద్ధిగా నుండిన యేర్లగడ్డ గుర్వారాయుఁ డను గుర్వినీఁడు దేవరకోట సంస్థాన పాలనమును సంపాదించినట్లు కృష్ణాజిల్లా

---

† తాడిపత్రి కయిఫీతు పీఠిక. శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు.

మ్యాన్యుయల్‌లో వ్రాయఁబడి యున్నది. ఆతఁడీ యిబ్రహీం కుతుబ్షా వద్దనే జమీా సంపాదించియుండును.

గుర్వారాయుఁడు సంస్థాన పాలనమును క్రీ.శ.1607వ సంllము వరకు నొనర్చెను. ఈయన పాలనా విశేషములు మనకుఁ దెలియవు. ఈయన క్రీ.శ. 1627వ సంll వరకును బాలించిన ట్లొక యభిప్రాయము గలదు.* ఈయనకు తిరుమలనీఁడు, గంగినీఁడు, కంచినీఁడు అను ముగ్వురు పుత్రు లుదయించిరి, గుర్వారాయని తర్వాత నాతని జ్యేష్ఠ కుమారుఁడగు తిరుమలనీఁడు రాజ్యమునకు వచ్చి క్రీ. శ. 1665 వ సంllము వరకును 57 సంllలు పాలించి యప్పటి గోల్కొండ నవాబు (అబ్దుల్లాకుతుబ్షా) వద్ద (దేశముఖ్ వాక్కులతో) నొక సనదును పొందినట్లు కృష్ణాజిల్లా మ్యాన్యుయల్ నుడువుచున్నది. ఈ వంశీకుల తర్వాత చరిత్ర మూఁడవ భాగమున వ్రాయఁబడును.

## —♦ నల్లా గురవయ్య ♦—

ఈయన శాలివాహన శకము 1539 వ సంllర ప్రాంతీయుఁడగు ప్రసిద్ధ పురుషుఁడు. ఈయన వేలూరివద్దఁ గల బావాజీకొండపైఁ గల దేవాలయములలోఁ గొన్ని దానము లొనర్చి నాలుగు తెలుఁగు శాసనములు వ్రాయించెను. ఆ శాసనము లన్నియు శిథిలావస్థలో నున్నందున నతఁ డెట్టి కార్యము లొనర్చెనో తెలియుటకు వీలు లేకున్నది. ఈ శాసనములు పింగళి సంవత్సరము (శా. శ. 1539 వ సంll)లో వ్రాయఁబడినవి. * రాయ వేలూరులో నితఁడు ప్రసిద్ధుఁడుగా నున్నట్లు పై శాసనములను బట్టి మనము గ్రహింపవచ్చును.

## —♦ ఉద్దండ నాయఁడు ♦—

ఈతఁడు పెమ్మసాని రామలింగా నాయని బంధువులలో నొకఁడుగాఁ బ్రసిద్ధి వహించెను. అందుచే 16 వ శతాబ్దములోని

---

* నానారాజన్య విఖ్యాతజన చరిత్ర చూడుఁడు.

• S. I. I. Vol. I పుట. 76·

వాఁడు. రామలింగ నృపాలుఁడు తాడిపత్రిలోఁ గట్టించిన కోట యందు కొంత కాలముండిన పిదప పెదతిమ్మా నాయఁడు గండికోట సీమ వ్యవహ ర్తయై నప్పుడు, తాడిపత్రి కోటలో నీ ఉద్దండనాయఁడు వ్యవహారములను జూచుచు ప్రఖ్యాతి వహించినట్లు, తాడిపత్రి కయి ఫీతు తెలుపు చున్నది. ఈయన యచటి పెన్నబడి నూగాని భూము లను విచారించుచు వచ్చెను.

## — యేనుఁగుల చన్నానాయుఁడు —

ఈయన పెమ్మసాని పెద తిమ్మానాయని బంధువులలో నొకఁడు. అందుచే దాదాపు క్రీ. శ. 1530 వ సం॥ర ప్రాంతీయుఁ డనవచ్చును. ఈయన తాడిపత్రికి రెండు క్రోసుల దూరములో గాండ్లపా డను గ్రామమును గట్టించుటయే గాక యచట బక్క చన్నారాయణస్వామి దేవళమును తిమ్మానాయని తండ్రి పేరిట కాఁబోలు కట్టించినట్లు కనుబడును. చల్లావారు అనే కమ్మవారు వ్యవసాయము చేయు చోట నితఁ డొక పల్లెను గట్టించెను. అది చల్లావారి పల్లె యని ప్రసిద్ధికివచ్చెను.

## — సాయపనేని వెంకటాద్రి నాయనింగారు —

ఈయన శా. శ. 1291 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయనకు పొదిలి తాలూకా గురాల మడుగు గ్రామంలో అమరం ఉండెను. దీనిలో కొంతభూమి నితఁడు కోరు సూరామిశ్ర రఘుపతీశ్వర శాస్త్రులకు దానమిచ్చి శాసనము వ్రాయించి ప్రసిద్ధికివచ్చెను. ఈ వంశీకులు దూపాటి సీమను పాలించుచు వచ్చినట్లు గూడ కనుబడు చున్నది. ఈ చరిత్రము ముందుఁ గలదు.

## — మిక్కిలినేని నల చన్నానాయుఁడు —

పెమ్మసానివారి బందుగులలో నొకఁ డగు నీతఁడు 16వ శతాబ్దమున తాడిపత్రిలో ప్రసిద్ధి వహించెను. తాడిపత్రికి సామీప్యమున నితఁ డొక పల్లెను గట్టించెను. ఆపల్లె ప్రక్కనే తూర్పు నాయని

-వారి సోదరియగు శానమ్మయొక చెఱువునుద్రవ్వించెను. అచటజమ్ము విస్తారముగా పెరుగుటచే నా పల్లెకు జంబులపా డను పేరువచ్చెను.

## —♦ జూపల్లి రామానాయనిం గారు ♦—

ఈయన శా.శ. 1448వ సం॥ర ప్రాంతీయుఁడగు నొక యోధాగ్రేసరుఁడు. ఈతఁడు కావలితాలూకాలో కొంతభాగమును పాలించుచు వచ్చెను. ఈపాలనము కృష్ణదేవరాయల కాలములోనిదే. ఈయనకు "కరవాల భైరవ, గండరగండ, గండభైరవ గండ, ఉద్దండ పులియ మార్గాలు గండ, కటకహన్నిబ్బర గండ, హత్తు మువ్వరగండ ధీరసామంత, బారామండలీకర గండ, దుష్టగోకుల మానమర్దన, రణమునం బెక్కండ్రు నాయంకుల కొట్నుత్తుగండ, దివిచూఱకార" మున్నగు బిరుదులున్న ట్లితఁడు వ్రాయించిన తంగెళ్ళ గ్రామము లోని ధర్మశాసనము వల్లఁ దెలియుచున్నది. ఈతఁడు పాల్గొనిన రణరంగములను గుఱించి గాని, జయించిన మాండలికుల విషయము గాని నిర్ణయించుట కాధారములు కన్పడవు¶. ఈ జూపల్లివారు కమ్మవారిలోను, వెలమవారిలోను గలరు. ఈతఁ డే శాఖీయుఁడో తెలియుట కాధారములు లేవు.

## —♦ కిలారి తల్లయ్య ♦—

ఈయన శా.శ.1466వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయనతండ్రి పేరు కొండమ నాయఁడు. ఈతఁడు కావలి తాలూకా రావుల గుంట వక్కలగుంటలకు అధిపతిగా నున్నట్లు కన్పడు చున్నది. ఈయన యచ్చటి దేవునకు రావులగుంటలో 4 గొర్లచేనును, వక్కలగుంటలో 5 గొర్లచేనును దానమిచ్చి శాసనము వ్రాయించి కీర్తి వహించెను†.

## —♦ సూర్యదేవర వారు ♦—

సూర్యదేవరవారు క్రీ.శ. 1500 సం॥ర ప్రాంతము నుండియు పులివఱ్ఱుసీమ 50 గ్రామములకు పాలకులుగా నున్నట్లు కన్పడు

¶ N. I., K. 83 † N. I. K. 25

చున్నది. ఇది యిప్పటి రేపల్లె తాలూకాలోనిది. వీరు తెలుఁగు చోడ శాఖీయు లని లోఁగడఁ దెలిపితిమి. ఈ వంశీకులకు "ఒరయూరిపుర విహార, ఒరయూరి శ్రీపాదపద్మారాధక, పులియ తలాటరాయ, గండభేరుండ, పులియమారొక్కలుగండ, గండరగండ, కరవాలభైరవ, రాజీవచూరాకార, విశాఖపట్టణ తలగుండు గండర, కటకహన్నిబ్బరగండ, సప్తదివిచూరాకార, కదన ప్రసంగ"మున్నగు బిరుదము లున్నట్లు కొన్ని చాటువులు తెలుపుచున్నవి. వీరికి వెండి కోర తాంబూలమును, పసిఁడికోర శాసయు, కనకదండ అందలము, హనుమంతుని ధ్వజమును గల్గి యుండు మర్యాద యుండెడిదఁట. వీరిది విష్ణువర్ధ గోత్రము. పులివట్టుసీమ వీరి పాలనములో వృద్ధి నొందెను. ఇది సముతు అని లోకలు రికార్డు నుడువుచున్నది.

## —♦ సూర్యదేవర తిమ్మనృపాలుఁడు ♦—

ఈతఁడు పులివట్టు సీమ నేలుచు నందు రాచూరు, పేటేరు కోటలను గట్టించినట్లు చాటువులు తెలుపుచున్నవి*. ఈయన కుమారుఁడగు ముసలయ నాయకుఁడు కృష్ణదేవరాయలు గజపతులతోఁ బోరాడిన కాలములో జరిగిన అరట్ల కోట యుద్ధములోఁ బాల్గొనిన ట్లొక చాటువు చెప్పుచుండుటవల్ల నితఁడు దాదాపు క్రీ.శ. 1490వ సం॥ర ప్రాంతీయుఁడని చెప్పవచ్చును†. ఈ వంశీకులలోఁ గొందఱు వీరాగ్రేసరులు అత్తలూరు బయలున జరిగిన యుద్ధములో గజపతుల యేనుఁగులతోఁ దలపడి పోరిరనియు, నాపోరాటము యేడుపగళ్లు జరిగెననియు, నందు జయించినందుననే పైన నుడివిన మర్యాదలు శ్రీకృష్ణదేవరాయ లొసంగినట్లును వారి ప్రశస్తి వలనఁ దెలియ బడుచున్నది. వీరి బిరుదములలో 'విశాఖపట్టణ తలగుండుగండర'

---

* "పులివర్తి సీమకు - భూపతిత్వము నంది । మేటి వదాన్యులై - మించినారు।
పేటేరు రాచూరు-కోటలు గట్టించి । శత్రురాజుల చేత _ శరణు గాంచు॥"

† "గండరగండ నీ - ఘన తురంగము నెక్కి । అరట్లకోట పో-రాడినాడు।"

యుండుటచే+ వీరు గజపతితోఁ బోరాడుటకై యాప్రాంతముల కేగి నట్లు స్పష్టపడుచున్నది. తిమ్మనృపాలుఁడు గూడ పై యుద్ధములలో నుండి యుండును. ఈయనకు యెఱ్ఱనృపాలుఁడు, ముసలయనాయకుఁ డను నిర్వురు కుమాళ్ళు గలరు. కొందఱు యెఱ్ఱ భూపాలుఁ డీతని సోదరుఁ డని తలంచుచున్నారు. తిమ్మనృపాలుఁడు వీరనరసింహ దేవరాయల సామంతుఁడై యుండును. ఈయన పై బిరుదులఁ గొన్నిఁటిని వహించినట్లు కనుబడుచున్నది.

## —♦ సూర్యదేవర యెఱ్ఱ నృపాలుఁడు ♦—

తిమ్మభూపతి తర్వాత పులివర్తిసీమ కితఁడే పాలకుఁడయ్యెను. ఆయన వలెనే యీతఁడుగూడ మిక్కిలి పరాక్రమ శాలియై యుండెను. ఈయన తిమ్మనృపాలుఁడు ధరించిన బిరుదుల నన్నిఁటిని ధరించెను. ఈ వంశీకులకుఁగల బిరుదులలో నడుమ నీ "పెక్కండ్రు నాయకుల నక్కత్తురగండ, మహిమతో ఘోడికరవాల భైరవ, దుష్ట గోప గోగుల మారిమర్దన, దర్పితారాతి ఘూమకేతు, హితహితి" మున్నగునవి గూడఁ గలవఁట.

ఈయన పేరిఁట గల యొక చాటు వీక్రింది విధమునన్నది:

"సీ॥ కల్పాంతరస్థాయి - గండభేరుండాంక. పటుఖర కరవాల - భైరవాంక
కుశలంబు విప్పర్ల - గోత్రాబ్ధి హిమధామ. శ్రీలందు పులియమా-రోకలుగండ
వినుత సత్కీర్తిచే - వెలయు గండరగండ. కుధమస్తు రాజీవ - చూఱకార
కౌమలొప్ప సభిమాన - ఘోడియ బిరుదాంక- లాలిత పులియత - లాటరాయ
గీ॥ అనుచు నిన్నును భాషింతు - రర్థిపరులు, పటువచోయాధి నఖిలభూ-పాల సభల
భూరిగుణహార ! యొరయూరి-పురవిహార, భళిర సూర్యదేవరతిమ్మ-ప్రభునియెఱ్ఱ॥"

## —♦ సూర్యదేవర ముసలయ నాయకుఁడు ♦—

ఈయన సూర్యదేవర తిమ్మనృపాలుని పుత్రుఁడు. ఎఱ్ఱ నృపాలుని యనంతర మితఁడు పులివర్తి సీమకు పాలకుఁ డయ్యెను. ఇతఁడు ఆరట్ల కోటవద్ద జరిగిన యుద్ధములోఁ బాల్గొని శత్రువులను

---

+ ఈ వంశప్రాశస్త్యికి కమ్మ మహారాజు పత్రిక 2-4-37 చూడుఁడు.

బారఁగ్రోలి తన పరాక్రమమును గనుపఱచె నని యీక్రింది చాటు పద్యము తెలుపు చున్నది.

"సీ. గండరగండ నీ - ఘనతురంగము నెక్కి. ఆరట్లకోట పో - రాడు నాఁడు
కరవాల భైరవ - కైవాలు ఝళిపింప। క్షితిని పగతురు - బెదరి చవిరి
పులియతలాటంక-జెలఁగి బల్లెంబెత్త. శరణంచు రిపులు హ - స్తమ్ము లెత్త
విప్రర్ల సింహంబు - విల్లు చేబూనిన. నరివర్గముల గుండె - లదరుచుండు

గీ. నేర్చినారలొ కాకున్న - నిన్ను గదిసి. భుజ సమగ్రత నెదిరించి - పోరదరమె
ప్రథననిశ్శంక సూర్య దే - వరశశాంక. తిమ్మభూపాల సత్పుత్ర - ధీపవిత్ర
నఖ్య గుణోపేంద్ర ముసలయ-నాయకేంద్ర."

ఈ తిమ్మ భూపాలుఁడును, యెఱ్ఱ నృపతి వహించిన బిరుద ముల నన్నిఁటిని వహించెను. ఈయన కృష్ణదేవరాయుల పాలన కాలములోని వాఁడుగాఁ గన్పడు చున్నాఁడు. అందుచే నితఁడు క్రీ. శ. 1520 వ సం॥ర ప్రాంతము వాఁ డన వచ్చును. ఈయన యుద్ధ మొనర్చిన ఆరట్ల కోట యుద్ధము గజపతులకును కృష్ణదేవ రాయలకును జరిగినదై యున్నది. అల్లసాని పెద్దన మహాకవి రచి తమైన యొక చాటువృనం దీ యుద్ధమును గుఱించిన ప్రశంస గలదు. ఆపద్య మిట్లున్నది:

"సీ. రాయరావుతుగండ - రాచయేనుఁగు వచ్చి. యారట్లకోట గో- రాడు నాఁడు
సంపెట నరపాల - సార్వభౌముఁడు వచ్చి. సింహాద్రిజయశిల - జేర్చునాఁడు
సెలగోలు సింహంబు - చేరి ధిక్కృతిఁగంచు. తల్పుల గరుల డీ - కొల్పునాడు
ఘనతర నిర్భర - గండపెండెర మిచ్చి. కూతురాయలకును - గూర్చునాఁడు

గీ. ఒడ లెఱుంగవొ చచ్చితో - యుర్విలేవొ. చేర జాలక తలచెడి - జీర్ణమైతొ
కన్నడంబెట్లు సొచ్చెదు-గజపతీంద్ర.తెలిచి నిలు కుక్క-సొచ్చిన-తెలుఁగుదోప."

ఈ వంశీకుల తర్వాత విషయము కొంతకాలము వరకు దెలియుటలేదు; గాని లోకలు రికార్డు, సంపుటము 41 పుట 471లో నీ వంశములోని నరసింహ నృపాలుఁడు (చివరివాఁడు) పులివట్టు సముతు 50 గ్రామములకు చౌదరీ తనము చేయుచూ వచ్చినట్లు గలదు. లోకలు రికార్డును విశ్వసించినచో, మొగలు ప్రభుత్వ కాల

ములో నేర్పడిన చౌదరీతనము దాదాపు క్రీ. శ. 1640 వ సం॥ర ప్రాంతముదై యుండి యీ శతాబ్దినే యీ నరసింహ నృపాలుని పాలన జరిగి యుండును. ఈయన పాలనను గుఱించి మూఁడవ భాగమున వ్రాయఁబడును.

క్రీ.శ. 1690వ సం॥ము నాఁటికి పులివఱ్ఱు సీమ రాచూరుకోట సహా వెలమ ప్రభువులకుఁ జేరిపోయినట్లు కనుబడు చున్నది. ఈ రాచూరు కోటలో సూర్యదేవరవారి బురుజొకటి యుండెననియు, దానినిటీవల ప్రాఁతజమీందారుత్రవ్వించి వేసినట్లు తెలియుచున్నది. క్రీ. శ. 1690 వ సం॥లో ఔరంగజేబు చక్రవర్తి ఢిల్లీ సామ్రాజ్యమును పాలించు చుండఁగా, హైదరాబాదులో నాతని సేనాధిపతులగు గోహల్లాఖాను, భసరత్ ఖానను వారలు మూర్తజానగరనఁబడు కొండవీటిసీమ పాలన మంతయు వెలమ ప్రభు వగు మాణిక్యారావు రామారావుగారి కొసంగిన శ్లోక పత్రమొకటి యుండె నని కృష్ణాజిల్లా మ్యాన్యూలులో గలదు. అందుచే సూర్యదేవర ప్రభువుల పాలన మీ పులివఱ్ఱు సీమలో క్రీ. శ. 1640—90 సం॥ల మధ్య యెప్పుడో అంతరించియుండును. కాని కృష్ణాజిల్లా మ్యాన్యూలులో కృష్ణదేవరాయల కాలము నుండియు మాణిక్యారావు వంశజులే పాలించు చున్నారని చెప్పుచున్నట్లు వ్రాయఁబడినది. ఇది పైన నుడివిన చరిత్రకు భిన్నముగ నుండుటచే విశ్వసించుటకు వీలుగాదు.

## —♦ మేదరమెట్టవారు ♦—

## మేదరమెట్ట నరస భూపతి

మేదరమెట్టవారు తమ్మలూరు గోత్రస్థులు. వీరి చరిత్రము 15 వ శతాబ్దాంతము వరకెచ్చటను గోచరించుటలేదు. ఈ వంశములో క్రీ. శ. 1520వ సం॥ర ప్రాంతమున మేదరమెట్ట నరస భూపతి యను పాలకుఁ డున్నట్లు గన్పడుచున్నది. ఈతఁడు పువ్వు-

నూరి పురవరాధీశ్వరుఁ డని పేరొందెను. ఈయన తండ్రిపేరు అయ్యలరాజువరపు ఔబలరాజు. ఈయన గజపతి రాజునకు (ప్రతాపరుద్రగజపతి కాఁబోలు) సాహాయ్య కర్తయై యుండెననియు మహమ్మదీయ సుల్తాను గర్వ మపహరించె ననియుఁ గొన్ని చాటువులు నుడువుచున్నవి. ఇంతేఁగాక యీయనకుఁ గల బిరుదములలో "గజపతిమన్నీఁడు, రాచూరి దుర్గాపహారుం" డను నవి గలవు. అందుచే క్రీ. శ. 1520 వ సం॥ర ప్రాంతమున కృష్ణదేవరాయల కాలములో జరిగిన రాయచూరు యుద్ధమున నితఁడు పాల్గొనెనేమోయని తోఁచుచున్నది. అప్పుడు గజపతి కృష్ణదేవరాయలకు సహాయపడెనా యని యనుమానింపఁదగి యున్నది. ఈయనకు "కొండమ నాయకుల మగఁడు, కోటలగొంగ, సురతాణు, గజపతి మన్నీఁడు, రాజ వేశ్యాభుజంగుఁడు, రాచూరి దుర్గాపహారుఁడు, కేళాదిరాయఁడు, గగ్గోలు రాయాంకుఁడు" మున్నగు బిరుదులు గల వని కొన్ని చాటువులు తెలుపుచున్నవి. ఈయనకు రమణభూపాలుఁ డను కుమారుఁ డుండెను. ఈ వీరాగ్రేసరుని యుద్ధ నైపుణ్యము నొక కవి యిట్లు వర్ణించియున్నాఁడు.

"సీ. కాల్బంటుల మీఁద - ఖడ్గంబు వేయఁడు, రాయరాహుత్తుల - వేయు గాని
యాధి కెక్కిన హయా - రూఢులఁ డాయఁడు, వీరసాహసులను - వేయుగాని
వెన్నిచ్చి పరచు భూ-విభుల వెంటాడించఁ, డెదురించు రిపులపై-నెక్కుగాని
సామాన్య యోధుల-సరకు సేయం డాజి,మించు నెక్కుడుకాంద్ర-దించు గాని

గీ. వెఱచి పఱచిన గుఱ్ఱులు-కఱచి నుఱచి, గట్టు లెక్కిన నఱచిన-గాచు రిపుల
ఛళిరె! మేదరమెట్లయౌ బళిసుతుండు,మన్నెమాత్రుండె నరసన-క్ష్మావిభుండు"

## —♦ మేదరమెట్ల రమణభూపతి ♦—

ఈయన నరసభూపాలుని పుత్రుఁడు. ఇతఁడు తన తండ్రి వహించిన బిరుదుల నన్నిఁటిని ధరించెను. ఈయనగూడ తన తండ్రి తోపాటు పైనఁబేర్కొనిన యుద్ధములలోఁబాల్గొనుచు వీర పురుషుఁ డని ప్రసిద్ధికెక్కెను. ఈయన పేరిటఁ గొన్ని చాటువులున్నవి. కాని గ్రంథవిస్తర భీతి నుదాహరించుట లేదు.

## —♦ మేదరమెట్ట కొండప ప్రభువు ♦—

ఈయన మేదరమెట్ల మల్ల నృపాలుని పుత్రుఁడు. ఈయన కును పైన నుడివిన నరసభూపతికిని, రమణ భూపతికినిఁ గల సంబంధము తెలియుట లేదు. ఈతఁడు గజపతి రాజు వద్ద నొక సేనాధిపతిగా నున్నట్లు కన్పడుచున్నాఁడు. అందుచే నితఁడు 16 వ శతాబ్దము వాఁడే యున వచ్చును. ఈయనకు "సురుతాయి, కేళాది రాయ. గాంగేయశౌర్య" మున్నగు బిరుదులు గలవు. ఈయన పేరిఁట నీ క్రింది చాటుపద్య మొకటి కనఁబడు చున్నది.

"సీ. సిరిమించు సురుతాయి-బిరుదు మన్నెకుమార, భీమప్రతాప సం-గ్రామ విజయ
గజపతి సామ్రాజ్య-గజమన్నె సింహము । కేళాదిరాయ గాం-గేయ శౌర్య
కమ్మకులాధ్యక్ష-ఘన కీర్తివిస్తార । తమ్మలూరి సుగోత్ర - దాన కర్ణ
సత్య హరిశ్చంద్ర - నిత్యాన్న వరదాన । ఘటకవి సంస్తుత్య-బంధు మిత్ర

గీ మిత్రజన పోష మేదర - మెట్ట వంశ । జలధి సారంగ లోభివే - శ్యా భుజంగ
మల్లభూపాల సత్పుత్ర-మంజుగాత్ర । దివ్య గుణగణ్య కొండప-ప్రభు వరేణ్య"

దీనిని బట్టి యీతఁడు కొన్ని యుద్ధములలోఁ బాల్గొని విజయ ములందె నని స్పష్టపడుచున్నను, కాలగర్భమునఁబడిపోయిన వానిని గుర్తించుటకు వీలు కలుగుట లేదు. వీరి తర్వాత చరిత్ర తెలియుట లేదు.

## —♦ మేదరమెట్ట సింగినాయఁడు ♦—

ఇతఁడు శా. శ: 1440 వ సం॥ర ప్రాంతీయుఁడు. ఇతఁడు పొదిల తాలూకా చిలమకూరిసందు గ్రామకాపురస్థుఁడు. ఆ సంవ త్సర మీతఁ డాగ్రామమున పొలిమేర హద్దు లేర్పడు నపుడు పొలి మేర నడిచి స్థాపించినందులకై యచటి కైలాసనాథభీమ సంస్థా నికులు 10 కుంటలు వరిచే నిచ్చిన ట్లొక శాసనము వ్రాయఁబడి నది. * ఇది యాకాలపు టాచారమును దెలుపుచున్నది.

* N. I. P. 5.

ఈ మేదరమెట్ల వారిది తమ్మలూరు గోత్రము. ఈ వంశీకుల తర్వాత చరిత్రము మూఁడవభాగమున వ్రాయఁబడును.

## —♦ పురము తిమ్మానేఁడు ♦—

క్రీ. శ. 1616 వ సం॥ర ప్రాంతములో నుండిన కమ్మ యోధులలో నితఁ డొకఁడు. ఆకాలమున గొబ్బూరి జగ్గరాజునకు తంజావూరి పాలకుఁ డగు రఘునాథ నాయక రాజునకు జరిగిన తోపూరు యుద్ధములో నితఁడు పాల్గొనెను. అప్పు డీ తిమ్మానేఁడు జగ్గరాజు పక్షమున నిలచి పోరాడి తుదకు పారిపోయినట్లుగా రఘునాథాభ్యుదయ నాటకములోని యీ క్రింది ద్విపద వలనఁ దెలియుచున్నది. ఈతఁడు మధుర రాజగు ముత్తు వీరప్పనాయకుని సేనలోనుండి యీ యుద్ధమునఁ బాల్గొనెను.

"తిరువందినాపల్లి - తిత్తెప్పశెట్టి । పురము తిమ్మానేఁడు - భుజబల రావు
చిన రౌతు యెఱ్ఱమ - చెట్టి లోనైన । తనవద్ది దొరలెల్ల - తను డించిపార ॥

## —♦ సూరనాయని తిమ్మరుసయ్య ♦—

ఈయన శా. శ. 1433 వ సం॥ర ప్రాంతీయుఁడు. కృష్ణదేవరాయల కాలము నాఁటి సేనాధిపతులలో నితఁ డొకఁడుగఁ గన్పడుచున్నాఁడు. అమ్మనబ్రోలు సీమలోని కొచ్చెర్లకోట; కటక సాలుంగ పట్టు, గోనుగుంట గ్రామము లీయన నాయంకరము క్రింద నున్నట్లితఁడు వ్రాయించిన శాసనమును బట్టి కనఁబడుచున్నది. శా. శ. 1433వ సం॥న నితఁడు గోనుగుంటలోని అమరేశ్వర స్వామికిఁ గొంత భూమి దానమిచ్చి శాసనము వ్రాసెను.*

## —♦ అబ్బినేని వెంకన్న ♦—

ఈయన శా. శ. 1470 వ సం॥ర ప్రాంతము వాఁడు. ఇతని తండ్రి పేరు రామానాయుఁడు. ఈయన మహామండలేశ్వర రామరాజు తిమ్మయ దేవరాజు కార్యకర్తలలో నొకఁడుగాఁ బ్రసిద్ధివహించెను.

గూడూరు తాలూకా కృష్ణాపట్టణమున నీయన శాసన మొకటి శా. శ. 1470 వ సం॥రము నాఁటిది కనఁబడుచున్నది.

## —♦ కూరపాటివారు ♦—

### కూరపాటి అయ్యప నాయఁడు

ఈయన కృష్ణదేవరాయల పాళెగాండ్రలో నొకఁడుగాఁ బ్రసిద్ధికెక్కెను. ఈయన యెచట పాలించుచు వచ్చెనో వివరములు తెలియుట లేదు. కాని యీయన విజయనగరమునకు సపరివార ముగ వచ్చినపుడు నివసించుటకు 310 కుంటల వైశాల్యము గల పాళెముండి యున్నట్లు తెలియుచున్నది*. అందుచే నీయన క్రీ. శ. 1520వ సం॥ర ప్రాంతీయుఁడనినిర్ణయింపఁబడుచున్నది. కూరపాటివారు కమ్మవారిలో వల్లుట్ల, పసుపునూళ్ళ గోత్రీకులుగా నిప్పటికినిఁ గలరు.

## —♦ కూరపాటి గోపినీఁడు ♦—

ఈయన పలనాడు తాలూకా దుర్గిగ్రామ కాపురస్థుఁడు. ఇతఁడు శా. శ. 1475వ (క్రీ. శ. 1557 వ) సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన తండ్రి పేరు మాదయ్య. ఈయన వైష్ణవ భక్తుఁడు. ఈయన పూర్వీకులు పెదకూరపాటిలో నుండిరి. కాకతి గణపతి దేవచక్రవర్తి కాలమున దుర్గి గ్రామములో వంకేశ్వరస్వామి యాలయ మొకటి వాయిపండితుఁ డను నతఁడు కట్టించెను. ఆ మార రమి మున్నూరేండ్లు కాదేవళ స్తంభముల తాళ్ళు పగిలిపోఁగా, నీ ధర్మాత్ముఁడు శా. శ. 1475 వ సం॥ము సరియగు ప్రమాదీచ వత్సర మున క్రొత్త స్తంభములను దయారు చేయించి ప్రతిష్ఠించి శాసన మొకటి వ్రాయించి పేరొందెను.† ఆ శాసనమున నీక్రింది పద్యము గలదు.

"సీ॥ కాకితా(ం)న్వయు-డైన గణపతి దేవని । పండితుం డగు వాయి-పండితుండు
యేపార దుగ్గె వం-కేశ్వర దేవుని । ప్రతి నూత్న నగర-ప్రతిష్ఠ శేశె

* భారతి - శుక్ల సంపుటము-పుట. 624.  † శాసన పద్య మంజరి

క్రితము మున్నూరేండ్ల-క్రిందట ఇప్పుడా। నగరి కంభము తాలు-పగిలియున్న మలిపించ్చి తెప్పించి- నిలిపించె కంభముల్ । తలఁప గోచరమైన-తరమునెత్తి॥

గీ॥ జగతి ఆచంద్ర తారాక్కముగ-మగుడు నెరయ। నిఖిల జను లలర ప్రఖ్యా-తిని వహించె|పరమ వైష్ణవ సజ్జన-పారిజాత। కోరి సద్గుణమరి పెద-కూరపాటి। దీపితోదారి మాదయ-గోప శవురి॥ "

ఈగోపినీఁడునకును పైన నుడివిన అయ్యప నాయకున కేమైన సంబంధ ముండినదియు లేనిదియు తెలియుట కాధారములు దొరకుట లేదు.

## —♦ అడపా వారు ♦—

### అడపా కూనయ నృపాలుఁడు

అడపావారు చాళుక్య వంశమునుండి యేర్పడి యుందు రని లోఁగడ నుడివితిమి. వీరి బంధువులగు మచ్చవారు గూడ నా శాఖీయులే. వీరు ముదునూరు గోత్రీకులు. వీరి వృత్తాంతము 14వ శతాబ్దము వరకును దెలియుట లేదు. 15వ శతాబ్దమున నీ వంశములోని కూనయ నృపాలుఁ డను నతఁడు మిక్కిలి ప్రసిద్ధికి వచ్చి గజపతి రాజునకు కుడిభుజముగా నుండి కొండపల్లి, కొండవీడులను బాలించినట్లు ఆతనికి 5వ తరమువాఁ డగు అడప నారభూపతి, బేతపూడి కృష్ణయ మంత్రిచే వ్రాయించిన జానకీ రాఘవ మను ప్రబంధములోని యీ క్రింది పద్యములవల్లఁ దెలియఁ గలదు. వీ రప్పటికి మిగత కమ్మవారి వలెనే విష్ణుపాదోద్భవుల మనియే చెప్పుకొనిరి.

"శా॥ శ్రీలక్ష్మీ రమణీశ పాదయుగ రా - జీవంబునం బుట్టి గం
గా లీలావతి తోడఁబుట్టు వయి లో - కా లోక పర్యంతముఞ్
బాలించుం ధరణీతలం బడఁప కూ - నయ్య క్షమా నాథుఁ డు
ద్వేల శ్రీకర కమ్మ సత్కులమునం - దీపించు సత్కీర్తులఞ్॥

గీ॥ కనక మణిమయ భూషణ-గజతురంగ।మౌక్తిక ఛత్ర చామర-మకర టెక్కెములను విద్యాధరునిచేత-నెలమినందె|నతఁడు గజపతి కుడిభుజ-మనఁగ మిగుల॥

గీ॥ కొండపలి కొండవీడు ల-ఖండవైభ । వమున నాఖండలుని రీతి-నమర నేలె
తనదు కీర్తి ప్రతాప సు-ధాంశుపద్మ । హిత ఘనప్రభ బ్రహ్మాండ-మెల్ల నింప॥"

కొండవీఁడు సీమ రెడ్డిప్రభువుల పాలనానంతరము దాదాపు క్రీ. శ. 1432వ సం॥ము నాఁటికి విజయనగరరాజ్యాధిపతియగు హరిహరరాయల క్రిందికి వచ్చి, మధ్యమధ్య దేవరకొండ రాచకొండ పాలకు లగు వెలమ ప్రభువులచే నాక్రమింపఁ బడినను, యెట్లైననేమి క్రీ. శ. 1447 వ సం॥ము వరకు విజయనగర పాలకుల క్రిందనే యుండెను. అప్పటికి రెండవ దేవరాయలు పాలించు చుండెను. ఆయన యా సంవత్సరము చనిపోయిన తర్వాత కొంత కాలములోనే మహా శూరాగ్రేసరుఁ డగు కపిలేశ్వర గజపతి యాక్రమించి నట్లు గన్పడు చున్నది. క్రీ. శ. 1460 వ సం॥ము నాఁటికి కొండవీటిలో యాతని పాలన మున్న ట్లాధారములను జరిత్రజ్ఞులు గుర్తించిరి. అడపా కూనయ నృపాలుఁ డీ కాలము వాఁడై యుండి, గజపతి యొనర్చిన దండయాత్రలలోఁ బాల్గొను చుండినట్లు గ్రహింప వచ్చును. వానిలో జయ మొందినందుననే గజపతి యీయనకు పైన నుడివిన సమ్మానము లొసంగినట్లు కనుబడును. ఈయనకు పెదతిమ్మ విభుఁడు, పినయ్య యను నిర్వురు శూరాగ్రేసరు లగు పుత్రు లుదయించిరి. వీరు గూడ నా గజపతి సామంత నృపాలురుగనే మెలంగి రనవచ్చును.

## —♦ అడపా పెదతిమ్మనృపాలుని వంశము ♦—

పైన నుడివిన పెదతిమ్మ నృపాలునకు దశావతారము లన్నట్లు పదిమంది కుమాళ్ళు జనించిరి. జ్యేష్ఠుఁడు అక్క నృపాలుఁడు. తర్వాత మల్లవిభుఁడు, కూనప్ప, నరసింహుఁడు, తిమ్మన్న, తెనుంగురావు, కృష్ణమనీఁడు, వసంతరావు, గోపశౌరి, చినఅక్క నృపాలుఁ డను సోదరులు గల్గిరి. ఈ తమ్ము లందరు గొల్చు చుండఁగా, అక్క నృపాలుఁడు పేరుఁ జెంది సర్వమాంబ యను సతీమణిని పెండ్లాడి యందువలన చినతిమ్మ నృపాలుని గాంచెను.

## —♦ అడపా చినతిమ్మభూపతి ♦—

ఈయన పాలనా విశేషములు దెలియుట లేదు. ఈతఁడు బత్తుల భీమనృపతి తోఁబుట్టు వగు అనంతమాంబను బెండ్లాడి అక్కవిభుఁడు, నృసింహుఁ డను నిర్వురు కుమాళ్ళను గాంచెనఁట. ఇందు నృసింహ భూపతి మిక్కిలి ధర్మాత్ముఁ డనియు, ప్రతాప శాలి యనియుఁ జెప్పఁబడినది. ఈతఁడు మచ్చకొండ నృపాలుని పుత్రిక యగు తిరుమలమ్మను, పేరమ్మ యను నామెను బరిణయమై తిరుమలాంబ వలన రాయనృపాలుఁడు, నారప నృపాలుఁ డను వారలను; పేరమ్మవలన అనంతినృపాలునిఁ గాంచెను. వీరిలో జ్యేష్ఠుఁడగు

## —♦ అడపా రాయనృపాలుఁడు ♦—

రాయనృపాలుఁడు మిక్కిలి ప్రసిద్ధుఁడై యనేక యుద్ధములలోఁ బాల్గొనినట్లీ క్రింది పద్యమున శ్లేషాలంకారమున వర్ణింపఁబడినది.

"సీ॥ ముసలి యంచును కడ-ముట్టఁ జేసెను గాక। బలుని కాంచీదేశ-మలమికొనఁడె?
ద్విజ రాజటంచు వ-ర్థిల్లఁ జేసెను గాక। చంద్రుని మధ్యదే-శంబు గొనఁడె?
అబల యంచును వాణి-నాదరించెను గాక। కుంతల దేశంబు-నెల్లగొనఁడె?
శ్రీ సర్వ మంగళ-ప్రియుఁడు శివుఁడని కాని। ఉత్కంఠ లాంఛన-ముడప లేదె

గీ॥ అమృత భువన నిధానంబు-యనుచుగాని। జలధి పథమెల్లఁ జేకొని-చెలఁగలేదె?
నీరజభవాండ భాండంబు-నిండి మించు.అడప నరసింహవిభుని రా-యప్పకీర్తి."

ఇందుదాహరింపఁబడిన దండయాత్ర లన్నియు కృష్ణరాయల మరణానంతరము నాఁటివేమో యని తోఁచుచున్నది.

## —♦ అడపా నార నృపాలుఁడు ♦—

అగ్రజుఁ డగు అడపారాయ నృపాలుఁ డట్లు యుద్ధములలోఁ బాల్గొని ప్రసిద్ధివహించుచుండఁగా, నాతని సోదరుఁడగు నార నృపాలుఁ డూరకుండక యాతనితోఁ గలిసి వీరవిహార మొనర్చుచు, గండ్రల రామినేస కుమార్తె యగు కోనమాంబను పెండ్లాడి, తిరుమలరాయ విభుని, గాంచినట్లు జానకీరాఘవములోని యీ క్రింది పద్యములు దెలుపుచున్నవి.

"చం॥ వనజ హిత ప్రతాపుఁ డయి-వారలలోనఁ బ్రసిద్ధిగాంచె, ౦౦
చన నగ కార్ముక స్థిరయ-శంబున నార నృపాలమౌళి పా
వన నయశాలి సద్గుణ ని-వాసిని గంగ్రల రామినేని నం
దన వరియించె గోనమను-ధాత సరస్వతిఁ బొందుకై వడిన్॥

గీ॥ దుగ్ధ వారాసి లోపల-తోయ జారి । పొడమిన ట్లుదయమ్మయ్యె-నడప నార
జనపతికి గోనమాంబందు-సకల విబుధ।రక్షణుండైన తిరుమల-రాయ విభుఁడు"

నారనృపాలుఁడు పండితగోష్ఠి విహారుఁ డగుట నొక కృతినిఁ బొందఁ దలంచి చేతపూడి కృష్ణ కవీంద్రునిఁ బిలిచి జానకీ రాఘవమును వ్రాయించి పేరొందెను. ఈ గ్రంథమును గుఱించి కవియే యందు "బహు కల్పానల్ప బంధుర సూక్తుల రచియించె జానకీ రాఘవంబు" అని వాకుచ్చియున్నాఁడు. నిజముగా నీ గ్రంథ మట్లే యున్నది. ఈ నార నృపాలుని యాస్థాన మాకవి యిట్లు వర్ణించి యున్నాఁడు.

"చ॥ హితులు పురోహితుల్ బుధ క । వీంద్రులు మంత్రులు బంధుమిత్రులున్
సతులు కళానిధుల్ భటులు । సభ్యులు గా కొలువంద మాగధుల్ ।
చతురులు నిండఁగా గొలువు । సావడి నుండియుఁ బిల్వఁ బంచె రా
జిత విభవంబు మీఱ గుణశేఖరుఁ । డూర్జిత కీర్తి ధాముఁడై ॥

ఈ వంశమువారి చరిత్ర తరువాత తెలియరాదు.

## —♦ చిరుమామిళ్ల వారు ♦—

### చిరుమామిళ్ల పెద్ద నృపాలుఁడు

చిరుమామిళ్ల వారిలో పైడికుల గోత్రికులు 16 వ శతాబ్దిలో ప్రసిద్ధిఁ గల వారుగ నుండిరి. ఈ వంశమువారు విఖ్యాత నరేంద్రుఁ డగు వాసిరెడ్డి వెంకటాద్రి ప్రభుని పూర్వీకులకు రాజబంధువులుగా 18 వ శతాబ్దినిఁ బ్రసిద్ధి వహించిరి. ఈ వంశములో క్రీ. శ. 1520వ సం॥ర ప్రాంతమున చిరుమామిళ్ళ పెద్దన్న గారత్యంత కీర్తివహించిరి. ఈయన విజయనగర సామ్రాజ్యాధిపతియగు కృష్ణదేవరాయల వద్ద నొక సేనాధిపతిగ నుండి యాయనచే గజరాజములను, మన్ననలను బొందుచు వచ్చినట్లును, బిరుదము లందినట్లును యీ వంశములోని-

పాపయ్య యనునాతఁడు 17 వ శతాబ్దమున వ్రాయించిన శకుంతలా పరిణయ మను గ్రంథములోని యీ క్రింది పద్యముల వల్లఁ దెలియుచున్నది.

కం॥ పెద్దన గారా వేలుపు। బెద్దన గా రాతి ఖ్యాతి- భృత వైభవుఁడై
పెద్దన గారా శూరుల। పెద్దనఁగా రాచ మెచ్చు - బిరుదము దెచ్చెన్.

ఉ॥ సన్నుత కృష్ణరాయ నృప- సత్తము చిత్తము రాఁ జరించుచున్
మన్నన మీఱ భూరి బహు - మానముగా గజరాజరాజిఁగై
కొన్న ఘనుండు పైఁడి కుల-గోత్ర పవిత్ర చరిత్రుఁ డౌర పె
ద్దన్న సిరుల్ పరుల్ పొగడ-నక్కడ నిక్కడ నెక్కుడై తగున్.

ఈయన నేటూరి యిమ్మడి తిర్మల కుమార సింగరార్యుల శిష్యుఁడనియు, సంగ్రామవిజయ బిరుదుగొన్నవాఁడనియు, రాయల వారి రాజకార్యము లందుండి యుఁట గొంత సామ్రాజ్యము గల వాఁడనియు నీ క్రింది పద్యము దెలుపుచున్నది.

"సీ॥ మహిమనేటూరి యి-మ్మడి తిర్మలకుమార। సింగరార్యులప్రియ-శిష్యుఁడగుచు
నాచార్య పద భక్తి- యాశ్రితావన రక్తి। గలిగి శౌర్యౌదార్య- కలితుఁ డగుచు
రాయల రాజకా-ర్యములందు నిరతుఁడై। ప్రాజ్య సామ్రాజ్య సం-భరితుఁడగుచు
ధన ధాన్య కటకమై-తన యిల్లు పర్థిల్ల। ధాత్రీసుర త్రాణ-దక్షుఁ డగుచు
గీ॥ నవని రవణించె రవణి హ్యా-ద్యాన వద్య। పద్య గద్యావళీ స్తవ్య-భవ్య నవ్య
కావ్య సంభావ్య క్షమ సంగ్రామ విజయ। బిరుదుఁ డగు చిఱుమామిళ్ళ-పెద్ద శౌరి॥"

ఈయనకు తిమ్మనృపాలుఁడను పుత్రుఁడు జనించి ప్రసిద్ధికి వచ్చెను.

## —♦ చిరు మామిళ్ళ తిమ్మ నృపాలుఁడు ♦—

చిరు మామిళ్ళ పెద్దన్న సేనాధిపతి పుత్రుఁడగు నీతఁడుగూడ రాయలకొలువులోనున్నట్లే కన్పడుచున్నది. ఈవీరాగ్రేసరుని పరాక్రమమును కృష్ణకవి శకుంతలా పరిణయమున నిట్లు వర్ణించుచున్నాఁడు.

"పంచ॥ ధరా ధరా ధరాహి వర్య - ధైర్య ధుర్య వీట్కర
స్ఫుర త్తర త్తరత్రప భా ప్ర - భూత శాత హేతి చే
విరోధిరా ట్విరోధి రాజి-ప్రీల హేలి సల్పనౌ
స్థిరామ రామ రాగుఁ డైన-తిమ్మ భూ విభుం డనిన॥"

ఈతిమ్మ నృపాలునకు వెంకటాద్రి, రామయ్యలను నిద్దరు కుమారులు జనించిరి. అందు వెంకటాద్రి వాసిరెడ్డి పద్మనాభ ప్రభునితోఁ బుట్టువగు మాదమ్మను పరిణయమై, వెంకటపతి యను కుమారునిఁ గాంచెను. ఈ వెంకటపతికిఁ గల మునిమనుమలలో నొకఁడే శకుంతలాపరిణయమును రచింపఁ జేసిన చిరుమామిళ్ళ పాపయ్యశౌరి. వీరి చరిత్రము మూఁడవ భాగమున వివరింపఁబడును. పాపయ్యశౌరి వ్రాయించిన గ్రంథమున చిరుమామిళ్ళవారి వంశ మంతయు తన కాలము వరకు వివరముగాఁ దెల్పియున్నాఁడు. ఈ గ్రంథము పిల్లవసుచరిత్ర మని కూడఁ గొన్నిచోట్ల నుతింపఁబడె నని కవుల చరిత్రమున శ్రీ వీరేశలింగము పంతులుగారు వ్రాయుచున్నారు. ఇట్టి ప్రౌఢ ప్రబంధమును వ్రాయించిన చిరుమామిళ్ళవారి కీర్తి చిరస్థాయిగ నుండఁ గలదు.

## —♦ గుమ్మడూరి వారు ♦—

## గుమ్మడూరి రామయదేవ మహారాజు

గుమ్మడూరివారు 15 వ శతాబ్దిలో ప్రసిద్ధిఁ జెందినవారు. ఈవంశీకు లిపుడు కమ్మవారిలో విండమూరను గ్రామమున నున్నట్లు తెలియుచున్నది. ఈ వంశీకులకు 15 వ శతాబ్దమున పినమెఱువలో నాయంకరము చెల్లుచుండెను. ఈ పినమెఱువ దర్శి తాలూకాలోనిది. ఈవంశములో శా. శ. 1349 వ సం॥ర ప్రాంతమున నుండిన గుమ్మడూరి కామయదేవ మహారాజు కొడుకు రామయదేవ మహారాజు తన నాయంకరములోని దొనకొండ కలాపరమేశ్వరికా గ్రామములో కొంత ధాన్యమును గ్రామములోనివా రిచ్చునట్లు కట్టడఁ జేసి యొక శాసనము వ్రాయించెను*. ఈతఁడు విజయనగరరాజ్యపాలకుఁ డగు ప్రతాపదేవరాయల సామంతుఁడు. ఈయన శాసన మా ప్రతాపదేవరాయల పుణ్యమునకై వ్రాయఁబడెను. ఈతఁడు తన పేరునకును, తండ్రి పేరునకును మహారాజ శబ్దమును,

---

* N. I., D/ 23.

దేవ శబ్దమును వాడుకొనుటయేగాక "అంత్యంబరగండాది" బిరుదులను ధరించెను. ఐనను యీతఁడొక సామంత నృపాలుఁడే యని చెప్ప వచ్చును. ఈ గుమ్మడూరివారు వాడుకొనిన దేవశబ్దమును బట్టి వీరు చోడ లేక చాళుక్య శాఖలలోని వారని యూహింపఁ దగి యున్నది.

## —♦ దా స రి వా రు ♦—

(దాసరి తిమ్మానేఁడు)

కమ్మవారిలో దాసరివారు 16 వ శతాబ్దము నుండియుఁ బ్రసిద్ధిగా నుండిన దృష్టాంతములు లభించు చున్నవి. వీరికి వల్లుట్ల, రేచర్ల, పమిడిపాళ్ళ, మారుట్ల యను నాలుగు గోత్రము లమలునందున్నవి. ఇందు మారుట్ల గోత్రీకు లగు దాసరివారు నరసరావుపేట తాలూకా పురుషోత్తమ పట్టణ ప్రాంతముల నివసించుచు వచ్చిరి. వీరికి దాసరి నారపనేఁ డనునతఁడు మూలపురుషుఁడు. ఈయనకు తిమ్మానేఁ డను కుమారుఁడు జనించెను. ఈ తిమ్మానీఁడు క్రీ. శ. 1579 వ సం॥ర ప్రాంతీయ వీరశిఖామణిగాఁ బేరొందెను. ఈయన వెలుగోటి కస్తూరి రంగపనాయనికిఁ బ్రత్యర్థిగా నుండి యాతనితో జరిగిన యుద్ధమునఁ బారిపోయినట్లు వెలుగోటివారి వంశావళిలోని యీ క్రింది పద్యమువల్ల గ్రహింప వచ్చును.

"సీ॥కొండవీ డాది వి-న్కొండ మన్నీలను, గొట్టవా కొచ్చెర్ల-కోట జేర
రాయ మన్నీల ని-ర్వటి యాఱువేలను, దునుమాడవా క్రొత్త-కనుమ లోన
రాయల కొద్దైన-రసిక తమ్మపగౌని, కప్పమందవె యొక్క-గడియలోన
బంద్రెండు వేలకా-ల్బలముతో వచ్చిన, దెగటార్పవా మట్ల - తిమ్మ ఘనుని

గీ॥ గోన వంకర్ల చల్లప-కూనపులుల । దాసరేంద్రుని తిమ్మని - దఱిమి తఱిమి
జయముగైకొన్న వెలుగోఁటి-సార్వభౌమ,విమత మదభంగయేచక్షూ-విభునిరంగ॥

ఈ యుద్ధము బహుశః బద్వేలి తాలూకా కోడూరు గ్రామమువద్ద క్రీ. శ. 1579 వ సం॥లో జరిగిన దని తోఁచు చున్నది. ఇందులోనే మట్ల తిమ్మరాజు, మున్నగు వారు తమ సేనలతోను,

యితర సామంత ప్రభువులతోను కలిసి యెదిరించి కస్తూరి రంగపనాయనితో ఘోరముగఁ బోరాడి యుండిరి. ఈ యుద్ధము తల్లికోట యుద్ధానంతరము విజయనగర పాలకుఁ డగు శ్రీరంగనాయకులు పెనుగొండకుఁ బోయి యచట రాజ్యపాలన సాగించుచుండఁగా, జరిగెనని చరిత్రజ్ఞులు గుర్తించుచున్నారు. ఆ కాలములో కొండవీడు సీమలోఁ గూడ యుద్ధములు జరుగుచు వచ్చెను. ఒక వేళ యీ తిమ్మానేఁడు కొచ్చెర్లకోట వద్ద జరిగిన యుద్ధములోనైన పాల్గొని యుండును. ఏలయన, కొండవీడు, వినుకొండ మన్నీలను రంగపనాయఁడు నోడించెనని పైన వ్రాసిన పద్యములో నున్నది. ఈయనకు నాగనేఁడను కుమారుఁడు జనించినట్లును, ఆ నాగనేనికి నూరమ్మ యను భార్యవలన గంగినీడు, నాగన్న, తిమ్మన్న, యర్రన్న యను నల్వురు సుతు లుదయించినట్లును, అందలి గంగినీడునకు అక్కమ్మ యను భార్యవలన నాగినేఁడు, చినగంగయ్య యను కుమాళ్ళు గల్గినట్లును, అందలి చినగంగయ్య వద్దెపూడి పెద్దయ్య యను కవీశ్వరునిచే వ్రాయించిన మాఘమాహాత్మ్య మను గ్రంథములోని* యీ క్రింది పద్యములవల్లఁ దెలియుచున్నది.

"ఉ॥ అతనికి తిమ్మనేఁ డుదయమై-శుభ సంయుతు నాగధన్య శా
శ్వత యశు గాంచె నా వినయ-శాలికి నూరమకున్ జనించి యు
న్నతమతి గంగయ ప్రభుఁడు-నాగన తిమ్మన యర్రనాఖ్యులున్
చతుర గుణాభిరాములయి - సన్నుతి కెక్కుచు వారి లోపలన్.

క॥ గంగాధరశరసుర———————పుంగవ పత్రాళి పవన - ఘగిన యశో
సంగతి విలసిల్లుచు పెద । గంగన ధర ప్రబల దాన - గౌరవలీలన్॥

కం॥ ఘూ సుర బంధు హిత త్రా । ణా సక్తుఁడు ధర్మ నిరతుఁ-డరి ధరణీ భృ
ద్వాసవుఁడు ప్రజ్ఞఁ దనరెను । దాసుల పెదగంగ ఘనుఁడు-ధర మే పొగడన్॥

గీ॥ అట్టి పెదగంగ విభుని యు-ద్ధాంగలక్ష్మి, అక్కమకు సుదయించి పెం-పలరి రవని
నాగినేఁడును చినగంగ-న ప్రభుండు । రామకృష్ణులరీతి సు-త్రామ విభుఁడు॥"

---

* ఈ తాళపత్రగ్రంథ మింకను ముద్రింపఁబడలేదు. ఇది మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమునఁ గలదు.

## —♦ దాసరి చిన గంగయ్య ♦—

ఈతఁడు పురుషోత్తమ పట్టణ పాలకుఁడుగా నుండిన యొక ప్రసిద్ధ పురుషుఁడు. ఈతఁడు కవిపోషకుఁడై వడ్డెపూడి పెద్దయ్య యను కవీశ్వరునిచే మాఘ మాహాత్మ్యమను గ్రంథమును వ్రాయించి కృతిఁబొందెను. ఈయన క్రీ. శ. 1660 వ సం॥ర ప్రాంతీయుఁడనియు గజపతుల సామంతుఁ డనియు, ఆంధ్రకవుల చరిత్రలో శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు నిర్ణయించి యున్నారు. ఈతఁడు హరిశ్చంద్ర (గజపతి) సేనాధిపతులలోని ముకుంద దేవుని సామంతులలో నొకఁడుగాఁ గన్పడుచున్నాఁడు. మాఘమాహాత్మ్యము ద్వితీయాశ్వాసారంభ పద్యమున నితని వర్ణించుటలో నీవిషయము సూచింపఁబడినది. ఆ పద్య మిా క్రింది విధమున నున్నది.

"కం॥ శ్రీ సార్వ హరిశ్చంద్ర మహీస్థల సుత్రామ (ప్ర)హృష్ట-హృదయాదరుణో
ద్భాసిత విభవ ముకుంద స। దా సేవాంతరంగ - దాసరి గంగా॥"

ఈయన హరిశ్చంద్ర నృపాలునిచే రత్నాంబరాదులఁ బొందినట్లీ క్రింది పద్యమువలనఁ దెలియుచున్నది. ఈ బహుమానము లేల యొసంగఁబడెనో తెలియుటలేదు.

"ఉ॥ సాంద్రయశోధనుండు హరి-శౌర్యుఁడు బాహుబలీంద్రుఁ డా హరి
శ్చంద్ర మహీతలేశుఁడు ఘృ-శంబుగ సత్యవచో నొసంగఁగా ।
చంద్ర సుగంధ పుష్ప ఘన-సంకుమ దాంబర రత్నరాజి ని
స్తంద్ర శుభోక్తి గైకొనియె-దాసరి గంగన లోక మెన్నఁగన్॥

ఈ హరిశ్చంద్ర నృపాలుఁ డొకవేళ విష్ణువర్ధన సాతోడా బెహరామహాపాత్ర శ్రీ శంకర హరిశ్చంద్ర మహారాజేమో తెలియకున్నది. శా. శ. 1518 వ సం॥ నాటి యీ శంకర హరిశ్చంద్రరాజు శాసన మొకటి పాలకొల్లులోఁ గలదు. (S. I. I., V, No 165.)

ఈ చినగంగయ్య పురుషోత్తమ పట్టణ పాలకుఁ డనుటకీ క్రింది పద్యమే ప్రమాణముగ గ్రహింపవచ్చును.

"కం॥ శ్రీ మత్పురుషోత్తమ పుర। ధామునకును కాంతి తుహిన-ధామునకును తే
జోమాన నీయ సుగుణ। స్తోమునకును వైరిశిఖరి - సుత్రామునకున్॥"

ఈచినగంగయ యాస్థానమం కవి యిట్లు వర్ణించుచున్నాఁడు.

" సీ॥ అతులిత శాస్త్రోక్తి-హాసంబు లొకవంక । నొకవంక దండ నా-యక గణంబు
తత చతుర్విధ వేద - తత్వజ్ఞు లొకవంక । నొక వంక నిపుణశా-బ్ది కచయంబు
ప్రకటిత ప్రౌఢతా-ర్కిక బృందమొక వంక, నొకవంక జతుర వా-క్సుకవి నికర
మకళంక పౌరాణి - క కదంబ మొకవంక । నొకవంక జ్యోతిష - ప్రకరవేత్త

గీ॥ లొక్క చో బంధు నిచయంబు - లొక్కయెడ స, మగ్ర సామంత- విసరంబు
మహిమ గొలువఁగొలువు కూటంబునందుండి - కలిత రచన, గౌరవము మీర
సధికులఁ - గాంచి పలికె."

ఇందు కొంత యతిశయోక్తిగా భావించినను, మొత్తము మీఁద నీతఁ డొక సామంత నృపాలుఁ డనియే చెప్పవచ్చును. ఈతనికి కృతి నొసంగిన గ్రంథకర్త యగు వడ్డెపూడి పెద్దయ్యయే చినవొడ్డెపూడి పురనాథుఁ డనియు, వెంకట మంత్రికి పేరమాంబకు జనించిన వాఁ డనియు, నా గ్రంథములోని యీ క్రిందిపద్యము తెలుపుచున్నది.

"చ॥ వినుత సమస్త భూ భుజుని - వెంకట మంత్రికి పేరమాంబకుఁ
దనయుని పుణ్యవర్తనుని - దాన గుణాన్వితు నారసింహ్వ స
ద్వనరుహ చంచరీకుని న - వార్య వచో రచనా విశారదు
న్నను చిన వొడ్డపూడి పుర - నాథుని పెద్దకవీంద్ర చంద్రునిఁ॥"

ఈ గంగినీఁడు చౌదరి పట్టభద్రుఁ డనియు, కోదండరామ స్వామిని ప్రతిష్ఠించిన వాఁ డనియు, వన ప్రతిష్ఠ, తటాక ప్రతిష్ఠ మున్నగు నిర్మాణము లొనరించిన ధర్మాత్ముఁ డనియు నీ క్రింది పద్యము తెలుపుచున్నది.

"సీ॥ సహకార పనస కే-సర నింబ జంబీర । సరళాది భూరుహో-త్కరము నిల్పె
నిఖిల జీవాధార - నిమ్న పుష్కరమైన । చెఱువు చేయించె న-చ్చెరువు గాఁగ
చతుర దేవాగార - శార్ఙ్గ కోదండ ప్ర । తిష్ఠా సమాసక్తి - దేజ రిల్లె
నుర్వీసురశ్రేణి - కుపనయ నోద్వాహ । వస్తు పదాఢ్యుఁడై-వాసికెక్కె

గీ॥నారయును మీరె పురుషోత్త-మాభిధాన । పట్టణ స్థిర చౌదరి - పట్టభద్రుఁ
డనుపమౌదార్యవియత వ-ర్తనుఁడుమానధనుఁడు దాసరి చినగంగ-ఘనయశుండు"

ఈగ్రంథమున పురుషోత్తమ పట్టణము, పురుషోత్తమ గజపతి నిర్మితమైన దని వ్రాసి యుండుట వలన, నాతని కాలము తరువాత

నుండిన యీ చినగంగయ్య శ్రీ వీరేశలింగము పంతులుగారు చెప్పిన కాలము వాఁడే యని తోఁచుచున్నది. ఈ చినగంగయ్యకు తాత తండ్రి యగు తిమ్మానేఁడు క్రీ. శ. 1579వ సం॥ర ప్రాంతీయుఁడుగా రుజువగుచున్నందునఁ గూడ దీనినే ధ్రువపఱచుచున్నది. కాని యాతని కాలములో, ననఁగా క్రీ.శ. 1660వ సం॥ర ప్రాంతమున కొండవీటి సీమలో గోల్కొండనవాబగు అబ్దుల్లా కుతుబ్షా పాలనము గన్పడుచున్నది. పైన నుడివిన గజపతి వంశీకులితనికి లోఁబడి పోయి యుండిన కాలముగఁ గన్పడుచున్నది. ఎట్లైనను, యీ చిన్న గంగయ్య, చౌదరి పట్టభద్రుఁ డని వర్ణింపఁబడియున్నందునను, చౌదరీ పదవులు మొగలు ప్రభుత్వములో క్రీ.శ. 1632వ సం॥ తర్వాత నేర్పడినట్లు కనుబడుట వల్లను, యీతఁడా తర్వాతవాఁడనియే నిశ్చయింపవచ్చును. ఈతఁడు కవిలోకపోషకుఁడై మాఘ మాహాత్మ్యమును కృతిని వ్రాయించనిచో, వీరి చరిత్ర మనకగమ్యగోచరముగ నుండెడిది. ఈయన మద్దాలి తిరుమలాచార్య శిష్యుఁడనియు, బ్రాహ్మణ పరీక్షణాభిలాషుం డనియు, మారుట్ల గోత్రుఁడనియు నందుఁ జెప్పఁబడినది. ఈయనకు మల్లమాంబయను సతీమణి వలన బాపినీఁడు, అంకన్న, సాబ్బినీఁడు, అక్కయ్య యను నల్గురు కుమాళ్లు గల్గిరఁట. వీరల తర్వాత చరిత్రము తెలియరాదు. మాఘ మాహాత్మ్యము గ్రంథకర్త కమ్మవారి నా కాలానుసరణముగ విష్ణుమూర్తి పాదముల యందుఁ జనించిన వారని యీ క్రింది పద్యమున వ్రాసి యున్నాఁడు.

"చ॥ హరిపద సంభవుల్ బుధహి - తాతిశయుల్ కమలాశ్రయుల్ శుభా
చ(రు)లును పుణ్యజీవనులు - సత్పథ వర్తులు లోకపావనుల్
సరస కవి ప్రజాస్పదులు - చారు గభీరులునై వియన్నదీ
స్థిర గతులైన వారి నుతి - జేసెద కమ్మ కులాగ్ర గణ్యులన్."

ఈ కాలమునకు విస్తరిల్లిన వైష్ణవ మత ప్రాబల్యమే దీనికి కారణ మనవచ్చును.

## —♦ శింగాల అక్కలయ్య ♦—

ఈయన శా.శ. 1444వ సం॥ర ప్రాంతీయుఁడు. ఈయన తండ్రి కొండసు సేఁసు. తల్లి రంగమ్మ. ఈయన ఉదయగిరి తాలూకా అలిమేలి మంగా పురమున హనుమద్దేవునిఁ బ్రతిష్ఠఁ జేసి శాసనము వ్రాయించి కీర్తిఁ జెందెను. * ఈవంశీకు లిప్పుడు కమ్మవారిలో నున్నది లేనిదియు తెలియకున్నది.

## —♦ సాయపనేని వారు† ♦—

### సాయపనేని చిన సాయపనాయఁడు

సాయపనేని వారి మొదటి వాసస్థలము కృష్ణా జిల్లాలోని పొత్తూరు గ్రామము. ఈ వంశమున చిన సాయప నాయకుఁడను నతఁడు మిక్కిలి ప్రసిద్ధుఁడై, యొక బ్రాహ్మణుని సహాయమున గోల్కొండ సుబేదారును దర్శించి, జహాగీర్లు, మన్నె కానలి రుసుములు, హాసీల్లు (దేశముఖు) సంపాదించి వారికి సామంతుఁడై నట్లు చెప్పఁబడినది. ఈ గోల్కొండ సుబేదా రెవ్వరైనదియు గుర్తించుటకు వీలుగా లేదు. ఈయనకు నాల్గవ తరము వారగు చిన వెంకటాద్రి, పెద వెంకటాద్రి నాయఁడులు ఢిల్లీ చక్రవర్తి యగు ఔరంగజేబు కాలములోని వారుగాఁ గన్పడు చున్నందున, చిన సాయపనాయఁడు దాదాపు క్రీ.శ. 1620 వ సం॥ర ప్రాంతీయుఁడై యుండ వచ్చును. అప్పుడు గోల్కొండ పాలించుచు వచ్చినది అబ్దుల్లా కుతుబ్షా. ఈ కుతుబ్షా వద్ద చిన సాయపనాయఁడు సామంతుఁడుగాఁ బాలించె నని చెప్ప వచ్చును. ఈయన పూర్వీకులకు సురాలమహుగుల్లో 14 వ శతాబ్దమున అమరం ఉన్న సంగతి లోఁగడ తెలుపఁ బడినది. ఈయనకు గంగపనాయఁ డను కుమారుఁడుండెను.

---

* N. I., u/1.

† ప్రజామిత్ర - 6-2-38 లోని చారిత్రక పత్రము ననుసరించి వ్రాయఁబడినది.

## —♦ సాయపనేని గంగప నాయఁడు ♦—

తండ్రి సంపాదించిన రాజ్యము నితఁడు వృద్ధి చేసెనఁట. ఈయనకు వినుకొండ, కొండవీడు సీమలలో నధికార ముండెను. ఈయన కొడుకు వెంకటాద్రి. ఈ వెంకటాద్రి మిక్కిలి ప్రఖ్యాతి పురుషుఁడఁట.

## — సాయపనేని వెంకటాద్రి నృపాలుఁడు —

గంగపనాయని కుమారుఁ డగు నితఁడు మిక్కిలి ప్రతిభాశాలియై, శ్రీశైల పర్వతమునకు తూర్పుగా పదిహేను క్రోశముల దూరములో నున్న దూపాటి సీమను పాలించుచు వచ్చెను. ఇతఁడు దద్దనాల యను పట్టణమును నూతనముగా కట్టించి యచ్చటికి తన రాజధానిని మార్చెనఁట. అంతకు పూర్వస్థాన మేదియో తెలియుటలేదు. ఈ దద్దనాల మొదట చిన్నపల్లెగా నుండెను. దీనిని మూఁడు క్రోశముల పట్టణముగా మార్చి; యందు 500 కోమటి యిండ్లును, 500 మార్వాడీ యిండ్లును, 60 అందలాలెక్కు ప్రభువుల యిండ్లును యేర్పాటొనరించెను. ఇంతేగాక 11 ఘటాల యేనుఁగులును, ప్రభువుల నౌకర్లు మున్నగు వారందరు కాఁపుర ముండునట్లుగా విస్తరించెను. ఈయన కుమారుని పేరేదియో తెలియుట లేదు. కాని యీయనకు పెదవెంకటాద్రి, చినవెంకటాద్రి యను మనుమలు వీరాగ్రేసరు లుదయించి మిక్కిలి ప్రసిద్ధికి వచ్చిరి. ఈయన అబుహసన్ కుతుబ్షా యనఁబడు తానీషాకాలము (క్రీ.శ. 1672-88 సం॥) లోని వాఁ డేమో యని తోఁచుచున్నది.

## —♦ సాయపనేని పెదవెంకటాద్రి, చినవెంకటాద్రి భూపతులు ♦—

వీరికిని గోల్కొండ అమీరులలో నొకఁడగు పఖురుల్లాఖాను నకు తగాదా జనించి, దానిపై పఖురుల్లాఖాను వీరికోటను నాశనము చేసినట్లు చెప్పఁబడినది. ఈ పఖురుల్లాఖాను ఔరంగజేబు చక్రవర్తికడ క్రీ. శ. 1708 వ సం॥లో దక్కను సుబేదారుగా

నియమింపఁబడిన జుల్ ఫికారుఖాన్ అనువాఁడై యుండునని తోఁచు చున్నది. చినవెంకటాద్రి నృపతి పల్లికొండ దుర్గమును సాధించి జయించిన శ్లోక చాటువు గలదు. అది యీ క్రిందివిధముగనున్నది.

"సీ॥అదిగో! సాయపనేని - యారట్టఘోట్టాణ, ధాటికా ఘోటికా - దళిత రవము
ఇదిగో! నయ్యనధీర - హేలా ఢమామికా। ధాంధణ ధాంధణ - ధ్వనిత రవము
అదెవచ్చె జినవెంక - టాద్రి నాయక సింహ, బలుఁడు బాహాబల - ప్రౌఢశాలి
ఇదె లగ్గ పట్టించె - నెట్టన పలికొండ, ఘనదుర్గ భటజనుల్-కడు పడంక

గీ॥ గివిసి మన్నీలు చూడంగ - మొనవిశాని। గరిమ నడపించి పలికొండ-గట్టి తౌర
సమద హంవీర నిశ్శంక - సార్వభౌమ। ధీర దేవేంద్ర వెంకటా ద్రి క్షితీంద్ర॥"

ఈ పల్లికొండ దుర్గమెవ్వరికాలమున నెందులకు సాధింపఁబడెనో వివరములు తెలియుట లేదు. చినవెంకటాద్రి గొప్ప దాతయనియు, మహాశూరుఁ డనియు పేరందెను. ఈవంశము వారు శైవ భక్తులు. చిన వెంకటాద్రి తన శైవగురువునకు వినుకొండ సీమలోని అందు గులపాటి గ్రామమునకు తూర్పుగా శివపుర మనే గ్రామము నిర్మించు కొని సుఖజీవనము చేయుటకై, 50 కుచ్చెళ్ల భూమిని దాన మిచ్చెను. ఇంతేఁగాక నితఁడు తన రాజ్యములోని పరగణా కొక యగ్రహారము చొప్పున బ్రాహ్మణుల కొసంగెను. దద్దనాల పట్టణమునకు ఆరు క్రోసుల దూరములో నీయన యఱ్ఱగొండపాళె మను గ్రామమును గట్టించి, దానిలో వజ్రపునాణెలఁ బట్టు నేర్పా టొనరించెను. ఈయన వద్ద యయ్యపరాజను నొక బ్రాహ్మణోద్యోగి యుండెను. ఆతఁ డేదో తప్పు జేయఁగా వెంకటాద్రి ప్రభు వాతని నొక వత్సరము ఖైదు (శిక్షను) వేసెను. అతఁ డా యుద్యోగము నుండి తొలఁగింపఁ బడెను. ఆతఁ డీ యీర్ష్య లోన నుంచుకొని, ఖైదు నుండి వదలిన వెంటనే పఖురుల్లా వద్ద కేగి లేనిపోని కొండెములు చెప్పి, దద్దనాలపై ముట్టడి చేయు నట్లొనరింపఁగా, నదియే తుదకు వీరి రాజ్యమునకును బ్రాహ్మణుని నాశనమునకును గారణమయ్యెను.

పఖురుల్లాఖాను దద్దనాలపైకి దండెత్తి వచ్చినపుడు చినవెంకటాద్రి నృపాలుఁడు కోటలో లేఁడు. పెద వెంకటాద్రి ప్రభు వుండి, పఖురుల్లాఖాన్ సైన్యము పట్టణములో దోపిడి నారంభింపఁగా నెదుర్కొని యుద్ధ మొనరించెను. దీనిలో నాతఁడు వీరస్వర్గ మలంకరించెను. అందుచే పఖురుల్లాఖానునకు సులభముగా దద్దనాల పట్టణమంతయు, కోటసహా వశ మయ్యెను. నగరము పఖురుల్లాకు వశమైనట్లు తెలియఁగనే కోటలోని రాజ కుటుంబ స్త్రీ లందర గ్ని ప్రవేశ మొనర్చి తమ మానము గాపాడుకొని యశఃకాములైరి.

ఈ యుద్ధములో పఖురుల్లాఖాను తొంబది యాఱు లక్షల రూపాయల వెండి బంగారు మున్నగు ఖజానాను దోఁచుకొనెనఁట. తర్వాత రాజద్రోహి యగు నయ్యపరాజును నమ్మరాదని తురుష్కులు సంహరించి తగిన శాస్తి నొనర్చిన వారైరి. దుర్మార్గుఁడగు పఖురుల్లాఖాను కూడ గోల్కొండకుఁ బోవు త్రోవలోనే మరణించెనఁట! చిన వెంకటాద్రి కొంతకాలమునకు వచ్చి జరిగిన వృత్తాంతమంతయు నెఱింగి, కుటుంబ మంతయు నగ్నిపాలగుటను దలపోసి, తానును కత్తితోఁ బొడుచుకొని చచ్చిపోయెనఁట. కుటుంబ స్త్రీలు చనిపోవునపుడు తమ వంశాంకురమగు నొక కుమారుని మాత్ర మొక దాసి సాహాయ్యమునఁ గొండవీటి సీమకుఁ బంపఁగా, నాతని వంశము క్రమముగ వృద్ధి యయ్యెనఁట. ఈ వంశమువారి తరువాతి చరిత్ర మూఁడవభాగమున వ్రాయఁబడును. ఈవంశములో దాదాపు క్రీ.శ. 1550వసం॥ర ప్రాంతమున సాయపనాయని అనంత నృపాలుఁడను నాతఁ డుండి యాతనికి శ్రీరంగమాంబ యను సతీమణి వలనఁ గాంచిన భాస్కరాంబ యను కుమార్తెను రావెళ్ళ లింగనృపాలున కిచ్చి పరిణయ మొనర్చినట్లు సౌగంధిక ప్రసవాపహరణ మను గ్రంథములో నుదాహరింపఁ బడినది; గా తద్వంశీకుల విశేషములు దెలియుట లేదు.

## —♦ వెలిచేటివారు ♦—

### వెలిచేటి తిరపతిదొర

వెలిచేటివారు కందాళ గోత్రీకులు. వీరిపుడు విశాఖపట్టణము జిల్లా విజయనగర గజపతుల సంస్థానమునఁ గాపురస్థులుగా నున్నారు. ఈ వంశీకులు గజపతుల సంస్థానములో 17 వ శతాబ్దము నుండియు సేనాధిపతులుగా నుండిరి. ఈ వంశము వారికి మూల పురుషుఁడు వెలిచేటి తిరపతిదొర. ఈయన వశిష్ఠ గోదావరీ నికటమున వెలిచే రను గ్రామ మొకటి కట్టె ననియు, నందుచే నా వంశీకులు వెలిచేటివారైరనియు నీ వంశీకులలోని గుకురాయనిచే కృతి నొందఁబడిన ధర్మనందన విలాస మను గ్రంథములో వ్రాయఁ బడి యున్నది.† ఈ తిరుపతి దొర భార్య పేరు మంగాంబ. ఈమె వలన నీయనకు మల్లికార్జునుఁ డను కుమారుఁడు జనించి ప్రసిద్ధికి వచ్చెను.

## —♦ వెలిచేటి మల్లికార్జున దొర.♦—

ఈ మల్లికార్జున దొర కళింగ రాజ్యమున, ననఁగా గజపతుల యాస్థానమునఁ, బ్రవేశించిన వారిలో మొదటి వాఁడుగఁ గన్పడు చున్నాఁడు. ఇతఁడు కళింగరాజ్యమున కరిగా నేగె ననియు, నచటి రాజుచే మన్ననలంది యచట నున్న భోగపురసీమలోని రణస్థలి చెంతగా బంటుపల్లి యను గ్రామమును గట్టించి, యా గ్రామమునఁ దన పేరిఁట కాఁబోలు మల్లికార్జునస్వామి యాలయ మొకటి నిర్మించి దేవునిఁ బ్రతిష్ఠించె ననియు, ధర్మనందన విలాసములోని యీ క్రింది పద్యము దెలుపుచున్నది. *

---

† "గీ॥ ధరణి నతఁడు వసిష్ఠగో-దావరీ ని। కటమునన్ వెలిచే రను - గ్రామ మొకటి
గట్టి మంగాంబికను జెట్ట-బట్టి మల్లి। కార్జునునిఁ గాంచె వజ్రి జ-యంతు బోలె॥"

* ఈ గ్రంథము ముద్రితము కాలేదు - కృత్యాదిపద్యములు మాత్రము నావద్ద గల ప్రతిలో నున్నవి. వీనిని పంపిన శ్రీ అడిదం రామారావు పంతులుగారు వందనీయులు.

"చం॥ అతఁడు కళింగ రాజ్యమున - కర్థిగ మించి తదీయ మేదినీ
పతి బహుమాన మందికొని - పౌరుష మారఁగ బంటుపల్లి సు
స్థితి రచియించె భోగపుర - సీమ రణస్థలి చెంత నందు స
ద్ధితముగ నిల్పి యచ్చటఁ బ్ర - తిష్ఠ యొనర్చెను మల్లికార్జునుఁ॥"

ఈయన బంటుపల్లి పాలకుఁడుగా నుండెను. ఈయన భార్య అచ్చమదేవి. ఈ దంపతులకు కూర్మరాయ, నారప్ప, తిరపతి దొర లను మువ్వురు శూరాగ్రేసరు లుదయించి గజపతుల సేనా పతులుగ మెలంగినట్లు గన్పడుచున్నది. మల్లికార్జున దొరకు అయి దవ తరమువాఁడును, దాదాపు క్రీ. శ. 1800 వ సం॥ర ప్రాంతీయుఁ డగు వెలిచేటి గురురాయఁడు పూసపాటి నారాయణ గజపతి మహా రాజు సేనాధిపతులలోని వాఁ డని పై గ్రంథమువల్లఁ దెలియు చున్నందున, మల్లికార్జునదొర పూసపాటి కృష్ణరాజు ప్రభువు కాలములోని సేనాధిపతి యని మనము నిర్ణయింప వచ్చును. ఈ వంశీకుల తర్వాత చరిత్రము మూఁడవభాగమున వ్రాయఁబడును.

## —♦ వేజెళ్లవారు ♦—

వెజెళ్ల, వెజెండ్ల, వేజెళ్ల, వేజెండ్ల వా రని చెప్పఁబడు వా రందరొకే కుటుంబమువారు. ఈ యింటి పేరటివారు కమ్మవారి లోను, నేఁటి యాంధ్ర క్షత్రియులలోను గన్పడుట వల్ల, నీ గృహ నామము 14 వ శతాబ్దమునకు పూర్వమే యేర్పడి నట్లు తోఁచును. ఈ యింటి పేరటి వారలలోఁ గొందఱు ప్రసిద్ధిగా నుండి 14వ శతా బ్దము నుండి యాంధ్ర క్షత్రియులుగా వ్యవహరించినట్లు కన్పడును. వీరు మందపాటి వారికి బంధువు లని వేజెళ్ళవారి వంశావళి యను గ్రంథము వలన కన్పడు చున్నందునను, మందపాటివారు దుర్జయా న్వయు లైనందునను, వీరు గూడ నందులోనివారే యై యుందురు. వీరిలో అయ్యప రాజనునతఁడు శా. శ. 1450 వ సం॥ర ప్రాంత మున నుండి హైదరాబాదు నవాబువద్ద గుడ్లూరు సీమకు జాగీరు

దెచ్చుకొనెను. అప్పటి నుండియు నా వంశీకులు దాని ననుభవించు చున్నారు. నేటికిని యీ వంశీకులు శెట్టు సంస్థానీకు లను పేరుతో నొప్పు చున్నారు. వీరు వశిష్ఠ గోత్రజు లై యున్నారు.

కమ్మవారిలో నున్న వేజెళ్ల లేక యేజెళ్ల వారి తెగవారే యయ్యును, 14 వ శతాబ్దము దాపులో విడిపోయి యప్పటి నుండియు కమ్మవారుగనే వ్యవహరించు చున్నట్లు గన్పట్టును. వీరి బంధువుల లోని మందపాటివారు కొందఱు గూడ కమ్మ వారిలో గలరు.

---

## (అనుబంధము I)

# కమ్మవారి గృహనామములు, గోత్రములు

(ప్రథమభాగము తరువాయి)

గృహనామము — గోత్రము

అంచె - తాడిపాళ్లు 980
అడుసుపల్లె - నాదెండ్ల
అత్తోట-అయోధ్య, చెరుకునూళ్లు
అన్నంగి - పమిడిపాళ్ళ, పెంజెర్ల
అన్నాబత్తుని - కొమరపూడి
అప్పసాని - మంగనూళ్ళ
అబ్బినేని - దేసట్ల
అభినేని - మురుకట్ల
అమ్మ - తాడిపాళ్ళ
అయినంపూడి - చెరకునూళ్ళ
అవిరినేని - పాలేటి 990
ఆచంట - పాలుళ్ళ
ఆరుమళ్ళ - సవనూళ్ళ

గృహనామము — గోత్రము

ఆరెకట్ల - పమిడిపాళ్ళ, పాలుళ్ళ
ఆలమందల -
ఆలోకం - ధాన్యాల
ఆవుల - పోగునూళ్ళ
ఇనుకునూళ్ళ - చంద్రునూళ్ళ
ఈధర - జానెల్లి, జన్నావుల
ఈవూరి - రేచెర్ల, పేపాళ్ల
ఉప్పటూరి - చెరకునూళ్ల 1000
ఎనికపాటి - చంద్రునూళ్ల
ఓడె - వల్లుట్ల
ఓరుగంటి - యేమునూళ్ళ
కంటు- గంధసిరి

| గృహనామము—గోత్రము | గృహనామము—గోత్రము |
|---|---|
| కంటం - పులిగోళ్ళ | కోణకంచి - చంద్రూళ్ళ |
| కంది - | కొమ్మరాజు - పమిడిపాళ్ళ 1030 |
| కందుల - యెలిశెట్ల | కోరనగుంట - చెరకునూళ్ళ |
| కందెప - పేపాళ్ళ | కొరిటాల - మేరువుల, పులివేళ్ల |
| కంభంపాటి - పమిడిపాళ్ళ | కొయ్యలమూడి - నాదెండ్ల |
| కట్లముడి - పోగునూళ్ళ 1010 | కోవి - విప్పర్ల, పమిడిపాళ్ళ |
| కమ్మవారు - బొమ్మనూళ్ళ, మారుట్ల, కొత్తనూళ్ళ | కొలనాని - తాటిపాళ్ల |
| కరి - చెన్నూళ్ళ | కొల్లిపర- |
| కలపాల - గంద్రూళ్ళ | కోంపల్లి-పమిడిపాళ్ళ, చంద్రూళ్ల, చిరినూళ్ళ |
| కాకాని - తాళ్ళూరి, కనపర్తి | కోటపాటి - వల్లుట్ల, గుంటూరు |
| కాకు } పులియేళ్ల | కోటు - రేబాల |
| కొక్కు } పులియేళ్ల | కోడెల - వల్లుట్ల, పురదాల, పులియేళ్ల |
| కామిరెడ్డి - రేచెర్ల | కోలసాని - పోగునూళ్ల 1040 |
| కారసాల - యేమునూళ్ల | కోసూరి - రేచెర్ల |
| కావూరు - ఆరెకట్ల | క్రవి - జన్నోలి |
| కాసుల - పొన్నపల్లి | క్రొత్తపల్లి - చంద్రూళ్ళ, పాలుట్ల, చెరకునూళ్ళ |
| కిడునూరి - చివలాకి 1020 | ఖణంతు - చెన్నూళ్ళ |
| కూంకుట్ల - వల్లుట్ల | గంగిశెట్టి - పసుపునూళ్ళ |
| కూనంనేని - వల్లుట్ల, కనుపర్తి, యేమునూళ్ళ | గండు - మదివెళ |
| కూరపాటి-వల్లుట్ల, పసుపునూళ్ళ | గండ్రల- |
| కేసరినేని - పులివేళ్ళ | గట్టు - చెరకునూళ్ళ |
| కేసారపు - వల్లుట్ల | గడి - కాచిపాళ్ల 1050 |
| కొటూరి - దేశట్ల | గడిగొట్టు - పమిడిపాళ్ల |
| కొండిబత్తిని - పోగునూళ్ళ | గణపవరపు - వల్లుట్ల |
| కొండేటి - కడిమిచెట్ల | |

గృహనామము—గోత్రము

గనేశరు - మేమున్నూళ్ళ
గవిరినీడి - వల్లుట్ల
గార్లపూటి - పమిడిపాళ్ళ
గుండారపు - పమిడిపాళ్ళ
గుండ్లపల్లి - గురిజాల
గుణం - పమిడిపాళ్ళ
గుత్తికొండ - కోనంకుల, పమిడిపాళ్ళ, చెరకునూళ్ళ
గుమ్మడూరి - 1060
గూడూరి - తాడిపాళ్ళ, కంచెర్ల
గూడపాటి - ధాన్యాల
గోనెగర - మేమునూళ్ళ
గోకనపూడి - మినుమునూళ్ళ
గోవాడ - వల్లుట్ల
గోవింకు - పమిడిపాళ్ళ
గోళ్ళ - యినగంటి
చంద్రపాటి - పసుపునూళ్ళ
చమళ్ళమూడి - వల్లుట్ల
చల్లపల్లి - రేచెర్ల 1070
చాకరాజవేముల -
చింతపట్ల -
చిగురుపాటి - కనుమునూళ్ళ
చిటి -
చిట్టినేని - పసనూళ్ళ, పచ్చంకుల
చిమ్మలి - నల్లకట్ల
చిర - పోగునూళ్ళ
చిలంనేని - తాడిపాళ్ళ

గృహనామము—గోత్రము

చిలుకూరి - చెరుకూరి
చెరుకుమల్లి - దేశట్ల, చెన్నమల్లు 108
చెలసాని - పమిడిపాళ్ళ
చొప్పన -
జగర్లమూడి - చెరకునూళ్ళ
జలం - పాలేటి
జాలాది - అబ్బూరి
జూజాల - శ్యామంచుల
జూపల్లె -
జెల్లావుల - వల్లుట్ల
తోళ్ళ - రేచెర్ల
దాదినేని - కాకినూళ్ళ
దాము - వల్లుట్ల 1090
దాయచర్ల - విప్పర్ల
దుర్గం - దుద్దెంపూడి
దూదిపాళ్ళ } తడుమర్తి,
ధూళిపాళ్ళ } కంచెర్ల
దొంతినేని - మోనూళ్ళ
దోమాలపాటి - చంద్రూళ్ళ
దోవంటి -
నడింపల్లి - కోణకంచి
నన్నూరి - పమిడిపాళ్ళ
నర్రపాటి - ధాన్యాల 1100
నలజాల - కలియపాల
నాగబోయిన - వల్లుట్ల
నాతాని - యినగంటి

గృహనామము—గోత్రము

నిడమానూరు - చెరకునూళ్ళ
నీలూరి - శ్రీపాల
నూతి - వల్లుట్ల
నూతులపాటి - మునగంటి
నెక్కలపూడి -
పత్తిపాటి - ఇప్పటూరు, విపసీల, తోటపల్లె, రేగుబాళ్ళ, చాముండల
పనకల - కొండూళ్ళ 1110
పసల - కంచర్ల
పిన్నింటి - చెన్నమల్లు
పెంటెల - కొండమూరి
పెడల్లి - వల్లుట్ల
పెదళ్ళ - పమిడిపాళ్ళ
పెనుమచ్చ - చందనూళ్ళ
పెరవలి - చుండూళ్ళ
పొందూరి - జోసంకుల
పొట్లు -
పొదిలపల్లి - 1120
పొన్న - పోగునూళ్ళ
పొన్నగంటి - పులివేళ్ళ, పోగునూళ్ళ
పోంకంటి - విప్పర్ల
పోచినేని -
పోతిని - వల్లుట్ల, పీపాళ్ళ, పోగునూళ్ళ
పోతురాజు - పమిడిపాళ్ళ

గృహనామము — గోత్రము

పోలవరపు - కడబిరుమల
పోసాని - కొండబాల
పోనం - పునుగోటి
బండారుపల్లె - గురిజాల, మానేపల్లి
బంగనిడి - పునుకునూళ్ళ 1130
బబ్బూరి - విప్పర్ల
బల్లెద్దుల -
బాలం -
బాలినేని -
బావన - ధాన్యాల
బుడి - తాండిపాళ్ళ
బూదాటి - అనుముక్కల
బేతపూడి - వల్లుట్ల
బొంతుల - పోగునూళ్ళ 1140
బొందలపాటి - వల్లుట్ల, వినుకొండ
బొక్కిశం - పమిడిపాళ్ళ
బొట్ల, బోట్ల - కొమరవోలి
బొడ్డు - కంచర్ల
బొప్పూడి - విప్పర్ల
బొల్లు - విప్పర్ల
బోదనపాటి - పాలేరు
బోయిడి - చన్నూళ్ళ
బోళ్ళ - శ్యామంచుల
బ్రహ్మసాని-మునునూళ్ళ 1150

గృహనామము—గోత్రము
భట్టిప్రోలు -
భీమ - కోరుట్ల
భీమిరెడ్డి - పరిటాల
మంచినీళ్ళ - కొమరవోలు
మందడి -
మందపాటి - వల్లుట్ల
మదమంచి - తాళ్ళూరు
మదమనేటి -
మద్దాల - విప్పర్ల
మద్ది - గాడిపాళ్ళ 1160
మద్దినేని - మూసునూళ్ల, ముష్నూళ్ల
మద్దిపాటి -
మద్దిరాల - మాంగుట్ల, వల్లుట్ల
మహారవుతు - దేశట్ల
మాకినేని - చెన్నమల్లు, దేశట్ల, పూరిపాళ్ల, పెరినూళ్ల
మాంగులూరు -
మారుపుడి - దానోళ్ళ లేక దానుళ్ళ
మామిళ్ళపల్లి - మోదుగునూళ్ళ, తూమాటి
మావులూరు - అయినోళ్ళ
ముంగర - రేచెర్ల 1170
ముండ్ల - వేయినూళ్ళ
ముండ్లూరి - యేడిపల్లె, యేటిపోల
ముత్తిని, ముత్తినేని } మేడాల

గృహనామము—గోత్రము
ముప్పరాజు - ముష్నూళ్ళ (ముసునూళ్ళ)
ముమ్మన - పసుపునూళ్ళ
మురకొండం - పరసునూళ్ళ, మండెపూడి
ములుగూరు -
మెరంపల్లె - పమిడిపాళ్ళ
మేడూరి - చెన్నమల్లు
మేవులూరి -
మైలేటి -
మొటపర్తి -
మొలకలపల్లి - వల్లుట్ల
మోటూరి - దేశట్ల
మోదుకూరి - మాణిక్యాల, మ[illegible]జుల
యడవల్లి - పమిడిపాళ్ళ
యద్దనపూడి - విప్పర్ల
యలవర్తి - రేచెర్ల, ముసునూళ్ళ, (పతికనూళ్ళ)
యినగంటి - చెన్నూళ్ళ, యినగంటి
యెల్లినేని - వల్లుట్ల, పొటూళ్ళ, పానుగోటి
యెలినేని - వెయినూళ్ళ 1190
రాగిపాటి, రావిపాటి } నిట్రాళ్ళ

గృహనామము—గోత్రము

రాచ - పమిడిపాళ్ళ
రాళ్ళ - వల్లుట్ల
లంక - చెన్నమల్లు, నిడమనూరి
లావు - చెన్నమల్లు
లింగా - కంచర్ల
వడ్డెల్లి - పేపాళ్ళ
వడ్లపట్ల -
వాకా - వల్లుట్ల 1200
వాయలచర్ల - విప్పర్ల
విక్రం - యినుకునూళ్ళ
వీరభద్రం - ఆకుట్ల
వీరమంచ -
వీరమాస - యేరువాకల
వీరులపల్లె - చెన్నమల్లు
వీరెల్లి - దవనూళ్ళ
వుగ్గం - ధనంకుల
వుట్లపల్లి - అన్నంకుల
వూట్ల - పోగునూళ్ళ 1210
వెలమాటి -
వెల్లినేని - పాన్పునూళ్ళ

గృహనామము—గోత్రము

వేముపాటి - పమిడిపాళ్ళ
వెలిగండ్ల - చందూళ్ళ
వోద్దినేడి -
వెంపటి - మూలాకు
శలంపల్లి - పావాల
శాసంపూడి - ముప్పాళ్ళ
శింపాటి - విప్పర్ల
శ్రీధర - బుడమునూళ్ళ 1220
సందిపాటి - పేపాళ్ళ
సబ్బినేని - నిడుమోలు
సల్లపనేని - రేచెర్ల
సింహంపాటి - వదిపాళ్ళ
సూరా - విప్పర్ల
సూరంబత్తిని - పమిడిపాళ్ళ
సూరి - పమిడిపాళ్ళ
సూరే - యేటికూరు
సేకూరు -
సోంశెట్టి - శెట్యూళ్ళ 1230
సోమారపు - ఆరెనూళ్ళ 1231

ఇందు వెలమవారిలోఁ గల యినగంటి గృహనామస్థులును క్షత్రియులలోఁ గల మందపాటి - గృహనామస్థులును కమ్మవారిలో నుండుట గమనింపఁదగినది. ఇట్టి వనేకము ప్రథమ భాగమునఁ దెల్పితిమి. ఇదిఁ గాక లోఁగడ నుడివిన కొసరాజువారు గాక కమ్మవారిలో కొమ్మరాజువారు, ముప్పరాజువారు, పోతురాజు వారలుండి రాజశబ్ద ధారణ లగుట గుర్తింపఁదగినది. కంఠసతిగోత్రము

నైజాంలో నా పేరిటనున్న గ్రామము పేరిట నేర్పడినట్లు కన్పట్టును. అత్తోట వారి యయోధ్యగోత్రము వారి వలనను దెలుపుచున్నది. ఓరుగంటి, మహారవుతు, వీరులపల్లె, విక్రం, వీరభద్రం మున్నగు పేర్లు వారి వాసస్థానమును బట్టియు, వారి ప్రతాప చిహ్నములుగను నేర్పడి యుండవచ్చును. ధనంకుల గోత్రీకులగు వుగ్గం వారును, అన్నంకుల గోత్రీకులగు వుట్లపల్లి వారును ఆదిలో నైశ్యవర్గంలోని వారు కావచ్చును.

---

## (అనుబంధము II)

# ప్రథమ భాగమున ప్రచురించిన గృహనామస్థులకుఁ గల మఱికొన్ని గోత్రములు

గృహనామము—గోత్రము

అంబటి - వల్లుట్ల
అడుసుమల్లి - రేచెర్ల
అత్తోట - దానూళ్ళ
అనుమోలు - వల్లుట్ల
ఆరె - నవనూళ్ళ
ఆలపాటి - ధాన్యాల, మునిపాల
ఆళ్ళ - వల్లుట్ల
ఈదుపుగంటి - చెన్నమల్లు
ఉప్పల - పమిడిపాళ్ళ
ఉప్పలపాటి - కొండూళ్ళ
ఏలూరు - చావనూళ్ళ
కంచెర్ల - చెరకునూళ్ళ, నిడు మోలు, నామాల, చంద్రూళ్ళ
కంజు - పోగునూళ్ళ
కంఠేటి - పనుకునూళ్ళ

గృహనామము—గోత్రము

కందిమళ్ళ - రేచెర్ల
కట్టా - కంచర్ల, కోటావుల, మష్నూళ్ళ
కటారి - ముదునూళ్ళ
కనగాల - వల్లుట్ల
కర్నాటి - కంచెర్ల
కర్నము - వల్లుట్ల
కర్లపూడి - కంచర్ల
కల్లూరు - కనపర్తి, చంద్రూళ్ళ
కాకుమాను - వల్లుట్ల
కాకుళ్ళ - వల్లుట్ల, పైనూళ్ళ
కాకొల్లు - గయనూళ్ళ, పులి మేళ్ళ
కామినేని - జలపాల, రేచెర్ల
కాటా - కంచర్ల

గృహనామము—గోత్రము

కాపు - మన్నూన్నాళ్ళ
కారుమంచి - కొండబాల
కాలారి - చంద్రూళ్ళ
కాళహస్తి - పమిడిపాళ్ళ
కాసరనేని - పులిగోళ్ళ
కుడితిపూడి - వల్లుట్ల
కుదుళ్ళ — కాశపాళ్ళ, పోగునూళ్ళ, పెనుమనూళ్ళ
కుర్రా — పోగునూళ్ళ
కొండబోలు — కొమరపుడి, వల్లుట్ల
కొండపనేని — చిలవర్తి
కొండ్ర — కవనూళ్ళ
కొండ్రు - చెరకునూళ్ళ
కొడాలి — శిరినూళ్ళ
కొప్పాకు — పమిడిపాళ్ళ
కొమ్మినేని — వల్లుట్ల
కొల్లూరు, కొటూరు } దేశట్ల, చెన్నమల్లు
కొసరాజు - పోగునూళ్ళ, మగనూళ్ళ
కోకా - వల్లుట్ల
కోటా - ముట్నూళ్ళ, గంధసిరి
కోడూరు - గంధసిరి, రాబాల, గంధబాల
కోడెల - పురదాళ్ళ, వల్లుట్ల, క్రొబాల

గృహనామము—గోత్రము

కోయ — మారుట్ల, పోగునూళ్ళ, పాలూళ్ళ, పాలవెల్లి
గంగా - కొండూళ్ళ
గంటా - విప్పర్ల, పమిడిపాళ్ళ, పులివేళ్ళ
గట్టినేని - తువ్వపాల
గద్దిపాటి - కాచిపాళ్ళ
గన్నమనేని - వల్లుట్ల
గన్నె - వల్లుట్ల
గరికిపాటి - చెరకునూళ్ళ
గాడిపర్తి - నవునూళ్ళ
గుంటూరు-మేడిపాళ్ళ, వేనూళ్ళ
గుజ్జర్లపూడి - చంద్రూళ్ళ
గుడుపూడి - వల్లుట్ల
గుత్తా - చెరకునూళ్ళ
గుడె - పినగంటి, వల్లుట్ల
గురజాల - వరిమానుల
గుర్రం - తాడిపాళ్ళ
గొంది - యినగంటి, రేచెర్ల
గొట్టిపాటి - యెంద్రాజుల
గోగినేని - పమిడిపాళ్ళ, రాగిపాళ్ళ, యేమునూళ్ళ, వీరంకుల
గోనుగుంట్ల - గోగునూళ్ళ (గోగపుడి)
గోరంట్ల - యినగంటి, ముప్పాళ్ల
గోళ్ళమూడి-పానూళ్ళ, దాసుళ
చదలవాడ - పాలకొల్లు, పాలుళ్ళ

| గృహనామము—గోత్రము | గృహనామము—గోత్రము |
|---|---|
| చన్నమనేని — వీరెల్లి | తిరువీధుల — యేముమున్నాళ్ళ |
| చల్లగుండ్ల — విప్పర్ల, రేచెర్ల | తుమ్మల—మాధిళ్ళ, నవునూళ్ళ |
| చల్లా — పోట్లూరి, మొగలిచర్ల | తూమాటి—వల్లుట్ల |
| చాగంటి — చెరకునూళ్ళ, వెల్లటూళ్ళ | తొట్టెంపూడి—వల్లుట్ల |
| చింతా — పమిడిముక్కల, అక్కనూళ్ళ | తొకల—శాగోలి, వల్లుట్ల |
| చింతల — శ్రీపాల, విచ్చెర్ల | తోట—నవునూళ్ళ |
| చిగురుపాటి — తొడిమనూళ్ళ | త్రిపురనేని—మారుట్ల, జనకునూళ్ళ |
| చిరుమామిళ్ళ — పమిడికోలుకుల, పైడికుల | దండమూడి—విప్పర్ల |
| చిలుకూరి — కాకితాల | దగ్గుమాటి—చెరకునూళ్ళ |
| చుండూరు — పైడిపాల, గురజాల | దరిశి—తాళ్ళూరు |
| చుక్కపల్లి — వల్లుట్ల | దాసరి—మారుట్ల |
| చెన్నమల్లు — వల్లుట్ల | దేవభక్తుని—ఆరవెల్లి |
| చెరుకూరి, చిరుకూరి — మదనుంచి, మారుట్ల | దొడ్డా—పులివేళ్ళ |
| చేబ్రోలు — పమిడిపాళ్ళ | దొడ్డపనేని—చెరకునూళ్ళ |
| జంపాని — కొమ్మరవోలు | దొమ్మలపాటి — యంద్రూళ్ళ |
| జాగర్లమూడి — పేరాల | నందిపాటి — పెయ్యమూగ, పేపాళ్ళ |
| జాస్తి — కంచర్ల | నన్నపనేని — విప్పర్ల |
| జవ్వాజి — యంద్రూళ్ళ | నర్రా — గొట్టిపాల, జిల్లేళ్ళ |
| జెట్టి — విప్పర్ల, ఆవాల | నాగండ్ల — చంద్రూళ్ళ, పోగునూళ్ళ |
| జొన్నలగడ్డ — పోగునూళ్ళ | నాదెండ్ల — దేసటి, మారుట్ల, అరువేల, కొల్లినన్నూళ్ళ |
| తెరిగోపుల — తాడిపాళ్ళ | నాయుడు — ముప్పూళ్ళ, ధర్మనూళ్ళ |
| తెల్లపనేని — పోగునూళ్ళ | నారెన్న — పోగునూళ్ళ |
| తాడికొండ — వల్లుట్ల | |

| గృహనామము—గోత్రము | గృహనామము—గోత్రము |
|---|---|
| నార్ల - పోగునూళ్ళ | పుట్టా—ఘనగంటి |
| నిమ్మగడ్డ - దేశ్లట్ల | పుట్ల—పోగునూళ్ల |
| నీరుకొండ - పెంజర్ల | పుత్తుంబాక—వల్లుట్ల |
| నున్నా - ధాన్యాల | పునుగుపాటి—పమిడిపాళ్ళ |
| నూతక్కి - ముప్పాళ్ళ | పువ్వాడ—వల్లుట్ల |
| నూతులపాటి - ఘనగంటి, వల్లుట్ల | పూనాటి—చెన్నూళ్ళ (చిరినూళ్ల) |
| నూతి - వల్లుట్ల | పెద్ది—గిజిబాల, పెరవలి |
| నూతేటి - వల్లుట్ల | పేర్ర—గజేంద్రుల్ల |
| నెప్పల్లి - వల్లుట్ల | పొక్కూరి—కడవిరుదుల, మంగనూళ్ళ, పేపాళ్ళ, గర్తిమ్మెళ్ళ |
| నెలకుర్తి—పచ్చనూళ్ళ | పోలినేని—కంచర్ల |
| నెల్లూరు—చందనూళ్ళ | బండారు—గురివిందలపాలెం |
| పచ్చాల—పేదపాళ్ళ | బండి—పాలనూళ్ల |
| పరిటాల—పులియాళ్ళ | బత్తిని—ఖ్యాతముక్కల |
| పల్లపోతుల—పమిడిపాళ్ళ | బత్తుల—పోగునూళ్ల, మన్నూళ్ళ, రాగిపాళ్ల, అమరావతి |
| పల్లంరెడ్డి—గోగునూళ్ళ | బలుసు—యేరువాకల |
| పాటిబండ్ల—ముప్పాళ్ల, నూజెళ్ళ, పులిమేళ్ళ, కంచర్ల | బిక్కి—నిడుముక్కల |
| పాతూరి—వల్లుట్ల, పేపాళ్ళ | బెజవాడ—సూరనూళ్ల |
| పాలకుర్తి—వినుకొండ | బెల్లముకొండ—మునునూళ్ల, వజ్జనూళ్ల |
| పాలేరు—తాడిపాళ్ళ | బొంతు—పోగునూళ్ల |
| పాలేటి—చెన్నమల్లు, పమిడిపాళ్ళ | బొగ్గారపు—తులసినీళ్ల |
| పావులూరి—చెరకునూళ్ళ, గుడిపాల | బొడ్డపాటి—పులిమేళ్ళ |
| పిన్నక—జన్నెల్లి, ఆరెనూళ్ళ | బొర్రా—పాలపర్తి |
| పిన్నమనేని—చెరకునూళ్ళ | బోడి—చెరకునూళ్ల |
| పుచ్చకాయల—చెరకునూళ్ళ | భీమనేని—మారుట్ల, పమిడిపాళ్ళ |

గృహనామము—గోత్రము

భైరవపూడి—కందుకూరి
మంచికలపూడి - వల్లుట్ల
మందలపు - పోగునూళ్ళ
మందాడి - ముట్నూళ్ళ (ముసునూళ్ళ)
మక్కెన - అన్నంగుల
మద్దుకూరి - వల్లుట్ల
మన్నెం - రావిళ్ళ, పమిడిపాళ్ళ, అయినోళ్ళ
మల్లెనేని - కంచర్ల
మల్లెల - గంద్రూళ్ళ
మల్లాది - శిలకోటి
మాగంటి - తంగెళ్ళ, పాలడుగు
మాచవరపు - ఆరెనూళ్ళ
మాదల - నానూళ్ళ, పైనూళ్ళ
మానము - రేచెర్ల, పెంజర్ల
మిక్కిలినేని - దానోలి
ముక్కాల - వల్లుట్ల
ముద్దని - చందనూళ్ళ
ముద్దినేని - మానూళ్ళ
ముప్పారపు - పోగునూళ్ళ
ముప్పాళ్ళ - యెంద్రూళ్ళ. చిలకోట
ముమ్మనేని—తాడిపాళ్ళ
ముమ్మలనేని—వల్లుట్ల
మురిగొండం—పరుసునూళ్ళ
మువ్వా—మలిశిరి

గృహనామము—గోత్రము

మెట్ల—మాగోగుళ్ల.
మేకా—వడిశాల
మేడికొండల—నన్నూళ్ళ
మొరసు—చన్నోళ్ళ
మోపర్తి—విప్పర్ల
యండ్లూరి—శిలకోటి
యడ్లపల్లి—పాన్నునూళ్ళ
యడ్లపాటి—పామునూళ్ళ
యనమదల—వల్లుట్ల
యరగుంట—చంద్రూళ్ళ
యర్రంనీడి—వల్లుట్ల
యలవర్తి—ముసునూళ్ళ, రేచర్ల పతకనూళ్ళ
యిరుకులపాటి—వల్లుట్ల
రవవరపు—చీమకుర్తి లేక చిలంకుర్తి
రాపర్ల—కంచెర్ల
రామినేని—ధాన్యాల, అయినోళ్ళ
రాయ—వీరంకుల, మునగనూళ్ళ
రాయిన—జన్నావుల
రాయడు—పోగునూళ్ళ
రావుల—జనకనూళ్ళ, లోకపాల
రావూరు - పమిడిపాళ్ళ, దామునూళ్ళ, గుంటూరారు, కాకితాల
లగడపాటి - శామంచుల
లేళ్ల—చిలకనూళ్ల

గృహనామము — గోత్రము

వంకాయలపాటి - వల్లుట్ల
వడ్లమూడి—గరిమెళ్ల, రేచర్ల. గోగునూర్ల, విప్పర్ల
వల్లభనేని—చెన్నమల్లు
వల్లూరి—పసుపునూర్ల మారుట్ల
వసంతం—దానోర్ల
వింజము—పువునూర్ల
విప్పర్ల—వల్లుట
వీరెల్లి—దవనూళ్ళ
వీరగంధం—దాసనూళ్ళ
వెనిగళ్ళ—చంద్రనూళ్ళ
వెలివోలు—వల్లుట్ల
వెల్లంకి - మండెపూడి
వేజండ్ల - జనోన్నలి
వేమూరు - మగనూళ్ళ
వేసంగి (యాసంగి) - గురిజాల

గృహనామము — గోత్రము

వోలేటి - వల్లుట్ల
శరణు - విప్పర్ల, పమిడిపాళ్ళ
శాఖమూరి - అయోధ్య
శింగారపు - గుడిపాడు
సాదినేని, సామినేని — దాసనూళ్ళ
సింగమనేని — జనోన్నలి
సుంకర — కడబిరుదుల
సుఖవాసి — సండెపూడి
సూదులకుంట — నడిపాళ్ళ
సూరపనేని — వల్లుట్ల, తాడిపాళ్ళ
సూర్రెడ్డి — చెన్నమల్లు
సోంపల్లి —పమిడిపాళ్ళ
స్వర్ణ — నాదిండ్ల

ఇందలి శాఖమూరివారి అయోధ్య గోత్రము వారి వలనను దెలుపుచున్నది. వీరెల్లి గోత్రము వీరులగోత్ర మేమో! కొన్ని గోత్రములు పిచ్చుకుంటల నోటఁబడి యపభ్రంశము నొందినవి. కొన్ని తారుమారులు గూడనై యుండును. పురాతన రాగి శాసనములు లభించినఁ గాని యట్టివి సరిచేయఁజాలము.

కమ్మవారి చరిత్రము ద్వితీయభాగము సమాప్తము.

# కమ్మవారి చరిత్ర ప్రథమ భాగముపై పెద్దలొసంగిన యభిప్రాయములు.

విజయనగరము మహారాజావారి కాలేజి సీనియర్ తెలుఁగు పండితులును, 'అడిదము సూరకవి' యను గ్రంథకర్తయు నగు శ్రీ అడిదము రామారావు పంతులుగా రిట్లు వ్రాసిరి:—

"మీరు బహుశ్రద్ధమై రచియించిన కమ్మవారి చరిత్రము నందలి కొన్నికొన్ని భాగములను జాగ్రత్తగాఁ, జదివి మీరు చేసిన పరిశ్రమకు సంతోషించుటయే గాక, ఆశ్చర్యమును గూడఁ జెందితిని. ఈ గ్రంథ రచనకు వలయు సామగ్రిని సేకరించుటలో మీరు చేసిన పరిశ్రమ నిండా శ్లాఘింపఁదగినది. ఇట్టి రచనకుఁ బూనుకొన్నవారికిఁ గాని అన్యులకు మీ యమూల్యమగు కృషి తెలియరాదు. గ్రంథములోనే ప్రకరణము చదివినను, మీరు గావించిన బహు గ్రంథ పఠనము, వస్తు సంగ్రహణమునందు మీరు చూపిన విమర్శన దృష్టి, అం దందుఁ గావించిన పూర్వపక్ష సిద్ధాంతములు విస్పష్టముగా వెల్లడి యగుచున్నవి. మీ గ్రంథము ఒక్క కమ్మవారికే గాదు. ఆంధ్రులెల్లరకును సమాదరణీయ మైనది. మీరు గావించు భాషాసేవ సర్వ పండిత శ్లాఘ్యమైనది."

★ ★ ★

గోల్కొండ పత్రిక 15—4—40 తేదీన యీ గ్రంథ విమర్శనము చేసిన వ్యాసములో కొన్ని వాక్యములు.

"మన గ్రంథకర్తలైన శ్రీయుత కొత్త భావయ్య చౌదరిగారు కమ్మలు సూర్య చంద్ర వంశీయులే అనుటకును, వారికి జందెములు వేసికొనుట కధికారమున్నదనియు వారికిని ఋషి సూత్రా లుండె ననియు ఋజువుచేయుటకు చాల పరిశోధనలు చేసి యుత్కృష్ట గ్రంథాన్ని సిద్ధము చేసినారు..........

మన భావయ్య చౌదరిగారు తమ గ్రంథములో నే వర్ణము వారికిని నొప్పి కలిగించక వాదములో నిగ్రహమును జూపి అభిప్రాయ భేదములు కలిగిన సకారణముగా ఋజువుపరచి మరచి శైలిలో మంచి పద్ధతిలో వ్రాసినారు..........

చాల పరిశ్రమతో పరిశోధన చేసినారనుటకు వా రిచ్చిన శాసనాది ప్రమాణములు గ్రంథాదుల ప్రమాణాలు చూచిన విశదమగును..........

చౌదరిపద విచార చర్చను గ్రంథకర్తగారు బాగుగా చేసినారు.........."

★ ★ ★

ప్రజామిత్ర పత్రిక 9—6—40 వ తేదీ వ్రాసిన రివ్యూలో కొంత భాగము—

" బహు గ్రంథకర్త శ్రీ భావయ్య చౌదరిగారి పరిశోధనాఫలితం.... .... ...

ప్రాచీనాంధ్ర క్షత్రియులైనటువంటి—చారిత్రక ప్రసిద్ధిగల - కమ్మవీరుల పుట్టు పూర్వోత్తరాల గుఱించి నిర్ణయాలను స్మరణకు తెగగ్గిన ఉద్గ్రంథమే ఇది.

ఇది మహా సముద్రమువంటి మహత్కార్యం. ఒకపట్ల దేశచరిత్రలు వ్రాయడ మనేదే ఇంచుక సుకరమనిపించునేమో గాని, ఇటువంటి సాంఘిక పూర్వచరిత్రను రచించడం నిజంగా అతి కష్టసాధ్యమైన పని. ఈ సందర్భాన్ని పురస్కరించుకొన్న పరిశోధనలలో సరియైన సాధన సామగ్రిని సంతరించుకోవడం—రచనలో మరి ఏ ఇతర సంఘానికిగాని న్యూనాధిక్యతలు కల్పించకుండా వుండటం, స్వార్థాసక్తిని వృద్ధి చేయకుండడం-ఇన్నిన్ని మెలకువలు గమనించుట ఆవశ్యకమై ఉన్నది. ఇన్ని మనసులో పెట్టుకొని సుమారు ఒక వంద గ్రంథాలను అవలోకించి ఆధారంగా తీసికొని ఈ గ్రంథరాజాన్ని రచించారు శ్రీభావయ్య చౌదరిగారు. సుబోధకమైన చక్కటి భాష, చరిత్రకు శోభకూర్చే సర్వోత్తమమైన ఉద్యమం, సంఘీయులు సర్వ విధాలా ఆదరించి, సత్వర ఫలసిద్ధికై తోడ్పడవలసిన విధి వారి భుజాల మీదనే ఉన్నది.... .... ...."

★ ★ ★

ఆంధ్ర విశ్వవిద్యాలయోపాధ్యక్షులగు శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డి యం. ఏ. గా రిట్లు వ్రాసిరి.

" కమ్మవారి చరిత్ర ప్రథమభాగ మను మీ గ్రంథమును చూచితిని. అది చదువుటకు మిక్కిలి యాసక్తి కలదిగ నున్నది. కాని నేను శాస్త్రీయ పరిశోధన పరిశోధన ప్రకారము దాని ప్రమాణమును నిర్ణయించునంతటి చరిత్రజ్ఞుఁడను కాను. అయినను మన ప్రాచీన చరిత్రములోని యొక ప్రాముఖ్యభాగమున కది చాల శోభ నొడగూర్చు నవియే నా నిశ్చయము." (ఇంగ్లీషున కనువాదము)

★ ★ ★

ఆంధ్రసాహిత్య పరిషదధ్యక్షులును, శాసనపరిశోధ కాగ్రగణ్యులును, రిటైర్డు డిప్యూటీ కలెక్టరునగు శ్రీ జయంతి రామయ్య పంతులు బి. ఎ, బి. ఎల్. గా రిట్లు వ్రాసిరి

" తాము పంపిన కమ్మవారి చరిత్రము ప్రథమభాగము చేరినది. స్థాలీపులాకన్యాయముగ చదివినాఁడను. కమ్మవారి చరిత్ర మాదినుండియు పరిశీలించి సమర్థించుటకు మీరు చేయుచున్న ప్రయత్నము మిక్కిలి ప్రశంసార్హము. మీ సిద్ధాంతము లన్నియు నందరకు నచ్చు ననుకొనగూడదు. కాని మీరు చేయుచున్న పరిశ్రమము కొనియాడ దగినది."

★ ★ ★

జీర్ణ విజయనగర చరిత్ర గ్రంథకర్తయు, చరిత్రకారులలో నొకరును విశాఖపట్టణమున లోకలు ఫండు ఆడిటరునగు శ్రీకుందూరి ఈశ్వరదత్తు బి. ఏ. గారొసంగిన యభిప్రాయము.

"తమరు పంపిన కమ్మవారి చరిత్రము ప్రథమ భాగము చేరినది. మీ పరిశోధనా ఫలితముగ కమ్మవారి చరిత్రము సమగ్రముగ వెలువడ గలదని నమ్ముచున్నాము. చరిత్రకు కులనిర్ణయమున కన్నను తత్కాల సంభూతులగు మహా పురుషుల జీవిత సంగ్రహము ఆధునిక యువకుల కాదర్శప్రాయముగ నుండగలదు. ఇదివరకు ఆంధ్రులు వెలమ, రెడ్డి వీరుల చరిత్రలు చదువుటే అలవాటుగలవారు. కమ్మకుల మందును మహాపురుషులు గలరని వా రాంధ్రలోకమునకు రెడ్డిపురుష శ్రేష్ఠులవలె ఆదర్శప్రాయులని మీరు తెలియజెప్పి మీ కమ్మ చరిత్రము యొక్క రెండవభాగము ఆంధ్రులకు నిత్య పఠనీయముగ వెలయజేయ గలరని నమ్ముచున్నాను. మీ గ్రంథ మొకతూరి ఆమూలాగ్రముగ చదివినాను. ఈ గ్రంథము మీ పరిశోధనా పరిశ్రమను నైపుణ్యమును ప్రస్ఫుటము చేయుచున్నది."

★ ★ ★

హిందూపత్రిక 19—11—39 తేదీన గ్రంథమును రివ్యూ చేయుచు చివర నిట్లు వ్రాసెను.

"శ్రీ భావయ్యగా రీ విషయమున గల వాఙ్మయమును, శాసనములను చదువుటలో మిక్కిలి పరిశ్రమ గైకొనిరి. మారు మూల గ్రామములలో నాయనకు గల్గిన గొప్ప చిక్కులనుబట్టి చూడఁగా నిది మెచ్చుకొనదగిన కార్యము. కమ్మవారి మూలపురుషులుగా వారిచే భావింపఁబడు తూర్పు చాళుక్యుల యొక్కయు, తెలుగు చోడులు మున్నగు చిన్న చిన్న రాజవంశముల యొక్కయు చరిత్ర మిందు జేర్చుట యుపయోగ కరముగను అభిరుచి కరముగను ఉన్నది. ఆయన 379 కమ్మవారి యింటిపేర్లు సంపాదించె నన్నపు డది సులభమైన కార్యముగాదు."

(Sd.) కె. ఆర్. సుబ్రహ్మణ్యంగారు (ఇంగ్లీషున కనువాదము)

★ ★ ★

వినుకొండ తహసీలుదారువారగు శ్రీ జంపాల గోపాలరావు చౌదరి ఎం. ఏ. గారిట్లు వ్రాసిరి.

"తా మంపిన కమ్మవారి చరిత్రము స్థాలీపులాక న్యాయమునఁ దిలకించితి. గ్రంథ[illegible]ము. శైలి అనతి కఠినము. మీ సహజ భావగర్భిత శైలి అందందు [illegible]. శాసనసంయుతములగు కమ్మవారి చరిత్రమందు సత్యమరయుట సుకరమ[illegible], ఈ శ్రమకు శ్రమయే ఫలిత మేమో నని సంశయము."

UNIVERSITY

**UNIVERSITY OF HYDERABAD**
**LIBRARY**
**HYDERABAD ( A. P. )**

Cl. No. 301.4409548 Acc. No. 29394
B46K

**DATE DUE**

DURATION OF LOAN—Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

T Acc. No. 29394

Call No. 301·44095484 B461

Author [illegible] V·2

**UNIVERSITY OF HYDERABAD**

**LIBRARY**

**HYDERABAD (A. P.)**

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book journal damaged, defaced or lost.

**Help to keep the book fresh and clean**